BROWN BOOK ONLY

UNIVERSAL LIBRARY
OU_204390
UNIVERSAL LIBRARY

OUP—730—28-4-81—10,000.

OSMANIA UNIVERSITY LIBRARY

Call No. T83 L19K Accession No. T14573

Author లక్ష్మీనరసింహం. చి.

Title కర్పూర మంజరి

This book should be returned on or before the date last marked below

కర్పూరమంజరి

ద్వితీయభాగము

చిలకమర్తి లక్ష్మీనృసింహకవి విరచితము

కొండపల్లి వీరవెంకయ్య అండ్ సన్సు
శ్రీ సత్యనారాయణ బుక్ డిపో
రాజమం
1954

రాజమహేంద్రవరమున

శ్రీ కొండపల్లి ముద్రాశాలయందు

ముద్రింపబడియె.

శ్రీరస్తు

కర్పూరమంజరి

ద్వితీయభాగము

మొదటి ప్రకరణము

"సఖీ! కర్పూరమంజరీ! మహారణ్య మతిక్రమించి బయలుగా నున్నభూమికిమనమువచ్చుటచే సంధ్యాసౌందర్యముఁ జూడగలిగితిమి. చూడు! చూడు! దాని రమణీయకము వర్ణనాతీతమై యున్నది. తన ప్రభావముచేఁ బగలు గలిగించి యసాధారణతేజంబున జగమెల్ల నాక్రమించి భువనంబులు సంతాపింపఁజేసి యెట్టకేలకుఁ గాలవశమున నిస్తేజతేజముఁ గోల్పడి పగతురచేఁ బరాజితుఁడై కాయమునుండి క్రొన్నెత్తురులు దొరఁగ నస్తమించుమహావీరుఁడుఁబోలె భాస్కరుఁడు పడమటికొండలోఁ గ్రుంకుచున్నాఁడు. ఎంతటెంతలకైన నీయవస్థ తప్పదుకదా" అని మల్లిక పలుకుటయుఁ గర్పూరమంజరి యిట్లనియె. 'మల్లికా! ఈసూర్యాస్తమయసమయము నాకు మఱియొకలాఁగుఁదోఁచుచున్నది, చూడు! పరమేశ్వరనిర్మితమైనజగన్నాటకమునకీ సంధ్యాసమయము ప్రస్తావనవలెఁ గనఁబడుచున్నది. కాలపురుషుఁ డను సూత్రధారుఁడు బిలువ రాగమని యెడుకుసుంభారుణచేలముఁ గట్టి ట్టమైనభానుబింబంబను కాశ్మీరతిలకంబు నెట్టి సంధ్య యను నటి ప్రవేశించి రాఁగలనిశానాటకమును సూచించుచున్నది. పులుఁగుల కిలుంగు నటిసేయుగానమువలె వినఁబడుచున్నది. అదే ప్రభాకరుఁ డస్తమించినాఁడు. ఇఁక నిశానాటకప్రథమరంగమును మనము దర్శింపఁగలము. అల్లదె! కథానాయకుఁడైనరాజు చంద్రుఁ డుదయించుచున్నాఁడు. చూడు! ఆకాశంబనునింద్రనీలమణిమయంబయినగద్దియపైఁ డెక్కినాఁడు. నిగనిగలాడు నాగద్దియపైఁ జెక్కినవజ్రంబులట్లు

తెక్కకుమీఱినచుక్కలు, మెఱయుచున్నవి. ఈతఁడు చల్లనిరా జయ్యు మహాతేజశ్శాలియై సహజశత్రువైనయంధకారమును బఱా పంచలుగఁ దోలియున్నాఁడు" అని కర్పూరమంజరి ప్రత్యుత్తర మీ యు మల్లిక "సఖీ! నీయూహ సరసముగా నున్నది. కాని యిదివిను. ఈనిశాసౌందర్యము నాకు మఱియొకలాగు కనఁబడుచున్నది. గగన లక్ష్మిషోడశకళాపరిపూర్ణమైన చంద్రమండలము నెమ్మొగముగా నం దలికళంకము కస్తూరితిలకంబుగా నీలసీలం బగునాకసంబు కొప్పుగాఁ జుక్కలు కొప్పునం దుఱిమినమల్లెపూవులుగా నలుగడల నలముకొను తేటవెన్నెలలు నవ్వులుగా హొయలు గులుక జగన్మోహనంబగు నా కృతిఁ దాల్చి యీసమయమున విశ్వమెట్లున్నదో చూచుటకు బయ లుదేరినది. చెలీ! యీ నభోలక్ష్మి యెల్లతెఱఁగుల నిన్నుఁబోలియున్న యది" యని పలికెను.

"సఖీ! నీకు నాపైఁ గలప్రేమచే నన్ను గగనలక్ష్మితోఁ బోల్చుచుంటివి గాని ప్రకృతి సౌందర్యమునకు నావంటిదానిపోల్పఁ దగునే? దాని కదె సాటి. చిత్రకారుఁడు బుద్ధికుశలతచేతను, హస్తనైపుణిచేతను వృక్షమునో పూవునో పండునో యొకఫలకము మీఁదఁ జిత్రించుఁ గాక! ఆయాచోటుల కనువుగా రంగులు పులుముఁ గాక! ఎన్నియందములఁ దేవలయునో యన్నియందములఁ దెచ్చుఁ గాక! ఎట్లయిన దేవదేవనిర్మిత మయినవృక్షమట్లు ఫలమట్లు, పువ్వట్లు చిత్తరు వుండునా?"

అని వారిరువురు ప్రకృతిసౌందర్యమును జూచి మెచ్చి యానం దము నొందుచుండ నంతలోఁ జంద్రిక వచ్చి "అమ్మా! గడియ రాత్రి యైనది. అమ్మగారు గుడారములోనికి రమ్మనుచున్నారు ర రండు. పోదము" అని పిలిచెను. పిలుచుటయు వారిరువురు "ఇదిగో వచ్చుచున్నాము" యని గుడారములనంక కరిగిరి.

జయంతుఁడు వెంటవచ్చిన పరివారమునకు బసలనిమిత్తం భోజనములనిమిత్తము దగిన యేర్పాటులఁ గావించెను. చెట్లక్రింద గుడారములు గట్టిరి. రాజకుటుంబము ప్రత్యేకమైన గుడారములలో విశ్రమించెను. ఇందుమణియుఁ, గర్పూరమంజరియు, విజయసేనుఁడును కొండలకడ భోజనము చేసిరి. అనంతరము జయంతుఁడు మొదలగు ప్రధానపురుషు లారగించిరి. పగలెల్లఁ బయనముసేయుటచే బడలికల నెంపున గుఱ్ఱపురౌతులుఁ బదాతులు భోజనములు సత్వరముముగించి చెట్లనీడలఁ జాపలు, కంబళ్ళుఁ బఱచుకొని నిమేషమాత్రముననే కనులు మూసికొని నిద్రించిరి. ప్రయాణములలోసైతము రాజకుటుంబములకు సకలసౌకర్యములు జరుగవలసియుండెను గనుక మంచములు, పానుపులు, పల్లకులు, దీపస్తంభములు, రత్నకంబళములు, బహువిధఫలములు, నానావిధభోజనపదార్థములు వారివెంట నుండునట్లు రాజవాహనుఁ డేర్పాటుచేసెను. పరిచారికలు పానుపులు పఱచిన నిందుమణియు విజయసేనుఁడును బవ్వళించి నిద్రించిరి.

పండువెన్నెలలు గాయుచుండెను. మలయమారుత తరంగములు యథేచ్ఛముగ శరీరముల సోఁకి హాయి యనిపించెను. కొన్ని పులుఁగుల యెలుఁగులు వీనులకు విందగు గానమునవలె మనమునకానందముఁ గూర్చెను. నేలయంతయుఁ దెల్లనుప్పుపఱచినట్లు గానబడెను. వెండిపూత పూసినట్లు కప్పురపుఁబొడి చల్లినట్లు, పాలగచ్చు చేసినట్లు గానఁబడెను. ఆసమయమునఁ గర్పూరమంజరి నాఁడు మకరందుఁడు తన రుగ్మతిలోఁ దనకుఁ గావించిన భేషజరూపక మహోపకారముం దలఁచి యాతని యాకారమును స్మరించి యాతని మృదుమధురసంభాషణలను మందహాసములను సుందర విలాసములను జ్ఞప్తికిం దెచ్చికొని వెండియు నతనితోడి కూటమి సంప్రాప్తించు భాగ్యకాలము గలుగునా యని తలపోయుచు నిద్రపోవకయుండెను.

మల్లికయు రెండుమూడుసారు లామెను బలుకరించి ప్రత్యుత్తరము గానక "ఏమమ్మా! నామాటలు వినఁబడుటలేదా? నీమనంబు మకరందరసము నాస్వాదించిన తుమ్మెదవలె మత్తిల్లియున్నది గాబోలు! నీచెవిలో మకరందబిందువు లడ్డుపడెనేమో? కానిచో నా పిలుపులేల వినఁబడవు?" అని చిఱునవ్వు మొలకెత్తిన మోముతో నర్మగర్భముగాఁ బలికెను. అప్పలుకులు విని "మూర్ఖురాలా! చమత్కారముగా మాటాడఁగలనని గర్వించి నీయిచ్చవచ్చినట్లు నన్ను దెప్పుచున్నావు. చాలు చాలు! నోరు మూసికొనియుండుము." అని కర్పూరమంజరి మందలించుచున్నంతలో "సందెకబళమమ్మా! సందెకబళము. పట్టెడన్నము పెట్టుఁడమ్మా! పెట్టుఁడు" అని యొక కేక వినఁబడెను. గుడారములచుట్టుఁ గావలిగాచుచున్న యామికులు కేక వైచిన యాపడఁతుకను లోపలికిఁ బోనీయక నిగ్రహించిరి. అది యొక్కపెట్టున మొఱవెట్టఁ జొచ్చెను. కర్పూరమంజరి దాని కుయ్యాలించి మల్లికం బిలిచి "దాని మొఱ యేమో తెలిసికొని తనకడకుఁ దోడుకొనిర"మ్మని పంచెను. మల్లికయు గుడారముదాఁటి యావలకుఁ బోయి కావలివాండ్రకుఁ గర్పూరమంజరియాన దెలిపి యా నెలంతను లోపలికిం దోడ్కొనివచ్చెను. మెడనిండ గురివెందపూసలసరములు, చేతుల గవ్వలగుత్తుల కంకణములు, గలిగి కడుమాసిన ప్రాతబట్ట గట్టి, చేత నొకకుండ దాల్చి కట్టెదుట నిల్చెను. ఆయంగనంజూచి కర్పూరమంజరి "నీకేమి కావలయును? నీ వెవ్వతవు?" అని యడిగెను. అప్పడఁతుక రాజపుత్రికం జూచి కుండ క్రిందఁబెట్టి దండముఁబెట్టి "తల్లి! నే నెఱుకలదానను. ఈసమీపముననే మాపల్లియ కలదు. మా కన్నవస్త్రములు లేవు. మిక్కిలి పేదవాండ్రము. ఈదారిని బోవు బాటసారులం జేరి కూఁడుగుడ్డ నడుగుకొని తెచ్చుకొనుచుందుము. ఇంటికడ నాబిడ్డ లన్నము లేక మాడుచున్నారు. గొప్ప దొరలు

గుడారములు పైచికొని దిగినారుగదా, పట్టెడన్నము దొరుకక పోవునా, యని యాసపడి వచ్చితిని. నే నెఱుక జెప్పఁగలను. కావలయునేని మీకుఁగూడఁ జెప్పఁగలను'' అని విన్నవించెను. దానిదీనాలాపముల నాలించి కర్పూరమంజరి జాలి నొంది దాని కేమైన నాహార మిడుమని మల్లికతోఁ జెప్పెను. ''అమ్మా! అట్లె చేసెద'' నని చెప్పి మల్లిక చెంచెతం జూచి నవ్వుచు ''నోసి! యెఱుక జెప్పఁగలనంటివి, మారాజపుత్రికకు నీ వెఱుక జెప్పు'' మని హెచ్చరించెను. వలదు వలదని కర్పూరమంజరి పలుకుచున్నను నయ్యెఱుకలసాని యూరకుండక చేత నొక పుల్లబట్టుకొని క్రింద నేవో రెండు మూఁడు గీట్లు గీచి యాకసమువంకఁ జూచి చేయి చాఁపుమని కర్పూరమంజరిని వేఁడి హస్తపరీక్షఁ జేసి యిట్లనియె.

భాగ్యశాలివే తల్లి! అదృష్టం గలదానవేతల్లి! చుట్టాలసురభివే తల్లి! కొడుకులకోట వవ్వుదువే తల్లి! నీమనసులో నున్న రాచబిడ్డఁడే నిన్నుఁ బెండ్లాడఁగలఁడె తల్లి! దాపున నున్నాఁడె తల్లి! దగ్గఱ నున్నాఁడె తల్లి! నీపంట పండునే తల్లి! సిరి నీకన్నుల కాఁపురమున్నదే తల్లి! వరాలబొజ్జవే తల్లి! నీదొరను గలసినప్పుడు నన్ను మఱచిపోకు తల్లి! ఒక ఎఱ్ఱచీర యియ్యవే తల్లి!'' అని యెఱుక చెప్పటయుఁ గర్పూరమంజరి ముసిముసినవ్వులు నవ్వి ''దానినోటికి వచ్చినట్లు ప్రేలినది. ఈచెంచుపడఁతు లందఱకు నీవిధముగానే చెప్పుదురు. ఇందువిశేష మేమియు లేదు.'' అని పలికి దానికిం బిల్లలకు సరిపడిన యాహారముం బెట్టించి గట్టచీరలు రెండిచ్చి పంపెను.

మల్లికయు దానిని సాగనంపి ''సఖి! దాఁపుననే యున్నది దగ్గఱనే యున్నది'' యని చెప్పినది. అచిరకాలములోనే నీవు నీ ప్రియునిఁ గలిసికొందువు గాఁబోలు'' నని పరిహసించెను. ''చాలు చాలు. నీమొగతాలి కట్టిపెట్టు. నాకు నిద్రవచ్చుచున్నది. రా పండు

కొండ" మని రాజపుత్రిక మేను సెజ్జం జేర్చెను. మల్లికయు నామె దగ్గఱనే తనపానుపుమీఁదఁ బండుకొనెను. అందఱు గుఱ్ఱుకొట్టి నిద్రించిరి. యామికులు మాత్రము మేలుకొని కావలిగాఁచుచుండిరి. ఎడనెడ బెబ్బులుల యఱపులు సింగపుఁ బొబ్బలు నక్కకూఁతలును భయంకరములై వినఁబడుచు రాజపుత్రిక నిద్రకుఁ గొంత భంగము గలిగింప "మకరందుఁడా! మకరందుఁడా! రక్షింపుము, రక్షింపుము" అని యొకటి రెండుసారు లామె పలువరించెను.

రెండవ ప్రకరణము

"చంద్రచూడుఁడా! నాయనగారి యాజ్ఞప్రకారము మనము మాళవదేశమంతయుఁ దిరిగితిమి గదా. రాజధానియగు నుజ్జయిని యతిదూరమున నుండుటచేఁ బ్రజ లంతదవ్వు నడచివచ్చి తమ చేసికొనవలసిన మనవులఁ బ్రభువునకు సరిగాఁ జేసికొనుట కవకాశము గలిగియుండదని పాలితులగు జనుల సుఖదుఃఖముల నారయుమని మహారాజుగారు మనలఁ బనిచినందుకుఁ బ్రజలు మిక్కిలి సంతోషభరితులైరి. వారు నాకుఁ దెలిపిన యిబ్బందు లన్నియును మహారాజుగారికి విన్నవించి యచిరకాలమున వానిం దొలఁగించుటకుఁ దగినప్రయత్నముఁ జేసెద. రాజాజ్ఞ సరిగా నెఱవేర్చుటచే నాతలపై భారమిప్పుడు దిగినట్లున్నది. నాహృదయమిప్పుడు చులకనైనది. కార్యవ్యగ్రత యడఁగినందున నీవెన్నెలసుఖ మనుభవించుటకు మన స్సుత్సహించుచున్నది. కాలపురుషుఁడు బ్రహ్మాండభవనమునకు వైచిన వెల్ల తెఱఁగునఁ గర్పూరపరాగము చల్లినభాతిని నెల్లయెడల వసుంధర తెల్లనై యొప్పె. పైతృకమగు రాజ్యంబు రెండుభాగములు చేసి సమానముగఁ బంచుకొను నన్న

దమ్ములట్లు దివాకరనిశాకరులు క్రమముగాఁ నహర్నిశలఁ బంచుకొని నై జనపదములకుఁ గిరణముల నుపకారము సేయుచున్నారు. ఈచల్లదనము నీవుఁగూడ ననుభవింపుము.'' అని మాళవేంద్రనందనుఁ డగు మకరందుఁడు వేడుక చెలికాఁడగు చంద్రచూడునిఁ జూచి పలికెను, చంద్రచూడుఁడు వాని మనోభావ మెఱిఁగి మెల్లగ నిట్లనియె. ''మిత్రుఁడా! నీవంటి మహారాజకుమారుఁడు సాంద్రసుధాధవళము లగు మేడలనుండువాఁడు. వనాంతరములకు వచ్చుటం జేసి వనలక్ష్మి గౌరవపురస్సరముగా నీకు స్వాగతమియ్యఁదలఁచి వెన్నెల పేరున్నము బ్రహ్మాండమంతయుఁ బూయించినది. కర్పూరపరాగము జల్లినట్లు విశ్వము తెల్లనై యున్నదిగదా! అంతేకాదు. చెట్లనున్న పూలగుత్తులు పండ్లగుత్తులు వెన్నెలకలిమినఁ దెల్లనై కర్పూరమంజరులట్లు వెలయుచున్నవి'' అని నర్మగర్భముగఁ బలికిన చంద్రచూడునిఁ గని మకరందుఁడు ''మిత్రుఁడా! నీమాటనిజము. పుష్పఫలగుచ్ఛము లన్నియుఁ గర్పూరమంజరు లట్లే వెలయుచున్నవి. ఈ గగనలక్ష్మియుఁ గర్పూరమంజరివలెనే యున్నది. ఏది చూచినను నా కా పద్మాక్షియే దృష్టికి వచ్చుచున్నది. అది లావణ్యరాశి. అంగనాకృతిఁ దాల్చిన శృంగార రసాధిదేవత, నడకలు మాటలు నేర్చినజాబిలి పసిఁడిబొమ్మ. పూఁబోఁడి యనుశబ్ద మన్యకాంతలయందు నిరర్థకముగాని కర్పూరమంజరియం దది సార్థకము. పలుకుపలుకున నది యమృతమొలుకుచుండును. ఆమెనోట వెడలునవి మాటలుగావు, చెవులతుప్పుల దుల్లఁ జేయుపాటలుగాని. ఆమెలోచనము పద్మగర్వనిర్మూలనము. ఎవఁడైన నొకసారి యామెం జూచిన నేత్రములు చరితార్థము లగును. పలుకులువిన్న వీనులు పెసికొన్న పావనంబు నొందును. మిత్రుఁడా! ఆమెంజూచి యెంతకాలమైనది! నాఁడు విదర్భాపురము బాసినదాదిగా నామనసు మనసులో లేదు. అత్త నిరంతరము విదర్భలో నుండుటచే

నా దేహము దీపములేనిగాజుకుప్పవలె నుజ్జయినిలో నున్నది. మగలం గన్నులకు అపుడీ నా వెన్నెలదీవిని జ డంగల్గుదునే? ఆమె యే రాజనందనుని జెట్టబట్టనున్నదో? ఆమె కరస్పర్శనంబున నే రాజ హస్తము ధన్యతనొందునో? ఓహో! నామాటలు పిచ్చివాని పలుకు లట్లు నీవు గ్రహించుచున్నావు కాంబోలు! ఆ సుందరీప్రసంగ మిప్పు డప్రస్తుతమై నీకు విసుగుగలిగింపవచ్చును. కావున విరమించెదనులే'' అని పలికి నిట్టూర్పు విడిచి యూరకుండెను.

అప్పుడు చంద్రచూడుడు ''మిత్రుడా! నాకనురెప్పలమీద నిద్రాదేవి రెండుకాళ్ళునెత్తి నిలిచియున్నట్లవి యెంతో బరువుగా నున్నవి. అతిప్రయత్నముగాని రెప్పలు లేచుటలేదు. నేను నీమా టలువినుచుంటినో నిద్రపోవుచున్నానో, నేను కలగనుచున్నానో నీతో మాటలాడుచున్నానో సరిగాజెప్పజాలను. ప్రపంచమంతయు నాకు గందరగోళమయమై యున్నది. కొంపదీసి నన్నుగూడ నీవు కస్తూరిమంజరిగా భావించి చెక్కిలి గాయమగునట్లు గట్టిగా ముద్దు పెట్టుకొందువేమోయని భయముగానున్నది. వలపు వెఱ్ఱి యెత్తిన వారు కేవలము పిచ్చివాండ్రు, సమానులు'' అని చంద్రచూడుం డింక నేమో చెప్పబోవుచుండ నంతలో నొకమూలనుండి ''పొడువుడు. తెగనఱుకుడు. పట్టుడు. పట్టుడు. అయ్యో! రక్షింపుడు. రక్షింపుడు'' అను నార్తనాదము వినంబడెను. అందులో నొకటిరెండు స్త్రీ కంఠ ములు వినబడెను. చంద్రచూడుడు గులికిపడి లేచి నిలిచెను. మకరం దుడు పీఠమునుండి దిగ్గునలేచి ''మిత్రుడా! ఏదో యార్తధ్వని వినంబడుచున్నది. అందులో స్త్రీస్వనముగూడ వినంబడుచున్నది. ఏదీ ఖడ్గము. ఖడ్గము! నే నిప్పుడె పోయి యక్కడ నుఱికెద. ఓరీ! ఎవ డురా యక్కడ! ఖడ్గముం దెమ్ము'' అని గుడారముపైపున కరిగెను.

చంద్రహాసుడు భయముచే గడగడవణకుచు "మిత్రుడా! నా ప్రాణము ప్రాణములో లేదు నన్నువారి కప్పగించి పోయెదవా? అయ్యో! పేదవాడను. బ్రాహ్మణుడను. నాతల్లి కొక్కడనే కుమారుడను. నాప్రాణము రక్షింపుము" అని యతని బిగ్గరగాఁ గౌగిలించుకొనెను. మకరందుడు వానిపిరికితనమునకు నవ్వుకొని "వయస్యా! భయములేదు. నీప్రాణమునకు నాప్రాణ మడ్డమువైచెదను. నీవీ గుహాంతరములోనుండుము. నీ కిరువురు సేవకుల నప్పగించెదను. వారు నిన్ను గట్టిగాబట్టుకొందురు." అని చెప్పి ఖడ్గము ధరించి మోరియల వంటి పోటుబంటులఁ బదుగురఁ దనవెంట నడువ సింహధ్వని నిచ్చినవైపునకు విసవిస నడచిపోయెను. విండ్లు నమ్ములు బల్లెములు మొదలగుసాధనంబుల ధరించి దాట లగుబంటులు పదుగురేగాక పెక్కండ్రు రాజకుమారుని వెంటనరిగిరి.

"వెలువడుడు వెలువడుడు! ఇదే చేవచ్చుచున్నాడు" అని యుచ్చైస్స్వరముతో దెసలు మారుమ్రోగునట్లు కేకలువేయుచు మకరందుడు మిక్కిలి వేగముతోఁ బరుగెత్తి సింహాసనములకడ కరిగెను. వీరభటులును యజమాను ననుసరించి గద్దెస్థానముఁ జేరిరి. అప్పుడేమి చెప్పను? మొగమున జేగురుబొట్లు తలలపై నెమలిపింఛములు గ్రుచ్చి తీఁగచుట్టలు, చేతి పిన్నలు, నత్తుల్లలు, భుజముల పై తోకలతో నల్లనయెనుములపోతులు, మెడలలో గవ్వలసరములు, కరివెంట్రుకల పీకలు, ముంజేతుల దండల నెముకలకంకణములు, నెన్నడుమునకు త్రిప్పబడిన శారుచీసములు గడ్డములు వ్రేలుచున్న కొండజాలు పుట్టగోచులు, వెడఁద ఱొమ్ములు, చింతనిప్పులట్లు మెఱయుకన్నులుఁ గల బిల్లులు విక్కులు చిల్లులువడిన ట్లఱుచుచుఁ గవ్వారము జేరి యుండు మణి యున్నగుహాంతరములోఁ బ్రవేశించి కొల్లపెట్టఁ జొచ్చిరి. చంద్రు క్రోల్పులవారొసుగ్రమూర్తులై వచ్చి ముసుముసుగాఁ గాపలివాండ్రం గడతేర్చి నిద్రించుచున్నవారు నిద్రించుచుండఁగనే కుత్తుక లుత్త

రించి బరిమార్చి యాకస్మికముగా లేచి చేతికి దొరకినయాయుధంబు లంబట్టి తమ్మెదిర్చిన బోయలగాయపఱచి కొందఱిని జెట్లకు బంధించి యథేచ్ఛముగఁ బ్రవర్తించుచుండిరి.

జయంతుఁడు వారిచే బంధింపఁబడెను. గాలుఁడైన విజయసేనుఁడు గాయము దగిలి నేలఁ బడెను. కల్పలతయుఁ జంద్రికయు మల్లికయు, "రక్షింపుఁడు. రక్షింపుఁ" డని యేడువఁ జొచ్చిరి. ఇందుమణి దొంగలఁజూచి తన మేని నగలు కర్పూరమంజరి యొసఁగిన యలంకారములు దీసి యిచ్చి తమ కేవిధమైనకీడు సేయకుండ గాపాడవలసిన దనియు గైకొనిపొమ్మని యమూల్యాభరణములు చీనిచీనాంబరములు నిండుగాగల సువర్ణఖండములు సొమ్ములుఁ గలపెట్టెలం జూపెను. కర్పూరమంజరి మూర్ఛిల్లెను. భిల్లులు కొల్లఁగొట్టుటకుఁ జాలని యవకాశము దొరకెనని సంతసించి యామూల్యద్రవ్యాపహరణకు బోక తమకువచ్చినపని చేయఁజొచ్చిరి.

ఆ తఱి మకరందుఁడు సపరివారముగా నచ్చోటికిఁ జనుదెంచి భిల్లులం దాఁకెను. రాజవాహనునిభటు లెవ్వరో దొంగ లెవ్వరో తెలిసికొనుట యుంపికులవేసములఁ బట్టి యత్యంత సులభమాయెను. నిశాచరులట్లు భయంకరాకారులై నిర్భయముగా సంచరించుచున్న యా తుచ్ఛులఁ గాంచి బెదరక కఱకుకత్తులతో మకరందుఁడును సముత్సాహకుశలులగు వానియనుచరులును వెదురుబొంగుల నఱికినట్లు నేలకు రాలునట్లు నఱకఁజొచ్చిరి. గొప్పగుంపుగ నున్న భిల్లులు మింటనుండి పిడుగులు పడినట్లు హటాత్తుగా మహాశూరులువచ్చి తమ్ము దాఁకినారని యూహింపలేక చెట్లుకూలినట్లు గూలిరి. కొందఱు మకరందుని విక్రమవిహారముఁ నెదుర నిలువలేక చేతనున్న పెట్టెలు మోఁదలగునవి జాఱవిడిచి పాఱిపోయిరి. రాజవాహనునిభటుల కళేబరములతోను, భిల్లులపీనుఁగులతోను నచ్చోటు భయంకరమై యుండెను.

ఒక్కముహూర్తములో దొంగలలో ననేకులు హతులైరి. తక్కినవారు పలాయితులైరి.

—*—

మూఁడవ ప్రకరణము

ఆపద్బాంధవు లయినమహనీయు లెవరో తమ కుయ్యాలించి వచ్చి సాయముచేసి ముచ్చులపీచ మడఁచి తమ్ముఁ గాపాడిరని యిందుమతియు మల్లికాచంద్రికలు జరిగినచిన్ని కయ్యంబువలన గ్రహించిరి గాని వచ్చినవా రెవ్వరో వా రెఱుఁగరు. దొంగలదాడివలనఁ గలిగినభయము రవంత శమించుచుండ గాదిలికూఁతురగు కర్పూరమంజరిమూర్ఛవలన నిందుమతికిని, మల్లికాచంద్రికలకును వెండియు మునుపటికన్న నధికమైనమనోవేదన కలిగెను. యోధులగంభీరభాషణంబులవలనఁ గాని, మృతినొందువారియార్తనాదమువలనఁ గాని గర్పూరమంజరికిఁ దెలివిరాలేదు. మల్లికాచంద్రికలు శైత్యోపచారములు చేయుచుండిరి. ఇందుమతి ప్రక్కనఁ గూర్చుండి మీఁదఁ జేయివైచి "బిడ్డా! తాతయుఁ దండ్రియు దగ్గఱ లేనితఱి మహారణ్యమధ్యమున దిక్కుమాలి నీ వీలీల నాకు దవ్వగుదువని నెన్నఁడుఁ దలంపనైతినమ్మా. అక్కటా! నీ దేహస్థితి యెట్లున్నదో తెలియఁజేయుటకై వైద్యులయిన లేరుగదా. దంట లగుశూరులు హతులైరిగదా. తల్లీ! తెల్లదామరవంటి మొగము నల్లఁబడినది. ఇఁక నేటిబ్రతుకు? ఏటియాస? మల్లికా! నీప్రాణసఖి చైతన్యముదక్కి యున్నది. చంద్రికా! ఇంక నీ వెవ్వరితో నర్మోక్తు లాడుదువే?" యని పలువిధముల వగచుచు నొక్కమచ్చున నోడికగట్టుచున్న కన్నీటి సోనలచే నప్రయత్నముగ దుఃఖవర్షము పుత్రికపైఁ గురిపించుచుండెను.

మకరందుఁడు భిల్లులుపలాయితులైన వెనుక వాండ్రు తీసికొని పోక విడిచిన పెట్టెలను వెదకి తెమ్మని తనభటులకు నానతిచ్చి చెట్టునకు బంధింపఁబడినజయంతుని విడిపించి భుజాదండముమీఁదఁ గాయము తగులుటంజేసి రక్తంబు జొటజొటఁ గారుక్రొన్నెత్తురు నాఁపుటకై ప్రయత్నించియు నట్లు సేయలేక సొక్కియున్న విజయసేనునిఁగని చేవఁదీసి యాతని మొగముఁ జూచి యాశ్చర్యపడి జయంతుని నాన వాలుబట్టి "ఎవరో యనుకొంటిని మీరా? ఆఁడువాండ్రతోఁగూడ వచ్చితిరా" యనియడుగఁగ, వారు "మేము స్త్రీలతోఁగూడ వచ్చితిమి. వారు గుడారములలో నున్నారు. అటకుఁ బోదము రండు" అని యుత్తరమీయ నతనిం దోడ్కొని పటకుటీరములకడకరిగెను. అరిగి లోనఁ బ్రవేశించి చూచునప్పటికి మోహాపరాయణయై కనుగవమూసి కొని వివశయై పండుకొనఁబెట్టినబంగారుబొమ్మవలె నున్న కర్పూరమంజరి యతనినేత్రములకగపడెను. ఇందుమణియు మల్లికాచంద్రికలును వానింజూచి తెల్లఁబోయిరి. సుదర్శనుఁ డగుసుదర్శనవంశనునిఁ జూచిన వెంటనే వారికందఱకుఁ బ్రాణములు లేచివచ్చెను. నూఱుమంది యాప్తబంధువులను జూచినట్లు వారికి ధైర్యముగలిగెను. కాని కర్పూరమంజరియవస్థ వారియుత్సాహమున కంతరాయము గలిగించెను. కుమారునకు గాయముతగిలినదని యిందుమణి యెఱుంగదు. నెత్తుటం దడిసినవస్త్రములతో నున్నకొమరునిం జూడ నిందుమణివగ పినుమడించెను. ఆవిధముగా నున్నకుమారికం గనుఁగొనియీవిధముగా నున్నకుమారునిం గనుఁగొని యిందుమణి ధైర్యము చిక్కఁబట్టి బాలికం గొమరుం గౌఁగలించుకొని "కుమారా! మీయిరువుర కేక కాలమందే యాపద సంభవించెఁగా" యని వాపోయెను. మకరందుఁడు జయంతునిఁ జూచి "విజయసేనునిగాయము మిక్కిలి గొప్పదిగాదు. వెంటనే వ్రణపట్టికలు వైచి చికిత్సఁ జేయుఁడు. అచిరకాలంబున

గాయము మాను'' నని చెప్పి బాలిక యిట్లుండుట కేమి కత మని యడిగెను.

మల్లిక నేత్రములనుండి బాష్పము లురుల "దేవా! దొంగలం జూచి యీమె మూర్ఛిల్లి పరవశ యైనది. ఇంకం దెలివి రాలేదు. కొనయూపిరి మాత్ర మున్నది. నాఁడు మా చెలి విదర్భానగరమున దారుణజ్వరపీడిత యైనపుడు మీరె మా దేవికిఁ బుత్రికా భిక్షము బెట్టిరి. నేఁడును మరల మీరే వచ్చిరి. మీరు వచ్చుట యీమెకుఁ బ్రాణము వచ్చుట మాకు శుభము వచ్చుట'' యని పలికెను. "కుమారా! ఈమె మేనఁ బ్రాణము లున్నవో లేవో సత్వరము జెప్పు'' మని యిందుమణి మకరందుని నడిగెను. మకరందుఁడు "అమ్మా! భయపడకుము. ఇది మూర్ఛ గాని మరణము గాదు. దురాత్ములైన భిల్లులదుండగముల జేతి భయంపడి యీతీఁగబోఁడి మూర్ఛిల్లినది.'' అని చేయి జూచి "నాడి స్ఫుటముగా నున్నది. ఉచ్ఛ్వాసనిశ్వాసములు సరిగానున్నవి. శైత్యముఁ జేయుక మీరు దూరముగా నుండుఁడు. క్రమక్రమముగ నామెకుఁ జైతన్యము వచ్చును'' అని పలికి వారికి ధైర్యముఁ గొలిపి తా నామెప్రక్కను గూర్చుండెను.

మోహావస్థ క్రమక్రమముగా సడలుచుండ మకరందుని హస్తస్పర్శసుఖముచేతనో బాలిక కాలుసేతులు గదల్చి ... టికిఁ గనులు విచ్చిచూచి యెట్టయెదుట నాత్మోత్కర్షి ... గూర్చున్న మకరందుఁ గనుంగొని సిగ్గుపెంపున ముదటఁ మరలఁ గన్నులు దెఱచి యా లావణ్య రసమునఁ దన నేత్ర నోలలాడించెను. అట్లిండొరులు దర్శన స్పర్శన సుఖము చూచు వారిరువురుఁ గొండొకసేపు పరమానంద సము యాడుచుండ నంతలో మల్లికా చంద్రికలు వేఱొక మూర్ఛితయైనప్పుడు నేలఁబడియున్న కలమున ఘా

బాలిక మేనుదులిపి లేవఁదీసి యాశయ్యం బండుకొనఁబెట్టెను. ఈయంతి రాయము వారి కిరువుర కనిష్టమైనను సహింపక తప్పనదిగాదు.

జయంతుఁడు విజయసేనుని గాయములకుఁ దగిన చికిత్సలఁ జేసి రక్తస్రావముఁగట్టించి యతనినిఁగూడఁ బవ్వళింపఁజేసి నిహతులయిన పరిజనులకు నగ్నిసంస్కారవిధానము దుస్సాధ్యమని హతశేషులచేత వారికిఁ దగినట్లు ఖననక్రియలు జేయించెను. పరిజనులలో గాయములు దగిలినవారికి సైతము చికిత్సలు చేయఁబడెను. పూరిపుల్లమైన దొంగల పాలుగాకుండ స్త్రీల కవమానము గలుగకుండఁ దమ్ముఁ గాపాడిన మకరందుని జయంతుఁడును దక్కిన పరిజనులును బలు తెఱంగులఁ గొనియాడిరి. తనకుఁ బుత్త్రపుత్త్రికాభిక్షము నాఁడు మకరందుఁడు ప్రసాదించెనని యిందుమణి పలు తెఱంగుల నాతని నుతించెను.

ఆ నడిరేయి యానట్టడవిలో వారుండుటకుఁ గారణమేమని మకరందుఁడు ప్రశ్నించెను. అప్పుడు జయంతుఁ డిట్లనియె. "కుమారా! ఎఱుఁగుదువుగదా హేమచంద్రుని యనుజుఁడును విదర్భరాజగు రాజవాహనున కల్లుఁడు నగు చిత్రభానుఁడు కలఁడు. కర్పూరమంజరి యాతని గారాబుకూఁతురు. చిత్రభానుఁడు శ్రీనగరమం దున్నాఁడు. ఇందుమణీదేవియుఁ గర్పూరమంజరియు హేమచంద్రుని రాణియగు చెను. ందాదేవిని, వాని గారాబుకొడుకు లగు విక్రమసేన హర్షవర్ధను నెత్తుటా దశ. పరామర్శించుట బాధుధర్మముగదా! అకార్యకారణంబున పినుమడించెను ప్రేరితులై రాజవాహనుని యనుమతంబున నచ్చటికిఁ నున్న కుమారు రు. విదర్భేశ్వరుఁడు తగు పరిజనంబు నిచ్చి యశ్వము బాలక గొడుకు ములిచ్చి యఖల ప్రయాణ సాధనంబుల నిచ్చి పెద్ద మందే యూసద నుభవము గలవాఁడను గనుక నన్నుఁ దోడిచ్చి కాశ్మీ జయంతునిఁ జూ బయనము చేసి పంపెను. మందభాగ్యుఁడనైన నేను నెంటనే వణపట్టిక తిని. సమరమున ముక్కాకలు దేరిన వీరులు నిష్ఠా

గణముగా మ్రుచ్చులచేతఁజిక్కి చచ్చిరిగాని హంతకుఁడనైన నేను కడతేఱిన భాగ్యశాలినిగదా! నీవు సమయమునకు రాకున్న క్రూరులు నీచమానవులు నగుచోరులు నన్నేమి చేసియుందురు! ఆర్తత్రాణపరాయణుఁడవైన నీచరిత్రము శ్లాఘాపాత్రము" అనుచుండఁగ మకరందుఁడు జయంతు నుద్దేశించి "ఆర్యా! ఇందు మీతప్పు లేదు. కాలవశమున నాకు వచ్చిన తెఱఁగైన శోకస్థాయి మఱగింపుము. అంతమాత్రమున మీ యట్టివారు మందప్రజ్ఞులుగారు. నేను మానవధర్మమును జేసితినిగాని శ్లాఘింపవలసినంత ఘనకార్యమేమియుఁ జేయలేదు. హేమచంద్ర మహారాజుమాట శిరోరత్నముగ తలపెట్టుటగా జేసి నాకు సత్కారణము నాకు జ్ఞప్తికివచ్చి నామనంబు గాసిల్లఁజేయుచున్నది. పుంభావము దాల్చిన ధర్మదేవతగదా యతఁడు! హేమచంద్రాస్తమయమునఁ గాశ్మీరదేశము— కాశ్మీరమన నేల? ప్రపంచము, చంద్రాస్తమయమైన నిశవలె నున్నది. నా కాంక్షకు నతనికి సతనికిని కొంత ప్రాణమని చెప్పవచ్చును. కాలగతి నుల్లంఘింపవా రెవ్వరు లేరు."

అని పలుకుచుండఁగ గర్వాకమంజరియు ... కన్నుల ... చెను. ఇతరవిషయ మాలోచించు ... సనుక ... తను ప్రయాణముమాట ... దర్భాస్పదముకాఁ బోవలయునా, హాతిశేష ... మునకుఁ బోవలయునా యని నా మనంబు ... యూఁగుచున్నది. బాలుఁడనైనను నీవు ... నాలోచన నేమో చెప్పుము"

అంతలో సింహమంజ యందుకొని "... తెలిసినది. ఈయల్పపరివారముతో మనము ... పైగా విజయసేనునకు గాయము తగిలిన ... విహ్వలమైనది. కావున విదర్భకరిగి తగి

కొని పోవుట మంచి" దని పలికెను. "అయ్యో! ఇంతలోనే వియోగము గలిగెనా" యని కర్పూరమంజరి తనలో ననుకొని నిట్టూర్పు విడిచెను. మల్లికా చంద్రిక లిందుమణితో నేకీభవించిరి.

అప్పుడు మకరందుఁడు వారితో నేకీభవింపక వారందఱు విను నట్లు జయంతున కిట్లనియె. అయ్యా! మీరిప్పుడు మాళవదేశపు సరిహద్దులలోనున్నారు. నాకడఁ దగినపరివారమున్నది. మీరు నావెంట నుజ్జయినికరండు. అచ్చటనుండి మీకుఁ గావలసినపరిజనంబునుబరికరములను నిచ్చి మాజనకుఁడు మిమ్ము సురక్షితముగాఁ గాశ్మీరదేశము జేర్పఁగలఁడు. అది కర్తవ్యము గాని వెనుకకుఁబోవుట సముచితము గాదు. ఈరేయి మీరందఱు నాలోచించుకొనుఁడు. ఇంక నేను నా శిబిరంబున కరిగెద" అదివిని కర్పూరమంజరి మల్లికం జేరఁబిలిచి చెవిలో "ఓసీ! తెక్కలికాండ్రు మరల వత్తురేమో? ఆయన నిండే యుండుమని చెప్పవే" యని మెల్లఁగఁ బలికెను. "అట్లకాక" యని మల్లిక మకరందుని నచటనుండుమని ప్రార్థించెను. ఆవేడికోలు కర్పూ
రమంజరీముఖంబుననే వచ్చినదిగా భావించి మకరందుఁ డయ్యకొ
నిద్రించుటకు వారు ప్రయత్నించిరిగాని. వారికందఱకుఁ ముఖ్య
రమంజరికఁ గనులుమూసినతోడనే వెలుపుఁగోలుపు
రూపములు గనబడుటం జేసియామె పలుమాఱు
ను. మల్లికాచంద్రికలు గుఱ్ఱుపట్టి నిద్రించిరి.
ము మకరందుఁడు తన సైనికులలో గొందఱు
రితోఁ గలిసి తన నెలవున కరిగెను.
ప సిందుమణియు జయంతుఁడు మున్నగు
మ ప్రయాణ విషయమును జర్చించి మకరం
గలుగా నున్నవని తలంచి యాతనివెంట
ండి శ్రీనగరమునకరుగుట సముచితమని

నిశ్చయించి యావార్త సతినికెఱిఁగించిరి. ఈనిశ్చయము చెవినిబడిన తోడనే కర్పూరమంజరీ మకరందుల యానందము మిన్నుముట్టెను. కొంతకాలమైన మరల నన్యోన్యావలోకన సుఖము సంప్రాప్త మగుటచే వారిహృదయములు ప్రశాంతములయ్యెను. ఆ మఱునాఁడు కర్పూరమంజరీ ప్రముఖ స్త్రీజనమును, విజయసేనుని, జయంతాదులను దోడుకొని మకరందుఁడు తనపరివార సంకలితుఁగా నచ్చోటు కదలి యుజ్జయినికిఁ బయనమయ్యెను.

మకరందుఁడు మార్గమధ్యమున వనవాసులు మిక్కిలి వినయంబునఁ గొనితెచ్చియిచ్చు నెమిలిపింఛియములు, పులికళాసములు, జింకకొమ్ములు, తేనెపెఱలు మొదలగు కానుకల నాదరపూర్వకంబుగ నందుకొనుచు వారు గావించువిన్నపములు సావధానుఁడై యాలకించుచుఁ జెంచులుగావించు విపరీతనృత్యముల గనుంగొని యానందించుచు నాకులు, చిగురులు, పండ్లు గాయలు లేని దిగంబరులై వృక్షశాఖలు నిలయంబులుగ మహాతపస్వుల విధంబున నుండెడు నానావిహంగముల సందర్శించి యక్కజంబునందుచు బయనము చేసెను. కర్పూరమంజరియు సమాయిక వేషభాషలుగల చెంచు కన్నియలంజూచి యచ్చెరుపడుచు నవ్యక్తమధురములైన పులుఁగుల గానములను మెచ్చుచు నల్లజింకకొమ్ముఁగొనఁదమకముఁ దనకన్నుఁ జేర్చి మరిదవోప దాఁచుకొను నాఁడు జింకంగని కన్నులు వగత్రొమ్ములైన వని తలంచుచు సింహవ్యాఘ్రాది క్రూరసత్వంబుల బొబ్బలువిని యదరిక్ పడుచుఁ బ్రకృతిసౌందర్యమంతయుఁ గన్నులఁ గ్రోలుచు మకరందుని వెంటనరిగెను. ఎడనెడ విడిసినతాఁవుల మాపులు వీణాగానీ యామెల నాఁగ దాని నాదములోఁ దన కంఠస్వరముగలిపి యేదికంఠమో యేది వీణానాదమో తెలియనట్లు వినువారల మేనులు గగుర్పొడుచు నట్లు వారు తన్మయత్వము నొందునట్లు పాడి పరిజనంబులకును, జెలిమి

కష్టములకును ముఖ్యముగా మకరందునకును మార్గశ్రమ మపనయించుచుండును. మకరందసాహచర్యంబునఁ గర్పూరమంజరికిని, గర్పూరమంజరీ సహవాసంబున మకరందునకును సంతోషముగనున్నది కనఁబడలేదు. ఉజ్జయిని సమీపించినకొలఁది సంతోషము కలుగుటకు మాఱుగాఁ బరస్పరవియోగము గలుగునేమో యని భయము పొడమఁజొచ్చెను. గమ్యస్థానము నానాఁటికి దవ్వయియున బాగుండు నని వారికిఁ దోఁచెను. బౌద్ధుఁడైన మకరందుఁడు జీవహింసావిముఖుఁడు గావున నొక్క జీవజంతువున్నైనఁ జంపక శాకాహారముతోడనే కాలము గడపెను. భూతదయాపరుఁడైన యాతని నియమంబులు బాగున్నవని కర్పూరమంజరియు మార్గాపాటనము వర్ణించెను. వ్యసనములలో నొక్కటియై పాపహేతువైన వేఁట నారాజనందనుఁడు చిన్ననాఁటఁ గోలె వర్జించెను. మనుష్యులకు హానిసేయు క్రూరమృగంబులఁ దక్క నాహారమునిమిత్త మెన్నఁడును నేజంతువును జంపి యెఱుఁగఁడు.

ఈవిధంబున బయనంబు చేసి కతిపయదినములకు వారు తమకన్నిదినము లాతిథ్యమిచ్చి చెక్కుచెదరక నిలుపుకొనుచుఁ జేర్చినఁ వనలక్ష్మియొద్ద సెలవుగైకొని యుజ్జయినీ పురలక్ష్మిం జేరిరి. కుమారుని రాకకు సుదర్శనుఁడు సంతసించి వానిం గౌఁగిటఁ జేర్చి కర్పూరమంజరీ ప్రముఖ స్త్రీజనంబుల రాక విని యానందమునఁ బొంగి వారల సగౌరవంబుగా సాదరంబుగా సస్నేహంబుగాఁ దోడ్కొని రమ్మని చంద్రప్రభాదేవినిఁ బంపెను. ఆమెయు శుద్ధాంతకాంతాజనోచితమైన గౌరవాదరంబులు నెఱపి వారలనంతఃపురము బ్రవేశింపఁజేసెను. ఇందుమణి రెండుమూఁడుదినములైన తరువాతఁ దమ్ముఁ గాశ్మీరమంపుమని చంద్రప్రభాదేవీముఖంబున సుదర్శనునకు విన్నవించెను. అటనుండి పోవుటకుఁ గర్పూరమంజరి కిష్టములేదు. పంపుటకుఁ మకరందునికిష్టము

లేదు. అటుమీఁదఁ జిత్రభాను పుత్రికకు దేహపీడయుఁ మనఃపీడయుఁ గలుగఁజొచ్చెను. పయనమనుకొన్నప్పుడెల్ల నామెకొకనాఁడు తల నొప్పియు, మఱియొకనాఁడు బద్ధకము, ఒకనాఁడు నిద్రాభావము అన్య దినంబున మనోవికారము మొదలగు విపరీతచేష్టలు పొడమెను. మకరందుఁడు వైద్యుఁడగుటచేఁ బ్రతిదినమామె చేయిజూచి రోగము చిన్నదైనను బ్రశ్నలధికముగ నడిగి పేరునకేదో మందిచ్చి చికిత్స చేయుచుండును. అతఁడు సన్నిధి నున్నంతసేపు, చేయి చూచునంత సేపు, మాటలాడునంతసేపు ప్రేమరసము జిల్కుచూపులు చూచు నంతసేపు నామెకేవిధమైన బాధయుఁ గనఁబడదు. అతఁ డావల కేగినతోడనే మరల నెప్పటి నొప్పులు తలయెత్తఁ జొచ్చెను. మల్లికా చంద్రికలు మాత్రము రోగకారణ మెఱుఁగుదురు. ఇందుమతి యది తెలియక తానెవరో దుర్ముహూర్తమున విదర్భాపురము వెడలిన ట్లొకమాఱు తలంచును. ఎఱుకలసాని యేదో క్షుద్రదేవతను బ్రయో గించియుండునని యొకమాఱు ఊహించును. అడవిలో నేదో పిశాచ మావహించియుండునని యొకసారి తలపోయును. ఉజ్జయిని జలమామెకు సరిపడలేదని యింకొకసారి భాషించును. ఎట్లయిన శ్రీనగరమును ద్వరగఁ జేరుట మంచిదని యామె నిశ్చయించి సత్వరముతమ్ముఁ బంపుమని యామె సుదర్శనునకు వర్తమాన మంపెను. కొన్ని యేనుఁ గులు గుఱ్ఱములు రథములు అందలములు సిద్ధముచేయించి చోరులు మఱి యే క్రూరులు దుండగములు చేయుట కవకాశము లేనంత బలము నిచ్చి సుదర్శనుఁడు వారిం బంపుమని మకరందున కానతిచ్చెను. మకరందుఁ డట్లు చేసెను.

కర్పూరమంజరి మనస్సు నుజ్జయినిలో మకరందుని కడఁ గుదువ బెట్టి శరీరము మాత్ర మందలములోఁ జేర్చెను. మకరందుఁడు తన మనస్సు నామెకు సాయమంపి నిర్మనస్కుఁడై నిర్విణ్ణుఁడై చాల

దూరము వారిని సాగనంపి జయంతునికడ సెలవుపుచ్చుకొని విజయసేనుని బహుధా బహూకరించి క్షేమవార్త నంపుచుండుమని చెప్పి స్వగృహాభిముఖుఁ డయ్యెను. నదీప్రవాహమున కెదురుపోవునావవలె నాని మీరు బహుప్రయత్నమునఁ గాని ముందుకు సాఁగిపోవదయ్యె.

నాల్గవ ప్రకరణము

ఆశ మనుష్యునకు మైకము గల్గించి వివశునిఁజేయుటలో సాఖ్యమును పెంచుచుండును. ఆశామద్యపాయి యొడలుమఱచి తిరుగును. తనతలలో వేయిపన్నుగలు పన్నును. ఆకసంబున నందలము లెక్కును. సముద్రములో సౌధములఁ గల్పించును. మహావాయుపథమున మనస్సునుసంచరింపఁ జేయును. అదియే వానికి జీవగఱ్ఱ. ఆశ యను గుఱ్ఱము నెక్కిన వాఁడు మహావేగముగఁ బదునాల్గులోకములు సంచరించి యది యెట్టకేలకు నడువలేక కూలి తన్నుఁగూల్చినపుడు భగ్నమనోరథుఁడై కూలి మరల వెనుకకుఁబోవుట కవకాశము లేని యపుడు గాఢపశ్చాత్తాపమునొంది నాశనము నొందును. తాఁ జెడుటయేగాక తన సంబంధముగలవారి నందఱను జెఱుపును. ఆశ విషముకన్న దహనముకన్న దారుణమైనది. ఇదివీరికి వారికనక యెల్లవారికి వారివారియవస్థలకుం దగినట్లు లాశ్రయమై దుస్తరమగు జంబాల పటలమున దింపును.

హేమచంద్రుని మరణమునకుఁ బూర్వము దండపాణి రాజకుటుంబమునకు మిక్కిలి కూర్చువాఁడు. తనకుమారికయైన మణిమాలికను హేమచంద్రుని జ్యేష్ఠనందనుఁడగువిక్రమసేనునకిచ్చివివాహము చేయవలెనని ప్రయత్నించుచుండెను. కాని నాఁడుగుహలో

హరిశర్మ విక్రమసేనుఁడు మందభాగ్యుఁడనియుఁ జిత్రభానుపుత్త్రకుఁడగు విజయసేనుఁడు మిక్కిలి యదృష్టవంతుఁడనియుఁ జెప్పి మణిమాలికను విజయసేనునికే యిమ్మని హితోపదేశము చేసినదాదిగా దండపాణి మనస్సు నావమీఁదిసూచీ యంత్రము త్తర దిక్కువైపు దిరిగియుండునట్లు నిరంతరముఁ జిత్రభానునివైపు దిరిగియుండెను. చిత్రభానుడు కాశ్మీర దేశాధీశ్వరుఁడు గావలెననియు, వానిసూనుఁడు విజయసేనుఁడు యువరాజు గావలెననియుఁ దనకూఁతురు మణిమాలిక మొదటయువరాజపత్నియై, పిమ్మటఁ గాశ్మీరరాజ మహిషి గావలెననియుఁ గోరి యామనోరథసిద్ధికి నేకార్యము లవశ్యములో వానిం జేయుటకును నేదారింబోయిన గమ్యస్థానము జేరసచ్చునో యాదారింబోవుటకును నిశ్చయించుకొనెను. కాశ్మీరరాజ్యసైన్యములు వానియధీనమం దుండుటచే సేనాచక్రమునకెల్ల నియామకుఁడయిన తనగీచినగీటు దళములు దాఁటవనుదృఢవిశ్వాసముచే నెల్లయెడలఁ దాను చిత్రభానునకుఁ బాసటయైయుండ నిశ్చయించుకొనెను. దండపాణితమ్ముఁడగువజ్రపాణి చిన్న సేనాపతియై మొదటినుండియు హేమచంద్రునిఁ గొలిచి యుండియుఁ జిన్ననాఁటఁ గోలెఁ గర్పూరమంజరిపైఁ గన్ను వైచి తన్నిమిత్తము [illegible]యుఁడఁ బక్షపాతము గలిగి యుండెను. ఆ హాల్యాసంగమాభిలాషియై [illegible]ల్లి వజ్రపాణి క్రోడియై మునిగృహముఁ జొచ్చినట్లు, కర్పూరమంజరీసమాగమముఁ గాంక్షించి యావజ్రపాణి జిత్రభానునియింటికుక్కయై తిరుగుచుండెను. ఆపరమమూర్ఖుఁడు కర్పూరమంజరి తనపై వలపునిలుపుచున్నదో లేదో తెలిసికొనఁజాలక చిత్రభానునిపాదసేవ యనునోలి నిచ్చినఁ గన్య యన్యవశము గాక తనచేఁజిక్కు నని యాటలు చరుచుండెను. స్వసుఖాభిలాషియై తమ్ముఁడును, స్వపుత్రికాసుఖాభిలాషియై యన్నయును జిత్రభానునికనుసన్న మెలంగుచుండిరి. ఆయన్నదమ్ము

లిరువురు ప్రతిదినము రాత్రులు చిత్రభానుని నెలవునకరిగి యత నితోఁ గాశ్మీరరాజ్యసంబంధములైన ప్రసంగములు సేయుచుండురు. రంధ్రాన్వేషియైన చిత్రభానుఁడు కాశ్మీరరాజ్యసంకలిలోఁగుపాటులు దౌర్బల్యములు వారివలనఁ దెలిసికొనుచుండును. రాజకుటుంబముపై నిష్కౌతుకముగా వారు పూనినద్వేషాగ్నిని రుద్రభట్టు తనవాక్సమిధలచేతఁ బ్రజ్వలింపఁ జేయుచుండును. ఈయిరువురఁ దనపక్షవర్తులుగాఁ జేసికొనుటతోఁ దనివినొందక చిత్రభానుఁడు శ్రీనగరవాసులలో ముఖ్యపురుషులఁ దనకడకు రావించియు వారియిండ్లకు స్వయముగాఁ బోయియుఁ, బూర్వము నేన్ను హేమచంద్రుఁడు నగరము నుండి వెడలనడఁచి నప్పుడుగాని, తరువాతగాని నసయెడ నంతమాత్రము దోసములేదనియు దురాత్ములైనవారో మహార్హిలైనట్టి యన్నను సంహరించిరనియు భ్రాతృహననదోషము తన కారోపించిన దురాత్ములు తత్కార్యముచేసిన వారిదుర్గతులకే పోవుదురనియు నొక్కివక్కాణించి యొట్లుపెట్టుకొని ప్రమాణములు చేసి వారిలోఁ గొందఱిమనస్సులు తానునిర్దోషి యని నమ్మునట్లుజేసెను. కొందఱతని మాటలు నమ్మినను మఱికొందఱు వాని బలుకులకుంగలయూఁటి యట్లైనావచ్చునని పలికి మనసుచెప్పటయట్లు నుండుకొనిరి.

చిత్రభానుని నంతఃపురికి రానిచ్చినందునను, నడచాలకనగిను మున నుండనిచ్చినందునను వానియాలు బిడ్డలు వచ్చితెన్ను సందర్శించుటకు సమ్మతించినందునను నరవిందాదేవిమీఁద మఱివర్మకుఁ బట్టరాని కినుకపొడమెను. కొన్నిదినములతఁడు రాజ్యవ్యాపారములం జూడనేలేదు. అంతిపురి కరుగనేలేదు. ఇల్లుకదలనేలేదు. వైదేశికులగు రాయబారులకుఁ గొన్ని ముఖ్యాంశములపైఁ దగినయుత్తరములీయలేదు. అరవిందాదేవి రాచనగరునకు రమ్మని యంతఃపురపరిచారకుల చేతను, నిగమశర్మచేతను మాధవసేనునిచేతను నెన్నోసారులు వర్తి

నగాను మంపినను మణివర్మ "యిదెవచ్చెద నదెవచ్చెద శరీరమస్వస్థముగానున్నది. పెద్దవాఁడనగుటచే మునుపటివలె రాజ్యవ్యాపారములయందు బుద్ధి ప్రసరించుటలేదు." అని యెన్నోవంకలు చెప్పి తప్పించుకొనుచుండును. కాని యాతని మనంబున నాశ్రయించిన తిక్కతిరుగదయ్యెను. అరవిందాదేవి యెట్టకేలకు మణివర్మ తనపై బెట్టలుక బూనినాఁడని యూహించి యొకనాఁడు విక్రమసేన హర్షవర్ధనులను బిలిచి "మీరిరువురు గధాహూథులై మణివర్మయొద్దకుంబోయి యతని యలుకం దీర్చి మన నగరునకుం గొనిరాగలరా నాయనలారా?" యని యడిగెను. "తప్పక దీసికొనివచ్చెద" మని వా రుత్తరమిచ్చి మఱునాఁ డుదయమున సముచితవస్త్రాలంకారములు ధరించి, తల్లికి వందన మొనర్చి స్యందన మెక్కి నందను లిరువురు తమపరివారము వెంటఁగొని కాశ్మీర రాజ్యవజ్రపంజరమగు మణివర్మగృహమున కరిగిరి. వారి రాకవిని మణివర్మ విస్మయమునొంది "అయ్యో! నా మాంద్యమువలన నతిసుకుమారులగు రాజకుమారు లిల్లువెడలి రావలసివచ్చెఁ గాదా" యని నొచ్చుకొని విసవిస మేడదిగి యెదురువోయి యిరువుర బిగికౌఁగిటఁ జేర్చి ముద్దులాడి చేతితోఁ దలమీఁద వీపుమీఁదనిమిరి "నాయనా! మిమ్ము నేను నకారణముగా మిక్కిలి శ్రమపెట్టితిని. ఈ మందభాగ్యుని నిమిత్తమున మీరంతఃపురము వెడలవలసివచ్చెఁగదా! ఛీ! నాబతుకు కాల్పనా" యని మనంబున హేమచంద్రుని దలఁచి బిగ్గరగా వాపోయుచు వారు శోకింతురని శంకించి నమ్మలిక నెమ్మనమున నణంచుకొని వారి నుచితాసనంబులఁ గూర్చుండఁబెట్టి సేమమడిగి గౌరవించి వచ్చినపని యేమని యడిగెను.

అడుగుటయు విక్రమసేనుఁడు మెల్లగ నిట్లనియె. "తాతగారు! నేను రాజును మీరు మంత్రియను సంబంధముచేత నిచ్చటికి రాలేదు, మాతండ్రిగారికి మీరు పితృప్రాయులై యుండిరి. మాకు మీరే పితా

మహులు. మీరె మాతామహులు. మాకు నిజమైన పితామహుఁడు లేనే
లేఁడు. మాతామహుఁడు మహేంద్రదేవుఁడు మాయమ్మను మమ్మును
మాతండ్రిగారి మరణానంతరమునఁ బరామర్శచేసి తనరాజ్యమున కరి
గెను. ఆపత్సముద్రమును జెలియలికట్టయై నిరోధించి శుభపరంపరల
నొడఁగూర్చుటకై మిమ్ముంజూపి మాజనకుఁడు స్వర్గస్థుఁడయ్యెను. రాజ్య
మునకు రాజు లేని వెలితి, మాకుఁ దండ్రి లేని వెలితి నీవలనం దీఱునని
మేము పుట్టెడాస పెట్టుకొని యుంటిమి. అట్టియాసలెల్లఁ జెడిపోయినని.
నవవైధవ్యదుఃఖభారమున నడఁగిపోయిన మాయమ్మకు మీదర్శనా
భావ ముఱిసినపుండున నుప్పుపెట్టినట్లయినది. ఇంతలోనే మీరు
మాపై నింత యనుగ్రహము దప్పియుందురని మేమెన్నఁడుఁ దలంప
లేదు. మాధవసేనుఁ డొక్కఁడే మంత్రాలోచనము చేసి కార్యభారము
నిర్వహింపఁజాలఁడు కావున నెప్పటియట్లు మీరు రాజకార్యంబుల
నిర్వర్తింపవలయునని నేను వేఁడుచున్నాను. మాయమ్మ మిమ్ము
రమ్మని వేఁడుచున్నది.'' అనుచుండ నంతలో హర్షవర్ధనుఁ డందుకొని
''తాతగారూ! మీరు రాకపోవుటచేత మాకోట చిన్నపోయినది.
మీరిచ్చటికి రానియెడల మేమే మీయింటిదగ్గఱ నుందుము. మిమ్ము
గెంటినను నిక్కడనుండి వెళ్ళము'' అని ముద్దులొలుకఁ బలికెను.
అంతమునుపు విక్రమసేనుని పలుకులకే సగముకరఁగిన యయ్యమా
త్యుని హృదయము సహజమధురములై జాలిగొలుపు హర్షవర్ధ
నుని పలుకులకు నీరై పోవ మణివర్మ లేచి యిద్దరిబిడ్డల మరల గౌఁగి
లించుకొని ''నాచిన్నియన్నలారా! ముద్దులమూటలగు మీమాటలు
వినినవాఁడు మీ చెప్పినచొప్పునఁ జేయకయుండఁగలఁడె? మీ
నుడువులకుఁ గరుఁగని డెందము ఱాయిగాని డెందము కాదు. నే నెప్ప
టికి మీ వాఁడనేగాని యన్యుఁడనుగాను. శిథిలగృహమువలె నున్న
యీముసలిమేనున నెంతకాలము ప్రాణముండునో యంతకాలము

నేను మీ క్షేమమే కోరుచుందును. ఎందుకట్టివలెనన్న యీ దేహ మక్కఱకు వచ్చినంతకాలము మీనిమిత్తమె పనిచేసి మీనిమిత్తమె వినియోగింపఁబడును. ఈదేహమే మీకవసరమైన పక్షమున నిర్విచారముగా నేను దీనిని మీకు సమర్పింతును. కాని నాఁడు నాచేసిన యుపదేశము సరకుగొనక మీతండ్రి స్వబుద్ధిచే మరణంబు దెచ్చి కొనియె. నేఁడు మీతల్లి నాపలుకులు ద్రోసిపుచ్చి చిత్రభానునిఁ జేర్చినది. మీరు పసికూనలు కార్యాకార్యము లెఱుఁగరు. మీపిన తండ్రి దురాత్ములలో నగ్రగణ్యుఁడు. తొలుదొల్త నితఁడు వైదర్భులం గొందఱఁ జేర్చి కుట్రపన్ని మీతండ్రిం గడతేర్పఁజూచెను. అయ్యది నేనును మాధవసేనుఁడును మహాప్రయత్నంబునఁ గనిపెట్టి లిఖిత మూలకమగు సాక్ష్యముతోఁ గూడ మీతండ్రి కెఱిఁగించితిమి. దానం జేసి మీయయ్య చిత్రభానుని దేశమునుండి వెడలనడఁచెను. అనంతరము హరిశర్మయను దురాత్మునిఁ బంచి యితఁడే మీజనకుని వంచించి చంపించెను. చంపించెననవేల? స్వహస్తములతో నితఁడే చంపెనని నానమ్మిక. నేను కన్నులారఁ జూడలేదుగాని, మీపిన తండ్రి స్వభావమునుబట్టి యితఁడే స్వయముగాఁ జేసెనాఁడని యనుచుంటిని. రాజభక్తిపూరితమైన మనస్సుతో నేనిట్లనుచున్నాఁడను గాన నాయాలాపములలోఁ శాపమున్నయెడల సకలపాప పరిహర్త యగు నుమాభర్త నన్ను క్షమియించుగాక! మీపినతండ్రి తేనె బూసినకత్తి. వానిమాటలనియెడి నురులలో నెట్టివారు దగుల్కొనుచుందురు. మేఁకవన్నె పులి. మాటలలోఁ దేనియలుట్టిపడుచుండును. హృదయము విషకుంభము. అట్టివానిని జేరనిచ్చుటం జేసి నామాట చెల్లదు గదాయని నాచేసిన హితోపదేశములు నిరర్థకములని నే నటవచ్చుటలేదు. అంతేగాని మీమీఁదఁగాని మీయమ్మమీఁదఁ గాని నాకు రవంతయు నలుకలేదు. నాపుత్రికకుఁ నరవిందాదేవికి

నెట్టి భేదములేదు. ఇదె యామె దర్శనము జేయ మీతోడ వచ్చుచున్నాఁడ''వని మేడమీఁదికిఁ బోయి తలపాగయు నిలువుటంగియుఁ దాల్చి బిడ్డలతోఁగలిసి రథమెక్కి రాజాంతఃపురమునకుఁ బోయి యరవిందాదేవిని సందర్శించెను. ఆదేవియు నతనికి నమస్కరించి తనవలనఁ దప్పులున్న క్షమియింపుమని ప్రార్థించి యెప్పటియట్ల రాజకార్యంబులఁ జూడుమని కోరెను. మణివర్మ విక్రమసేనునితోఁ జెప్పినట్ల యామెతోఁగూడ జెప్పి కడపట నిట్లనియె. ''తల్లీ! నాకన్న నీవు జిన్నదానవు. నీబిడ్డలు పసిపాపలు. చిత్రభానుఁడు బెబ్బులులకన్న సింగములకన్నఁ గోడెత్రాచులకన్నఁ గ్రూరుఁడు. నిజముగా నతఁడు దానవుఁడుగాని మానవుఁడుగాఁడు. అతఁడు నీకు నీబిడ్డలకు హానిసేయఁజూచు దండపాణియు వజ్రపాణియుఁ బ్రతినిధియు వాని కడకుఁబోయి యిక్కడివృత్తాంతమంతయు వాని కెఱిఁగించుచున్నారనియు వారే వానికి వేగులవాండ్రుగ నున్నారనియు నాగూఢచారులవలన నే వినియుంటిని. సైన్యమంతయు వారి యధీనములో నున్నది. అందుచేత మనము జాగ్రత్తగా నుండవలయును.'' అనవుడు నరవింద ''తండ్రీ! నాచేసిన పొరపాటు క్షమింపుము. నాతోడికోడలు కర్పూరమంజరియు రేపో నేఁడో వత్తురు. వారువచ్చి నన్నుఁ జూచిన తరువాత కార్యపద్ధతియంతయు నీచెప్పినట్లప్పుడు జరుగుఁగాక! ఇఁక మీఁద నీగీచినగీఁటు దాఁటుదానను గాను. నేను నిబిడ్డను. నాబిడ్డలు నీమనుమలు. నన్నును నాయనుంగునిసువులను నీకప్పగించి కాదె మహారాజుగారు స్వర్గస్థులైరి. అని యనివార్యమై వచ్చు కన్నీటిసోనల నాపలేక వలవల నేడ్చెను. మణివర్మయు దుఃఖము నాఁపలేక వేడి కన్నీళ్ళువిడిచి ''అమ్మా! నాశక్తివంచనలేక నేను పాటుపడియెద. అవసరమైన మీనిమిత్తము నాప్రాణములైన నర్పించెద'' నని యభయప్రదానమిచ్చి కొన్ని యితరవిషయముల మాటలాడి సెలవు గైకొని యింటికిఁబోయెను.

అయిదవ ప్రకరణము.

ప్రియజనవిరహము దుస్సహము. అది జీవితమును దుఃఖభాజనముఁ జేయును. ప్రియజనవియోగిమైన కాలమున భానుఁడు సహస్రమయూఖములతో నైజతేజమున వెలుగుచున్నను జగమంధకారమై తోఁచును. చలువలు వెదఁజల్లుచు మింటఁ జందమామ వెలయుచున్నను జంతువు దుర్భర సంతాపము నొందుచుండును. సౌఖ్యప్రదములగు వస్తువులన్నియు దుఃఖప్రదములట్లు కనఁబడును. ఉజ్జయినినుండి బైలుదేరిననాటఁగోలెఁ గర్పూరమంజరి సరిగా నన్నము ముట్టక, నీరుద్రావక, నిదుర వోవక, మునుపటియట్లఁ గలకలలాడు నెమ్మొగముతో సఖీజనమును బలుకరింపక విధిలేక పయనము సేయుచుండెను. ఆమె యందలమందున్నను సెజ్జమీఁదనున్నను మకరంద నామస్మరణమే సేయుచుండును. పరమయోగిని కన్నులుమూసి పరమేశ్వరునిధ్యానించునట్లు మకరందుని సుందరమూర్తిని ధ్యానించుచుండును. కన్నులు మూసిమూసి తన్మయత్వముజెంది మైమఱచి తనమనోనాథుఁ డెట్టయెదుటనున్నట్లు భావించుకొని చేతులుచాఁచి బయలు కౌఁగిలించుకొనును. అత్తఱి నెవ్వరయిన దాఁపుననున్న యెడల వారింజూచి సిగ్గుపడును. తానొక్కతెయున్న హాయని నిట్టూర్పు విడుచును. ఇత్తెఱంగున నత్తలిరుఁబోఁడి మకరందుని వియోగమునకుఁజిత్తమున నుత్తలపడుచు నెట్టెటో తల్లితోడను నెచ్చెలులతోడనుఁ గలసి పయనముచేసి తనువు శ్రీనగరముఁ జేర్చెను.

జయంతుఁడు తమ రాక ముందుగాఁ జిత్రభానునకుఁ దెలియఁజేసియున్నకతనమున నాతఁడు దారపుత్త్రిల నూరుబయట నెదుర్కొని సంభావించెను. జయంతుఁడు వనములో దొంగలుకొట్టుట మగంటిమి గల బంట్లుకూలుట, విజయసేనుఁడు గాయపడుట,

కర్పూరమంజరి మూర్ఛిల్లుట, మాలవ రాజనందనుఁడు సాయపడి వారిసపాయమునుండి యుద్ధరించుట, పిమ్మట నుజ్జయినిలోఁ గొంత కాల ముండుట, సుదర్శనుఁ డాదరించి తగుపరిజనమునిచ్చి పంపుట మున్నగు వృత్తాంతమంతయుఁ జిత్రభానునకు విన్నవించెను. అదివిని యతఁడు విస్మయంబును విషాదంబునుబొంది మకరందుని తోడ్పాటు గనెను. సుదర్శనుని కూఁతురకును దద్దయుసంతసించి వారినందఱఁ దన గుడారంబులయందఁ దూరేయినిలిపి వారిరాక మఱునాఁ డరవిందాదేవికిఁ దెలియఁబఱచెను.

ఆ దేవి వారిరాక ననుమతించుటయు నాఁటియపరాహ్ణమున నిందుమతి కర్పూరమంజరి విజయసేనునిఁబరిచారికాజనమును వెంటఁ బెట్టుకొని రాచనగరునకుం జనియెను. కర్పూరమంజరి కంటికి మొగసాలలు, కొలువుకూటములు కళాహీనములై కానఁబడనామె మొగము గాఢవిషాదమును దెలుపుచుండెను. దేవింజూచి యందఱు దుఃఖాక్రాంతచిత్తలైరి. కర్పూరమంజరి చిన్ననాఁటనుండియు హేమచంద్రునిఁ దండ్రిగ నరవిందను దల్లిగ భావించి వారు కన్నబిడ్డయట్లె పెరుఁగుటం జేసి హేమచంద్రుని మృతికిఁ దన పెదతల్లిదురవస్థకు నామె మెండైన యుమ్మలికఁ జెందెను. అరవిందాదేవి తనదుఃఖమును మాటలచేతఁగాక బొటబొటఁ గారెడు బాష్పములచేత నే వెలిబుచ్చెను. విజయసేనుఁడు విక్రమసేన హర్షవర్ధనుల నోదార్చెను. ఇందుమతి, సమయోచితవచనములఁ దోడికోడలిని సమాశ్వాసించెను. పరామర్శ ముగిసినపిదప నందఱు మరల గుడారములకుఁ బోవఁబయనమగుచుండ నరవింద కర్పూరమంజరిం బిలిచి "బిడ్డా! నీవిచ్చట నిలువుము. మీ యమ్మయుఁ దక్కినవారుఁ బోయివత్తురుగాక!" యని పలికెను. ఇందుమతియుఁ గర్పూరమంజరి యచ్చటనుండుటకు సమ్మతింప నామె పెదతల్లికడ నిలిచి పోయెను. తక్కినవారందఱు గుడారములకుం

చనిరి. ఆ బాలిక యంతిపురినుండుట విక్రమసేనహర్షవర్ధనులకును సంతోషకరముగా నుండెను. అరవిందాదేవి నిరంతరము భర్తృమరణదుఃఖమునం గడుంగడు గుందుచుండుటం జేసి యామెదుఃఖాపనోదార్థము కర్పూరమంజరి పురాణములనుండియుం బూర్వరాజుల చరిత్రములనుండియు మనోహరములైన కథలనేర్చి పెదతల్లికిం జెప్పుచుండును. విక్రమసేన హర్షవర్ధనులుగూడ మిక్కిలితమకముతో వానినాలకించుచువచ్చిరి. ఒకసారి తనప్రయాణమును గుఱించి ముచ్చటించి త్రోవలోం జెంచుపడతిం జెప్పిన యెఱుక తెలిపి యామె వారిని నవ్వించెను. వెంటనే యాసడి రేయి జరిగినభిల్లుల బందిపోటుజెప్పి వారందఱికి భయముగొలుపును. ఒకతూఱి విదర్భాపుర వృత్తాంతములు, మఱియొకసారి యుజ్జయినీ విశేషములు దెలిపి వారినానందింపం జేయును. ఒకసారి మకరందుని సాహసౌదార్యాదిగుణములు వర్ణించి వారివీనులవిందుసేయును. మఱియొకతూఱి హేమచంద్రుని మరణవృత్తాంతము సవిస్తరముగా నర్మదనడిగి దెలిసికొని పెదతండ్రికట్టి దుర్మరణము సంభవించినందుకు బిట్టువిచారించుచుండును. విద్యావతి యగుటచే నా బాలిక శోకవిహ్వలయగు నరవిందకు నప్పుడప్పుడు వేదాంతవాక్యములు చెప్పి యామె యులమునకు సంతోషముం జేయును. ఈ విధముగాం దనశక్త్యైనంతవఱకు బెదతల్లిని స్వబుద్ధిశోకాంధకారమును వెడలద్రోలుటకు సర్వప్రయత్నములం జేయుచుండెను. అందుచే నరవిందాదేవి కర్పూరమంజరినివిడిచి పెట్టనిచ్చగింపదయ్యె.

విదర్భాపురమునుండి తనకుటుంబము వచ్చిన వెనుకం జిత్రభానుండు రమారమి యొకవారము దనకు నెడాగముయంత బనచేసి పిమ్మట దండపాణిప్రముఖులు తననిమిత్తమరసి సమకూర్చిన భవనమునం గాపురముండ వెళ్ళెను. ఆగృహము విశాలమైన యావరణము గలిగి వెనకప్రక్క చిన్నయుద్యానము గలిగిముందువిశాలమైనవాకిలి

గలిగి రమణీయములగు మేడలుమిద్దెలు గలిగి రాజబంధువులు సపరివారముగా వసియించుట కనువుగానుండెను. అందువిడిసిన రెండుమూఁడు దినములకుఁ గర్పూరమంజరి తండ్రి పిలువనంప నాథవనమును తల్లిదండ్రులను జూడఁబోయెను. మాతాపితలు గాలికను రెండుమూఁడుదినములాఁపిరి. ఆలో నరవింద కర్పూరమంజరిని రమ్మని నర్మదచేత వర్తమానమంపెను. కర్పూరమంజరిమీఁద నరవిందకు గాఢానురాగము గలుగుట చిత్రభానున కొకవిధముచేత సంతోషకరముగాను, వేఱొకవిధముచేత సంతాపకరముగాను నుండెను. తన పుత్రికచేత మణివర్మప్రముఖులమీఁద గొన్ని కానిమాటలు రాణితోఁ జెప్పింపవచ్చునని వారికలయిక నతఁడిచ్చగించెను. కాని చిరసహవాస దోషమునఁ దనపుత్రికకు నరవిందమీఁదను నామె బిడ్డలమీఁదను విప్పరాని కూర్మిజనించి భవిష్యత్కాలమున బాధకరమగునేమోయని భయముగలుగఁ జొచ్చెను. అయినను నతఁడామె రాచనగరమునకుఁ బోవుట కాటంకముఁ గలిగింపలేదు. రెండవనాటిరేయి చిత్రభానుఁడు భోజనానంతరమందుఁ గూఁతురుం జేరఁబిలిచి "బిడ్డా! నీవు నీ పెదతల్లితోఁ గలిసిమెలసి కొన్నినాళ్ళునుండి యుంటివిగదా! భర్తృమరణమునుగూర్చి యామె నీతో నేదేని చెప్పినదా?" యని యడిగెను. "నర్మద నడిగి నేను పెదవాయనగారి దుర్మరణవృత్తాంతముఁ దెలిసికొంటిని. అదియున్నదున్నట్లు జెప్పెనుగాని యెవరిమీఁదను నిందారోపణముఁ జేయలేదు. నర్మద చెప్పినంతసేపు నా పెదతల్లినోటమాట రాలేదు. కంటినుండి ముత్యాలచేరులు నేలకు వ్రేలగట్టినట్లు బాష్పధారలు దొరఁగెను. ఇదియే జరిగినవృత్తాంతము" అని కూఁతురు తండ్రికి నుత్తరము చెప్పెను. "అంతేనా? ఎవ్వరిమీఁద ననుమాన మున్నట్లు చెప్పలేదా? సరే! వాండ్రకు నిజము తెలియక పోవచ్చును. నిజము నిలుకడమీఁద దెలియకపోదు."

అని పలికి కొంత సేపూరకుండి యేదో యాలోచించుచున్నట్లు పైకి
జూచి [illegible] చెప్పెను. "బిడ్డా! అరవిందా దేవికడ
నిన్ను [illegible] నా కొక [illegible] రహస్యము చెప్పవలయునని
[illegible] మా
యన్న [illegible] చేసిన వాని [illegible] భ
[illegible] ఘోర
[illegible] కాలభుజగము. [illegible]
[illegible] బిడ్డా! [illegible] నీయభిప్రాయము. నిన
[illegible] లేదు. [illegible] హృదయము [illegible] పాత్రములు.
[illegible] చేయని పాపములు లోకములో లేవు. [illegible]
ములు [illegible] నుండను. [illegible]
[illegible] వారు [illegible]
[illegible] లేఖ [illegible] ములు [illegible]
[illegible] లారు.
[illegible]
[illegible] మాయన్న [illegible]
[illegible] సద్గుణ [illegible]
[illegible] బిడ్డా! అతని [illegible] దేశమునుండి
వెడలనడచుట [illegible]
లేకున్న మాయన్న నన్నట్లు సేయునే" యని [illegible]
[illegible] గద్గదస్వరయుక్తముగా మాటలాడ [illegible] రువిడిచెను.
కర్పూరమంజరియు దుఃఖపూరితయై కన్నీరు [illegible] "తండ్రీ!
విచారింపకు. నీ సౌభ్రాత్రము నిరుపమానమైనది. కాలవశమున మన
స్సులలో [illegible] వలు పొడముటయు దానికిందగినట్లు హేమచంద్ర

జంపుటకుఁ గొన్ని కుట్రలు బైలువెడలుటయు నప్పుడు సంభవించెను. ఎందుచేతనో నీపై నప్పు డనురాగముగలుగ నతఁడట్లు చేసెను. ఆయనమరణమునకు విచారించి యేఁ గార్యమేమి? నీయభిమతమేమో చెప్పుము. శక్యమైన పక్షమునఁ జేసెద" నని హెచ్చరించుటయుఁ జిత్రభానుఁడు మరల నిట్లు చెప్పఁదొడఁగెను. "అమ్మా! మణివర్మ హేమచంద్రునిఁ జపించినట్లు సివరవిందాదేవి మనసునకు నచ్చునట్లు గట్టిగఁ జెప్పవలయును. మణివర్మయన్న మాఁకున్న యట్ల నామెయుఁబడి చచ్చును. అతఁడే తన తండ్రిగా గురువుగా క్షేమంకరుఁడుగా నమ్మి తనప్రాణము కొడుకులప్రాణములు వానిచేతం బెట్టినది. అందుచేత నామె కతనిపై ద్వేషము వెలుగునట్లు నీవు నొక్కి పలుకవలెను. మాయన్న యున్నప్పుడే మణివర్మ కాశ్మీర రాజ్యచక్రమును నిచ్చి వచ్చినట్లు ద్రిప్పినాఁడు. ఇప్పుడతఁడే రాజు వానిమాట నిరంకుశమై చెల్లుచున్నది. మాయన్న పేరుమీఁదుగా నాయిద్దరిబిడ్డలనైన వాఁడు బ్రతుకనిచ్చునని నాకునమ్మికలేదు. ఆపసికూనలఁగూడ వాఁడెప్పుడో తనపొట్టంబెట్టుకొనును. కాబట్టి మణివర్మపై బ్రాలియున్న నామె మనసును నీవు యథాస్థితిని మరలింపవలెను. నీవు విద్యావతివి. మాటలయందును జాణవు వాక్చటుత్వముగలదు. హేతుకల్పన చక్కగాఁ జేయఁగలవు. పూర్వోత్తరవిరోధము గలుగకుండ సందర్భశుద్ధి చెడకుండ నెట్లుచెప్పవలెనో యట్లుచెప్పి కాశ్మీరరాజ్యమును రాజకుటుంబమును రక్షించునట్టి మార్గము చూడుము. అట్లయిన నీవు కష్టపరంపరలను వేఁడిగాడ్పులచే శోషిల్లుచున్న మన వంశవృక్షమునకు నీరుపోసిరక్షించినదానవగుదువు. నేనేమో చెప్పితినని చక్కఁగా నాలోచించి కర్తవ్యము చేయుము. నాయన్న కుమారులు నాయన్న రాజ్యము చక్కఁగానుండుటయే నాకోరిక."

అప్పలుకులు విని కర్పూరమంజరి విస్మయముఁ గొంచు క్షణమాలోచించి తండ్రి కిట్లనియె. "నాయనా! కాశ్మీర రాజ్యమునకు మన విక్రమసేనహర్షవర్ధనులకు క్షేమముగలుగుట నాకుఁ బరమ సంతోషము. కాని యువరాజు చెప్పినను మణివర్మ మిక్కిలి యోగ్యుఁడనియు, రాజకుటుంబమునకు హితకారియనియు నాత్మలాభపరాయణుఁడు గాఁడనియుఁ జెప్పుచున్నారు. నీమాటలుచూడ నతనివంటి మలినవర్తనుఁడు లేఁడని స్పష్టమగుచున్నది. పెదనాయనకు మణివర్మ యుపకారము సేయుచుండ నేఁ జూడలేదు. ఇంతవఱకు వినలేదు. అట్టి సజ్జనునిపై రాజద్రోహము, రాజహత్య మొదలగు మహాదోషముల నారోపించి నేనేవిధముగా నరవిందాదేవితోఁ జెప్పఁగలను? ఈ పని చేయుటకు నా యంతరాత్మ యొప్పుకొనుటలేదు. ఒక సద్గుణవంతుని జెఱచుట మహాపాతకహేతువు. కావున నన్ను నీవీ విషయమున క్షమింపవలయు. మణివర్మయే హేమచంద్రహంతకుఁడని నీవు చెప్పితివి కాని ప్రపంచమున నెట్టి దుర్వాఖ్యకయున్నదో యెఱుఁగుదువా? మాళవరాజాంతఃపురమున నేనున్నకాలమున నే నిద్దఱు ముగ్గురివలన నీవే నీయన్నను జంపితివని—చంపించితివని వింటిని. అప్పలుకులు నేను నమ్మెదనా? కర్పూరమంజరిని గన్నతండ్రి చేతులు భ్రాతృరక్తము సోఁడ నరుణములగునే! నీపై నపవాదము నెట్లు విశ్వసింపనో మణివర్మపై నారోపణలుగూడ నట్లె విశ్వసింపను. కావున నీపని నాతలపైఁ బెట్టకుము. అది నాచేఁ గానిపని." అని బాలిక యూరకుండఁ జిత్రభానుఁడు "పోనీ! బిడ్డా! నీవాపని జేయలేకున్నను నాపై లోకులు మోఁపిన యపవాదము నీవు నమ్మలేదు. అదియే నాకుఁ బరమసంతోషము. అదియే పదివేలు. ఇంకఁ బండుకొనుము" అని యామెను బంపి తానును శయనాగారమునకుఁ బోయెను.

ఆఱవ ప్రకరణము

మణివర్మ యరవిందాదేవి యాజ్ఞ శిరసావహించి యెప్పటి యట్ల రాజ్యవ్యాపారములఁ జూచుచుండెను గాని యాతనిమనస్సు యథాస్థితిని బ్రాపింపలేదు. చిత్రభానుఁడు శ్రీనగరమునకు వచ్చుటే యతని కిష్టములేదు. వచ్చినను నతఁ డచ్చట నిలువఁ జేసియుండుట కిట్టదు. ఆతని కుటుంబము వచ్చుటంతకన్న నతనికి సరిపడలేదు. కుటుంబమువచ్చి రాజపత్నిని బరామర్శ చేసినపిదప నకుటుంబముగాఁ దా నూరువిడిచిపోవునట్లు దేవియెదుట వాగ్దానముఁజేసి చేసినట్లు వీడు విడిచిపోకపోవుటగాక, మీఁదుమిక్కిలి యచ్చట స్థిరవాసము చేయఁ దలంచి యొక విశాలభవనము నాక్రమించుకొనుట వానికి మిక్కిలి కష్టముగా నుండెను. అన్నిటికంటె నెక్కువగఁ జిత్రభాను పుత్రిక యైన కర్పూరమంజరి నిరంతరము దేవికి సన్నిధానవర్తినియైయుండుట లోకజ్ఞుఁడైన యతని కనుమానము హెచ్చించుచుండెను. అందుచేత నతఁ డేమిచేయుటకుఁ దోఁచక మూఢునియట్లు, కార్యపద్ధతి నిర్ణయింపలేకయుండెను. ఒకసారి కాశ్మీరరాజ్యముతో సంబంధమువదలుకొనుట యుక్తమని యతఁడు తలంచును; వెంటనే మృతుఁడైన హేమచంద్రుని దలఁచియు లేబ్రాయముననున్న రాజకుమారులం దలఁచియు బిడ్డవలెఁ దన్నునమ్మిన యరవిందం దలఁచియు నాయాలోచన మంతమునొందించును. ఒకతూరి చిత్రభానుని నూరువిడిచి తక్షణమె పొమ్మని సందేశ మంపవలయునని తలపోయును. రాణి యానలేక యట్లుచేసిన నామె యెట్లుగాఁదలంచునో యని శంకించును. తనవేగుల వాండ్రెంత తెలివిగలవాండ్రైనను లోలోపల నేమి జరుగుచున్నదో వారు తెలియఁజేయఁ జాలరుగదా! ఏమి జరుగుచున్నదో యేమి పన్నుగడలు చిత్రభానుఁడు పన్నుచున్నాఁడో యని భయ

పడుచుండును. ఈవిధముగాఁ గొన్నిదినములతఁడు తలపోసి తలపోసి యరవిందాదేవికడకుఁ బోయి యామెతో నీవిషయమై ముచ్చటింపఁదలఁచి విక్రమసేనునిం బిలిచి "కర్పూరమంజరి లేనిసమయమున మీయమ్మతోడను నీతోడను నే నించుక ప్రసంగింపవలతు. ఇట్లు మీయమ్మతోఁ జెప్పుము" అని పలుక నక్కుమారుఁడు వల్లెయని తల్లికడకరికి యమ్మాట చెప్పెను. ఆమెయు మఱునాఁ డేకాంతమునఁ బ్రసంగించుటకుఁ దగినసమయము స్థలము నిర్దేశించి యమాత్యుని రావించెను. మణివర్మ ముడుతలువడిన మొగము ముగ్గుబుట్టవలె నెఱసినతల, మాంసహీనములై వ్రేలుచర్మములు, వయోభారమునకుఁ దోడు స్వయముగాఁ బైనవైచుకొనిన కార్యభారముచేతఁ గొంచెము వంగిన నడుము, దేవికిఁ గుమారునకు జాలిగొలుప వారిని సమీపించి సన్మానితుఁడై పీఠముపైఁ గూర్చుండి మెల్లగ నిట్లనెను. "అమ్మా! చిరకాలజీవనము కష్టపరంపరాదర్శనముకొఱకే. కానిచో నట్టి నరపాలచంద్రుని హేమచంద్రుని చేతులుమీఁదుగా నేనుబోక జీవచ్ఛవమునై యుందునా? చిత్రభానుని రాకనుగూర్చి నేను మీతో నివఱకే మనవి చేసికొనియుంటి. అతఁడు వచ్చుటే ముప్పు. రానిచ్చుట తప్పు. చేసిన తప్పు దిద్దుకొనుట యొప్పు. తనకుటుంబము మిమ్ముఁ బరామర్శ చేసిన తరువాతఁ దా నీయూరు విడిచిపోవునట్లు మాటయిచ్చెను గదా! ఇప్పుడు చేసినపనిచూడుఁడు. ఇచ్చట శాశ్వతనివాసము చేయఁదలంచి కాఁబోలు విశాలభవనము నాక్రమించుకొనియె. ఏకువలెవచ్చి మేకువలె బిగుసుకొనెనన్న సామెత నిజమైనది. మీమనసులో మీకెట్లున్నదోగాని యతఁ డిక్కడనుండుటచే నేను ముండ్లమీఁదనున్నట్లున్నాను. నామనస్సు నిప్పుల బొరలుచున్నది. జ్వరములేకయే నేను తాపపడుచున్నాను. రోగములేకయే నాకాహారద్వేషము గలిగినది. తెగులులేకయే నిద్రాశూన్యములైన రాత్రులు గడపుచున్నాను.

చిత్రభానుఁ డున్నచోట మనముండుట త్రాఁచుపామున్న యింట మెలఁగుట. వాని నుండనిచ్చుట కొంగున నిప్పు మూఁటగట్టుకొనుట. ఈవిషయములన్నియు నేను మున్నె సూచించియుంటి. విశేషించి కర్పూరమంజరి మిమ్మువిశ్రమము పాయక తోడునీడవలెనున్నది. ఆమెపై మీ కెంతి మక్కువయున్నను నామె శత్రుని బిడ్డగదా. ఆమెకు మీపై నెత యనురాగమున్నను మీరు తల్లిదండ్రుల తరువాతివారు గదా! మీగుట్టుమట్టు లామెతండ్రి కెఱిఁగింపకుండునా ? ఎంతమంచి దైనను బాలిక మీకు వారికి వైరమువచ్చినప్పుడు తండ్రిపక్షము నుండక మీపక్షముండునా ? అతఁడేమి దుస్తంత్రములఁ బన్నుచున్న వాఁడో మన మెఱుఁగము. నావేగులవాండ్రు విహంగకుఁడు కైరవుఁడు మున్నగువారు పలుతెఱంగుల వారిజాడలఁ దీయ యత్నించుచున్నారు. కాని పైపై వార్తలేగాని లోపలిగుట్టు తెలియుట లేదు. కావున నోతల్లీ ! వాని నిచ్చటినుండి వెడలనడఁచుట మంచిది. ఆదికాలమున మన మహారాజుగారే వానిని దేశభ్రష్టునిజేసిరి. కావున నింద మన మీఁదనుండదు. వెనుకటి మహారాజు చేసిన పనియే మన మిప్పుడు చేయుచున్నాము. బలవత్తరములైన పూర్వకారణములే యిప్పుడు నున్నవి. అంతకన్న నెక్కుడు కారణములుం గలవు. కావున వానిని వెడలనడఁచుటకు నాకు సెలవిమ్ము. నీ ముదలయయ్యే నేని వానింబంపి వేయుటకు యత్నించెద. నగరమువిడిచిపోవునో లేదో నాకును సందియమే. అందుచేత నే యత్నించెదనంటిని. మీఁదమీచిత్తము'' అని పురోహితాభిలాషియగు వృద్ధామాత్యుఁడు వచియింప నద్దేవి విక్రమసేనునివంకఁ జూచెను. విక్రమసేనుఁడు తల్లివైపు జూచెను.

అమ్మా ! తల్లికొడుకు లొండొరుల మొగములు చూచుకొని తెల్లఁబోవనేల ? ఏదో కార్యపద్ధతి సత్వరము నిశ్చయింపుఁడు'' అని యమాత్యుఁడు హెచ్చరింప రాజమాత యిట్లనియె. ''తండ్రీ! నీపలు

కులు వేదవాక్యంబులుం బోలె సత్యంబులు. మా కెల్ల చుట్టములునీవ!
నీవంటి క్షేమంకరుఁడు మాకు వేయిజన్మములు దపస్సుచేసినను లభిం
పఁడు. నీయిష్టమెట్లో యట్లె నేను చేసెద. కాని యొక్కవిషయ మా
లోచింపుఁడు. మామఱఁది నిప్పు దూరువిడిచిపొమ్మనుట నిద్రించు
చున్న బెబ్బులిని మేల్కొలుపుట యగునేమో! పండుకొన్న
త్రాచుబామును పడగవిప్పి యాడించుటయగునేమొ! రాజుచున్న
నిప్పు మండించుట యగునేమో! ఆఁడుదానను రాజనీతి నెఱుఁ
గనిదానను. అందుచేత నా మాటలే పాటిగాఁ గొనక నీవును
మాధవసేనుఁడును రాజభక్తియుక్తులగు దక్కిననియోగులతోడను
గార్యాలోచనముసలిపి యథోచితముగావర్తింపుము. కర్పూరమంజరి
చిత్రభానుని పుత్రికయైననుసుగుణరాశి, ఇక్కడమాటలక్కడ నక్కడి
మాట లిక్కడఁ జెప్పునదిగాదు. ఎక్కడిమాటలక్కడనే జీర్ణము
చేసికొను స్వభావము దానిది. అయినను రాజ్యపరిరక్షణార్థము
దానింగూడ నేఁ బరిత్యజించెద.అనవుడు మణివర్మ విక్రమసేనునివంక
దిరిగి "కుమారా! సాలగ్రామము చిన్నదైనను బెద్దదైనను బూజ్య
మె. రాజుబాలుఁడైనను వృద్ధుడైనను మాననీయుఁడె. కావున నీయభి
మతముఁజెప్పుమని యడిగెను. అడుగుటయు నతఁడు "అయ్యా! కిరీట
భారమే నేను తలఁదాల్చితినిగాని రాజ్యభారము మోయువాఁడవు
నీవు. దండపాణిప్రముఖులతోఁగూడ నీవాలోచింపుము. మనకు వారి
పై ననుమానమున్నట్లు మనవర్తనముచే వారికిఁ దెలియనీయఁగూ
డదు. అందఱితోపాటు వారింగూడ గౌరవపురస్సరముగాఁ బిలిచి
కార్యనిశ్చయముచేయుట కర్తవ్యము. మీశాస్త్రజ్ఞానము మీలో
కానుభవము, మీబుద్ధివిశేషము నాశ్రయించి మీ యిచ్చవచ్చిన
తెఱంగున వర్తింపుఁడు. మీకుపదేశముచేయుటకు నేనెవ్వఁడనని విన
యమున బదులుచెప్పెను. అప్పలుకులు విని యాసచివాగ్రణి "సరే

మీ రిరువురు నాకుం దోఁచినపోల్కి సేయుమని చెప్పిరిగదా. మాధవసేనుఁడు సర్వకార్యములందును నన్ననుసరించును. దండపాణిని వజ్రపాణినిగూడఁ బిలువనంపి వారిమతము దెలిసికొనియెద. వారు నాతో నేకీభవింపక పోయినను నేను చిత్రభానుని బురమువిడిచిపోవలసినదని చెప్పెద. ఏలయన, వారి రాజభక్తినిగూర్చి నాకనుమానము గలదు. వారయినను జాటుచాటువ వానికిసాయము చేయవలసిన దేగాని సాహసించి బహిరంగముగా మనకు వ్యతిరేకముగా నుండఁజాలరు. అట్లు సేయుటకుఁగూడ వారికిఁ దగిన హేతువులు లేవు. ఇప్పటికి నేను సెలవుగైకొని పోయివచ్చెద" నని స్వగృహమునకుఁబోయెను.

ఆరేయి మాణివర్మ దండపాణిని వజ్రపాణినిఁ దన గృహంబునకుఁ బిలువనంపి మొదటినుండియుఁ జిత్రభానునకు హేమచంద్రునకు గలసంబంధ ముపన్యసించి యతఁడు భ్రాతృహంతయని లోకమునం గలవాడుకల నెత్తి నగరమున నతనినుంచుట కర్తవ్యమగునా కాదా యనుమాట గట్టిగా విచారించవలసిన దని వారితోఁ జెప్పెను. అప్పలుకులు వారికి శ్రోత్రపేయములుగా లేవు. మనసులోఁ జిత్రభానుని యెడఁ బ్రేమగలిగియుండుటఁ జేసి వారిరువురును నెటు చెప్పుటకు వీలు లేక కొంతసేపు మనసులలో వితర్కించుకొనిన పిదప దండపాణి యిట్లనియె. "ఆర్యా! చిత్రభానునిమీఁద నలుకవొడమి హేమచంద్ర మహారాజు వానిని దేశమునుండి వెడలనడఁచిన మాట నిజమే. అది ఘోరపాటని మేము తలంచుచుంటిమి. చిత్రభానుఁడు భ్రాతృహంత యనుమాట మేము నమ్మఁజాలము మేమే కాదు బుద్ధిమంతు లెవ్వరు నమ్మరు. అన్ననిమిత్త మతఁ డెంతో యడలుచున్నాఁడని వినుచున్నాము. అది కపటనాటకముగాక నిక్కమైనదుఃఖమే యని మా తలంపు. ఆతఁడిక్కడనున్నందువలన మన కేమియుపకారముగలుగును? అతనిం గదుపుట కందిరీఁగలతుట్టం జెదరగొట్టుట. ఓఁగాములు చక్కఁగ

విచారించి మీ యిచ్చవచ్చిన తెఱంగునఁ జేయుఁడు. ఈకార్యము నాకు మాత్ర మిష్టములేదు." అదివిని మణివర్మ "వజ్రపాణీ! నీయభిప్రాయ మేమి?" యని యడుగ వజ్రపాణి "అయ్యా! అన్నదమ్ములకు నేమి కారణముచేతనో మనస్పర్థలు కలిగినవి. వెనుకటి మహారాజు, విషయము సరిగ విమర్శించియో విమర్శింపకయో తమ్ముని వెడలఁ గొట్టెను. హేమచంద్రునితో వైరములంత మొందినవి. చిత్రభానుఁడు వెనుకటివైరము మఱచి మరల స్వదేశమునకు వచ్చినాఁడు. అతని జోలికిఁబోవుట యుక్తముగాదు. అదిగాక యతఁ డేమి చేయఁగలఁడు? ధనమా, రాజ్యమా, యధికారమా, సైన్యమా, యతనిచేత నేమి గలదు? కావున మనమతని నుపేక్షించియుండుట సముచితమని నా మతము."

అప్పలుకులు విని వారిమనస్సులోనున్న భావము సంపూర్ణముగ గ్రహించి యంతకన్న వారితో నెక్కువ ముచ్చటించుట యప్రస్తుతమని యప్పటికి వారికి సెలవిచ్చి పంపి మణివర్మ తనమనస్సులో నిట్లు వితర్కించెను. "అన్నన్నా! రాజ్యతంత్రనిర్వాహణము కడుంగడుఁ గష్టముగదా! ఇదియనేకాపదలకాస్పదము. ప్రమాదము మానవమాత్రునకు సహజము. అది మంత్రిపట్లవచ్చినా దానిని లోకము సహింపదు; రాజుసహింపఁడు. తల పెట్టినకార్యము శుభముగాఁ బరిణమించెనా యామంత్రి యభినవబృహస్పతియనియుఁ గలియుగ శుక్రుడనియు, యుగంధరుఁడనియుఁ బ్రకృతిజనులు వేయితెఱంగుల సన్నుతింతురు. దైవవశమున నక్కార్యము మంత్రిలోపము లేకయే చెడినా వాఁడు పనికిమాలినవాఁడు, దండనార్హుఁడు నని యానోళ్ళతోనె నిందింతురు. ప్రజాభిప్రాయము బహుముఖములు గలరాక్షసి. కార్యధురంధరులపట్ల లోపమువచ్చినా యది వారిం దప్పక మ్రింగివేయును. రాజుల చిత్తవృత్తులు నట్టివే. అందు రాజు పిన్నవాఁడైనప్పుడు

మంత్రిపాట్లు చెప్పవలసినదే లేదు. ఇక్కడ రాజు చిన్నవాఁడు. సంరక్షకురాలు తల్లి; యాఁడుది చేయవలసినకార్య మతికష్టమైనది. చిత్రభానుఁడు పరమదుర్మార్గుఁడు మిత్రు లెవరో శత్రు లెవరో తెలియకుండ నున్నది. దైవమా! ఏమి తెలుపు! ఇట్టి సందిగ్ధసమయ మెన్నఁడు రాలేదు. ఏమైన నగుఁగాక! దైవముమీఁద భారమువైచి రాజకుటుంబక్షేమము విచారించి నాబుద్ధికి నచ్చినట్లు జేసెద. ప్రయత్నమే మనుష్యునివంతు; కార్యసిద్ధి దైవాయత్తము'' అని నిశ్చయించి ద్వితీయమంత్రి యగుమాధవసేనుని మఱునాఁడు బిలువనంపి యాతనితో ననేక రాజకార్యములను ముచ్చటించిచిత్రభానుప్రసంగముదెచ్చి నగరమునుండి బహిష్కరించుట కర్తవ్యమా యకర్తవ్యమా యని యడిగెను. మాధవసేనుఁడును మణివర్మ యట్ల యఖండ రాజభక్తియుక్తుఁడు. అతనియట్లె చిత్రభానునియెడ విశ్వాసము లేనివాఁడు. అయినను మణివర్మ యట్లు కార్యనిశ్చయము సత్వరముగా నతఁడు చేయఁజాలఁడు. నోటనుండిమాట వెడలకమునుపు దాని నతఁ డెన్నిసారులో తూఁచును. భావమున నెన్నిసారులో దానిని మర్దనచేయును. అందుచేత నతఁడు చాలసేపాలోచనముచేసి కొట్టకొన కిట్లనియె "అన్నివిధములఁ జిత్రభానుఁడు శ్రీనగరమునకు దూరమున నుండవలసినవాఁడె. కాని, మనమింత తొందరపడవలసినయవసర మేమి? సాహసించినపక్షమున నేమిప్రమాదము సంభవించునో! వానిచర్యలు మఱికొంతకాలము కనిపెట్టి యవి విపరీతములయినపక్షమున మనమప్పుడు వానిని బహిష్కరింపఁగూడదా!" అనుచుండ నతనిమాట కడ్డముపోయి మణివర్మ "ఎంతకాలము మనము నిదానించుట? తలుపులు గొళ్ళెముపెట్టి వాఁడు నాలుగుచూరు లంటించినపిదప మన మేమి చేయఁగలము? వాఁడిచ్చట దుస్తంత్రవృక్షమును బెంపఁదలంచి మొక్కనాటినాఁడు. దోహదము సేయుచున్నాఁడని నా నమ్మిక.

అది మ్రానై గొడ్డళ్ళకైనఁ దెగనప్పుడు మన మేమిచేయఁగలము? మొలకయయిననాఁడె పెల్లగించుట కర్తవ్యము. కావున నామాట వినుము. నీవుపోయి చిత్రభానునిం గలసి సకుటుంబముగా నతఁడు శ్రీనగరము విడిచి వెళ్ళవలసినట్లు రాజశాసనమైనదని చెప్పుము. నేను పిన్నరాజుతోను రాణితోను మాటలాడితిని. ఎప్పుడో యొకప్పుడు మన మీకార్యము జేయవలసినవారమె. పెందలకడఁ జేయుట మంచిది'' అని కఠినస్వరముతోఁ బలికెను. ''మీచిత్తమువచ్చినట్లు జేసెద. ఈసాయంకాలమె పోయి చిత్రభానున కీవార్త నెఱింగించెద. ఆతని ప్రత్యుత్తరము మీకు నేఁ జెప్పెద''నని మాధవసేనుఁడు చెప్పి సెలవుగైకొని పోయెను.

ఏడవ ప్రకరణము

మణివర్మ సందేశము మాధవసేనుఁ డెఱిఁగింపకముందె దండపాణి వజ్రపాణులవలన ముందుగఁ జిత్రభానుఁ డెఱింగి సందేశము కడకునచ్చినప్పు డేమిచెప్పనొప్పునాయని విచారించుచుండెను. వార్తాహరు లెవ్వరై యుందురో యతఁడు ముందుగ నూహింపలేకపోయెను గాని మఱునాఁడు మాధవసేనుఁడు వచ్చినతోడనే యతఁ డాసందేశ మెఱిఁగించుటకె వచ్చియుండునని నిశ్చయించియు యథోచితగౌరవమున నామంత్రి నెదుర్కొని యర్హాసనమునఁ గూర్చుండఁబెట్టి సేమ మరసి రాజకుటుంబముయొక్క క్షేమమడిగి పిమ్మట నక్కడకు వానిం దోడితెచ్చిన పనియేమో తెలియఁ జేయఁదగునని పలికెను. మాధవ ఁ లుపుకొనుచు మెల్లమెల్లగా నేదో చెప్పఁబూనెను.

"అయ్యా! మీరు నేఁడేదో యుత్కృష్ట కార్యముమీఁద వచ్చినట్లు గనఁబడుచున్నారు. నసుగుచు మాటలాడవలసిన పనిలేదు. చెప్పఁదలఁచినమాట లేవో స్పష్టముగా గంభీరముగాఁ బలుకుఁడు. నావల్ల మీకెట్టిభయములేదు. మనము ప్రాఁతచుట్టాలముగాని మొగమోటిక లేనివారము గాము" అని చిత్రభానుఁడు కంఠమెత్తి పలికెను. "అయ్యా! నసుగుచు నగము చెప్పఁదలఁచుకొని రాలేదు. చెప్పవలసిన దేమో సంపూర్ణముగాఁ జెప్పిపోయెద"నని మాధవసేనుఁడు చెప్పెను. "అదే నాకు కావలసిన"దని చిత్రభానుఁడు మరల నొక్కి పలికెను. అప్పుడు మాధవసేనుఁ డిట్లనియె—"మనము చిరకాల మిత్రులము. అయినను స్వధర్మనిర్వాహణము మానవునకు విధిగావున నేనప్రియము చెప్పుటకు వచ్చితిని. ఇందుకు మీరు నన్ను క్షమింతురు గాక! మీ యన్నగారు మిమ్ముఁ గొన్ని కారణములచేత వెడల నడఁచిరిగదా! ఆక్షణమే మీరు దేశమును విడిచిపోయిరి. ఇప్పుడు రాజకుటుంబమును బరామర్శచేయుటకై వచ్చిరిగదా! మీరు మీ కుటుంబము బంధుప్రేమ ప్రేరితులై వచ్చుట, విపత్సముద్రమున మునిఁగిన రాజపత్నిని రాజపుత్రులను సమాశ్వాసించుట యుక్తమె. మొట్టమొదట మీరు మీకుటుంబమువచ్చి పరామర్శించినపిదప నగరము విడిచిపోవునట్లు మాటనిచ్చిరి. మీమాట మీరు నిలుపుకొనుఁడు. మీరు మహారాజపుత్రులు. మహారాజసోదరులు. చంద్రవంశసంజాతులు. మీపూర్వులందఱు నాడితప్పనివారు. కావున మాటతప్పక సకుటుంబముగా మీరు శ్రీనగరము విడిచి మూఁడు దినములలో వెడలవలయు. ఇది రాజశాసనము. రాజమాతృశాసనము. మీ రొకరిని శాసించువారే గాని యొకరిచే శాసింపఁబడువారు కారు. మీ భృత్యులమైన మేము మీకుఁ జెప్పవలసినవారము గాము. మీయన్నగారున్నప్పుడు మీరు వచ్చి వారియనుమతముననో వారిశాసనముఁ బ్రతిఘటించియో యిక్కడ

నుండిన నది శ్లాఘ్యమైయుండును. వారి మరణానంతరమున సహగమనము చేయక బ్రతికియుండుట ఘోరము. మరియు నిప్పుడు బాహ్యారణ్యములం దుండి తపము చేసి క్షీణించిన క్షత్రియుండని సహా శ్వాసము పేరుఁబెట్టి వచ్చి భర్తృవియోగముచేత మూలఁబడియున్న రాణిని లోకానుభవము లేని పిన్నరాజును లోకువచేసి యిచ్చట నుండుట భావ్యముగాదు. ఇదియే నామనవి." అని సంపూర్ణముగా నతఁడు చెప్పఁదలఁచిన దంతయుఁజెప్పి ముగింపకమునుపే చిత్రభానుని మొగము గీచిన కందనుంపవలె నెఱ్ఱపడెను. కన్బొమలు ముడి పడెను. కన్గొనలు గురివిందగింజల నెఱ్ఱపడెను. పెదవు లదరఁ జొచ్చెను. మేను గగుర్పొడిచెను. ఆగ్రహము వానిని సంపూర్ణ ముగ నావేశించి వశపఱచుకొనెను. అపుడు వాని నోటనుండి యుచ్చైస్స్వరముతో నీ క్రిందిమాటలు వెడలెను.

"మాధవసేనుఁడా! నీవును నీకన్న నీచుఁడైన మణివర్మయు మాయన్నతో నామీఁద గాలి ప్రోఁగుఁజేసి నేరములు కల్పించి కొండెములు చెప్పి మాయిరువుర మైత్రిఁజెఱిపి పరస్పర ద్వేషములు గలిగించిరి. మాయలమాఁటలగు మీమాటలు వేదాక్షరములుగా నమ్మి వెంగలియగు మాయన్న నన్ను దేశమునుండి పొమ్మనియె ఆతఁడు పెద్ద వాఁడగుటచేతను, నేను మంచివాఁడనగుటచేతను, వానినిర్ణయ మధర్మ గర్భితమైనను వానియందలి గౌరవముచేత వానియాన శిరసావహించి యాలుబిడ్డల వెంటగొని నేను దేశాంతరములకరిగితిని. తండ్రిలేని బిడ్డ లను నవవైధవ్యదుఃఖితయైనవదినెను జూడవచ్చుటతప్పా? నన్నుమీరు పొమ్మని నిర్బంధింపకపోయినపక్షమున నాయంతట నేనే వెడలిపోయి యుందును గాని నాపురనిర్గమనమును గుఱించి మీ రింత పట్టుబట్టు చున్నారు. కావున ముక్కంటి వచ్చినను నేనిక్కడనుండి కదలువాఁ డనుఁగాను. ఎవ్వఁడు వచ్చి నన్నిక్కడనుండి కదపునో చూచెదఁగాక! వ్రేలితో నవ్వలఁద్రోసివైచుటకిది గుండుగాని బెండుగాదు. మీ వెడ గింపులకుఁ బాఱిపోవుటకిది పిల్లిపిల్లగాదు సింగపుఁగొదమగాని. ఇది నా

తండ్రిరాజ్యము, నాతాతదేశము, నాముత్తాతల యార్జితము. ఇది నా జన్మభూమి. కావున నేనిక్కడనుండికదలను. స్వామిద్రోహులైన నీవును మణివర్మయును నాఁడుదానిని జిన్నవాండ్రను గన్నుఁబ్రామి రాజ్యము పంచుకొని వెడవలెనని చూచుచున్నారు గాఁబోలు! నేనిట నుండి పోనని మీ పిన్నరాజుతోను రాజమాతతోను వృద్ధజంబుక మైన మణివర్మతోను గట్టిగఁజెప్పుము. పొమ్ము. పూర్వమిత్రుఁడవు బ్రాహ్మణుఁడవు నగుటచేఁ గరుణించితినిగాని కానిచో నిట్టిసందేశముఁ దెచ్చినందుకుఁ గత్తితో నీకుత్తుక నుత్తరింపవలసినదే;"

అట్లు చిత్రభానుఁడు కడుతీవ్రముగాఁబలుక మాధవసేనుఁడును రోషఘూర్ణితమనస్కుఁడై యిట్లనియె. "రాజకుమారా! కుత్తుక నుత్తరింతునని నీవుపలికిన జడియువాఁడనుగాను. నీ కట్టి సంకల్పము గలదేని నీ సంకల్ప మీడేర్చుకొనుము. బ్రాహ్మణుఁడ నని నీవు దయ దలఁపనక్కఱలేదు. మారాజశాసనము ననుసరించి మేము నీతోఁ జెప్పవలసినమాట జెప్పితిమి. నీకడ మేము సేవజేసినను నీయాజ్ఞ నెఱ వేర్పవలసినవార మేగదా! సేవకులమీఁద నాగ్రహించిన లాభ మేమి? వార్తాహరులను దెగటార్చుట పౌరుషము గాదనియు నీతి గాదనియు రాజపుత్రుఁడవైన నీవే యెఱుఁగుదువు. ఎఱిఁగియుండియు నిట్టిసంభా షణలు చేయుదువని యెన్నఁడుఁదలంచియుండలేదు. హేమచంద్రుని యనుజునినోట నిట్టిమాట వెడలుట మిక్కిలి యాశ్చర్యము. సరే! మీప్రత్యుత్తరము మారాజునకు, రాజమాతకు నెఱిఁగించెద. ఇంక మాకు సెలవిమ్ము." అని చివాలున లేచిపోయెను. అతఁడు వెళ్ళిన పిమ్మటఁ జిత్రభానుఁడును మాధవసేనుని విషయమునఁ దాను గావించిన సంభాషణ కఠినమై రాజకుమారోచితముగా లేదనియుఁ దాను తొందరపడె ననియు నతఁడెంచుక పశ్చాత్తప్తుఁడై విచారి మరల నెప్పటియట్ల బింకముగలిగి యుండెను.

రుద్రభట్టు చిత్రభానునితోఁగూడ శ్రీనగరమునకు వచ్చినది మొదలు వానికి నఖిలవిషయములయందు నుపదేశము చేయుచునే యుండెను. చిత్రభానుఁడు వానియుపదేశము పరమప్రమాణముగా, వేదవాక్యముగ గ్రహించుచుండెను. కొన్ని కారణములచేత రుద్రభట్టు బహిరంగముగ నెల్లవారికిఁ గనఁబడుట కిష్టపడమి మేడమీఁద నొకమూలఁ గృష్ణాజినము బఱచుకొని శాలువగప్పుకొని సంస్కృత గ్రంథమేదో చూచుకొనుచుండును. చిత్రభానుఁడుసన్నిధానమున కరిగి విషమసమస్యలవంటి సందిగ్ధవిషయములలో నాలోచన నడిగినప్పుడు పూర్వోత్తరపరిస్థితులఁబరికించి యుపదేశము చేయుచుండును. దండపాణియు వజ్రపాణియుఁ దప్ప రాజసేవకులలో నెవ్వరికి నతఁడు కనఁబడలేదు. మాధవసేనుఁడు తన్నువిడిచివెళ్ళినతరువాతఁ జిత్రభానుఁడు మేడమీఁదికిఁబోయి రుద్రభట్టునకు నమస్కరించి తనకు నయ్యమాత్యునకు జరిగినసంభాషణ మంతయుఁ జెప్పెను. అతఁడదివిని "రావలసినపరిస్థితులు వచ్చుచున్నవి. వీనికెంతమాత్రము నీవు జడియవలదు. నీవు మాధవసేనునకుఁ జెప్పిన ప్రత్యుత్తరము రాజకుమారోచితముగా నున్నది. అంత తీవ్రముగఁ బలికి నందుకుఁబశ్చాత్తాపము నొందితి నంటివి. పశ్చాత్తాపమున కవసరములేదు. సన్నిపాతజ్వరమునకు మేకు గాల్చి వాత బెట్టుటయేమందు. ఇప్పుడునీవు దండపాణిని వజ్రపాణిని బిలిపించి కార్యాలోచనముఁజేసి తెంపు సేయవలయు. గొప్పసందిగ్ధసమయమువచ్చినది. నీవిప్పుడు సంశయింపక సాహసింపఁదగును. ఆదండనాథులిద్దఱు నేమికోరుదురో యవియెల్ల వారికొడఁగూర్చినట్లు బాసజేసి వారిని నీయధీనము చేసికొనవలెను. సైన్యమంతయు వారిచేతిలోనున్నది. వారు నీకువశవర్తులగుదురా కాశ్మీరరాజ్యలక్ష్మి నీవశవర్తినియగును. ఈరేయి వారిం బిలిపించి మంతనముండవలయు. అంతయు వారితోనున్నది. అర్ధరాజ్యమడిగి

సను నిచ్చునట్లు వాగ్దానముచేయుము.'' అని గట్టిగాఁ జెప్పెను. అట్ల కానీ! యని చిత్రభానుఁడు కరటకునిఁ బిలిచి దండపాణి వజ్రపాణులను రాత్రిబిలుచుకొని రమ్మని యానతిచ్చెను. చీఁకటిపడినతోడనే కరటకుఁడు వారిరువురికడకుఁబోయి తన స్వామి సందేశమెఱిఁగించెను. జాము రాత్రియైన వెనుక వీధులు నిర్మనుష్యములైన వెనుక రాజవీధులు పరిత్యజించి వారు సందుగొందులఁబడి చిత్రభానుగృహముఁ జేరిరి. వారు లోపలఁ బ్రవేశించినతోడనే వీధికవాటము దృఢముగా బంధింపఁబడియెను. చిత్రభానుఁడు వారి నెదుర్కొని మేడమీఁదికిఁ గొనిపోయి రుద్రభట్టసన్నిధానమున నిలిపెను. మొగమున వెండిరేకులది కిట్లు బూదిపిండికట్లు మెఱయ మెడలో స్ఫటికాక్షసూత్రము ధగధగలాడుచుండ బ్రహ్మతేజ ముట్టిపడునట్లు-జింకతోలుమీఁదఁ బద్మాసనమువైచికొని యపరశివునివలెఁ గూర్చున్న యాబ్రాహ్మణునిఁ జూచియన్నదమ్ములు తత్పాదములకు నమస్కరించిరి. అతఁడు ''మనోరథసిద్ధిరస్తు'' అనిదీవించి రత్నకంబళములపైఁ గూర్చుండ నియమించిన వారందు సుఖాసీనులై యుండిరి. చిత్రభానుఁడును వారిప్రక్కనె గూర్చుండెను. రుద్రభట్టునకుఁ గుడిప్రక్క నొకమూఁకుడులో నగ్ని వెలుఁగుచుండెను. అది యారిపోకుండ నడుమనడుమ నతఁడే రెండుమూఁడు సమిధలు వేయుచుండెను. అపుడు రుద్రభట్టు ముందుగా నిట్లు సంభాషణ మారంభించెను.— ''అయ్యా! నేను చిన్ననాఁటనుండి యాసేతుహిమాచలమగు భరతఖండమంతయుఁ దిరిగినాఁడను, ఎన్నో దేశములు జూచినాఁడను. ఎందఱో రాజులతో సంభాషించినాఁడను. బహుజనులస్వభావములను గ్రహించినాఁడను. కాని, మీవంటిసజ్జనుల నెందుఁజూడలేదు. మైత్రియనఁగా మీదే మైత్రి. మిత్రుని నిమిత్తము ప్రాణములనయిన ధారవోయునట్టి సజ్జనులను మిమ్మే చూచితిని. అట్లుకానియెడల నీయర్ధరాత్రమున

నీ గాఢాంధకారమున స్వపరెఱుఁగకుండ నతిరహస్యముగ ముసుఁగులు వైచుకొని యెంతో కష్టపడి మీ రీమిత్రుని గృహంబునకు వత్తురే? ఇంతశ్రమ మీ రేలపడవలె? మీయంతటవారు మీరు. విశేషించి కాశ్మీరసైన్యముల కధిపతులు. పిల్చినవాఁడో— రాజ్యము లేనివాఁడు, పూజ్యత లేనివాఁడు. ధనము లేనివాఁడు పరిజనము లేనివాఁడు బలఁగము లేనివాఁడు. అట్టివానిమాట తలఁదాల్చి మీరిట్లువచ్చుట మీచరిత్రమునకు వన్నెపెట్టుచున్నది. ఐశ్వర్యమున్నప్పు డందఱుమిత్రులె; ధనవిహీనునకు నాపత్కాలమున మిత్రులైనవారే మిత్రులు. అన్నయుఁ జుట్టములు, దేశీయులుఁ బరిత్యజింప నేకాకినై తిరుగు వీనిని మీరు చేపట్టినందుకు నేను మిక్కిలి సంతసించుచున్నాను. వేల్పులు సంతసింతురు. వెయ్యేల! పరమేశ్వరుఁడు సంతసించును? ఎడారిలో నోరెండి తిరుగు బాటసారికి మంచినీటిమడుగు దొరకినట్లు, పేరాఁకలికి నకనకంబడువానికి నట్టడవిలోఁ బండ్లచెట్టు దొరకినట్లు నిర్భాగ్యుఁడైన వీనికి వీనియదృష్టమున మీరు లభించిరి. ఇతనికి ముంగిట రెండు పెన్నిధానములు దొరికెను. రెండు కల్పవృక్షములు పెరటిలో లభించెను. ఆవృక్షచ్ఛాయ నింక జల్లఁగ మనఁగలఁడు. ఆశాఖలు బట్టుకొని పైకెగఁబాకఁగలఁడు. అతనిముంచినఁ దేల్చిన మీదే భారము." అనవుడు దండపాణి వినయముతో "స్వామీ! మేమేమిచేయఁగలము? పూర్వమైత్రిచేత మే మీయనను వదలలేక పట్టిప్రాఁకులాడుచున్నాము. మాచేతనైన సాయము చేయఁగలము. ఇప్పుడుమమ్ముఁ బిలువనంపిన కార్యమేదో సెలవియ్యవలయు" నని పలికెను. పలుకుటయుఁ జిత్రభానుఁడు వారి చెఱియొక చేయి తన చెఱియొక చేతితోఁ బట్టుకొని మెల్లగా నిట్లనియె—మిత్రులారా! నేను భయపడుచునే యిటకువచ్చితిని. వచ్చినందుకు నే ననుకొన్నంతపని జరిగినది. మాధవసేనుఁడు నిన్న వచ్చి సకుటుంబముగా నన్నీయూరినుండి

పొమ్మని తమ రాజుయొక్కయు రాజమాతయొక్కయు శాసనమైన
దని చెప్పెను. అది విని కోపపరవశుఁడనై నే నిక్కడనుండి కదలనని
దృఢముగాఁ బలికితిని. ఆపలుకుల కేమి! నన్నిక్కడ మీరుండుమన్న
నుండెద. పొమ్మన్నఁ బోయెద. నాకు నిలువనీడ లేదు. చెట్లమీఁది
పక్షికైనను నెలవున్నదిగాని నాకు నెలవు లేదు. సువిశాలమైన యీ
విశ్వమే నామందిరమైనది. నక్షత్రయుతమైన యాకాశమె మణిరం
జిత వితానమైనది. మెత్తని పచ్చిక బయళ్ళు రత్నకంబళములైనవి.
వృక్షచ్ఛాయలు పందిళ్లయినవి. అడవులు పూవుఁదోట లయినవి.
రాజకుమారుఁడనై నందుకు నే నీవిధముగా భోగములననుభవించు
చున్నాను. విదర్భలో నుండుమన్న నత్తవారి యింట బ్రతుకుకన్న
హీనమైనది మఱియొకటి లేదు. అదిగాక చంద్రవంశజుఁడనై విక్రమ
సేనుని గారాబుకొడుకునై యమిత సౌఖ్యంబు లవ్వారిగా ననుభవిం
చిన నేను పరులపంచల నొకరిచేతిక్రింద నొదిగియుండఁగలనా! వెనుక
మాయన్నయందలి గౌరవముచేతఁ నే నెట్టిటో వీడువిడిచి పోయి
తిని. ఇప్పుడు నాకిక్కడ నుండవలెనని యున్నది. మీయుత్తాలభుజ
లీల యూఁతకోలగా నే నింక నిలువఁబడఁ దలఁచుచున్నాఁడ మీరు
స్వసైన్యముగా నాకు బాసటలై నిలిచిరేని యీభాగ్యము తుద
నెగ్గును. ఇందుకు మీకు నేను ప్రత్యుపకారము మీయిచ్ఛాప్రకార
ముఁ జేసెద. నన్నిక్కడ సుప్రతిష్ఠితునిఁ జేసితిరేని మీకష్టైశ్వర్యము
లొసఁగుదును. చదరంగపుటాటలో నొకగుఱ్ఱమును మఱియొకగుఱ్ఱము
గాచినట్లు నన్ను మీరు గాతురేని మిమ్ము నేను మహోన్నత దశలో
నిలుపుదును. ఇన్నిమాట లెందుకు! కాశ్మీరరాజ్యమే మీది. మీ
మనస్సులో నున్నకోరిక యేమో దాఁచక చెప్పుఁడు. సముఖమున
రాయబారము లెందుకు? చల్లకువచ్చి ముంత దాఁచనేల? అని యుపన్య
సింప దండపాణి వెంటనే యుత్తరమీయలేక సందేహించెను. అతని

మొగమునఁ జెమటలు తోఁచెను. అతఁడు భయపడినట్లు కనఁబడెను. వజ్రపాణి వెలవెలఁ బోయెను. చిత్రభానుఁడు దండపాణిమీఁదఁ జేయి "వైచి మిత్రుఁడా! ఏమి భయపడుచున్నట్లున్నావు? ఇది సేనాపతికిఁ దగినలక్షణము గాదు. క్షత్రియుఁడవు మహావీరుఁడవు. జంకన్నది నీవున్న యూరనుండఁ గూడదు. అట్టిదానికి నీమనస్సు నెలవు గాఁగూడదు." అని హెచ్చరించుచుండ దండపాణి "రాజద్రోహము, రాజద్రోహము." అని మెల్లగాబలికెను. అదివిని చిత్రభానుఁడు "రాజద్రోహమా? నేనుమాత్రము రాజునుగానా? ఈ వఱకు నా యెడలఁజేసిన ద్రోహముమాట యేమిచెప్పెదవు? మిత్రులయినందుకు నాకుజరిగిన యన్యాయమునకు మీరు ప్రతిక్రియ సేయవలయు. అవి పిచ్చిమాటలు, రాజెవఁడు? మీరాజు చనిపోయినాఁడు. ఈ పసికూన నీకు రాజా? మూలగూర్చున్న యావితంతువు నీకు శాసకురాలా? ఇంతబ్రదుకు బ్రతికి చివర కాఁడుదాని శాసనములా నీవుశిరసా వహింపవలసినది? దుస్తంత్రపేటికయైన యాముసలిరాబందు మణివర్మయా నిన్ను శాసించువాఁడు? ఛీ! ఈ పిఱికితనము విడువుము. వజ్రపాణీ! నీహృదయము వజ్రమువలెనుండవలె. మున్ను నేపాళసైన్యముల నుఱుమాడిన యాధైర్యమొకసారి నీమనమున నెలకొల్పుము. పిఱికికండలను దూరముగఁ దొలఁగింపుము. ధైర్యము చిక్కఁబట్టుము." అని మందలించెను. వజ్రపాణియేదో యుత్తరము చెప్పఁ బోవుచుండ రుద్రభట్టందుకొని "రాజద్రోహము భీరువులమాట. మీరెవరిని రాజునుజేసిన వాఁడే రాజు. చిత్రభానుని రాజుం జేయుఁడు. అప్పుడుమీరు రాజభక్తులగుదురు. ఇతఁడు విక్రమసేనుని కొడుకు గాఁడా? శూరుఁడుగాఁడా? రాజ్యము సమర్థతోఁ బాలింపలేఁడా? సైన్యముల నడుపలేఁడా! సమరముల విక్రమవిహారము సలుపలేఁడా? వీనికేమి కొఱఁత? మీ మనంబుల శంకలు బాఱఁద్రోలి యాతని

రాజుం జేసి ధనము, పలుకుబడి, యధికారము, సన్నియుఁ గలిగి మీరు మెలంగుఁడు. అదిగో! లక్ష్మి వచ్చుచున్నది. మోఁకా లడ్డు పెట్టకుండ దిక్కుమాలిన యీచిత్రభానుని బాగుచేసినప్రతిష్ఠ మీకు దక్కఁగాక! మీయభిప్రాయముఁ జెప్పుఁడు?" అని ప్రబోధింప దండపాణి మహాత్మా! సందియములేదు. చిన్నరాజును దండపాణి మోసముచేసి శత్రుపక్షమునుఁ జొచ్చినాఁడని లోకాపవాదము గలుగునని సందియపడుచున్నాను." అని మెల్లగాఁ జెప్పెను. వెంటనేరుద్రభట్టు "లోకాపవాదమా? లోకులనందఱ మెప్పింపఁదరమా; మనకిష్టమైనపని మనముచేయవలయునేగాని లోకులిట్లనుకొందు రట్లను కొందురని శంకించిన నొక్క కార్యముఁ జేయఁగలమా? స్వబుద్ధిననుసరించిపోవుట శ్రేయము. లోకులు కాకులు ఇష్టమువచ్చినట్లు కూయుదురు. ఆకూఁతలన్నిఁటిని మనము లెక్కసేయరాదు. ప్రతిమనుష్యునిఁ గొందఱునిందింతురు. కొందఱుమెత్తురు. ప్రతికార్యమును గొందఱు శ్లాఘింతురు. కొందఱు దూషింతురు. ఎల్లరు దేనిని మెచ్చరు. ఎల్లరు దేనిని దూషింపరు. "ఆత్మబుద్ధి స్సుఖంచైవ"యను నార్యోక్తి వినవే? ఎల్లవారికి నంతఃకరణ ప్రవృత్తియే ప్రమాణము. కావున నీవిందు సందియపడక చిత్రభానుని కండవై నిలువుము. ఇదే సమయము. జంకినలాభము లేదు. వెనుదీసినఁ బ్రయోజనము లేదు. అదను పదనుదప్పిన మరలఁ గూడిరాదు." అని గంభీరభావముతోఁ బలికెను. దండపాణి మాఱాడలేక వారి యుపన్యాసములకు దాసుఁడై "మీయిచ్చవచ్చినట్లు జేసెద. ఈశరీరముమీఁది దీనిని మీ యిష్టము వచ్చినట్లుపయోగించుకొనుఁడు. నాతమ్ముఁడు నాతోడిపాటివాఁడే. మేము చిత్రభానునికొఱకుఁ జచ్చుటకు మన్న నుఱుకుదుము. జలధిఁ దుముకుమన్నఁ బడుదుము. పంచప్రాణముల విడుతుమన్న విడుతుము. కాని మేముగాక యితరసైన్యాధిపతులు కొందఱు గలరు. అందు

ముఖ్యముగ గదాధరుఁడు, శూలపాణిమున్నగు దండనాథులు రాజ భక్తికిఁ బేరుపడినవారు. సేనలోఁ బలుకుబడి వారికిఁగూడ మెండుగాఁ గలదు. వారు మనపక్షమురారు. ఆవిషయమై మనము గట్టిగ విచారింపవలెను. అది యటుండఁగా మూకోరికలుగూడ మీరు విన వలయుఁ జెప్పుమన్న జెప్పెద''నని చిత్రభానుని మొగమువంకఁ జూడ ''నిస్సంశయముగాఁ జెప్పవచ్చును''అని యతఁడు పలికెను. ''వ్యవహారముపట్ల మొగమోటముగూడ''దని రుద్రభట్టు చెప్పెను. అప్పుడు దండపాణి యిట్లనియె. ''నాకూఁతురు మణిమాలికను విజయసేనున కిచ్చి వివాహము సేయవలెనని చిరకాలమునుండి నేనభిలషించు చుంటిని. ఆవిషయమై మీయభిమతి మేమో తెలుపవలయు. ఇది నావిషయము. మాతమ్ముని మనోరథముగూడ జెప్పెద నాకర్ణింపుము. సిగ్గుపెంపున వాఁడు చెప్పఁజాలకున్నాఁడు. మీకర్పూరమంజరిని చేపట్టఁ బట్టవలె నని మావజ్రపాణి తడవులంబట్టి తలపెట్టియున్నాఁడు. మా తమ్ముని మనోరథము మీరీడేర్పవలయునని కోరుచున్నాను. మా కింతకన్నఁ గోరికలు లేవు. మఃమనోన్య మనోరథసిద్ధులు చేసి సుఖంపవలెనని నాప్రార్థన''అని విరమింపఁ జిత్రభానుఁడు ''మన మిరువురము వియ్యమందుట నాకుఁ బరమానందకరము. విజయసేనుఁడు నీయల్లుఁడు నేఁడే యయ్యెనని నీవు నిశ్చయించుకొనుము. ఇఁకఁ గర్పూరమంజరిని వజ్రపాణి కిచ్చుట విషయమున దాని మనోరథ మెట్లుండునో చెప్పఁజాలను. అయినను దానిమనసు విఱిచి తప్పక నీకు వివాహముచేసెద''నని దృఢముగాఁ బలికెను. అతని పలుకునే దృఢీకరింపఁ దలఁచి రుద్రభట్టుగూడ నిట్లనియె—''ఇదియా మీ కోర్కెలు! ఇందసాధ్యమైనదియు, నసంభవమైనదియు నేదియులేదు. విజయసేనున కెవ్వతెనో యొకబాలికను దెచ్చి వివాహము సేయ వలయునుగదా. ఆకన్య మణిమాలికయే యగుఁగాక! మణిమాలిక

గుణమాణిక్యమాలికయని విందును. అబ్బాలిక విజయసేనుని సహధర్మచారిణియై యర్ధాంగలక్ష్మియై మహాపతివ్రతయై సంతానవతియై భావి కాలమున శ్రీకాశ్మీరరాజపట్టమహిషియై వర్ధిల్లుగాక యని మేమాశీర్వదించుచున్నాము. కర్పూరమంజరి యీనాఁటి బాలికలవంటిదిగాదు. జననీజనకులకు విధేయురాలు. చదువుల సరస్వతి. గానములప్రోవు. చక్కఁదనాల దీవి. ఆమె తండ్రిమాటవిని తప్పక వజ్రపాణి చేయి పట్టును. వజ్రపాణికి శచీదేవియుం బోలె నీ వజ్రపాణి కీమె యిల్లాలై పేరుప్రతిష్ఠలగాంచి జయంతునిఁ బోలు నందనుం గని చిరంజీవినియై వర్ధిల్లుగాకయని దీవించుచున్నాఁడ. నా యాశీర్వచన మమోఘమగు గాక! దివ్యులు ప్రసన్నులగుదురుగాక! చిత్రభానుఁడా! ఏమి యిది నీకిష్టమేగదా?''అన నతఁడు "సందేహములేదు. అట్లె జరుగుగాక" యనెను. "అట్లయిన మీరీ యగ్నిసాక్షిగా నాయెదుటఁ బ్రమాణములు సేయుఁడు''అని రుద్రభట్టానతిచ్చి ఋగ్వేదములోని యగ్ని సూక్తమంత్రముఁ బఠించి యగ్నికభిముఖుఁడై యుండెను. చిత్రభానుఁడు లేచి యగ్నికిఁ బ్రదక్షిణముఁ జేసి "ఓ యగ్నిదేవా! నీవు సాక్షిగ మణిమాలికను విజయసేనునకు భార్యగాఁ జేసెద. కర్పూర మంజరిని వజ్రపాణికి వివాహముచేసెద.''అని నమస్కరించెను. అనంతరము దండపాణిలేచి వహ్నికిఁ బ్రదక్షిణముసేసి "నేను సుఖదుఃఖములయందు నాప్రాణములకయిన నాసపడక చిత్రభానునిపక్షమున నుండెద. ఓయగ్నిదేవా! నీవిందుకు సాక్షివి''అని ప్రమాణము చేసెను. వజ్రపాణియు నన్న చేసినయట్లే ప్రదక్షిణముఁ బ్రమాణము గావించెను. అనంతరము వారిరువురు రుద్రభట్టునకు నమస్కరించి గృహములకరిగిరి. "వలలోఁ బెద్దచేఁపలు పడినవి. ఇఁక విజయమున కాటంకములేదు. ఇఁక నిర్భయముగ నిద్రబొమ్ము''అని రుద్రభట్టు చిత్రభానుని బహూకరించి పంపెను.

ఎనిమిదవ ప్రకరణము

అట్లు మాధవసేనుఁడు చిత్రభానునకుఁ దనసందేశ మెఱిఁగించి యాతని వీడ్కొని మణివర్మకడకుఁబోయి తాను రాజసందేశ మెఱిఁగించుటయు నతఁడు తన్నుఁ దూలనాడుటయు రాజశాసనముఁ దిరస్కరించుటయు లోనగు వృత్తాంతమంతయు నొకయక్షరమైన విడువకుండఁ జెప్పెను. సందేశఫల మట్లేయుండునని యిదివఱకె మనంబున నూహించుటంజేసి మణివర్మ వానిపలుకులు విని విస్మయము నొందలేదు. కాని యటమీఁది కర్తవ్యమేమియని యతఁడు విచారింపఁ దొడఁగెను. "మాధవసేనుఁడా! దండపాణియొక్కయు వజ్రపాణియొక్కయు బలముజూచుకొని మనయెడ నిట్టి తిరస్కారభావముఁ జూపియుండునా, లేక మామయైన విదర్భరాజువలన సహాయ్యము నపేక్షించి యిట్లు దూలనాడియుండునా? ఏమని నీవూహించెదవు?" అని యడిగెను. "ఉభయుల ప్రాపుఁగూడఁ జూచుకొని నతఁ డట్లు పరుషప్రలాపములు నోటవెడలనిచ్చెను. అందుముఖ్యముగ నిక్కడివారి బలముఁ జూచుకొనియె యతఁడు నిర్భయముగ నున్నాఁడు. అట్టిప్రాపు లేనియెడల రాజశాసనము ధిక్కరించుటకు వాఁ డెంతవాఁడు? పట్టుమని చూచితిమా పదిమందిసైనికులు లేరు. కావలసినవిత్తము లేదు. పలుకుబడి యంతకుముందే సున్న. అట్టివానికి ధైర్య మెక్కడినుండి వచ్చెను. ఏదో దృఢమైన మూలకారణ ముండియుండవలయు" నని పెద్దమంత్రికిఁ జిన్నమంత్రి యుత్తరమిచ్చెను. "సరే! ఈవార్త రాజమాతకు మన చిన్నరాజునకు నెఱిఁగించి వారియభిప్రాయ మేమో తెలిసికొని మనము చేయవలసిన యుపదేశముచేసి కర్తవ్య మిదమిత్థమని నిర్ణయింతము. శంఖమునఁ బోసినంగాని తీర్థము గాదుకదా! ఏకార్యమునకైన రాజశాసనము ప్రధానముగదా? పద పద. అక్క

డికి పోవుదము'' అని యిరువురు రాచనగరునకుం జని యరవిందాదేవిఁ గనుంగొనిరి. అప్పుడు మాధవసేనుఁడు తనకుం జిత్రభానునకు జరిగిన సంభాషణమంతయు వరుసగాఁ దెలిపెను. విక్రమసేనుఁడు తెల్లఁబోయి మంత్రులవైపుఁ జూచెను. అరవిందాదేవి హృదయము చెదరినట్లు ముఖవైఖరి తెలియఁజేసెను. ''అట్టయిన మనకు మరల దుర్దినములు సంభవించినవా'' యని యామె హీనస్వరముతోఁ బలికెను. ''సైన్యమునుబంపి యాతని నేల వెడలఁగొట్టఁగూడదు?'' అని విక్రమసేనుఁడు బలికెను. ''అదియే మేమును జేయఁదలఁచుచున్నాము. కాని సేనాపతుల రాజభక్తి స్థిరముగానున్నదో యూఁగులాడుచున్నదో తెలిసికొనుట కష్టముగా నున్నది'' యని మణివర్మ పలికెను. ''వారింతలో నంతకృతఘ్నులగుదురా?'' యని యరవింద వచియించెను. ''నాకనుమానముగా నున్నది. అది యిప్పుడే నిశ్చయింపవలయును. కావున మనము ముందుగా గదాధరుని, శూలపాణిని బిలిపించి వారి మనస్సెట్లున్నదో కనుఁగొందము'' అని మణివర్మ వాక్రుచ్చెను. ''అట్లకాక!'' యని నమ్మికగల బంటునొక్కనిఁ బిలిచి విక్రమసేనుఁడా దండనాథుల నిరువురఁ బిలుచుకొనిరమ్మని పంచెను. వాఁడు నతి త్వరితముగ నరిగి యాచమూపతులం దోడ్కొనివచ్చె. వారిని సముచిత సత్కారములం గారవించి మణివర్మ సుఖాసీనులం జేసి హేమచంద్రుఁడు చిత్రభానుని గుణముల రోసి దేశమునుండి వెడలనడఁచుట మొదలు నాఁటివఱకు జరిగిన యావద్వృత్తాంతము మరల వారికి జ్ఞాపకము చేసి యిట్లనియె—

''మిత్రులారా! రాజ్యమున కావశ్యములైన సప్తాంగములలో సైన్యకోశములు ప్రధానములు. సైన్యమున్నఁగాని రాజ్యలక్ష్మి నిలువఁజాలదు. కోశము సమృద్ధిగానుండినంగాని సైన్యము తనధర్మము తాను చేయదు. కాశ్మీరరాజ్యమునకువలసినంత కోశసమృద్ధియున్నది. సైన్య

మును మీవంటి సేనాపతులుండుటచే సర్వలక్షణసంపన్నమై సమర్థమై యున్నది. కాని రాజ్యమునకు వెంటనేయుఁజిత్రభానునివలనఁగొన్ని కలఁతలు సంభవించునని తోఁచుచున్నది. ఒక్కకడుపునఁబుట్టియొక్కచో బెరిఁగి యొక్కమంచమునం బవ్వళించి యొకకంచమునం గుడిచిన హేమచంద్రుఁడే యతనిని నమ్మఁజాలక గాఢమైన యనుమానము మీఁద దేశమునందుండఁదగనివాఁడని వెడలనడచెనుగదా! హేమచంద్రుని మరణమునుగూర్చి యెట్టి వాకుకలున్నవో మీరే యెఱుఁగుదురు. చిత్రభానునిచరిత్ర మొకనాటకముగా నున్నది. ఎవఁడో హరిశర్మయనువాఁడు వచ్చి ప్రయాగలో చిత్రభానుఁడు మిక్కిలి దీనముగా మరణమొందెనని మాయమాటలుచెప్పి మహారాజుగారి మనస్సు కలంచెను. ఆమనఃక్షోభముచేతనే యాయన వికలచిత్తుఁడై హరిశర్మచేతిబొమ్మయై యాడి మరణముఁ దెచ్చికొనెను. చిత్రభానుఁడు సజీవుఁడై ఱాయివలె నున్నాఁడు. చుట్టఱికమువంకఁబెట్టి తన యన్నబిడ్డలయందలి ప్రేమరసమెల్ల నిక్కడవర్షించుటకు మరలవచ్చెను. వీరింబరామర్శించి వెడలిపోవుమనని చెప్పెఁగదా! పిమ్మట నాలు బిడ్డలం దెచ్చె. పురమువిడిచి పోవలసినదని సందేశమంప రాజమాతయొక్కయు, రాజుయొక్కయు శాసనము నిరాకరించి సందేశముం గొనిపోయిన మాధవసేనుని దృణీకరించి తూలనాడెను. అతఁడు నగరముననుండుట రాజకుటుంబమునకు రాజ్యమునకు ననర్థకము. అతని నెట్లయిన వెడలనడువవలయు. కావున మీరండఱు నవసరమైనపక్షమున సైన్యములతో నాతనియిల్లు ముట్టడించి వానిని దేశమునుండి యావలకిఁ బంపవలయు, కఱుకుదనమెక్కుడైన మనము చుఱుకుదనము నెఱపి వానిని బంధింపవలయు. బంధింపవలె నననేల! అవసరమగునేని శిరచ్ఛేదముఁ జేయవలయు. ఇంతకఠినముగాఁ బలికితి నని మీరు నొచ్చుకొనవలదు. మంత్రులు వైద్యులవంటివారు. వైద్యుఁడు

దయాళుఁడయ్యు నిష్కారణముగా వ్రణమునుచ్ఛేదించునట్లు మంత్రులు రాజద్రోహులను నిర్దయాత్ములై దండింపవలయు. ఇవియెల్ల నేను మీకు జెప్పవలసినవికావు. ఇదిగో మీరాజు! అదిగో ఆతనితమ్ముఁడు అదే హేమచంద్రమహారాజపట్టమహిషి. వారినిముగ్గురనుమాకుమీకు మీసైన్యమునకు నప్పగించి హేమచంద్రమహారాజుస్వర్గస్థుఁడయ్యెను. మీరు రాజభక్తిఁ జూపవలసిన సమయమిది. మీచిత్తనైర్మల్యముఁ బ్రకటింపవలసిన తరుణమిది. మీయున్నతభావముల వెల్లడింపవల సిన యవసరమిది. రాజ్యలక్ష్మిని గాపాడవలసినయదనిది. కావున మీరుమృతుఁడైన హేమచంద్రునిఁదలంచి రక్షణీయమైన రాజ్య లక్ష్మినిదలంచి, బాలుఁడై యేమియునెఱుంగకయున్న రాజు మొగము జూచి నవవైధవ్యదుఃఖభారవినమ్రమైన దేవిమొగముఁజూచి, భగ వంతుని మొగముఁ జూచి, మోమోటవిడిచి చిత్రభానునిమాయ లలోఁబడక యాతని వెడలనడఁచుటకు సర్వప్రయత్నములఁ జేయ వలయు. దండపాణి వజ్రపాణులవైఖరి వేఱుతెఱంగుగా నున్నదని యనుమానము గలుగుచున్నది. అయిన నిట్లు నిశ్చయముగాఁ జెప్పఁ జాల. ఇదిమీకు సమ్మతిమగునో కాదో చెప్పుఁడు. మనసులో నొకటి పెట్టుకొని పైకొకటి చెప్పవలదు.

అప్పలుకులు గదాధరశూలపాణుల హృదయంబులం గదలిం చుటంజేసి వారుత్సాహపూరితులై రాజభక్తి ప్రేరితులైరి. గదా ధరుఁ డిట్లనియె. "మహాత్మా! సైన్యము రాజ్యలక్ష్మికి సంగరక్షక బలము. అది సమర్థమై యుండదేని రాజ్యలక్ష్మి యచిరకాలంబునఁ బరహస్తగతమై నశియించు. ఇంతవఱకుఁ గాశ్మీరసైన్యంబులు సమ ర్థంబులై శత్రుదుర్భేద్యములై పరచక్రభయంకరములై యున్న యవి. దండపాణియు హేమచంద్రునియెడ భక్తితత్పరుఁడై యుం డెను. ఆతని మనస్సు వాని తమ్మునిమనస్సు మాఱుటకుఁ దగినకారణ

ములు నా కగపడవు, అయినను దగిన కారణము లుండినంగాని మీారు వారిచరిత్ర మనుమానాస్పదమని పల్కరు. వారెట్లయిన నగుదురు గాక! నామాట చిత్తగింపుఁడు. ఈలోకమున నెవఁడైన హేమచంద్ర మహారాజునెడఁ గాశ్మీర రాజవంశమునెడ నాజన్మాంతముఁ గృతజ్ఞుఁడై యుండవలయునేని నిశ్చయముగ నట్టివాఁడు గదాధరుఁడే. గదాధరుని జీవనమంతయుఁ గాశ్మీర రాజుల ద్రవ్యమే. రక్తమంతయుఁ గాశ్మీర రాజుల ప్రేమరసమే. అట్టిగదాధరుఁడు కృతఘ్నుఁడగునేని నింక ప్రశంచమునఁ గృతజ్ఞత యనుమాట లేదనవచ్చును. నాపూర్వపు వృత్తాంతము నిమ్మహాదేవియు నీచిన్నిరాజు నెఱుఁగకపోవచ్చును గాని సంపూర్ణముగ మీారెఱుంగుదురు. నేనొకరాచబిడ్డఁడను హిమాలయపర్వతప్రాంతమున నొకకొండపల్లియ మాయునికిపట్టు. మా తండ్రికృషీవలుఁడు. నాజననీజనకులకు నేనొక్కఁడనే పుత్రుఁడను. మందభాగ్యుఁడనైన నేనుబయిఁ దినినాఁడే నాతల్లిభూలోకమును బాసి పరమపదముఁ గొందెను. నిఱుపేదయైన నాతండ్రినాకుందల్లియై పురిటి మంచమెక్కి యుగ్గుపాలుబోసి పెంచి మిక్కిలికష్టపడి నన్నుం బది యేండ్లవానిం జేసెను. ఆపదలకు దృష్టిహీనులుపరమబాంధవులు. నాతండ్రి నాపదివయేట నన్నును దనకు నితరులకుఁగూడ భారముగనున్న తన శరీరమునువిడిచి పరలోకమునఁనైన సుఖముకలుఁగక పోవునా యని యచ్చటికిఁ జనెను. అప్పుడు చేయునది లేక నేను కొన్నిదినంబులు చుట్టములయింట నిరుగుపొరుగు వాండ్రయింటఁ గాలక్షేపముఁజేసి వారిచేఁ దిరస్కృతుఁడనై కట్టగుడ్డలేకనిలువనీడలేక తినుటకన్నము లేక యాదరించుటకాప్తులులేక నాది యనిచెప్పఁదగిన పదార్థములేక పొట్టజరుగుటకుపాయముగానక మాధుకరవృత్తి చేత భిక్షాటనముచేత నొకపూఁటతిన్నట్లు నొకపూఁటతినకట్లు గొన్నిప్రొద్దులుపుచ్చి విసిగి దుండఁగులగు బాలకులఁ గొందఱంగలిసి చిన్నచిన్నదొంగతనము

లారంభించితిని. క్రమక్రమముగా నందారితేటి పదియేనేండ్లప్రాయ
మున బందిపోటుల జట్టులోఁ గలసితిని. హేమచంద్రమహారాజుతండ్రి
విక్రమసేననృపాలుఁడు కాశ్మీరమును పాలించుచు దేశక్షేమమరయు
టకై మంచుకొండవాఁపున నున్నప్రాంతములకొకసారివచ్చెను. ఆ
ప్రాంతమున వసియించుజనులు "దురాచారులగు చోరులబారినుండి
తమ్మురక్షింపు"మని యానరేంద్రునివేఁడ నతఁడక్కడఁగొన్నిదినము
లుండి సైనికులచేత బందిపోటుల వెతకించిపట్టించి వారిలోఁ బెక్కం
డ్రకుఁ దగినదండనలవిధించి నన్నుఁజూచి యిట్లనియెను. "ఓరీ! నీది
లేబ్రాయము. ఆకారమునుజూడ సద్వంశజాతుఁడవనితోఁచుచున్నది.
ముఖము విలాసమును గ్రక్కుచున్నది. నీ తెలివితేటలు నీసాహసము
నీబాహుబలము మంచిదారినుపయోగించిన లోకమునకెంతో మేలగు.
నీవు నీవృత్తిమాని వెనుకటికార్యములకై పశ్చాత్తాపమునొంది
సన్మార్గమున సంచరింతువేని నీభవిష్యచ్చరిత్రము శ్లాఘాపాత్రమగును.
ఈతలంపుల విడువుము. నావెంటరమ్ము" అని దయార్ద్రహృద
యుఁడై పలికిన యానరపాలుని వాక్యములు నాచెవులలో నిప్పుడును
ధ్వనించుచున్నట్లున్నవి. కరుణారసపరిపూర్ణములైన యాయనచల్లని
చూడ్కులు నామీఁదనిప్పుడు ప్రసరించుచున్నట్లున్నవి. శాంతరస
మొలుకు నామహాత్మునిమూర్తి యిప్పుడు నాకన్నులఁగట్టినట్లున్నది.
ఆయనవాక్యామృతము నాశ్రవణములఁ బడినతోడనే నామనోమాలి
న్యమునీటం గడిగిన తెలుంగునఁ దొలఁగిపోయెను. మనస్సు నిర్మలు
మమయ్యెను. పశ్చాత్తాపమహాగ్నిచేఁ బాపపటలము భస్మమయ్యెను.
ప్రాఁతయాకులూడిపోయిన చెట్టువలెఁ గుబుసమూడ్చిన త్రాఁచువలె
నామనసపుడు స్వచ్ఛమైయుండెను. వెంటనేనేనామహాత్ముని పాద
ములపైఁ బడి 'దేవా! నాతప్పులు క్షమింపుడు. నేను మహాపరా
ధిని. దండ్యుఁడును. మీదండనలకన్న మీహితోపదేశమే నాకు

గొప్పశిక్షుడై నన్ను శుద్ధునిఁ జేసెను. పశ్చాత్తాపమహాగ్ని నా హృదయముఁ గాల్చుచున్నది. ఇఁక నేసన్మార్గమున సంచరించెద. ఇఁక నన్ననుగ్రహింపుఁడు, అని వలవలనేడ్చి యారాజశేఖరుని పాదరాజీవముల నాబాష్పధారలచే నభిషేకించితిని. భూమండలాఖండలుఁడగు నప్పుడమితేఁడు నన్ను స్వయముగా దన చేతులతో నెత్తి వగవకు బాగుపడియెదవని ధైర్యముచెప్పి చేతితోఁ వీఁపుపైఁదట్టి నన్ను స్నానము చేయింపుమనియు నూతన వస్త్రములనాచేఁ గట్టింపుమనియు సేవకుల కానతిచ్చెను. వారట్లు గావించిరి. అప్పుడు నేను క్రొత్తమనుష్యుఁడనైతిని. నా మనోవృత్తమునఁ గ్రొత్త తలఁపులను జివుళ్ళు మొలకలెత్తసాఁగెను. మహారాజుగారితో నేను రాజధానికివచ్చి విద్యాభ్యాసము జేయనారంభించితిని. నేను మిక్కిలి శ్రద్ధగాజదివి గురువుల యనుగ్రహమునకుఁ బాత్రమునైతిని. ఎప్పటికప్పుడు మహారాజుగారు నావర్తనముఁగూర్చియు నా విద్యాభివృద్ధిని గూర్చియు గురువులనడిగి తెలిసికొనుచువచ్చిరి. సామాన్యవిద్యతోఁ బాటు ధనుర్విద్యయు నేర్చితిని. అందనేక బహుమానములు వడసితిని. గురువులయు సహకారులనియు మెప్పుగాంచితిని. అంతలో నమ్మహారాజు పరమపదము నందెను. హేమచంద్రమహారాజు రాజ్యాభిషిక్తుఁడయ్యెను. పితృభక్తిని హేమచంద్రుఁడు రామచంద్రుఁడు సత్యభాషణమున హేమచంద్రుఁడు హరిశ్చంద్రుఁడు ప్రసన్నభావమున హేమచంద్రుఁడు శరశ్చంద్రుఁడు. ఆ తండ్రికిం దగిన కొడుకు గావునఁ దండ్రిచే గారామునఁ బెంపబడిననన్ను మిక్కిలి కనికరంబునం గని యమ్మహారాజు మరణంబువలన దుఃఖితుఁడనైన నన్ను నోదార్చి కొంతసేన కధిపతిం జేసి వివాహము జేసి నన్నొక యింటివానిం జేసెను. ఆమహాత్మునిదయవలనగౌరవమార్జించితిని. ధనమార్జించితిని సంతానవంతుఁడనయితిని గృహారామక్షేత్రములసంపాదించితిని. మిత్ర

లపాగడ్డలకుఁజుట్టముల యాదరణకులోకులమన్ననకునాస్వామి యనుగ్రహమునకుఁ బెద్దల దీవనలకు భాజనమైతిని. ఉదయమున లేచి హేమచంద్రునిపేరుఁ దలఁచి విక్రమసేనుని నామముఁదలఁచి, మొక్కులిడుదును. నే వసియించు గృహమువారిది. తినెడియన్నము వారిది. కట్టుబట్ట వారిది. నాచర్మముఁగోసి పాదరక్షలుగఁ గుట్టి యామహాత్మునకిచ్చినను నాఋణముతీరదు. వారు మసిబొగ్గును దెచ్చి మానికముఁ జేసిరి. నత్తగుల్లను ముత్తెపుఁజిప్పఁ జేసిరి. ఇత్తడిపుత్తడిఁ జేసిరి పశువును మానిసిం జేసిరి. ఇంతకన్న మహోపకార మెవ్వరు చేయఁ గలరు? ఇట్టినేను గాశ్మీరరాజులయెడఁ గృతఘ్నుఁడ నగుదునేని—ఛీ! నాజన్మమేల? జంతువులకైనఁ గృతజ్ఞత కలదు. పరమనీచమైన కుక్క పిడికెడన్నము వైచిన నదియెన్నఁడు మఱువదు. వృక్షముల సైతము తమకుఁ జిన్ననాఁడు నీరువోసి పెంచిన మనుష్యులకు బ్రతికి యున్నంతకాలము నీడనిచ్చును. కాయలిచ్చును. ఆకులిచ్చును. పండ్ల నిచ్చును. చచ్చియు వారికనేకవిధములనుపకరించును. క్షుద్రజంతువులు, ప్రాణులుసయితమట్లే కృతజ్ఞత గలిగియుండ నీశ్వరాంశసంభూతుఁడై జ్ఞానేంద్రియవ్యాపారముఁ గర్మేంద్రియవ్యాపారముఁ గలిగి విద్యాసంపన్నుఁడైన మనుష్యుఁడు కృతజ్ఞుఁడగుట యాశ్చర్యమా? అదిలేని వాఁడు వానరుఁడుగాని నరుఁడుగాఁడు. కావున నోమహాదేవీ! యో రాజా! యోయమాత్యులారా! ఈగదాధరుఁడు రాజకుటుంబమునకు రాజ్యమునకు క్షేమకరమగునట్లు వర్తించును. రాజా! బాలుఁడవయినను రాజువగుటచే మాకుఁ బూజ్యుఁడవు. అందుచే మీపాదములపై నేను ప్రమాణము చేసెద'' అని మహోత్సాహముతోఁ బలికి రాజకుమారుని పాదములు స్పృశియించి ప్రమాణముచేసి రాజభక్తి బ్రకటించెను. అంతకుముందు నిరుత్సాహముచేఁ గ్రుంగియున్న రాజమాతృ విక్రమసేనుల మనస్సులు నూతనోత్సాహ భరితములగుటయు వారిమొగములు వికాసవంతము లయ్యెను.

అంతట మణివర్మ "గదాధరా! నీవృత్తాంతముఁ గొంత నే నెఱుఁగుదును. నీ నడత నీమాటలకు విస్పష్టవ్యాఖ్యానముగానున్నది. ఉప్పునీరు మంచినీరుగా మాఱినట్లు ఎండ కాలవిశేషముచే వెన్నెలయైనట్లు దురాచారుఁడవు పరమసాధువైతివి. నాఁటనుండియు నీచరిత్రము శ్లాఘాపాత్రమై యున్నది. మేము నిన్ను నమ్మికొనియుంటిమి. శూలపాణీ! నీయభిమతమేమో చెప్పుము?" అని యడిగెను.

అనవుఁడు శూలపాణియిట్లనియె. "మహాత్మా! చెప్పుటకేమున్నది? కుత్తుకలో విసముఁబెట్టుకొన్నవాఁడుసైతము రాజునెదుట విపరీతముగాఁ బలుకునా? తేనె తేటలూరిపడునట్లే పలుకును. నానడతయే నాభావమును వెల్లడింపవలెను. పలు పలుకులేల? నేను గదాధరుని తోడివాఁడనే. అతనిమనస్సు నామనస్సు నొక్కటియె. అవసరమగునేని మేమిరువురము మాప్రాణములను మా చిన్నిరాజు నిమిత్తమై సమర్పించెదము. మాశిరస్సులు రాజ్యలక్ష్మికిఁ గానుకగా నిచ్చెదము. ఇంతకన్న వేఱు చెప్పవలసినది లేదు. దండపాణిని వజ్రపాణిని గూడఁ బిలిపించి వీరిద్దఱియెదుట వారిమనోగతము నరయుము. మాటలం బట్టియు ముఖలక్షణములం బట్టియు వారిభావ మెఱుఁగవచ్చును. ఈవఱకు మీరు వారితో మాటలాడియుండుట వేఱు; రాజునెదుటఁ బలికించుట వేఱు."

"అది లెస్సయైనపని" యని మాధవసేనుఁడు హెచ్చరించెను. "వారు రాకుండనే మాకుముందుగా సెలవియ్యదగును." అని గదాధరుఁడు వెండియు నిట్లనియె. "ఈస్థితిగతులలో నామనవి యొకటి వినుండు. వెంటనే చిత్రభానుని వెడలఁగొట్టుటకు మనము ససైన్యముగా వానియిల్లు ముట్టడించుట కర్జముగాదు. వారిచేష్టలు మనము కనిపెట్టుచుందుము. మీఁదుమిక్కిలివచ్చిన వెంటనే మేము వానిం దాకుదుము. రేపుమాపు వచ్చిన తొందరలేదు. నాకిపుడు సెల

వాఁకంగుఁడు. పోయివచ్చెదను.'' అని యందఱవీడ్కొని శూలపాణిసహితుఁడై వెడలెను. మఱియొక పరిచారకుం బిలిచి దేవి దండపాణిని వజ్రపాణిని దోడి తెమ్మని పనిచెను. వా డతివేగమున వారిసదనముల కరిగి రాజశాసన మెఱిఁగించెను. ''నీవు ముందునడువుము మేము వెనుక వచ్చెదము'' అని వారిరువురు నొకముహూర్తము తమలోఁ దాము రహస్యముగ మాటలాడుకొని సేవకుఁ డరిగి రొకగడియ లోనే రాచనగరుఁ జొచ్చిరి. మనో మాలిన్యము పైకిఁ దోఁచెనో యన్నట్లు మొగములు తొంటియట్లుండక వికాసశూన్యములై యుండెను. మణివర్మ వారినిగూడ సబహుమానముగా గౌరవించి యుచితాసనంబులం గూర్చుండఁబనిచి మెల్లగ నిట్లనియె—''ఇదివఱకు నేను మీతోఁ జిత్రభానునివిషయమై ప్రసంగించినను మనరాజుగారుగూడ దద్విషయమున మీయభిప్రాయమును స్వయముగాఁ దెలిసికొనఁగోరి మాతృశాసనమున మిమ్ముఁరావించిరి. మీ హృదయ మకలంకమని నేనెఱుఁగుదును. అదియే రాజగారు మీనోటవినఁ గోరుచున్నారు. చిత్రభానుఁడు పురమునుండి వెడలవలయునా లేదా! తనయంతటఁ దాను వెడలకున్న మీరాతని సైన్యసహాయమున దేశమునుండి తోలవలయునని మనరాజుగారి యాశయము. దండాధినాథు లగుటచే నీ కార్యభారము మీపైఁబడియున్నది.'' ఆవచనంబులు విని దండపాణి మొగము చిట్లించుకొని యిత్తెఱంగునఁ బలుకఁజొచ్చె. ''అయ్యా! మున్నొకసారి మీరీవిషయము నన్నడిగిరి. అప్పుడు నాకుంబోలిన తెఱంగున మీకుత్తరమిచ్చితిని. చిత్రభానుఁడు పురము వెడలిపోవలయునో లేదో నిర్ణయింపవలసినవారు రాజుగారును మంత్రులైన మీరును గాని మేముగాము. కార్యనిశ్చయము మీరు చేసిన వెనుక మీ యాజ్ఞాప్రకారము దళములఁగొని శత్రుమర్దనము చేయుటమాపని. అదియునుఁగాక మాటిమాటికి మమ్ముంబిలిచి మాయభిప్రాయ మడుగుటకు మేము రాజద్రోహులమా? కుట్రలుపన్నుచున్నామా? మాకు

మాత్రము గౌరవములేదా? ఇట్లవమానించుట మీకుఁదగునా?" యని కఠినస్వరముతోఁ బలుకుచున్న యాదండపాణి మాటకడ్డముపోయి విక్రమసేనుఁడు "అయ్యా! దండపాణీ! మీరురాజద్రోహులని యెవరన్నారు? మీరు కుట్రలుపన్నుచున్నారని యెవరుపలికిరి! రాజకార్యవిషయములను సమాలోచించుటకు మిమ్ముఁ బిలువనంపుట మిమ్మవమానించుటా? మణివర్మ యాడినమాటలలో దోషమేమున్నది? మీకింతరోసముఁ గలుగఁ గారణమేమి? రాజ్యక్షేమముఁ జూడవలసినవారు మంత్రులు దండనాథులుగదా! రెండుచెట్లకొమ్మలొండొంటితోఁ రాపాడి నిప్పుబుట్టించి వనమెల్లఁ గాల్చునట్లు ప్రధానపురుషులగుమీరు పరస్పరవివాదములుగలిగి రాజకులమున కాపద వాటింపఁజేయుదురా? ఇది ధర్మమా? ఘోరకర్మమా?" అని గంభీరముగానడిగెను. అడుగుటయు దండపాణి మొదటికన్నఁ గొంచెము శాంతించి తనచిన్నప్రభువున కిట్లనియె. "రాజా! మణివర్మవైఖరిఁ జూడ మాయెడననుమానము బూనినట్లు దోఁచుచున్నది. మేమనుమానింపవలసిన వారముగాము. ఈవరకు రెండుసారులు మమ్మతఁ డీవిషయమునఁ బ్రశ్నించుటంజేసి యాత్మగౌరవముఁ గలవారమగుటచే సూకించుట కష్టముగానున్నది. అందుచేనట్లనవలసివచ్చె. అంతేగాని దేవరవారియెడ మాకెట్టి పరాభిప్రాయములేదు. మే మెట్టి ద్రోహముఁ దలఁచుకొనలేదు. మీయాజ్ఞకు బద్ధులము. మీకనుసన్నలమెలఁగెదము. మీముదలయగునేని యెట్టిపనినైనఁ జేయఁగలవారము. కావున మాయందు సంపూర్ణవిశ్వాసము నిలుపవలయునని ప్రార్థించుచున్నాము." అనవుడు మణివర్మ "నావైఖరింబట్టి మీ కాగ్రహము గలిగినదా? మీ కవమానము గలిగింపవలెనని నేఁ గలనైన దలఁపలేదు. నామాటలలోఁగాని భావములోఁగాని నాముఖలక్షణములోఁగాని మీ కవమానకరములైన చిన్నలేవియులేవు. ఒకవేళ మీకట్లు దోఁచినపక్ష

మున నేను వయోవృద్ధుఁడను చంచలస్వభావుఁడను గావున నన్ను క్షమియించి రాజకార్యమును జక్కఁజేయుఁడు. మనకు వివాదము లున్న పక్షమునఁ బిమ్మటఁ దీర్చికొనవచ్చు నని యనునయపూర్వకముగాఁ బలికెను. అంతట వారు రాజును మంత్రులను వీడ్కొని స్వగృహముల కరిగిరి.

వారు వెడలినపిదప మాధవసేనుఁడు మణివర్మతోఁ "జిత్తగించితిరా? వాని మాటలవరుస. వానినీడలుచూచి వారే భయపడుచున్నారు. అంతఃకరణము మలినమైనప్పుడు మానవుని కెదుటివారి మనస్సులుగూడ మలినములైనట్లు గనఁబడును. కామిలరోగికిజగమంతయుఁ బచ్చఁగాఁ గనఁబడునుగదా? చూచితిరా! గదాధరునిమాటలకు వీనిమాటలకు నెంత వ్యత్యాసమున్నదో, అతని రాజభక్తి హృదయమునుండి వెల్లివిరిసినది. వీని భక్తి జిహ్వాగ్రమునుండి వచ్చినది. కావున వీరిని విశ్వసించియుండుట శ్రేయస్కరముగాదు." అని వచియించెను. "నీవుయదార్థము వచించితివి. దోషాత్మునకు లేనిచోట ననుమానముగలుగును" అని మణివర్మ వాని కుత్తరమిచ్చెను. విక్రమసేనుఁడు చిఱునవ్వునవ్వి ఉన్నమాటన్న నులుకెక్కువన్నట్లు దండపాణికి నిర్హేతుకమైన యాగ్రహమువచ్చినది. మనము వీరివిషయమున జాగ్రతగానుండవలె నని పలికెను. "మీరిద్దఱు గదాధరశూలపాణులు నను నాలుగు స్తంభములమీఁద నిప్పుడు కాశ్మీరరాజ్యసౌధము నిలిచియున్నది. దండపాణి రాజభక్తి మలినమైనదో శుద్ధమైనదో సమయమను గీటురాతిమీఁదఁగాని తెలియదు. ఇంకమీరు మీపనులమీఁద నుండుఁడు" యని యరవిందాదేవి పలికి వారికి సెలవిచ్చెను.

తొమ్మిదవ ప్రకరణము

రాచనగరమునుండి వెడలి దండపాణియుసోదరుడునుస్వగృహం బులకుజనక యారేయి వెండియుజిత్రభానుని గృహంబున కరిగి రాజగృహంబున నాడు జరిగినవృత్తాంత మంతయు దెలిపిరి. చిత్ర భానుడు తనయెడ వారికిగల యమితానురాగమునకు సంతసించి కొండొకవడి పొగడి యిట్లనియె. "మిత్రులారా! అయస్కాంతము నకు సూదికిబలె నాకును మీకును గాఢసంబంధము కుదిరినందుకు నేను మిక్కిలి సంతసించుచున్నాను. మీచెవినిబడిన చిన్న మాటయు దాచక నాకు వెంటనే తెలియజేయవలె నని మీరు సంకల్పించుట మనకార్యసిద్ధికి సూచకము. ముందుగా వారే కలహ మునకు డీకొనునట్లు మనము చేయవలయునుగాని మనము దిగ గూడదు. అందుచే నీలోపున సైనికులవిషయమున మీరు వలసిన ప్రయత్నము చేయుచుండుడు" అనుచుండ రుద్రభట్టు "కీలక మంతయు సైన్యములోనే యున్నది. దాని గలచుట కనేకప్రయ త్నములు గావలయు. కొంతయత్నము మేముగూడ జేయుచున్నాము అది యిక మీద గాలక్రమమున మీకు దెలియగలదు" అని పలికెను. అనంతరము గొంతసంభాషణము జరిగినవెనుక దండపాణి యిట్లనియె. "మాకొక్క కోరికయున్నది. అది మీ యిరువుర సన్ని ధానమున విన్నవింపదలచుచున్నాము. కర్పూరమంజరిని మావజ్ర పాణికిచ్చి వివాహము చేయుటకు మీరంగీకరించిరి గనుకను మామణి మాలికను విజయసేనునకు బెండ్లిచేసికొనుటకు మీరిష్టపడిరి గావునను నీరెండు కార్యములకు బ్రధానము చేసికొనవలెనని మే ముబలాట బడుచున్నాము. మాముద్దు చెల్లించి యీకార్యము చేయవలయు."

అప్పలుకులలో మొదటిభాగము చిత్రభానునకు రుచింప లేదు. ఏలయన గుణముల పేటికయైన కర్పూరమంజరి వజ్రపాణినివరించునో

వరింపదో చిత్రభానుఁ డెఱుఁగఁడు. ఇంతకుమున్నామెతో నాప్రసంగము చేయనే లేదు. రెండవభాగమైన మణిమాలికా వివాహము చిత్రభానునకిష్టమే. ఆవిషయమై ప్రధానముచేసికొమ్మన్నను నతఁడు చేసికొనుటకు సిద్ధముగనుండెను. ఒకటిచేసి రెండవది మానినపక్షమున వారి కనుమానము కలుఁగవచ్చును. చేసినరెంటను జేయవలయును; మానిన రెండును మానవలయు. చిత్రభానున కప్పుడు విషమపరిస్థితులు తటస్థించెను. తాము తలపెట్టిన కార్యములన్నియు ముగిసిన పిదపఁ బ్రధానములు చేయవచ్చునని చెప్పినచో వారికి విశ్వాసముండదని భయము. అందుచే నెద్దియుం దోఁచక యతఁడు వెంటనే యుత్తరమీయక మనోవేదనము బడుచుండ వాని చేష్టలంబట్టి మనోగతభావమెఱిఁగి రుద్రభట్టు "దండపాణి కిట్లనియె. దండపాణీ! నీ సంకల్పము మంచిది. 'శుభస్య శీఘ్ర'మ్మను నార్యోక్తిని బట్టియు 'నాలస్య మమృతం విష'మను న్యాయమును బట్టియు నిట్టివి వెంటనే జరుగుట మంచిది. కాని యవి క్రొత్తవారివిషయమునఁగాని, మీవంటి పూర్వపరిచితుల విషయమునఁ గావు. మాటయే ప్రధానముగాని మానవంతులకుఁ బ్రధానము ప్రధానము గాదు. పసుపుం గుంకుమ పండ్లుదెచ్చి యొండొరుల కిచ్చి పుచ్చుకొనుటచేత ననుకొన్నమాటలు స్థిరమగునా? కానిచోఁ గార్యములు భగ్నమగునా? అగ్నిసాక్షిగఁ జేసిన ప్రమాణముల కన్నఁ బ్రధానములు బలవత్తరములా? ఇది యొక ముచ్చట. అదియు నాఁడు వారిముచ్చట. మగవాండ్రు దానిం గూర్చి యంత పట్టింపులు బట్టఁగూడదు. కాబట్టి కాలాంతరమున నన్ని ముచ్చటలు దీర్చికొనవచ్చును. ఇది విషమసమయము. తాంబూలములు పుచ్చుకొనుటకైనఁ బదుగురు పెద్దమనుష్యులు వచ్చుటకు వీలులేని తరుణముగదా యిది! పదిమంది జేరి వెల్లడిగా జరుగవలసిన శుభకార్యము చాటున మాటున జేసికొనుట యేటి తగవు? కావున సర్వవిధముల నిది కాలాంతరమున గావచ్చును. మీఁద మీయిష్టము."

అదివఱకేమియుఁ దోఁచకయే మి యుత్తరము జెప్పుదునా యని సందిగ్ధమనస్కుఁడై యున్న చిత్రభానునకు రుద్రభట్టు పలుకులు ధైర్యము గొలిపెను. అప్పలుకు శాంతగాఁగొని చిత్రభానుఁడు వారి నుద్దేశించి "విజయసేనుఁ డెక్కడి కేగును ? కర్పూరమంజరి యెక్కడి కరుగును ? ప్రధానములు కాకపోవు. వివాహములు, గాక పోవు. వివాహము ప్రధానముగాని, ప్రధానము ప్రధానము గాదు. చంచలచిత్తులకు మాటనిలకడలేని వారికి బ్రధానములుగాని మన కేల ? ఈసుహోత్రుఁడు సెలవిచ్చినట్లు గాలాంతరమునఁ గావచ్చు" నని పలుక వజ్రపాణి "యిప్పుడు చేసికొని నందువలనఁ దప్పేమి" యని మెల్లగాఁ బలికెను. "నామాట యెట్టులున్నను జిన్నవాఁడైన మాతమ్ముని కోర్కె దీర్చుట సర్వోత్తమము" అని దండపాణి వాక్రుచ్చెను. వారు పట్టినపట్టు వదలకపోవుటచే సమయము దాటిం చుటకు రుద్రభట్టు "సరే! అట్లె యగుఁగాక! ప్రధానమునకైన మంచిముహూర్త ముండవలయు. నేనా సుముహూర్తము బెట్టి మీకుం దెలియఁబరచెద. మీకిష్టమే కద ?" యని బలికెను. "అహా! మాకిష్టమే" యని వా రిరువురు. సంతుష్టులై సెలవుఁగైకొని పోయిరి. వారు వెడలినపిదప రుద్రభట్టునకును జిత్రభానునకును నీ క్రిందివిధ మున సంభాషణము జరిగెను.

చిత్రభాను—స్వామీ! నేనిప్పుడు పిశాచమునకు సముద్రము నకు నడుమనున్నాఁడను. ముందరకువచ్చిన దయ్యము మ్రింగును. వెనుకకుఁబోయిన సముద్రతరంగములు ముంచి చంపును.

రుద్రభట్టు—ఏ మట్లనుచున్నాఁడవు ?

చిత్ర—వజ్రపాణికోరిక దుర్ఘటముగా నున్నది. కర్పూరమం జరి మనస్సునందము నేనరయలేను. అద వీనిమీఁద వలపు నిలుపునో లేదో తెలియదు. అది వీనిఁగూర్చి మేలుపడదేని పంచమహాపాతకము

మోడబాఱినట్లు గార్యమంతయు భగ్నమగును. వీరు ప్రధాన మిప్పుడే చేయవలె ననుచున్నారు.

రుద్ర—ఇందుకా యింతబెంగ? మానవుఁడు కష్టసమయముల యందే ధీరోదాత్తుఁడై, తన మనశ్శక్తిని జూపవలయును. తొందర పడక బెంగగొనక కలఁతనొందక నరుఁడు నిర్మలమగు తటాకజలము వలెఁ బ్రవిమలమనస్కుఁడై యుండెనా యెంతెంత కష్టసమయము లందును మబ్బులేని యాకసమున సూర్యోదయమైనట్లు చక్కని యుపాయములు తోఁచును.

చిత్ర—అది జితేంద్రియులగు మీకు సాధ్యముగాని మావంటి సంసారులకు సాధ్యముకాదు. కష్టసమయము రాఁగానే మనస్సు నిప్పుఁ ద్రొక్కిన కోఁతివలెఁ జంచలమై యాలోచన కనర్హమై యుండును. కావున నిప్పుడు నాకేమియుఁ దోఁచకున్నది.

రుద్ర—నీ కూఁతురు మనోరథ మేమో తెలిసికొనకయే నీ వింత కలఁతజెంద నేల? ఆమె నీకోరిక నిరాకరింపకపోవచ్చును. ఆమె నడిగిరమ్ము. కార్యము సఫలమయ్యెనా సరి! కాదేని నాఁటి కొక యుపాయ మూహింపఁజాలమా?

చిత్ర—అట్లయిన నే నామె నడిగి వత్తునా?

రుద్ర—ముందుగా నీ వడుగుట యుక్తముగాదు. ఆఁడుబిడ్డలకుఁ జిన్ననాఁటనుండి తల్లిదగ్గరఁ జనవులు మెండు. కావున నామె మనోరథ మేమొ తల్లిచే నడిగింపుము.

చిత్ర—సిగ్గుపెంపునఁ దల్లికిఁ జెప్పనిపక్షమున?

రుద్ర—అంతకన్న నెక్కుడు మచ్చికయుఁ జనవులుగలవారు చెలికత్తియలు. చంద్రికను మల్లికను వేఱువేఱుగఁ బిలిచి రహస్యముగ నడుగుము. రాజపుత్రికల తలంపులకుఁ జెలికత్తెలు దాపుడు బరిణలు.

చిత్ర—అట్లయిన నేను తద్విషయప్రయత్నమున నుండెద, ఇవి యన్నియుఁ దేలినతరువాతనే మనము సుముహూర్తముఁ మాట నాలోచింపవచ్చును.

రుద్ర—నీకూఁతురు రాచనగరములో నున్నదికదా! మీ నెయ్యము లంతకంత కెడమగుచున్నప్పుడు మీపుత్రిక శత్రుగృహమున నుండుట నీకును వారికిని శ్రేయముగాదు. వెంటనే బిలువ నంపుము. పాముపగయుఁ బడగ చుట్టము నగునా?

చిత్ర—ఔను! ఆమె నిటకు దోడితెచ్చుట యుభయులకు శ్రేయస్కరము. అట్లచేసెద.

అని యాతని వీడ్కొని చిత్రభానుఁడు దీర్ఘాలోచనావశంబున మెల్లమెల్ల నడుగు లిడుకొనుచు నభ్యంతర మందిరమునకుం జని యిందుమణిం గాంచి కర్పూరమంజరిని వెంటనే పిలిపింపుమని యాన తిచ్చెను. అట్ల కాక యని యామె చంద్రికామల్లికలఁ బిలిచి "రాచ నగరమున కరిగి బాలికం దోడితె"మ్మని సెలవిచ్చెను. సెలవిచ్చుటయ తడవుగా వారిరువురు నచ్చోటికిం జనిరి. ఆలోపున నిందుమణితోఁ జిత్రభానుఁడు గృహకృత్యంబులం గూర్చి కొంత ముచ్చటించి కర్పూరమంజరి మాటయెత్తి ప్రసంగవశమున నిట్లనియె. "బాలిక వివాహయోగ్యమగు వయస్సును బ్రాపించినది. ఇంక మన మాలసింపక వరాన్వేషణమునకుఁ గడంగవలయు."

ఇందుమణి—నానోటితో నేననఁగూడదుగాని దానింజూచిన వారందఱు నిది సర్వలక్షణసంపన్న యగుకన్య. దీని కనుకూలుఁడగు వరుఁడు లభించుట కష్టమని పలుమాఱు నాతోననిరి.

చిత్రభాను—అన్ని లక్షణములు నొక్కచో నెుమిగూడి యుండునా? చెఱకునకుఁ గావలసినంత తీపియున్నదిగాని పండ్లులేవు. పనసపండు గర్భమున రసవంతము లైన తొన లుండును,

మీఁదిభాగము మిక్కిలి మోటగా నుండును. విశేషించి పనసకుఁ బూవులు లేవు. మామిడికి జీడియుండును. సీతాఫలమునకు లెక్కలే నన్ని గింజలు. భానునియందు దుస్సహమైన వేఁడియుండును. చంద్రునియం దతిశైత్యముండును. అట్లే పురుషులయందు నొకఁడు సత్కులప్రసూనత గలిగియుండును. ఒకఁడు చక్కదనంబున కిక్కయగును. ఒకఁడు గానమునకు స్థానమగును. ఒకఁడు మాటలలోఁ దేనె తేటలు గురిపించును. ఒకఁడు విద్యానిధియై పుంభావసరస్వతి యగును. ఒకఁడు వాక్పటిమలో నపరశేషుఁ డనిపించుకొనును. ఒకఁడు మేటిమగంటిమికిఁ బేరువడును. ఒకఁడు సౌజన్యమునకు భాజనమగును. ఇన్ని శుభలక్షణములు నొక్కచో నుండునా? అది యసంభవముగాదా? అందుచే నేవో కొన్ని శుభలక్షణములు జూచి వరనిర్ణయము జేసికొనవలయును.

ఇందు—ఆ లక్షణములు మీకును నాకును నచ్చవచ్చును. బాలిక మెచ్చవలదా?

చిత్ర మెచ్చ కేమిచేయును? దివ్యౌషధుల నన్నిటినో కలిపి వైద్యుఁడు మాత్ర జేసినట్లు బ్రహ్మదేవుఁడు సమస్తశుభలక్షణములు గల పురుషునిఁ గ్రొత్తగా మన కన్యకకొఱకు సృష్టింపవలెను!

ఇందు—ఇదివఱకే సృష్టింపఁబడి యున్నాఁడు. క్రొత్త సృష్టితోఁ బనిలేదు.

చిత్ర—అట్లయిన బాలిక యెవనిమీఁద మనసు నిలిపినదో చెప్పఁగలవా?

ఇందు—ఇంతవఱకు నే నెఱుఁగను. ఇదివఱకే సృష్టింపఁబడినాఁడని మాటవరుస కంటిని.

చిత్ర—వజ్రపాణియను నొక సేనాపతి యున్నాఁడు. వాని నెఱుఁగుదువా?

ఇందు—నేనతఁడుఁ జూడలేదు. వినియుంటిని.

చిత్ర—అతఁడు సేనాపతియగు దండపాణికుమారుఁడు. అతని వంశము మంచిది. స్థితి మంచిది. ప్రాయమున నున్నవాఁడు. అతనికిచ్చి వివాహముచేయవలెనని నాకోరిక. అతనిం జేపట్టుమని బాలికతో నీవు నొక్కి చెప్పుము.

ఇందు—చెప్పెదనుగాని నామాటయందు దానికి విశ్వాసము లేదు. మల్లికకు దానికి నత్యంతమైత్రి. దానిచేతఁ జెప్పింపుము. బిడ్డ మాత్రము యుక్తాయుక్తమెఱుఁగదా? మంచిసంబంధమైనచో నది యేల నిరాకరించును?

చిత్ర—మంచిదనుట నిస్సంశయము. నీవు చెప్పినట్లు మల్లికతోఁగూడ మాటలాడెదను.

అని సంభాషణ ముగించి యావలకు జనెను. సంధ్యాకాల మగునప్పటికి మల్లికాచంద్రికలు కర్పూరమంజరిం దోడుకొని గృహముం జేరిరి. రేయి భోజనమైనతరువాతఁ గర్పూరమంజరి పెందలకడ బండుకొనెను. ఆమె నిద్రవోవగాఁ జూచి చిత్రభానుఁడు మల్లికను దన పడకగదిలోనికిఁ బిలిచి పీటపైఁ గూర్చుండఁబెట్టి కొంతసేపు దాని సేమసుఖములు రాజాంతఃపురమందలి వార్తలేమని యడిగి కొండొకపడికిట్లనియె—"మల్లికా! నీయెదుట నిన్ను బొగడఁగూడదు గాని నీవు నిజముగా గుణపుష్పములతో నిండిన వల్లికవు. ముద్దుల మూటగట్టు నీమొగముఁ జూచినను గ్రమ్మతేనియలొలుకు నీపలుకులు విన్నను హృదయంగమములయిన నీగుణములు జూచినను నాకు బ్రహ్మదేవునిఁ దిట్టబుద్ధి. ఎందుకందువా? మతిలేని యాముసలిదయ్యము బహులక్షణసంపదగల నిన్ను నేదో యొకమహారాజగర్భమునఁ బుట్టింపక సేవకురాలిఁగా జేసినాఁడని. ఆవెఱ్ఱిముండకొడుకు చేసెడి సృష్టిలో నిట్టివి పందలకొలఁది గలవు. నిన్ను స్తోత్రము చేయుటను

గాదు నేనిట్లనుచుంట. యదార్థము నాకడుపులో దాఁగదు. పెద్దదైన మంచుదైన కుండ పగులగొట్టినట్లు వెంటనే యనుట నాకలవాటు. కర్పూరమంజరి యొకర్తయే నాకుఁగూతురై సదని మఱియొకకూఁతు రులేకపోయెనని చాలాకాలము విచారించితిని. కాని నిన్నుఁ జూచు కొని యావిచారము పోగొట్టుకొంటిని. నీవే నారెండవ కూతుఁరవు. అట్లగుటచేత మీ యక్కవిషయమున నీతో నొక్కమాట ముచ్చ టింపవలెనని పిలిచితిని. బిడ్డసంప్రాప్త యౌవనయైనది. వివాహయో గ్యకాలము ప్రాపించినది. వరాన్వేషణముచేయవలయును. నీ జిహ్వా దాని యభిప్రాయము ప్రతిఫలించు నద్దము. అందుచే నిన్నడుగు చుంటి. అది యీవఱకెవ్వనిమీఁదనైన మనసు నిలిపినదా? నిజము దాఁచక చెప్పు?" అనవుడు మల్లిక చిఱునవ్వునవ్వి "ఏమోనండీ! నాకుఁదెలియదు. ఆమె మనస్సులో నేమున్నదో నా కెట్లు తెలియు నండి" యని బదులుచెప్పెను.

అనుటయు నతడు వెండియు నిట్లనియె. "ఓసీ! నీ వెఱుఁగని రహస్యములుదానికుండవు. దానిమనసులోమాటనీచెవిలో నుండును. చెప్పకపోతివా నన్నుఁ జంపుకొన్నట్లే." యని నిర్బంధించి యడి గెను. "అయ్యో! ఇదేమిపాపమండీ. చిన్నపిల్లలము. మాలో మే మేదో పరిహాసమునకో మఱెందుకో యెన్నోమాట లనుకొందుము. వాటివిషయమై నిర్బంధించి యిట్లుదిట్లుప్రయోగించిన మేమెట్లు బ్రతు కఁగలము? నన్ను మీరు నిర్బంధింపవద్దు" అని నిష్ఠురముగా నామె బలికెను. "పోనీ! నన్నుఁ జంపుకొన్నట్లే గాఁబోలును. నీవు నా కూఁతురువని చెప్పితినిగదా! నీవును గర్పూరమంజరియుఁ దండ్రి లేని కూఁతులగుదురు గాక!" యని కఠినముగఁ బలికెను.

అప్పుడు చేయునదిలేక మల్లికమెల్లమెల్లగా నిట్లనియె—"నా తోనామె చెప్పలేదుగాని మున్నామెకు జబ్బుచేసినప్పుడు మాళవ

రాజు కుమారుఁడగు మకరందుఁడువచ్చి వైద్యముచేసెను. అప్పటి నుండి యాతనిమీఁద మనసునిలిపిన దేమోయని నాయూహ. అయ్య గారూ! నే నీమాట చెప్పితినని యామెతోఁ జెప్పవద్దు. 'నీనోట నువ్వగింజదాగదు పనికిమాలినదానా' యని నామీఁద మీబిడ్డయుఁ జంద్రికయుఁ గోపించి దెప్పుదురు."

అనవుడు చిత్రభానుఁడు "బిడ్డా! నీవుచెప్పినట్లు నేను చెప్పను. కాని, నే నొకరహస్యము జెప్పెద. అది నీమనసులో నుంచు కొని పనిచేయుము. అట్లు చేసెదవా?" యని యడిగెను. "నాచేత నైన పక్షమున నదితప్పక చేసెద" నని యామె యుత్తరమిచ్చెను. అంతటఁ జిత్రభానుఁడిట్లనియె. "బిడ్డా! మకరందునిమీఁద నిలిచిన యామె మనస్సును నీవు త్రిప్పుటకుఁ బ్రయత్నము సేయవలయు. మక రందుఁడు బౌద్ధుఁడు. నాస్తికుఁడు, వేదశాస్త్రములు విశ్వసింపనివాఁడు. అట్టివానిఁ జేపట్టఁ గూడదని నీబుద్ధికుశలతకొలఁది హేతువులఁగల్పించి దృఢముగా చెప్పుము. నీవు బుద్ధిమంతురాలవు. ఇటు జెప్పుమిటుజెప్పు మని నీకు నేఁ జెప్పవలెనా? ఓసీ! తెలియక అడుగుచున్నాను. మక రందుఁ డేలాగుండును?"

"ఏలాగుండునని చెప్పనుస్వామీ! భూలోకమున విహరింప వచ్చిన మన్మథుఁడు. గుణములు చెప్పఁదలఁచితిమా వర్ణింపశక్యమే గాదు. దానికిఁదగిన పరాక్రమము. అందుకుఁదగిన విద్య. ఇదియది యననేల? అన్ని మంచిగుణములున్న వంది!" యని మల్లిక యుత్తరము చెప్పెను. చిత్రభానుఁడదివిని వెండియు నిట్లనియె. "ఎట్టిఁగా బొట్టిఁగా నుండఁగానే సరియా? మేడిపండు మిక్కిలి మెఱయుచుండును. పొట్టవిచ్చితిమా పురుగులగుంపు. ఆకారముఁజూచి యెవ్వరిని వరింప రాదు. గుణములకేమి యెవరిగుణములు వారికుండును. ఎన్ని గుణము లున్ననేమి? వాఁడు మనవాఁడు కాఁడు. బౌద్ధుఁడు పాషండుఁడు.

అట్టివానిం జేపట్టుట పాపముగాదా" అనవుడు మల్లిక "స్వామీ! మకరందునివిడిచి యేరాజకుమారుని వరింపవలసినదని మీ యభిప్రాయము" అని యడిగెను. అడుగుటయు నతండు మఱియు నిట్లనియె. "ఆఁ ఇపుడు మంచిదారికి వచ్చితివి. చెప్పుచున్నాను విను. ఈపట్టణమున దండపాణియను సేనాపతిగలఁడు. అతని తమ్ముఁడు వజ్రపాణి కలఁడు. అతనిని వరింపవలసినదని నాయభిప్రాయము. అతఁడు సద్గుణవంతుఁడు. బాహుశాలి. సత్కులజాతుఁడు. ఎప్పుడైనఁ జూచితివా?"

అనవుడు మల్లిక నవ్వుచు నిట్లనియె. "చూచితినండి! నన్నికల్లు మీఁది గంట్లవలె మొగముమీఁద మసూచకము మచ్చలుగలిగి నల్లగానున్నయతఁడే కాదా? చూచిచూచి యమ్మాయికొఱకామంచి పెండ్లికొడుకు నేరినారండి! అతని యొడలతఁడే కదుపుకొనలేనంత లావు. అతనిశరీరమునుండి చమటలుగారినప్పుడు కొండమీఁదినుండి సెలయేళ్ళు ప్రవహించిన ట్లుండును. అతనిమీసములు మొగము నొకచేఁ రంగుగనుండును. వయస్సుచూచినను నలువదేండ్లకుఁ దక్కువ యుండదు. ప్రథమభార్య యున్నది. ఆమెవలన నలుగురో ముగ్గురో బిడ్డలుకలరు. ఈ వన్నె పెండ్లికొడుకును జేపట్టుమని చెప్పుటకు మాకు నోరెట్లాడును? మేమొకవేళ జెప్పినను నామె యెట్లు సమ్మతించును? అట్టివివాహము లోకులెట్లు మెత్తురు? చెప్పుటకు మాకే సిగ్గగుచున్నది. ఆపెండ్లికొడుకు సరసను మీబిడ్డయెట్లు కూర్చుండునండీ? వారిద్దఱు కాటుకముద్ద పసుపుముద్దవలె నుందురు." అని పరిహాసోక్తులు పలుకుచున్న మల్లికకుఁ బ్రత్యుత్తరముఁ జెప్పఁదలఁచి చిత్రభానుఁడిట్లనియె: "ఓసీ! శరీరము నల్లగా నున్న నేమి యెఱ్ఱఁగానున్న నేమి? కొఱుకుకొని తినుటకు రాదేమి? వంశము గుణము భాగ్యము చూచుకొనవలెనుగాని రూపమెందుకే? అట్లయినఁ జైతన్యములేని బంగారపు బొమ్మను బెండ్లాడవచ్చునా? నీయుల్లసోక్తులు గట్టిపెట్టి నామాటవిని

నీచెలికత్తె దగ్గఱ వజ్రపాణిని జక్కఁగాఁ బొగడివర్ణింపుము. అతఁడు సత్కులజాతుఁడనుము. గుణనిధానమనుము. పరాక్రమంబున రెండవ కుమారస్వామి యనుము. అతఁడు చేపట్టిన వీరపత్ని యగుననుము. అనంతరము వీరమాతయగుననుము. కావలసినంత భాగ్యమున్నదను ము. ఒకభార్యయున్నను దానే యగ్రమహిషి కావచ్చుననుము. స్త్రీ కింత కన్నఁగావలసిన దేమున్నదనుము. ఓసీ! ఇన్నిమాటలెందుకు? ఎట్లు చెప్పవలెనో యట్లుచెప్పి కార్యము సఫలముచేసితివా నీకొక రత్నాలహారము వెలలేనియొకముత్యాలహారము బహుమానమిచ్చె దను. నీమేలు మఱచిపోను.''

అతఁడు చెప్పినదంతయు విని మల్లిక ''అయ్యా! మీయాజ్ఞ శిరసావహించి నేనామెతోఁ జెప్పుదునుగాని యామె నామాట విశ్వ సించునని నాకునమ్మకము లేదు. అని యాయనయొద్ద సెలవుగైకొని మల్లిక శయనాగారమునకరిగెను. ''ఈపలుగు ముండయే శకునపక్షి లాగున విరుద్ధముగాఁ జెప్పెను. ఇఁక నామె నాకనుకూలముగఁ జేయు నా? యని తనలో వితర్కించుకొనుచుఁ జిత్రభానుఁడు పండుకొనెను.

పదియవ ప్రకరణము

కాశ్మీరరాజు సైనికులు వసించుటకు శ్రీనగరమునకుం బడమటఁ బ్రత్యేకముగా నొకపేటకలదు. అందుసైనికులు సేనానాయకులు మాత్రమే వయుంతురు. సైనికుల దేహపరిశ్రమలకు, వ్యాయామ ములకు, వారిబిడ్డల యాటలకు ధనుర్విద్యయందు నభ్యాసముచేసికొను టకు మల్లయుద్ధములు, నేర్చుకొనుటకు యుద్ధవిశారదులగుటకు శు ష్కరణములు గావించుకొనుటకుఁ దగు విశాలభూములక్కడ నేర్పడి

యున్నవి. ఉదయాస్తమయముల యందు సైనికులు నానావిధముల గు సాధనములతో బహుపరిశ్రమల జేసి నేర్చినవిద్య మఱపురాకుండునట్లు చేసికొనుచుందురు. యోధులు సాధారణముగా విద్యావిహీనులై యుండుటచే గ్రంథపఠనము చేతగాదు కావున బహుపురాణవేత్తలుధర్మశాస్త్రవిశారదులుచిత్రకథాకథనకుశలురు జ్యోతిశ్శాస్త్రవేత్తలునగు బ్రాహ్మణులు స్కంధావారముఁజొచ్చి పూర్వరాజులచరిత్రములు మొదలగునవి చదివి వినిపించియు మనోహరములగు కథలు చెప్పియు వారిమనోరంజనము చేయుటయేగాక వారికిఁబుణ్యముపురుషార్థము నెఱిఁగించి యుక్తాయుక్తవివేచన జ్ఞానముఁగలిగించుచుందురు. అందుచే బ్రాహ్మణులన్న వారికిఁ బరమభక్తి. వారునిజముగా స్వర్గమునుండి భూమి కవతరించిన దేవతలనినమ్మి జోదులు వారియిల్లాండ్రు మిక్కిలివినయంబుగదుర వారికినమస్కారములుచేసి సన్మానించి యుచితాసనంబులనునిచ్చి శక్తికొలంది ధనధాన్యాదుల నూత్నవస్త్రములనొసంగి సత్కరించుచుందురు. ఆఁడువాండ్రు పగలు గృహకృత్యములందగిలియు మగవాండ్రు నానావిధ పరిశ్రమలఁజిక్కియుఁ దీరిక లేకయుండుటంజేసి సాధారణముగాఁ బురాణశ్రవణాదు లప్పటిలో రాత్రులే జరుగుచుండును. పౌరాణికుని వసంతఋతు రాత్రులయందు వారు చల్లని లేఁతగాడ్పులువీచు బయళ్ళయందుఁ గూర్చుండఁబెట్టి వందలకొలఁది స్త్రీపురుషులు చేరి పురాణ మాలకించి యానందించుచుందురు. వర్షకాలమునను, శీతకాలమునను భజనమందిరములయందె యాసభలు జరుగుచుండును.

అత్తఱి నొక్కనాఁటిరేయి నొకబ్రాహ్మణుఁడు మార్గాయాసమున రోఁజుచు నొకజోదుగృహమునకుఁ బోయి "అయ్యా! పండుకొనుటకు నాకించుకతావు నొసంగు ధర్మాత్ము లెవ్వరైన నున్నారా? నేను బాటసారిని. బ్రాహ్మణుఁడను. పగలెల్ల నెండలో మలమల

మూఁడి నడిచియున్న కతమున మిక్కిలిడస్సియున్నాఁడను. అడుగులు పుడపుడబొక్కినవి" యని యడిగెను ఆగృహయజమానుఁడగుజోదు "స్వామీ! మాయరుఁగుమీఁద మీరు పండుకొనవచ్చును. దయచే యుఁడు" అని యుత్తరమిచ్చెను "నాయనా! నీకెంతైనఁబుణ్యముగలదు. రక్షించితివి" అని యాబ్రాహ్మణుఁడు తనకృష్ణాజినము నాయింటియరుఁగుమీఁదఁ బెట్టియుంగవస్త్రముతో నడ్డికిఁగట్టిన యుత్తడి చెంబుఁ దీసి "నాయనా! పాదప్రక్షాళనమున కుదకము కావలెను. చేరువ నెక్కడైన నూయికలదా?" యని ప్రశ్నించెను. "స్వామీ! అల్లదె నూయి" యని చూప విప్రుఁడు ముఖహస్తప్రక్షాళనముఁ జేసికొని కడుపునిండ నీరుద్రావి మరల నప్పదాతియింటికిఁజని దర్భాసనముఁ బఱచుకొని యుచ్చైశ్స్వరముతో మహిమ్నస్తోత్రముఁ జదువ నారంభించెను. అదివిని జోదులనేకు లచ్చటఁజేరిరి. కొందరాశ్లోకముల యర్థమడిగి తెలిసికొనిరి. అది ముగిసిన వెనుక వారిలోఁగొందఱు బ్రాహ్మణుని నామధేయము దేశము నామముఁ దెలిసికొనఁగోరిప్రశ్నలడిగిరి. వారిప్రశ్నలకు బ్రాహ్మణుఁ డిట్లుత్తరముఁ జెప్పెను. "అయ్యా! నాపేరు వేదశర్మ, నాది గాంధార దేశము. అందుఁ దక్షశిలయను గ్రామముగలదు. అది [illegible]స్థలము. ఏమహానుభావుఁడు సంస్కృతభాషయందలి శబ్దజాలమున కెల్లనియమముల నేర్పఱుపఁ దలఁచి సర్వబుధజనశ్లాఘ్యమైన వ్యాకరణ శాస్త్రమువ్రాసిభాషా ప్రపంచము నుద్ధరించెనో సుశబ్ద ప్రయోగము జేసినప్పు డెవ్వనిపవిత్ర నామము ప్రతిపండితునకు మొట్టమొదట జ్ఞాపకమువచ్చునో యట్టి మహానుభావుఁడు పాణినిజన్మించినట్టి గ్రామమది. ఆమహాత్ముఁడేగాక బహువ్యాకరణవేత్తలు, బహువేదపారంగతులు బహుపురాణసంవిదులుఁ సకలధర్మశాస్త్రవిశారదులు బ్రహ్మవాదులు, నచ్చటఁ బలువురుగలరు. ఆసేతు హిమాచలమగు భరతఖండమందలి నానాభాగ

ములనుండి విద్యార్థులై బ్రహ్మచారు లప్పరికివచ్చి భిక్షాటనముఁజేసి జీవించుచు గురుశుశ్రూషాపరాయణులై తమకభిమానశాస్త్రంబుల నేర్చుకొని పోవుచుందురు. అది గొప్పవిద్యాసత్రము. సరస్వతికొలువు కూటము. చదువులకోటారు. కాశ్మీరదేశమున హిరణ్యపురమున నా కుటుంబములున్నారు. వారింజూడఁదలంచి నేను పయనమైపోవుచున్నాఁడ, మార్గపరిశ్రమ మెక్కుడగుటచే నగరమునకుఁబోలేక నిప్పేటలో విడిసినాఁడ. కాని కాశ్మీరదేశమింతయల్పకాలములో నేయింతదుస్థితికి వచ్చునని నేను స్వప్నమందైనఁ దలఁపలేదు, తక్షశిలలోసజ్జనులందరిందుకై వగచుచున్నారు" ఈచివర వాక్యములు రెండు మెల్లగానననెను "ఏమి! అట్లనుచున్నారేల?" యని పలువురుతొందరతో నడిగిరి.

"అయ్యో పొరబాటున నోరుజాఱి యనఁగూడనిమాటంటినే అయ్యా! బాటసారిని పేదబాపఁడను. ఈగొడవలు నాకెందుకు నన్ను విడిచిపెట్టుఁడు. ప్రశ్నలవర్షములో నన్నుఁదడుపకుఁడు" అని యతఁడు బదులుచెప్పెను.

స్వామీ! అట్లుగాదు. అదియేమోయన్నదాఁక మామనస్సులు తత్తఱపడుచున్నవి. మీరిది చెప్పితీరవలయు, మీరుబ్రాహ్మణోత్తములు' లోకులందఱికి మేలుగోరువారు. అట్టివారు మాదురవస్థయేమో తెలుపవలదా! దానికిం దగినప్రతిక్రియఁ జేసికొనుమా? అట్టివారు మీరు నోట పొరబాటుమాటరానియ్యనే గూడదు. మాట వచ్చినదా మూలముట్టఁ జెప్పవలయు" నని వారనిరి.

అప్పుడు బ్రాహ్మణుఁడు బలవంతముమీఁద నిట్లు చెప్పఁదొడఁగెను. "అయ్యా! ఇది రహస్యము. అయిన మాదేశములో నందఱెఱిగిన రహస్యమే. గాంధారదేశపురాజగు భాగ్యవర్ధనుఁడు కొన్నిదినములలో మీదేశముపై దండువిడిసి జయించి తనరాజ్యమునఁ గాశ్మీరమును గలుపుకొనవలయునని ప్రయత్నము చేయుచున్నాఁడు.

చుట్టుప్రక్కల దేశములనుండి సమరమున ముక్కాకలు దీరినజోదు
లను రావించి తనసేనలోఁ జేర్చుకొనుచున్నాఁడు. మహాటవులనుండి
మదపుటేనుఁగులం బట్టి తెప్పించి కదనమున కాయత్తము సేయు
చున్నాఁడు. వేనవేలు పారసీకహయంబుల బహుధనము లిచ్చి కొను
చున్నాఁడు. పదివేలయేనుఁగులు, ముప్పదివేలగుఱ్ఱపుదళము ఏఁబది
వేల కాల్బలము, పదివేల రథములు, రణమునకు సిద్ధమై యున్నవి.
పదాతులందఱు నీటజరించు చేఁపల మింటఁబాఱు పులుఁగుల సైతము
గుఱిదప్పక నొక్కయమ్మునఁ గూల్పఁగల మేటివిలుకాండ్రు. అట్టి
సేనతో జయముఁ గాంచవలయునను పేరాసతో మనంబున వెల్లివిరి
సిన యుత్సాహముతో నమ్మహాసేనకుఁ గావలసిన సకలసంభారము
లతో నతఁడు రాఁగల శరత్కాలమునఁ దండెత్తఁదలఁచుచున్నాఁడు. కట
కటా! చిరకాలమునుండి స్వాతంత్ర్య మనుభవించుచున్న కాశ్మీర
దేశము భూలోకస్వర్గఖండమని పేరువడసిన కాశ్మీర దేశము—హేమ
చంద్ర మహారాజు పరిపాలించిన కాశ్మీర దేశము—నెల్లసిరులకు నిల్లగు
కాశ్మీర దేశము—దిక్కుమాలిన పడంతివలె నన్యవశవర్తిని యగు
చున్నది. రత్నగర్భవంటి యీ దేశము మాసామ్రాజ్యములోఁ జేరునని
నాకెంతో సంతోషముగానున్నను మీకు రాఁగల దుర్దశఁ దలంచిన నా
కడుపు చుమ్మలు చుట్టుచున్నది. మా రాజును గుఱించి వేఱు తెలుంగునఁ
జెప్పుట నాకు ధర్మముగాదు కాని భాగ్యవర్ధనుఁ డనఁగా నెవఁడో యెఱుఁ
గుదురా? పాండవ ధార్తరాష్ట్రులకు మొదటఁ గలిగిన మనస్పర్ధ
యను చిన్నిమొక్కను తన దురాలోచన లనెడు దోహదములచేత
మహావృక్షముఁ జేసి కురుపాండవ వైరమునకుఁ బ్రధానకారణుఁడై
కౌరవకులమును గూఁకటివ్రేళ్ళతో నాశనముజేసిన శకునివంశస్థుఁడు
'స్యాలకోగృహనాశాయ' యను సామెత నిజముజేసిన దుష్టచిత్తుఁ
డతఁడు. అతని వంశస్థుఁడైన యీ భాగ్యవర్ధనుఁడు వానికన్నఁ బద్ధి

యాకు లెక్కువ చదువుకొన్నవాఁడు. ప్రజలను మంగలములోఁబెట్టి వేఁచినట్లు హింసించును. భరింపరాని పన్నులుగట్టును. భాగ్యవంతుల గృహములపైఁబడి దోఁచుకొనును. ఎదురాడినవారి పుత్త్రులుదీయించి కోటకొమ్మలకుఁ గట్టించును. చక్కని యాఁడువాండ్రుదఱుఁ దన ప్రక్కకుఁ జేరవలసినదె. వానికి నీతిలేదు. ధర్మభీతిలేదు. పాపభయము లేదు. శాపభయములేదు. అట్టిరాజు పాలనక్రింద మే మెట్లు వేగుచున్నా మందురో? విషక్రిమిన్యాయమున బ్రదుకుచున్నాము. వాని మంత్రులు కుటిలమార్గ పరతంత్రులు. దేశము పరాక్రాంత మగుటకన్న జనులకుగొప్పకష్టములేదుగదా? కాటకముల సహింపవచ్చును. ఈతిబాధల నోర్వవచ్చును. అంతఃకలహముల నడఁచుకొనవచ్చును. మహామారి మొదలగు ప్రళయరోగముల భరింపవచ్చును. కాని, పరరాజుపాలన మొక్కదినమైన సైరించుట కష్టము. దేశమందలి ధనధాన్యములనెల్ల నతఁడే తరలించుకొనిపోవును. రత్నగర్భల వంటి భూములు చవుటిపట్లులు జేయును. గనులన్నిటిని ద్రవ్వుకొని పోవును. తనదేశస్థుల కన్ని గొప్పయుద్యోగముల నిచ్చును. వెయ్యేల! జయింపఁబడిన దేశస్థులను బానిసలంజేయును. నోరున్నవారు మాటాడరాదు. చెవులున్నను వినరాదు. చేరెడు కన్నులున్నను జూడరాదు. వారిసాహసము నమసిపోవును. ధైర్యము తఱిగిపోవును. మగంటిమి మంటిపాలగును. ధైర్యమును వెడలఁగొట్టి భీతి వారి మనస్సుల నాక్రమించును. అడుగడుగునకు వారు పరరాజులకుఁ జేతులుజోడించి జోహారులు సేయుదురు. పరులను బట్టులవలె బొగడి స్తోత్రపాఠకు లగుదురు. వెయ్యేల! పరరాజు పాలనలోనున్న జనులు మృగములకన్నఁ బులుఁగులకన్నఁ బురుగులకన్న నికృష్టమైన జీవనముఁ జేయుదురు. నా శత్రువులకైన నే నెన్నఁ డట్టికష్టములఁ గోరను. "జననీ జన్మభూమిశ్చ స్వర్గా దపి గరీయసీ" యను

నార్యోక్తి మీరు వినలేదా? తల్లియు జన్మభూమియు స్వర్గముకన్న నెక్కుడని దీనిభావము. తల్లినిఁగోల్పోయి బ్రదుకవచ్చును. బిడ్డలు మృతులైన బ్రదుకవచ్చును. కులకాంతఁగూలిన మనవచ్చును. ధనముపోయిన బ్రతుకవచ్చును. కాని మాతృదేశము పరాక్రాంత మయినచో బ్రతుకఁజాలము. ఆదినమే దేశస్థులకు మరణదినము. ఆదినమే యాత్మగౌరవంబునకుఁ గడపటిదినము. సర్వసుఖముల కంత్యదినము. ఆదుర్దినము మీకు రాకపోవుగాక! ఆయాపద మీకుఁ దప్పుఁగాక!"

ఈ సంభాషణము మొదట సామాన్యస్వరముతోనే యతఁ డారంభించెనుగాని వెళ్ళినకొలఁది క్రమక్రమముగా నుత్సాహపూరితుఁడై యెలుఁగెత్తి చెప్పెను. అదివినునప్పు డచ్చట జేరిన సైనికులలోఁ గొందఱు "హాహా"యనియు, "శివశివా"యనియు, "హరిహరీ"యనియు "నెంతకర్మ, మెంతకర్మ"మనియు సంతాపార్థకములైన పదముల నుచ్చరించిరి. అతఁడు సంభాషణ ముగించినపిదప నందులో నొకఁడు "గాంధారరాజునకు మనదేశముమీఁద నింత కోపమేల? మన మతని కేమపకారముఁ జేసితిమి?"యని తక్కిన వారి నడిగెను. అందుకు వేదశర్మ యిట్లుత్తరముఁ జెప్పెను.

"ఒకరాజు మఱియొక దేశముపై దాడెత్తుటకుఁ గారణ మవసరములేదు. అపకారము చేయనక్కఱలేదు. మీ దేశము దుర్బలమగుట యొక కారణము. అతఁడు బలవంతుఁడగుట యొక కారణము. అతనికి గొప్పయాశలుండుట యొక కారణము. కారణము లరయనేల? పెనుచేప చిఱుచేపం దినును. ముంగిస పాముం జంపును. సర్పము కప్పను గబళించును. కప్ప పురుగులను మ్రింగును. పులి మేఁకం జంపును. ఇందొకదానికొకటి యేమి యపకృతిఁ గావించెను? బలవంతులు బలహీనులం జెఱుపుట నైజము. అదియునుఁ గాక కొన్ని జంతువులకు వలెనే కొందఱు మానవులకుఁ గూడ

దుష్కార్యాచరణము సహజము. నూఱువరాలు వెలగల చీర చిమ్మట బొత్తలు పొడిచి పాడుసేయును. ప్రశస్తమయిన పుస్తకముల జడ పురుగులు నాశనముఁ జేయును. కావున దురాత్ముల కపకారముతోఁ బనిలేదు. అంతియేఁగాక భూపతు లాశాపిశాచగ్రస్తులు. నేలనాలుగు చెఱంగులేలినను వారియాశ దీఱదు. మూఁడులోకములు హస్తగతములైనను వారి నావహించిన యాశాపిశాచమున కాఁకలిదీఱదు. భూమండలమంతయు జయించినవాఁడు సైతము భగవంతుఁడు తన విజయము నిమిత్తము నూతనఖండముల సృజియించిన బాగుండునని తలంచుచుండును. ఇవి యన్నియు నటుండనిండు! విభీషణుఁడు త్రేతాయుగమందు రావణసైన్యమునందె గాక ప్రతియుగమునందుఁ బ్రతిదేశమునందుఁ బ్రతిసైన్యమునందు నున్నాఁడు. తన నెత్తురు తన జాడఁ జూపినప్పుడు తననీడ తన్నుఁ బగతురకుఁబట్టి యిచ్చినప్పుడు తన యడుగులజాడయె తన నెలవుఁ దెలిపినప్పుడు మానవుఁడు పరులచే హింసింపఁబడకఁబోఁడుగదా !”

ఈ కడపటిమాటలు కర్ణములం జొఱఁబడి మనస్సునకు సూదులువలె నాటెను. “ఎవఁడావిభీషణుఁడు? ఎవఁడా దేశద్రోహి? ఈ రాజ్యమం దట్టివాఁ డుండఁగలఁడా?”యని కొందఱఱచిరి. “శాంతింపుఁడు. శాంతింపుఁడు”అని మఱికొందఱు వారిని వారించిరి. వేదశర్మ “క్రమక్రమముగా మీకే తెలియును. నిప్పులోపలి యటకమీఁదఁబెట్టి యిల్లంటించినను మంటలు పైకి రాకపోవు. ఓపికపట్టి యుండుఁడు”అని బదులుచెప్పెను. అందులోఁ గొందఱు “స్వామీ! మర్మముబెట్టి మాటలాడి మమ్ముం జంపనేల ? ఇంతవఱకుఁ జెప్పితిరి గదా. తక్కినదిగూడ స్పష్టముగాఁ జెప్పుఁడు. మేము పగరాజులకు దాసులము కాలేము. బెబ్బులులవలెఁ బరసైనికులువచ్చి దేశమాక్రమించి యూళ్ళు కొల్లఁగొనుచుండఁగా మేము చూడలేము. కాశ్మీర దేశముకొఱకు, రాజకుటుంబముకొఱకు, మేము మానెత్తురు ధారవో

యుదుము. ప్రాణములు బలియిత్తుము. ద్రోహులను శిక్షింతుము. విషయము సమూలకముగాఁ దెలిపి మమ్మనుగ్రహింపుఁడు.'' అని పలికిరి.

''అయ్యా! మీరు బలవంతపెట్టుచున్నారు గనుక చెప్పక తప్పదు. మీరాజు చిన్నవాఁడగుటచే మంత్రులు లంచగొండులై దేశము పరుల కప్పగింపఁదలచుచున్నారు. మీరాజకుటుంబమునకు వెనుకటిరాజు సహోదరుఁడైన చిత్రభానునకు సరిపడదుగాని, యతఁడధికారము వహించునేని, నేఁటిమంత్రులు తొలఁగింపఁబడుదురేని రాజభక్తిగల దండనాథులు మీవంటి శౌర్యధైర్యముఁగలబంట్లను రణరంగమునకు నడుపుదురేని ఇటువంటిగాంధారరాజులను నూఱుమందిని మీరు జయింపవచ్చును. అన్నిబలములుకన్న నైకమత్యబల మెక్కువది. అదియే జయమును సమకూర్చును.'' అని సన్నసన్నముగాఁ దన యుపన్యాసము ముగించెను.

ఆమాటలు వానినోట వెడలినతోడనే ''మంత్రులే! మంత్రులే! ఓరీ రాజద్రోహులారా! ఓరీ దేశద్రోహులారా! ఓరీ! మీ మొగములుమండ. ఓరీ! లంచగొండిముండకొడుకులారా'' యని కొందఱు దూషింపనారంభించిరి.

''లంచగొండులు ధనమునకై దేశమునైన నమ్మివేయుదురు. వారిని నిలువనీయఁగూడ''దని కొందఱు పలికిరి. ''చిత్రభానుఁ డధికారము వహించుట దేశక్షేమకర'' మని కొందఱు వచించిరి. ''చిత్రభానుఁడు భ్రాతృద్రోహి. వానికధికారమిచ్చుటత'' ప్పని కొందఱు భాషించిరి.

ఇట్లు పలువురు పలువిధంబుల సంభాషించుచు నర్ధరాత్రమగుటచే నిద్రాపీడితులై స్వగృహముల కరిగిరి. వేదశర్మ తెల్లవాఱుజామున సైనికుల మనస్సులలోఁ జిచ్చుపెట్టి తనదారింబోయెను.

మఱునాఁ డుదయమున సైనికులు లేచి గుంపులుగూడి వేదశర్మ చెప్పిన వృత్తాంతమంతయు బహువిధములఁ జర్చింపఁదొడఁగిరి.

అది నిజమని కొందఱు నీలి వార్తయని కొందఱుఁ దమకుందోఁచిన పోల్కిఁ బలికిరి. "మంత్రుల నమ్మరా" దని కొందఱు "వారివంటి సజ్జనులు లే"రని కొందఱు వాదించిరి. చిత్రభానుఁడు దుర్జనుఁ డని కొందఱు సజ్జనుఁడని కొందఱు వక్కాణించిరి.

పిమ్మట దండపాణి వజ్రపాణియు, గదాధరుఁడు శూలపాణియు నెప్పటియట్ల రాఁగా వారి కావృత్తాంత మెఱిఁగించిరి. గదాధరుఁడు శూలపాణియు "నిదియెల్లకల్ల. ఇవి శత్రువులకల్పనలు నమ్మరా"దని గట్టిగా జెప్పిరి. దండపాణియు వజ్రపాణియు "నిజమని నమ్మరాదు. కల్లయని త్రోసివేయరాదు. ఏపుట్టలో ఏపామున్నదో మన మెఱుంగుదుము!" అని చెప్పి చాటుచాటునఁ దమకాప్తులయిన క్రింది యుద్యోగస్థులతో బాలరాజు పరిపాలనము చేటునకు మూలమనియు, సమర్థుఁడెవ్వరైన రాజ్యాధికారమువహించిన మేలగుననియుఁ జెప్పుచు వచ్చిరి.

మఱునాఁడు మధ్యాహ్నమున కీవార్త కాఱుచిచ్చువలె శ్రీనగరమందంతట రేగెను. అత్యుత్సాహముతోఁ బ్రజలందఱు దీనిని గుఱించి మాటలాడు కొనుచుండిరి. ఏమూలఁజూచిన మనుష్యుఁ గుంపులే ఎక్కడనాలకించిన దండయాత్రా విషయమే. ఎక్కడ జర్చించిన మంత్రుల ప్రవర్తనమే. కొందఱు హేమచంద్రునిఁగూర్చి విచారించిరి. కొందఱు విక్రమసేనుని దురవస్థకుఁ జింతించిరి. కొందఱు మంత్రులను దూషించిరి. ఇన్నిమాటలేల? ఆఁడువాండ్రుమగవాండ్రు బాలురు వృద్ధులు భిక్షుకులు పరిచారకులు సర్వజనులు తద్విషయము లనె జర్చించుచుఁ బనిపాటలుమాని యుండిరి. ఊరంతయు నట్టుడికి నట్లుండెను. కొందఱు పిచ్చివాండ్రువలె సంచరించిరి. కొందఱు మంత్రుల యింటిమీఁదఁబడి వారిని గఠిన ప్రశ్నములనెడు రాళ్ళతో

ఉన్నిరి. దండయాత్రాభయమునఁ గొందఱు నగరము విడిచి పల్లెలకుఁబోవఁ దలపెట్టిరి. క్రమక్రమముగా నీవార్త రాచనగరుఁజేరెను. విక్రమసేనుఁడు అచ్చవడియెను. హర్షవర్ధనుఁడు తల్లికడకరిగి యవ్వార్తచెప్పి యామె నాశ్చర్యసముద్రములో ముంచెను. కొంతసేఁ పామె విచారించి యదికల్పితకథయని కొడుకులతోఁ జెప్పెను. నర్మదయేదో పనిమీఁద నగరములోనికిఁబోయి ప్రజలలో వ్యక్తమగుచున్న యమ్మహోత్సాహము భయము స్వయముగాఁజూచి వచ్చినదగుటచే నది చేతులు ద్రిప్పుకొని యభినయముఁ జేయుచు నేత్రవిభ్రమము చేతను ముఖవైలక్ష్యముచేతను నెంతో చిత్రముగా వర్ణింపఁ దొడఁగెను. నగర మెట్లుండెనో నగరునట్టె యుండెను. సేవకులు మిక్కిలి కలవళముపడిరి. గాంధారరాజ దండయాత్ర ప్రతివారి పెదవులమీఁద నుండెను.

మణివర్మయు మాధవసేనుఁడును బ్రజల కోలాహలమును దమ యుభయప్రధానముచేఁ గొంతవఱకు నివారించి యరవిందాదేవికిని విక్రమసేనునకును దప్పక చిత్తక్షోభము గలిగియుండునని తన్నివారణార్థము రాచనగరునకు దేవి పిలువనంపకయే పోయిరి. అరవిందాదేవి వారి నెప్పటియట్ల గారవించి గాంధారరాజ దండయాత్రా విషయమున నేదయిన సత్యమున్నదాయని యడిగెను. ఆ ప్రశ్నకు మణివర్మ యిట్లుత్తర మిచ్చెను.

"అమ్మా! ఇందు లేశమయిన సత్యము లేదు. మన వేగులవాండ్రు గాంధారదేశపు సరహద్దులనుండి యీ నడుమనే వచ్చినారు. ఆ దేశము యుద్ధసన్నాహము లేక నిస్తరంగమగుసముద్రమువలె నున్నదని చెప్పిరి. అదిగాక మనదేశమునుండి వణిజులు కొందరక్కడికి బోయివచ్చిరి. అక్కడనుండి బేహారము సేయుటకిక్కడికిఁ గొందఱు వచ్చియుండిరి. వారెవ్వరీమాట చెప్పలేదు. ఇది యెవ్వరో రాజ

కుటుంబమునకు నగరజనంబునకుఁ జిత్తసంక్షోభమునకుఁ గలిగింపవలె నని పుట్టించినకల్లవార్త. ఇదినమ్మి మీరు, మోసపోకుఁడు మీ మనస్సులు ప్రసన్నములుగా నుంచుకొనుఁడు. భయము సర్వావయవముల పటుత్వము నడంచును. ధైర్యముం జెఱుచును. కార్యములనెల్ల విఘాత మొనర్చును. కావున భయమున కెడమీయవలదు. మేము గూడ మిమ్ము ద్రోహము సేయుచున్నామని లోకములో నపవాదములు బైలుదేఱినవి. ఆ విషయమై మేము చెప్పకొనరాము. మా పూర్వచరితము మా స్వభావము మా ఋజుత్వములను గుఱించి సాక్ష్యమీయవలయును గాని మా మాటలుగావు. దీనికి మీ యంతఃకరణమే ప్రమాణము"

అనవుడు రాజమాత "ఇవి కట్టుకథ లని విక్రమసేనునితో మొట్టమొదటనే చెప్పితిని. మీపై మా కనుమానము లేదు" అని చెప్పెను. అమాత్యులు సెలవుగైకొని యంతఃపురము విడిచిపోయిరి.

పదునొకండవ ప్రకరణము.

వేదవర్మపలుకులవలనఁ గలిగిన యలజడి సంపూర్ణముగా నడఁగకమునుపే మఱియొక విషయము రాజకులమునకు మహోద్దోళనము గలిగించెను. వెనుకటిగొడవ జరిగిన నాలవనాఁటిరేయి రెండు గడియలు గడిచిన వెనుక రాచనగరు కడకుఁ నొక క్రొత్త పురుషుఁడు పోయి ద్వారరక్షకులంజూచి "అయ్యా! అరవిందా దేవిపుట్టినింటనుండి నేనువచ్చితిని. ఆమెజనకుఁడగు మహేంద్రదేవుఁడు నన్నతి రహస్యముగా దేవిగారికొక రహస్యసందేశ మెఱిఁగించిరమ్మని పనిచె. తత్కారణమున నే నిటవచ్చితిని. నేనువచ్చినపని రాజకులమునకు మహోపకారకముగాఁబరిణమించునుగావునమీరతి శీఘ్రమున నాకొక

యమ్మహాదేవి కెఱిఁగించి దర్శనము చేయింపుఁడు" అని రహస్యముగఁ జెప్పెను. అప్పలకులువిని "మీరెవ్వరు? మీపేరేమి? పాంచాల నాయకులైన మహేంద్ర దేవులు మిమ్ముఁబంపిరని మిమ్ము నమ్ముట కానవాలేమున్నది?" అనియడిగిరి. అనవుడు నప్పురుషుఁడు "నాపేరు సోమభట్టు నేను బ్రాహ్మణుఁడను. పాంచాలరాజ పురోహితుఁడగు హరదత్తుని పుత్రుఁడను. దేవిగారు నాతండ్రి నెఱుగుదురు. మహేంద్ర దేవునకు వివాహకాలమున నత్తవారిచ్చిన వజ్రపు టుంగరము నాకాయన కూఁతునకుం జూపుమని యానవాలుగనిచ్చె. ఇదె యా యుంగరము. కావలయునేని దీనిం జేకొని మీరామెకుం జూపుఁడు" అని బదులు చెప్పి యప్పురుషుఁ డంగుళీయకము వారి కిచ్చెను. రాజభటులు దానింగైకొని యంతఃపురసంరక్షకునికడ కరిగి యావృత్తాంతముఁ జెప్పి యదివాని కిచ్చిరి. అతఁడది యెల్ల నర్మద కెఱిఁగించి యుంగరమామెకిచ్చి దేవికడకుఁ బంపెను.

నర్మద దానిం బుచ్చుకొని యరవిందాదేవి కడకుఁ బోయి యవ్వార్త నెఱిఁగించెను. ఆదేవి దీపముల వెలుఁగున నయ్యంగుళీయకము ముందరి భాగము వెనుక భాగము మిక్కిలి శ్రద్ధతోఁ బరీక్షించి చూచి "ఓసీ! నర్మదా! ఇది మజ్జనకునకు వివాహకాలమున నా మాతామహులిచ్చిన యుంగరమే. కావున నితఁడు తప్పక మహేంద్రదేవుని చేతఁ బంపఁబడినవాఁడై యుండును. లోపలికి రానిమ్మని చెప్పుము. పురోహిత నందనుఁడగుటచే నితఁడు పరమ వైదికుఁడు గావున నన్నుం జూడఁదగును అనిదానిం బంచెను. అనియు యథాక్రమముగా నంతఃపురరక్షకునకును నతఁడు ద్వారపాలకులకును దెలుప వారా భూసురుని నగరుఁ బ్రవేశపెట్టిరి. ఒక వృద్ధకంచుకిదారి జూప నాజన్నిగట్టు బహుద్వారములు గడచి యభ్యంతర మందిరముం జేరి కిశోరద్వయమధ్యముననున్న యాఁడుసింగముంబోలి కుమారద్వయ

సమేతయైన యరవిందాదేవి యెట్టయెదుట నిలిచెను. ఆమెయుచితాసనంబున నాతనింగూర్చుండఁబనిచి మహేంద్రదేవునియుఁ దనతల్లియు సోదరులయు బంధుగులయు సేమ మరసి యాతని తండ్రిక్షేమ మడిగెను. తనతండ్రి కాలధర్మమునొందెనని యాతఁడు విన్నవించి యిట్లనియె. "అమ్మా! నాతండ్రి స్వర్గస్థుఁడగుటచేతనే మీ తండ్రిగారు మీయొద్దకు నన్నుఁబుత్తెంచిరి. ఆయనయున్నపక్షమున నాయననే పంపియుందురు" అనవుఁడు దేవి "అయ్యో! మహానుభావులైన మీతండ్రిగారు గతించిరా? సామగానమాయనతో నంతరించినదని చెప్పవచ్చును. నావివాహమాయనే చేయించిరి." అని వివాహము మాటజ్ఞప్తికి రాఁగానే తన నూతనావస్థను దలంచుకొని కన్నీరువెట్టుకొనెను. సోమభట్టు దేవిని సమయోచితముగా సమాశ్వాసించి యిట్లనియె.

"అమ్మా! నావచ్చినపని చిత్తగింపుము. మీ జనకుఁడైన మహేంద్రదేవుఁడు భర్తృవిహీనవైన నీయొక్కయుఁ బితృవిహీనులయిన మనుమలయొక్కయు సేమమరసి యతిరహస్యముగ మీకొక్కమాటజెప్పి రమ్మని నన్నుం బుత్తెంచెను. మీరది సావధానముగా నాలకింపుఁడు. సింధుదేశ నాయకుఁడగు పరంతపుఁడు కాశ్మీరదేశముపై దండు విడియవలెనని సంకల్పించి మహోత్సాహముతో మహాప్రయత్నము సేయుచున్నవాఁడు. పరంతపశబ్దము నేతిబీరకాయగాదు. అతఁడు పరంతపుఁడే. అతనికి మ్లేచ్ఛులు సమరదోహదులు చండప్రతాపులునగు పారసీకులు మిడుతలదండులువలెవచ్చి సాయము చేయుదురఁట. వారికి జీతములు బత్తెములు నీయనక్కఱ లేదఁట. దోఁపుడువలన నెంతసొమ్ము వారికిదొరకునో యంతయు వారికిచ్చినం జాలునఁట. సింధుదేశము మంచిగుఱ్ఱములకుఁ బేరువడియెఁ గావున సామ్రాజ్య సేనలో గుఱ్ఱపు దళము మెండుఁగ నుండును. అవి గుఱ్ఱము

ఖగావు లేళ్ళుగాని అదిగాక కాల్బలము గజబలము రథబలము కావలసినంతయుండును" అంతవఱకుఁ జెప్పునప్పటికి విక్రమసేనుఁ డందుకొని "దండెత్తువాఁడు సింధురాజనుచున్నారు. గాంధారరాజని చెప్పుఁ"డని పలికెను. అనవుఁడు సోమభట్టు 'కాదు. కాదు. సింధు నాయకుఁడే. దానికిం దగిన తార్కాణములున్నవి. లిఖితరూపకము లైన తార్కాణములు దొరకినవి. కానిచో శాస్త్రజ్ఞానము లోకాను భవము సంపూర్ణముగాఁగల మహేంద్రదేవునివంటి రాజనీతి కోవి దుఁడు తన పురోహితుని శ్రమైక సాధ్యంబగు నీపయనమునకుఁ బురి కొల్పి పంపునా?"యని యుత్తరమిచ్చెను. అనవుఁడు నగవిందాదేవి మిక్కిలి విస్మయమునొంది "ఏమీ! లిఖితరూపకమగు తార్కాణము దొరకినదా? ఎవరువ్రాసినది? ఎవరికి వ్రాసినది? ఎప్పుడువ్రాసినది? ఏదేది! చూడనిమ్ము"అని మాటవెంబడి మాట వచ్చునట్లు మిక్కిలి తొందరతోనడిగెను.

అడుగుటయు సోమభట్టు "అమ్మా! ఎవరననేల! మనచేతులు మనకాళ్ళు, మనకన్నులు, మనచెవులు వారు మనతోడు నీడలవలె మనతోనుందురు. ఆనీడలేమనకు శత్రువులు మన గోడలే మనకు శత్రువులుగదా"యని బదులుచెప్పెను.

అయ్యో! వారి నామధేయములు వినువఱకు లిఖిత రూపక దృష్టాంతములు చూచువఱకు నామనస్సు తత్తఱపాటు చెప్ప నలవి గాకున్నది. కావున నీక్షణమే వాటిం బ్రదర్శించి స్థానముదప్పి భ్రమిం చుచున్న నామనస్సునకుం గుదురుపాటు గలిగింపుము"అని యర విందాదేవి వానిం దొరపెట్టెను. అప్పుడు సోమభట్టు తన కృష్ణాజి నముచుట్ట విప్పి యందుండి యొక యడపసుఁచి దీసి యాసంచిలోఁ గట్టకడపటి సొరంగములో నట్టడుగున సన్నగుడ్డ చుట్టఁబడి రెండు మడతలుగానున్న యొక భూర్జపత్రముఁ దీసి విక్రమసేనుని చేతికిచ్చి చదువుమనెను. అతఁడు దీపముదగ్గఱకుఁ బోయి యిట్లు చదివెను.

శ్రీమన్మహారాజాధిరాజ త్రిభువనమల్ల కిన్నరేంద్ర ఘటాపంచానన పరరాజవేశ్యాభుజంగ సకలసమరాంగణ సార్వభౌమప్రముఖ బిరుదాంకితులును సింధుదేశాధీశ్వరులును అగు స్వస్తిశ్రీ పరంతప మహారాజుగారి దివ్యచరణారవింద సన్నిధికి కాశ్మీర రాజమంత్రియు మీ సేవకుఁడునగు మణివర్మ వందన శతపురస్సరముగా వ్రాసికొన్న విజ్ఞాపనము.

బౌద్ధభిక్షుక వేషధారియైన మీ వేగులవానిచేత దేవరవారు పరమానుగ్రహమున నాకు వ్రాయించి పంపిన లేఖనందుకొంటిని. కన్నుల నద్దుకొంటిని. పూవుదండవలె శిరమున ధరించితిని. ఈసేవకునిమీఁద నిర్హేతుకముగా మీకింత యనుగ్రహము గలిగినందుకు మిక్కిలి సంతసించితిని. నాహృదయానందము దెలియఁజేయుటకుఁ దగిన మాటలు నే నేరకున్నవాఁడ. మీరు కాశ్మీరదేశము దండెత్తఁ గుతూహలపడుచున్నట్లు వ్రాసినారు. ఆదేశ మేపాటిబలము గలదని యడిగినారు. మీసంకల్పము శ్లాఘాపాత్రము. ఈరాజ్యము పూర్వము బలమైనదేగాని నేఁటికాలమున రాజు చిన్నవాఁడగుటచే రాజ్యము దుర్బలముగానున్నది. మానవశరీరమునం దరిషడ్వర్గమువోలె నీదేశమున నంతశ్శత్రువులు బలాఢ్యులు గలరు. వారిరాయిడిచేత నెలుకలు దొలిచిన యిల్లువలె నీదేశము శిథిలమైయున్నది. దేశము సారవంతమై రత్నగర్భలగు భూములుగలదై స్వర్గఖండమువలె నుండుటంజేసి బాహ్యశత్రులనేకులు దీనిపైఁ గన్నువైచియున్నారు. మాకుముప్పది వేల సేనకంటె నెక్కువలేదు. దేశస్థితియిది. సాయము జేయుమని నన్ను మీరు కోరినారు మీచిత్తప్రకారము నేను మీకుఁ దోడుపడియెద. నేను కోరుకొన్నచోట నాకు సారవంతములైన పది యగ్రహారములు, పదిలక్షల రూకలు మీరిచ్చెదనని వ్రాయించిరి. ఇరువది యగ్రహారములు నాకు దయచేయవలెనని కోరుచున్నాను. మీరు

మీచిత్తము మాచిన్నరాజునుబట్టి మీకప్పగించెద. కోటమీస్వాధీనము జేసెద ధనాగారమంతయుఁ దరతరములనుండి ప్రోగుచేసిన ధనరాసులతో నిండియున్నది. అచ్చట లక్ష్మితాండవమాడుచు మిమ్ముం బిలుచుచున్నది. మీరువచ్చి యాక్రమించుటయే కొఱఁత. ఈదేశము మీస్వాధీనమగునేని స్వర్గముమీచేతిక్రిందికివచ్చినట్లు. మేరుపర్వతము మీయధీనమైనట్లు కైలాసము మీగడపలోనున్నట్లు ఆలస్యముచేయక వెంటనే బలములఁగూర్చుకొని రండు దండపాణియు వజ్రపాణియు నేఁ జెప్పినట్లు వినరుగాని గదాధరుఁడు శూలపాణియు నాయింటి కుక్కలు. వారు నాపనుపు దప్పక సేయుదురు వారు తమతమ సైన్య భాగములతోవచ్చి మిమ్ముం జేరుదురు. మాధవసేనుఁడుగూడ మన లోనివాఁడె. ఆముగ్గురకుఁగూడ మీరు మనపనితీఱినవెనుక దగిన పారితోషికములిచ్చి సంతోషపెట్టవలయు. మీరు నాపేర దీనికుత్తరము వ్రాయునప్పుడు దానిలో నాపేరువ్రాయక యశోకవర్ధనునకని వ్రాయవలయును. పాములవానివేశము వేయించి నావేగులవానిని మీకడ కీయుత్తర మిచ్చి పంపుచున్నాను. ఇదే వందన శతము.

ఇట్లు విన్నవించు మీ విధేయుఁడు,

మణివర్మ.

కుమారుఁడు జాబుచదువుట ముగించినతోడనే యరవిందాదేవి "నాయనా! నీవు మణివర్మ వ్రాఁత నెఱుఁగుదువుకదా! ఇది యతని వ్రాతయగునా?" యని యడిగెను. "తల్లీ! మణివర్మలేఖనము నే నెఱుఁగుదును. అక్షరములు గుండ్రములై యాణిముత్తెములట్టులుండును. పంక్తులువంకర లేక ముత్యాలకోవలుపఱచినట్లుండును. అక్షరములు మిక్కిలి దగ్గఱఁగా వ్రాయుట యతనికలవాటు. పెద్దగ్రంథము చిన్నచోటున నతఁ డిమిడింపఁ గలఁడు. ఆ నైపుణ్యమిందు స్పష్టముగఁ

గనఁబడుచున్నది. తలకట్లు పొల్లులు తీర్చుటలో నతని హస్తమున
కొకానొక వింతకౌశలముగలదు. అదియు నిందుఁ గనఁబడుచున్నది.
కావున నీవ్రాత యాతనిదే యని నాకుఁ దోఁచుచున్నది. అని యుత్త
రము జెప్పెను. అదివిని యాదేవి నిట్టూర్పు విడిచి యీవ్రాత తప్పక
మణివర్మదే యైనపక్షమునఁ గాశ్మీరరాజ్యలక్ష్మి ముఖమున బ్రహ్మ
మిక్కిలి చెడ్డవ్రాత వ్రాసెనని నేను దలంచెద. అట్లుకానిచో మేరువు
వంటి ధైర్యమును సముద్రునివంటి గాంభీర్యమును రాజసామాన్య
దుర్లభమైన సౌజన్యమునుగల మాతండ్రిగారేల దారుణముగా నస్త
మింతురు? హా రాజ్యలక్ష్మి! నీకును మాకును ఋణముదీఱినదా?
మాపైని నీకు విసుగుదోఁచినదా మమ్మువిడచి పరరాజుల పాలుగాఁ
దలఁచితివా పరమేశ్వరు మయ మెట్లున్నదో యట్లు కాగలదు అని
పలికి కుమారు లధైర్య పడుదురేమో యని వెంటనే శంక దోప నా
ధోరణి దప్పించి యా దేవి వెండియు సోమభట్టు నుద్దేశించి "అయ్యా!
ఇది యెట్లు మాతండ్రిగారికి దొరికినది?" యని యడిగెను. అందుకు
సోమభట్టిట్లనియె. "అమ్మా! ఇది చిత్రముగా లభించినది. ఒక
పాములవాఁడు కన్యాకుబ్జపట్టణమునఁ దనపాముల నాడించి ధన
మార్జించుకొని యిందందుఁ దిరుగుచుండెను. ఒకనాఁడు వాఁడు తా
నార్జించిన విత్తముం దీసికొని యూరుచివరనున్న కల్లంగడికి బోయి
రెండు లొట్టియల కల్లుద్రావి యొడలుమఱచి కొంతసేపుఁ దొరలి
కొంతసేపు నేలఁబొరలి తెలివివచ్చినతోడనే మరల కొంతద్రావి ప్రక్క
నున్నవారితో నిర్హేతుకముగాఁ గయ్యమునకుఁ గాలుదువ్వి వారిపైఁ
బడెను. అప్పుడు జుట్టుజుట్టు పట్టుకొని వాండ్రుపోరాడిరి ఈ భూర్జ
పత్రము వాఁడు తన తలపాగలో జాగ్రత్తగా దాచెను. ఈకలహములో
తలగుడ్డవీడిపోవుటం జేసి యిది నేలంబడెను. మహేంద్రదేవమహారాజు
గారి వేఁగులవాండ్రు దేశమందంతట వ్యాపించియుందురు గావున

నాఁడు కల్లంగడిలోనున్న రొయికచాఱఁడు మెల్లగా దీనిందీసికొని మహారాజుగారికిచ్చెను. ఈభూర్జపత్రముయొక్క చరిత్రమిది. ఇందు నమ్మకపోవుటకేమియు లేదు. అంతయు సహజముగానున్నది. అసంభవమేమియుఁగానఁబడదు. కావున మీతండ్రిగారిట్లు మీతోఁజెప్పుమనిరి. మణివర్మను మాధవసేనుని నమ్మి మీయర్ధప్రాణము లాతని చేతంబెట్టవలదు. అవి పూలదండలుగావు. కుబుసమూడ్చిన కోడెత్రాచులు. అవి పగడములుగావు, చంద్రనిప్పులు. అవి క్షీరములుగావు, సున్నపునీళ్ళు. అవి హంసలుగావు, కొంగలు. అవి గోవులుగావు గోచర్మముఁదాల్చిన బెబ్బులులు. కావున నమ్మి మోసపోకుఁడు. నీప్రాణములు బాలురప్రాణములు విషాగ్నులవలన శస్త్రాదిసాధనములవలనఁ గాఁపాడుకొనునది.'' ఇది మీనాయనగారి సందేశము. దీనిని రత్నాభరణమువలె మీశిరంబునఁ దాల్పనగు. మహామంత్రమువలె భక్తితో స్మరియింపవలెను. అమ్మా! నావచ్చినపనియైనది. చీఁకటిపడిన తరువాత నగరుసొచ్చి రేయి రెండుజాములు గాకమునుపే యూరు విడిచి పోవలసినదని మీతండ్రిగారు సెలవిచ్చిరి. నేనిచ్చటఁ దెల్లవాఱువరకునుండరాదు. మీ యమాత్యులు మీసేనాపతులు నన్నుఁ బలుసిలుఁగులఁ బెట్టుదురు మీతండ్రికి బురోహితుఁడనై మీకు హితమాచరింపవచ్చితిని. మేము ఛాందసులము. అలౌకికులము. ముక్కుకు నూటిగిఁ బోవువారము. దారినవెళ్ళి దారినవచ్చువాగము మీసేమమతనికి వెంటనే యెఱిఁగింపుమనిగూడ మీతండ్రిగారు సెలవిచ్చిరి. అందుచే నాకు సెలవొసంగుము.'' అని లేచెను.

అరవిందయు విక్రమసేనుఁడు హర్షవర్ధనుఁడును లేచి వానికి నమస్కరించిరి. ''అయ్యా! మేమీగడియవఱకు సేమముగా నున్నామని మానాయనగారితోఁ జెప్పుఁడు. ఇక్కడిస్థితిగతులనరసి సేనాయనకుఁ గర్తవ్యమునుగుఱించిజాబువ్రాసి విశ్వాసముగలబంటునంపెను.

అంతయు నడిగితినని జెప్పుఁడు. దైవానుగ్రహమున బ్రతికితిమా మరల దర్శనము జేయుదుమని జెప్పుము.'' అని యరవిందాదేవి వాత్రాచ్చి పానినంపెను.

ఆభూర్జపత్రము విక్రమసేనుని చేతినుండి హర్షవర్ధనుఁడు దీసికొని చదువుకొని ''అమ్మా! మనము దొంగలగుంపు నడుమనున్నాముసుమీ'' యనిపలికెను. ''కుమారా! అదియిటు లెమ్ము. నేనుజాగ్రత్తగాదాఁచెద''నని తల్లిపుచ్చుకొని మరలమరల దానింజదువుకొని ''వత్సలారా! ప్రొద్దుపోయినది పండుకొనుఁడు భయములేదు'' అని వారిం బానుపులఁజేర్చి నిద్రపుచ్చెను.

అరవిందాదేవికిఁ జాలసేపు నిద్రపట్టనేలేదు. తెల్లవారుజామున నొకచిన్నకునుకుపట్టెను. అంతలోనే పగతురుకోటనాక్రమించి విక్రమసేనునింబట్టకొని బంధించినట్లు దుస్స్వప్నము రాగాఁ నామె నిద్రలో నయ్యోయయ్యోయని యఱచివగచిత్రుళ్ళిపడి మేల్కాని లేచి విక్రమసేనుని పాన్పుకడకుఁబోయి కొడుకుఁజూచుకొని యదికలగదా యని ధైర్యముఁదెచ్చుకొని వర్ధదను లేపి తనదుస్స్వప్న మంతయు నెఱిఁగించిమరలఁ గన్నుమూసిన నెక్కడపాడుకలవచ్చునోయని శంకించి తెల్లవాఱుఁఱకు దానితో మాటలాడుచుండెను. తెల్లవాఱిన పిదప సమయోచిత కృత్యములుదీర్చి యాదేవి మణివర్మం బిలుచుకొని రమ్మని యొక సేవకునిం బనిచెను.

అతఁడును స్నానసంధ్యాద్యనుష్ఠానములు దీర్చికొని సముచితవేషంబుఁదాల్చి రాచనగరుఁజొచ్చి దేవిని సందర్శించెను. విక్రమసేను డాప్రక్కనుండెను. వారిమొగము లెప్పటియట్ల ప్రసన్నములుగాక వేఱుభంగి నుండుటచే నేదో క్లిష్టవిషయము వారిమనస్సులం బీడించుచున్నదని వృద్ధమంత్రియూహించి కారణమడుగఁబోవుచుండ నంతలో నరవిందాదేవి యుచితాసనంబున నతనిం గూర్చుండఁబనిచి కడ

చినరేయి సోమభట్టు తెచ్చిన భూర్జరపత్ర మతనిచేతికిచ్చి చదువుకొమ్మనియెను ఆ సచివోత్తముఁడు లేఖ నామూలాగ్రముగఁ జదువుకొని విస్మితుఁడై యేమనుటకు నోటమాటరాక చదివినదే చదువుచు లేఖ దిరుగవేయుచు వెఱ్ఱివానివాలెనుండెను. అప్పుడరవిందాదేవివానినుద్దేశించి "అయ్యా! లేఖలోని వ్రాతనీయది యగునా?" యని యడిగెను. "అమ్మా! వ్రాతనాయది కాదు. ఈజాబు నెన్నఁడు నేను వ్రాయలేదు. సింధునాయకుఁడగు పరంతపుని పేరు వినుటయే కాని వాని నెన్నఁడుఁ జూడలేదు. వానికినాకు సంబంధములేదు. కాని యీ వ్రాత యచ్చముగ నావ్రాతవలెనే యున్నది. అక్షరముల పొందిక తలకట్లయొక్కయుపొల్లులయొక్కయుతీరు నేనువ్రాసినప్పుడెట్లుండునో యట్లేయున్నది. ఇదిచూడనాకు మాయగా నున్నది." అని యతఁడు బదులుచెప్పెను.

"అయ్యా! వ్రాతనీవ్రాతవలెనున్నదా? అక్షరములు పొందిక తలకట్లతీరు పొల్లులతీరు నీవ్రాతలోనున్నట్లె యున్నవా? కాని జాబు నీవు వ్రాసినది కాదా? ఇదియెవ్వరైన విశ్వసింతురని నీవు చెప్పుచుంటివా? నీపలుకులు శిశువులు నమ్మవలయు. పశువులవంటి బాలీశులు నమ్మవలయు. మతిలేనివారు నమ్మవలయు. ఇట్టిపలుకులు నమ్ముటకు మేము వెఱ్ఱివాండ్రముకాము. నీవేతండ్రివి; నీవేసోదరుఁడవు, నేవే మాకేడుగడయు, మా మామగారినాఁటనుండిమమ్ముంగొలిచియున్నవాఁడవు నని నేనెంతో విశ్వాసముంచి మాయర్థప్రాణములునీకప్పగించినందుకుఁ బదిలక్షలరూకలకు నిరువది యగ్రహారములకు నాసపడి మాగొంతు గోయదలఁచితివా? పిన్నరాజును బట్టి పగతురకప్పగింపఁ దలఁచితివిగా! ఇంతకన్నద్రోహమున్నదా? భర్తృవియోగదుఃఖమున మఱుఁగుచున్న నన్నుఁ జూడవైతివి? తండ్రిలేనిపసిపాపలని జాలిపడవైతివి? నీవు బెబ్బులులకన్నఁ దోఁడేళ్ళకన్న విషసర్పములకన్న ఘాతుకకృత్యముల సేయఁదలఁచితివే? నీవు చేయఁదలంచుచున్న ద్రోహము

నకు యమధర్మరాజు నీ నిమిత్తమై క్రొత్తనరకముల సృష్టింప వలయు గాని ప్రాతనరకములు పనికిరావు. నీ కగ్రహారములే కావలసిన పక్షమున నన్నడిగిన నే నియ్యనా? రూకల నేనియ్యనా? బిరుదుల నే నియ్యనా? దీనికై గడ్డితినవలెనే? చిరకాలము జీవించితివే. ఎందుకు నీ జీవనము? జగజ్జనులం బీడించుచు సర్పము వేయిసంవత్సరములు జీవించును. గదాధరుఁడు శూలపాణి మాధవసేనుఁడు మొదలగు నందఱనుగూడఁ జెఱచితివే. ఆహా? తేనెబూసిన కత్తి యని గడ్డి గప్పిన గొయ్యి యని యెఱుఁగక మేము మోసపోయితిమి. చాలు చాలు! చిత్రభానుఁడు పరమదుర్మార్గుఁ డంటివి. అతఁడు మహారాజు గారిని వధించెనంటివి. అతనికన్న నీయాధిక్యమేమి? నీదుశ్చరిత్ర మువలన నిఁక నెవ్వరిని నమ్మగూడదను నీతి మేమునేర్చుకొంటిమి. బ్రాహ్మణుఁడవు వయోవృద్ధుఁడవు చిరకాలపరిచితుఁడవు కావున మే మూరకుండవలసి వచ్చెఁగాని నీవెట్టిశిక్షకైనఁ బాత్రుఁడవు. నీకంతః కరణము లేదు. నీకుగుండెలు లేవు. కటికవాఁడైన నీకన్న యోగ్యుఁడు రాక్షసులైన నీకన్న యోగ్యులు చాలుఁజాలు నిఁక బొమ్ము" అని యాగ్రహావిష్టయై యరవిందాదేవి యాతని గడుంగడుఁ దూలనాడెను విక్రమసేనుఁడు "తాతగారూ! మాయమ్మ కోపోద్రేకమున మిమ్ముం దూలనాడిన దన్నమాటే కాని యీ జాబుమీఁద వ్రాయని మొదల నిట్లుండుటకుఁ గారణమేమో చెప్పఁగలరా? ఇది యసంభవము గాదా" యని యడిగెను. మణివర్మమొగము కళావిహీన మయ్యెను. చిరకాలమునుండి కడువిశ్వాసముతోఁ దానొనర్చిన సేవయంతయు బూడిదఁబోసిన పన్నీరయ్యెనని యతఁడు మనంబున విచారించెను. అయినను ధైర్యముఁ దెచ్చుకొని యిట్లనియె. "కుమారా! రాజపత్ని యైనందున నీకుం బలెనె నాకుంల్లి. తల్లి బిడ్డలను లోప మున్నప్పుడు లోపమున్నదని భావించినప్పుడు, చీవాట్లు పెట్టుట యుక్తము

నేను మహాపరాధముఁ జేసితినని నమ్మియామె బాణములవంటి మాటలతో నన్ను నొప్పించె. అందుకు నే విచారింపను. రాజ్యమీస్థితిలో నున్నప్పుడు మిక్కిలి యనుమానాస్పదమైన యిట్టిలేఖ చేయిఁజిక్కినప్పుడు మీయమ్మయే గాదు—ఎవ్వరైన నిట్లేయందురు. ఈయపరాధమును నేను జేసినపక్షమున నామె యన్నమాటలన్నిఁటికి నేనర్హుఁడనే. నేనీతప్పు చేయలేదని నాయంతరాత్మ యెఱుఁగును; భగవంతుఁడెఱుఁగును మాధవసేనుఁడెఱుఁగును. ఇది శత్రువులకల్పనము. బ్రహ్మసృష్టికిఁ బ్రతిసృష్టిఁ జేసిన విశ్వామిత్రుఁడువలె నావ్రాఁతకెవరో మిక్కిలి బుద్ధిమంతుఁడు ప్రతిసృష్టి గావించినాఁడు, లోకములో నెంతెంత నెఱజాణలైనఁ గలరు. పరమేశ్వరుఁడు సృష్టించిన యాకులంబోలిన యాకులు, పండ్లబోలినపండ్లు మవ్వపుంజిగురులుం బోలిన మవ్వపుంజిగురులుఁ జిత్రింపఁగల చిత్రకారులున్నట్లే రూపంబులం బోలినరూపంబులనిర్మించు శిల్పులున్నట్లే వ్రాతలంబోలిన వ్రాతలసృష్టింపఁగల భూలోకవిశ్వకర్మలు, కలియుగవిశ్వామిత్రులు లోకంబునం గలరు. మీకు నామీఁద నాగ్రహముబుట్టించుటే వారి సంకల్పము. అంమవారు సంపూర్ణముగాఁ గృతకృత్యులైరి. నన్ను మీరుతూలనాడినట్లు, నాయెడనమ్మిక గోలుపోయినట్లు నన్నుఁ గొలువునుండి తప్పించినట్లు వారువిందురేని వారికార్యము నెఱవేఱినట్లు వారానందింతురు. ఎట్లయినశత్రువులు సంకల్పసిద్ధులు, తల్లీ! నీవురోషావేశమున నన్నుం దూలనాడినను నేనాగ్రహింపను. నేను మనోవాక్కాయకర్మముల మీయెడ దోసమాచరింపఁదలఁతునేని కాశీమహాక్షేత్రమున గోసహస్రమును వధించినట్లె, కురుక్షేత్రాదిపుణ్యస్థలములలో బ్రాహ్మణహత్యలు చేసినట్లె, నాతల్లిం జంపినట్లె, నాతండ్రిం జంపినట్లె. ఇంతకన్న నేనేశపథంబులు చేయుదు? నన్నుగుఱించి నేఁ జెప్పుకొనుటన్యాయముకాదు. సూర్యచంద్రులుసాక్షులుగా, భూమ్యా

ది పంచభూతములు సాక్షులుగా నేనుమీయెడఁ గృతజ్ఞుఁడనై యున్నాఁడను. ఏపాపమెఱుఁగను నాచేసినమేటిసేవ బూడిదఁబోసిన పన్నీరైనదనిఁ నాబ్రతుకు హాస్యాస్పదమైనదని నేను విచారించుచున్నాఁడను. ఏలయన మితరాజభక్తి గల్గియుండుటచేత నేనావలఁ జిత్రభానునకుఁ బగతుఁడనైతిని. అతని మాయలను నురులలో మీరు చిక్కుటంచేసి మీకు నేఁ బగతుఁడనైతిని. ఏమైననేమి? మీరునన్నుఁ గొలువులో నుండి తప్పించిననుసరే దూషించిననుసరే, రాజకులమునకు నామేనఁ బ్రాణములున్నంతసేపు నేనుపకారమేకాని యపకారముసేయను. నాతలఁదెగవేసి మీరు కోటగొమ్మలకుఁ గట్టించినను నేను విచారింపను. నామరణమువలఁ గాశ్మీరరాజకుటుంబమునకు మేలగునేని నాజన్మముసార్థకమైనదని నేను సంతోషింతును. నాబుద్ధి నాశరీరము, నాకాలము, నావయస్సు మీసేవకై గడపితిని. కొనయూపిరి యున్నంతసేపు నిఁక ముందునట్లే చేయుదును. ఇట్లుసేయనైతినేని బంచమహాపాతకులు పోవుదుర్గతులకుం బోవుదును.

ఇట్లుసంపూర్ణమనోవేదనతోసంభాషించియావృద్ధసచివుఁడువారి కడ సెలవుదీసికొని పోయెను. పోవుటకు సెలవిమ్మనియడిగినప్పుడుఁ గూడ నరవిందాదేవి వానితోమాటలాడలేదు. విక్రమసేనుఁడుమాత్రము ''మంచిది. పోయిరం''డని పలికెను. మణివర్మ రాజాంతఃపురమున జరిగిన చిత్రకథయంతయు మాధవసేనునకు గదాధరాదులకుఁ దెలిపి రాజకుటుంబము చిత్రభానుఁడు త్రవ్వినగోతిలోఁబడి లేవలేకయున్నదని మిక్కిలివిచారించెను. వారును దేవి ప్రమాదమునఁ దప్పుదారింద్రొక్కినదని నొచ్చుకొనిరి.

మంత్రివెళ్ళినవెనుక విక్రమసేనుఁడు తల్లితో మణివర్మచెప్పిన సమాధానము ప్రశాంతమైన సమయమున వెండియునాలోచింపఁ దగియున్నదని చెప్పెను. ''నాయనా! మిత్రులెవ్వరో శత్రులెవ్వరో

తెలిసికొనుటకు వీలులేని యవస్థలో మనమున్నాము. నామనస్సు చెడిపోయియున్నది. అది చక్కఁబడినవెనుక సల్లజేయుదము" అని యుత్తరము చెప్పెను.

పండ్రెండవ ప్రకరణము

చిత్రభానుఁడు కర్పూరమంజరికి వజ్రపాణిపై ననురాగము కలుగునట్లు జేయవలసినదని తనభార్యతోడను మల్లికతోడను తన వాక్పటిమమంతయు వినియోగించి చెప్పెనుగదా! తనయాశలన్నియు దానిమీఁదనె నిలిచియుండుటచే నప్పని యెట్లు పరిణమించునో యని మనసులో నింతింతయనరాని బెంగబెట్టుకొని యుండెను. "బాలికతో మాటలాడితివా? మాటలాడితివా?" యని యిందుమణిఁ బ్రత్యహముం దొందరపెట్టుచుండెను. మల్లిక కంటఁబడినప్పుడెల్ల "బిడ్డయేమన్నది? చెప్పితివా?" యని యడుగుచుండును. మూఁడునాలుగు దినములు గడచినతరువాత నొకనాఁ డిందుమణి బిడ్డఁబిలచి భర్త తనతోఁ జెప్పినవిషయ మంతయు నామె కెఱిఁగించెను. అదివిని కర్పూర మంజరి యనిష్టమును సూచించు చిఱునవ్వు నవ్వి యూరకుండెను. భావజ్ఞురాలయిన తల్లి యక్కన్యామతల్లి యుల్లము దానివలనఁ దెల్లముగనెఱిఁగి వల్లభునితో నావృత్తాంతముఁ జెప్పెను. అంత నతఁడు మల్లికను ద్వారపెట్టి వేధించుటచే నామె కర్పూరమంజరితో మాట లాడి యామె భావమును జిత్రభానుని కిట్లెఱిఁగించెను. "అయ్యా! మీబాలిక మీసందేశము నాముఖమునవిని నన్ను మొగము వాచు నట్లు జీవాట్లు పెట్టినది. బుద్ధిలేదాయని యడిగినది. ఇట్టిసందేశములు తేవలదని నొక్కిచెప్పినది. కావున దేవరవారె స్వయముగా నామె నడుగుట సమంజసము. మీయెడఁగలభక్తినైన భయమునైన నామె

మీ యుపదేశమును మన్నించి మీకోర్కెఁ దీర్పవచ్చును. ఇది మాకు సాధ్యముగాదు. ఆమె కెవ్వరియెడ గౌరవమున్నదో వారి ప్రసంగము చేయవలయుఁగాని మిక్కిలి చనువుగల మాబోంట్లు చేయఁ గూడదు. అనవుడు చిత్రభానుఁడు తలయూఁచి "సరే! ఆమె యభిమతము నేనే కనుఁగొనియెద" నని యారేయి భోజనానంతరమున బాలికయున్న గదిలోనికిఁబోయి సముచితాసనమునఁ గూర్చుండి "అమ్మాయి! నీతో నే నొక్కమాట చెప్పఁదలఁచి వచ్చితి స్తిమితమనస్కవై వినుము" అని చెప్పెను.

ఎన్నఁడుఁ దన గదిలోనికిరాని తండ్రి యారేయి తనకడకు వచ్చుటచేత నతఁడు నా వివాహ విషయమునుగూర్చి ప్రసంగింపఁ దలఁచి యరుదెంచి యుండునని యామె గ్రహించి యతనికిఁ జెప్పఁదగిన సమాధానము ముందుగా నూహించుకొని ధైర్యముతో నెదుట మంచముమీఁద గూర్చుండెను. అప్పుడు తండ్రికి బిడ్డకు నీ క్రింది విధమున సంభాషణము జరిగెను.

చిత్రభాను—కుమారీ! నేనును నీతల్లియు మున్ను జేసిన పూజలఫలముగా నోచిననోములపంటగా దేవతా వరప్రసాదమువలె మా యదృష్టవశమున లేక లేక యొక్కకుమారితవు జన్మించితివి. నాకు నీ వొక కన్ను. నీతమ్ముఁడు విజయసేనుఁ డొక కన్ను. అందు నీవే నా మనోరథంబవు. నా కనుల చందమామవు. నా బహిఃప్రాణంబవు. అట్లగుటచే నేను నిన్నొక్క కోరిక గోరఁదలంచి వచ్చితిని. అది నీవు సఫలముచేసెదవో బహుదుఃఖపరంపరచేత నవసియున్న నామనస్సు చెడిపోవునట్లు నిరాకరించెదవో యెఱుఁగ. ఏమనియెదవు?

కర్పూ—తండ్రీ! అదివినకుండ నేనేమియుత్తరము చెప్పగలను?

చిత్రభా—బిడ్డా! నీవది విన్నదే. నీతల్లివలన వింటివి. మల్లికవలన వింటివి. అయినను నానోటఁగూడవిని సమాధానముఁజెప్పు. నీకు

వివాహయోగ్యకాలము ప్రాప్తించినది. తగినవరుని నన్వేషింపవలసిన భారము నాపైనున్నది. బిడ్డలకు మాతాపితలకన్న హితార్థులు క్షేమంకరులు నాప్తులు ప్రపంచమున మఱియొకరు లేరుగదా? అందుచేత మేమెల్లవిధముల నీమేలు నీసుఖముఁగోరి వరనిర్ణయము సేయుదుము. స్వయంవరమనుపద్ధతి రాచకొలమునన్నదిగాని దానివలనఁ గొన్ని యరిష్టములుండుటచే నది నాకిష్టములేదు. బాలికలు నవయౌవనప్రేరితలై పౌర్వాపర్యములు విచారింపక భావికాలకష్టముల నెన్నలేక "కన్యావరయతేరూప" మ్మనునట్లు కేవలము చక్కఁదనమునే చూచుకొని యే దరిద్రునో గుణహీనునో నాస్తికునో కులభ్రష్టునో విద్యాగంధశూన్యునో వరింతురు. స్వయంవరమునఁబ్రమాదమున కెన్నో యవకాశము లున్నవి. కావున దానిని నే నంగీకరింపఁ అందుచే మేముచేసిన, నిర్ణయమునే నీవు తలయొగ్గి యనుసరింపవలయునని కోరుచున్నాను. "మాతృదేవోభవ పితృదేవోభవ" యని వేదము చెప్పుచున్నది. మాతాపితలు బిడ్డల పాలిదైవతములు. వారి మాట యవశ్యము గ్రాహ్యము అట్లగుటంజేసి నీవు నామాట ననుసరింతువని నమ్మియుంటి. విశేషించి నీవు తక్కిన రాజకన్యలవంటి దానవు కావు. కావ్యనాటకాదులేగాక శాస్త్రములఁగూడ నభ్యసించిన దానవు. గుణగ్రహణపరాయణవు. సంగీతసాహిత్య ధౌరంధర్యమున నీకు సాటియగుకన్య నేఁటికాలమున లేదు. నాబిడ్డ వగుటచే నేను నిన్నుఁ బొగడఁగూడదుగాని నీవిద్యకు వినయము వన్నెపెట్టుచున్నది. ఈ నాటికన్యలవలె గర్వము పెంకెతనము నీకడనున్న పక్షమున నేనట్లు చెప్పుటకు రాకనేపోదును.

కర్పూర—తండ్రీ! స్వయంవరమునఁ బ్రమాదములున్నవనుట నిజమేకాని దమయంతి పొరబడినదా? రుక్మిణిపొరబడినదా? తల్లిదండ్రులకిష్టములేని పెండ్లికొడుకును జేపట్టినను సుభద్రపొరబడినదా!

విద్యావంతులైన కన్యకలు మనసులో నెంత వలపున్నను నెంత మోహపరవశులైనను స్వయంవర సమయమునఁ దమకులగౌరవమును వరుని యాభిజాత్యమును గుణసంపదను జూచుకొనక పోరు.

చిత్రభా—బిడ్డా! అందఱు కన్యకలు దమయంతివంటివా రగుదురా? అందఱు రుక్మిణివంటివా రగుదురా? ఎల్లరు సుభద్రలగుదురా? అవి పురాణములలోని గాథలు. అదియునుంగాక కవిచాతుర్యమందు మెండుగా నుండును. కవులు గోరంతలు కొండంతలు జేసి వర్ణింతురు. ఆమాట నీవే యెఱుంగుదువు. దాని కేమిగాని నీ వెవ్వరి కొఱకైన మేలుపడితివేమో చెప్పుము. నీవలపునకే రాజకుమారుఁ డైన గుఱియైనచో నది నాకెఱింగింపుము. అతఁడు స్వీకరింపఁ దగిన వాఁడగునో కాదో చెప్పెద.

కర్పూ—ఆ విషయమున నేనిప్పుడేమియుం జెప్పఁజాల. (అని సిగ్గునఁ దలవంచినది.)

చిత్ర—అమ్మా! మాళవరాజనందనుఁడగు మకరందుఁడు నీకు నచ్చినాఁడని కర్ణాకర్ణికగ వింటిని. అయ్యది నిజమగునో కాదో నీవు నాకెఱిఁగింపుము? నాకడ సిగ్గుపడకుము. నీమనోభావము స్పష్టముగా దెల్పుము. పెఱవాఁడనుగాను. కన్నతండ్రిని. నీభావము దెలుపుదువేని నేనందున్న గుణదోషము లుగ్గడించెద.

కర్పూ—భావమున కేమిగాని యక్కుమారుని యందుఁగల గుణదోషముల నుగ్గడింపుము.

చిత్ర—బిడ్డా! గుణదోషము లుగ్గడింపవలసినదని నన్నడుగుచుంటివా? నీవు విద్యావతివి. గుణగ్రహణశక్తికలదు. అనఁగూడదు గాని నాకన్న నెక్కువ చదువుకొంటివి. నీవు గ్రహింపలేని గుణదోషముల నేనెన్నఁగలనా? అయినం దండ్రినగుటచేతను బెద్దతికము నా మీఁదఁ బెట్టుటచేతను జెప్పెద వినుము—మాళవేంద్రుఁడగు

సుదర్శనుఁడు బౌద్ధుఁడు. మనము క్షత్రియులము. మనము వర్ణాశ్రమ ధర్మములఁ బాటింతుము. వారికవి లేవు. మనకు యజ్ఞములు మొదలగు క్రతువులు కలవు. శ్రాద్ధములు మొదలగు పితృకర్మలు గలవు. సంధ్యావందనాది నిత్యకర్మలు కలవు. ఇవి వారికి లేవు. వారు వేదమును ప్రమాణముగా గ్రహింపరు. శాస్త్రములు విశ్వసింపరు. పురాణములు కల్పిత కథలందురు. ఆత్మ లేదందురు. ఉత్తరలోకఫలమును నమ్మరు. జగన్నిర్మాణ ధురీణుఁడగు చతుర్ముఖుని కన్నను, విశ్వరక్షణ కళాప్రవీణుఁ డగు నారాయణుని కన్నను జగత్ప్రళయకారణుఁడయిన శివుని కన్నను, శాక్యకులుఁడైన గౌతమబుద్ధుఁడె సర్వవిధముల నధికుఁడని వారు విశ్వసింతురు. ఇన్నిటికన్న గష్టమైన దింకొకటి కలదు. వారు పరమేశ్వరుఁడు లేఁడందురు. అందుచే నాస్తికులు. ఇట్టి యపవిత్రమగు ధర్మ ముపదేశించి లోకులను ధర్మభ్రష్టులను బరమపతితులను జేసిన యాఁగౌతమబుద్ధునకుఁ నధమగతులే గాని యుత్తమగతు లుండవుగదా !

కర్పూర—తండ్రీ! బౌద్ధమసిద్ధాంతములు నీకు సరిపడక పోయిన బోవుగాక! నీచెప్పిన దోసములు బౌద్ధమతస్థులకడ నుండిన నుండుఁగాక! కాని, లోకోత్తర చరిత్రుఁడును, బరమపవిత్రుఁడును, సర్వదీనజనమిత్రుఁడును నయిన సిద్ధార్థుని నీనట్లు దూషించుట ధర్మము గాదు. ఆ మహాత్మునికన్న నుత్తముఁడు నమ్మహనీయునికన్న మాననీయుఁడు—నా దేవునికన్న మహానుభావుఁడు జగంబున మఱియొకఁడు గలఁడా? ఆ సిద్ధాంతములు నీవు చదువలేదు. వైదికధర్మనిరతు లగు పండితులవలన నిజములు కొన్ని యబద్ధములు కొన్ని విని సౌగత ధర్మములు నింద్యములని దురభిప్రాయముఁ గలిగియుంటివి. అది వట్టి పొరబాటు. చిత్తగింపుము. అమ్మహాత్ముఁడు పవిత్రరాజవంశమున జన్మించి మహీమండలమేలుట కర్హుఁడై యుండియుఁ దండ్రి కొక్కఁడె

కొడుకయ్యు, నమితలావణ్యతారుణ్య సమేతయగు భార్యం గూడి యుండియు, సకలైశ్వర్యసమృద్ధిఁ గల్గియుండియు లోకము పాప భూయిష్టమై యున్నదని విచారించి దుర్గతిపాలగుచున్న మానవ లోకము నుద్ధరింపసమకట్టి యాలుబిడ్డలను, దల్లిదండ్రులను, బంధు మిత్రులను భాగ్యభోగ్యములను విసర్జించి చీనిచీనాంబరములకు మాఱుగాఁ గాషాయవస్త్రములఁ దాల్చి, ముత్యాలహారములకు మాఱుగా రుద్రాక్షమాలలు ధరించి శిరమున రత్నమకుటమునకు మాఱుగా జటాజూటమువహించి, గమగమతావుల నీను కలపంబు లకు మాఱు బూదిఁబూసికొని, యుద్యానవనములు రోసి వనముల జొసి, మేడలు విడిచి చెట్లనీడల విడిసి, హిరణ్మయపాత్రముల త్యజించి మృణ్మయపాత్రముల భుజించి, పరమనిష్ఠాగరిష్ఠుఁడై తపంబుసేసి, మేను శుష్కింపఁజేసి యింద్రియంబుల గెల్చి, జీవితముయొక్క పర మార్థముం గనిపెట్టెను. ఆమహానీయుఁడు మధ్యమలోకమున కలం కారము. క్షత్రియుఁడగుటచే రాచకొలమాయనవలన వన్నె కెక్కెను. మానవలోక మాయనవలనఁ బవిత్రమైనది. దయాదాక్షి ణ్యములే యా మహాత్మునిమతమునకు మూలరాళ్ళు. ఆశాక్య సింహుఁడు మూర్తీభవించిన భూతదయయని చెప్పుట యతిశయోక్తి గాదు. భూతదయ యాతని కళేబరముతో నాఁడు దగ్ధమైపోయిన దనుట పొగడ్తగాదు. శాంత మామహానీయునితో నాఁడు చితి మీఁద బూడిదయయ్యెనని పలుకుట కవిచాతుర్యముగాదు. ఆయన బోధామృత మాస్వాదించినవారు ధన్యులు. ఆయనం జూచిన వారు కృతకృత్యులు. ఆయన మతము స్వీకరించినవారు పవిత్రులు. ఆయనవలన మానవులు పతితులు గాలేదు. పతితులు పావను లయిరి. దుర్జనులు సజ్జనులైరి. అపవిత్రులు పవిత్రులైరి. ఆ భగ వానుఁడు దేవుఁడున్నాఁడనిగాని లేఁడనిగాని చెప్పలేదు. అంత మాత్రముచేత నతఁడు నాస్తికుఁడుగాఁడు. అతనిమతము నాస్తిక

మతముగాదు. అతఁ డాస్తికులలో నగ్రగణ్యుఁ డని చెప్పవచ్చును. ఆస్తికులమని విఱ్ఱవీగు మానవులలో ననేకులు సత్య నాస్తికులు, ధర్మ నాస్తికులు, దయా నాస్తికులు, భక్తి నాస్తికులు, కలరు. ఆ నాస్తికులలో నెందఱో యాస్తికులు గలరు. భూతదయాజితేంద్రియ త్వమునను రెండును దన్మతమునఁ బరమసిద్ధాంతములు. ఆమత మవలంబించినవారు జీవహింస చేయరు. "ఆత్మవత్సర్వభూతాని" యను ధర్మము వారియందు స్థిరమైయున్నది. జీవహింసా భయముననే వారు యజ్ఞములు మానిరి.

చిత్ర—అమ్మాయి! బౌద్ధమతసిద్ధాంతములు నీతలకెక్కినవే. అవి యెక్కడ నేర్చితివి? ఆమతమన్న నీకింతగౌరవము కలుగుటకుఁ గారణమేమి? గురివెందగింజలు నిప్పులని, గాజుపూసలు జాతిరత్నములని, యెఱ్ఱనిపెంకులు కెంపులని నీవు భ్రమించుచుంటివి.

కరుణా—తండ్రీ! నేను భ్రమించుటలేదు. నేను విదర్భలో నున్నప్పుడు మైత్రేయియను బౌద్ధయోగిని తఱుచు రాజాంతఃపురమునకు వచ్చుచు బోవుచు శుద్ధాంత కాంతలకు నప్పు డప్పుడు సుగత స్వాముల ధర్మముల నుపదేశించుచుండెను. అవి నేను మిక్కిలి శ్రద్ధగ వింటిని. పిమ్మట నామె పాళియనుభాష నాకుపదేశింప నందులో నున్న దమ్మపదము మొదలగు నుత్కృష్ట గ్రంథములఁ జదివితిని. అదికారణముగా నాకు మహనీయుఁడైన బుద్ధదేవునిమీఁదను వాని మతముమీఁదను నమితగౌరవము గలిగినది.

చిత్ర—సహవాసదోషమున సుశీలురు దుశ్శీలురగుట యాశ్చర్యముగాదు. నీళ్ళకు వస్త్రములకు వాయువునకు వస్తుసహవాసములనుబట్టి సుగంధ దుర్గంధములు గలుగునట్లే మనుష్యులకుఁ గూడ దుర్జన సజ్జన సహవాసమువల్ల దురభిప్రాయ సదభిప్రాయములు పట్టువడును. ఒకవేళ బౌద్ధమతములో నుత్కృష్ట ధర్మము లున్నను బౌద్ధులందఱు సుగుణసంపన్ను లగుదురా?

కర్పూ—తంత్రీ! అందఱు సుగుణవంతు లుండరు. కాని మానవేంద్రుఁ డగు సుదర్శనుఁడు లాతివారితోఁ బోల్పఁ దగినవాఁడు గాఁడు. ఆయన గుణరత్నాకరుఁడు. అతఁడు తనదేశమున జీవహింస మాన్పించెను. ఆయన నిష్కళంక చరిత్రుఁడు. పరమ కృపాళుఁడు. ప్రజలం దన బిడ్డలుగాఁ జూచును. ఆత్మసుఖముకంటెఁ బ్రజాసుఖ మెక్కువగఁ జూచును. ఎక్కువ పన్నులుగట్టి ప్రజలబాధింపఁడు. బౌద్ధమతస్థులమీఁదఁ బక్షపాతము, వైదికమతస్థులమీఁద ద్వేషము లేదు. అందఱ సమానముగఁ జూచును. ఆయన కొడుకు మకరందుఁడు పితృమార్గానువర్తి. తల్లిదండ్రులకు విధేయుఁడు. ప్రజాబాంధవుఁడు. తండ్రివలెనే యతఁడుగూడ రాజ్యమందలి ప్రజలలోఁ దండ్రి లేని వారికిఁ దండ్రి. సోదరులు లేనివారికి సోదరుఁడు. మిత్రులు లేనివారికి మిత్రుఁడు. బిడ్డలు లేనివారికి బిడ్డ. ఈవిధముగా వారు సర్వజన శ్లాఘనీయులై, కృపాసముద్రులై, ధర్మతత్పరులై, రాజ్యపాలనము సేయుచున్నారు.

చిత్ర—ధర్మతత్పరులై పరిపాలించుట నీ వెట్లెఱింగితివి?

కర్పూ—మాళవదేశమున నేనున్న కాలములో వారి ఔదార్యాదిగుణములు దెలిసికొనుట కనేకావకాశములు గలిగినవి.

చిత్ర—అంతఃపురమునందున్న విదేశాంగనకు నీకు లోకము నందలి వ్యవహారము, రాజుల పరిపాలనాపద్ధతులు దెలిసికొనుట కవ కాశము గలిగినదా? ఎంతో కాలము దేశమందుండి నల్గడలు దిరిగి జనులతోఁ గలసిమెలసి యున్నవారికే తెలియుట కష్టముగదా నీ కవలీలగా దెలిసెనని నీ వనినంతమాత్రమున నమ్మవచ్చునా? ఏదో యభిమానమున నిట్లనుచుంటివి!

కర్పూ—తంత్రీ! నాపలికినది సత్యముగాని యభిమాన ప్రేరితమైన మాటగాదు! శత్రువులయందైనను గుణమున్నచో గ్రహించుట సత్పురుష లక్షణము.

చిత్ర—గుణమున్న గ్రహింపవచ్చును. లేనిచో గ్రహించుటెట్లు? ప్రస్తుతాంశము విను! మకరందునిమీఁద నీవువలపునిలిపితివో లేదో నీమాటలచే స్పష్టముగాఁ దేటపడలేదు. కాని, వానియెడనీకుఁ గల యభిమానముంబట్టి నీకాతనిపైఁ గూరిమిగలదని నేను నిశ్చయింపవలసివచ్చినది. మనము వైదికాచారసంపన్నులము. వారు వేదబాహ్యులు కర్మరహితులు, మనకువారికింగలయిక యపేక్షణీయముగాదు. నీవు దేవాలయమున కరుగుదువు; వారు దేవాలయములను ద్రోయుదురు. మనము శివకేశవులను బరమాత్ములుగా నెంతుము; వారు మనుష్యమాత్రుఁడైన బుద్ధునే యారాధింతురు. నడవడులలో నాచారములలో నభిప్రాయములలో మనకువారికి నమితభేదము గలదు. అట్టివారి మనసులెట్లు కలియును? పొత్తులెట్లు కలుగును? సామరస్యమెట్లు కుదురును?

కర్పూర—తండ్రీ! అన్నింటికి మనస్సుప్రధానము. మనస్సులో నిష్టమున్న యెడల నన్నిఁట సామరస్యము గుదురును. దంపతులు భిన్నమతస్థులయినను దాంపత్యమున భంగముండదు. భర్తశైవుఁడు, భార్యవైష్ణవియైన దాంపత్యములున్నవి. మతములో నెవరిష్టము వారిది. ఎవరియిచ్చవచ్చినట్లు వారు దేవతల నారాధించుకొనవచ్చును. అంతమాత్రముచేతఁ బరస్పరమైత్రికి భంగముండదు. అరమర లేని కూరములునిలుపుటకు మనమడ్డమురాదు.

చిత్ర—బిడ్డా! నీవు వెఱ్ఱిపడుచున్నావు? అట్టిదంపతులకెన్నఁడుఁ గాపురము సరిగాఁబొసగదు. అయ్యాదాసునకుఁబెట్టు నమ్మజంగమునకుఁబెట్టు నన్నసామెత నిజమగును. నీవుజక్కఁదనమొక్కటే మెచ్చి యాతని వరింపఁదలచు చుంటివి. వరునియందుఁ జూడఁదగినలక్షణమదియొక్కటియే గాదు. త్రాఁచుపాము తలలో వెలలేని మణియుండును. అదిచూపులకెంతో చక్కఁగానుండును. ఈగుణములంబట్టి

దానినెట్టివెంగలిమైన మెడలో హారముగా వైచుకొనునే? దానిం బ్రక్కలోc బెట్టుకొని సుఖింకొనునే? మెఱయుచున్నదంతయు బంగారమనుకొనవద్దు. కస్తూరిపంకముc బూసికొన వచ్చునుగాని బురదc బూసికొనc గూడదు.

కర్పూ—అయ్యో! చక్కదనమ్ముక్కటేమెచ్చి కార్యనిశ్చయము చేసికొనుటలేదు. మెడc దాల్చునది కుసుమమాలగాని కోడె త్రాcచుగాదు. మేనc బూసికొనునది మృగనాభిగాని, మొత్తనిబురద గాదు.

చిత్ర—బిడ్డా! చదువుకొన్నదానవు గావున వీరుcడు బాణమునకు బాణము వైచినట్లు మాటకు మాట సమయోచితముగc జెప్పcగలవు. యుక్తులనటుంచి నామాటవినుము. మకరందునిపై మక్కువ మానుము.

కర్పూ—అట్లయిన నెవ్వని పాణిగ్రహణము సేయుమందువు?

చిత్ర—భళి! ఇప్పుడు దారికివచ్చితివి. చెప్పుచున్నాను వినుము—ఈపట్టణమున దండపాణి వజ్రపాణియని యిరువురన్నదమ్ములున్నారు. వారుత్తమక్షత్రియులు; చంద్రవంశజులు, మనము పాండవసంతతి; వారు యాదవసంతతి, మనకు వారికిc బూర్వకాలమునుండియు నిచ్చుకోలు బుచ్చుకోలుగలవు. వారిద్దరు సేనాధిపతులు, అసహాయశూరులు, నిర్వక్రపరాక్రములు, అందువజ్రపాణి భుజాబలమున భీమసేనుcడు, ధనుర్విద్యయందు సవ్యసాచి, సౌజన్యమునందు సహదేవుcడు, శాంతమునందు ధర్మరాజే.

కర్పూ—చక్కదనమందో?

చిత్ర—పాడుచక్కదనము. వరునకుc జక్కదనమే ప్రధానమా? అది యప్రధానమని నాయభిప్రాయము. అదిగాక యెవరి చక్కదనము వారికుండును. కన్ను ముక్కు చెవి నోరు కాలుసేతులు

వంకర లేక సరిగానుండెనా యెట్టినదైనఁ జక్కగానుండెను. గుణము ప్రధానముగాని చక్కఁదనమెందుకు? తురాయిపువ్వు కట్టెఱ్ఱగా నుండును అందములేదు. చందము లేదు. వాసన లేదు. అతఁడు నల్లగానుండును. నల్లగా నున్నంత మాత్రమున యువతీదూష్యుఁడగునా? అట్లయిన నల్లనివారికిఁ బెండ్లి కాఁ గూడదా? కస్తూరి నల్లనై సువాసనలచేత మాననీయముగాదా? కోయిలనల్లనై మనోజ్ఞ ధ్వనులచే జగద్వంద్యముగాదా? ఇంద్రనీలము నిగనిగ కాంతుల నీనుచు నవరత్నములలో నొకటి కాలేదా? భగవంతుండగు పరమేశ్వరుఁడు స్ఫటికమువలెఁ దెల్లని మేను గలవాఁడయ్యు నల్లనిదానిని పార్వతిని బెండ్లియాడలేదా? శ్రీమహాలక్ష్మి బంగరుబొమ్మవలె నుండియు నీలమేఘశ్యాముఁడైన నారాయణుని వరింపలేదా? నీలవర్ణము హరిహరులకు భార్యలతోడి కూటములు చెఱిపెనా? పాంచాలి నల్లనిది; పాండవులు చక్కనివారు. ఇట్లెన్నో యుదాహరణము లున్నవి. కావున నల్లనివాఁడని రోయక వజ్రపాణిం జేపట్టుము. అతఁడు వేయి కన్నులు లేని వజ్రపాణి. రక్కసులచేఁ బెక్కుసారులు కయ్యముల నోడిపోని వజ్రపాణి. మునిశాపంబును జెందని వజ్రపాణి. మధ్యమలోకమందున్న వజ్రపాణి.

కర్పూ—రాజ్యములేని వజ్రపాణి. పూజ్యతలేని వజ్రపాణి యని చెప్పుము.

చిత్ర—అమ్మా! ఆలాగు నిరసింపఁగూడదు. అందఱకు రాజ్యములుండునా? శ్రీకృష్ణున కేమిరాజ్యము గలదు? రుక్మిణీ సత్యభామ మొదలగు కాంతలెంతమంది గుణములకువలచి యాతనిఁ జెట్టఁబట్టలేదు.

కర్పూ—ఆయనకిదివఱ కొక భార్యయున్నది గదా?

చిత్ర—ఉండిననేమి? చిన్నదానవయ్యు నీవె పెద్దభార్య వగుదువు. నిన్నుఁ జేపట్టినపిదప నామె గౌరవము కడముట్టును. ఆమె నీకు దాసియై యుండును.

దానినెట్టివెంగలియైన మెడలో హారముగా వైచుకొనునే? దానింబ్రక్కలోఁ బెట్టుకొని సాదుకొనునే? మెఱయుచున్నదంతయు బంగారమనుకొనవద్దు. కస్తూరీపంకముఁబూసికొన వచ్చునుగాని బురదఁబూసికొనఁ గూడదు.

కర్పూ—అయ్యా! చక్కఁదన మొక్కటేమెచ్చి కార్యనిశ్చయము చేసికొనుటలేదు. మెడఁదాల్చునది కుసుమమాలగాని కోడెత్రాఁచుగాదు. మేనఁ బూసికొనునది మృగనాభిగాని, మొత్తనిబురద గాదు.

చిత్ర—బిడ్డా! చదువుకొన్నదానవు గావున వీరుఁడు బాణమునకుబాణము వైచినట్లు మాటకు మాట సమయోచితముగఁజెప్పఁగలవు. యుక్తులనటుంచి నామాటవినుము. మకరందునిపై మక్కువమానుము.

కర్పూ—అట్లయిన నెవ్వని పాణిగ్రహణము సేయుమందువు?

చిత్ర—భళి! ఇప్పుడు దారికివచ్చితివి. చెప్పుచున్నాను వినుము— ఈపట్టణమున దండపాణి వజ్రపాణియని యిరువురన్నదమ్ములున్నారు. వారుత్తమక్షత్రియులు; చంద్రవంశజులు, మనము పాండవసంతతి; వారు యాదవసంతతి, మనకువారికిఁ బూర్వకాలమునుండియు నిచ్చుకోలు బుచ్చుకోలుగలవు. వారిద్దరు సేనాధిపతులు, అసహాయశూరులు, నిర్వక్రపరాక్రములు, అందువజ్రపాణి భుజాబలమున భీమసేనుఁడు, ధనుర్విద్యయందు సవ్యసాచి, సౌజన్యమునందు సహదేవుఁడు, శాంతమునందు ధర్మరాజే.

కర్పూ—చక్కఁదనమందో?

చిత్ర—పాడుచక్కఁదనము. వరునకుఁ జక్కఁదనమే ప్రధానమా? అది యప్రధానమని నాయభిప్రాయము. అదిగాక యెవరి చక్కఁదనము వారికుండును. కన్ను ముక్కు చెవి నోరు కాలుసేతులు

వంకర లేక సరిగా నుండెనా మెట్టినదుఁ డైనఁ జక్కఁగా నుండెను. గుణము ప్రధానముగాని చక్కఁదన మెందుకు? తురాయిపువ్వు కట్టెఱ్ఱగా నుండును అందము లేదు. చందము లేదు. వాసన లేదు. అతఁడు నల్లగా నుండును. నల్లగా నున్నంత మాత్రమున యువతీదూష్యుఁ డగునా? అట్లయిన నల్లనివారికిఁ బెండ్లి కాఁ గూడదా? కస్తూరి నల్లనై సువాసనలచేత మాననీయముగాదా? కోయిల నల్లనై మనోజ్ఞ ధ్వనులచే జగద్వంద్యముగాదా? ఇంద్రనీలము నిగనిగ కాంతుల నీనుచు నవరత్నములలో నొకటి కాలేదా? భగవంతుండగు పరమేశ్వరుఁడు స్ఫటికమువలెఁ దెల్లనిమేను గలవాఁడయ్యు నల్లనిదానిని పార్వతిని బెండ్లియాడ లేదా? శ్రీమహాలక్ష్మి బంగరుబొమ్మవలె నుండియు నీలమేఘశ్యాముఁడైన నారాయణుని వరింపలేదా? నీలవర్ణము హరిహరులకు భార్యలతోడి కూటములు చెడిపెనా? పాంచాలి నల్లనిది; పాండవులు చక్కనివారు. ఇట్లెన్నో యుదాహరణము లున్నవి. కావున నల్లనివాఁడని రోయక వజ్రపాణిం జేపట్టుము. అతఁడు వేయి కన్నులు లేని వజ్రపాణి. రక్కసులచేఁ బెక్కుసారులు కయ్యముల నోడిపోని వజ్రపాణి. మునిశాపంబును జెందని వజ్రపాణి. మధ్యమలోకమందున్న వజ్రపాణి.

కర్పూ—రాజ్యము లేని వజ్రపాణి. పూజ్యత లేని వజ్రపాణి యని చెప్పుము.

చిత్ర—అమ్మా! ఆలాగు నిరసింపఁగూడదు. అందఱకు రాజ్యములుండునా? శ్రీకృష్ణున కేమి రాజ్యము గలదు? రుక్మిణీ సత్యభామ మొదలగు కాంతలెంతమంది గుణములకువలచి యాతనిఁ జెట్టఁబట్టలేదు.

కర్పూ—ఆయనకిదివఱ కొక భార్యయున్నది గదా?

చిత్ర—ఉండిననేమి? చిన్నదానవయ్యు నీవె పెద్దభార్య వగుదువు. నిన్నుఁ జేపట్టినపిదప నామె గౌరవము కడముట్టును. ఆమె నీకు దాసియై యుండును.

కర్పూ—హరిహరీ! తండ్రీ! ఆయన చెట్టబట్టి యెంతో సుఖపడవలెననివచ్చి సంతానవతియై మహాపతివ్రతయై యూతని సేవించిన యిల్లాలిని నేను దాసిగా నేలుదునా? అట్టిపాడుపని యెన్నఁడు నేఁ జేయను. నాదురదృష్టముచేత నొకవేళ నాతని చెట్టఁ బట్టుట సంభవించునేని నేనాయనకు రెండవపత్నినై యామెకే నేను దాసినై యూడిగములు సేయుదునుగాని యాసాధ్వి మనస్సునకు రవంతయేని నొప్పిగలిగింపను సుమీ! నీవు లక్ష్మీదేవిని శంకరునిఁ బ్రసంగవశమునఁ జేర్కొంటివి. నారాయణుని యందున్న గుణములు నీవజ్రపాణి యందున్నవా? దేవతలసామ్యము పనికిరాదు. దేనికయిన మనస్సు ప్రధానము. మహారాజునకు మందిరములు కావలెను. విరాగికి విపినములు గావలెను. మనసునకు నచ్చినవాఁడె మన్మథుఁడు; నచ్చనివాఁడు నాగుఁబాము.

చిత్ర—ఇంతకు వజ్రపాణి నీకు నచ్చెనా. లేదా?

కర్పూ—తండ్రీ! అడుగుచుంటివి గాన జెప్పెద వినుము. అతనిచేయి బట్టుటకంటె శాశ్వతబ్రహ్మచర్యమున నుంట మేలు.

చిత్ర—బిడ్డా! నీవాతని చేపట్టుటవలన మనకు గొప్ప యుపకార మగును. అదియేదందువేని—వజ్రపాణియు వానియన్నయగు దండపాణియు మనపక్షమున నున్నారు. నీవు వజ్రపాణిని జేపట్టుదువేని వారు హేమచంద్రుని వంశమును సింహాసనమునుండి కూలఁద్రోసి కాశ్మీరరాజ్యమునకు నన్నభిషిక్తుఁ జేయుదురు. నేను పెద్దవాఁడను. నాలుగైదేండ్లు రాజ్యముచేసి చనిపోదును. నా యనంతరమున నీతమ్ముఁడు విజయసేనుఁడు రా జగును.

కర్పూ—(చెవులుమూసికొని) హరి హరీ! ఎంతమాట! పవిత్రమసేనుని రాజ్యభ్రష్టుం జేయుదురా? అందుకని నేను వజ్రపాణి

సుదర్శనుఁడు బౌద్ధుఁడు. మనము క్షత్రియులము. మనము వర్ణాశ్రమ ధర్మములఁ బాటింతుము. వారికవి లేవు. మనకు యజ్ఞములు మొదలగు క్రతువులు కలవు. శ్రాద్ధములు మొదలగు పితృకర్మలు గలవు. సంధ్యావందనాది నిత్యకర్మలు కలవు. ఇవి వారికి లేవు. వారు వేదమును బ్రమాణముగా గ్రహింపరు. శాస్త్రములు విశ్వసింపరు. పురాణములు కల్పిత కథలందురు. ఆత్మ లేదందురు. ఉత్తరలోకఫలమును నమ్మరు. జగన్నిర్మాణ ధురీణుఁడగు చతుర్ముఖుని కన్నను, విశ్వరక్షణ కళాప్రవీణుఁ డగు నారాయణుని కన్నను జగత్ప్రళయకారణుఁడయిన శివుని కన్నను, శాక్యకులుఁడైన గౌతమబుద్ధుఁడె సర్వవిధముల నధికుఁడని వారు విశ్వసింతురు. ఇన్నిటికన్న గష్టమైన దింకొకటికలదు. వారు పరమేశ్వరుఁడు లేఁడందురు. అందుచే నాస్తికులు. ఇట్టి యపవిత్రమగు ధర్మ ముపదేశించి లోకులను ధర్మభ్రష్టులను బరమపతితులను జేసిన యాగౌతమబుద్ధునకుఁ నధమగతులే గాని యుత్తమగతు లుండవుగదా!

కర్పూర—తండ్రీ! బౌద్ధమసిద్ధాంతములు నీకు సరిపడక పోయిన బోవుగాక! నీచెప్పిన దోసములు బౌద్ధమతస్థులకడ నుండిన నుండుఁగాక! కాని, లోకోత్తర చరిత్రుఁడును, బరమపవిత్రుఁడును, సర్వదీనజనమిత్రుఁడును నయిన సిద్ధార్థుని నీనట్లు దూషించుట ధర్మము గాదు. ఆ మహాత్మునికన్న నుత్తముఁడు నమ్మహనీయునికన్న మాననీయుఁడు—నా దేవునికన్న మహానుభావుఁడు జగంబున మఱియొకఁడు గలఁడా? ఆ సిద్ధాంతములు నీవు చదువలేదు. వైదికధర్మనిరతు లగు పండితులవలన నిజములు కొన్ని యబద్ధములు కొన్ని విని సౌగత ధర్మములు నింద్యములని యభిప్రాయముఁ గలిగియుంటివి. అది వట్టి పొరబాటు. చిత్తగింపుము. అమ్మహాత్ముఁడు పవిత్రరాజ వంశమున జన్మించి మహీమండలమేలుట కర్హుఁడై యుండియుఁ దండ్రి కొక్కఁడై

కొడుకయ్యు, నమితలావణ్యతారుణ్య సమేతయగు భార్యం గూడి యుండియు, సకలైశ్వర్యసమృద్ధిం గల్గియుండియు లోకము పాప భూయిష్ఠమై యున్నదని విచారించి దుర్గతిపాలగుచున్న మానవ లోకము నుద్ధరింపసమకట్టి యాలుబిడ్డలను, దల్లిదండ్రులను, బంధు మిత్రులను భాగ్యభోగ్యములను విసర్జించి చీనిచీనాంబరములకు మాఱుగాఁ గాషాయవస్త్రములఁ దాల్చి, ముత్యాలహారములకు మాఱుగా రుద్రాక్షమాలలు ధరించి శిరమున రత్నమకుటమునకు మాఱుగా జటాజూటమువహించి, గమగమతావుల నీను కలపంబు లకు మాఱు బూదిఁబూసికొని, యుద్యానవనములు రోసి వనముల జాసి, మేడలు విడిచి చెట్లనీడల విడిసి, హిరణ్మయపాత్రముల త్యజించి మృణ్మయపాత్రముల భుజించి, పరమనిష్ఠాగరిష్ఠుఁడై తపంబుసేసి, మేను శుష్కింపఁజేసి యింద్రియంబుల గెల్చి, జీవితముయొక్క పర మార్థముం గనిపెట్టెను. ఆమహానీయుఁడు మధ్యమలోకమున కలం కారము. క్షత్రియుఁ డగుటచే రాచకొలమాయనవలన వన్నె కెక్కెను. మానవలోక మాయనవలనఁ బవిత్రమైనది. దయాదాక్షి ణ్యములే యా మహాత్ముని మతమునకు మూలరాళ్ళు. ఆశాక్య సింహుఁడు మూర్తీభవించిన భూతదయయని చెప్పుట యతిశయోక్తి గాదు. భూతదయ యాతని కళేబరముతో నాఁడు దగ్ధమైపోయిన దనుట పొగడ్తగాదు. శాంత మామహానీయునితో నాఁడు చితి మీఁద బూడిదయయ్యెనని పలుకుట కవిచాతుర్యముగాదు. ఆయన బోధామృత మాస్వాదించినవారు ధన్యులు. ఆయనం జూచిన వారు కృతకృత్యులు. ఆయన మతము స్వీకరించినవారు పవిత్రులు. ఆయనవలన మానవులు పతితులు గాలేదు. పతితులు పావను లయిరి. దుర్జనులు సజ్జనులైరి. అపవిత్రులు పవిత్రులైరి. ఆ భగ వానుఁడు దేవుఁడున్నాఁడనిగాని లేఁడనిగాని చెప్పలేదు. అంత మాత్రముచేత నతఁడు నాస్తికుఁడుగాఁడు. అతనిమతము నాస్తిక

మతముగాదు. అతఁ డాస్తికులలో నగ్రగణ్యుఁ డని చెప్పనచ్చును. ఆస్తికులమని విఱ్ఱవీగు మానవులలో ననేకులు సత్య నాస్తికులు, ధర్మ నాస్తికులు, దయా నాస్తికులు, భక్తి నాస్తికులు, కలరు. ఆ నాస్తికులలో నెందఱో యాస్తికులు గలరు. భూతదయాజితేంద్రియ త్వమునను రెండును దన్మతమునఁ బరమసిద్ధాంతములు. ఆమత మవ లంబించినవారు జీవహింస చేయరు. "ఆత్మవత్సర్వభూతాని" యను ధర్మము వారియందు స్థిరమైయున్నది. జీవహింసా భయముననే వారు యజ్ఞములు మానిరి.

చిత్ర—అమ్మాయి! బౌద్ధమతసిద్ధాంతములు నీతలకెక్కినవే. అవి యెక్కడ నేర్చితివి? ఆమతమన్న నీకింతగౌరవము కలుగుటకుఁ గారణమేమి? గురివెందగింజలు నిప్పులని, గాజుపూసలు జాతిరత్నము లని, యెఱ్ఱనిపెంకులు కెంపులని నీవు భ్రమించుచుంటివి.

కరుణ—తండ్రీ! నేను భ్రమించుటలేదు. నేను విదర్భలో నున్నప్పుడు మైత్రేయియను బౌద్ధయోగిని తఱుచు రాజాంతఃపురము నకు వచ్చుచు బోవుచు శుద్ధాంత కాంతలకు నప్పు డప్పుడు సుగత స్వాముల ధర్మముల నుపదేశించుచుండెను. అవి నేను మిక్కిలి శ్రద్ధగ వింటిని. పిమ్మట నామె పాళియనుభాష నాకుపదేశింప నందులో నున్న దమ్మపదము మొదలగు నుత్కృష్ట గ్రంథములఁ జదివితిని. అదికారణముగా నాకు మహనీయుఁడైన బుద్ధదేవునిమీఁదను వాని మతముమీఁదను నమితగౌరవము గలిగినది.

చిత్ర—సహవాసదోషమున సుశీలురు దుశ్శీలురగుట యాశ్చ ర్యముగాదు. నీళ్ళకు వస్త్రములకు వాయువునకు వస్తుసహవాసము లనుబట్టి సుగంధ దుర్గంధములు గలుగునట్లే మనుష్యులకుఁ గూడ దుర్జన సజ్జన సహవాసమునల్ల దురభిప్రాయ సదభిప్రాయములు పట్టు వడును. ఒకవేళ బౌద్ధమతములో నుత్కృష్ట ధర్మము లున్నను బౌద్ధు లందఱు సుగుణసంపన్ను లగుదురా?

కర్పూ—తండ్రీ! అందఱు సుగుణవంతు లుండరు. కాని మాళవేంద్రుఁ డగు సుదర్శనుఁడు లాతివారితోఁ బోల్పఁ దగినవాఁడు గాఁడు. ఆయన గుణరత్నాకరుఁడు. అతఁడు తన దేశమున జీవహింస మాన్పించెను. ఆయన నిష్కళంక చరిత్రుఁడు. పరమ కృపాళుఁడు. ప్రజలం దన బిడ్డలుగాఁ జూచును. ఆత్మసుఖముకంటెఁ బ్రజాసుఖ మెక్కువగఁ జూచును. ఎక్కువ పన్నులుగట్టి ప్రజలబాధింపఁడు. బౌద్ధమతస్థులమీఁదఁ బక్షపాతము, వైదికమతస్థులమీఁద ద్వేషము లేదు. అందఱ సమానముగఁ జూచును. ఆయన కొడుకు మకరందుఁడు పితృమార్గానువర్తి. తల్లిదండ్రులకు విధేయుఁడు. ప్రజాబాంధవుఁడు. తండ్రివలెనే యతఁడుగూడ రాజ్యమందలి ప్రజలలోఁ దండ్రి లేని వారికిఁ దండ్రి. సోదరులు లేనివారికి సోదరుఁడు. మిత్రులు లేనివారికి మిత్రుఁడు. బిడ్డలు లేసవారికి బిడ్డ. ఈవిధముగా వారు సర్వజన శ్లాఘనీయులై, కృపాసముద్రులై, ధర్మతత్పరులై, రాజ్యపాలనము సేయుచున్నారు.

చిత్ర—ధర్మతత్పరులై పరిపాలించుట నీ వెట్లెఱిఁగితివి?

కర్పూ—మాళవదేశమున నేనున్న కాలములో వారి దయాదాశ్యాదిగుణములు దెలిసికొనుట కనేకావకాశములు గలిగినవి.

చిత్ర—అంతఃపురమునందున్న విదేశాంగనకు నీకు లోకమునందలి వ్యవహారము, రాజుల పరిపాలనాపద్ధతులు దెలిసికొనుట కవకాశము గలిగినదా? ఎంతో కాలము దేశములందుండి సల్లడలు దిరిగి జనులతోఁ గలసిమెలసి యున్నవారికే తెలియుట కష్టముగదా నీ కవలీలగా దెలిసెనని నీ వనినంతమాత్రమున నమ్మవచ్చునా? ఏదో యభిమానమున నిట్లనుచుంటివి!

కర్పూ—తండ్రీ! నాపలికినది సత్యముగాని యభిమాన ప్రేరితమైన మాటగాదు! శత్రువులయందైనను గుణమున్నచోఁ గ్రహించుట సత్పురుష లక్షణము.

చిత్ర—గుణమున్న గ్రహింపవచ్చును. లేనిచో గ్రహించు టెట్లు? ప్రస్తుతాంశము విను! మఱి యందునిమిత్తము నీవువలపునిలిపితివో లేదో నీమాటలచే స్పష్టముగాఁ దేటపడలేదు. కాని, వానియెడనీకుఁ గల యభిమానమునుబట్టి నీకాతనిపైఁ గూరిమిగలదని నేను నిశ్చ యింపవలసివచ్చినది. మనము వైదికాచారసంపన్నులము. వారు వేదబాహ్యులు కర్మరహితులు, మనకువారికింగలయిక యుపేక్ష ణీయముగాదు. నీవు దేవాలయమున కరుగుదువు; వారు దేవాలయ ములను రోయుదురు. మనము శివకేశవులను బరమాత్ములుగా నెం తుము; వారు మనుష్యమాత్రుఁడైన బుద్ధునే యారాధింతురు. నడ వడులలో నాచారములలో నభిప్రాయములలో మనకువారికి నమిత భేదము గలదు. అట్టివారి మనసులెట్లు కలియును? పొత్తులెట్లు కలు గును? సామరస్యమెట్లు కుదురును?

కర్పూర—తండ్రీ! అన్నింటికి మనస్సుప్రధానము. మనస్సులో నిష్టమున్న యెడల నన్నిఁట సామరస్యము గుదురును. దంపతులు భిన్నమతస్థులయినను దాంపత్యమున భంగముండదు. భర్తశైవుఁడు, భార్యవైష్ణవియైన దాంపత్యములున్నవి. మతములో నెవరిష్టము వారిది. ఎవరియిచ్ఛవచ్చినట్లు వారు దేవతల నారాధించుకొనవచ్చును. అంతమాత్రముచేతఁ బరస్పరమైత్రికి భంగముండదు. అరమరలేని కూరుములునిలుపుటకు మనముద్ధముఁరాము.

చిత్ర—బిడ్డా! నీవు వెఱ్ఱిపడుచున్నావు? అట్టిదంపతులకెన్నఁడుఁ గాపురము సరిగాఁబొసగదు. అయ్యాదాసునకుఁబెట్టు నమ్మజంగము నకుఁబెట్టు నన్నసామెత నిజమగును. నీవుజక్కఁదనమొక్కటే మెచ్చి యాతని వరింపఁదలచు చుంటివి. వరునియందుఁ జూడఁదగినలక్షణ మదియొక్కటియే గాదు. త్రాఁచుపాము తలలో వెలలేని మణియుం డును. అదిచూపులకెంతో చక్కఁగానుండును. ఈగుణములంబట్టి

దానినెట్టి వెంగలియైన మెడలో హారముగా వైచుకొనునే? దానిం బ్రక్కలోఁ బెట్టుకొని పండుకొనునే? మెఱయుచున్నదంతయు బంగారమనుకొనవద్దు. కస్తూరీపంకముఁబూసికొన వచ్చునుగాని బురదఁ బూసికొనఁ గూడదు.

కర్పూ—అయ్యా! చక్కఁదన మొక్కఁటేమెచ్చి కార్యనిశ్చయము చేసికొనుట లేదు. మెడఁదాల్చునది కుసుమమాలగాని కోడెత్రాఁచుగాదు. మేనఁ బూసికొనునది మృగనాభిగాని, మెత్తనిబురద గాదు.

చిత్ర—బిడ్డా! చదువుకొన్నదానవు గావున వీరుఁడు బాణమునకు బాణము వైచినట్లు మాటకు మాట సమయోచితముగఁ జెప్పఁ గలవు. యుక్తులనటుంచి నామాటవినుము. మకరందునిపై మక్కువ మానుము.

కర్పూ—అట్లయిన నెవ్వని పాణిగ్రహణము సేయుమందువు?

చిత్ర—భళి! ఇప్పుడు దారికివచ్చితివి. చెప్పుచున్నాను వినుము—ఈపట్టణమున దండపాణి వజ్రపాణియని యిరువురన్నదమ్ములున్నారు. వారుత్తమక్షత్రియులు; చంద్రవంశజులు, మనము పాండవసంతతి; వారు యాదవసంతతి, మనకు వారికిఁ బూర్వకాలమునుండియు నిచ్చుకోలు పుచ్చుకోలుగలవు. వారిద్దరు సేనాధిపతులు, అసహాయశూరులు, నిర్వక్రపరాక్రములు, అందువజ్రపాణి భుజాబలమున భీమసేనుఁడు, ధనుర్విద్యయందు సవ్యసాచి, సౌజన్యమునందు సహదేవుఁడు, శాంతమునందు ధర్మరాజే.

కర్పూ—చక్కఁదనమందో?

చిత్ర—పాడుచక్కఁదనము. వరునకుఁ జక్కఁదనమే ప్రధానమా? అది యప్రధానమని నాయభిప్రాయము. అదిగాక యెవరి చక్కఁదనము వారికుండును, కన్ను ముక్కు చెవి నోరు కాలుసేతులు

వంకరలేక సరిగానుండెనా? యెట్టివాఁడైనఁ జక్కగానుండెను. గుణము ప్రధానముగాని చక్కఁదనమెందుకు? తురాయిపువ్వు కట్టెఱ్ఱగా నుండును. అందము లేదు. చందము లేదు. వాసన లేదు. అతఁడు నల్లగానుండును. నల్లగా నున్నంత మాత్రమున యువతీదూష్యుఁడగునా? అట్లయిన నల్లనివారికిఁ బెండ్లి కాఁ గూడదా? కస్తూరి నల్లనై సువాసనలచేత మాననీయముగాదా? కోయిల నల్లనై మనోజ్ఞ ధ్వనులచే జగద్వంద్యముగాదా? ఇంద్రనీలము నిగనిగ కాంతుల నీనుచు నవరత్నములలో నొకటి కాలేదా? భగవంతుండగు పరమేశ్వరుఁడు స్ఫటికమువలెఁ దెల్లనిమేను గలవాఁడయ్యు నల్లనిదానిని పార్వతిని బెండ్లియాడలేదా? శ్రీమహాలక్ష్మి బంగరుబొమ్మవలె నుండియు నీలమేఘశ్యాముఁడైన నారాయణుని వరింపలేదా? నీలవర్ణము హరిహరులకు భార్యలతోడి కూటములు చెఱిపెనా? పాంచాలి నల్లనిది; పాండవులు చక్కనివారు. ఇట్లెన్నో యుదాహరణము లున్నవి. కావున నల్లనివాఁడని రోయక వజ్రపాణిఁ జేపట్టుము. అతఁడు వేయి కన్నులు లేని వజ్రపాణి. రక్కసులచేఁ బెక్కుసారులు కయ్యముల నోడిపోని వజ్రపాణి. మునిశాపంబును జెందని వజ్రపాణి. మధ్యమలోకమందున్న వజ్రపాణి.

కర్పూ—రాజ్యములేని వజ్రపాణి. పూజ్యతలేని వజ్రపాణి యని చెప్పుము.

చిత్ర—అమ్మా! ఆలాగు నిరసింపఁగూడదు. అందఱకు రాజ్యములుండునా? శ్రీకృష్ణున కేమి రాజ్యము గలదు? రుక్మిణీ సత్యభామ మొదలగు కాంతలెంతమంది గుణములకు వలచి యాతనిఁ జెట్టఁబట్టలేదు.

కర్పూ—ఆయనకిదివఱ కొక భార్యయున్నది గదా?

చిత్ర—ఉండిననేమి? చిన్నదానవయ్యు నీవె పెద్దభార్య వగుదువు. నిన్నుఁ జేపట్టినపిదప నామె గౌరవము కడముట్టును. ఆమె నీకు దాసియై యుండును.

కర్పూ—హరిహరీ! తండ్రీ! ఆయన చెట్టబట్టి యెంతో సుఖపడవలెననివచ్చి సంతానవతియై మహాపత్నియై యాతని సేవించిన యిల్లాలిని నేను దాసిగా నేలుదునా? అట్టిపాపమపని యెన్నఁడు నేఁజేయను. నాదురదృష్టముచేత నొకవేళ నాతనిచెట్టఁ బట్టుటయే సంభవించునేని నేనాయనకు రెండవపత్నినై యామెకే నేను దాసినై యూడిగములు సేయుదునుగాని యాసాధ్వి మనస్సునకు రవంతయేని నొప్పిగలిగింపను సుమీ! నీవు లక్ష్మీదేవిని శంకరునిఁ బ్రసంగవశమునఁ జేర్కొంటివి. నారాయణుని యందున్నగుణములు నీవజ్రపాణి యందున్నవా? దేవతలసామ్యము పనికిరాదు. దేనికయిన మనస్సు ప్రధానము. మహారాజునకు మందిరములు కావలెను. విరాగికి విపినములు గావలెను. మనసునకు నచ్చినవాఁడె మన్మథుఁడు; నచ్చనివాఁడు నాగుఁబాము.

చిత్ర—ఇంతకు వజ్రపాణి నీకు నచ్చెనా. లేదా?

కర్పూ—తండ్రీ! అడుగుచుంటివి గాన జెప్పెద వినుము. అతనిచేయి బట్టుటకంటె శాశ్వతబ్రహ్మచర్యమున నుంట మేలు.

చిత్ర—బిడ్డా! నీవాతని చేపట్టుటవలన మనకు గొప్ప యుపకార మగును. అదియెట్లందువేని—వజ్రపాణియు వానియన్నయగు దండపాణియు మనపక్షమున నున్నారు. నీవు వజ్రపాణిని జేపట్టుదువేని వారు హేమచంద్రుని వంశమును సింహాసనమునుండి కూలఁద్రోసి కాశ్మీరరాజ్యమునకు నన్నభిషిక్తుఁ జేయుదురు. నేను పెద్దవాఁడను. నాలుగైదేండ్లు రాజ్యముచేసి చనిపోదును. నా యనంతరమున నీతమ్ముఁడు విజయసేనుఁడు రాజగును.

కర్పూ—(చెవులుమూసికొని) హరి హరీ! ఎంతమాట! విక్రమసేనుని రాజ్యభ్రష్టుం జేయుదురా? అందుకని నేను వజ్రపాణి

పాణిగ్రహణము జేయవలెనా? నావివాహమిట్టి దుష్కార్యమునకై నుపయోగింపఁబడునా? కటకటా! అట్టిపాడుపనిలో నేనెన్నఁడు బాల్గొనను. విక్రమసేనుఁడు తండ్రిలేనిబిడ్డ. మనమంతఱమువానికి సాయము జేసి రాజ్యమునందతని సుప్రతిష్ఠితునిఁ జేయుటకుమాఱుగా నిట్టి దుష్కార్యము సేయఁదగునే? ఈకార్యము నింద్యము. దూష్యము. నరకహేతువు. తండ్రీ! అట్టిపని యెన్నఁడు సేయకుము. విక్రమసేనుఁడు విజయసేనుఁడుఁ గూడ నా తమ్ములే. ఎవరు గద్దె నెక్కినను నాకు దద్దయు సంతసమే కాని, పైతృకంబగు రాజ్యమునకు విక్రమసేనుఁడే యర్హుఁడు. అతఁడు రాజగుటే ధర్మము. ధర్మేతరములగు మాటలు నాకడఁ జెప్పవలదు.

చిత్ర—(రోసముతో) నయమున భయమున నే నెన్నివిధములఁ జెప్పిన నామాటలు నీమనసున కెక్కకున్నవి. తలక్రిందుగాఁ దపస్సుచేసినను నీకు మకరంయుఁడు భర్తగాఁడు. నిన్ను వజ్రపాణికే పెండ్లిచేసెదను జూడు.

కర్పూ—(రోషముతో) తండ్రీ! అంతవఱకు వచ్చునేని నాశరీరమగ్ని కాహుతిఁ జేసెద. అంత కవకాశము లేదేని—ఇదిగో! నాచేతి వజ్రపుటుంగరము. కర్పూరమంజరీశవమునే నీవు వజ్రపాణికి వివాహము సేయవలయునుగాని, యీమేనఁ బ్రాణములుండఁగాఁ జేయఁజాలవు. ఒకవేళ నీవతనిచేత నామెడలోఁ ద్రాడుగట్టించిసంకల్పసిద్ధుఁడగుదువేని యది నామెడ కురిత్రాడగునుగాని మంగళసూత్రము గాదు. నీవు శూరుఁడవు. చలముగలవాఁడవు. నేను నీకడుపున బుట్టిన కూఁతును. నీరక్తమే నానాళములలోఁ బ్రవహించుచున్నది. నీచలమే నాలోఁ బ్రతిఫలించుచున్నది. నేను మనస్సుచేత మకరందుని వివాహమాడితిని. దేహముచేత వివాహముగాదేని, యీదేహ

మితరులకొఱ కుపయోగపడక పోవుఁగాక! బలవంతముగఁ జచ్చి మఱియొకజన్మమెత్తియైన నతనిం జేపట్టెద.

చిత్ర—బలవన్మరణమునఁ బిశాచమగుదువు.

కర్పూ—వజ్రపాణిని వివాహమాడి వానిభార్య యనిపించుకొనుటకన్నఁ బిశాచమైనను మంచిదే. ఏకృసియైనను మంచిదే. ఆ పెనుభూతముతోఁ గాపురముసేయుటకన్న భూతమునైనను మంచిదే. వివాహము సామాన్య మనుకొంటివా? నీయిచ్చవచ్చినట్లు సేయుట కిది బొమ్మలపెండ్లి గాదు. రెండుహృదయము లొకహృదయము కావలె. రెండుమనస్సు లొకమనస్సు కావలె. భర్త చంద్రుఁడు, భార్య వెన్నెల. మగఁడు సూర్యుఁడు; మగనాలు కాంతి. గృహస్థుఁడు పూవు. ఇల్లాలు తావి. ఏకమనస్సుతో వా రవినాభావముగ నుండ వలయు. బలాత్కారవివాహములు పనికిరావు.

చిత్ర—నీవు చచ్చిననుసరే! వివాహమాడి చావుము.

కర్పూ—అహాహా! నీవంటి తండ్రి ప్రపంచమున లేఁడు. నే మృతినొందిననుసరే నీకార్యమైనం జాలుఁగాఁబోలు!

చిత్ర—సరే! జాగ్రత్తగానుండుము. నీవు నాకు ధర్మపన్నములు చెప్పఁదొడఁగితివి. దీనిఫల మనుభవింతువుగాక!

అని గాటమగు రోసమునఁ జివాలున లేచి గదివిడిచి యవ్వలకుం బోయెను.

పదమూఁడవ ప్రకరణము

ఆశాదేవత జగన్మోహనాకారముఁ దాల్చి హస్తమున బహురసభరితమైన రాజ్యఫలంబును బట్టుకొని మొగమునఁ జిఱునవ్వు వెన్నెలలు గాయ "నన్ను మెప్పించితివేని యీఫలంబు నీయదియ

నీయుదియ! త్వరపడుము. ప్రయత్నింపుము" అని యూరించుచుఁ బలు తెఱంగులఁ బులికొల్పుటం జేసి చిత్రభానుఁడు స్వలాభపరాయణుఁడై కన్నబిడ్డసౌఖ్యము వీటిఁబుచ్చి నిష్కరుణుఁడై కర్పూరమంజరి నట్లు తూలనాడి తన శయ్యాగారమునకుం జని నేత్రములనియెడు కొలుములనుండి రూక్షవీక్షణములను విస్ఫులింగములు చెదిరిపడ మొగము జేవురుబూసిన తెఱఁగున శోణమయి భయంకరముగఁ దోఁపఁ బండ్లు పటపటఁ గొఱుకుచు నిందుమణిఁ బిలిచి తనకుం గూఁతునకుం జరిగిన సంభాషణమంతయుఁ జెప్పి యామె పెంకెతనమునకుఁ దగిన దండన చేయునట్లు ప్రతినబట్టెను.

ఇందుమణి మిక్కిలి భయపడి కూఁతుకడకుఁ బోయి శాంత వచనములతో నిట్లనియె. "బిడ్డా! మీతండ్రిగారి స్వభావ మెఱిఁగి యుండియు నీవాయన కంత కోపముఁ దెప్పింపఁదగునా? తండ్రిమాట వినవలదా? పితృవాక్యపాలనము నీవంటి విద్యావతియే చేయనిపక్షమున సామాన్యబాలికలు చేయుదురా? నీవు తండ్రిని దిరస్కరించితివని లోకమున వెల్లడియైన నది మనకప్రతిష్ఠగాదా? నీవు మిక్కిలి కఠినముగా మాటాడితివఁట! అట్టి కఠినోక్తులు తగునా?" అని మందలించుటయుఁ గర్పూరమంజరి "అమ్మా! తండ్రిమాట వినఁదగినదే. పితృవాక్యపాలన ముత్తమధర్మము. కాని, వివాహము పేరుపెట్టి నాకు దున్నపోతునో పెద్దపులినో లేక మఱియొక మోటపశువునో గట్టిపెట్టవలనని తండ్రిగారు స్వలాభపరాయణులై సమకట్టినప్పుడు తండ్రిమాట గ్రాహ్యము. అధర్మము పలికినప్పుడు గ్రాహ్యముగాదు. తండ్రి యసత్యమాడుమన్న నాడవలెనా? జనకుఁడు నరహత్య సలుపుమన్న సలుపవలెనా? తండ్రి నీతిమాలి వర్తింపుమన్న వర్తింపవలెనా? ఆయన యధర్మము పలికెనుగావున నే నాయన యాన దాఁటితిని" అని బదులు చెప్పెను.

"బిడ్డా! చదువుకొన్నదానవు. నీకు నేను జెప్పఁజాలనుగాని యొక్కమాట వినుము! మహాత్ముఁడైన భీష్ముఁడు తండ్రిసుఖము కొఱకు స్వసుఖనిరభిలాషియై వివాహము మానుకొని బ్రహ్మచర్య దీక్షాపరతంత్రుఁడై లోకవంద్యుఁడయ్యెను. వివాహమేగాదు రాజ్యము గూడ జనకుని సుఖమునిమిత్తము తృణప్రాయముగాఁ బరిత్యజించెను. రఘురాముఁడు జనకుని శాసనంబున రాజ్యపరిత్యాగంబు గావించి సుకుమారియైన జనకకుమారితోఁగూడ వనములకేగి పితృవాక్యపాలకులలో నగ్రగణ్యుఁడయ్యెను. చెప్పఁబూనిన నిట్టి వనేకములుగలవు. వారి తెఱంగున నీవును నీజనకునినిమిత్తము స్వసౌఖ్యముల నాసింపక యాయన ప్రీతికొఱకు నీదేహము నర్పింపరాదే?" యని యిందుమణి యుత్తరము చెప్పెను.

"తల్లీ! రాజ్యములు వదలవచ్చును. వివాహములు మానవచ్చును. నేనును వలయునేని వివాహము మాని బ్రహ్మచారిణినై తపోవనమున కరిగి జీవయాత్ర జరిపెద. అది తండ్రిగారి కిష్టమగునేమో కనుఁగొనుము. కాని, యొకపిశాచమునకు మాత్రము చేఁబట్టను. వివాహమాడదలఁచితినా నామనసువచ్చిన రాజకుమారునినాకు నచ్చిన గుణములుగలవానిని—నాకందోయి నలరించెడు లావణ్యవంతుని—నాహృదయము రంజింపఁగల రసికశిఖామణిని—నాప్రాణమునకుఁ బ్రాణమైనవాని—నామనోరథము సఫలముసేయువాని——నామేనికి గందపుంబూతవలె నుండువాని—నొకలోకవంద్యుని—గుణరత్నాకరుని-- సత్కులీనుని, విద్యావంతునిఁ జేపట్టెద. లేదా గార్గివలె శాశ్వత బ్రహ్మచర్య వ్రతమవలంబించి నారలుగట్టి కందమూలములు నాకలములు దిని జడలుదాల్చి మేను శుష్కింపఁజేసి కోర్కలు మొలక లెత్తకుండఁజేసి పరమపదమునందెద. ఈ రెండు దారులేగాని మధ్యమార్గము నేనొల్ల. దాంపత్యమన నట్టిదో యెఱుఁ

గుదువా? అదియు సుఖదుఃఖములయంద్వైతము. సర్వావస్థలలో పసంగతము. ఉదయమునకు విశ్రామము. ఆజన్మాంతము బరస్పరానంద సంధాయకము. అట్టిది కాని పెండ్లి పెండ్లిగాదు. తల్లీ! ఇన్నిమాట లెందుకు? విదర్భరాజపుత్రికయగు దమయంతి జగత్త్రియనాయకులు వర ప్రదాతలు మహామహిమాఢ్యులునగు దేవతలువచ్చి తెమ్ము వారింపుమని ప్రార్థించినను వారిం గ్రేగంటిచూపులనైనం దనుపక మానవుఁడు-తనవలపుకాఁడు నైన నిషధరాజును వరించెను. మఱియొక విదర్భరాజపుత్రిక రుక్మిణి తలిదండ్రులు నన్నదమ్ములు, బంధుమిత్రులు తన్ను శిశుపాలునకిచ్చి పెండ్లిచేయ నిశ్చయించినను వారి కన్నుబ్రామి యతిరహస్యమున శ్రీకృష్ణునియొద్దకుఁ దనకునమ్మికగల యొక బ్రాహ్మణుని రాయబారమంపి తన మనోరథమాయనకెరిగించి యాయనచేబలాత్కారముగాఁగొనిపోఁబడి రాక్షసవిధిచే నాయనను వివాహమాడెను. అదిగాక సాక్షాన్నారాయణావతారుఁడైన శ్రీకృష్ణునియొక్కయు శేషావతారుఁడైన బలభద్రుని యొక్కయుఁ జెల్లెలు, వసుదేవుని కూఁతురు, సుగుణభద్ర సుభద్ర తన్ను బలదేవుఁడు దుర్యోధనునకీయఁ దలఁచినను మేనత్తకొడుకగు నర్జునుని వలచి వలపించి పితృభ్రాతృవచన తిరస్కారముఁగావించి యాతని వెంటఁ బోయెను. తల్లీ! వారి సాదృశ్యమేల తేఁగూడదు? నాచెప్పిన పలుకులన్నియుఁ జక్కఁగఁ బరిశీలించి తండ్రిగారి కోపమును శమింపఁ జేయుము. ఇంతకన్న నా చెప్పునది లేదు." అని కర్పూరమంజరి బ్రతిమలాడవచ్చిన తల్లి కుత్తరమిచ్చెను.

పుత్రిక గట్టిపట్టుపట్టియున్నదనియుఁ దనమాటలామెతలకెక్కవనియు గ్రహించి యిందుమణి మాఱుమాటాడక పడకగదికిఁబోయి తనయనునయంబులుగూడఁ దనయయెడ నిష్ప్రయోజనంబులైనవని యాగ్రహావిష్టుఁడై సభర్తకెఱింగించి యతని యాగ్రహము ద్విగుణముఁ జేసెను.

చిత్రభానుఁడా రేయి కన్నుమూయలేదు. చాలసేపు తోఁచక నటునిటుఁ బచారుచేసి తాను తలపెట్టిన కార్యము ఫలోన్ముఖమునకు వచ్చినప్పుడు తానెన్నఁడుఁ దలఁపని విధమునఁ గూఁతురువలన భగ్నమైనదని చింతించి కార్యసాధనము జేయుట యెటులనాయని విచారింపఁదొడఁగెను. గాఢముగ నిద్రించుచున్న రుద్రభట్టును మేల్కొల్పి కార్యాలోచనమడుగ వలయునని యొకటి రెండుసారులు వాడుకయ నించిన తావునకుఁ బోవ సమకట్టి యాతనికి నిద్రాభంగముసేయుట యనుచితమని మరలఁ దనలోఁదానే సమర్థించుకొని యూరకుండెను. అంత వేకువజామయ్యెను. తెల్లవాఱఁబోవుచున్నది. మేలుకొనుఁడో హోయని కాలపురుషుఁడు వైచిన కేకవోలెఁ గొక్కొరోకోయని కోడికూసెను. ఆకూఁత వినఁగానే రుద్రభట్టు మేల్కొని యఱచేతులు జూపాడఁజేసి కన్నులు నులుముకొని పుష్పదంత విరచితమైన మహిమ్నస్తవము పారాయణముగఁ జేసికొనుచుండెను. అప్పుడు చిత్రభానుఁడు సమీపించి యాస్తవము ముగిసినపిదప గడచిన రేయి దనకుం గూఁతునకు జరిగిన సంవాదప్రకారము సమగ్రముగా విన్నవించి యిట్లనియె.

"స్వామీ! మీయాశీర్వచన ప్రభావమునఁ గార్యము దాదాపుగఁ బంటకు సిద్ధమైనది. పరమమూర్ఖురాలైన నాకూఁతువలనఁ బోటుపొడిచిన సముద్రముపాటువడినప్పుడు వెనుకకుఁ దగ్గినట్లు కార్యము యథాస్థానమునకుఁ బోవుచున్నది. ప్రధానముచేసినంగాని మనకు సేనాపతులు తోడుపడరు. వారితోడు లేనియెడల మన మిచ్చటఁ జిల్లిగవ్వకైన మాఱము. బాలికమూఢయై నామాటలఁద్రోసిపుచ్చుచున్నది. వజ్రపాణి చక్కనివాఁడుగాఁడట. సవతియున్నదఁట. మాళవరాజనందనుఁడగు మకరందుఁడు మహీతలమున వెలసిన మన్మథుఁడఁట! అతనినేగాని వివాహమాడదఁట. బుద్ధి విశేషమున శుక్రబృహ

స్వతులను జీరికింగొనని మీరే యుపాయాంతర మన్వేషించి తప్పు
దారింబడిన యీకార్యమును సత్వరముగ ద్రోవకుం ద్రిప్పవలయును.''
అనవుడు రుద్రభట్టు మెల్లగా "అలాగా! బాలిక కడుమూర్ఖు
రాలుగా నున్నదే. చదువుకొనిన యాఁడుది, చదువునేఱని మగవాఁడు
పనికిరారని మొదటి నుండియు నేను వాదించుచుంటిని. నీకూఁతురు
ముద్దుముద్దియగాక ముద్దులమూటగట్టునట్లు విద్దియలు నేర్చి పెద్ద
పండితురాలయినదని తద్దయు సంతసించితిమిగాని తుదకు నీకెదురు
ఱొమ్ముమీఁది కుంపటివలెనుండి సంతాపకారిణియగునని యూహింప
వైతివి. 'న స్త్రీ స్వాతంత్ర్య మర్హతి' యని మనువు వెఱ్ఱివాఁడై
చెప్పెనా? మనువుమాటలు మనముఁ పెడచెవిని బెట్టుటచే మన
కూఁతులు మనము తెచ్చిన మనువుల నొల్లక మన మనవులు సరకు
గొనక యిచ్చవచ్చిన తెఱంగున మెలఁగుచున్నారు. తేలునకు ముల్లు
పామునకు విసపుతిత్తి, బెబ్బులికి వాఁడిగోఱు యెట్టిదో పడఁతికిఁ జదు
వట్టిది. స్త్రీని నేలఁబెట్టి త్రొక్కివేయవలెను గాని స్వాతంత్ర్య మీయఁ
గూడదు. వారియెడ జాలిపడఁగూడదు'' అని చేతులతో నభినయిం
చుచు మొగముఁ ద్రిప్పుచు నేఁడీయు నిట్లనియె "వివాహమున
నాఁడుదానికి స్వతంత్ర్యభావమా? తాఁ వలచినవానిని పెండ్లి చేసి
కొనుటా? రుక్మిణితోను సుభద్రతోను తనకు సామ్యమా? నరక
మెక్కడ, దేవలోకమెక్కడ? తల్లిదండ్రులు తెచ్చిన సంబంధ
మంగీకరించి చచ్చినట్లు పడియుండవలసినదేగాని యాఁడుబిడ్డ వలపులు
గిలపులు నిలిపి మనసుకు నచ్చిన వానిని బెండ్లియాడుటా? పూర్వ
కాలపుమాట నేను చెప్పనుగాని యీ కాలమున స్వయంవరమనఁగా
నాఁడుపిల్ల తన చూపులకు నచ్చినవానిని దగుల్కొని పోవుటయే.
ఈవెఱ్ఱి యాగడములు సాగనీయఁ గూడదు. రాజా! నేనింత కఠిన
ముగాఁ బల్కితినని మనసులో వేఱువిధముగాఁ దలఁపకుము. నాబిడ్డ

రొకటి నీబిడ్డయొకటిగాదు. అదియే నాబిడ్డయగునేని నీ తెఱంగున నాతో వితండవాదము సేయునేని దాని శరీరము ఖండఖండములు చేయనా? ఇట్లనుటచేత నీబిడ్డం జంపుమనుటగాదు సుమీ! నామనస్సు మండిపోవుటచేత నిట్లంటిని. ఇంక నొక్కటే యుపాయమున్నది. కాలహరణమైనఁ గార్యము చెడును. దండపాణిని వజ్రపాణినిబిలిచి ప్రధానము చేయుదము. కర్పూరమంజరి వివాహమున కంగీకరించినదని మనవారితోఁ జెప్పుదము. అబద్ధమెట్లు చెప్పుదునాయని నీమనస్సు శంకింపవచ్చును ఇట్టివిషయమున శంకలు పనికిరావు. మనము తెల్లవాఱలేచి యెన్ని యబద్ధములు నాడువుటలేదు? రాజనీతి కసత్యము కన్నతల్లి. సత్యము సవతితల్లి. రాజనీతి యసత్యమునఁబుట్టి యసత్యమునఁ బెరుగుచున్నది. అది యసత్యాత్మకము. రాజయినవాఁడు రాజనీతి నవలంబింపక తప్పదు. ప్రాణవిత్తమానభంగములందు సూనృతంబువిడిచి యనృతంబు నాశ్రయింపవచ్చునని భగవానుండైన శుక్రుఁ డుపదేశింపలేదా? అందుచేత నిశ్శంకముగా మన మసత్యమును సత్యముగా మార్చి మాటాడవచ్చును. ప్రధానము చేయుదునని వారికిఁ జెప్పిపంపుము. ఎల్లుండి మిక్కిలి మంచిది. తిథివార నక్షత్రములు సరిగాఁ గుదిరినవి. తారాబల చంద్రబలములు సమకూడినవి. ఆ దినమునఁ దప్పక ప్రధానము జరుగునని వారికిం దెలుపుము. అతిరహస్యముగా జరుగవలెనని మాత్రము చెప్పుము. వానిసన్నిధిని నీవూరకుండుము. కర్పూరమంజరి సమ్మతించినదని నేనే చెప్పెద. వానితో నిన్నే వలచినదని చెప్పెద నీదర్శనమునకై నిరీక్షించుచున్నదనియెద. నీచేయిపట్టెడు భాగ్యమెప్పుడు లభించునాయని యువ్విళ్ళూరుచున్నదనియెద. నీపేరే యామెకు హరినామస్మరణ మనియెద. నీ విజయములే పాడుచున్నదనియెద. అదియిది యననేల! ఏమనవలెనో యన్నియు ననియెద. భగవంతుఁడు కపటోపాయములకు గట్టితల యిచ్చినాఁడు. వాటిని వాగ్రూపమున వెల్లడించుటకు నాలుక నిచ్చి

నాఁడు. ఆశక్తి నీక్రింద వినియోగించెద.'' అని నిశ్శంకముగఁ బలుకుచున్న రుద్రభట్టును జూచి చిత్రభానుఁడు ''స్వామీ! ఎట్టివంటి క్లిష్టమార్గములనైన మీబుద్ధిరథము నిరాఘాటసంచారముఁ గలిగియుండును. చికిలిచేసిన కత్తివంటి మీబుద్ధి యెట్టిసంకటారణ్యములనైన ఛేదించును. మీమాటలు విషాదముచే జడములైన నామనస్సునకునవయవములకు నెంతో చైతన్యముగలిగించినవి. మీరుచెప్పినట్లు జేసెదఁగాని కొట్టకొనకు మనము వివాహముచేయకపోవుదుమేని దండపాణియు వజ్రపాణియు మనము వంచించితిమని యాగ్రహించి యెదురుతిరిగి యపకారము సేయరా? ఈలోపున బాలికయభిమతముఁ దెలిసి కోపించి కార్యభంగము సేయురా? బాలిక యీవార్త విని యాత్మహత్య చేసికొనదుగదా? ఈమూఁడుశంకలు నామనంబును బీడించుచున్నవి. దీనికేమియుపాయము?'' అని పలికెను.

నిశ్శంకహృదయుఁడైన రుద్రభట్టు ప్రత్యుత్తరమునకై వెదకుకొనక తత్క్షణమే యిట్లనియెను. ''కర్పూరమంజరికి వానిపై వలపు లేదనుమాట లోకమునకుఁ బొక్కకుండ మనము గోప్యముగ నుంచవలెను. ఈవార్త మనలో జీర్ణముకావలెను. ఎవ్వరియొద్ద నిది యెత్తవద్దని నీభార్యతో నొక్కివక్కాణింపుము. చెలికత్తె లీమాట జాఱవిడిచిరేని బ్రతికియుండఁగానే నేలం బాతిపెట్టింతుమని చెప్పుము. సలసలకాఁగుచున్న నూనెలోఁ బాఱవేయించి వడియములట్లు వేయింతుమని చెప్పుము. ఇట్లు చేసితిమేని యీమాట పైకిఁ బొక్కదు. మన కార్యమయినతరువాత వివాహము మనము సేయలేకపోయినను మనను వాఁడేమిసేయఁగలఁడు? బాలిక మొదట పెండ్లికంగీకరించి పిదప దుర్బోధలవలన మానుకొన్నదని చెప్పవచ్చును. అదివినక వాఁడు తెగనీల్గి పెంకితనముచేసెనా వానిజుట్టు మనచేతిలో నుండును గనుక నోరు మూయించి శిరచ్ఛేదము జేయించెదము. బాలికయాత్మహత్య

చేసికొనునేమో యని నీకు శంకగదా! చేసికొన్న పక్షమున నీవీడయే పోయినదని నమ్ముము. ఏదోరోగమువచ్చి చచ్చినదని మనము చెప్ప వచ్చును. దైవికమున కేమిచేయఁగలమని వాఁడు తన యదృష్టమును నిందించుకొనుచు నూరకుండి యెప్పటియట్ల మనకుసాయము జేయును. ఆమె బలవన్మరణమునొందిన వార్త లోకమునకుఁ దెలియకుండఁ జేసి నీబిడ్డ చెలికత్తెయైన మల్లికనో చంద్రికనో దెచ్చి యదే కర్పూర మంజరియని వానికి వివాహము చేయుదము. వీఁడు చిన్నప్పుడెప్పుడో బాలికం జూచియుండును గాని యీనడుమ నెప్పుడుఁ జూడలేదు గదా? "శతకోటి దరిద్రాణా మనంత కోట్యుపాయాః" అని ప్రాచీనులు చెప్పియేయున్నారు. 'నందో రాజా భవిష్యతి' యని వినలేదే? నాఁటికొక్క దైవముండదా? భక్తవత్సలుఁడైన మహేశ్వరుఁడు నాశిష్యుని కార్యము భంగముసేయునా? వెనుకటియట్ల నేనెప్పుడో యొక నాఁటిరాత్రి రెండుజాములవేళ మహేశ్వరసాక్షాత్కారము జేసికొని నాకభీష్టసిద్ధిచేయుమని కోరెదను. భయపడకు."

చిత్రభానున కతఁడు చేసినయుపదేశము సమంజసముగా నుండెను. మూఁడవనాఁడు ప్రధానమునకు సుముహూర్తము నిశ్చయింపఁబడినదని యతఁడు వారి కెఱిఁగించెను. వారాదినమున రాత్రి జాము ప్రొద్దుపోయినతరువాతఁ దమకాప్తులైన యిరువురుబ్రాహ్మణులం దోడ్కొని పసపు, కుంకుమ, పండ్లు, యగరు, చందనము, సుగంధ పుష్పములు, వెలలేని యాభరణములు మేలైన పట్టుచీరెలుఁ దెచ్చి తమతోడవచ్చిన సేవకులను వీధిలో నిలిపి వారైన నెఱుఁగకుండ నింటిలోని వారెఱుఁగకుండ రుద్రభట్టు నెదుటఁబెట్టిరి. యథాక్రమముగాఁ బ్రధానముజరిగెను. ఈకార్య మతిరహస్యముగా నుంచవలసినదని వచ్చినబ్రాహ్మణులతో రుద్రభట్టు జిత్రభానుఁడుఁ జెప్పిరి. రుద్రభట్టు కర్పూరమంజరి వానిసమాగమమునకై తహతహం

బడుచున్నదని మిక్కిలి దృఢముగాఁ జెప్పెను. వజ్రపాణి మేరమీరిన యానందమునొంది కర్పూరమంజరీ పాణిగ్రహణ మహోత్సవమునకై యాటలూరఁ దొడఁగెను. భవిష్యత్కాలమునఁ దన కూఁతురు కాశ్మీరదేశపు రాణియగునని దండపాణి పరమానందమునొందెను. ప్రధానము ముగిసినపిదప వారు నిజనివాసముల కరిగిరి. చిత్రభానుఁడు రుద్రభట్టు తాము త్రవ్విన మాయాకూపమున వారుపడిరని చెప్పుకొని నవ్వుకొని పిమ్మట నిద్రపోయిరి.

పదునాలుగవ ప్రకరణము.

తెల్లవాఱఁజొచ్చెను. కాశ్మీరరాజ్యలక్ష్మిని దమవశము జేసికొనుటకై గొప్పకుట్ర జరుగుచున్నది. రాజభక్తులందఱు వెంటనే మేలుకొనుఁడోహో" యని కాలపురుషుఁడు పెట్టుబొమ్మవలె జాముకోడికూసెను. విషాదమాలిన్యమువోవఁ జిత్రభానుల మొగము తెలివొందినట్లు పూర్వదెస తెల్లబాఱెను. విక్రమసేనుని పక్షమున నున్న మిత్రులు క్రమక్రమముగా నిల్లె యంతరించుచున్న వారిని తెలియఁ జేయుటకో యన జుక్కలదృశ్యములు కాఁజొచ్చెను. రాజ్యలక్ష్మి పరహస్తగతమగుచున్నది. పరమేశ్వరా! కావుకావుమనిపక్షులుసైతమఱచుచున్నవో యన్నట్లు కాకులు కావుకావుమని కూయఁజొచ్చెను అరవిందాదేవి మనంబున నెలకొన్న కొంచెపు టాసలుగూడ నడఁగుచుండినట్లు తెల్లవారుజామున నున్న చిలుపవన్నెలలు క్రమక్రమముగా క్షీణించెను. దినమనియెడు కాంత నల్లచీర విడిచి తెల్లచీర కట్టినట్లు చీఁకటిపోయి వెలుఁగుపొడమెను. క్రొత్తవేసముతో శ్రీనగ

రంబున జిత్రభానుఁడు పొడసూపినట్లు పొడుపు గొండమీఁదఁ జిత్ర వర్ణములతోఁ భానుఁ డుదయించెను. ఎవ్వరికిం గానఁబడకుండఁ బైపైని జరుగు చిత్రభానుని ప్రయత్నంబులుగా నుదయకాల ప్రభాకరుని లేయండలు మునుముందు నేలపైఁ బ్రసరింపక యిండ్లమీఁదను జెట్లమీఁదను వ్యాపింపజొచ్చెను. అతనిజతనంబులు క్రమక్రమంబుగ నిట్లే పురంబున వ్యాపించుననిఁ తెలుపుటకో యన లేకుండ లించుకించుక తీవ్రములై నేలం బఱువఁజొచ్చెను.

వైదికకర్మనిరతులగు బ్రాహ్మణోత్తములు స్నానముచేసి ప్రాతస్సంధ్యావిధులఁ దీర్చి భగవానుఁడగు భాస్కరున కర్ఘ్యప్రదానమొసఁగి నిత్యనైమిత్తికములకుం జొచ్చిరి. మూర్ఛనుండిలేచిన జంతువువోలెఁ బ్రపంచమంతయు వెండియుఁ జైతన్యముగలిగి వికాసవంతమయ్యెను. మానవులు తమతమవ్యాపారములయందుఁ బ్రవేశించిరి. రుద్రభట్టు తనమొగ మప్పటికిఁ బ్రజలకుఁ జూపఁదలఁచుకొనలేదుగావున దొడ్డిలోనున్న బావికడనే స్నానముచేసి ప్రాతరనుష్ఠానములఁ దీర్చికొని, వ్యాఘ్రాసనమునఁ గూర్చుండియుండఁ జిత్రభానుఁ డాయనకడకుఁ బోయి నమస్కరించి యెట్టయెదుట నాసీనుడయ్యెను. "రాజా! సుఖముగ నిద్రపట్టినదా?" యని రుద్రభట్టడిగెను. "దేవా! మీ యనుగ్రహమున మనోవిచారములెల్ల దూరములగుటచే నిద్ర పట్టినది. కాని, "రాజా!" యని పిలుచుచున్నారేమి? అది లంభింపలేదే!" యని చిత్రభానుఁడు బదులుచెప్పెను. అప్పుడు రుద్రభట్టు చిఱునవ్వు మొగమున నంకురింప నిట్లనియె—"లభింపలేదా!నీమట్టుకు లభింపలేదని తోఁచుచున్నదిగాని, నా బుద్ధికి లభించినట్లు తోఁచుచున్నది. నీవు కాశ్మీరసింహాసన మెక్కినట్లు. నీశిరంబున నానారత్న విరాజితమగు కనకకిరీటము భాసిల్లుచున్నట్లు బహుపుణ్యనదీజలంబులందెచ్చి భూసురులు వేదోక్తముగ నీ కభిషేకము చేయుచున్నట్లు

సామంతమహీపాలురు తమ మకుటకాంతుల నీపాదములకు నీరాంజనంబిచ్చునట్లు వంగి నీకు నమస్కరించినట్లు హస్తకంకణంబులు ఘులుఘుల్లుమని మొఱయ రాజులు కానుకలుగాఁ బంపినయంగనలు నీకు వింజామరలు విసరుచున్నట్లు, హెగ్గడలు కైవారము సేయుచున్నట్లు ప్రగ్గడలు రాజకార్యముల నివేదించుచున్నట్లు రాయబారులు వినయంబునఁ దమతమ రాజుల సందేశంబుల నెఱిఁగించుచున్నట్లు నీవు వారి మనవిసనవులవిని మెచ్చి తలయూఁచి కృపారసపూరితములగు క్రీఁగంటిచూపులఁ జూచుచున్నట్లు నామనోనేత్రమున కిప్పుడే పొడగట్టుచున్నది. సర్వాలంకార శోభితమగు మదపుటేనుఁగు నెక్కి నీవు శ్రీనగరంబున నూరేగుచున్నట్లు నేలవేల్పులు గంభీరస్వరమున నిన్నాశీర్వదించు చున్నట్లు పౌరాంగనలు నీపై నక్షతలు లాజలు పూవులుజల్లి మందహాస విలసితములగు సుందర వదనారవిందములతో నిన్నుం జూచి యానందించి పసిడిపళ్ళెరంబుల గప్పూటంపు టారతులిచ్చినట్లు నా మనోలోచనమునకుఁ గానవచ్చుచున్నది. కాకపోయెను కార్యంబు నామనంబున నింత దృఢముగా ముద్రయిడినట్లు నిలువదు. పరమేశ్వరానుగ్రహము నీపై సంపూర్ణముగాఁగలదు. తెల్లవాఱుజామున భగవంతుం డగు చంద్రశేఖరుఁడు నాకు స్వప్నమున సాక్షాత్కరించి మీఁదఁ జేయివైచి తట్టి 'వత్సా! నీ సంకల్ప మీడేఱును. నీవింకఁ విచారంబు దక్కియుండుము. చాణక్యుఁడు చంద్రగుప్తుని మగధరాజ్యంబునఁ బ్రతిష్ఠించిన చందంబున నీవు చిత్రభానుని గాశ్మీరసింహాసనంబున నిలుపగలవుసుమీ' యని యానతిచ్చెను. అంతలో నాకు మెలకువవచ్చెను. శాంతరసమొల్కు నామూర్తిని, సువర్ణములవంటి సువర్ణములతోఁ గూడిన యా చల్లని మాటలను మఱియొకసారి కని వినవలెనని కుతూహలము పొడముచున్నది. మరల నెప్పుడోగాని లభింపదు. ఇఁక మన కార్యసిద్ధి యైనట్లె. మనదే యాలస్యము. రాజ్యలక్ష్మి రాక్షసివంటిది. అది

కామరూపిణి. చిఱునవ్వునవ్వి యొకనితో మేలమాడును. భయంకరాకారిణియై యొకనిని బెదరించును. ఎండమావులవలె తన యునికి నిజమ్మని భ్రమింపఁజేసి వేఱొకని బేలుపుచ్చును. ఒకని నిజముగా ననుగ్రహించి బాగుచేయును. దానినెప్పుడు నమ్మరాదు. మాంత్రికుఁడు పిశాచము దొరకినప్పుడు మంత్రప్రభావమునఁ బట్టుకొని దిగ్బంధనముజేసి కదలనీక మెదలనీక దనవశము జేసికొనినట్లు రాజనీతికోవిదు లదను జిక్కినప్పుడు రాజ్యలక్ష్మిం బట్టుకొని బంధింపవలయు. ఇప్పు డయ్యదను వచ్చినది. మనదే యాలస్యము. కార్యమునకు దిగవలయు."

అనవుడు చిత్రభానుఁ డుత్సాహపూరితుఁడై "ఏమిచేయవలయునో యిప్పుడె యానతిండు. చేసెద"నని బదులుచెప్ప రుద్రభట్టు వాని కిట్లనియె. "నీమామగారిమంత్రియగు జయంతుని మున్ను నీతోవచ్చిన విదర్భరాజసేనాపతి నుగ్రసేనుని విదర్భకుఁబంపి యిచ్చటి పరిస్థితులు విదర్భరాజునకు విన్నవించి గొప్పసేనం దీసికొని సాధ్యమైనంత వేగముగా రమ్మనుము. ఇక్కడ దండపాణియు వజ్రపాణియు దోడ్కొనివచ్చు సేనలకుఁ దోడుగ విదర్భసేనయుండవలయు. అదియే మనకు ముఖ్యాధారము. అది ప్రథమకర్తవ్యము. తరువాత మన కరటకుని వాక్యవాయువులు ప్రశాంతమైన సేనాసముద్రమునసంక్షోభతరంగములను సృజియించినవి. పింగళుఁడు రాజకుటుంబము మనస్సున బెట్టిన చిచ్చు నేఁటికిని మండుచునేయుండి మంత్రులమెడ విశ్వాసమును దగ్ధముచేసియుండును. రాజ్యలక్ష్మిని సమీపించుటకు మార్గమేర్పడినది. అనవుడు చిత్రభానుఁడు 'ప్రథమమున నేమి సేయవలయునోయది యానతిండు. అట్టిపనికిఁగూడ మీరు సుముహూర్తము నిర్ణయింపుడు. అమరేంద్రునకు బృహస్పతియట్లు దానవేశ్వరునకు శుక్రుడట్లు మీరు మాకు ధర్మోపదేష్టలు. విజయము మీమాట ననుసరించి

పోవును." అనివినయమున మనవిచేయ రుద్రభట్టు పెండియునిట్ల నియె. "రాజా! సేనానివేశమునకుఁబోయి పాములవాఁడు నాగస్వరముతో వల్మీకములలో నిద్రించుపాములను లేవఁగొట్టి యాడించునట్లు చిత్రవిచిత్రములు మహోత్సాహభరితములునగు నీవచోగుంభనలచేత సైనికులం బ్రబోధించి పురికొల్పుము. సింధుగాంధారనాయకులదండయాత్రలు నీ వాడునాటకమున కితివృత్తములగుఁగాక! నీయన్నగారి మరణము నాందియగుఁగాక! మణివర్మప్రముఖులు ప్రతినాయకులగుదురుగాక! నీవు కథానాయకుఁడవు. రాజ్యలక్ష్మి కథానాయిక. ఈ నాటకమునకు నేనే సూత్రధారుఁడను. నీవువిసిపించుకలాప మెంత రసవంతముగా నుండిన నంతత్వరలో నీకు జయము చేకూఱును. నీ మాటఁకుంజొక్కి సైనికులు తియ్యనీటికిఁ జేప లెక్కినట్లు నిన్ననుసరింపవలెను ప్రస్తుతము నేనువచ్చుటకు వీలులేదు. అయినను నా యాశీర్వచనమె నిన్ననుసరించి నీకు జయము నాపాదించును. రేపు రేయి మంచిముహూర్తమున్నది. మనశిష్యులు సైనికులమనస్సులు కలఁచెదరుగాక!

అనవుడు జిత్రభానుఁడు "మహాప్రసాదము స్వామీ! యట్ల చేసెద" నని వానికడ సెలవుపుచ్చుకొని యావలకుంబోయి తద్విషయప్రయత్నములనుండెను.

మఱునాఁడు తెల్లవాఱుజామున సేనానివేశమున నొకకలకలముగలిగెను. తలపై నాఁకుపచ్చని పెద్దపాగ నమర్చి మోఁకాళ్ళంటుచున్న ప్రాఁతనిలువుటంగి దొడిగి, మెడలోనొక గవ్వలదండ వైచుకొని జనులు ధర్మార్థమిచ్చిన ప్రాతగుడ్డలు రెండుభుజములపై వైచుకొని మెడలోఁ గట్టుకొన్న కంచుగంట మాటిమాటికి కంగుకంగుమని మొఱయ నెడమభుజమునుండి వీఁపుమీఁది కొక కఱ్ఱకుఁ దగిలించిన సంచి వ్రేలుచుండఁ గుడిచేతిలోనున్న ఢక్కతుణతుణమువాయించుచు భయంకరముగా క్షుద్రదేవతల నాహ్వానించుచు నొకసా

యులఁపాడు సైన్యనివేశమండలి వీథులలోఁ దిరుగఁ జొచ్చెను. గంట మ్రోఁతయు డక్కచప్పుడును వాని పెద్దకేకలును నిద్రించుచున్న సైనికులకు వారి యాఁడువాండ్రకు మేలుకొలుపులయ్యెను. అందఱు లేచి వానిం జూచుటకు గుమ్మములలో నిలిచిరి. సాయిలవాఁ డిట్లు సంభాషించెను.

"ఆ! కాళీ! పల్కవే, భద్రకాళీ! పల్కవే, జగజ్జనని! పల్కవే, భైరవీ పల్కవే, శాంకరీ, పల్కవే, తల్లి నిజముపల్కవే, యక్షిణీ! పల్కవే, దుర్గా! పల్కవే, చెప్పవే నిజముచెప్పవే, సాయిలరాము జోగినోట పల్కవే, సత్యముచెప్పవే, ఈదేశమువకు, గొప్పకీడురాఁ దలఁచియున్నది. పడమటినుండి పగరాఁదలఁచియున్నది. దక్షిణము నుండి దండురాఁదలఁచి యున్నది, రాత్రి రెండుజాములప్పుడు నల్ల చీరకట్టుకొన్న యాఁడది మొగమున పెద్దకుంకుమబొట్టు పెట్టుకొన్న యాఁడది, కాళ్ళకు గజ్జలుకట్టుకున్న యాఁడది, చీపురుపట్టుకొని యూడ్చుచున్నది. ఈరాజ్యములో సిరులన్నిఁటిని తానాలాగేయూడ్చెద నన్నమాట. మనుష్యుల జీవాలన్నియు నూడ్చెదనన్నమాట. తను వులుదక్కవన్నమాట. ఆతల్లి దుర్గకు నీదేశముమీఁద దయదప్పినది. ఇది పరరాజులపాలై పోనున్నది. గట్టివాఁగిసి బట్టుకొన్న పక్షమున రానున్నయాపద తప్పిపోవును. చిన్నవారివల్లఁగాదు. చిఱుతవారివల్ల! గాదు. ఆఁడవాళ్ళవల్లఁగాదు. జాగ్రత్త జాగ్రత్త! భద్రము! భద్రము, మేలుకొనుఁడు! మేలుకొనుఁడు! మూసినకన్నులు తెఱువుఁడీ, మోఁసపోకుఁడి. ప్రాణాలు దక్కించుకొనండి! బాగుపడుండి."

ఆమాటలువిని మనస్సులలో భయము శంకయు నెలకొన వానిఁబిలిచి కొందఱు "ఏమియాపదవచ్చు? నీకెట్లు తెలిసినది?" యని ప్రశ్నించిరి. ఆప్రశ్నలకు వాడిట్లనియె. "ఏమియాపదని చెప్పుదును! మానములు దక్కవు. మాటలుదక్కవు. తనువులుదక్కవు. ధనములు దక్కవు. నీకెట్లు తెలిసినదని మీరడుగవద్దు. మేము భద్రకాళికి పెం

పుడు కొడుకులము. ఎల్లమారికమ్మ మాయిలువేల్పు. శంకరునిరాణి సాయిలరామజోగిని సాకును. అతఁడు రమ్మంటే యాతల్లివచ్చును. పొమ్మంటే యాతల్లిపోవును. పలుకుమన్న పలుకును. నిలువుమన్న నిలుచును. అదుగో! ఆతల్లి. నానోట పలికించుచున్నది. ఇట్టిప్రశ్నల మీరువేసితిరా తల్లికోపించి యిప్పుడే నిప్పులవాన గురిపించును. అట్టి ప్రశ్నలడుగఁబోకుఁడు. అది మీకు మేలుగాదు. అదిమీకు మంచిగాదు. కొఱవిబెట్టి తలగోఁకికొనవద్దు.''

అతనిమాటలు విన్నతోడనే యెల్లవారును భయమున గడ గడ వడఁకిరి. బుద్ధిమంతులగు పెద్దవాండ్రు ప్రశ్న లడుగువారిని జీవాట్లుపెట్టి యాయుద్యమము మాన్పిరి. కొందఱు ''స్వామీ! సాయిలరామజోగీ! మాతప్పు మన్నింపు'' మని దండములుపెట్టిరి. కొందఱు రూకలు బియ్యము వస్త్రములు మొదలగుకానుకలు భక్తియుక్తులై యాతనికి సమర్పించిరి. కాని, యాతఁడు వానిం గైకొనక యిట్టులనియె. ''మాకు బట్టలువద్దు పాఁతలువద్దు, బియ్యమునకు రాలేదు. బిచ్చమునకు రాలేదు. రూకలు వద్దు; కోఁకలువద్దు. మీ మీఁద దయచేత జగజ్జనని దుర్గ పంపఁగా వచ్చితిని. కీడెఱిఁగించితిని. మేలుదారి తెల్పితిని. పోవుచున్నాను. పోవుచున్నాను. జాగ్రత్త! జాగ్రత్త!'' అని పలుకవలసిన పలుకులు పలికి కలిగింపఁదలఁచిన యలజడి గలిగించి వెలుఁగు రాకమునుపె తనదారిం బోయెను.

అంతట సైనికులు పరిపరివిధముల సవిస్మయమై చర్చింపఁ దొడఁగిరి. ''ఎవఁడో బిచ్చగాఁడు పిలువనిపేరంటముగవచ్చి వానికిఁ దోఁచిన కూఁతలుగూసి పోయినాఁ''డని కొందఱనిరి. ''బిచ్చగాఁడైన పక్షమున మనముసమర్పించిన తండులములు వస్త్రములు ధనము నేల గ్రహింపకపోవు నందుచేత నతఁడు తక్కిన సాయిలవాండ్రవలె జనులనుబీడించి తిరిపమెత్తువాఁడుగాఁడు. మంత్రప్రభావమున క్షుద్రదేవ

తల వశపఱచుకొన్నవాఁడుగాని సామాన్యుఁడు గాఁ"డని కొందఱు పలికిరి. 'వట్టికూఁతలుగా వానిమాటలుత్రోసిపుచ్చరా'దని కొందఱు వచించిరి. "నల్లచీరగట్టుకొన్న యాఁడుది చీపురుపుచ్చుకొని యూడ్చుట శ్రేయస్కరముగా"దని కొందఱు వక్కాణించిరి.

అట్లు వారు గుంపులుగుంపులుగఁజేసిరి ప్రాతఃకాలమునఁ బలుతెఱంగులఁ బ్రసంగించుచుండ నంతలో దండపాణి యశ్వారూఢుడై యచ్చోటికిఁ బోయెను. సైనికులులేచి జోహారులుచేసిరి. "అట్లు గుంపులు గుంపులుగాజేరుటకు హేతువే"మని యాసేనాపతియడుగ వారు వేకువనుజరిగిన వృత్తాంతమంతయుఁ బూసగ్రుచ్చినట్లుజెప్పిరి. అదివిని దండపాణి యచ్చెరువుపడి "ఏమీ! నల్లచీరగట్టుకొన్న యాఁడుదియా? చీపురుపుచ్చుకొని యూడ్చుచున్నదా? చిన్నవాండ్రవల్లగాదు. చిఱుతవాండ్రవల్ల కాదనిచెప్పినాఁడా? గొప్పవారియందఁ జేరుమన్నాఁడా? జగజ్జననియైన మహాకాళి తనకీదేవరహాస్యములు చెప్పినదన్నాఁడా? సరె! మనకేదో మూఁడదలఁచుకొన్నది. సాయిలవాండ్ర మాటలు కల్లలని మనము త్రోసివేయరాదు. వారికి క్షుద్రదేవతలు ప్రత్యక్షమగుచుందురు. కల్లు మాంసము మొదలగు పదార్థములు నివేదించి వారాదేవతలను వశముజేసికొందురు. అందుచే నాగతానాగతములు వారికిఁ దెలియుచుండును. నల్లచీరగట్టుకొన్న యాఁడుది మనపాలిఁటి నాశనదేవత. ఇదిచాల దుశ్శకునము. దీనికిం దగినప్రతిక్రియ మనము చేసికొనవలెను. పడమటనుండి పగవచ్చునని వాఁడు చెప్పెనుగదా! పడమటిపగ యనఁగా గాంధారదేశపు దండయాత్ర. దక్షిణమునుండి దండువచ్చుననఁగా సింధురాజు దండెత్తుట. ఇది మీరెఱుఁగరుగా బోలు! పండ్లచెట్లపై గాళ్ళువిసరినట్లు ఫలవంతమగు దేశమునుగొట్టి యాక్రమించుట కనేలు సిద్ధమగుదురు. మనోజ్ఞవస్తువెల్ల వారి కాసగొల్పును. అట్లే కాశ్మీరరాజ్యము రాజసింహాముల కామితము

గానున్నది. ఆరాజులిద్దఱు.వచ్చి చెఱియొకప్రక్క ముట్టడించిరా తలుపుసందునఁబడిన వెలగకాయవలె మనము నలిగిపోదుము. కావున మనము దీనికిఁ దగినప్రతీకారము సేయవలయు'' నని వారి కుపదేశించెను. ఎట్టిప్రతిక్రియ! ఏమిప్రతిక్రియ? యని వారు తొందరతో నడిగిరి.

అడుగుటయు నతఁడు సర్వము కొంచెము తగ్గించి ''యెట్టిప్రతిక్రియ యని చెప్పుదును? దానికొక్కటే మందున్నది'' అని స్వరము హెచ్చించి ''మనరాజు బాలుఁడు. ఆలముల ముక్కాకలు దేఱినమీవంటి పోటుబంట్లకు మొనగాఁడై నిలిచి మిమ్ము రణరంగములకుఁ దోడుకొనిపోయి మీమనస్సులు, నుత్సాహరసముతో నిండించి పురికొల్పి మీచేత సాహసక్రియలు చేయించి మనదేశమును రక్షింపఁగల మేటిశూరుఁ డొక్కఁడున్నాఁ''డని యూరకుండెను. అతఁ డెవ్వఁ డెవ్వఁడని యందఱడిగిరి. ''అతఁడా—అతఁడా—చెప్పనా? మీరు నాచెప్పినచొప్పున చేయుదురా?'' యని యతఁడు సందిగ్ధమనస్కుఁడై పల్కెను. ''మీరుచెప్పినచొప్పునఁ దప్పక చేయుదుము, తప్పక చేయుదుము'' అని వారైకకంఠ్యముగఁ బల్కిరి. ''అతఁ డీరాత్రివచ్చి స్వయముగానే మీతో మాటాడును లెండి. నేనిప్పు డాయన పేరు మీతోఁ జెప్పను. భానుదర్శనమునఁ దామరలువిచ్చినట్లు వానింజూచి మీమొగములు వికసింపఁగలవు. చంద్రదర్శనమున స్రవించుచంద్రకాంతశిలలవలె మీమనస్సులువానింజూచినంతనె యుత్సాహరసపూరితములై యుండగలవు. పేరుచెప్పుమని నన్నడుగవద్దు. నేఁటిరాత్రి జామయినతరువాత మీకడకాయనవచ్చును. మీరు భోజనములుచేసి సిద్ధముగనుండుఁడు'' అని దండపాణి వారికినచ్చఁ జెప్పి యధేచ్ఛంబోయెను. ఆవచ్చునట్టి మహావీరుఁ డెవడై యుండునా యని సైనికు లూహించుచు వారిరాక నిరీక్షించుచుండిరి.

పదియైదవ ప్రకరణము

క్రమక్రమముగ సాయంకాలమయ్యెను. దీర్ఘప్రయాణముచేసిన తెరువరి గమ్యస్థానముఁ జేరి విశ్రమించుతెఱఁగున భానుఁడు పశ్చిమాచలశృంగము నలంకరించెను. చరమగిరిమీఁద వ్రేలాడుజపాకుసుమగుచ్ఛమువలె నావృద్ధభానుని బింబము కట్టెఱ్ఱనై చూపఱకనులకు విందుసేయుచుండెను. చిన్ననాఁటిగుణములు చరమకాలమున నయిన విడువ వనుటకు దృష్టాంతరముగ నుదయవేళనున్న యారుణ్యమే ప్రభాకరునియందు సాయంకాలమునఁగూడ గనఁబడెను. ఆశ్రమచతుష్టయములలోఁ గట్టకడపటిదగు సన్న్యాసమును గర్మసాక్షియయిన ప్రభాకరుఁడు స్వీకరించి ధరియించిన కాషాయాంబరమో యనునట్లు సంధ్యారాగము నభోమండలమున వ్యాపించి దర్శనీయమయ్యెను. మహాసౌధముమీఁదనుండి క్రమక్రమముగాఁ గ్రిందికిదిగునట్టిపురుషునట్లు క్రమక్రమంబుగా దివాకరుఁడు క్రిందికిదిగిదిగి యస్తమించి యగోచరుఁడయ్యెను. చండశాసనుఁడగుపరమేశ్వరుని నియమప్రకార మెవ్వరిధర్మము వారు నిర్వర్తింతురని తెలియఁజేయుట కోయన సూర్యాస్తమ యానంతరమునకలనరమునఁ జంద్రోదయమయ్యెను. జనులకానందోదయమయ్యెను. కాలపురుషుండు గప్పుకొన్న తెల్లపట్టుపుట్టంబువలె విశ్వమంతటవెన్నెలవ్యాపించెను. మహాపురుషుని తేజముముందఱ నెందుకుం బనికిరాని యల్పపురుషుల ప్రభావముంబలె లెక్కకుమిక్కిలి యగుచుక్కలవెలుంగు శీతమయూఖుని తేటవెన్నెలలముందఱ, వెలవెల బోయెను. చల్లదనములకు సీమయైన చందమామను జూచినతోడనే యెల్లజీవుల కనులు చల్లఁబడెను. ఉల్లములుచల్లఁబడెను. సేనానివేళములో సైనికులందఱుఁ దమకొఱకై రాదలఁచిన యాపద్బాంధవునిఁజూడ నుబలాటపడుచుఁ బెండలకడభోజనములుచేసి తెల్లబట్టపర

చినట్లు చంద్రికాపసరణముచేత వెలయుచున్న బయలునేల కరిగి గుంపులుగూడి తద్విషయికములైన ప్రసంగములు జేయుచుండిరి. ఎవరువచ్చినను నాతఁడేమోయని యట్టులెత్తి చూచుచుండిరి.

అంతలో దండపాణి యొకపురుషుని వెంటఁబెట్టుకొని యచ్చో టికివచ్చెను. అప్పురుషుఁడు కనఁబడినతోడనే "చిత్రభానుఁడు చిత్ర భానుఁ"డని సైనికులు మెల్లమెల్లఁగా ననఁజొచ్చిరి. అందఱినోటఁ చిత్రభానుని పేరేయుండెను. అందఱికన్నులకు జిత్రభానుఁడే కనఁ బడెను. చంద్రప్రభయు భానుప్రభయు నేకకాలమున సంభవించిన పక్షమున నెట్టి యాశ్చర్యము జనించునో నాఁటిరేయి జనులఁకట్టి యాశ్చర్యము జనించెను. 'ఇతఁడు హరిద్వారమునఁ జచ్చినాఁడని వింటిమిగాదా'యని యొకరు "కాదుకా దీనడుమ నిక్కడనే యున్నాఁ"డని యొకరు 'భ్రాతృమరణహేతు వితఁడే గాదా'యని యొకఁడు సది నట్టిమాటయని యొకఁడు పురమునుండి వీనిని వెడల నడుచ మణివర్మ సమకట్టెఁ గాదాయని యొకరు దేవిగా రుండుమని నారని యొకరు సైనికులు తమలోఁ దామునానావిధముల భాషింపఁ జొచ్చిరి. అప్పుడు దండపాణి యచ్చటఁజేరిన జనులనుగూర్చుండఁ బనిచి యుపోద్ఘాతముగా నిట్లు చెప్పెను.

"వీరులారా! అనేకయుద్ధములఁ బేరుగాంచిన శూరులారా! మీకు మొనగాఁడై మీదేశము పరాక్రాంతము గాకుండఁజేయఁగల మహావీరుఁడు మీయెట్టయెదుటకు వచ్చియున్నాఁడు. మీకీయన చిరపరిచితుఁడుగాని క్రొత్తవాఁడుగాఁడు. ఈ మహాశూరుని ప్రజ్ఞా విశేషములు మీరు నావంటివానివలన వినఁగోరుట చిన్నదివ్వెసాయ మున సూర్యబింబమును జూడఁగోరుటవంటిదని తలంచి యీ మహా భాగుని విక్రమవిహారములు వర్ణింప నిశ్చగింపను. కుమారస్వామి దేవతలకు దళవాయియై మొక్కలు లగు రక్కసుల నుక్కడంచి

దేవలోకము నుద్ధరించిన తెలుంగున నీరాజకుమారుఁడు శత్రుసైన్యములఁ నుఱుమాడి మీదేశమునకు సౌఖ్య మాపాదింపఁగలఁడు. ఈయన హేమచంద్రమహారాజు తమ్ముఁడు, చిత్రభానుఁడు. అన్నగారి కుటుంబమును బరామర్శ చేయుటకును దనకు శక్యమైన సాయము జేయుటకును వచ్చియున్నవాఁడు. విల్లుపట్టి నా రఘురాముని భృగురామునిఁ దలపించును. ఇతఁడు బాణంబువిడిచెనా శత్రువుఁడు ప్రాణంబు విడుచును. ఇతఁడు కలియుగార్జునుఁడు. మనల నాపత్సముద్రమునుండి యుద్ధరింపఁ గల యోడయిదే. మన విచారాంధకారమును మాపఁగల భానుమండలమిదే! మన సంతాపమడఁచి చల్లని నీడనిచ్చు వృక్షమిదే. కావున వీని నాశ్రయింపుఁడు. ఆయన చెప్పెడు మాటల సావధానులై యాకర్ణింపుఁడు'' అని యతఁడు విరమించెను.

''జయము! చిత్రభానుఁడా జయము!'' అని సభాసదులలో ననేకులరచిరి. ''స్వాగతము! మీకు స్వాగతము!'' అని కొందఱు కేకలువైచిరి. ''మీవచనామృతమును వర్షించి మాసంతాపముఁ దీర్పుఁ'' డని కొందఱు బిగ్గఱగఁ జెప్పిరి. అదివిని సభాస్థారులలోఁ దన కనుకూలమైన భావము పొడమినదని తెలిసికొని ధైర్యము దెచ్చికొని చిత్రభానుఁడు ముందరకువచ్చి సభాసదులముందఱ నిలిచి యీవిధముగాఁ బ్రసంగించెను.

మహాయోధులారా! దండపాణిచెప్పినట్లు మీకు నేను క్రొత్తవాఁడనుగాను. పూర్వపరిచితుఁడనె. హేమచంద్రమహారాజు తమ్ముఁడనని విక్రమసేనునిఁ రెండవ కొడుకునని నాపేరు చిత్రభానుఁ డని మీరందఱెఱుఁగుదురు. మీలో ననేకుల నేను మున్ను మాయన్నగారియనుగ్రహమునకు బాత్రమైనకాలమునఁ జూచియుంటిని. కొన్ని యుద్ధముల మిమ్ముఁగొనిపోయి గెల్చియుంటిని. మీవలన నేను పేరు గాంచియుంటిని, నావలనమీరు కీర్తిగాంచియుండిరి. కాలవశమున

మంత్రులమాయలచేత నాకును మాయన్నకును మనంబుల స్పర్థలు జనించినవి. చాటుననుండి సమిధలునై చి సచివులు వైరాగ్నిని బ్రజ్వ లింపఁజేసిరి. ఆయగ్ని మాసోదరుల సహజమైత్రిని దగ్ధముచేసినది, ప్రేమను భస్మపటలము గావించినది. అప్పుడు మాయన్న మంత్రుల మాటలు విని నిరపరాధిని-నిష్కపటిని-నిర్మలచిత్తుని-నిజసోదరుని నిరా ధారునిఁజేసి స్వదేశమునుండి వెడలనడఁచెను. అపుడు నేను సపుత్ర ముగా సకళత్రముగా నూరువిడిచి-దేశమువిడిచి-బంధుమిత్రులవిడిచి పోయి దారపుత్రుల విదర్భలోనిలిపి యత్తవారింట నుండుటయనుచిత మని భావించి రాచబిడ్డనగుటచే నాత్మగౌరవమును పాటించి దేశ ములపాలై తిరిగితిని. నాపడినకష్టములన్నియు వరుసగా మీకుఁజెప్పఁ బూనితినేని మీమనస్సులు విచారసముద్రమున మునుంగును కన్నీరు వరదలై పాఱును ఒక్కొక్కసారి యాత్మహత్య చేసికొనుట యుక్త మని ప్రయత్నించితిని. అది నామిత్రులు వారించిరి పక్షులకైన గూడు లుండును. పులులకైన దలఁదాచుకొనుటకు పొదలుండును. సింగముల కైన గుహలుండును. నాకంతమాత్రమైన నెలవులేకపోయినది. రాచ వాఁడనగుటచే నొకరినడుగఁజాల ఆగర్భసుకుమారుఁడనగుటచే మేను వంచి పనిచేయఁజాల. అభిమానధనుఁడ నగుటచే సేవవృత్తులం దిగఁ జాల. అన్నములేక-బట్టలులేక-నిలువ నీడలేక-చుట్టములులేక-పక్క ములులేక యేకాకినై చిరకాలము తిరిగితిరిగి యీశ్వరానుగ్రహమున నెట్టటో బ్రతికి యుంటిని. దైవమునే నమ్మియుంటిని. శివుని నమ్మిన వాఁడు చెడిపోవఁడని నానమ్మిక. ఎందుకు బ్రతికించెనో దైవమునన్ను బ్రతికించెను. స్వప్నావస్థయందైన నేను మాయన్నగారిని దూషింప లేదు. నా దురదృష్టమును నిందించుకొంటిని గాని మాసోదరుని నిందింపలేదు. ఆయన నిష్కళంక చరిత్రుఁడు. నిరుపమానత్యాగశీలి. లోకోత్తరచరిత్రుఁడు. అగ్నికి ధూమము పేరిట మాలిన్యముగలదు.

చంద్రునకు మచ్చగలదు. కాని యమ్మహాత్ముని చరిత్రమునకు మచ్చ లేదు. ఆతఁడు నేలపై నవతరించిన నారాయణుఁడే. అట్టివాని నీచల్లని సమయమున దృష్టికిఁ దెచ్చుకొని మనసుంకటము ధన్యుల నగుదము గాక ! అట్టి మహారాజును-అట్టి దయాశాలిని-అట్టి శాంతచిత్తుని-అట్టి పరమపవిత్రుని నట్టి లోకమిత్రుని నట్టి సుగుణరత్నాకరుని- హా ! దురాత్ములెవ్వరో దారుణవధముపాలు చేసిరిగదా ! హా ! హేంమహా చంద్రా !! హా ! భ్రాతృవత్సలా" అని కన్నులనీరు జొటజొటఁగార మాటాడలేక దుఃఖపరవశుడై నిలువబడలేక నేలపైఁ జదికిలంబడెను. అతని దుఃఖముఁ జూడఁగానే సభాసదులకుఁగూడ మిక్కిలి విషాదము జనించెను. వారును బాష్పధారలచేతఁ దమ దుఃఖము బ్రకటించిరి. అనంతరమునఁ జిత్రభానుఁడు వెండియు నిట్లు బ్రసంగించెను.

"ఆమహాత్ముని జంపించినవారెవ్వరో నే నెఱుఁగుదును. కానివారి పేర్లిప్పుడిక్కడఁ జెప్పను. పాప మెన్నటికైన బయలుపడకమానదు. మగనిజంపి మొగసాలలో మొఱ్ఱలెత్తినది యను సామెత నిజముగా నాపైఁ దోడును జంపించిన దురాత్ములే. తమమీఁద నెవ్వరికనుమానము లేకుండఁ జేసికొనుటకై నేనే యీ ఘాతకృత్యముఁ జేసితినని లోకమునం బ్రవాదము బుట్టించిరి. ఎక్కడనో నరులు చేరని నట్టడవులలోఁ గాకులైన లేని కాఱడవులలో మృగములయట్లు నేనును నాకు లలములు దిని పొట్టబోసుకొని కాలక్షేపము చేయుచుండ దుస్సహమయిన యపవాదము వారు నాపై బడవైచిరి. మహేశ్వరపూజా నిరతములైన యీహస్తములా యిట్టిఘాతుకకృత్యము జేయుట? మహానీయులగుముని జనులకు నమస్కరించునట్టి యీచేతులా- యన్న నెత్తురుతోటి యపవిత్రములగుట? ఛీ! అట్టిపని నేనా చేయుట ? విక్రమసేనుని కొడుకా యీనింద్యకర్మకుఁ బాల్పడుట ? ఈయపవాదము వచ్చిననాఁటంగోలె నాహృదయము విషాదాగ్నిచే మండిపోవుచున్నది. ఈ సంతాపము

చేతనే నేను చిక్కుసగమైతిని. నాహృదయ మెవ్వరయినఁ బరీక్షించి చూడలేని యది సంతాపమను యగ్నిలోఁ బడి కాలిపోవుచున్నట్లు దెలియును. నరుఁ డేదైన మోయఁగలఁడు గాని నిందాభారము మోయఁజాలఁడు. నింద పడుటకంటె చచ్చుటమేలు. నాపైనున్న యపవాదము బాపుకొనుటకే నిటు వచ్చితిని. నిర్హేతుకముగ నిందపైబడినను సజ్జనుఁడుదానిం బాపుకొనుట కర్తవ్యము. కర్తవ్యమగుటచేతనే గదా సాక్షాన్నారాయణావతారుఁడైన భగవానుఁడు శ్రీకృష్ణుఁడు శమంతకమాణిక్యాపహరణ ప్రవాదముఁ దనపైఁబడినపుడు తానా దోషములుంగక పోయినను లోకాపవాదముఁ బాపుకొనుటకై దేశదేశములుతిరిగి జాంబవంతుఁ డమ్మణిని గ్రహించినాఁడని తెలిసికొని యా భల్లూక ప్రభువుతోఁబోరాడి మణిం గ్రహించి సత్రాజిత్తునకిచ్చి నిందాభారమును దించి హృదయమును జల్లనజేసికొనెను. కర్తవ్యమగుటచేతనేకదా యిక్ష్వాకు కులప్రదీపకుఁడైనరాముఁడు నిర్మలచారిత్రయైన జనకరాజకన్యకను నిండుచూలాలనియైన శంకింపక గహనాంతరములకుఁ బంపెను. మానవంతునకుఁ బ్రాణముకన్న సత్కీర్తి ప్రియము. అతఁ డసువులనైన విడుచునుగాని సద్గుణము విడువఁడు. అందుచే నేనట్టి మహాపాతకముఁజేసినవాఁడను గానని మీరెల్లరు నమ్మి యున్న మీమనంబుల దురాత్ములచే నాటఁబడిన యనుమాన బీజంబులఁ బెల్లగింపవలయునని చేతులుజోడించి వేడుచున్నాను. ఏమి మీయనుమానములు తీరినవా లేదా? ఇంకను శంకాశల్యములు మీమనంబులఁబీడించుచున్నవా?" అనిబిగ్గఱగాఁ నడుగ వారిలోననేకులు "లేదనుమానములేదు. శంకలుతీరినవి" యని కేకలువైచిరి. వైచుటయుఁ జిత్రభానుఁడు "మంచిది ఇప్పుడు నేను ధన్యుఁడనైతిని. ఇప్పుడు నేను మనుష్యుఁడనని తలంచుచున్నాను. ఇప్పుడు నేను రాచబిడ్డనని గర్వించుచున్నాను. ఈమహాజనాభిప్రాయమేమో నాకు

ధైర్యము గలిగించుచున్నది. ఇంక నే ప్రస్తుతాంశములను గూర్చి కొన్ని మాటలు చెప్పి విరమించెద” నని యిత్తెఱంగున బలికెను.

“యోధులారా! పరమసాధులారా! మనదేశము కల్పవృక్షములులేని స్వర్గఖండము. ఈనేలయంతయు రత్నగర్భ. సింధునది తన బాహువులతోఁ గాశ్మీర దేశలక్ష్మిని గాఢాలింగనముచేసికొన్నదో యన్నట్టు లుపనదుల నెల్ల నెల్లయెడల వ్యాపింపఁజేసి దేశమును సారవంతము జేయుచున్నది. ఎక్కడఁజూచిన తీయని నీరు. ఎక్కడఁ జూచిన ఫలవృక్షములు ఎక్కడఁజూచిన బచ్చనిపంటలు, ఎక్కడఁ తృణకాష్ఠజలసమృద్ధి, ఎక్కడఁజూచిన గామధేనువువంటి పాడిమొదవులు ఎక్కడఁజూచిన ధనధాన్యసమృద్ధి. ఇక్కడిపడఁతులు చక్కదనమున వేల్పుటువిదల వెక్కిరింపగలరు. ఈపర్వతములు-ఈసెలయేళ్లు-నీపూఁదోటలు - నీవనలక్ష్ములు - మధురగానములుసేయు నీవిహంగములు-నీనానావిధజంతుసంతతులు జూచిన నెవనికన్నుకుట్టదు? ఎవని నోరూరదు? ఎవని కాస పుట్టదు? ఎవనిచిత్తము భ్రమింపదు? నవలావణ్యవిరాజమానయగు సుందరిసిగన్నప్పుడు పరమయోగియైనను కలచిత్తుఁడగునట్లు వనంబులనియెడు శిరోజములు సరస్సులనియెడు నేత్రములు నదులనియెడు ముత్యాలహారములు వసుంధరయనియెడు మేనుగల దేశాంగన జూచి చుట్టుప్రక్కలనున్న రాజులు మంచివారైనను నాసపడుట సహజము. అందు ముఖ్యముగా నేలిక బాలకుఁడైనప్పుడు వెఱ్ఱివానియిల్లాలు వాడకెల్ల వదినెయైనట్లు దేశ మెల్లరాజులకు లోకువయై యాసలకు గుఱియై యుండును. ఇప్పుడు గాంధారరాజు మన దేశముపై దాడువెడలఁ బోవుచున్నాఁడు. ఈవార్త మీరు వినియే యుందురు. విశేషించి సింధురాజుగూడ దీనిపైఁ గన్నువైచినాఁడు. చియ్యపట్టినమేకను జూచిన బెబ్బులుల నోరూరదా! పడమటినుండి గాంధారులు దక్షిణమునుండి సింధురాజు మనపైదాడివెడలిన ముక్కు

పచ్చలారని ముద్దుబాలుఁడు దేశమును రక్షింపఁగలఁడా! తన్నుఁ గాఁచుకొనఁగలఁడా? సైన్యమును నడుపఁగలఁడా? సన్నాహము సేయఁగలఁడా? చేయఁగలఁడనుకొనుము. మంత్రులతనికిఁ గాళ్ళసంకెలలు. వారు హారముల కాసపడియు నగ్రహారముల కాసపడియు, ధనములఁ గోరియు సౌఖ్యసాధనములఁ గోరియు పగఱతోఁ జేరి దేశమును వారి కప్పగింపఁ దలఁచుచున్నారు. ఇంతకన్న రాజద్రోహముగలదా? ఇంతకన్న దేశద్రోహముగలదా? ఇంతకన్నఁ బాపముగలదా? ఇట్టి యమాత్యుల- స్వామిద్రోహుల - లంచగొండుల - దేశవిక్రయులఁ- బయోముఖవిషకుంభముల గోముఖవ్యాఘ్రములఁ గొరతవేసిన బాపమున్నదా? మేనిచర్మమొలిపించిన దోషమున్నదా? బ్రతికియుండఁగఁ నిప్పులం గాఁరలించినఁ దప్పున్నదా? పాపములేదు. లేదు దోషము లేదు. కాని రాజు బాలుఁడు సాధుశీలుఁడు తల్లియాఁడుది. అసూర్యంపశ్య పరపురుషవిముఖ. మంత్రులె యామె చెవులు. మంత్రులె యామె కన్నులు. మంత్రులె యామె చేతులు. ఇట్టిస్థితిలో నామె యేమిచేయఁగలదు! బాలుఁడేమి చేయఁగలఁడు! కావున మీ దేశసంరక్షణము యోధులయినమీరు మహాయుధపాణు లయిన మీరు శూరాగ్రేసరులయిన మీరు దేశాభిమానులైన మీరు-రాజభక్తులైన మీరు నేఁడు చేసికొనవలయు. దానంజేసి దేశసంరక్షణమేగాక మీ యాత్మసంరక్షణము రాజకుటుంబరక్షణము మొదలగు నన్నియు జరుగును మిమ్ము నడుపుటకుఁ దగిన దళవాయి నేర్పరచుకొని నగరము చక్కఁజేసికొని దురాచారుల మేరమీఱకుండ బంధించి వలయు సాధనసామగ్రుల సమకూర్చుకొనిపిమ్మట బగఱపై నడువవలయు. యోగులైనను ముందుగా నంతఃపురశత్రువుల గెలుతురుగదా! తగిన మొనగాఁడుండిన గాంధారరాజుగర్వము క్షణములో నణఁపవచ్చును. సింధురాజుసేన త్రుటిలో నణఁపవచ్చును. మీ కందర మిష్టమైన

మొదల దండపాణి వజ్రపాణి ప్రముఖుల సాయముగొని నేనే గాంధారుల నెదిర్చి జయము చేకూర్చెద. కాశ్మీర రాజ్యము సురక్షితమైయుండుటే నా యభిప్రాయముగాని నా ప్రజ్ఞ జూపుట నా యిష్టముగాదు. జనవాక్యంతు కర్తవ్య మ్మను లోకోక్తినిబట్టి మీ కందఱ కేదియిష్టమో యదియే చేయుట నాయిష్టము. మీయభిమత మెఱింగింపుడు" అని యుపన్యాసము విరమించెను. వెంటనే ఇక్ష్వాకుండు లేచి "అయ్యా! మీరే మమ్ము నడుపుడు. రాజ్యమును గాపాడుడు. దురాత్ములైన యామంత్రుల బంధింపుడు. స్వామిద్రోహుల సంహరింపుడు." అని బిగ్గరగా నఱచిరి. కొందర కడుట కర్తవ్యము గాదని కొందఱు లోలోపల ననుకొనిరి. కొంద ఱట్లు కాదని మూలఁగిరి. కొందఱు స్పష్టముగాఁ దెలియకుండ గొణుగుకొనిరి.

మొత్తముమీఁద సైనికులలోఁ బెక్కండ్రు చిత్రభానుని గంభీర వచఃప్రభావమువలన సమ్మోహితులైరి. జనసామాన్యమునకు నేదేనొకవిషయము మనస్సుల నాటునట్లు చెప్పుట గడ్డిమేటికి నిప్పు పెట్టుట. అవి చరచర యంటుకొని మహాజ్వాలగా మండునట్లే జన సామాన్యముగూడ నట్టిసంభాషణ విన్నపిదప నొడలుదెలియక వర్తించును. 'కలౌ సంఘేశక్తిః' యను నార్యోక్తి నిజము. సంఘశక్తికి మించిన శక్తిలేదు. అందుచేత సంఘమునెదుట సాహసోక్తులుబల్కుట పులికొల్పుట యేనుగునకు సిడులుచూపుటయని భావింపవలెను. మదించిన యెద్దునకు కెఱ్ఱగుడ్డచూపుటయని తలంపవలెను. వేఁటకుక్క నుసికొల్పుట యని యెంచవలెను. జనసామాన్య స్వభావ మిట్టిదని యెఱిగినవాఁడగుటవలననే చిత్రభానుఁడు వారి చెవులలో నయ్యుపన్యాసవిషము బోసెను. అది వారి తలకెక్కెను. "రండు! లెండు! చిత్రభానుని సేవింపుడు. దేశము గాపాడుడు. ద్రోహులఁ దుద ముట్టింపుఁడు" అను కేకలు వినంబడెను.

అప్పుడు చిత్రభానుఁడు "యోధులారా! మీరంతయు శాంతిం పుఁడు. సాహసించి యెట్టిపని చేయఁగూడదు. నిదానించి కార్యములు చేయవలెను. అవిచారత సకలాపదలకు హేతువు. మీరు స్థిరబుద్ధితో నుండుఁడు. మఱి యెవ్వరేమాటలు చెప్పినను వినకుఁడు. స్వకార్య పరతంత్రు లగు మంత్రులు తంత్రములుపన్ని మిమ్ముం బేలుపుచ్చఁ బ్రయత్నింతురు. వారిమాయలలోఁ బడవద్దు. ఎల్లియో తేపో నేను వచ్చి మిమ్ముం దోడ్కొనిపోయి కర్తవ్యముఁ ~ వించెద. ఇప్పటికి నాకు సెలవొసంగుడు."అని చెప్పి దండపాణిసహితుఁడై తన నిల యంబునకుం బోయెను. అతఁడు వెళ్ళినపిదప సైనికులు మరల గుంపులుగుంపులుగాఁ గూడి నోటికివచ్చినట్లు జెప్పుకొనఁజొచ్చిరి. "అతఁడే తమ్ము నడుపఁదగిన మొనగాఁ"డని కొందఱు పలికిరి. ఆహాహా! వాని భ్రాతృప్రేమ కనుఁగొంటిరా! అతని పేరెత్తఁగానే యెంత దుఃఖపడెనో యని కొందఱు, వానిపలుకు లన్నియు సత్యములే యం దొక్కటి పొరపాటు లేదని కొందఱు, వానికన్న మనకు గత్యంతరము లేదని కొందఱుఁ బలికిరి.

"ఈ వెంగలిమూఁకను కల్లబొల్లిమాటలతో బేలుపుచ్చి యతఁడు స్వకార్యసాధనము చేసికొనుచున్నాఁ"డని కొంద ఱనిరి. కాని యిట్టివా రల్పసంఖ్యాకులై యుండిరి. అధికసంఖ్యాకులు చిత్ర భానుని వలలోని చేఁపలయిరి. వానిచేతి కీలుబొమ్మల ట్లాడఁదలఁచిరి. రెండుజాముల రాత్రియైనపిదప నెల్లవారు స్వగృహంబులకుం బోయి నిద్రించిరి.

విక్రమసేనునిమీఁదఁ బక్షపాతమును మణివర్మమీఁద నభి మానమును సంపూర్ణవిశ్వాసమును గల సైనికులు కొందఱు తెల్ల వాఱుజామున లేచి గదాధరుని శూలపాణినిం గలిసికొని కడచిన రేయి చిత్రభానుఁడు నెఱపిన చిత్రవృత్తాంతమును దెలిపిరి. వారును

కలఁతఁజెందిన మనంబులతో మణివర్మ నిలయమున కరిగి చిత్రభానుని సాహసమును, దండపాణి ద్రోహమును, సైనికుల మహోత్సాహమును దెలిపిరి. వారి పలుకులువిని యా వృద్ధసచివుఁడు వారితో నిట్లనియె.

"మిత్రులారా! ఇంతవఱకు వచ్చునని నేను మున్నే కనిపెట్టితిని. దేవి నామాటలు పాటి చేసినదికాదు. విశేషించి చిత్రభానుని మాయలవలన దేవి మనలనందఱ రాజద్రోహులుగాఁ బరిగణించినది. చేఁప లెఱ మ్రింగి చెడును. పక్షులు దమములచేత భంగపడును. మానవులు మాయలమాఱులవలన నష్టపోవుదురు. దేవి కెవ్వరో మన మీఁదఁ బలుకొండెములుజెప్పి మనపై ద్వేషముఁ గలిగించిరి. ఇప్పుడు మన మేమిచెప్పిన నామెకు రుచింపదు. పైత్యరోగమున రుచిచెడిన జిహ్వకుఁ జక్కెరయుఁ జేఁదగును. అట్లే యోఁగాముల విచారింపక సేవకుల పూర్వచారిత్రములఁ దలంపక వంచకులమాయలం బడినవా రెండమావులు నీళ్ళనినమ్మి నశియింతురు. ఇప్పు డొకపని చేయుట కర్తవ్యము. మీరుపోయి మీపక్షముననున్న సైనికుల నందఱ వారితోఁ జేరకుండఁ జేయుఁడు. రాణికి మాధవసేనుని ముఖమున నీవృత్తాంత మెఱిఁగించెద. మీఁద నామెయిష్టము. ఇంతకు విక్రమసేనునకు రాజకుటుంబమునకు దుర్దినములు వచ్చినవి. మనకు దుర్దినములు వచ్చినవి. చిత్రభానుని యదృష్టము పండినట్లు గనఁబడుచున్నది. అఘటనఘటనా సమర్థుఁడైన పరమేశ్వరుని లీలల నధమాధములైన మనమెట్లు తెలిసికొనఁగలము! వేగమెపోయి మీరు పనిచేయుఁడు. నేనును మాధవసేనుని బిలిపించి కర్తవ్యముచేసెదను."

గదాధరాదులు తద్వచనము లాకర్ణించి వానిపనిచిన తెఱఁగునఁ జేయఁజనిరి. మణివర్మ మాధవసేనుని బిలువనంపి దేవికా వృత్తాంతము దెలియఁబంచెను.

పదియాఱవ ప్రకరణము

రాజ్యవ్యాపారము లీతెఱంగున నుండ వజ్రపాణి గృహవ్యాపార మెట్లుండవలెనో యట్లుండెను. ప్రధాననాఁటంగోలె నతఁడు ధర్మపత్నియైన సునందను మున్ను గారవించినట్లు గారవించుట మానెను. వెనుకటియట్లు దంపతు లిష్టాగోష్ఠి చెప్పుకొనుట కవకాశము లేకపోయెను. విరసోక్తులేగాని యాతనినోట సరసోక్తులు రాకపోయెను. అంతఃపురమున క్షణకాలమైన నతఁడు నిలువకపోయెను. ఏదో కారణము గల్పించుకొని యామె యతనితోఁ బలుకఁబోవ నతఁడు తగిన యుత్తరము చెప్పక విసుగుజెందుచుండెను. ఆమె సమాలోకమే వానికిఁ గిట్టకపోయెను. దానికిం గారణమేమని యామె బహువిధంబుల నరసెనుగాని కారణ మామెకుం బొడగట్టలేదు. కారణ మరయుమని పలుమాఱు పరిచారికలకుం జెప్పెనుగాని వారు నందుఁ గృతకృత్యులు కాలేకపోయిరి. కర్పూరమంజరీవిరహమున నతఁడు మఱుఁగుచుండ భర్త చేసెడి ననాదరణంబున నామె తసరుచుండెను. అట్లు దంపతు లిద్దఱు వేర్వేఱు కారణంబుల మనస్తాపము నొందుచుండుటచే గృహము శోభాహీనమై యుండెను.

ఒకనాఁడు వజ్రపాణి గాఢనిద్రపోవుచుండెను. సునంద మందమతియై తన పానుపుమీఁదఁ బండుకొని నిద్దుర రామి దనయవస్థం గూర్చి యిట్లు తలపోసెను. "మిక్కిలి మక్కువగల హృదయేశ్వరుఁ డాకస్మికముగ నూతనపురుషుఁడట్లు మాఱిపోవుటకుఁ గారణమేమి? నే నెఱింగినంతవఱకు నాచేసిన యపచార మేమియు లేదు. ఎప్పటియట్ల వినయవృత్తిగలిగియుంటి. మునుపటియట్ల యాయన మనస్సు రంజించుటకై యత్నించుచుంటి. ఆయన కనుసన్నల మెలఁగుచుంటి. నాపాలిదైవమని నమ్ముకొంటి. ఆయన యడుగులు కన్నుల నద్దుకొను.

చుంటి. ఇఱుప్రొద్దులు రుచ్యంబులగు భక్ష్యంబులు సేవకులచేతఁ జేయించి సమర్పించుచుంటి. గీచినగీటు దాఁటకుంటి. అనృతము చెప్పితినా? అప్రియము పలికితినా? పరపురుషులతోఁ సంభాషించితినా? ఎన్నఁడేని దలవాఁకిటనైన నిలిచితినా? ధనవ్యయము చేసితినా? అత్తలయెడ నాఁడుబిడ్డలయెడ దుర్వినయంబు సల్పితినా? ఆయన చుట్టముల జుల్కన జేసితినా? ఏమి నావల్లలోపము? ఏరితప్పు వారికిఁ దెలియదుగదా? అడుగులొత్తుదమన్న స్పృశింపనీయరు. ఊడిగములు చేయుదమన్న నొల్లరు. మాటలాడింతమన్న పలుకరు. కేదారరాగమన్న నీయనకెంతో యిష్టము. తఱచుగా వీణియమీఁద నది వాయింపుమని నన్ను గోరుచుండెడివారు. కొంతకాలమునుండి యా మాటయే లేదు. పాడుదునాయని యడిగిన వలదని తలయూచుటయేగాని మాటయైనం జెప్పరు. నామీఁదిరాగ మీదారినున్నప్పుడు కేదారరాగమెందుకు? ప్రాణేశ్వరుని మనస్సున కెక్కని పడఁతి జీవితమేల? ఆయన చిత్తరంజనముసేయని చెలువమేల? ఆయన కానందము గలిగింపని యలరుఁబోఁడి బ్రదుకేల? నావలనఁగల తప్పేమో చెప్పక యొప్పరికించి నప్పుడు నేనేమి సేయవలయు? నాతప్పు నాకుఁజూపిన దిద్దుకొని తగినతెఱంగున మెలంగుదునుగదా!" యని చింతించుచు రెండు కనుగొలఁకులనుండి వేఁడినీరు పానుపుపైఁబడ సునంద వెచ్చని యూర్పులు విడుచుచు నిద్రించుచున్న భర్తపై చూడ్కులు నిగిడించెను. ఆతఁడు గాఢనిద్రలో "కర్పూరమంజరీ! కర్పూరమంజరీ! ఏల సిగ్గుపడియెదవు" అని పలవరించెను.

అప్పలుకులు చెవినిబడినతోడనే యప్పొలఁతి మిన్నకు మగని మనసుం దెఱచిచూచుటకు సరియైన తాళముచెవి దొరకినట్లయ్యెను. కర్పూరమంజరి యెవ్వతెయో యామె యెఱుఁగును. ఆమెకు వివాహము కాలేదని యెఱుఁగును. ఆమె యసాధారణ లావణ్యవతియని

యెఱుఁగును. ఆమె చూపుతూపు లెవ్వరిపైఁబడునో వారి హృదయముల గాయములు పడునని యామె యెఱుఁగును. అప్పుడామె వెండియు నిట్లు తలపోసెను. "చిత్రభాను పుత్రికయైన కర్పూరమంజరిపై నీయనకు వలపునిలిచినదని నిద్రావశమున నప్రయత్నముగ నీయననోట వెడలిన మాటలవలనఁ దెలిసినది. ఈయనం గూర్చి యామెయే మేలుపడెనా లేక యాలోకైకసుందరి నిమిత్తమీయనే పరితపించుచుండెనా? ఎట్లయిననేమి? బంగారమువంటి నా కాఁపురము చెడిపోయినది. నిక్షేపమువంటి నా సంసారము నిస్సారమగుచున్నది. ఒక యొఱలో రెండుకత్తు లిముడునా? ఒక యర్ధశరీరములో నిరువురు పడఁతులు నిలుచుట కవకాశమున్నదా? ఒకతెను ద్రోసిరా జనవలె, రెండవదాని నచ్చోట నెలకొల్పవలె. ఇంతకన్న గత్యంతర మేమున్నది? పెద్దదానను. జవ్వనము కొంత వఱకుఁ జెల్లిపోయినదానను. మగని మనసు రంజింపఁజాలనిదానను. నేనే యొత్తిగిలవలయుఁగాని నిందుజవ్వనంబును నెఱజాణతనంబును జక్కఁదనంబును సౌకుమార్యంబును గల లేమ తొలఁగిపోవునా? అఱువదియవయేఁట యగ్నిగుండ మన్నట్లు పదునైదేండ్లు కాపురముజేసి సంతానవతినైన నాకు నీనాఁటికి సవతిపోరా? నేను వయసు మరలినదాన నగుటచే మిసమిసలాడు లేజవ్వనంబుగల క్రొత్తపెండ్లికూఁతురు మీఁదనే యీయనకు గౌరవముండును గాని నామీఁద లేశమైన నుండదు. ఆమె యడుగులకు మడుగులొగ్గుచు నామె చిఱునవ్వుల కలరుచు, నామె బోమముడుల కదలుచుఁ బ్రొద్దులు పుచ్చవలయుఁ గాఁబోలు! హా! పరమేశ్వరా!" యని విచారించుచు నొకమాఱు పాన్పుమీఁదినుండి లేచి యిట్టటు దిరుగుచు నొకమాఱు పండుకొనుచు నొకమాఱు భర్తను లేపఁదలచి నిద్రాభంగము సేయఁగూడదని మరల వెనుకకుఁబోయి తెగులులేని వేదనం బడుచుండెను.

అంతలో నాలవజాము కోడికూసెను. కోడికూసిన కొలందిదీ సెపటికిం గాకులు కావుకావుమని యఱచెను. అప్పుడు వజ్రపాణికి మెలంకువవచ్చెను. వచ్చినతోడనే యతండు మంచముమీంద లేచి కూర్చుండి కన్నులు తుడుచుకొని మహేశ్వరధ్యానము చేసికొని మంచముదిగెను. సునంద చేతులుజోడించి మగని యడుగులమీంద బడి కన్నీటితో వాటిం దడుపంజొచ్చెను. అతడు మిక్కిలి విస్మితుడై విస్మయమునకు భయము తోడుగ మిక్కిలి తొట్రుపాటుతో "సునందా! ఏమిది? యేమిది? ఎన్నండులేనిపని చేయుచుంటివి? నీకేమికష్టము వచ్చినది? బిడ్డలు సుఖముగా నున్నారా? నీపుట్టినింటి నుండి యేదేని చెడువార్త వచ్చినదా? నీశరీరమున నేదేని రుగ్మత కలిగినదా? చెప్పు చెప్పుము." అని పాదములపైనున్న ప్రాణసఖిని జేతులతో లేవనెత్తెను. ఆమె కన్నీరు విడుచుటయేగాని యాతని మాటలకు బదులు చెప్పదయ్యె.

అతండు భయము రెట్టింప నామె వీంపుపైం జేయివైచి తట్టి కల్యాణీ! భయములేదు. చెప్పు చెప్పు. పాడుకల యేదేని గంటివా? భయపడకు చెప్పు చెప్పు"మని వెండియు హెచ్చరించెను. కొంతవడి కామె యూరడిల్లి గద్గదస్వరముతో నిట్లనియె. "బిడ్డ లింతవఱకు సుఖముగా నున్నారు. ఇంకమీంద వారికి సుఖ ముండదని విచారించు చున్నాను. నా పుట్టినింటివారికి నేటివఱకుం గుశలమే. ఇంకముందది యుండదని వెఱచుచున్నాను. నా శరీరమందింతవఱకు రుగ్మతలేదు. ఇంకముందు జీవితశంక గలుగవచ్చునని భయపడుచున్నాను. పాడుకల నేనేదియుం గానలేదు. దేవరవారికే యట్టిది వచ్చినదని మనవి చేయుచున్నాను.

అప్పలుకులువిని వజ్రపాణి తెల్లబోయి "సుందరీ! నీపలుకులు నాకర్థమగుటలేదు. ఇది పిశాచభాషవలె నున్నది. విస్పష్టముగాంజెప్పి నామనస్సును జక్కంజేయు"మని పలికెను. అనవుండు సునందకంఠ

గాద్గద్యము కొంతవఱకు దిండుపడ స్పష్టమైనభావముతో నిట్లుత్తరము జెప్పెను. "అయ్యా! నేను మీకంటికిఁ బెద్దపిశాచమువలె గనబడుచుండుటచేత నాసంభాషణము పిశాచభాషవలె మీకుఁదోఁచుచున్నది. మీమనస్సు చక్కఁగ జేయుట నావంటిదానికి శక్యమా? కొంతకాలము నుండి దుర్గంధమునకుఁ దొరఁగినట్లు నాకు మీరు దవ్వు దవ్వుగ దొలఁగుచున్నారు. కర్పూరమంజరీ కారణమున దుర్గంధము తొలఁగి బోవునుగదా! నాకంపు దొలఁగించుకొని వెంటనే మీకింపుగలుగు నట్లు కర్పూరమంజరిని హృదయముచెంత ధరింపుఁడు. భర్త భరింపలేని మగనాండ్రను బావులు భరించును. వాఁగులు భరించును. భగవానుఁడైన పావకుడు భరించును. మనసులోఁ గర్పూరమంజరిపై మీకు మక్కువగలదని యెఱుఁగనుగాని మీ వైఖరియంతయు మాఱిపోవుట నే గనిపెట్టుచుంటిని. కంటిచూపుకరువయ్యె. నోటిమాట యరుదయ్యె. కలలోనైన నేఁబనికిరాక కర్పూరమంజరి కావలసివచ్చె. ఎనలేని యామమత యేయేటఁ గలసె? ఆ ప్రేమ యెందరిగె? ఆవిశ్వాసమే దేశాంతర మరిగె? ఇంతలోనే నాకింతదురవస్థ కలుగునని నే నెన్నఁడు దలంపనైతి. ఒకరాటను రెండుపశువులం గట్టిన నవి యొండొంటిం బొడుచుకొని చచ్చును. నేను కొంతకాలమైన సుఖమనుభవించినదానను. పదికాలములపాటు కాపురముచేసినదానను. సంతానవంతురాలను. కొంతవయసు మీఱినదానను జవ్వనము సడలినదానను. కావున నాకు సెలవొసంగుఁడు భర్తకుఁబ్రియముసేయుటయే భార్యకు ధర్మముగనుక రాచకన్నియనగు నేను మీకును భూమికిని భారముగానున్న నామేనువిడిచి మీ కన్నుల చందమామయైన వన్నెలాడికై తావొసంగెదను. అదే! నిదిరించుచున్న యాచిన్నబిడ్డలం గాచికొనుఁడు. సవతితల్లి కప్పగింపక మీరే కనిపెట్టుఁడు. మీరు విక్రమశాలురై యనేకరణరంగముల విజయములుగాంచి విఖ్యా

తులు బడసిన మహాత్ములరు. ఇట్టిమహనీయులకు భార్యనైనందుకు నేను సంతసించుచున్నాను. ఐదవతనము బసుపుగుంకుమలతోఁ గాటికిఁబోయినకాంత కడుధన్యురాలు. అందుచే నాకు సెలవొసంగుఁడు. రేపు తెల్లవాఱకమునుపే మీ కన్నులు చల్లనగునట్లు మీ మనస్సు చక్కఁబడునట్లు—మీమనోరథము సిద్ధించునట్లు—మీ సంకల్పమున కాటంకముదీరునట్లు—మీయుద్యమము సఫలమగునట్లు తగినమగఁడు గావలెనని తహతహపడుచున్న యా తలిరుఁబోడి తపము ఫలించునట్లు—నేను చేయఁదలఁచినకార్యముఁ జేసెద'' అని రోషావేశంబున నామెలనాఁగ యింక నేమియో పలుకఁబోవుచుండ వజ్రపాణి యెఱ్ఱఁబడిన యామెకన్నులను దృఢనిశ్చయము దెలుపుచున్న యామె మొగమును- గంపించుచున్న గాత్రమును- తొట్రుపడుచున్న యామెమాటలను జూచి విని యేమియుందోఁచక భయవిహ్వలుఁడై యామె చేతులు బట్టుకొని యిట్లనియె.

''కల్యాణీ! నీ మాటలనుబట్టికలలో నేనుకర్పూరమంజరియను మాట దలపెట్టితినని తేటపడుచున్నది. నీవు విస్పష్టముగఁ జెప్పక పోయినను నీసంభాషణమువలన నది గ్రహింపవచ్చును. స్వప్నములు నీవెఱుగనివిగావు. అదృష్టపూర్వములు నశ్రుతపూర్వములు స్వప్నమున మనము గనుచుందుము. స్వర్గమునఁ బోయినట్లు కలగందుము. అప్పుడేమేమో పలవరింతుము. అవియన్నియు నిజములగునా చిత్రభానుని కూఁతురు కర్పూరమంజరియని యొకర్తెకలదు. ఆపేరు నాకు మిక్కిలి చిత్రముగా నున్నది. అది క్రొత్తపేరు, రమణీయమైన పేరు. మనోహరమైన పేరు. అందుచేత నాకీసారి యాఁడుబిడ్డ పుట్టునేని దానికా పేరుపెట్టవలెనని సంకల్పించుకొని తఱచుగా మనసులో దాని స్మరియించుచుందును. అందుచేఁ గలలోనప్పేరు పలవరించితిగాఁబోలు! ఇంత మాత్రమునకై యింతగొడవ కావలెనా!

కర్పూరమంజరి త్రిలోకసుందరి. లేజవ్వని. అట్టిదానిని వయసుచెల్లిన నాకిచ్చి తండ్రి పెండ్లిసేయునా? నాయందమును నాచందమునుజూచి యాబాల నన్ను వరించునా? ఇటువంటి పిచ్చితలంపులు తలలోఁ బెట్టుకొని సాహసంబులు చేయఁదలంతువా? నేను కొంతకాలము నుండి యెప్పటియట్లనీతోఁ జనవుగా మాటలాడకపోవుటకు గొప్పకారణముగలదు. రాజ్యవ్యవహారములు యథాపూర్వకముగ లేవు. పరిస్థితులు మాఱినవి. సేనలలో గొప్పకలఁత బయలుదేఱినది. వైదేశికులు మనదేశముపై దాడివెట్ట గమకించుచున్నారు. నిరంతరము వాటికిం బ్రతిక్రియలు వెదకుచు నామనస్సు స్తిమితముగాలేదు. అందుచే నట్లుంటిని. అంతేగాని నామనస్సులో నీపై నలుకలేదు. నీవె నాయర్ధాంగము. నీవె నాబహిఃప్రాణము. నీకన్న నాకు వేఱులేదు. కఠినోక్తులు గట్టిపెట్టుము. సాహసము లుపసంహరింపుము. నన్ను మన్నింపుము. బిడ్డల నడలఁ జేయకుము. నా కప్రతిష్ఠ ఘటింపకుము. నేను మనోవాక్కాయకర్మములనీయెడ నెట్టివిరుద్ధభావములేనివాడను, నమ్ము. మనకుటుంబము పరువుగలది. అవసరముమాలిన యల్లరిచేసి యప్రతిష్ఠ సంఘటింపకుము" అని బతిమాలుటయు సునంద "సరే! మీచిత్తము వచ్చినట్లు చేయుఁడు. బహుభార్యాపరిగ్రహణమునకు మీ కధికారము గలదు. పరకాంతాసక్తులయిన పురుషులు తెలుచుగా నన్యతంబునకు వెఱువరు. వారు చేయుబాసలు, ప్రమాణములు, విశ్వసింపఁదగినవికావు. వారిసంభాషణలకు సత్యమునకు, జీఁకటికిఁ వెలుతురునకుఁగల దూరముండును. పాలముంచుటకు నీటముంచుటకు మీరు సమర్థులు. ప్రాణేశ్వరుఁడె దైవంబని నమ్మియిల్లాలి నుసురుపెట్టఁ గూడదు." అని కఠినముగాఁ జెప్పి గదివిడిచి లోనికిఁ బోయెను.

వజ్రపాణి కలలోఁ దాను ప్రేలిన ప్రేలాపనలవలన కార్యమింత చెడివచ్చినదని విచారించి యామె సాహసకృత్యములఁ జేసినపక్షమున హానియు లోకనిందయుఁ దనకు సంప్రాప్తించుటయే గాక కర్పూరమంజరీ పాణిగ్రహణ మహోత్సవముగూడ తప్పిపోవచ్చునని భయపడి యిల్లాలినదిసఱకే తిరస్కారభావమునఁ జూచుటతప్పని గ్రహించి యిఁకమీఁద నామెనులాలించి గౌరవించుటయే కార్యసాధకమని నిశ్చయించెను. కాని యతఁడు మిక్కిలి యాలస్యముగా మేల్కానెను. తనయనునయములామెయెడఁ బనిసేయలేదు. తన మాటయెడ నామెకు విశ్వాసము గలుగలేదు. ఆమె హృదయమెంత మాత్రము మాఱలేను. ఆమె యింటనడయాడుచున్నను మనస్సు మహావాయుపథమున సంచరించుచు నెన్నెన్నోపాట్లు పడుచుండెను. స్త్రీలకు సాహసముమెండని యతఁడు పెద్దలవలనఁ బలుమాఱు విని యుండుటచే నామె యాత్మహత్య చేసికొనునేమో యనుభయమున నతఁడా పగ లిల్లు గదలక నా రాత్రియు నిద్రపోక జాగ్రత్తగ నుండెను. ఆ రేయిసునంద నిదురింపనే లేదు. మంచముమీఁద గూర్చున్నది. కూర్చున్నట్లె యుండెను. పండుకొమ్మని భర్త యెన్నివిధముల బతిమాలినను శయనింపదు. ఆ రేయి సతీపతుల జాగరణముతోనే గడచెను.

మఱునాఁటినుండి సునందకు మతి చలించెను. ఊరకయె నవ్వును. కారణములేకయె పెద్దపెట్టున నేడ్చును. ఆహారము ముట్టదు. "కర్పూరమంజరీ, కర్పూరమంజరీ" యని పిలుచును. ఒకచోట స్థిరముగా నిలువక గృహమునందు, గృహముచుట్టునున్న దొడ్డియందుఁ దిరుగుచుండును. నిష్కారణముగా బిడ్డలం గసిరికొట్టును. పరిచారికు లందిట్టును. అయ్యయ్యో! నన్ను సేవకులు కొట్టుచున్నారని కేకలు వేయును. తినుటకేదేని బెట్టిన విసము పెట్టుచున్నారోయని యఱచును. మాటిమాటికి మొత్తుకొనును. రొమ్ముమోదుకొనును. నిలువ

గల దువ్వలువలుదెచ్చి చింపును. ఏలచింపెదవన బొమ్మలకు బట్టలు కావలెనను. అద్దములు పగులఁగొట్టును. అట్టిపని చేయవలదని భర్త నివారింప తలగోడకుఁ గొట్టుకొనును చీనిచీనాంబరములు మైలపడినవని తడుపును. తన యమూల్యాభరణములఁ దీసి పరిచారికలంబిలిచి యొక్కొక్కరి కొక్కొకనగ పంచిపెట్టును. ఇల్లు కాలిపోవునని వంకబెట్టి ప్రొయిలో నిప్పులార్పును. కర్పూరమంజరి యాబొకంటి కనుక్షణముఁ గనఁబడఁ జొచ్చెను. తనవెనుక నామె నడచుచున్నట్లు చెప్పును. కర్పూరమంజరి యటకమీఁద నున్నదని నిచ్చెనవైచుకొని యటకమీఁద కెక్కును. పెరటిలోన్న పొదరిండ్లలోను గృహమండలి చీఁకటిభాగములలోను మంచముక్రిందను, బఱుపుచుట్టలలోను భోషాణమునందునుఁ నిలువెత్తునున్న గుండిగలలోను, కర్పూరమంజరి యున్నదని శోధించిచూచును. కర్పూరమంజరి యింటఁబ్రవేశించునని చెప్పి కవాటములు బంధించును. నిశ్శబ్దముగా నున్న సమయమునను భర్తం బిలిచి "యదిగో కర్పూరమంజరి. వీధిలోనుండి నన్నుఁ బిలుచుచున్నది. వినఁబడినదా" యని యడుగును. "పిలుచుటలేదు. నీది వట్టిభ్రమ" యని భర్త బదులుచెప్ప అయ్యో! అంతబిగ్గరగాఁ బిలుచుచున్నప్పుడు మీకు వినఁబడకపోవుటేమి? ఇది వట్టిమాట. నాకంటిలో దుమ్ముగొట్టవలెనని మీరీలా గనుచున్నారు." అని కొఱకొఱమనుచు భర్తం దూలనాడును. ఛీ! నాయింటికి రాకు నాభర్తం బిలచుటకు నీకెవ్వతెవే? వచ్చితివా! నీసొత్తురు కంటఁజూచెద. రాచకూఁతురవైనయెడల రా, నేను రాచబిడ్డనే" యని కత్తి చేతఁబూని కర్పూరమంజరి వీధిలోనున్నదని తలుపులుదెఱచి పరుగెత్తఁబోవును.

వజ్రపాణి తన నూతనవధూ సమాగమము ప్రయత్నమీ విధముగాఁ బరిణమించినందుకుఁ దద్దయు విచారించి యది స్వయంకృ

తాపరాధమేయని నిశ్చయించి పశ్చాత్తాపమునొందిన గార్యము లేదని గ్రహించి యామెను నలుగురు పరిచారికల కప్పగించి తలను నిమ్మకాయలురుద్ది స్నానముచేయించుచు గదిలోనుండి యావలకు రాకుండఁ దలుపులు మూయించుచు నొక వైద్యునింబిలిచి చికిత్స చేయింపఁ జొచ్చెను.

వైద్యుఁడు చేయిచూచుటకురాఁగా 'ఛీ దుర్మార్గుఁడా ! నీవు కర్పూరమంజరికిఁ దండ్రివటరా నీవు కన్యాదానముచేయుటకు వచ్చితివా ? యని మీఁద నుమ్మివైచెను. పరిచారికలకప్పుడప్పుడు చెంప కాయలు దగులుచువచ్చెను. బిడ్డలు తల్లియవస్థఁజూచి తండ్రిం గౌఁగిలించుకొని యేడ్చిరి. బిడ్డల దైన్యముఁజూచి తండ్రియు బాష్పాకులిత లోచనుఁడయ్యెను. లోకైకసుందరిని బెండ్లియాడి భూలోకస్వర్గ మను భవింపఁదలఁచుచుండఁగా భూలోకనరక మనుభవింపవలసి వచ్చినదే యని యతఁ డింతింతయనరాని చింత చే గ్రుక్కుచుండెను.

వలవంతలు వంతలుగా మాఱుట యద్భుతముగదా ! మనుజుఁడు తలఁచిన దొక్కటి, దైవము గావించిన దొక్కటి యను సామెత వజ్రపాణియెడల నిజమయ్యెను. మానవుఁ డాకాశమున మేడలుగట్ట యత్నించును. స్వర్గమర్త్యపాతాళముల కేకసూత్రము వన్నును. కాని యఘటనఘటనాసమర్థుఁడును, సర్వశక్తుఁడును సర్వ నియామకుఁడును నైన పరమేశ్వరుఁడు తఱచుగా వారితలంపుల భగ్నము చేయుచుండును.

పదునేడవ ప్రకరణము

"మల్లికా! ఏమియుపాయమే నీవెంతో చతురమతివని సఖీ జనము చెప్పుకొనును. జనకుఁడు నన్ను వజ్రపాణి కిచ్చుటకుఁ గృత నిశ్చయుఁడైనాఁడు. పట్టినముకరందుని చెట్టఁ బట్టవలె; లేదా నానంటి దైవోపహతులకుఁ బ్రాణసఖయైన మృత్యుదేవతను గాఢాలింగనముఁ జేసికొనవలెను. ఇంతియేగాని మఱియొక పురుషుని కేలువట్టనోపను. అతఁడు నవమన్మథుఁడెగాని, మర్త్యలోకమునకు దిగివచ్చిన జయం తుఁడుగాని, పురుషాకృతి దాల్చిన వసంతుఁడుగాని, యా మదనునిం గన్నతండ్రిగాని యెవఁడైన నాకక్కఱలేదు. ఆతనింగలియు టెట్లే! ఎక్కడ యుజ్జయినీ పట్టణము! ఎక్కడ శ్రీనగరము! ఎన్నివందల యామడల దూరమున్నదే! మనశ్శబ్దము నపుంసకలింగ మని పాణిని, శాకల్యుఁడు మొదలగు వైయ్యాకరణులు వచించిరి. కాని యది నపుంసక లింగము గాదు. నపుంసకములకు సంచలన మెక్కడిదే! నపుంసకమైనయెడల నిమేషమాత్రమున నిన్నివందల యామడప్రయాణము జేసి మహానుభావుఁడైన మకరందునికడ కెట్లుపోఁగలదే! 'ప్రమాదో ధీమతామపి' యన్నట్లు మహామేధావంతులగు వైయాకరణులు గూడ శాస్త్రరచనలలోఁ బొరపడియుందురు. నామనస్సు నిజముగా నపుంసకమైన నేనెంతసంతోషింతునే! నపుంసకములైన ఱాళ్ళవలెఁ దీఁగలవలె నిదియొకచోటఁ బడియుండిన నెంతబాగుండునే! దీని కీసంచలన మెక్కడినుండి కలిగినదే! ఇంతవేగ మెక్కడినుండి వచ్చి నదే! ఒక్కనిముసమైన నాదగ్గఱనుండదేమే! నేనన్న దీనికింత గిట్ట కున్నదేమే! ఇది కోఁతివంటిదిగదా! దీనిని బంధించుట కేశ్శృంఖల ములు లేవుగదా! చతురమతివి నీవట్టి సంకెళ్ళు నిర్మింపలేవుగదా! నీ తెలివి తెల్లవాఱినట్లే యున్నది. నాకుఁ బనికివచ్చు నుపాయమేదియు

నీకడ లేదు ఓసీ! ఆమహానుభావుని పాణిగ్రహణభాగ్యము చేకుఱినను జేకుఱక పోయినను చిఱునవ్వు వెన్నెలలు గ్రక్కు నాతని ముఖచంద్ర మండలము నొక్కసారి చూపవే. ఈ మహోపకారమునకు నీఋణ మెన్నఁడైనఁ దీర్చుకొందునే. ఆహాహా! ఏమీ యాముఖలావణ్యము. ఏమీ యాకర్ణాంతములైన యానోగకన్నులతీరు ఏమీ యామీసకల సిరికి నివాసమైన తెలిదామరపుష్పముల నెవ్వఁడు చేసెనో యాకన్నుఁ నాతఁడే చేసెను. శరత్కాలచంద్రమండల మెవ్వఁడు నిర్మించెనో యాతని మొగము నాతఁడే నిర్మించెను. బంగార మెవ్వఁడు సృజి యించెనో వానిమేన్నను నాతఁడే సృజియించెను. వెన్నెల నెవ్వఁడు గావించెనో యామందహాసముల నాతఁడే గావించెను. చందమామ లోని లావణ్యము వసంతుని మార్దవము పచ్చవిల్తుని చక్కఁదనము మూఁడును ము[illegible]ఖ్యనైచి చతురాస్యుఁడు తన పురుషసృష్టి సార్థకము నిట్లీతనిం జేసియుండెను. చెలీ! అట్టిపురుషుని సందర్శించు టెట్లే? ఒక్క సారి యతనిజూచి యీమేను విడువవలెనని యున్నది. ఏల యిట్టిపని యందువా విను. అతఁ డతి దూరమందుండుటచేతను నావంటి కన్నియలు పెక్కండ్రు వాని కిచ్ఛామాత్రమున సులభ ముగా లభింపఁగలుగుట చేతను నతని కాలిగోటి కయినఁ బరిచర్య సేయుటకు నేను తగియుండక పోవుటచేతను నతని దాసీజనంబులో నైనఁ జేరి యాతని యూడిగముసేయ నేఁ దలపెట్టినను నాజనకుఁడు నన్ను విడిచిపెట్టక పోవుటచేతను నా కాతని చరణంబు దుర్లభ మనియు మరణంబ శరణంబయనియు నిశ్చయించుకొంటిని. కాని యాతనిఁ జూచి ప్రాణంబు విడువవలఁతు. ఆహాహా! పులుఁగు లెంత యదృష్టవంతులే. అక్కట కలిమిచే నవి యెక్కడి కరుగ దలంచిన నవి యక్కడికి కరిగిపోవునుగదా! విమాన సంచారముచేయు దేవతాంగన లెంతయదృష్టవంతులే. ఎవఁడైన నొక్కయోగి మనకడకు వచ్చి ప్రవరాఖ్యునకుంబలె మనకు నొక్కపాదలేపన మిచ్చిన దాని

ప్రభావమున మనమొకసారి యుజ్జయినికి తెప్పపాటు కాలములోఁబోయి యతని దర్శించి నమస్కరించి రాఁగలుగుదుముగదా! మందభాగ్యులకు మనకట్టి యదృష్టము పట్టునా? పోనీ, నిరాశజెందుదమన్న మేన నుసురులున్నంతవఱకు ఆశాబంధము తెగదు. అనుభవములతోఁబాటనే యాశలు నశించును. స్వతంత్రించిపోవుదమన్న పనికిమాలిన యీ రాచకొలమునఁబుట్టితిమిగదా! అడవులలో యథేచ్ఛముగా సంచరించు చెంచు కన్నియలు తొలిమేనులు నేమి మేలునోములు నోచిరే? ఈపాడు రాచకులమునఁ బుట్టిన కతమున మావంటి కన్నియల సుగార్యవంశ్యలై చిలుకలులువోలె మేడలలో మిద్దెలలో నడఁగియుండవలయును. జంతువులకు స్వేచ్ఛయున్నది. పక్షులకు స్వేచ్ఛయున్నది. కీటకములకు స్వేచ్ఛయున్నది. సరీసృపములకు స్వేచ్ఛయున్నది. కాని చైతన్యముగలిగి జ్ఞానసంపత్తిగలిగి మెలంగు మెలంతులకు స్వాతంత్ర్యమున్నది లేదు. 'స్త్రీస్వాతంత్ర్యమర్హతి' యని మనువుచేసిన శాసనమొక్కటి లోకమునఁ బ్రవర్తిల్లుచున్నదే? ఈశాసన మెన్నటికయిన మాసిపోవునే? సఖీ! నాకోరికలిసుకపాతర నలెఁడఱుగకున్నవి. ఎన్నో చెప్పితినని నీకు విసుగుగలుగుచున్నదిగాఁబోలు చెప్పినవి చెప్పఁగా నింక చెప్పనన్నియున్నవి, ఎన్నిదినములు చెప్పినను దఱుగవు. చెప్పుటకు మాటలుచాలవు వాల్మీకిగాని వేదవ్యాసుఁడుగాని వేదవ్యాసునియబ్బగాని మనసులోనున్న యూహాల సరియైన మాటలలోఁ దెలిపిసంపూర్ణభావప్రకటనము చేయఁగలఁడే. అదికవికేగాదు రవికైన సాధ్యముగాదు. అట్టిచో నేనెట్లు నీకుఁ నచ్చఁజెప్పగలను? అదియునుఁగాక వలవంతయొక్క తీవ్రపు వేఁడిమి వలవంతయను చిచ్చునంబడి మాడెడువారికే గాని పెఱవారికిం దెలియదు. కన్నియవైనను నీపుణ్యమున నీకట్టియలమట కలుగదయ్యో మల్లికా! తల్లికడనైనఁజెప్పనొల్లని గుట్టుమట్టులు నీకడఁ జెప్పుకొంటి తల్లికని పిమ్మట మీకప్పగించినది. కావున నీవు తల్లికన్న నెక్కుడు

దానవు. అందుచే నాయత్తులికము తీఱునట్లు తగిన తెఱంగునీవచేయ వలయు. అట్టియదృష్టము నాకబ్బునా?" అనికన్నుదోయినీటికతమున మంచుగ్రమ్మిన కెందామరతేకుల చందంబున నలర నామె విచారాక్రాంతయై యేమియుం బలుకలేక యూరకుండెను. మల్లిక తన చెఱంగుతో నామెకన్నీరు తుడిచి "సఖీ! నేడు కడుపులోనున్న దెల్ల వెళ్ళబుచ్చితివి. మనస్సును గలంచునట్టి విషయములు వమనములవలె బైకివచ్చునేని మానిసికి సుఖముండును. దుఃఖములు మిత్రులతో జెప్పుకొన్నం గొంతవఱ కుపశమించును. చెలికాండ్రతోం జెప్పుకొన్నపక్షమున నానంద మతిశయించును. కావున నీకుం గొంత హృదయభారము తగ్గిపోవును. ధైర్యము దెచ్చుకొనుము. విచారములవల్లం గార్యములుగావు. ధైర్య కవచముం బూనిన వారిని గష్టములు బాధింపం జాలవు. నాచేతనైన సాయము నేఁజేసెద. ఏమి చేయుదునాయని విచారించుచున్నాను. ఉపాయము తోంచకున్నది" యని బదులు చెప్పెను.

"ఓరీ! నా విచారము కొంత డీలుపడుననుచున్నావు. నాహృదయమిందుకేని జులకపడలేదు. నామనోవ్యథతగ్గలేదు. అతనికటాక్షవీక్షణములు ప్రసరింపవలె. నామనస్సు చల్లంబడవలె. నీవంటి బుద్ధిమంతురాలి కొక్క యుపాయమైనం బొడగట్టకపోవుట నా దురదృష్టము. అయిన దృఢముగానాలోచింపుము. నేనును నా తమ్ముండు విజయసేనుండట్లు మగపుట్టువు పుట్టక కట్టిడి యాడుపుట్టువు పుట్టిన కతమున నిట్టి బెట్టిదంబులు వాటిల్లె. ఛీ! స్త్రీ జన్మమెత్తగూడదె. అందులో రాచకన్నియనై పుట్టం గిట్టదు. పేదదాననై పుట్టి యిచ్చవచ్చిన మగని చెట్టబట్టి సుఖింపనైతినిగదా" యని కర్పూరమంజరి పలుకుచుండ మల్లిక యందుకొని "నెచ్చెలీ! నీ కష్టములు నీకున్నట్లే పేదలకష్టములు పేదలకుండును, సకలసౌఖ్యము

లుండి స్వాతంత్ర్యము లేక నీవు విచారించుచున్నావు. స్వాతంత్ర్యముం డియే సౌఖ్యము లేక కడ లేని కడుగండ్లఁబలు కటికి పేదలయవస్థలు వర్ణింపఁదరమా? జలచరములస్థితి స్థలచరములకు రాదు. జలస్థలచరముల స్థితి ఖచరములగు పక్షులకు రాదు. సుఖమున్న చోట దుఃఖము తప్పక యుండును. క్రీనీడ దీపము క్రిందనే యుండును. ఛాయ సూర్యునను సరించియే యుండును. పేదవాండైనంతమాత్రము సుఖపడవు. భాగ్యవంతురాలయినంతమాత్రమున కష్టపడవు. ప్రస్తుతస్థితినిబట్టి యిట్లను కొందువు. దానికేమి! అనిరుద్ధునితో సమాగమ మెట్లు గలుగునా యను విషయమునుగూర్చి విచారించుచున్నాను. పోనీ! ఇది విను. విదర్భ రాజనందనయగు రుక్మిణి తనమనోరథసిద్ధికై వాసుదేవునికడకు బ్రాహ్మణుని దూతగాఁ బంపినట్లు మనముగూడ నెవ్వరినైన మకరందునికడకంపుదమా?'' యని పలికెను.

''పంపవచ్చునుగాని మనము సంపూర్ణముగా విశ్వసింపఁదగిన బ్రాహ్మణుఁడు మనకెవ్వఁడు దొరకును? రుక్మిణీదేవికున్న స్వాతంత్ర్య ము మనకుఁ గలదా? పొతుటీఁగయైన మనయింటఁజొరరాదు. ఎట్లో సూర్యచంద్రులుమాత్రము మన యావరణలోఁ బ్రవేశించుచున్నారు. మనకట్టిపురుషుని దగ్గన మెట్లగును? మాతండ్రి యింట లేనప్పుడు నీ వెవ్వరినైనఁ దోడ్కొనివచ్చుటకయిన వీలు లేకుండ రుద్రభట్టు హిమాలయపర్వతమువలె మనకడ్డముగ నున్నాఁడు. ఇతని వైఖరిజూడ మాతండ్రి కేవో దురాలోచనలు చెప్పుచున్నట్లు తోఁచును. ఇతని వలన మనకుఁ గొంతయపకారము జరుగుచున్నదని నాయభిప్రాయము. ఎట్లైనను బ్రాహ్మణసందేశము వలనుపడదు. మఱియొక యుపాయ మన్వేషింపుము.'' అని యామె బదులు చెప్పెను.

''పోనీ యెవరిని బంపుమని యెదవు?'' అని మల్లిక యడిగెను.

''చెలీ!'' యెవ్వరిబంపుమని నేను చెప్పగలను. వెళ్లెడువారికి ధైర్యముం

డవలె. ఎక్కవలసిన పర్వతములుగలవు. దాఁట వలసినయేళ్ళుగలవు. కడువవలనకాఱడవులుగలవు. మెలఁగవలసిన మృగములుగలవు. విశేషించి క్రూరులగుచోరులు దారులుగాఁచియుందురు. వారిబాఁనుండి తప్పించుకొనవలయు. రెండవది నేఱజాణతనముండవలయు. ఏలయన—ఆమహాత్మునికడకుఁ బోవునప్పుడు సమయాసమయము లెఱుఁగవలయు. ఆసమయంబునఁజేసినదర్శనము కోపహేతువుగావచ్చును. అకాలమందు నాఁటినవిత్తనమువలె ప్రయత్నము నిష్ఫలమగును. దర్శనముచేసినపిమ్మటమాటనేర్పుండవలయు. సమయోచితముగా-సందర్భోచితముగాఁ బలుకగలవారుప్రపంచమున మిక్కిలితక్కువగాఁగలరు. ఎదుటివారిమనసు నొవ్వకుండవారికిష్టులగు వారిమీఁద నిందలువేయకుండఁ దన కార్యంబుసాధించుకొనునట్టినేర్పరితనముండవలయును. ఇట్టివెన్నోగలవు. ఇట్టిగుణములుగలవారుమనకెట్లులభింతురు? ఎన్నివిధములఁజూచిన నట్టిగుణసంపద నాచెలిమికత్తెయొద్దనే గలదు'' అని చిఱునవ్వుమొగమునఁదోఁపఁ గర్పూరమంజరి పలుక మల్లిక ''సరిసరి! నేనాయిట్టిపనికిఁ జాలినదానను. ఇదిపురుషుల కసాధ్యమయినపని. ఆఁడుదానికలవియగునే? ఇట్టిసాహసంబుసమకట్టుటకు నేనంతవలంతినే? కొండలెక్కఁగలనా? ఏఱులుదాటఁగలనా? మెకములబారినుండి తప్పించుకొనఁగలనా? మున్కరములగు తస్కరుల చేతఁబడకుండదాఁటిపోఁగలనా? ఏబాటసారులగుంపునయినఁగలసి పోయి సుఖప్రయాణము చేయఁగలననుము. ఉజ్జయిని జేరుదుననుకొనుము. ఆయుధపాణులచే సురక్షితమైన రాచనగరు ప్రవేశింపఁగలనా? నాకామహారాజకుమారునిదర్శన మగునా? అగుననుకొనుము. నన్నాయనపూరికింగొనునా? ఒకవేళనాదరించి మాటలాడుననుకొనుము. నేనంతజాణతనముగలిగి పూర్వోత్తరవిరోధములేకుండ సందర్భశుద్ధిచెడకుండ నాతని మనసు నొవ్వకుండఁగార్యముపొసఁగునట్లు మా

మాటలాడగలనా? ఇది నాకుఁ దగనిబరువు. నాకు శక్యముకాని కార్యము. నాకనుచితమైనకర్మము. కావున నింకొక్కని నియోగింపుము''అని యుత్తరమిచ్చి తన యసామర్థ్యమును జెప్పుకొనియెను.

''సఖి! నీవే యిట్లన్న గార్యసాధనమగుటెట్లే? పోనీ! ప్రయత్నముడుగుదమన్న నాప్రాణ మాశయను తొడిమ నంటిపెట్టుకొని యున్నది. నిరాశయను గాలి యించుక వీచిన నాప్రాణపుష్పమూడి క్రిందఁబడును. అతనిచేత నేను నిరాకరింపఁబడితినా యీమేను విడిచెద. ఆతనిమనంబున నేమూలనైన నేనుంటినా మనప్రయత్నము సార్థకమగును. పోనీ, యీమహారాజు కుమారునివిడిచి మఱియొకనిపై దృష్టిపఱుపుదమన్న నట్టిసాహస విక్రమార్కుఁడేడీ? అట్టి దాన రాధేయుఁడేడీ? అట్టి పండితారామచైత్రుఁడేడీ? అట్టి రసికశిఖామణి యేఁడీ? అట్టి మధ్యమలోకమందారమేదీ! ఏఁడీ వ్రేలుమడఁచి చూపుము; రత్నములలో వజ్రమట్లు చుక్కలలోఁ జంద్రుఁడట్లు పుష్పములలో గమ్మసంపెంగ యట్లు, మృగములలో సింగమట్లు, మకరందుఁడు తనకుఁదానె సాటియై యుండిమగలకు దండివగడై మన్మథమన్మథుడై, రాజరాజై శోభిల్లుచున్నాడు. ఇట్లనుటచే నితర రాజకుమారుల నిందించుచుంటినని తలంపకుము. అట్లుచేయుట నాసంకల్పముగాదు. మహనీయుఁడైన మకరందుని గుణవర్ణనము యథాస్థితిగ నేఁచేయుచుంటిని. అట్టివాని చెట్టఁబట్టనిచో నీజన్మమేల? ఈ పుట్టుక వ్యర్థము. అడవిలోఁ బుట్టినపు వ్వడవిలోనే నేలను రాలి చివికి మంటిలోఁ గలిసినట్లు నావిద్దియ-నాయౌవనము-నాచక్కఁదనము మంటిపాలు గావలసినదె. కావున మన చిరకాలస్నేహముఁ దలంచియైన, నాయందలి జాలిపెంపుననైన సహజమైన నీసౌజన్యాతిశయమువల్లనైన నాపనుపు సేయుము. సత్కార్యసిద్ధికొఱకుఁ బోవుచుంటిగావున నీకే యాపదలురావు'అని గడ్డముపట్టి బ్రతిమాలుకొనెను.

"చెలీ! నన్ను బ్రతిమాలనక్కఱలేదమ్మా. ఈ మేనుమీఁది నేను తినునన్నముమీఁద, నాకట్టుబట్టమీఁది. ఈశరీరము మీయిచ్చ వచ్చినట్లు చేసికొనవచ్చును. ఒకవేళ మధ్యేమార్గమున నేనే బెబ్బులి నోటనైనఁ బడి మృతినొందినను నేను విచారింపను. ఏలయన దాని యాఁకలి దీర్చినదాననగుదును. ఏహానిలేకుండ నుజ్జయిని జేరితినా ప్రియసఖి కార్యము జేసినదాననగుదును. ఎట్లయిన నీపనుపు జేసి నాతనువు ధన్యముసేసికొనియెద. కాని, మీతండ్రితోఁజెప్పి యిల్లు గడలవలయు. ఏవంకబెట్టి యాయనకడ సెలవుపుచ్చుకొందును. నా తల్లిదండ్రులు మూఁడుగాళ్ళ ముదుసలులయిరి. వారు రమ్మని నాకు వర్తమానమంపిరి. తప్పక నేపోవలెనని చెప్పిపోయెద నీయుంగరము నాకిమ్ము. ఆయన కానవాలు జూపెదను. నీవేదైన లేఖయిచ్చెదవా? అట్లయిన వ్రాసియిమ్ము. ఏమిచెప్పుమనెదవో చెప్పుము. ఈ రేయి మీయయ్యకడ సెలవుగైకొని తేపు బైలుదేఱిపోయెద. మీనాయన గారు నన్నొంటిగఁ బోనియ్యరు. నక్షత్రకునివంటి వృద్ధకంచుకుని జంటుకుని నావెంట సంపుదురు. సరె ఆసల్లమందు తాతకు నాలుగు గంజాయాకు లిచ్చితినా కునికిపాట్లు బడుచు దారిలో నేచెట్టుక్రిందనో కూర్చుండును. అప్పుడు జేపరమేశా యని దాఁటుదును. ఇంక శాంతింపవమ్మా!' యని యామెచిత్త మూఱడిల్లునట్లు మల్లిక పలికెను.

కర్పూరమంజరి ముఖారవిందము వికసించెను. నేత్రములు విశాలములయ్యెను. చిఱునవ్వు మొగమునలంకరించెను. శరీరమం దంతట నుత్సాహరసము వ్యాపించెను. ఆనందము పట్టజాలక యామె మల్లికను గౌఁగలించుకొని "సఖిజనమనఁగా సుఖదుఃఖసమానమైన జనము. నానిమిత్తమున నీప్రాణములనైన విడువఁదలఁచితివిగదా! నీఋణము వేయిజన్మములకయిన నేను దీర్పఁగలనా?" యని వెండియు నిట్లనియె.

"ఓసీ! ఏమిచెప్పుమని నీతోఁజెప్పుదును? అదిచెప్పు మిది చెప్పు మని నేఁజెప్పఁజాలను. చెప్పవలసిన దంతయుఁ జెప్పుము. నా యలమట యంతయుఁ జెప్పుము. నీవు చూచినదంతయుఁ జెప్పుము. చెప్పఁగూడనిదంతయు విడిచిపెట్టుము. సమయోచితముగాఁజెప్పుము. మిక్కిలి దీనముగాఁ జెప్పిన లోకువగును. ఎక్కువబెట్టుసరిగాఁజెప్పినఁ గార్యముచెడును. కార్యశకటమును నడిమిత్రోవ నడిపింపవలయును. పరులతోసంభాషించునప్పుడు వానిం జేరకుము. విసుగుగానున్నప్పుడు పలుకరింపకుము. విచారాక్రాంతుఁ డైనప్పుడు నీసోదెచెప్పకుము. ఒంటిగానున్నప్పుడు చిత్తము ప్రసన్నమైయున్నప్పుడు మొగము కలకలలాడుచున్నప్పుడు దీర్ఘాలోచనాపరతంత్రుఁడు కానప్పుడు మెల్లగఁ జేరి విన్నవింపుము. నాశరీరమాయనదెయనుము. నాప్రాణమాయనదే యనుము. నామనస్సాయనదె యనుము. నాహృదయమాయనదె యనుము. నాజీవితమతని యాధీనమనుము. పరమేశ్వరుని నమ్ముకొని ప్రయాణముసేయుము. అంతట గార్యసిద్ధి కరతలామలకము. ఇదిగో! నాయుంగరముతీసికొమ్ము. ఇది యాతనికిచ్చిరమ్ము. ఆయన యేదేని మరలనిచ్చినఁ గనుల నద్దుకొందుననుము. పొమ్ము శుభమగుగాక!"

ఆరేయి మల్లిక చిత్రభానునితో మాతాపితృ సందర్శనార్థము పోవుదునని చెప్పి యాయన నొడఁబఱచి మఱునాఁడు వఱువాత వృద్ధ కంచుకియైన జంబుకుని చిత్రభానుని యాజ్ఞాప్రకారము వెంటఁ బెట్టుకొని బైలుదేఱెను.

రెండుదినములు గడచెను. మూఁడవనాఁడు తెల్లవాఱుజామున వీధిగుమ్మముకడ నేడుపువినఁబడెను. అప్పుడే మెలకువవచ్చిన సేవకులు తలుపుదెఱచి యదియేమోయని చూచునప్పటికి వెక్కి వెక్కి యేడ్చుచు జంబుకుఁడు నిలిచెను. వారు వాని నట్లో లోపలికిఁ దెచ్చిరి. వాఁకిటిలో నరుగుమీఁదఁ గూర్చుండి వాఁడు వెక్కివెక్కి యేడువఁ జొచ్చెను. సేవకులు కలవరముపడిరి. అది విని యింటివా

రందఱు లేచిరి. వానిని లోపలికి దోడ్కొనిరమ్మని చిత్రభానుఁ డాజ్ఞాపింప సేవకు లట్లుచేసిరి. ఆదుఃఖమునకుఁ గారణమేమని చిత్రభానుఁడు, రుద్రభట్టు, వాని నెన్నివిధముల నడిగినను వాఁడు వారి పలుకులు వినిపించుకొనక "అయ్యో! అయ్యో! నాతల్లీ! నాతల్లీ!" యని బొమ్మనోఁదుకొని యేడువఁ జొచ్చెనేగాని యుత్తర మీయఁజాలక పోయెను. చిత్రభానుఁడు చీవాట్లు పెట్టెను. సేవకు లేడువవద్దని బ్రతిమాలిరి. ఎట్టకేలకు వాఁడిట్లు బదులు చెప్పెను.

"ఏమి చెప్పుదును తండ్రీ! బైలుదేఱిన నాఁటిరాత్రియే నేనును మల్లికయు నొకసత్రపు టరుగుమీఁదఁ బండుకొనఁగా దగ్గఱయడవిలోనుండి పెద్దపులి వచ్చి దానిని లాగుకొనిపోయెను. నేను దుడ్డుకఱ్ఱ పుచ్చుకొని తఱిమికొట్టితినిగాని యది మల్లికనువిడువక పాఱిపోయెను. ముసలిముండకొడుకును నన్నైనఁ దీసికొనిపోయినది కాదు. దుంపలాటి బిడ్డనుదీసికొనిపోయినది" అని పెద్దపెట్టున నేడ్చెను.

సేవకు లాశ్చర్యపడిరి. కర్పూరమంజరి వగపుచే నేలఁజదికిలఁ బడెను. చిత్రభానుఁడు కటకటా యనెను. చంద్రికయు నిందుమణియు గర్పూరమంజరిని లోనికిఁదీసికొనిపోయి పానుపుజేర్చిరి.

ఆమె కిప్పుడు రెండువిచారములు పట్టెను. ప్రాణమిత్రమైన మల్లిక మరణ మొందుట యొకటి తనసందేశము మకరమందున కందకపోవుట మఱియొకటి. ఇవి యొకదానికంటె నొకటి బలవత్తరమైన విషాదకారణములు. మధ్యాహ్నము జంబుకునిబిలిచి యామె జంబుకా! నిజముచెప్పు. చెప్పు మల్లికను బెబ్బులి యీడ్చికొనిపోవుచుండ నీవు చూచితివా?" యని గ్రుచ్చిగ్రుచ్చి యడిగెను. "అమ్మా! మీపాదములసాక్షి. పెద్దపులి లాగుకొనిపోవుచుండఁగా నేను కన్నులారఁ జూచితిని" అని వాఁడు బదులు చెప్పెను. అన్నివిధముల దైవము తన్ను బాడుచేసెనని కర్పూరమంజరి దుఃఖపరవశయై రెండవ సఖయైన చంద్రికతో నెట్టెటో కాలక్షేపము చేయుచుండెను.

పదునెనిమిదవ ప్రకరణము.

మణివర్మనియుక్తుఁడై మాధవసేనుఁడు రాచనగరునకరిగి కంచుకిచేతఁ దనరాక నరవిందాదేవి కెఱిఁగించి యామెయాజ్ఞాప్రకారములోనికరిగి యథోచితసత్కారముల నంది సుఖాసీనుఁడై మణివర్మ చెప్పినట్లు చిత్రభానుఁడు సేనానివేశమునఁ జేసినచర్యలెల్ల వినిపించెను. అది వినఁగానే యామెగుండె జల్లుమనెను. రాజకుటుంబమునకు మూఁడఁదలఁచినయాపద యామెయెట్టయెదుటఁ గనఁబడెను. ప్రక్కనున్నవిక్రమసేనునిం జూచి యాదేవి విచారసూచక మగు హీనస్వరముతో నిట్లనియె. "నాయనా! కాశ్మీరరాజ్యవృక్షమునకుఁ బురుగులు పట్టినవి. ఈకీటకములు తరువును నిర్మూలముచేసినంగాని విడువవు. దొంగయు మనుష్యుఁడేయగుసామెతనుబట్టి మనకు హితులెవ్వరో యహితులెవ్వరో తెలిసికొనఁజాలకున్నాము. ఎవరిని నమ్మవచ్చునో యెవరిని నమ్మఁగూడదో మనమెఱుఁగము. ఇదిచూడ నాకొకశ్లోకము జ్ఞాపకమువచ్చుచున్నది. చిన్ననాట మాతండ్రి మహేంద్రదేవుఁడు నాకు విద్దెగఱపుటకై తర్కవాచస్పతియని బిరుదు బొందినజయదేవుఁడను పండితుని నియమించెను. ఆయనప్రస్తావవశమున నొకనాఁడీశ్లోకముఁజదివి నాకర్థము చెప్పెను. అదిమిక్కిలి రసవంతమగుటచే నేనుదానినివల్లించితిని. క్రొత్తకుండ మీఁద జేసిన సంస్కారమట్లులేత మనస్సు మీఁదఁబడిన భావములు మఱపునకురాక యాజీవితాంతముండును గనుక నాకిప్పటికి నది జ్ఞాపకమే.

శ్లో. అగ్రే వ్యాధః కరధృతధనుః పార్శ్వయోర్జ్వాలమాలాః
పృష్ఠే వహ్ని ర్దహతి విపినం సన్నిధౌ సారమేయాః
ఏణీ గర్భా దలసగమనా బాలికాః పాదలగ్నాః
లక్ష్మీనాథ! త్వమసి శరణం కిం కరోమి క్వ యామి,

“కుమారా! దీనిభావమిది. ఒకమగలేడిదురవస్థలోనుండి యిట్లు విచారించినదఁట. ఎట్టయెదుటఁ జేతవిల్లుబూని కిరాతుఁడు నిలిచి యున్నాఁడు. కావున ముందుకుఁ బాఱిపోవుటకు వీలులేదు. వెనుకకుఁ బాఱిపోవుదమన్న వెనుకప్రక్క భయంకరమైన కాఱుచిచ్చు వనముం గాల్చుచున్నది. ప్రక్కలకుఁ బఱుగెత్తుదమన్నఁ గిరాతుఁడు వలలు పన్నియున్నాఁడు. సమీపమందు వేఁటకుక్కలు సిద్ధముగానున్నవి. ఆఁడులేడి చూలుదాల్చియున్నది. పరుగెత్తఁదలఁచుకొన్నను వీలు లేదు. పైఁగా బిడ్డలుకాళ్ళకడ్డముగాఁదగులుచున్నవి. ఓలక్ష్మీనాథా! నీవేశరణము. నేనేమిచేయుదును? ఎక్కడికిఁబోవుదును?’

మనయవస్థయు నట్లేయున్నది. మంత్రులనమ్ముదమన్న వారు సింధుగాంధారరాజులకువశులై రూకలకై మనరాజ్యమును మనలను విక్రయింపఁదలచుకొన్నారు. సేనాపతులు సేనలనుజిత్రభానునివశము చేయఁదలఁచుకొన్నారు చిత్రభానుఁడు సోదరుం గడతేర్చినట్లే నన్నును సోదరపుత్రులను రూపుమాపఁదలఁచుచున్నాఁడు. నాయనా! మీరుచిన్నవాండ్రు. లోకానుభవములేనివాండ్రు. నేనో కోటదాఁటి వెళ్ళుటకు వీలులేని యాఁడుదానను. దీనజనమందారమై దేవతాశిరోమణియై సకలలోకరక్షకుఁడై వెలయుచున్న శ్రీమన్నారాయణుఁడే మనల రక్షింపవలయు. అగతికులకుఁ గతియు ననాథలకు నాథుఁడు నైనజగన్నాథుఁడు నాఁడు విరటుపుత్రిక కడుపులోనున్న పరీక్షితుని సురక్షితుఁజేసినట్లు మిమ్ముఁ గాచుఁగాక! మనుష్యయత్నమను నడ్డుగట్టు భగవదిచ్ఛయనుప్రవాహమును వారింపఁ జాలవు.” అని నిష్ఠురముగాను దయనీయముగాను సంభాషించుచున్న దేవి నుద్దేశించి మాధవసేనుఁడు వినయముగ నిట్లనియె—

“తల్లీ! నేనునుమణివర్మయురాజకుటుంబమునెడ నమితవిశ్వాసముగలిగి చేతులుగట్టికొని మీపనులు చేయుటకు సిద్ధముగనున్నను

మాయెడ మీకు లేశమైన నమ్మకలేదు. మేము మీవిశ్వాసమునకు వెలియైయున్నాము. చండాలురకుం దొలఁగు బ్రాహ్మణులట్లు కుష్ఠరోగులకుం దొలఁగు సుశరీరులట్లు దుర్గంధమునకు దూరముగఁబోవు మానవులట్లు మీరు మమ్ముఁ బరిత్యజించుచున్నారు. చిత్రభానుని దుస్తంత్రము లనియెడు పెద్దయేఱులువచ్చి మిట్టపల్లముల నేకము జేసినవి. అందుచే నేదిమెఱకయో యేదిపల్లమో తెలియక మీరు జలమంతయు మేటిమొసళ్ళతో నిండిన యపాయకర ప్రదేశమని భయపడుచున్నారు. మాయొట్లు మాబాసలు మాప్రమాణములు మా పూర్వచారిత్రములు మీకడఁజిల్లిగవ్వయైనఁ బనికివచ్చినవిగావు. మే మేమి చేయుదుము? మా యుపదేశము విషాన్న మట్లుమీకు రుచింపదయ్యె. ఇప్పటికిని మేము మీయాజ్ఞా బద్ధులము. మీ ప్రియకింకరులము. మీకు వశవర్తులము. మాచేత మీయిచ్చవచ్చిన కార్యములు చేయించుకొనుఁడు. అట్లుకానియెడల మీరట్లు శూలనాడినను మణివర్మ మరల నన్నేల మీకడ కంపును. అతఁడు చిత్రభానునకు మీకుఁగూడ విరోధియైనందుకు బిట్టు వగచుచున్నాఁడు. గదాధర శూలపాణులు మీకుఁబరమ విధేయులు రాజభక్తులు. మీ తిరస్కారమున రాజభక్తులు శూరశిఖామణు లగువారిరువురు పగతుఱతోఁ జేరుదురేమోగాని యింతదనుక వారు మన పక్షమే యున్నారు. మీఁద మీచిత్తము.”

అని మాధవసేనుఁడు తనవిశ్వాసమును దృఢముగాఁ దెల్పుటయు విక్రమసేనుఁడు తల్లికిట్లనియె. “అమ్మా! నీకు నేఁజెప్పవలసినవాఁడనుగాను. అయినను నాపలుకులు సరిగావిచారించుము. మాధవసేనునిమాటలు నాకునచ్చినవి. సైన్యములు పరాధీనములగుచుండుటచేతఁ గార్యభారమీ యమాత్యులమీఁదబెట్టి మీ తండ్రియైన మహేంద్రదేవుని కడకును మా తండ్రికి పరమమిత్రమైన సుదర్శనుని

కడకును సాహాయ్యము నిమిత్తము సందేశములంపుట మంచిది. నా బుద్ధికింజూడ మాధవసేనుఁడే యిప్పటికిఁ దగినవాఁడు. మీఁద నీయిష్టము" అనుటయు నరవిందాదేవి కొంతసేపు మనంబున నాలోచించి "కుమారా! నీవు రాజవు. శాస్త్రజ్ఞానము గలవాఁడవు. చక్కఁగా నాలోచించి యేదికర్తవ్యమో చేయుము. నా బుద్ధికేదారియుఁ బొడకట్టుటలేదు. మనకందఱుఁ బగతుఁరేయగుటచేత మన మాన ప్రాణములు చిత్రభానునిచేతఁ గోల్పోవుటకంటెఁ జిరపరిచితులైన మణివర్మ మాధవసేనులచేతనే గోల్పోవుట యుక్తము. కావున గొఱ్ఱె కటికవానినే నమ్మినట్లు వీరినే నమ్ముకొనియుందము. మణివర్మతో మంతనముండి మాధవసేనుఁడే సుదర్శనునికడకు మాతండ్రి కడకు సందేశము గొంపోవుఁగాక!" అని పలికె.

అనవుడు మాధవసేనుఁడు చింతిల్లుచు "తల్లీ! మే మెన్నివిధముల మొఱవెట్టుకొనుచున్నను మీరింకను మమ్ము చిత్రభాను ప్రముఖులతోడ సమానులుగాఁ జేయుచున్నారు. కాని కాలక్రమమున మా ప్రవర్తనమే మాపలుకులకు వ్యాఖ్యానమగుగాక! నేను మణివర్మతో నాలోచించి మహేంద్రదేవునికడకు సుదర్శనునికడకు సందేశము గొనిపోయి సాధ్యమైనంత వేగముగా వారిని సేనలతోఁగూడఁ దోడ్కొనివచ్చెద. మహేంద్రదేవునకు సుదర్శనునకును మీరు జాబులు వ్రాసి సిద్ధముగ నుంచుఁడు. నేను మణివర్మతోఁ జెప్పి రేప పయనము జేసెద. నాకు సెలవొసంగుడు." అని పలికి వారి యనుమతి వడసి పోయెను. అతఁడు చన్నపిదప నరవిందాదేవి కుమారునిఁజూచి "నాయనా! నా తండ్రికి వ్రాయవలసినజాబు నేనేవ్రాసెద. సుదర్శనుఁడు పరపురుషుఁడగుటను నే నాతనిపేర నేమియు వ్రాయనొల్ల. ఆ జాబు నీవ లిఖంపుము" అనిచెప్పి తనగదిలోనికరిగి జనకునిపేర జాబు వ్రాయఁ దొడగెను. విక్రమసేనుఁడు తన జాబువ్రాసి తల్లి కిట్లు వినిపించెను.

"శ్రీ మన్మాళవమహీపాలు రగు స్వస్తిశ్రీ సుదర్శన మహా రాజుగారికి—కాశ్మీర పాలకుం డగు విక్రమసేనుండు వినయపూర్వకముగా నమస్కరించి చేసిన విజ్ఞాపనము.

నాకు మీపరిచయభాగ్యము లేకపోయినను మాజనకుండు హేమచంద్ర మహారాజుగారును మీరును వారణాసీ నగరమున సబ్రహ్మచారులై సహాధ్యాయులై ప్రాణమిత్రులై యుండినందున నేను మీకుం బుత్రప్రాయుండ ననియు మీరు నాకు జనకప్రాయులనియు భావించి చనవుగల్పించుకొని యీలేఖ వ్రాసి పంపుకొంటిని. ఈలేఖం దెచ్చిన యతండు మాకమాత్యుండు. మాధవసేనుండు సింధుగాంధార వల్లభులు మాదేశముపై దాడి వెడలుదురని లోకమునం బ్రవాదము గలిగినది. అది యటుండ మాపినతండ్రి చిత్రభానుండు మజ్జనకునిచే దేశభ్రష్టుండు గావింపం బడియు నతని మరణానంతరమున శ్రీనగర ముంజొచ్చి చన్న యన్నమీందను నిందున్న యన్నబిడ్డల మీందను నెంతో ప్రేమ నభినయించి సేనల సేనాపతులం దనవశము జేసికొని యేదో ద్రోహము సేయందలంచుచున్నాండు. మాతండ్రిగారి దారుణ మరణముం దలంచియు బాలుండను నిస్సహాయుండను నైన నా దీన స్థితిం దలంచియుం బగతుర బారినుండియు నాప్తుండట్లు మేకవన్నె పులియైయున్న మాపినతండ్రి బారినుండియు మమ్ముం దప్పించి కాశ్మీరరాజ్య పరిరక్షణము సేయం బ్రార్థించుచున్నాండను. హేమ చంద్రమహారాజు బ్రతికియున్నవాం డని మీరు భావింపుండు. 'మిత్ర మాపది జానీయా' త్తను న్యాయమును లెస్సగా గమనింపుండు. ఆర్త రక్షణపరాయణులు, దయాసాగరులు, పరోపకార ధురంధరులు, నిష్కళంక చరిత్రులు, మత్పితృసఖులు నగు మీకు నేనింతకన్న విస్తరించి వ్రాయనక్కఱలేదు. ఈ యమాత్యుండే తక్కిన విష

యము లన్నింటిని మీకుం దెలుపఁగలఁడు. వేయేల ? కాశ్మీరరాజ్య లక్ష్మి మీకు రక్షణీయ మాళవకాశ్మీరంబు లొక్కచెల్లెండ్రట్ల యుండ వలయునని కోరెద.

ఇట్లు విన్నవించు విధేయుఁడు,

విక్రమసేనుఁడు.

ఆజాబు నామాలాగ్రముగఁ గొడుకు వినుపింప విని సంతసించి యరవిందాదేవి తన వ్రాసిన లేఖయుఁ మిత్రుఁడు లిఖించిన జాబును ముసలికంచుకి యగు ముంజుని చేతికిచ్చి మణిసర్మకడకంపెను. అతఁ డదిచూచి మాధవసేనుని బయనముచేసి పంపెను.

పందొమ్మిదవ ప్రకరణము

ఒకానొక మహాకవి వర్ణించినట్లు నాఁటిరేయి గాఢపుచీఁకటులు నరుల మేనుల నల్లపూఁతలు బూసినట్లు గగనమునుండి కాటుకవానలు గురిసినట్లు నలుదెసలవ్యాపించి దుష్టుఁడగు యజమానునికిఁ జేసిన సేవ యుంబోలె దృష్టి నిష్ఫలమగునట్లు చేసెను. శ్రీనగరమంతయు నిద్రా మోహితమై నిస్తరంగమగు సముద్రమట్లుండెను. పగలెల్ల బహు వ్యాపారపరతంత్రులై శ్రమపడి యుండుటంజేసి నగరవాసులలో దాదాపుగ నందఱు గాఢనిద్రం దగిలి విశ్రాంతిసుఖ మనుభవించు చుండిరి. పరద్రవ్యాపహర్తలు పరకాంతాసక్తులు మొదలగు దుర్వి నీతులుమాత్రము గుహలవిడి యెఱనిమిత్తము సంచరించుదుష్టమృగం బులవలె భయపడుచు రాచబాటలు విడిచి సందుగొందులం బడి

ముసుఁగువైచికొని వలయుసాధన సామగ్రుల గ్రహించి తననీడలు చూచి తామె శంకించుచుఁ దమ దుర్యశమువలె లోకమెల్ల నిండిన యా గాఢాంధకారమున సంచరించుచుండిరి. ఆకాశలక్ష్మి తన వేయి కన్నులఁదెఱచి నేలపై జరుగుచున్న దంతయుఁ గనిపెట్టుచున్నదో యనునట్లు నభోమండలమున లెక్కలేని చుక్కలు మిణుకు మిణుకు మని మెఱయఁ జొచ్చెను. నూతనపురుషులు మున్నెన్నఁడుఁ జొఱని సందులలోఁ జొచ్చిన తావుల మోరలెత్తి కుక్కలు మొఱుగఁ జొచ్చెను. నగర రక్షణము నిమిత్తమయి నియోగింపఁబడిన రాజ భటులు కొంతసేపు తిరిగి యే యరుఁగుమీఁదనో యే స్తంభముచాటు ననో నిద్రాదేవికి విధేయులై యామెపనుపు చేయుచుండిరి. తెగుళ్ళ చేత నిద్రపట్టక బాధపడు రోగుల మూల్గులు నిలువనీడలేక వీధులలో నెఱిపంచనో నిద్రించు పాంథుల గుఱ్ఱులు చెట్లమీఁద నడుమనడుమఁ బులుఁగుల మొలుంగులు పైనఁజెప్పిన కుక్కలుదప్పఁ బట్టణమున నితరశబ్దమేదియు లేదు.

సేనానివేశముమాత్ర మారేయి మిక్కిలి సందడి గలిగియుండెను. సైనికులు తమతమ యాయుధంబుల ధరించి సమరసన్నద్ధులై మహోత్సాహభరితులై యుండిరి. దండపాణియు, వజ్రపాణియుఁ గవచంబులుదొడిగి శిరస్త్రాణంబులు ధరించి యశ్వారూఢులై డాలు కత్తులు, విండ్లు నమ్ములు మొదలగు నాయుధవిశేషంబులఁబూని సైనికులలో ముఖ్యులగువారితో వారు వారు గావింపవలసిన కృత్యంబుల నుపదేశించుచుండిరి. సైనికులలోఁ గొందఱు దండపాణిం గలసి యా సన్నాహ మెందుకని ప్రశ్నింప నాతఁడు "ఈసన్నాహము మన రాజ కుటుంబ రక్షణార్థమే. గాంధార రాజపరిజనులు మాఱువేసములు వైచుకొని మనపట్టణంబున సంచరించుచున్నారు. వారిం బట్టవలయు నందునిమిత్తమై యాయుధహస్తులగు వేయిమందిజోదుల మేము తోడ్కొనిపోవుచున్నాము" అని బదులు చెప్పెను.

"అట్టివారిం బట్టుటకు వేయిమందిచాలుగదా! తక్కిన సైనికుల నందఱ సిద్ధముగనుండవలయునని యేలచెప్పవలయును ?" అని వారు మరలనడిగిరి. అందుకు దండపాణి యిట్లనియె. "మీరుసైనికులు మేము సేనాపతులము. మేమాయుధములు పూనుమన్న మీరు పూనవలసినదె. ఎవరితలఁ గొట్టుమన్న వారితలఁ గొట్టవలసినదె. ఎక్కడికిఁ బొమ్మన్న నక్కడికిఁ బోవలసినదె. ఏమిసేయుమన్న నది సేయవలసినదె. ప్రశ్నలు వేయుటకు మీకధికారము లేదు. ప్రబలసమరసన్నాహముఁ జేసి దండనాయకులు దండునడిపించునప్పుడు ప్రతిసైనికుఁడు నిలువఁబడి యెక్కడికి ? ఈదండయాత్ర యెందుకు ? ఇదిన్యాయమది యన్యాయమని వితర్కమారంభించినపక్షమున రాజ్యతంత్ర మొక్క నిముసముజరుగునా? సమరములుజరుగునా ? జయములు చేకూఱునా ? ఎవరిధర్మము వారు చేయవలయును. రాజాజ్ఞ మేము మన్నింపవలె మాయాజ్ఞ మీరు మన్నింపవలె. ఇట్టిప్రశ్నలింకెవరైనఁ జేసిరేని నట్టి వారిశిరస్సులు వెంటనే ఖండింపఁబడును" అని దండపాణి కఠినముగా బలికెను. ఆయుత్తరముతో వారు ప్రశ్నలుమానిరి. అప్పుడు దండపాణి సైనికులనందఱ బారులుగా నిలువఁబెట్టి వారితో నిట్లనియె "ఈసమయమున రణదుందుభులు వాయింపఁగూడదు. నాయాజ్ఞలేక మీరు కేకలువేయఁగూడదు. ఒండొరులతో మాటలాడఁగూడదు. నడచునప్పుడు కాలిచప్పుడు గాఁగూడదు. నేనుముందునడచెదను నావెంటనే గోవు వెంటఁదగిలిపోవు దూడవలె మీరురావలయును. నేనెవ్వరియింటి దగ్గఱ నిలిచెదనో మీరచ్చట నిలువవలయును. నే నెవ్వరిబంధింపుమన్న వారిని బంధింపవలయును. ఏవిధమైన ప్రశ్నల నడుగఁగూడదు. దీపములు చేతఁబట్టఁగూడదు. అయిదుగు రొక్కబారుగా నిలువవలె. వారివెనుక నైదుగురు వారివెనుక నైదుగురు నీవిధముగా వేయిమందియు రెండువందలు చిన్నబారులుగాఁదీరి నడువవలయు. ఈనిబంధన

లన్నియు మనంబునఁబెట్టుకొని నా వెంటరండు." అని సేనాపతి మానతీయ సైనికులప్పుడే యైదుగురేసి యొక్క బారుగాఁజేరి యొకరివెనుక నొకరునిలువఁబడిరి. మొట్టమొదట దండపాణియశ్వారూఢుఁడై నడువ జొచ్చెను. వజ్రపాణిసేనకు వెనుక గుఱ్ఱమెక్కి రాఁజొచ్చెను. నిశ్శబ్దముగా మనుష్యవాహిని ప్రవహించునట్లు చిన్నసేన నడచి పట్టణముఁ జేరెను.

రెండుజాములురాత్రి యయ్యెను. పట్టణద్వారముకడ నాజానేయతురంగమెక్కి కవచశిరస్త్రాణములు ధరించి యాయుధపాణియైన యొకమహాయోధుఁడు వారింగలిసికొనెను. వాని కిరుప్రక్కల విచ్చుకత్తులతో నలుగురుజోదు లంగరక్షకులుగానుండిరి. గాఢాంధకారమగుటచే సైనికులాతనిని గుర్తింపలేకపోయిరి. కాని దండపాణి తన గుఱ్ఱము నాతనిగుఱ్ఱము సమీపమునకుఁ దీసికొనిపోయి మెల్లగా "సరిగా సమయమున కేవచ్చితివే" యని హెచ్చరించెను. ఇంతకుమున్నే వచ్చితినని యాతఁడు బదులుచెప్పెను "మున్ను మనమనుకొన్నట్లు వానిం బట్టుకొనవలసిన దేగదా?" యని దండపాణి యడిగెను. "ఆహా! సందియమేమి? అదే ప్రథమకర్తవ్యము తరువాత, వానిని బట్టి రెండవపని" యని యాతఁడు ప్రత్యుత్తరమిచ్చెను.

ఈసంభాషణము గుఱ్ఱమునునడపుచునే వారుచేసిరి. సైన్యము నిశ్శబ్దముగా వెనుకవచ్చుచుండెను. వారుక్రమముగా రాజవీథిం బ్రవేశించి యటనుండికొన్ని ప్రక్కవీథులజొచ్చి విశాలమయిన యావరణము-నయ్యావరణములో రమణీయమైనయుద్యానము నయ్యుద్యానమధ్యమున మనోహరమైనసౌధము-గలయొకస్థలముఁ జేరిరి. సింహద్వారము బంధింపఁబడియుండెను. గోడయెత్తుగనుండెను. దండపాణి నలుగురుజోదుల బిలిచి "యీగోడదాఁటిలోపలికిదుమికి తలుపు దీయుఁ"డని యానతిచ్చెను. వెంటనే యొకయోధుఁడు కూర్చుండెను,

వానిభుజములపై నింకొక యోధుఁ డెక్కెను. అంతట మొదటివాఁడు లేవఁగా వానిభుజారోహణముచేసిన సైనికుఁడు గోడమీఁది కెక్కి యాగోడదఁటినున్న చెట్టెక్కి మెల్లగా నావరణములోనికి దిగెను. అట్లె యిద్దఱుముగ్గురు చేసి లోనఁబ్రవేశించి మొదటివానికిఁ దోడై కవాటముఁ దెఱచిరి.

దండపాణి నూఱుమంది జోదుల నావరణమునఁ బ్రవేశింపుమని తక్కినవారి నింటికి నన్నిదెసలఁ గావలియుంచి యింటిలోనుండి యీఁగయైన నావలకుదాటిపోకుండ చూడుమని యానతిచ్చెను. సైనికులు కడుత్వరితముగా నట్లుచేసిరి.

లోపలిద్వారపుఁ దలుపులకు సూక్ష్మాగ్రములుగల యినుప బొగడలు వేయఁబడియుండెను. గ్రంథులనడుమ నినుపరేకులు తాపటము చేయఁబడెను. భుజములతో గెంటినఁ దలుపులూఁగిపోవని దండపాణి యుపదేశముమీఁద నిరువురుసైనికులు గొడ్డళ్ళుదీసికొని తలుపులు పగులఁగొట్టనారంభించిరి. చప్పుడువిని యింటిలోనివారు మేల్కొనిరి. ఎవఁడు వారని మేడమీఁదనుండి యొకవృద్ధుఁడు గంభీరముగఁ గేకవైచెను. మేడక్రిందనున్న వారందఱు దొంగలుదొంగలని యాక్రందనముఁ జేసిరి. చుట్టుప్రక్కలనున్నవారు కొందఱా చప్పుడును గృహములోనున్నవారి యాక్రందనమును నాలకించి వీధిలోనికి రాఁబోయిరి. కాని సైనికులువారి నిండ్లుదాటి రాకుండఁ జేసిరి. తలుపులంతలోఁ బగిలిపోయెను.

దండపాణి, వజ్రపాణి, చిత్రభానుఁడు లోపలఁ బ్రవేశించిరి. గృహదీపికలు వెలుఁగుచుండుటచేత వానిసాయమున వారు మేఁడమీదికిఁ గొందఱు సైనికులం దీసికొనిపోనసమకట్టిరి. మేడతలుపులుగూడ బంధింపఁబడెను. గృహమునందున్న స్త్రీలు బాలురు సేవకులుదొంగలు

దొంగలని గృహమునంతయుఁ బ్రతిధ్వనులిచ్చు నట్లాక్రందనము చేయుచుండిరి. మేడతలుపులుగూడ గొడ్డలిపెట్లులవలన భేదింపఁ బడెను. మున్ను పేర్కొనఁబడిన మువ్వురు నాయకులు కొంతమంది సైనికులం దీసికొని మేడమీఁదికరిగిరి. మేడమీఁద విశాలమయిన చావడిలో దొంగల నెదిరింపవలెనని చేత ఖడ్గములుఁబూని నిలువంబడియున్న వృద్ధుని మణివర్మనుజూచి చిత్రభానుఁడు "సైనికులారా! వీనిచేతిలోని ఖడ్గము లాగుకొని చెక్కులు విఱిచికట్టుఁడు" అని యాజ్ఞాపించెను.

అప్పలుకులతని నోటనుండి వెలువడినవో లేవో వెంటనే యొక సేవకుఁడు ఖడ్గమూడఁదీసికొనెను. మఱియిద్దఱు మాంసహీనములై శల్యచర్మావశిష్టములయిన యాతని చెక్కలం బట్టుకొని వెనుకకుఁ దీసి మోటుత్రాళ్ళతో విఱిచికట్టిరి. మణివర్మ వారిం జూచినతోడనే విస్మితుఁడై యొకట మాటలాడలేకపోయెను. తరువాత నించుక తొట్రుపాటులోనుండి వెలువడి మాటలాడఁ గమకించుచుండఁగనే నోటమాట రాకమునుపే యా దారుణకృత్యము జరిగెను. "మీరావచ్చినవారు? అర్ధరాత్రమున నిల్లుజొచ్చుటచేతను గొడ్డళ్ళతో దలుపులు బగులఁగొట్టుటచేతను నేను దొంగలను కొన్నాను. దొంగలు ధనము హరింతురు. మీరు ప్రాణధనము హరింపవచ్చినారు. చిత్రభానుఁడువచ్చి యిట్టిదుండగము సేయుటలో నాశ్చర్యములేదు. కాని దండపాణీ! ఆవిధమున దేవిగారియొద్దను నాయొద్దను నీవును నీతమ్ముఁడును రాజభక్తి నభినయించి మీకపకారమెన్నఁడు సేయనివాని నేదోషమెఱుంగనివాని, పితృవిహీనుని, విక్రమసేనుని ద్రోహభావమున విడిచి యీతనిఁ జేరుట మిమ్ము మొదటినుండియు నెంతో గౌరవమునఁ జూచి మహోన్నత పదవిలోనికిఁ దెచ్చిన నన్ను శతవృద్ధుని బద్ధునిఁ జేయుట మహాశ్చర్యము గొల్పుచున్నది. పూవుదండయనుకొన్నది పామయినది. ఇంద్రనీలము

మసిబొగ్గయినది. మీరు గావించిన రాజద్రోహమునకు మీయన్న దమ్ములిరువురు నిహపరలోకముల రెంటనుగూడఁ దగినఫలం బనుభ వింతురు.'' అని మణివర్మ కోపావేశమున నెఱ్ఱబాఱిన మొగములోఁ దడబడునట్లు పలుకుచుండ నంతలో జైత్రభానుఁ డడ్డముతగిలి యా వృద్ధామాత్యు నుద్దేశించి యిట్లనియె.

ఓరీ, దురాత్మా! వృద్ధమర్కటమా! కాదుకాదు. వృద్ధజంబుకమా! విక్రమసేనునకు వారు ద్రోహముచేసిరా? ఇట్లనుటకు నీకు నోరెట్లాడెనురా? నీకాత్మలేదా? అంతఃకరణములేదా? సిగ్గులేదా? మహానుభావుఁడైన హేమచంద్రుని మాయోపాయములు బన్ని చంపించి విక్రమసేనునికి మహోపకారముఁ జేసిన దుర్జనుఁడవు నీవు. మొదటినుండియు నాకును నాయన్నకును స్పర్థలు గలిగించి వైరానలము వృద్ధినొందించి నన్ను దేశమునుండి వెడల నడపించిన పాపాత్ముఁడవు నీవు. విక్రమసేనుఁడను శాలుని పేరుపెట్టి కాశ్మీర రాజ్యమంతయు నేకచ్ఛత్రముగ నేలుచుఁ బ్రజలను దరిద్రులనుజేసి ధనములు దోఁచుకొని కుబేరుఁడనగుచున్న కుచ్ఛితాత్ముఁడవు నీవు. సింధుగాంధార మహీధవులను నిక్షేపము వంటి యీ దేశములమీఁద దండెత్తిరమ్మని యాహ్వానించి కొన్ని యగ్రహారములు వాని వలన లంచముగా గ్రహించి దేశమును, దేశస్థులను, రాజకుటుంబమును మా కులగౌరవమును వారికి విక్రయింపఁదలఁచిన నీచాతి నీచుఁడవు నీవే. పాన్పుమీఁది పామువలె మా యన్నయొద్ద నీవు మంత్రివైయుండి యెట్టకేల కాతని దుదముట్టించిన పాతకుఁడవు నీవే. నిన్నునమ్మి యాయనప్రాణముఁ గోలుపోయెను. రాజ్యము నీకప్పగించి బిడ్డల నీకప్పగించి యాయన బలవన్మరణము నొంద నీవు దేశ మితరుల కప్పగించుచుంటివి. మా యన్నబిడ్డలను భార్యను బరామర్శ చేయనేనిటకు వచ్చియుండ నన్నూరువిడిచి పొమ్మని యాజ్ఞాపించిన యమాత్యశేఖరుఁడవు నీవేగావా? నన్ను

బొమ్మనుటకు నీ నెవ్వఁడవు? ఈ రాజ్యము నీ యబ్బసొమ్మా! నీ తాతసొమ్మా! నా యన్న రాజ్యము నా తండ్రి రాజ్యము. మాయన్న చెవులలో విసముపోసినాఁడు నన్ను వెడలగొట్టించి నేఁడు ను నట్టియాటలే యాఁడజూచితివి. నీయాట లంత మొందు సమయము వచ్చినది. నీదుశ్చరిత్రము వెల్లడియగుకాలము వచ్చినది. నీమలిన వర్తనపుగోడకు నేఁటినుక మాయ యనువెల్లవైచిజ గద్వచనముఁ జేసితివి. ఇప్పు డేమిచేసెదవు! కాశ్మీరరాజ్య ప్రధానమంత్రుల భుజ ములు విఱిచికట్టఁబడిన వేమి? మీదు స్తంత్రము లిప్పుడు సాఁగ వేమి! ఇప్పుడయిన బుద్ధిగలిగి బ్రతుకుము.” అని యతఁ డూరకుండ దండ పాణి “అయ్యో మారాక మీ కాశ్చర్యముగా నున్నదా? మేము విక్రమసేనుని మోసపుచ్చితిమా? ఇంకను మహాశ్చర్యము జూచెదవు గాక నీకన్న మే మెక్కువ వంచకులముగాము. నీవు గావించిన ద్రోహములకన్న మే మెక్కువ ద్రోహములు చేయఁజాలము. నీవు ద్రోహముల పుట్టవు. నీ వితరుల నే విషయమున దూషింపనవసరము లేదు. నీ చేసిన యపచారములకన్నిఁటికి ఫలముగా భగవంతుఁ డీ పాట్లు దెచ్చె” నని యతఁడు తన్ను మొదటనాడినమాటల కుత్తర మిచ్చెను.

అప్పుడు మణివర్మ సగము ప్రాణ్లాడిపోవుటం జేసి కొంతబొంగు గానున్న నోటనుండి కొన్నిమాటలు తెలియకుండునట్లు వారికిట్లనియె. “చిత్రభానుఁడా! పిల్లి కన్నులుమూసికొని పాలుద్రావి తన్నెవ్వరుఁ జూడలేదని సంతసించును. అట్లే నీ కావించిన మహాపాతకములులోకు లెఱుఁగరని నీవు భ్రమించి పరమపవిత్రుఁడట్లు - నిష్కళంకవర్తను డట్లు- నిరపరాధులగు నితరులపై దోషారోపణముఁ జేయుచుంటివి. నీ వర్తనము చక్కఁగా నరసియే నీయన్న నీవు పాముకన్నఁదోడేలు కన్నఁ-బెబ్బులికన్నఁ-క్రూరుఁడవని నిన్ను దేశభ్రష్టునిఁ జేసెను. నీ సంచారములన్నియు వక్రములు. నీపలుకు లన్నియు ననృతములు.నీ

చేష్టితము లన్నియు దురాచారములు. నీది హృదయము గాదు. జాతి ముక్క. నీ కంతఃకరణము లేదు. దయలేదు. దాక్షిణ్యము లేదు. ఎగ్గులేదు. సిగ్గులేదు. ఆశాదేవత నిన్నావహించినది. భ్రాతృహంతవు ఏకగర్భజనితుండైన సోదరుని జంపించిన మహాపాతకునకు ఆ నెత్తురు కూడు భుజించి సుఖింపందలంచిన పరమదుర్మార్గునకు- జగద్వంచనమే ప్రధానవ్యాపారముగాంగలఖలునకు నీకుంగ్రుడ్డివానికింబట్టపగలుగూడ నంధకారమయమై తోంచునట్లు, మావంటి రాజభక్తులు, మావంటి ధర్మమార్గానుచరులు. మావంటి నిరపరాధులు, దురాచారులుగాం గనంబడుటలో నాశ్చర్యమేమున్నది? నీవు మీ యన్నగారి దార పుత్రుల బరామర్శించుటకు రాలేదు. ఆపసికూనలంగూడం గడతేర్చి యీ గద్దియ నాక్రమింపం దలంచివచ్చితివి. ఆ యభిప్రాయముతోనె యేదో యెఱబెట్టి యీ దండనాథుల వశముం జేసికొంటివి. ఈ సేన స్వాయత్తము జేసికొంటివి. ఈమూర్ఖులు నీమాయలలోంబడిరి. సింధు గాంధారరాజుల దండయాత్రా కథలు నీకల్పించిన ప్రబంధములు. అవియెల్ల నీదు స్తంత్రములు. ఈవంక బెట్టి వీరింజంక బెట్టుకొంటివి హతవిధి హేమచంద్రునకు, వానికుటుంబమునకుం బ్రతికూలుండై యుండుటం జేసి నీయాగడములు సాంగుచున్నవి. పరమేశ్వరుండొక్క డున్నపక్షమున నతండు దయాళుండైన పక్షమున - శిష్టజనసంరక్షణం బును, దుష్టజనశిక్షణంబును వానికి నైజములైనపక్షమున - ధర్మమను నదీప్రపంచమున నున్నపక్షమున—"సత్యమేవ జయతేనానృత"మ్మను వేదవాక్యములు సత్యములైనపక్షమున వేదశాస్త్రంబులుప్రభావంతములైన పక్షమున నేడుగాకున్న మఱియొకనాండయిన నీవొనర్చిన మహాపాతకములకుం బ్రతిఫలముగా నీవు భగ్నమనోరథుండవైన సర్వ విధములంజెడినీచమరణంబు నొందక పోవు. నీచేసినదుశ్చేష్టలువ్రాయజాలక చిత్రగుప్తుండు సైతము నీయంతముం గోరుచుండును. నీనిమిత్తమై

యమధర్మరాజు క్రొత్తనరకము నిర్మింపవలెను. విక్రమసేనుని గర్భము చెడఁ బుట్టితివి. కాశ్మీరరాజ కుటుంబమునకుఁ గలంకముఁ దెచ్చితివి. హరిశ్చంద్రుఁడు, రామచంద్రుఁడు భీష్ముఁడు, యుధిష్ఠిరుఁడు రఘువు, రంతిదేవుఁడు మొదలగు మహనీయులైన రాజర్షులకు జన్మ కారణమైన క్షత్రియ వంశము నీవలన మలినమై యవమానిత మైనది. చల్లని చంద్రుఁడు పొడమిన పాలసముద్రమునందు హాలాహలము పుట్టినట్లు ధర్మస్వరూపుఁడు హేమచంద్రుఁడు పొడమిన సద్వంశమునఁ బరమనీచుఁడవు పరమపాతకుఁడవు నీవుసంభవించితివి. నీవెన్ని ధర్మ పన్నములు జెప్పిన నమ్మువారులేరు. నీవన్న నించుకైన నాఁకు గౌర వముగాని భయముగాని లేదు. నీబంట్లు నాకించుకేనియు వెఱపు గొలుపలేరు.'' అని యంతతో నాఁగక మణివర్మ వెండియు రూక్ష వచనంబులఁ బలుకఁ బోవుచుండ నొకసేవకుఁడు ''స్వామీ! వీని కుత్తుక నుత్తరింతునా? సెలవైన వీనితల తాటిపండువలె మీయడు గులకడఁ బడవేయుదు. దేవరవారికి వీనియందు నింతశాంత మెందు'' కని ఖడ్గపాణియై ముందఱకు వచ్చెను. చిత్రభానుఁడు వానిని వారించి ఓయీ నీభక్తికి సంతసించితిని. బంటువైన నీకున్నభక్తిలో సహ స్రాంశ మీ పాపకర్మున కున్నపక్షమున మారాజ్య మింతవఱకేల వచ్చును? కాని వీని నిపుడు చంపవద్దు. ఈ చాటుచావు వీనికిం దగదు. వీని బహిరంగప్రదేశమున జెట్టునకుఁగట్టి యురిదీసి మాసామ్ము దినుటఁచే బెరిఁగిన వీని మాంసము కాకులు గ్రద్దలు దినునట్లు వీని కళేబరమును రుద్రభూమిలోఁ బడవేయవలెను. కావున వీని నిప్పటికి రక్షించితి'' నని బంటు నావలకుఁ ద్రోసివైచెను.

''ఓహో! నన్నిప్పటికి నీవురక్షించితివా! దయామయుఁడవు గావున మహోపకారముఁ జేసితివి. నేను మరణమునకు భీతిల్లువాఁడను గాను. నీవంటి పందలు మరణమునకు వెఱతురు గాని, నేను వెఱువ,

నేను వృద్ధుఁడను. రేపో నేఁడో చావవలసిన వాఁడను. నీచేత జచ్చినను నేదో తెగులుచేతఁ జచ్చినను నాకొక్కటే. పరమేశ్వరుఁడు ప్రపంచమున మానవ వినాశమునకొఱకుఁ గొన్నితావుల మహామారకములైన తెవుళ్ళను, మఱికొన్ని తావుల నీవంటి దురాత్ములను సృజించుచుండును. రోగములును మీవంటివారును సన్నిహితజ్ఞాతులు. జగద్వినాశనమునకై జనియించుచుందురు. నేను మరణించినను జీవించినంతకాలము విశ్వాసముతో స్వామికార్య నిర్వహణ ప్రవీణుఁడ నగుటచేతను. మనోమాలిన్యములేక నడచుటచేతను, పరవంచనా విముఖుఁడ నగుటచేతను, నాకుత్తమగతులు ప్రాపించునని నమ్మిక గలను. జన్మాంతర మొందినను నేను మరల నరజన్మమే పొందుదును. ఇంక నీవు మృతినొందితివేని మహానరకములలో స్త్రీహంతలు శిశుహంతలు గురుహంతలు మాతాపితృభ్రాతృహంతలు మొదలగు మహాపాతకులు పోవు దుర్గతులకుఁ బోవుదువు. ఒకవేళ జన్మాంతర మొందినను, నుత్తమమగు మానవజన్మ మెత్తక పాముఁ పెద్దపులి మొదలగు ఘాతుక మృగజన్మమో లేక హేయమైన కీటకజన్మమో నీవెత్తుదువు. మరణానంతరమున నాకళేబరమును నీవెక్కడ బాఱవైచినను నాకు విచారములేదు. నామాంసము పక్షులుతిని యాకలిదీర్చికొనుటచేఁ 'పరోపకారార్థ మిదంశరీర' మ్మను మాట యొక్కింత సార్థకమైనదని నేను సంతసింతును. శరీరము భగవానుఁడైన యగ్నిదేవున కాహుతియైనను మంటిపాలైనను, విహంగముల కాహారమైనను నామనంబునకు విచారంబు గలుగదు. విగతప్రాణమైన వెనుక వట్టికట్టెవంటి యీదేహ మేమైన నేమి? అది నీ నైచ్యమునే తెలియఁజేయును. నీదౌర్జన్యమునే ప్రకటించును. నీఘాతుకవృత్తినే వెల్లడించు నీక్రౌర్యమునె చాటును. అది నే చూడఁబోను.' అని మణివర్మ నిర్భయముగా నిశ్చలమనస్సుతోఁ జిత్రభానుని దూలనాడెను."

"ఓహో! నేను పందను. నీవుదంతిమగఁడవు. నీకు భయము లేదు. నిజమే! ఇదియొక్కటియే నీనోట వెడలినసత్యము. నీకు దేవుని భయము లేదు. పాపభయము లేదు. లోకాపవాదభయము లేదు. నీవంటివారికే యుత్తమగతులు వచ్చినపక్షమున జారులకుత్తమగతులు చోరుల కుత్తమగతులు, రాజద్రోహుల కుత్తమగతులు, నీవు జేయరాని యవియుత్తమగతులన్న పేరు గోల్పోవును. నీప్రేలరితనము మేమెఱుఁగుదుముగాని నీవు ధనమెందు దాఁచితివో చెప్పుము. కాశ్మీర రాజ్యమంతయు దోఁచుకొని నీయిల్లునిధినిక్షేపములతో నింపితివని వినుచున్నాము. అవియెల్లనిక్కడ గ్రక్కుము.' అని చిత్రభానుఁడు వాక్రుచ్చెను.

"నేను ధనము సంపాదించినమాటకల్ల. మానధనము నాకడఁ గలదు. యశోధనము కొంతకలదు. ధర్మసాధనమే సాధనము. ఇంత కన్న నాదగ్గఱ ధనము లేదు' అని మణివర్మ జెప్పెను.

ఆహా! నీకు మానధనములు యశోధనములుగూడగలవా! భూమి మీఁదనవతరించిన దంభుఁడవే నీవు. ఈయాత్మస్తుతి కేమిగాని ధన మెక్కడనున్నదో చూపుము. చూపవేని నీగ్రుడ్లు దీయించెద. నీవె త్తుకుక్కలు నాకునట్లు గుఱ్ఱముల గొట్టు కశలతో జీమలచింతకు నిన్నుఁ గట్టించి కొట్టించెద ఓరీ! జోదులారా! గుడ్డ లాముదములో ముంచి వీనిచేతులకుం గాళ్ళకుం జుట్టినిప్పంటించుఁడు. అవి కాగడాల వలె వెలుఁగవలయు. అప్పుడుగాని వీఁడుధనము దాఁచినచాటుచో టులు జూపఁడు. నేనన్నంతపని జేయించెద. జాగ్రత్త. నీవువృద్ధుఁడ వని బ్రాహ్మణుఁడవనిచూచువాఁడనుగాను. వజ్రపాణీ! మేడదిగి వెళ్ళి స్త్రీలశరీరములమీఁదఁ నున్న నగలన్నియుఁ దీసి కొనిరమ్ము. తిమంత టతాము నగలనొసగరేని సాహసికులగు నీబంట్లను వారిమీఁది

కంపి యంగనలని సంశయింపక, సర్వాభరణముల దీయింపుము, ఆఁడువాండ్రను స్పృశియించిరని యవమానించిరని పరుషోక్తులాడిరని నేనువారినిదండింపను.'' అని చిత్రభానుఁ డానతిచ్చెను.

అనవుడు మణివర్మయిట్లనియె. ''నీకావించుపాపముల దండలో నింకను కొన్నిగ్రుచ్చవలసియున్నవి. ఇప్పుడుతలపెట్టినదుష్కృత్యములు దండను పూర్తి చేయఁగలవు. కానిమ్ము! గ్రుడ్లుదీయించినను నాకు వెల్తిలేదు. గ్రుడ్లున్నపక్షమున నీవంటిపాపాత్ములను జూడవలసివచ్చును. బాహ్యనేత్రములు లేకున్నను మనోనేత్రముతో ఫాలనేత్రునిజూచుచుఁ గాలముఁబుచ్చెద. ఎన్నిదెబ్బలు నీవునన్నుఁగశలతోఁ గొట్టింతువో నన్నియు వడ్డితో నాపక్షమున దండధరుఁడు నీకిచ్చును. భగవానుఁడైన యగ్నిహోత్రునకు నాశరీరము మరణానంతరమైన నాహుతికావలసినదే. అదిజీవించియుండఁగానె యైనపక్షమునఁ గడుంగడుమేలుగదా! రక్తమాంసహీనమై యెండుకట్టెవలెనున్న నాశరీర మామహాత్మునకు నల్పకాలమే వినియోగించునని విచారించెద. అదియునుఁగాక భర్త మృతినొందినప్పుడు మహాపతివ్రతలగు మనదేశపుటంగనలు మగనికాటిపై నెక్కి పదియాఱువన్నె పసిండికెనయగు తమమేనుల నగ్నిహోత్రునకు నిర్విచారముగాఁ గంటఁడడియైనఁ బెట్టక యమ్మా యనక యబ్బా యనక యాహుతులుగా సమర్పించుచున్నారు. అట్టియాఁడువాండ్రే యబలలే యట్టి సాహసములు చేయుచుండ మగవాఁడ నయిననేను క్షణమునీవు భగవానుఁడైన వీతిహోత్రుని గాఁగలించుకొనియుండఁజాలనా? ''మన ఏవ మనుష్యాణాం కారణం బంధమోక్షయోః'' అని యమృతబిందూపనిషత్తు చెప్పుచున్నది. మనుష్యునిబంధమునకుఁగాని మోక్షమునకుఁగాని మనస్సే కారణము. మనస్సుస్థిరపఱచుకొన్న వారికి మున్నీరు మోకాలుబంటి, గండకత్తెర పుష్పమాల, అగ్నిప్రవేశమా

కారాగ్రప్రవేశము, మరణము దేశాంతరప్రయాణము. కావున మిమ్ము నీబెదిరింపులు వెఱపింపఁజాలవు. అవి చిన్నబిడ్డలకడఁ జెప్పుము. నేను మృత్యుదేవతకు సమీపమందున్నవాఁడను. వాడికోఱలు గల యా భయంకరముఖ మీవలకే నాకగపడుచున్నది. వృద్ధుని జంపి నను యప్రతిష్ఠ నీకు వచ్చుటకై నీకీదుర్బుద్ధులు పుట్టినవిగాని నే నెట్లయిన మరణింపకమానను. నాకడ ధనముమాత్రములేదు. నీ యిచ్చవచ్చినట్లు చేసికొమ్ము. బ్రాహ్మణుఁడని వృద్ధుఁడని, శంకలు గాని జాలిగాని నీకుండునని నేనెన్నఁడు దలంపలేదు.''

ఈ సంభాషణము జరుగుచుండఁగానే వజ్రపాణి సౌధమెుదిగి దిగువభాగమునకు వెళ్ళి మణివర్మభార్య మొదలగు స్త్రీజనమును నిర్బంధించి సమస్తాభరణములను దీసికొనితెచ్చెను. అంతటఁ జిత్ర భానుఁడు వీఁడు ధనమున్నతావులు చూపలేదు గావున వీనిని క్రూర దండనల పాలుచేయవలయు. అప్పని యిచ్చట చేయఁదగదు. వీనిం గారాగృహమున బంధింపుఁడు. అచ్చటనే చిత్రవధ చేయవచ్చును. వజ్రపాణీ! ఆ యాభరణంబులు నీకడనే యుంచుము. మెుటియలవంటి నలువురు జోదులను వెంటనిచ్చి వీనిం గారాగృహమున కనుపుము. అచ్చట వీనిని బంధించి నిరంతరము పదుగురుభటులు కావలియుండ వలయు''నని యానతియ్య 'నట్లే' యని వజ్రపాణి మెుటకులగు నలుగురు కఱకుబంట్ల బిలిచి మణివర్మఁ దోడ్కొనిపొమ్మనిచెప్పెను. వారాతని రమ్మని లాగి తోడ్కొనిపోయిరి.

కాలవశమున వచ్చు సుఖదుఃఖముల ననుభవింపక తీఱదని లోకజ్ఞానసంపన్నుఁడగు మణివర్మ తన నివాసగృహమును విడిచి కారాగృహమున కరిగెను. చిత్రభానుఁడు ససైన్యముగా దండనాథ యుక్తుఁడై పిమ్మట మాధవసేను గృహమునకరిగెను. అదియుఁ గవాటభేదముఁజేసి ప్రవేశించి చూచునప్పటి కయ్యమాత్యుఁడు లేక

పోయెను. వానిగృహము గూడ దోచుకొని వారు పిమ్మట కోడికూత వేళకు గదాధరుని యింటికిం జని యాతనిబంధించి యాతనియిల్లు కొల్లవెట్టి పిమ్మట శూలపాణిమందిరమున కరిగి వానిబంధించి యాతని గృహముం దోఁచుకొనిరి. అంతలోఁ బ్రభాతమయ్యెను.

ఇరువదియవ ప్రకరణము

రాజ్యలక్ష్మి తాను చిత్రభానునివశము గావలసివచ్చినందుకు విలపించుచున్నదో యన్నట్లు పులుఁగులయెలుంగులు నలుదెసల నెసంగెను. చిత్రభానుని బారిఁబడకుండఁ దన్నుగావుమని యామె పరమేశ్వరుం బ్రార్థించిన తెఱంగున గాకులు కావు కావుమని యఱచెను. కోపోద్దీపితమయిన చిత్రభానుని నెమ్మొగంబుపగిది భానుమండలము పొడుపుగొండపయి జపాకుసుమశోణంబై కనంబడెను. రాజ్యరమాదేవికి మున్ను తోడై నిలిచినమిత్రులందఱుఁ గ్రమక్రమంబుగ వెనుకబడినట్లు తారకలదృశ్యములయ్యెను. చిత్రభానుని పన్నుగడలు గూఢభావమునుమాని వెల్లడియైనట్లు చీకటి యంతరించి వెలుఁగుదోఁచెను.

చిత్రభానుని యాజ్ఞాప్రకారము సైనికులు గదాధరశూలపాణులంగూడఁ జెచ్చెరఁజెఱలోబంధించి కాల్యకృత్యంబులఁ దీర్చికొనుటకు నిజనివాసంబుల కరిగిరి. దండపాణియు వజ్రపాణియు నిర్వర్తిత కాల్యకృత్యులై చిత్రభానుసమేతముగ జాముప్రొద్దెక్కునప్పటికి సేనానివేశమున కరిగిరి. విక్రమసేనునియెడ భక్తిగల సైనికు లనేకులు మణివర్మయొక్కయు గదాధర శూలపాణులయొక్కయు బంధనము విని

శోకించిరి. వారల్పసంఖ్యాకులయినను దమ్ము నడపింపు నాయకుఁడున్న పక్షమున మహోత్సాహముతో వెంటనేచని వృద్ధామాత్యుని సేనాపతులను బంధవిముక్తులఁ జేయఁదలంచిరిగాని గదాధరశూలపాణులు సయితము కారాగారబద్ధులగుటచే నత్తఱిఁ జేయునది లేక దైన్యము హేమచంద్ర కుటుంబమునకు విముఖుఁడై యున్నాఁడని తలంచియూరకుండిరి తక్కినవాండ్రందఱు మనసులో విక్రమసేనునిమీఁద గొంత యభిమాన మున్నను దమయభిమానము నిష్ప్రయోజనమగుటచే రెండవ పక్షమునఁ జేరుట లాభకరమని చిత్రభానునిపక్షముఁ జేరిరి. బలహీనుల విడిచి బలవంతులఁ జేరుట లోకులకు నైజమేగదా!

మణివర్మ ప్రముఖులను జిత్రభానుఁడు జెఱలోనుంచెనని వారి యిండ్లు కొల్లగొలెనని నగరమంతట వెల్లడియయ్యెను. చిత్రభానుని బిట్టలుకయను పిట్టపిడుగు లింకెవ్వరిమీఁదఁ బడనున్నవోయని పౌరులలో ననేకులు గుండెలు చేతఁబట్టుకొనియుండిరి. విక్రమసేనుని కొలువులో నున్న గొప్పయుద్యోగస్థులుఁగూడ భీతచేతస్కులయిరి. ధనవంతులు చిత్రభానుఁడు తమయిండ్లు గొల్లబెట్టునేమో యనుభయమునఁ దమతమవిత్తంబులు నాభరణంబుల భూగర్భంబున నిక్షేపించిరి. ఎక్కడఁజూచినఁ జిత్రభానునిదుండగములే ప్రజలు చెప్పుకొనఁ జొచ్చిరి.

ఆ విషయము రాచనగరునందుఁ గూడ దెలిసెను. విక్రమసేనుఁడు మిక్కిలి యాశ్చర్యమునొంది తల్లికావార్త నెఱిఁగించెను. అరవిందాదేవి పిడుగువంటి యవ్వార్తవిని "కటకటా! వృద్ధుఁడైన మణివర్మ కారాబద్ధుడయ్యెనే" యని జాలినొంది గదాధరాదును గూడ బంధింపబడుటచేఁ దమకు గృహమందున్న పరిచారకులుతప్ప నితరులయిన యాప్తులు నగరమందు లేరని విచారించి యేక్షణమందో

తమకుఁ గూడ నేఁడో మహాపాయమువాటిల్లునని నిశ్చయించుకొనిరి. మాధవసేనుఁడు సుదర్శనునకు రాయబారమొడిఁగించి సాయముగొని తెచ్చునప్పటికిఁ గార్యము పాకముదప్పుననియుఁ దమకు రావలసిన యిక్కట్టులన్నియు వచ్చుననియు వారు తలంచుచుండిరి.

అంతలో గడచినరేయి మణివర్మ ప్రముఖులమీఁదికిం జనిన సైనికసహస్రము వెంటరాఁ జిత్రభానుఁడు దండపాణి వజ్రపాణులు తనకిఱుగెలంకుల నడువ రాజవీధినుండి కోటవైపుజనెను. రాత్రి కొందఱి కంతయునది. పగలు కొందఱికంతు వచ్చినదని పురజనులు భయభ్రాంతులయిరి. కొందఱు తలుపులు మూసికొనిరి. కొందఱు మేడలెక్కిచూచిరి. కొందఱు దొడ్డిదారినిఁ బొరుగూళ్ళకుఁ బయనమై పోయిరి. అందఱు నెవ్వగచే భోజనములుమాని కూర్చుండిరి. "హా! హేమచంద్రా! నీకును నీసంతతికి నెట్టి దురవస్థ వాటిల్లినది!" అని కొందఱు నెచ్చునూర్చి విచారించిరి.

అట్లు సేనాసమేతముగఁ జిత్రభానుఁడు కోటకుంజనియె. భయపడి కావలివాండ్రు నిశ్చేష్టులయిరి. ఎవరియాటంకము లేక సత్రమును బాటసారులు జేరునట్లు జిత్రభానుఁడు ససైన్యముగఁ గొలువుకూటముఁజొచ్చి యం దాసీనుఁడయ్యెను. అంతఃపురమున హాహాకారములు సెలంగెను. హర్షవర్ధనుఁడు మిక్కిలి భయంపడి యన్నకడకు బోయెను. నర్మదభయముచే గడగడవడఁకి యరవిందాదేవి పాదములపైఁబడెను. ఆమెయు నివ్వెఱపడి నోటమాటలేక గోడకుఁ జేరబడి కూర్చుండెను. అంతలోఁ జిత్రభాను డంతఃపుర పరిచారకుని రావించి విక్రమసేనుని నరవిందాదేవిని దానుచూడవలయునని చెప్పెను. ఆ కంచుకి యవ్వార్త వారికిదుపుర కెఱిగించి రావచ్చునని చెప్పెను. అప్పుడు చిత్రభానుఁడు ఖడ్గహస్తుఁడై యంతఃపురముఁ బ్రవేశించి

విక్రమసేనుఁ డెదుర్కొని సన్మానింప లోపలిగది జొచ్చి యుచితాసన
మునఁ గూర్చుండెను. విక్రమసేన హర్షవర్ధనులు వానిప్రక్కఁ నిలువఁ
బడియుండ వారి నతఁడు గూర్చుండఁ బనిచెను. ప్రక్కగదిలో నర
వింద్రాదేవి యుండెను, అప్పుడు చిత్రభానుఁడు వదినకు వినఁబడునట్లు
గుమారులతో నిట్లనియె.

"కుమారా! నేనిప్పుడు సేనాసమేతముగ నీకోటఁజొచ్చితినని
నీవు భయపడనక్కఱలేదు. నేను నీకెట్టికీడుఁ జేయఁదలంచి రాలేదు.
నామనస్సు స్ఫటికమువలె నిష్కళంకమైయున్నది. మీయెడ నాకెట్టి
ద్వేషమునులేదు. కాశ్మీరరాజ్యము నీయది. నీవు దానికి నిరంకుశ
ప్రభువవు. నీతమ్ముఁడు హర్షవర్ధనుఁడు యువరాజు. నీవు రాజువైయుండ
నీ యనుమతిలేక నీసేనాపతులను నీదళములను వశముచేసికొని నేను
కడచినరేయి గొన్నిసాహసంబులుచేసి నేఁడు మహాసాహసంబున
సేనాసమేతముగ నీకోటకువచ్చుటకుఁ గారణంబేమియని నీవె యడుగ
వచ్చును. బాలుఁడవగుటచే భయమున నీవడుగకున్నను నట్టిప్రశ్న
నీవడిగినట్లే భావించి దానికుత్తరము నే జెప్పవలసినవాఁడ. కాశ్మీర
రాజ్యమును జూడ నెండఱకో కన్నెఱ్ఱగా నున్నది. గాంధారవసుంధ
రాధిపుఁడు దీనిపై దండువెడలఁదలఁచి యున్నాఁడు. చతురంగబల
సన్నాహము జరుగుచున్నది. ఈవఱకే యాతఁడు బయలుదేఱి యుం
డును. దక్షిణమునుండి సింధునాయకుఁడగు పరంతపుఁడు బెబ్బులి
మేఁకపై దుముకునట్లు మనవిషయంబుపై నుఱుకఁదలఁచున్నాఁడు.
పరంతపుఁడు పరంతపు డనుటకు సందియములేదు. భాగ్యవర్ధనుఁడు
మనదేశము జయించి నిజభాగ్యవర్ధనుఁ డగుచు.. ఆ నరపాలురిద్దఱు
మనమంత్రులను మనసేనాపతులలో గొందఱిని వశవర్తులుగాఁ జేసి
కొని యున్నారు. మన ప్రధానామాత్యుఁడు మణివర్మను, ద్వితీయా
మాత్యుఁడు మాధవసేనుఁడును బరమనీచులై యాత్మలాభపరాయ
ణులై ధర్మదూరులై దేశమును బరరాజులకు విక్రయింపఁదలఁచు

చున్నారు. దానికిం దగిన సాక్ష్యము నాకడ నున్నది. మాయన్న వారియందే విశ్వాసముంచి చెడితివి. మీరును వారినేనమ్మి చెడుచున్నారు. మాయన్నం జంపించిన మహాపాతకుఁ మణివర్మ. కొన్ని గ్రామముల కాసపడి కొంతధనమున కాసపడి గొప్పబిరుదుల కాసపడి మేటిపదవుల కాసపడి కాశ్మీరమును గోవును కటికవాని కమ్మినట్లు సింధుగాంధారరాజుల కమ్మ మణివర్మ దలఁచుచున్నవాఁడు. మణివర్మ యనగా దేనెబూసినకత్తి. మణివర్మయనఁగా మేఁకవన్నె పులి. మణివర్మ యనఁగా బ్రాహ్మణ వేషముతోనున్న చండాలుఁడు. మణివర్మ ప్రక్కలోఁబాము. నీవు బాలుఁడవు. నీతల్లి శుద్ధాంత కాంత కావున మీ గురువులు వ్యవహార మెట్టిదో యెఱుఁగరు. నీవు నీతండ్రివలెనే మాయామర్మము లెఱుంగనివాఁడవు. ఎవరేమి చెప్పిన నదినమ్ముదువు. తెల్లనివన్నియు పాలనియు నల్లనివన్నియు నీళ్ళనియు విశ్వసింతువు. రాజనీతియందు నీవు సంపూర్ణకుశలుండవుగావు. పాపమునీకువయస్సేది? ఒకచెంపగొట్టినఁ బాలు నొకచెంపగొట్టిన నీరుగారు లేఁతప్రాయము గదా! అంతలోనే విద్యాభ్యాసము సమగ్రము గాకుండ జనకునిచావు రాజ్యభారవహనము మనోవ్యథా ప్రారంభము మున్నగు నిక్కట్లు గలిగినవి. దేశమిట్టి దుర్దశలో నుండుటచే నిన్న రేయి దుస్తంత్రకారకుఁడును దేశద్రోహియు రాజద్రోహియు నైన మణివర్మను బట్టి బంధించితిని. మాయలాడు మాధవసేనుఁడు లేఁడట. వాఁడు వచ్చినతోడనే బంధించెదను. గదాధర శూలపాణులు మణివర్మ శిష్యులై దళములను మనకు విరుద్ధముగా నడపింపఁ దలఁచుచున్నారని తెలిసి వారినిఁ గూడఁ గారాగృహ బద్ధులఁ జేసితి. సింధుగాంధార ప్రభువులు చతురంగబలములతో మహాసన్నాహముతోఁ దండువిడిసినను మన కింత భయములేదు. అంతః శత్రువులయిన మణివర్మ ప్రముఖులు బంధింపఁబడిరి గావున బాహ్యశత్రువులు సులభముగా నిర్జింపఁబడు

దురు. ఇఁక మీరందఱు గుండెలపైఁ జేతులు వైచికొని హాయిగా నిద్రింపవచ్చును. మనసైన్యమునంతను నేనే నడపి కదనరంగమునకుం గొంపోయి బల్లిదులగు పగతుఱ జయించి చెల్లాచెదరుగఁ దోలి కాశ్మీరరాజ్యలక్ష్మిని సుస్థిరముగఁ జేసెద. మీరిం దేయుండుఁడు. నీవు చేతవిల్లుదాల్పకుండ, జెన్నుచెదరకుండ, మెడలోని పువ్వులదండయైన నలుగకుండ, మేనంజెమ్మటయైనఁ గ్రమ్మకుండ, నవలీలగ నరిబలంబుల జయింపఁగలవు. మేమందఱము మీబంట్లము. ఈదండపాణియు వజ్రపాణియు నీకు ద్రోహులుగారు. రాజ్యపరిరక్షణము నిమిత్తము నీనిమిత్తము వారు నన్ననుసరించిరి. నాయన్నరాజ్యము, నాయన్నబిడ్డల రాజ్యము, పరాక్రాంతమగుచుండగా నన్నుఁగానట్లు నేనూరక జూచుచుండుటకంత యభిమానహీనుఁడనా? పరాక్రమశూన్యుఁడనా? పుట్టినది రాచపుట్టుకగాదా? మూతిమీఁదనున్నది మీసముగాదా? చేతఁబట్టినది ఖడ్గముగాదా? నాయన్నకు నాకు మనస్పర్ధలుండిన నుండుఁగాక! 'మరణాంతాని వైరాని' యని మహానుభావుఁడైన వాల్మీకి చెప్పియున్నాఁడు. ఆ మనస్పర్ధ లాయనతోనే పోయినవి. పసిబాలురయిన మీకాపదవచ్చినఁ బ్రతిక్రియ గావింపక నేనూరకుండఁగలనా? మీయాపద నాయాపదగాదా? నీవింక భయపడకుము. శంకపిశునవృసు మూర్ఖులు నీకనేకవిధముల దుర్బోధ చేయుదురు. వానిం జెవిపెట్టకుము. నాయుపదేశము మనంబున నిలుపుకొందువేని నీకులగ్గగు. నాయంతరంగశుద్ధియు నాధర్మప్రవర్తనము నానిష్కామవ్యాపారము కాలక్రమంబున నీవ యెఱుంగఁగలవు. ధాత్రి నిష్కంటకము చేసి నీకప్పగించి తపోవనంబున కరుగవలెనని నాసంకల్పము. నా కేవిధమైన కోరికలు లేవు. సుఖదుఃఖముల ననుభవించితిని. కాశ్మీరరాజ్యము పరహస్తగతము గాకుండఁ జూచుటయే నామనోరథము. కుమారా! దీనికి నీవేమందువు?' అని చిత్రభానుఁడు దీర్ఘోపన్యాసము జేయుటయు విక్రమసేనుఁడు విని యేమనుటకుఁ

దోఁచక పినతండ్రివైపు జూచుచుండెను. "కుమారా! నీయభిప్రాయ మేమని యతఁడు మరల నడిగెను."

"అయ్యా! నేనేమి చెప్పఁగలను? మీరు పెద్దలు. సర్వధర్మములు తెలిసినవారు. సింధుగాంధారరాజుల దండయాత్రలగుఱించియు మనము వాని నిమిత్తమై చేయవలసిన ప్రతిక్రియల గుఱించియు ముందుగా నాతోడ మీరాలోచింపలేదు. మణివర్మ ప్రముఖులను గారాబద్ధులను జేయునప్పుడు నాచెవిని వేయలేదు. అన్నియు జరిగిన పిదప నన్నడిగిన నేమిచెప్పగలను? మీరెట్లుండుమని సెలవిచ్చిన నట్లేయుండెద. ఏమిచేయుమన్ననది చేసెద. ఈనగరము విడిచి పొమ్మన్న నాతమ్ముని దల్లిని వెంటఁబెట్టుకొని పాంచాలమునకుఁ గాని మఱియొక దేశమునకు గాని పోయెద. మీతండ్రి యొక్కనగద్దె మీరేయెక్కుఁడు. అందఱకు రాజ్యములేయున్నవా? అందఱకైశ్వర్యములేయున్నవా? నాయభిమత మడుగనక్కఱలేదు. మీయిచ్చవచ్చిన తెఱంగున మీరు సేయవచ్చును." అని విక్రమసేనుఁడు మొగము చిన్నపుచ్చుకొని యుత్తరము చెప్పెను.

"కుమారా! తొందరపడకుము. మీరు దేశమువిడచి వెళ్ళనేల? మణివర్మప్రముఖులపై నీకు సంపూర్ణ విశ్వాసముగలదు గావున వారిం బంధించెడు విషయము నీ కసమ్మతమని ముందుజెప్పనయితి. సేనలను సేనాపతులను వశముజేసికొంటినని యంటివి. నీపని నిమిత్తము నేను వారిని దోడితెచ్చితినిగాని నాపనికిగాదు. నేను వారిని వశముచేసికొనలేదు. వారికే నేను వశుఁడనైతిని. నీతో జెప్పి చేసినను జెప్పక చేసినను నీపనిచేయుటయే నాకుఁ బ్రధానము. కావున నిదియొక తప్పుగాఁబట్టుకొనకుము. నీవు మీయమ్మతోడ స్థిమితముగా నాలోచించుకొనుము." అని చిత్రభానుఁడు విక్రమసేనుని వీడుకొని కొలువుకూటమునకువచ్చి తననిమిత్తమై కని పెట్టుకొనియున్న

సైనికులను సేనాపతులను గలసికొని వారితోఁగూడి కోటవిడిచి స్వగృహంబునకుంబోయెను. దండనాథులు సైనికులు వానికడ సెలవు గైకొని స్వగృహములకుం జనిరి.

అటఁ జిత్రభానుఁడు చన్నపిదప నరవిందాదేవి విక్రమసేనుం బిలిచి యిట్లనియె. "కుమారా! చిత్రభానుఁడు మనయెడ నభిమానముగల వారినందఱ బంధించినాడు. సైన్యమును వశపఱచుకొన్నాఁడు. దండనాథులు వానికి వశంవదులైరి. మణివర్మ మొట్టమొదటనుండియుఁ జేసిన యుపదేశము మనముఁ జెవినిబెట్టకపోవుటఁ జేసి యింతవఱకువచ్చినది. అతఁడే ఋజుమార్గవర్తనుఁడు. సింధుగాంధారవల్లభులంగూడి యతఁడు దుస్తంత్రములు పన్నెనని మనము నిశ్చయించుట పొరపాటేమో! కాని యాజాబులతఁడు వ్రాసినట్లె యెవఁడో సృష్టించినాఁడని యాతఁడు మొఱవెట్టుకొన్నను మనము వినమైతిమి. ఆతని విశ్వసించినచో నింతవఱకు రాకపోనేమో? 'స్త్రీబుద్ధిః ప్రళయాంతకః'యను నార్యోక్తి నావంటి బుద్ధిహీనులగాలి చేష్టలంబట్టి పుట్టియుండవచ్చును. ఈ వైపరీత్యమునకు నేనే కారణమునైతిని. బిడ్డా! చేతులార నీభాగ్యమును నేను వెడలఁగొట్టితిని. ఇప్పుడేమి చేయుదుము? మనరాజ్యవ్యాపారము చుక్కానిలేని యోడపగిది నున్నది..' అని విచారించుచున్న తల్లిం జూచి విక్రమసేనుఁడు "అమ్మా! నీవు విచారింపవలదు. కార్యములు కన్నీటి కాలువలలో మునిఁగిపోవును. కన్నీరు కార్యములను సరిగాఁ జూడనియ్యదు. దుఃఖము దుర్బలలక్షణము. ధైర్యమెన్నటికిని మునుఁగనినావ. దాని నెక్కిన వారుసురక్షితముగా దుఃఖసాగరమీఁది యవ్వలియొడ్డుఁ జేరుదురు. నీవు ధృతిఁదాల్చియుంటివా మేముత్సాహవంతుల మగుదుము. నీవు ధృతిదప్పిన మామతిచలించు. కావున ధైర్యమును నూఁతగోల విడువకుము" అనిచెప్పి యామె నూరడించెను.

చిత్రభానుఁడు మధ్యాహ్నమున దండపాణి వజ్రపాణులం బిలిచి "విక్రమసేనుఁడు మాతృభ్రాతృసమేతుఁడై దేశమువిడిచి పాంచాలమునకుం బోయెద నని చెప్పె. అతఁడు గాని వారిపరిజనము గాని చుట్టములుగాని కోట దాఁటి పోకుండ నన్ని ద్వారములయొద్ద నన్నిబురుజులయొద్ద ముక్కాకలందేరిన మేటిమగలఁ గావలి యుంచుఁడు. మాధవసేనుని జాడలరయుఁడు. అతఁ డేదో రాజకార్యము మీఁదనే పైకిపోయియుండునని నేఁ దలంచెద" నని చెప్పి వారింబనిచి మణివర్మమాధవసేనులకు బదులుగా నూతనమంత్రుల నియమింపఁ దలఁచి యెవ్వరిని నియమింతుమని రుద్రభట్టుతో నాలోచించెను. అతఁడు కొంచెము సేపాలోచించి "నీకు మంత్రు లెందుకు? నీవు మహేంద్రుఁడవు. నేనుబృహస్పతి యట్లుసకలవిషయముల ధర్మోపదేశముఁ జేయుచుండెద. నామనస్సే నీమనస్సు. నేనునీకు హితమే యుపదేశింతును. నీచేత హితమే చేయింతును. ఒకవేళ మంత్రుల నియోగింపవలసి వచ్చిన నిక్కడివారిని నియోగింపకుము. సమర్థులయిన యమాత్యులను విదర్భాపురమునుండి రావింతము. ఇక్కడి వారు నమ్మఁదగినవారు కారు. నీబుద్ధిబలము వినియోగించి నీవొక్కఁడవే పాలించుచుండుము" అని యుపదేశించెను.

అది లెస్సగా నున్నదని భావించి చిత్రభానుఁడు నాఁడు మొదలుకొని ప్రతిదినముఁ గోటకుంబోవుచుఁ గొలువుకూటమున విక్రమసేనుని గద్దెపైనునిచి ప్రక్కను దానొక చిఱుగద్దియ వేయించుకొని కూర్చుండి దండనాథులను సామంతులను నగరమందలి ప్రధాన పురుషులను రావించి కొలువుదీర్చి రాజ్యవ్యాపారములను విక్రమసేనుని పేరం జక్కఁబెట్టఁదొడఁగెను.

ప్రజలలో ననేకులాతనివర్తనముఁజూచి సముచితముగా నున్నదని మెచ్చిరి. నగరమండలిసంక్షోభము క్రమక్రమముగా డిందుపడెను. చిత్రభానునిపట్ల దుర్నయ మెద్దియు లేదని పౌరులు చెప్పుకొన

జొచ్చిరి. వ్యవహారము మిక్కిలికట్టునిట్టముగా జరుగఁజొచ్చెను. జారులుచోరులుమున్నగు నుండగులు చండశాసనుఁడగు చిత్రభానునకు భయంపడఁజొచ్చిరి. దేశమందు బందిపోటులు మున్నగునల్లరులు క్రమక్రమముగ నడఁగెను. అరవిందాదేవియు విక్రమసేనుఁడును జిత్రభానునిమనస్సునెఱుఁగ నోడ యేకడకుఁబోవునో యేరేవు జేరునో తెలియక యాతనివర్తనమంతయు నాటక మనియు నభినయ మనియు దలంచుచుండిరి.

మణివర్మకడ విశేషధనమున్నదని చిత్రభానుఁడు సంపూర్ణముగనమ్మి యతని నెట్లయిన హింసించి యానిక్షేపమును గనుగొనవలె నని ప్రయత్నములుచేయుచుండెను. దండపాణింబిలిచి యొకనాఁడతఁడు మణివర్మను మిక్కిలి కఠినముగా హింసించి విత్తంబుదాఁచిన చోటు దెలిసికొమ్మని యాజ్ఞాపించెను. దండపాణి "స్వామీ! ఇంటిలో నేమూలనో యతఁడు సొమ్ముపాతిపెట్టియుండును. కావున మన మిల్లంతయుఁ ద్రవ్వించిచూతము. అక్కడనది కానఁబడనినాఁడు వానిని హింసింపవచ్చు" నని యుత్తరమిచ్చెను. "అది లెస్సగానున్న" దని యక్కార్యమునకుఁ జిత్రభానుఁ డంగీకరించెను.

మఱునాఁడు ఖనికులచేత నిల్లంతయు నొక్కనిలువులోతు ద్రవ్వించిరి. ఎముకలు మసిబొగ్గులు ప్రాతకుండపెంకులు కొన్ని రాగి శాసనములు మున్నగునవే కానఁబడియెనుగాని యొక్కరూకయైన నచ్చటఁ గనబడలేదు. అవ్వార్త దండపాణి చిత్రభానున కెఱింగింప నాతఁడు భగ్నమనోరథుఁడై మణివర్మ మఱెచ్చటనో ధనముదాఁచి యుండుననినమ్మి వానిం గ్రూరదండనలపాలు చేసిన సత్త్వాపుబయటబడునని నిశ్చయించెను. ఒకనాఁడుసాయంకాలము చిత్రభానుఁడు దండపాణియు వజ్రపాణియు మఱిపదుగురు భీకరాకారులగు బంటులు మణివర్మయున్న కారాగృహముఁ జొచ్చిరి "నీవార్జించినధనరాసులు

మణులు మొదలగు నమూల్యపదార్థములు నీవెచ్చటదాచితివో చెప్ప
దవా లేక దారుణవధపాలయ్యెదవా” యని చిత్రభానుఁడడిగెను.

“ధనమునాకడ లేదని యిదివఱకే చెప్పితిని నన్ను మీరెంత
హింసించినను ప్రాణములేగాని నాణెములు నాకడగ్రహింపలేరు.
నెత్తురుచుక్కలేగాని మణులుమీకు దొరకవు. చివికిపోయినయెముక
లేగానిపసిఁడికణికలు మీకులభింపవు. చర్మమేగాని ధర్మముమీకు
లభింపదు. ఏదోవంకబెట్టి నన్నుహింసించుటయే మీసంకల్పమైన
మీరిట్లుచేయవచ్చును. పాపము మూటఁగట్టుకొనుటయే మీకోరిక
యైనయెడల నట్లుచేయవచ్చును. అపకీర్తిసంపాదనము నీయభిమత
మేని నన్ను నీయిచ్చవచ్చునట్లు హింసింపవచ్చును. పరమేశ్వరుఁడు
సాక్షిగా భూమ్యాకాశములు, సాక్షులుగా నేనసత్యము బలుకుచుంటిని
ధనమునాకడలేదు. నాశరీరము వేఁడివేల్పునకిం ధనముగావీరిడినను
యావజ్జీవముబంధనముననుంచినను ధనముమాత్రము నేను మీకియ్య
జాల” నని యమ్ముసలిమంత్రి యుత్తరమిచ్చెను.

“వీనిప్రమాణములు నమ్మఁజాలము. వీనికాలుసేతులకుగుడ్డలు
చుట్టి కాల్పుఁ”డని చిత్రభానుఁడానతిచ్చెను. “అట్లగాక!” యని
మొఱకులగుకఱకుబంట్లాముదముసం గుడ్డలు తడిపి వానిచేతులకు
మోచేతులవఱకుఁ గాళ్లకు మోకాళ్లవఱకుఁజుట్టిరి. ఒకఁడు సమిధలు
వైచి యగ్నిహోత్రము రవులుకొల్పుచుండెను. మణివర్మ లేశమయిన
భయపడక విషాదముంజూపక కూర్చుండి కన్నులు మూసి నమక
చమకములతో మహేశ్వరుని లోలోనధ్యానించుకొనుచు మరణము
నకుసిద్ధముగానుండెను. “ఇదేగుడ్డలకు నిప్పంటించుచున్నాము. క్షణ
ములో భస్మమయ్యెదవు. జాగ్రత్త! ధనమెక్కడనున్నదో చెప్పు” మని
ముష్కరులగు బంట్లుమఱియొకసారియడిగిరి. మణివర్మధ్యానపరుఁడై
నిరుత్తరుఁడయ్యెను.

"స్వామీ ! ముమ్మాటికి సెలవేనా ? నిప్పంటింతుమా" యని చిత్రభానునివంక దిరిగి యొకఁ డడిగెను. చిత్రభానుఁడు దండపాణి వంక జూచెను. దండపాణి తప్పని యిష్టములేకపోయినను దనయేలిక కాగ్రహము వచ్చునేమో యని యతఁడు నలదనఁజాలక వజ్రపాణి వైపు జూచెను. ఆ జానుబాహువులు ముసలితనమందైన వన్నె దఱుగని యాపచ్చని మేను విశాలమై యప్పుడు ముడుతలతో నిండి యున్న ఫాలభాగమును మాంసహీనములై వ్రేలుచున్న చర్మమును జూడ సేనాపతుల కిరువురకు మనస్సు కరిగెను. వారు చిత్రభానున కుత్తరమీయ కూరకుండిరి.

"చంచలులారా ! మీమనస్సులు చలించినవి. మీరు సేనాపతులై పరసేనల రూపుమాపుటకేగాని పరిచితులకడ మీరు పనికి రారు. మోమోటము జాలి మిమ్మలముచున్నవి. ఓరీ! నిప్పు బాగుగా మంటజేయుము రా" యని మాట సరిగా ముగించెనో లేదో యంతలో వృద్ధకంచుకి యగు జంబుకుఁడు వచ్చి "స్వామీ! కర్పూరమంజరి కర్పూరమంజరి యని" యేడ్చుచుఁ బలికెను. "ఏమిరా! కర్పూరమంజరి కేమి ?" యని చిత్రభానుఁడు తొట్రుపడి యడిగెను. "ఉరిబెట్టుకొనె. ఉరిబెట్టుకొనె" నని వగర్చుచు వాఁడు చెప్పెను. చిత్రభానుఁడు భయసంభ్రమములతో విసవిస నడచుచుఁ బోయెను. దండపాణియు వజ్రపాణియు వాని వెనువెంటఁ జనిరి. సేవకులు నాఁడప్పని చాలించి మణివర్మ కట్లువిప్పి తలుపులు బిగించి యావలకుం బోయిరి. వజ్రపాణి జంబుకుని బిలిచి మెల్లగాఁ గర్పూరమంజరి యురిబెట్టుకొనుటకుఁ గారణ మడిగెను. "చెలికత్తెయైన మల్లిక పెద్దపులిచేఁ బట్టువడి చచ్చిపోవుటచే బెంగపెట్టుకొని యామె మాధవీలతతో మెడ కురిపెట్టుకొన్నది" యని యతఁడు బదులుచెప్పెను. "బ్రతికి యున్నదా మృతినొందినదా ?" యని మరల వాని నడిగెను. "ఏమో తెలియదు. మాటలేదు. చూపులేదు. నాడిలేదు. బ్రతికియున్నదో చచ్చిపోయినదో నే నెఱుఁగను" అని వాఁ డుత్తరము చెప్పెను.

ఇరువదియొకటవ ప్రకరణము

సునంద మతి యించుకేనియుఁ జక్కబడలేదు. ఆమె యున్మాదము నానాటికి హెచ్చుచుండెను. ఇంటనున్న చెంబులు తాను మోయఁగల చిన్నబిందెలు తననగలు దీసికొనిపోయి యామె దొడ్డిలో నున్న నూతిలోఁ బడవైచుచుండును. అట్లు పాఱవైచెదవేమమ్మా యని సేవకు లడిగినప్పుడు "అయ్యో! కర్పూరమంజరి యెత్తుకొని పోవును. అందుకని దాఁచుచున్నాను" అని బదులుచెప్పెను. రమారమి సంవత్సరము వయస్సుగల యామె చిన్నబిడ్డ నొకనాఁడు చంకఁ బెట్టుకొని బావికడకుఁ గొనిపోయెను. వెంటనే పరిచారిక యొకర్తు పరుగెత్తుకొనిపోయి "ఏమమ్మా! బిడ్డ నేమిచేసెదవు?" అని యడుగ "ఓసీ! కర్పూరమంజరి వీనిం దీసికొనిపోవును. కాఁబట్టి యీనూతిలో బందుకొనఁబెట్టెద" నని బదులుచెప్పెను. వెంటనే యప్పనికత్తె బిడ్డకుఁ బ్రాణభంగమగునని యామెచేతిలోనుండి బిడ్డను బలవంతముగా లాగుకొనెను. ఆ పెనఁగులాటలో సునంద సేవకురాలిని గట్టిగా గఱచి నాలుగుమూఁడుచోట్ల గాయములు చేసెను. గదిలోఁ బెట్టి తాళము వైచినప్పుడు కడుపునొప్పి వచ్చినదని కాలునొప్పి వచ్చినదని లేనిపోని వంకలుబెట్టి తలుపు దీయుమని పెద్దపెద్ద కేకలువేయును. పరిచారకు లాయఱపుల సరకుసేయక పోయిరేని గదిలోఁ దనతల గోడకుఁబెట్టి గట్టిగఁ గొట్టుకొనును. తలుపు దీసినపక్షమున నేదో చెఱుపు జేయుచుండును. రెండుమూఁడు పిల్లికూనలను సేవకులు చూడకుండ నూతిలోఁ బడవైచి చంపెను. ఆమె యవస్థఁజూచి వజ్రపాణి మిక్కిలి ఖేదము నొందుచుండెను. ఎట్టి గట్టివైద్యులచేతఁ జికిత్సచేయించినను నామె యున్మాదము హెచ్చెనేకాని తగ్గలేదు. మనోవ్యాధికి మందు లేదుగదా! రాత్రులు సునంద తాను నిద్రపోవుట లేదు సరేకదా

భర్తకుం జుట్టుప్రక్కలవారికిఁ గంటిమీఁద కునుకు లేకుండ నఱచు
చుండును. ఎవరో యెదుట నున్నట్లు భావించి వారితో వాదము
సేయుచుండును.

కర్పూరమంజరిని వజ్రపాణి కిచ్చి వివాహము చేయుట నిశ్చయ మయినదని యీమె యున్మాదమువల్లనో ప్రధానమయిననాఁడు వచ్చిన బ్రాహ్మణుల వెంగలితనముననో యెట్లో పట్టణమునం బొక్కెను. పెండ్లి లేదు. పేరంటము లేదు. ముందుమునుపటిభార్యకు మాత్రము వజ్రపాణి పిచ్చియెత్తించినాఁడు గదా'' యని లోకులు చెప్పుకొని చాటుచాటున వాని నెగతాళిసేయఁ జొచ్చిరి. ఎందఱు హసించినను నెంద ఱధిక్షేపించినను మఱెందఱు నిందించినను భార్య యున్మాదిని యైనను గర్పూరమంజరిముఖముఁ దనమనోనేత్రములతోఁ జూచుచు సకలసంతాపహారక మయినయీమె దృఢాలింగనము దనకుఁ జేకురి నట్లు భావించుచు నప్పుడప్పుడు స్వప్నములలో నామె సమాగమ సుఖము క్షణకాల మనుభవించుచు వజ్రపాణి యిల్లాలిదురవస్థ కెడ నెడ వగచుచున్నను మొత్తముమీఁద సంతోషముతోడనే దినములు పుచ్చుచుండెను. విశేషించి రాజ్యము చిత్రభానునివశమగుటచేఁ దన కింకను గొప్పపదవులు చేకూరునని యాసపడి యుండెను. కర్పూర మంజరి యురిబెట్టుకొన్ననాఁడు చిత్రభానునివెంట నరిగి యీమె బ్రతికియున్నదో లేదో తెలిసికొనుటకును రతీదేవికిఁ బ్రతిరూప మని పేరువడసిన యాకన్నియ మేనివన్నియయు ముఖవిలాసమును నొక సారి జూడవలయుననియు నాతఁడు భయసంభ్రమములతోఁ బోవు చుండ నంతలో నతనిసేవకుఁడు పరుగుపరుగున వచ్చి వగర్చుచు ''మహాప్రభూ! మహాప్రభూ! ఇల్లు—ఇల్లు—'' అని యఱచెను. ''ఏమియిల్లు? ఏమియిల్లు? వేగము చెప్పఁగదరా'' యని యతఁ డచ్చట నాఁగి యడుగ ''మనయిల్లు కాలిపోవుచున్నది స్వామీ!

రండి రండి'' యుని యేడ్చుచుఁ బలికెను. ''అయ్యో! అయ్యో! ఏమిరా యిది'' యని వజ్రపాణి నడచుచు వానిని బ్రశ్నింప నా సేవకుఁడు నడచుచునే వాని కిట్లుత్తరముఁ జెప్పెను.

''స్వామీ! ఏమి చెప్పుదును? సేవకుల కందఱకు నిద్రపట్టినది. అమ్మగారు దీపము చేతఁబుచ్చుకొని మీరు పఱుపులుకుట్టించుటకై యీ నడుమ తెప్పించిన దూదిబుంగల నంటించినారు. ఇంతటిలో నా భాగమంతయుఁ బూర్తిగా నంటుకొన్నతరువాతఁ గాని మా కెవ్వరికి మెలఁకువ రాలేదు. అంతలోఁ జుట్టుప్రక్కలవారు వచ్చి యిల్లంటుకొన్నదని కేకలువైచిరి. పొగ నలుదెసలం గ్రమ్మెను. మంట లెగసి మిన్నుముట్టెను. మీ బిడ్డలం దీసికొని మేము బయటఁబడుటయే మిక్కిలి కష్టమయ్యెను. ఇంటిలోనిసామాను దీయుటకయిన నవకాశము లేకపోయెను. దైవానుగ్రహమువలన బిడ్డలను దేవిగారిని మాత్రము బ్రతికించితిమి. ఆమె నీవలకు రమ్మన్న రాదు. చలిమంట కాగెద నిక్కడ నుండనీయుండి యని బలుకఁజొచ్చెను. చేతులు పట్టుకొని యామెను బలాత్కారముగా నీవలకు లాగితిమి.''

ఈ సంభాషణము జరుగుచుండఁగనె వారిరువురు వారియిల్లున్న వీదికి వచ్చిరి. ఆ కోలాహల మేమని వర్ణింపవచ్చును? ఆ కలకల మెంత యని చెప్పఁగలము? అత్తఱి గాలి విసరుగా వీచుచుండుటచే వజ్రపాణి గృహమేగాక నిరుగుపొరుగునున్న రెండిండ్లుగూడఁ బరశురామప్రీతి యయ్యెను. వజ్రపాణి సర్వస్వము వీతిహోత్రునకే కాహుతియయ్యెను. నగలు నాణెములు చీని చీనాంబరములు విండ్లు నమ్ములు నమ్ములపొదులు చిత్తరువులు రొక్కము సమస్తము దగ్ధమయ్యెను. ఇదియంతయు దగ్ధమైనను నతఁడు విచారింపకపోవునుగాని తనమనోరథము తనపాలిటిచింతామణి తననిధి తన నిక్షేపమునైన కర్పూరమంజరియు నురిపెట్టుకొని విగతజీవియైనదని యతని కింతింత

యనరాని విషాదము గలిగెను. కర్పూరమంజరి లేకపోవుటచేఁ దన యిల్లు గాలినలోపము భార్య యున్మత్తయయినలోపము ఘోరముగా గనఁబడఁజొచ్చెను. పాప మతనికారాత్రి పండుకొనుటకుఁ దావులేదు. మఱునాఁడు పండుకొనుటకు నెలవులేదు. కట్టుకొనుటకు బట్టలులేవు. ఇంటిముందర నిలువఁగానే పిల్లలు తండ్రిం గౌఁగలించుకొని యేడ్చిరి. సునంద భర్తయెదుటకుఁ బోయినిలిచి "ఏమండీ! బాగున్నదా? మనము క్రొత్తయిల్లు కట్టుకొందము. కర్పూరమంజరి రాకుండఁ జేసితిని. చూచితిరా" యని నవ్వుచుఁ బలికెను. అతఁ డేమియు ననక స్తంభమువలె నిలబడి తన దురవస్థను దలంచుకొని తన గృహముకవలెనే మండిపోవుచున్న తన మనస్సును జల్లార్చుకొనలేక తన యింటియెదుట నున్న యొక యరుగుపైఁ జదికిలఁబడెను. బిడ్డలును వానితోఁ జని యతని కిరుప్రక్కలఁ గూర్చుండి కొంతసే పక్కడనే వట్టినేలఁ బండుకొని నిదురించిరి. తనుపోత్తని మెత్తనిపాన్పుల నత్తమిల్లు తనబిడ్డలు బెడ్డలుగుచ్చుకొనునట్లు గటికినేలఁ బవ్వళించి యొడలెఱుఁగక నిదురింపఁజూచి యతఁడు కన్నుల నీరువెట్టుకొని యిరుగుపొరుగువారి సమాశ్వాసములవలన నూఱడిల్లి పొరుగువారు పాన్పుదెచ్చి పండుకొమ్మన్నను బండుకొనక రేయియెల్ల మేల్కొని తద్గృహమందే దృష్టినిలిపియుండెను. కాలుచున్న యాగృహముఁ జూచుచున్నప్పు డతఁడు తన మనోరథమెల్ల నగ్ని దగ్ధమయినదని తన యాశలెల్ల బూడిదయైనవని, తన సౌఖ్యములెల్ల నేలపాలయినవని విచారించి తన భవిష్యదవస్థ యెట్లుండునో యని తలపోయఁజొచ్చెను.

అంతలోఁ దెల్లవారెను. తొల్లి యతి రమణీయముగానున్న తన భవనమొక్కరాత్రిలో భస్మమగుట కతఁడు మిక్కిలి యాశ్చర్యమొందెను. ఆమాడినబోడిగోడల నాకాలుచున్న దూలముల నా

ప్రేలుచున్న పెంకుల నాకూలుచున్న వాసములఁ జూచి యతఁడు కాలగతి మిక్కిలి చిత్రమయినదనియు దానికన్న విచిత్రమయినది మఱియొకటి లేదనియు నీశ్వరేచ్ఛ యగమ్యగోచరమనియుఁ బ్రపంచమంతయు వినశ్వరమనియుఁ బెద్దలు చెప్పుమాటల స్మరించుకొనెను.

ఇరువదిరెండవ ప్రకరణము

సిప్రానది భాగీరథీమొదలగు మహానదులవలె మహావాహిని గాకపోయినను ముక్తిప్రదములయిన నగరములలో నొకటియని పురాణప్రసిద్ధిగాంచి మహాకాళేశ్వరస్వామికి నిలయమై వెలయు నుజ్జయినీనగరమునఁ బ్రవహించుటచే నదియు నొక పుణ్యనదిగాఁ బరిగణింపఁబడుచుండును. అక్కాలమునఁ బ్రతిదినముఁ దీర్థవాసులు వందలకొలందివచ్చి యయ్యేట స్నానముజేసి మహాకాళేశ్వరుని దర్శించి స్థలపురాణమును విని గతకల్మషులైనట్లు సంతసించి పోవుచుందురు. అయ్యేటియొడ్డున రామణీయకపురాశి యనఁదగు పూవుఁదోఁట యొకటికలదు. అయ్యలరుదోఁటనడుమఁ గమలాకరం బగు కమలాకరం బొండు నయనోత్సవము చేయుచుండు. దానియొడ్డునఁ జూచువారి కన్నులకు విందులుసేయు సౌధమొండు నిర్మింపఁబడియె. సిప్రానదీతరంగములఁ గాఁగలించుకొని యాసంసర్గమునఁ గడుంగడు జల్లనై యటనుండి మెలతోఁటఁజొచ్చి కుసుమపరిమళంబులఁ జూఱఁగొని మెల్లమెల్ల గమలయానిలుఁడు కొలంకుఁజొచ్చి యన్నీటి తుంపురుల మేనదాల్చి గవాక్షద్వారమున సౌధంబుజొచ్చి యందున్నవారి నానందపరవశులఁ జేయుచుండును. మాళవ రాజనందనుఁ డగు మకరందుఁడు తఱచుగా నయ్యుద్యానమున విహరించుచుండును. ప్రాయికముగా నక్కాలంబున

జలకమాడుచుండును. వేమారు వేడుక చెలికాఁడు చంద్రచూడునిం గూడి మేడమీఁదఁ గూర్చుండి మలయమారుత సుఖమనుభవించి యుద్యానవన రామణీయకము సందర్శించి కనులం దనుపుకొను చుండును. వసంతసమయములందును శరత్కాలములందును రాకా చంద్రమండలము నిండు వెన్నెలలు గాయునప్పుడు నమ్మేడ నంటి యున్న పాలరాతి మిద్దెపైఁ గూరుచుండి చల్లనిపండువెన్నెలల సుఖ మనుభవించుచుండును.

ఒకనాఁడు కర్పూరమంజరీవిరహమున నతఁడింటికిఁ బోవక నా మొలదోఁటలోనేయుండి సాయంకాలమయినపిదప జగన్మోహనం బగు ధవళప్రభతో నుదయించిన శరత్కాలసంపూర్ణచంద్రమండల మును జూచి దానివలనఁ దనప్రియురాలి మొగంబును బండువెన్నె లలవలన నామెలావణ్యమును స్మరణకురాఁగ మిద్దెపైఁగూర్చుండి "రోచందమామా! మేడమీఁదనుండువారికిఁ గ్రిందివారుసేయు పనులెల్ల నగపడునట్లు గగనప్రాసాదమధిష్ఠించిన నీకు సకలభూత చేష్టలుఁ గరతలామలకముగదా? నీవు చల్లనివాఁడవు కావున నా గ్రహములేనివాఁడవు. కాఁబట్టి నిన్నొకప్రశ్నయడిగెదను దయచేసి చెప్పుము. నీవు కాశ్మీరమునకరిగితివా? శ్రీనగరముంజూచితివా? అందు మాకర్పూరమంజరి కనఁబడినదా? ఆమెసుఖముగానున్నదా? ఏమి! యుత్తరము చెప్పవు? ఔను నీవేల చెప్పెదువు? ఆమె మొగమునకు నివాళినిచ్చుటకయినను నీనెమ్మొగము పనికిరాదుగదా! కళంకిత మైనది నీమొగము. అకళంకమైన దామెవదనము. ఎంతవారికయిన నీర్ష్యయుండకపోవునా? అందుచే సిగ్గుపడి నీవామెంజూచియుండవు. నిన్నడిగిన ప్రయోజనమేమి?" అని కాముర్తుఁడు చేతనంబులంబలె నచేతనంబులంగూడ సంబోధింతురను నార్యోక్తి నిజముగఁ చిత్త వికారమున జాబిల్లింజూచి యసంబద్ధప్రలాపములు చేయు మిత్రుని

దగ్గరి చంద్రచూడుఁడు మీఁదఁ జేయివయిచి తట్టి తన మోఁగము నతనిమొగముకడఁజేర్చి "వయస్యా! ఇదియేమి నీకువెఱ్ఱియెత్తినదా? లేక నీలేఁదోటలో నేదయ్యమయిన సోఁకినదా? లేక మద్యపానముఁ జేసితివా? చందమామకు నోరున్నదా నాలుకయున్నదా నీవడిగిన ప్రశ్నల కుత్తరముజెప్పుటకు? చంద్రుఁడనఁగా మనవంటి పురుషుఁడను కొంటివా? నీవుజ్యోతిశ్శాస్త్రవేత్తవు. చంద్రుఁడనగా సూర్యానువర్తి యగుగ్రహమని నీవెఱుంగవా? చాలు చాలు! నేనుహిమవంతునివంటి ధైర్యసారముగలవాఁడనుగనుక భయపడలేదుగాని, మఱియొకరు నీ యసంబద్ధసంభాషణములు విన్న బెదరి మేడదూకి పాఱిపోదురు. నీ కలాపమిఁకఁ గట్టిపెట్టు" మని మందలించెను.

అప్పుడు మకరందుఁడు చంద్రచూడుని చేయిబట్టుకొని మెల్లగ నిట్లనియె—"మిత్రమా! నీవు నన్నెఱుఁగనివానివలె భాషించెదవేల? స్వప్నముననైన నేను మద్యపానముసేయుదునా? భూతములు పిశాచములు పిఱికివాండ్రపైఁ బడునుగాని నాపైఁబడవు. కర్పూరమంజరీ వియోగదుఃఖము దుస్సహమగుటచే నేనేమేమో కొన్నియసందర్భములుపలికియుంటిని. దానంజేసి నామతి చలించెనని నీవుదలంపకుము. ఎంతవారించినను నామనస్సు కర్పూరమంజరీ సమక్షమున కరుగక మానినదిగాదు. దానిమాటలలో నేమితీఁపియున్నదో-దాని మొగమున నెంతయాకర్షణశక్తియున్నదో-దానిసాన్నిధ్యముం దేమివిశేషమున్నదో-దానికన్నులలో నేమివశీకరణప్రభావమున్నదో-నే నెఱుంగనుగాని నామనస్సు వేయిసార్లుపిలిచినను గొలుసులువైచిలాగినను నాకడకు రాకున్నది. అదిదానిమాయలలోఁ బడినది. దాని చెలికత్తెలుపన్నిన వలలలోనదితగులుకొనియెంగావలయు! మాటలాడించు శక్తిమనస్సుదిగదా? అదిదగ్గఱలేనప్పుడు-దగ్గఱనున్ననుసరిగాలేనప్పుడు నోరుతనయిచ్చవచ్చినట్లు ప్రేలును. చంద్రచూడుఁడా! నీవుచూచి

తివో లేదో, చూచినను మెచ్చితివో లేదో, కాని, కర్పూరమంజరి సౌందర్యము వర్ణనాతీతమని చెప్పుట వర్ణనముగాదు. దాని సోయగంబుఁ గనువిచ్చి యొక్కసారి జూచునేనిఁ గాలకంఠుని కఠోరహుంకారంబున మూర్ఛిల్లి యాతని కంటిమంటల గ్రమ్మిన మదనుఁడు తన నియతిని రతినివిడిచి మరల దానికొఱకై భూమండలంబున నవతరించి సాంగుఁడై యనంగశబ్దముఁ బోగొట్టుకొనఁడే? వసంతుడు తాను జూచుభాగ్యము గలవాఁ డగునేనిఁ జివురుటాకులు మేనుగాఁ జేసికొని మాధవీలతాదులు కరచరణంబులుగా నిర్మించుకొని ఫలరసంబులు రక్తంబుగా నమర్చుకొని కలువరేకులు కన్నులుగాఁ గావించుకొని దొండపండులు మోవిగాఁబెట్టుకొని శుకపికంబులనుండి పలుకులు పుడికిపుచ్చుకొని మాటలుగాఁ జేసికొని మూర్తిమంతుఁడై దన్ను వరింపుమని దాసి యడుగుదోయిఁబడి వేఁడుకొనఁడే? అది నలకూబరుని కంటఁబడిన గడుముసలిదై శృంగారరస మెల్లఁ గోల్పోయిన రంభను నవ్వులకుం ద్రోసివయిచి జవ్వనియగు నివ్వనజాక్షికై తహతహంబడఁడే? వారిమాటయేల! సంసారములరోసి సౌఖ్యములబాసి కాంతారాంతర వాసులై గాలియు దుంపలు నాకులు నలములు దిని చెట్లనీడల వసియించుచుఁ జర్మంబులందాల్చు బ్రహ్మజ్ఞాన సంపన్నులైన మానులుసైతము పల్లమునకుం బోవు నీరుపగిది జపములు తపములు పాలించి నిష్ఠలు నీటఁగలిపి దానివెంటంబడరే! ఆ చక్కదనముఁ గవులు వర్ణింపజాలరు. చిత్రకారులు చిత్రింపఁజాలరు."

అనుచుండఁ జంద్రచూడుఁడు "మిత్రమా! ఆమెకై నీవింత తహతహఁ బడుచుంటివి. నిన్నామె వలచునా? లేక యిది చమురు దండుగ భాగవతమా?" యని యడిగెను. "మిత్రుఁడా! ఆప్రశ్నకు నేనుత్తరము జెప్పఁగలనా? నాచక్కదనము, నా తెలివితేటలు, నా జవ్వని యడుగుఁ దామరలకు దాస్యముచేయుటకయినఁ దగవని

నే దలంచెద. ఎందఱు రాజకుమారు లామె కేలువట్ట యత్నించుచున్నారో యెందఱు నృపకుమారుల దూతలామెకడ దర్శనముగాక వేచియున్నారో యెందఱు లేఖలనువ్రాసి విజ్ఞాపనము లంపుకొనుచున్నారో, యెందఱు దానితండ్రిం బతిమాలుచున్నారో యెందఱు దాని పొందుగూర్పుమని దాని చెలిమికత్తెలకు లంచము లిచ్చుచున్నారో యెందఱామె మనఃప్రీతికై కట్నములు కానుకలు నంపుచున్నారో, యెందఱామెచేఁ దిరస్కృతులై లజ్జావశంబునఁ దల యెత్తుకొనలేక యున్నారో, యెందఱామె సమాగమముఁ దమకు లభించునని యువ్విళులూరుచున్నారో! నన్నా యామె వలచుట? నాకా యాసమాగమ సౌఖ్యము గలుగుట? నేనా యంతపుణ్యము చేసినవాఁడను? మిత్రుఁడా! మనస్సునకున్న వేగము మనుష్యుని కేల యుండఁగూడదు? తిరస్కరిణీవిద్యాప్రభావము నేఁడు కలియుగమందున్న పక్షమున దేవదూతయై నలుఁడు పరులకంటఁ బడకుండ విదర్భాపురముఁ జొచ్చి దమయంతీసమాగమముఁ బడసి యామె దర్శనంబున నేత్రంబులను సంభాషణంబున శ్రవణంబులను ధన్యంబుల జేసికొనినట్లు నేనును బ్రియురాలిదర్శించి నానయనశ్రవణంబులఁ జరితార్థములఁ జేసికొననా? చిలుకవారునము నెక్కు చిగురువిలుతుడును గరుడగమనుఁ డగు కమలలోచనుఁడును నెంత ధన్యులో గదా? క్షణములోఁ గామితప్రదేశంబుల కరిగి కృతార్థు లవుచుందురుగదా! మానవున కేశక్తియు లేదుగదా! మనుష్యుని దౌర్బల్య మిట్టివిషయముల స్పష్టముగఁ గనఁబడుచుండును. ఆమె చిత్తవృత్తి యెట్లున్నదో తెలియదు. మిత్రుఁడా! నీవు మాఱువేసమున శ్రీనగరమునకుఁ బోయి తెలిసికొనలేవుగదా!" అని మకరందుడు పరిపరివిధములఁ బ్రియురాలి చక్కదనము దలంచి గుణములదలంచి తన కామె సంప్రాప్తించువిధ మెఱుఁగక వ్యథలుపడుచుండ మిత్రుఁడగు, చంద్రచూడుఁడు వాని విరహసంతాపమ్ముం జూచి పరిహసించుచు నిట్లనియె.

"వయస్యా! నీవు లేదన్నను నేను నమ్మఁజాల. నీతల చెడిపోయినది. ఏదో పిశాచము నిన్నావహించినది. తోఁటలలో దొడ్లలో నపరాహ్ణ మనక యర్ధరాత్రి మనక తిరుగఁగూడదు. నీకు భూతవైద్యము చేయింపవలెను. లేనిచో నిటువంటిపిచ్చి యేమిటి? ప్రపంచములో నామెకన్న సుందరులు లేరనుకొన్నావా? ఆ మాటల కర్థమే లేదు. నీకు యౌవనము చిన్నయప్పుడే వచ్చినది. తా వలచినది రంభ తా మునిఁగినది గంగ యన్నట్లు నీకంటికామె రంభలాగు మేనకలాగు కనఁబడుచున్నది. ఆమె నిన్ను మెచ్చకపోయిన యెడల మఱియొకదానిని పెండ్లిచేసికొనవచ్చునులే. పిల్లలు దొరకకపోరు. నావంటి దరిద్రునకు వివాహము గాదు కాని నీకేమి తక్కువయ్యా! ఈమె దాఁటిపోయిన యెడల నేనే వెళ్ళి మఱియొకదానిని కుదిర్చెదనులే." అనవుడు మకరందుఁడు "మిత్రుఁడా! వలపెట్టిదో యెఱుఁగని ఘోటకబ్రహ్మచారికి నీకు సుందరాంగులను మెచ్చుకొనుట గూడ దెలియునా? వం

పులోని తీఁపి సీక పరిచితంబు. గొడ్రాలు ప్రసవవేదన నెఱుఁగ

బ్రహ్మచారి విరహతాపము నెఱుఁగఁజాలఁడు. ఆమెలనాగ

కుఱదేని నేను జన్మాంతముదాఁక బ్రహ్మచారినై యుం

మఱియొకదాని కేలువట్టను" అని మఱియేమో చె

నంతలో సేవకుఁ డరుదెంచి "మహాప్రభో! ఎవ్వఁడో

మీకొఱకై వచ్చియున్నాఁడు" మీదరిన

విన్నవించెను.

"పూవుదోఁటలోనున్న

వారెవ్వరు చెప్పుమా? సరే!

తెచ్చెను. సేవకుఁడా పురుష

దికి దిగిపోయెను. నూ

చేసి నిలువంబడిగా

తెల్లని మొగము, తలమీఁద తెల్లనిపాగా, మోకాళ్ళనుదాఁసు తెల్లని నిలువుటంగీ, పాదములను స్పృశించు తెల్లనిలాగు గల యప్పురుషుని జూచిమకరందుఁడు "మీదేయూరు? మీరేమిపనిమీఁద వచ్చిరి"అనియడిగెను. "అయ్యా! నాది కాశ్మీరదేశము. శ్రీనగరము నాఁపురము. నేను చిత్రభానుని సేవకుఁడను. నన్ను జయంధరుఁ డందురు. ఆయనసందేశము మీకుఁదెచ్చితిని" అని యప్పురుషు డుత్తరము జెప్పెను.

"సందేశము నాకా, మాతండ్రిగారికా?" యని యతఁడు మరల నడిగెను. "స్వామీ! మీకే" యని యతఁడు బదులుచెప్ప "సరే! కూర్చుండి వినిపింపు" మని మకరందుఁడు పలికెను. అనవుడు జయంధరుఁడిట్లు విన్నవించెను. "దేవా! చిత్రభానుఁడు కాశ్మీరరాజ్యమును స్వాధీనము జేసికొని పాలింపఁబ్రయత్నించుచున్నాఁడు. అందు మీ సాహాయ్యమును గోరుచున్నాఁడు. అట్లు తోడుపడుదురేని తన
ఁతురు కర్పూరమంజరిని మీకిచ్చి వివాహముసేయఁ దలఁచుచు
ప." అనుచుండఁ జంద్రచోడుఁ డడ్డమువచ్చి "ఆమె కితనిపై
? బలవంతవివాహమా?" యని యడిగెను. నావుడు
వెండియు నిట్లనియె. "స్వామీ! చిత్తగింపుఁడు. ఆమె
మఱెవ్వరిని వివాహమాడదఁట. మకరందుఁడే
వివాహమాడఁడేని నేను బ్రహ్మ
ని మఱియొక రాజకుమారుని కేలు
మే తపముసేయుచున్నది. ఆమె
ర ముజ్జయినిలో నుండును. విర
రాజకుమారా! మీరు చేప
మెనింతవఱకు నిలిపినది.
ను. మీరామెను

రెండుసారులు చూచియుండిరఁట. వెనుకనొకసారి విదర్భలో జ్వర పీడి తమైనప్పుడు మంచిమందు లిచ్చి బ్రతికించిరఁట. రెండవసారి భిల్లుల బారినుండి తప్పించి కాపాడిరఁట. ఆ ఋణము రక్షణముగాదు. నేఁడు గాపాడుటయే కాచుట. మీ హస్తస్పర్శన మామె తాపము జల్లార్చును. మీ ముఖదర్శన మామె యలమటఁదీర్చును. ప్రస్తుత మామె స్వప్నములలో మిమ్ము దఱచుగాఁ జూచుటం జేసియు, మీ నామస్మరణంబు గావించుటం జేసియు నామె జీవించుచున్నదిగాని లేనిచో నీపాటి కామె మఱియొకలాగైనయుండును. మఱియు చెప్ప వలసిన విషయము లున్నవిగాని మగవాఁడనగు నేను శుద్ధాంతవాసిని నైన యాఁడుదానిగుట్టు నంతకన్న విప్పిచెప్పనొప్పదు. అంతయు నీవే భావించుకొనుము" అని యూరకుండుటయుఁ జంద్రచూడ్యుఁడు

"సాహాయ్యముజేయని పక్షమున మీరాజు కూఁతు
కీయఁడా యేమి?" యని యడుగ జయంధరుఁడు "
స్థితి తటస్తించు నేని గర్పూరమంజరి చి
జాలను. ఐన నింతవలవంతగల కాం
గూర్చి మేలుపడెనో యాతని
జేయునా!" యని బదులు చె

అది విని మకరంద
శాంతిఁగలుగదు. ఆ యి
చున్నదిగాని దానిలో
గాని యది చేఱదు.
వృత్తి యెట్లుండునో
మీరాయఁడన్నట్లు
గలిఁగింప వచ్చు
జను చల్లనివా

పునాదిపై నాయాశాసౌధముం గట్టవచ్చును" అని తలంచి బహి రంగముగా నిట్లనియె." జయంధరా! సాయము చేయుటకుఁగాని చేయకపోవుటకుగాని నే స్వతంత్రుఁడను గాదుగదా! ఇందుకు నా తండ్రిగారు సుదర్శన మహారాజుగారె ప్రమాణము. ఈ విషయమై వారితో నే బ్రసంగించి కర్తవ్యము గావించెద. నీవు మాయతిథివై యుండుము. మా పట్టణమునఁ జూడవలసిన విశేషములఁ జూడుము. కర్పూరమంజరి నన్నువలచి యనుగ్రహించిన దని శుభవర్తమానము చెప్పుటచే నిదిగో నీ హారము నీకుఁ బారితోషికముగా నిచ్చు చున్నాను. గ్రహింపుము."

అనవుడు మహాప్రసాదమని జయంధరుఁడు దానిం గ్రహించి "దేవా! మీకు నాపైఁగలదయకు సంతసించితిని. నేను మీ యతిథినై ...ఁజాల. నా కీనగరమునఁ జుట్టములుగలరు. వారికడ నుండెద. ...ు." అని వంగి నమస్కరించి వాని యనుజ్ఞవడసి ...ోయెను.

...ందుఁడు చంద్రచూడుంజూచి "మిత్రమా! ...చున్నది. నడక యాఁడుదానినడక. ...ు నప్పుడచ్చముగ నాఁడుదివలె ...ంచును. ముదుకఁడగుబ్రహ్మ ...యి పొరపాటున మగవానిం ...మత్కృతిని సందేశార్థము

...ంతయు జాగరముసేయు ...లుటకయి వనలక్ష్మి ...నమాడెను. చంద్ర ...థముగ గుఱ్ఱుపట్టి ...ి మాతనినిష్ఠలు

కొలుప లేకపోయెను. మకరందుఁడు కూర్చుండినను నిలిచియుండినను స్నానమాడుచుండినను, నిటునటు దిరుగుచుండినను నతని మనస్సు సర్వావస్థలయందుఁ గర్పూరమంజరిమీఁదనే యుండెను. ఆమె తన్ను ప్రేమించునో లేదో యని మున్ను సంశయించుచుండెను. ఆమె తన్ను గాఢముగా వలచియున్నదని యిప్పుడు తెలిసినను జనకుని నియమమునుబట్టి యామె తనకు దుర్లభురాలని బెంగపెట్టుకొనెను. "ఏమిచేయుదు నిందెవరు నాకుఁ దోడుపడుదు" రని బూవుఁదోఁటలో నడయాడుచుండ సేవకుఁ డొక్కఁడు వచ్చి "మహాప్రభూ! నాయన గారి సెలవైనది. దయచేయుఁడు" అని మనవిచేసెను. "ఇదే వచ్చు చున్నా" నని యాతఁడు వానివెంటం జనియె.

సుదర్శనమహారాజు స్నానముజేసి సౌగతమతప్రకారము
ర్తింపవలసిన ప్రాతఃకాలకృత్యముల నియమపరతంత్రుఁ
శుద్ధవస్త్రముల ధరియించి యంతఃపురమున రా
బిచ్చు గదిలో నున్నతాసనంబునం గూర్చుఁ
వృద్ధుఁడైన యొక బ్రాహ్మణుఁడు స
సుదర్శనుఁ డడుగు ప్రశ్నల క
మకరందు డచ్చటికిఁజోయి
ప్రక్కం గూర్చుండెను. స
నున్న యా బ్రాహ్మణుఁడు
నేనుఁడు. హేమచంద్రుని
నన్నుం జూడవచ్చె. ?
యిచ్చిన లేఖలోఁగల
ిచ్చెను. మకరందు
యములన్నియు ప్ర
సుదర్శనుఁడు కు

విక్రమసేనుని జాబు జూచినది మొదలుకొని నాకడుపు జాలిపెంపున జుమ్మలుచుట్టుచున్నది. హేమచంద్రునిం దలంచిన నాకిప్పుడుసైతము గంట నీరువచ్చును. అతఁడు నేను సహాధ్యాయులము. అతనివంటి పరిశుద్ధుఁడు లోకమున లేఁడు మంచితనము మూర్తిభవించినదని చెప్పవచ్చును. అట్టిమహారాజు దుర్మరణము పాలగుటయు, మాయలమారి యగు చిత్రభానుఁడు రాజ్యమాక్రమింప దలఁచుటయు,విక్రమసేనుఁడు బాలుఁడగుటయు, దండనాథాది నియోగులు స్వామిద్రోహు లగుటయుఁ దలంచిచూడ మన మవశ్య మాతనికిఁ దోడుపడవలయునని దోఁచుచున్నది. ఇంతకన్న హేమచంద్రునకు నేనేమి సాయముచేయగలను? అతఁడు సంతసింపకపోయినను వాని యాత్మయైన నా యభి...నమునకు సంతసించును. నీవిందు కేమందువు? ఇది నీకుసమ్మతమగు

...ు సమరసన్నాహంబుగావించి కతిపయదివసములలోఁ
...కొని మన దండనాథుఁడైన కంఠీరవ దేవుఁ
...ం బోవలయును. నే నిచ్చటనుండి రాజ
...నీకిష్టము లేదేని సేనాసమేతుఁ
...వు నగరమునుండి నాస్థాన

...యే పితృప్రేరణంబునఁ
...రిగినదని కర్పూరమంజరీ
...నా! మీచిత్త మెట్లో
...ఇచట నుండుమన్న
...నే మీరుకదలుటకు
...ర్యంబు నిర్వర్తిం
...పము నీవెంట
...మ్ము చంద్ర

చూడుఁడు పిఱికివాఁడు. యుద్ధమున్న వెఱచును. అతఁడు నీతోరాఁడు కావున భద్రసేనుఁడే నీకు చెలికాఁడై హితోపదేష్టయై చేదోడు వాదోడై మెలంగును," అని సుదర్శనుఁ డానతిచ్చెను.

అప్పుడు మాధవసేనుఁడు లేచి చేతులుజోడించి వారుగావించిన యుపకారమునకుఁ దనకృతజ్ఞతందెల్పుచు నిట్లనియె. "మహాప్రభూ! నేనువచ్చునప్పుడు మీరేమందురోయని మిక్కిలిసంశయించుచువచ్చితిని. మీరు బాలుఁడగు విక్రమసేనునియెడఁ జూపిన దయ నిరుపమానము. మిత్రులన్న నాపద్బాంధవులన్న మీరె. చనిపోయిన మిత్రుని దలంచి చిన్నవాఁడగు వానికిమారు నకెవ్వరుపకారము సేయుదురు? పరోపకారార్థ మిదంశరీరమను వాక్యము మీయందు రూఢమైనది. మారాజుపక్షమున మారాజమాతపక్షమున, నమాత్యుల పక్షమున మీకు నే ననేక కృతజ్ఞతాసూచకవందనము లాచరించుచున్నవాఁడ. పాంచాలనరపాలుఁడగు మహేంద్రదేవుని దర్శనము చేసివచ్చితిని. ఆతఁడుగూడఁ దన దౌహిత్రునకు సాయముచేయఁదలఁచినాఁడు. మీరుభయులు గూడిరేని జిత్రభానుని బరాజితుని జేయుట మిక్కిలి సులభము. నాకనుజ్ఞనొసంగుడు రేని మగలబాంచాలమున కరిగి పాంచాలసైన్యములఁ దోడుకొని నేను కాశ్మీరమునకుఁబోయి మీరాక కెదురుచూచుచుందు" నని వారిముదలగైకొని మాధవసేనుఁడు వెడలిపోయెను.

అతఁడు నిర్గమించుటయు మకరందుఁడు పరిస్థితులట్లు మాఱుటనందుకుఁ దనలో నిట్లువిచారించెను. "ఇప్పుడు నేనేమిచేయుదును! విక్రమసేనునికి సాయముసేయుమని మాధవసేనుఁడువచ్చె. తన తోడుపడుమని చిత్రభానుఁడు దూతనంపె. చిత్రభాను పుత్రిక నామనసు లగ్నమైయున్నది. ఆమెకై నేనాతనిఁ గాదా! కాని ధర్మమాలోచించినపక్షమున

డైన విక్రమసేనునికే నేను దోడుపడవలయు. నామన స్సెయ్యెల లూఁగుచున్నది. ప్రాణసఖీసమాగమముఁ గోలుపోవుదునా, ధర్మపరిత్యాగము చేయుదునా? వివాహము లేకపోయిననుసరే ధర్మమే నేనను సరించెద. "యతో ధర్మస్తతో జయః" యను నార్యోక్తి సార్థకము గాకపోవునా!

ఇరువది మూఁడవ ప్రకరణము.

ధర్మదేవత మూర్తీభవించినట్లు జిత్రభానుఁడు కాశ్మీరమునఁ బ్రజాపాలనము సేయుచుండెను. రుద్రభట్టు ప్రజలకు బహిరంగముగ దర్శనమీయక చిత్రభానునకు నన్నివిషయముల దనుజనాయకునకు శుక్రాచార్యులట్లు హితోపదేశము చేయుచుండెను. విక్రమసేనహర్ష వర్ధనులకుఁ దనమీఁద నేతనూత్రము ననుమానము లేకుండునట్లు జిత్రభానుఁడు ప్రవర్తించుచుండెను. రాజకుమారులచేతఁ బగలు విద్యాభ్యాసము చేయించుచుండును. తగినశిక్షకుల నేర్పఱచి సాయంకాలములవారికి విలువిద్దియ నేర్పించుచుండెను. ప్రతికార్యమునందును విక్రమసేనునియాలోచనమడుగుచుండును. సింధుగాంధారవసుంధరాధిపులదండయాత్ర లెందుచేతనో, యాగిపోయెను. రాజ్యనౌకరొక్కచుక్కాని దాను ద్రిప్పుచుండుటచేఁ బరరాజులు భయంపడిరి. దండమాత్రలుమానిరని యతఁడు సైనికులతోడను దండనాథులతోడను, కుమారులతోడను నగరవాసులతోడను బలుమాఱు చెప్పుచు ను. మణివర్మను మొదటఁదలఁచుకొన్నట్లు చిత్రభానుఁడు ధన హింసింపలేదుగాని కారాగృహమందు బంధించియుం కర్యములు నొడఁగూర్పఁబడలేదు. స్నానమునకు

జలమైన నతనికి దుర్లభమయ్యెను. దినమున కొక్కసారి జొన్న రొట్టె లభింపఁజొచ్చెను. కటిక నేలం బండుకొనుచుండెను. మాసిన గుడ్డలైన నుదికించుకొనుట కుత్తరవులేదు. త్రాగుట మొదలయిన యెల్లపనులకు నొక్క ముంతెడుమంతమాత్రము వానికీయఁబడెను. జీవముతో నయిన నుండనిచ్చుటకు దండపాణి మాటసాయమె ముఖ్య కారణమై యుండవచ్చును. పురరాలోచనమీద దండపాణి కిష్టము లేనిపని గావించుట తనకు శ్రేయస్కరముగాదని తలంచి చిత్రభానుఁడు హింసాప్రకరణమునుండి మరలియుండవచ్చును.

చిత్రభానుఁడు వేటయందు మిక్కిలి తమకము గలవాఁడు. మృగయాక్రీడయందుఁ దనకుమారుఁడైన విజయసేనునకును విక్రమ సేన హర్షవర్ధనులకును నభిరుచిగలిగించెను. వేటపేరు చెప్పిన వారు మిక్కిలి యుత్సాహముతో వెడలుచుండెడివారు. విక్రమసేనుఁడు చిన్ననాటనుండియు మృగయాక్రీడ కలవడినవాఁ డగుటం జేసి వేట కతఁడు ముందడుగు వేయుచుండెను. రెండుమూఁడు సారులు పిన తండ్రివెంట వారిరువురు మృగయాక్రీడల కరిగి సాయంకాలమున కింటికివచ్చిరి. ఎన్నఁడో యేదో యపకారము చేయునని మహా భయము బిడ్డలకుఁ దల్లికి నుండినను జిత్రభానుని వర్తనము కొంత వఱకు వారికి నమ్మికఁ గలిగించుచుండెను. అయినను వారు జాగ రూకులై యుండిరి.

అట్లుండ నొకనాఁడు చిత్రభానుఁడు విక్రమసేన హర్షవర్ధ నులు విజయసేనుఁడు దండపాణి వజ్రపాణులు మఱికొందఱాప్తులుఁ బరివేష్టింపఁ గొలువుండి నగరవాసుల వ్యవహారములఁ దీర్పులు చెప్పుచుండ సూర్యాస్తమయసమయమున జిఱుచీఁకటులు పడుచుండ నొక యాటవికుఁడు గోచిపెట్టుకొని కంబళి మీఁద గప్పుకొని చేత నొక దుడ్డుకఱ్ఱఁ బట్టుకొని పరుగుపరుగునఁ గొలువుకూటము సొచ్చి "దండాలుసామీ! దండా"లని నేలసాగిలంబడి మొక్కి నిలిచెను.

"ఎవఁడవురానీవు! ఏమిపనిమీఁద వచ్చితి"వని చిత్రభానుఁడడిగెను. అందుకు వాఁడు ప్రభువుతో నిట్లు మనవిచేసెను.

"నేను గొల్లల చిన్నవాఁడనుదేవరా! మంచుకొండదగ్గఱ చాఱలమెకములు చిఱుతపులులు సివంగులు పెచ్చుపెఱిఁగి మాపసరములను గసగస నమలివేయుచున్నవిదొరా! పసులమందలు తగ్గిపోయినవి. ఏలినవారు వేఁటలాడి యామెకాలను చంపి మాకింత కూడుపెట్టవలె దేవరా! లేకున్నమేము బ్రతుకజాలము పసరాలే మాసొమ్ములు పసరాలే మా బ్రతుకులు రక్షించుదేవరా!రక్షించు" అని మొఱవెట్టెను.

వాని కుయ్యాలించి చిత్రభానుఁడు కన్నకొడుకును నన్నకొడుకులను జూచి "వేఁటకై యరుగుదమా? గోరక్షణముకన్నఁ బుణ్యకార్యములేదు.అది యుభయతారకమయిన సత్కర్మ. పాపమీపేదగొల్లలు మనకవశ్యము రక్షణీయులు." అని యడుగ వారు ముగ్వురు వల్లెయని యుత్సాహముతోఁ బలికిరి. మఱునాఁడుదయమున మృగయాక్రీడకుఁ గావలసిన సన్నాహమంతయుఁ జేయఁబడెను. ఉరులు, నుత్సులు, వేఁటకుక్కలు, జిగురుగండెలు, దీపములు, బోనులు, విండ్లు, నమ్ములు, బల్లెములు పట్టుకొని వాటి నుపయోగించుటయందు నేర్పరులగు వేఁటకాండ్రు మహోత్సాహముతో కొలువఁ జిత్రభానుఁడు వేఁటకై బైలుదేఱెను.

"మంచుకొండ చాలదూరము. కొన్నిదినములకుఁగాని వచ్చుటకు వీలులేదు. ఎప్పటివార్త లప్పటికిఁ దెలియవు. మనస్థితి బాగులేదు. ఏదినమెట్టిదో తెలియదు. కావున మీరు పోవలదు. నాయనలారా"యని యరవిందాదేవి బిడ్డలం బతిమాలెనుగాని వేఁట తమకము వారిని ముందుకు గెంటెను. మహోత్సాహముతో ముగ్వురు కుమారు లొకరథ మెక్కిరి. చిత్రభానుఁ డొకరథమెక్కెను. పరివారము ముందునడచెను. దండపాణియు స్వల్పసైన్యముతో వారి వెను

వెంట జనెను. ఆ బలగమెల్ల హిమవత్పర్వతప్రాంతమున కరిగి గుడారములలో బసచేసి యైదుదినములు వేఁటాడి మ్రుక్కడిమెకములఁ బెక్కింటి నుక్కడఁచి గొల్లపల్లియలఁ యిక్కట్టులఁ దొలగించిరి.

విక్రమసేనుఁడుమూఁడుపులులంగొట్టెను. హర్షవర్ధనుఁడొక్కచిఱుతం జంపెను. విజయసేనుఁడు రెండు భల్లూకములఁ గడతేర్చెను. చిత్రభానుఁడు రెండు సింగంబులం గూల్చెను. దండపాణి రాత్రివేళ మంచెమీఁద బొంచుండి చెఱువులో నీరుద్రావుచుండ గొప్ప పులి యనుకొని యొకగాడిదను జంపెను. అయిదుదినములు వేఁటాడి విశ్రాంతి నిమిత్తమై వారు గుడారములు విడిచి సమీపమున నొక కొండమీఁదనున్న చిన్నకోటలో విడిసిరి. అక్కడ రెండుదినములు గడపిరి. అక్కడి ప్రకృతిసౌందర్య మతిమనోహరముగా నుండెను. ఆ యున్నత ప్రదేశమునుండి చూడఁ బ్రథమచరమసంధ్యారాగముల విశేషశోభాసౌభాగ్యము పద్మరాగమణీయకాంతులను మించి వారి కన్నుదోయి కమితానందముఁ గూర్చెను. ఆకాశము నందుకొనుటకు హిమవంతుఁడు చాఁచినదీర్ఘబాహువులో యన్నట్లు వెలయు మహోన్నత శృంగములతోడను, కొండరాజు తొడిగిన తెల్లని నిలువు టంగీయో యనునట్లువిలసిల్లు మంచుతోడను చేవయు నున్నతియు దట్టమయిన యాకులగలిమియుఁ గలిగి సూర్యరశ్మి నడ్డగించు మహావృక్షములతోడను నింద్రధనుస్సువలె నానావర్ణములుగలిగి నలుగెలంకులఁ బరుగులెత్తు విహంగములతోడను, ప్రాయములు నైశ్వర్యములు నిల్వే యతివేగంబునఁ గడచిపోవునని లోకంబునకుం దెలుపుటకో యన నతివేగంబునఁ మీఁదినుండి క్రిందికిఁ బ్రవహించు సెలయేళ్ళతోడను, కొండగుహలు ప్రతిధ్వనులిచ్చునట్లు బొబ్బలిడు బొబ్బమెకంబులు బెబ్బులులు మొదలగు ఘాతుకమృగంబులతోడను విండ్ల చేబూని మెకంబుల వేఁటాడుటకయి విసవిస నడచిపోవు వేఁటకాండ్ర

తోడను, వేటకాండ్ర వెనువెంట వారి కమ్ములనందించుచు నుత్సాహముఁ గలిగించుచు నడచు కిరాతాంగనలతోడను విరాజిల్లు చున్నంచుగొండం జూచి విక్రమసేనుఁడు బట్టణంబులఁ జూచినప్పుడు పొందని మహానందము నొంది తమ్మునకు విజయసేనునకు, వనంబులకు నుపవనంబులకుఁ గల భేదంబు దెలుపుచుఁ దొల్లి యిందే మహేశ్వరుంగూర్చి గౌరి యఖండతపంబు గావించె. ఇందే జగంబునకు మాతాపితలు పురాణదంపతులు నైనపార్వతీపరమేశ్వరులకుఁ గల్యాణమహోత్సవము జరిగె. ఇందే సప్తమహర్షులు ననేక యాగములుజేసి హవిర్భాగములచే వేల్పులం దనిపిరి. ఇందే నరనారాయణ నివాసమైన బదరికాశ్రమ మున్నది. ఇందే గంగానది మొట్టమొదట నెలవుజేసికొన్నది'' యని తత్సంబంధములయిన పురాణగాథల వర్ణించుచు నారెండుదినములు గడపెను. రెండవనాఁటిరేయి వారందఱు సుఖముగా భుజియించి ప్రియభాషణంబులు సలిపి పండుకొనిరి. విక్రమసేనుఁడు హర్షవర్ధనుఁడు నొకగదిలో శయనించిరి. చిత్రభానుఁడు విజయసేనుఁడు మఱియొకగదిలోఁ బవళించిరి. కొలది పరివారము నచ్చటనుంచి కార్యాంతరములమీఁద దండపాణి యాసాయంకాలమే పట్టణాభిముఖుఁడై పోయెను.

విక్రమసేన హర్షవర్ధనులు గాఢనిద్రావశులై యెప్పటియట్ల ప్రభాతకాలమున మేల్కాంచి లేచిరి. లేచిచూచునప్పటికివిజయసేనుఁడు చిత్రభానుఁడు వారికి గపడలేదు. ఏఁబదిమంది యాయుధహస్తులయిన సైనికులును తమకు వంటలు నుపచారములు మొదలగునవి చేయుటకు నిద్దఱు ముగ్గురు సేవకులు మాత్రము గనఁబడిరి. ''పినతండ్రి యెందరిగె విక్రమసేనుఁడు సైనికులలోఁ బ్రధానపురుషుఁడగు శక్తివర్మయను వాని నడిగె. ''మహాప్రభూ! ఏదో తొందరపనిమీఁద వారు మిమ్ములేపుటకైన నవకాశము లేక కుమారుని తీసికొని

పరివారమును వెంటఁగొని నిన్న నడిరేయి పురమునకుం జనిరి. ఇట్లు మీతో మనవిసేయుమని నా కానతిచ్చి" రని యాతఁడు బదులు చెప్పెను.

"ఏమీ! తొందరపనిగలిగినదా? మమ్ము లేపుటకైన నవకాశము లేకపోయినదా? కుమారుని బరివారమును వెంటఁగొనిచనెనా? ఆహా! మాయమ్మ పోవలదని చేసిన హితోపదేశమును నేను నిరాకరించి మోసపోతినిగదా!" యని విక్రమసేనుఁడు తమ్మునిఁ జూచి "హర్షవర్ధనా! ఎంతయు మోసము వాటిల్లినది. మనల నిందువిడిచి బుద్ధిపూర్వకముగా విజయసేనునిం దోడ్కొని చిత్రభానుఁడు పురమున కరిగినాఁడు. దురాత్ముఁడను వేఁటకు నేనొక్కఁడను రాక నిన్నుగూడ దీసికొనివచ్చితినిగదా మనరాకకై యెంతో యాత్రముతో నిరీక్షించుచుండు మనతల్లి మనము గనఁబడకపోవుటచే నెంతగుందునో, యెంత బెంగపెట్టుకొనునో, యామె చిత్త మెంతక్షోభించునో, ఆమె హృదయము భిన్నముగాక యుండునా? ఇంక నామె యన్నముదినునా? నిదురించునా? మనకిది కారాగృహముగాని గృహముగాదు. మన మిక మీఁద బందితులముగాని రాజపుత్రులముగాము. ఈఘాతుకకృత్యము చేయుటకే యతఁడీ వేఁటపన్నుగడ పన్నినాఁడు. అతని సంకల్పము ముప్పాతిక నెఱవేరినది. మనమిందు దిక్కులేక మన మొఱలు వినువారు లేక మన సంతాప మార్చువారు లేక మనకోరికల దీర్చువారు లేక యీ వనవృక్షములట్ల యెన్నఁడో నాశన మొందవలసి యుండును. ఆహా! ఏమిగతి? తమ్ముఁడా నేఁబోయిన విచారము లేదు. నీవయిన నమ్మకొఱ కుండిన బాగుండును గదా!" యని విచారగ్రస్తుఁడై పలికెను.

అదివిని హర్షవర్ధనుఁడు "అన్నయ్యా! నీవేలపోవలె నేనందు కుండవలె నేను నీతోడివాఁడనే. ఉండిన నిరువురముండము. పోయిన నిరువురము పోదము. నీవుచెప్పినట్లు తల్లి పొందుతల్లడమింతింతగాదు,

ఆమె జీవింపనే జీవింపదు. అమ్మ దూరదృష్టిగలదై యిట్టి యాపదల శంకించి మనలం బోవద్దన్నది. మన మామెమాట విన్నాముకాము. మాతృశాసన తిరస్కారమునకుఁ దగినఫల మనుభవింపవలయును గదా'' యని దీనాననుఁడై ప్రత్యుత్తర మిచ్చెను.

ఆదినమున వారు వంటలుచేసి సేవకులు పిలిచినను బతిమాలినను భుజింపలేదు. శక్తివర్మ వారికడఁజేరి ''ప్రభువులారా! భోజనము సేయుఁడు ఎన్నిదినములు మానెదరు? ఇది యొక్కనాఁటిదిగాదు. మీ కిది శాశ్వతమైనచెఱ. మీ రీయిల్లుగదలి యావలికిఁబోకుండ మమ్ము మీపినతండ్రి కాఁపుఁబెట్టెను. నా చిన్నియన్నలారా! అంతటి మహారాజు గర్భమునఁబుట్టి యంతటి మహైశ్వర్యము ననుభవించి తుదకిట్టి దురవస్థపాలైన మిమ్ముఁజూడ మిక్కిలి కఠినుండనైన నా హృదయముగూడ చలించుచున్నది. మేమేమి చేయఁగలము? సేవకులము. దుర్భరమైన కుటుంబరక్షణమునకుఁ శరీర మన్యుల కమ్ముకొన్నాము. ప్రభువులయాజ్ఞ శిరసావహింపవలయు. లేనిచో మాబుఱ్ఱ లెగిరిపోవును. మాకూఁడు పడిపోవును. కడుపుకక్కుర్తికై ప్రభువుల కడఁ గొలువుచేసి యిట్టి దుష్కార్యములు చేయనలసి వచ్చినందుకు మేము మిక్కిలి దుఃఖపడుచున్నాము. మాకు స్వాధీనమైన పని లేదు. సేవకు లంతఃకరణము చంపుకొని గుండె రాయిచేసికొని యుండవలయు. మేము మనుష్యులలో లెక్కగాదు. కాబట్టి మమ్ముల క్షమింపుఁడు నాయనలారా'' యని కంటనీరు పెట్టుకొనెను.

''శక్తివర్మా! నీవేమి చేయగలవు? మే మదృష్టవంతుల మయిన పక్షమున మాతండ్రి కట్టి దుర్మ్మణ మేల కలుగున్నే? చిత్రభానున కిట్టి దుర్బుద్ధి యేలపుట్టును? ఒకరిని నిందింపనేల? మాభాగ్యమునే నిందించుకొందుము నీవు విచారింపకుము'' అని విక్రసేనుఁడు వాని నూఱడించెను.

ఇరువది నాల్గవ ప్రకరణము.

చిత్రభానుఁడు వేఁటనుండి కుమారునితోడను బలగముతోడను మరలివచ్చెనని విని యరవిందాదేవి తనకొడుకులుగూడ వచ్చుచున్నారని వారింజూచి యానందింప నుబలాటపడుచుండ వారెంత సేపటికి రారయిరి. ఆమె సాయంకాలమువఱకు వారినిమిత్తము నిరీక్షించి యాత్ర మంతకంత కెక్కువకాఁగఁ దన నందనులు రాకపోవుటకుఁ గారణమేమో తెలిసికొనిరమ్మని దండపాణియొద్దకు సేవకుల నంపెను. 'తనకావిషయ మెంతమాత్రము తెలియఁదని యాతఁ డుత్తరముజెప్పెను. బెంగ యినుమడింపఁ బుత్రవత్సలయయినయా దేవి నలుగురు బంట్ల నాలుగుప్రక్కలకంపి వేటకాండ్రను దద్విషయమై కనుఁగొని రమ్మని పంపెను. తమకావిషయము తెలియదనివాండ్రును దెలిపిరి.

అరవిందాదేవి తొట్రుపాటు వర్ణనాతీతమయ్యెను. అప్పుడామె వృద్ధకంచుకియయిన ముంజనిబిలిచి చిత్రభానునియొద్దకరికి తద్విషయ మరసిరమ్మని పంపెను. వాఁడును సత్వరంబయరిగి యతనిజోహారొనర్చి వినయపూర్వకముగా రాజకుమారు లేలరాలే' దని యడిగెను. అతనికిఁ జిత్రభానుఁడిట్లనియె. "కుమారులు సేమముగానున్నారు. మంచుకొండ చరియలలో నొకదానిమీఁద మనోహరమైన కోటగలదు. వారక్కడ గొంతకాలముండి యవ్వన సౌందర్యము శైల సౌందర్యముఁ జూడవలయునని కోరుటచే వారినక్కడ నుంచివచ్చితిని. భయములేదని మీరాణిగారితోఁ జెప్పు. పో."

ఆమాటవిని ముంజుఁడు వెంటనేరాచనగరున కరిగి యేమి యుత్తరము వచ్చునోయని తత్తరపడుచున్న రాణికెఱింగించెను. అమ్మాటలు శూలపుంబోటులువలె నామెకర్ణములనాఁట నిలువఁలేక నేలం గూర్చుండి "అయ్యో! నర్మదా! నర్మదా! దురాత్ముఁడయిన

చిత్రభానుఁడు నాకొడుకులఁ గడతేర్చినాఁడేతల్లీ! కటకటా! నాపసిపాపల నితఁడు తినకడుపునఁబెట్టుకొననే. అయ్యో! ఏమిసేయుదునే? నర్మదా! ఏదోఘాతుక కృత్యము జరిగినదే. ఓసీ! నేనునిలువలేను. నా గుండెలు కొట్టుకొనుచున్నవి మనస్సు మండుచున్నది. ఒడలు వడఁకుచున్నది. తల తిరుగుచున్నది. కన్నులుచీకట్లు గ్రమ్ముచున్నవి. నీవు వచ్చి పట్టుకొనవేనన్ను. ఎవరితోఁ జెప్పుకొందునే! మణివర్మ లేఁడు మాధవసేనుఁడు లేఁడు. గదాధర శూలపాణులు లేరు. ఎంతదిక్కుమాలినదాననైతినే! ఇప్పుడేమియుపాయమే? ఆలోచన చెప్పువారయిన లేరే! నీవేమనియెదవే?" యని పరిపరివిధముల నాక్రోశింపఁ దొడఁగెను.

ఆమె దుఃఖముజూచి నర్మద వెఱపు జాలియు మల్లడిగొన నేమి చెప్పుటకుందోఁచక నెట్లుసమాశ్వాసించుటకు నుపాయము గానక "అమ్మా! నేను పోయి నీమఱఁదిగారిని గనుఁగొని వత్తునా" యని యనెను. "ఓసీ! నీవు కాదు వెళ్ళవలసినది. నన్నే యచ్చటికిఁ దీసికొని పొమ్ము. నేనాయిందుమణి యడుగులమీఁదను గర్పూరమంజరిపాదములయొద్దను బడి నాచిన్నియన్నల నాకర్పింపుమని ప్రార్థించెద. తీసికొనిరా. రథము తీసికొనిరా. జాగుసేయకు. నిమేషమాత్రమాలసించితివా యేమిజరుగునో నీవేయెఱుఁగఁగలవు" అని కఠినముగాఁ బలుకుటయు నర్మద యప్పుని సారథినొక్కనిం బిలిచి యరదంబు పన్నించి దేవినందుఁ గూర్చుండఁబెట్టి దాను నామె ప్రక్కను గూర్చుండెను.

కోటకావలి నిమిత్తము చిత్రభానునిచే నియమింపబడిన మొఱకుజోదులు స్యందనము నిలిపి కోటలోనుండి యావలికవరింబోనియ్యవలదని చిత్రభానునియాజ్ఞ యయినదని తెలిపిరి. అప్పలుకులు విని మహాగ్రహాపూరితచిత్తయై కోపావేశంబునఁ బలుకులు తడబడఁ

నరవింద రథములోనుండి బిగ్గరగా "ఓరీ! ఎవఁడురా నా స్యందన మాఁపగలవాఁడు? ఈ రథ మెవ్వరిదిగా దలఁచితివి. హేమచంద్ర మహారాజు పట్టమహిషియుఁ గుమార విక్రమసేనుని మాతయునగు నరవిందదిగా గ్రహింపుఁడు. ఆనయిచ్చుటకుఁ జిత్రభానుఁ డెవ్వఁడు? నిలుపుటకు మీ రెవ్వరు? సూతుఁడా! రథము సాఁగనిమ్ము. ఎవ్వరేని నడ్డమువచ్చిన నేనే రథము దిగి గుఱ్ఱముముందర నడచెద. వారి ప్రభువు నాజ్ఞాప్రకారము నన్నుం జంపుమని యీ బంట్లతోఁ జెప్పుము" అని పలికెను. భీషణములైన యా భాషణములు ధైర్య శోషణముగావింప నాజోదులు భయకంపితులై యేమియుఁ ననఁ జాలక నొత్తిగిలిరి. రథము నిరంతరాయముగ సాఁగి చిత్రభానుని గృహముముందర కరిగి నిలచెను. కుమారవియోగ సంజనితమయిన మనస్తాపమున నొడలెఱుఁగక దేవియెదుటనున్న వారెవ్వరో తెలిసి కొనకయే నర్మద దారిజూప సింహద్వారముదాఁటి లోపలికవాట ములు దాఁటి యభ్యంతరమందిరమున కరిగెను. అరిగి "యిందుమణి యెక్కడ? ఇందుమణి యెక్కడ?" యని విచారించి సేవకులవలన నామెయున్న చోటెఱిఁగి యాతావునకుం జనెను.

అప్పుడు కర్పూరమంజరియు నిందుమణియు నొకమంచముపై గూరుచుండి యేదో మాటలాడుచుండిరి. విజయసేనుఁ డామెరాక జూచి విసవిస మేడమీఁదికరిగి తండ్రి కెఱిఁగించెను. అరవిందాదేవి తనయింటికి వచ్చునని చిత్రభానుఁ డెన్నఁడు దలఁపలేదు. అంతఁ డదరి పడెను. రుద్రభట్టు మహాశ్చర్యమునొందెను. వెంటనే చిత్రభానుఁడు మేడదిగి క్రిందికివచ్చెను. అరవిందాదేవి గది ప్రవేశించిన తోడనే మహాశ్చర్యముచేఁ గన్నులు పెద్దవిచేసి చూచి యిందుమణియుఁ గర్పూరమంజరియు మంచముమీఁదినుండి దిగ్గునలేచి నిలిచిరి. అర విందవారి యిరువురపాదములపైఁ బడి "అమ్మా! పుత్రభిక్షము పెట్టుఁడు పుత్రభిక్షము పెట్టుఁడు" అని వేఁడుకొనెను.

ఆగొడవ వారేమియు నెఱుంగకపోవుటచే వారిరువురుం డెల్ల బోయి చేతులతోఁ నామెనెత్తి "అయ్యో! ఇదియేమివెట్టి? మా యడుగులమీఁద బడఁజెల్లునా? తల్లీ! మీరుండగ మేమెంతవారము! బిడ్డలకేమియాపద వాటిల్లెను? అని తొట్రుపాటుతోఁ బలికిరి. అందు కరవింద వారింజూచి తనకొడుకులు చిత్రభానునితో వేఁటకరుగుట, బలగమంతయువచ్చినను వారు రాకపోవుటఁ, గొండకోటలో నున్నారని చిత్రభానుఁడు చెప్పుట మొదలగు వృత్తాంత మంతయు గద్గద స్వరముతో దుఃఖపూరితయై తెలిపి "తల్లీ! కర్పూరమంజరీ! నీవు నాకన్న కూఁతువుగాకున్నను నిన్నే నాబిడ్డగాఁ జూచుకొంటి. ఇద్దఱు మగబిడ్డలు నాకొకయాఁడు బిడ్డ యని సంతసించుచుంటిని. అమ్మా! నీతమ్ముల రక్షింపుము. తమ్ములం జూపుమని నీ తండ్రి నడుగుము. చూపఁడేని ఇదిగో! నేను రాచకూఁతురను సాహసంబులందు ముందంజవేయుదానను. ఇదిగో! నాచిన్నకత్తి మొలలోనున్నది. ఇప్పుడె నీతండ్రి చూచుచుండ నీవు నీతల్లియుఁ జూచుచుండఁ బొడుచుకొని బిడ్డలకు దూరనై, భర్తకు దూరనై, వసుంధరాదేవికిని మీకును భారమైన యీశరీరము మీతండ్రిపాదములయొద్ద విడిచెను ఆయన కనులు చల్లఁబడుఁగాక! ఇదివఱకే భ్రాతృహంతయని పేరువచ్చినది. ఇప్పుడు శిశుహంతయైనాఁడని నాయనుమానము. ఇప్పుడు నా చావుచే నాయన పాపశరీరమునకు మకుటమేర్పడును. బిడ్డా! కర్పూరమంజరీ! పద. నీతండ్రియొద్దకుఁ బద, తల్లీ! యిందుముఖీ! పద నీపతి కడకు పద" అని మిక్కిలి యార్తయై తీవ్రముగ భాషించెను.

చిత్రభానుఁడు ప్రక్కగదిలోనుండి యప్పలుకులు వినుచుండెను. రుద్రభట్టు వానిప్రక్కనేయుండి యతని చెవిలో నేదో గుసగుసలాడుచుండెను. కర్పూరమంజరి యామె దీనదశఁజూచి మెత్తని చిత్తము మిక్కిలి యుత్తలపాటునొందఁ దత్తఱంబునఁ దండ్రికడ

కరిగి "నాయనా ! ఏమిది ? తమ్ములేమైరి ? ఎందుండిరి? కుశలముగ నున్నారా ? ఆమెబిడ్డల నామె కప్పగింపుము. నీకీ యపవాదమేల ? ఇదివఱకే సీతలపైఁ బడిన లోకాపవాదములు చాలవా ? ఆదుర్యశోభారమున నీవెగాక మేముగూడ గ్రుంగిపోవుచుంటిమి. ఆ యపకీర్తి యను నంధకారమువలన మన కులప్రతిష్ఠ నల్లఁబడినది. సత్వర మామెబిడ్డల నప్పగింపుము" అని మందలించెను.

చిత్రభానుఁడు బిడ్డనుడువుల నాలించి "అమ్మాయి ! సీతమ్ములు కుశలముగనున్నారు. ఏల యీామె తొందర ? వారు హిమవత్పర్వత సౌందర్యముఁ జూడ నుబలాటపడుటచే నచ్చట నునిచితిని. పది దినములలో వత్తురు. మహారాజ్ఞి అంతఃపురవాసిని ఈమె యేమి, యీరాత్రి తొందరతో వచ్చుటేమి ? ఇంత మనక్షోభ మెందుకు ? ఏమిమునిఁగిపోయినది? ఇప్పుడు కోటకు జనుమనుము" అని నిర్విచారముగ నుత్తర మిచ్చెను.

అదివిని యరవిందాదేవి మహారోషమున నిట్లనియె. "ఏమి మునిఁగిపోయినదా ? నామనస్సు దుఃఖమున మునిఁగిపోయినది. మీ పలుకులు నే నమ్మఁజాలను. ఒకవేళ వారు బ్రతికియేయుండిన వారిని నీవు చెఱలో బంధించితివి. అందుకే యమాయకులైన పసిబిడ్డలను మాయమాటలుచెప్పి వేఁటవంకబెట్టి దూరము తీసికొనిపోతివి. నేను రాణినా ? నేను రాణినిగాను నేను నీదాసిని. నారాణితనము నాఁడే పోయినది. నేను కోటకుంజనను. నాబిడ్డలులేని కోట శ్మశానముగాని కోటగాదు. నాచిన్నియన్నలులేని నగరుఁ నట్టడవిగాని నగరుకాదు. నాబహిఃప్రాణములు లేని యాభవనము సముద్రముగాని భవనము గాదు. ఆకోట నేఁ బ్రవేశింపను. నాబిడ్డలఁ జూచినదాఁక యీనగరులో నే నడుగుపెట్టను. నన్నుఁజంపి శవమును శ్మశానమునకయినఁ బంపుము. లేదా నాకొడుకుల యొద్దకయినఁ బంపుము. వారింజూడమి

నాకన్నులు వాఁచిపోయినవి. ఏరీ! నారత్నాలరాసులు? ఏరీ! నాబంగారుబొమ్మలు? ఏరీ! నావరాలకుప్పలు. ఏరీ ! నాసింగపుఁగొదమలు. ఏరీ! నాముద్దులమూటలు. ఏరీ! నా గారాల కాణాచులు. చూపవా? ఇదిగో చూరకత్తి పొడిచి చంపు. నీచేతులతో నేనన్ను నాభర్తయొద్దకుఁ బంపు." అని యతని కాళ్ళ సమీపమున నేలపై సాఁగిలఁబడెను.

అప్పలుకులు విన్నవారందఱు భయమున గడగడవడఁకిరి. జాలిగుండెగల చిత్రభానుని మేనుసయితము కంపించెను. "ఇది మనకుఁ దగదు. ఆమెను బిడ్డలయొద్దకైనఁ బంపుఁడు. లేదా, బిడ్డల నామెయొద్దకైనఁ దీసికొనిరండు" అని యిందుమణి చెప్పెను. "తండ్రీ! నాగుండెలు వ్రీలుచున్నవి. నాతమ్ములం దీసికొనివచ్చి యామెకుం జూపుము. నేనును వారిం జూడఁదలఁతు" నని కర్పూరమంజరి జనకునితోఁ బలికెను. అప్పలుకులు విని చిత్రభానుఁడు "ఆమెయు మీరు నింతనిష్ఠురోక్తులు బలుకనేల! ఆమె నిప్పుడె బిడ్డలయొద్దకు బనిచెద. ఉండుఁడు" యని యవ్వలకుం జని కరటకపింగళులం బిలిచి వారితో నేదో పదినిమేషములు చెప్పి మరల వచ్చి, యీసేవకు లిరువురు నీరథముపై వచ్చి నిన్ను నీబిడ్డలున్నచోటికిఁ దీసికొనిపోఁగలరు. వదినె! రథమెక్కుము. నర్మదంగూడ దీసికొనిపొమ్ము. నీవు నీబిడ్డలం గలిసి మరల నిక్కడికి సుఖముగా నత్తువుగాక!" అని చెప్పెను.

"నాకిదే మహోపకారము. ఇదేపోయివచ్చెద" నని వారినందఱి నామంత్రణముచేసి యరవిందాదేవి నర్మదఁగూడి యరద మెక్కెను. కరటకపింగళులు సారథి కిరువంకల నయ్యరదముమీఁదనే కూర్చుండిరి. పయనము సాగెను. కరటకపింగళులు చూపిన దారినె సూతుఁడు స్యందనముఁ దోలెను.

అట్లు రెండుదినములు వారు ప్రయాణముచేసి రెండవనాఁటి సాయంకాలమునకు నట్టడవుల నడుమనున్న యొకచిన్న కొండకోటం

చేరిరి. ఆకోటచుట్టుఁ గొండలుగలవు. ఒకటిరెండు చెంచుల పల్లియలు గలవు. "ప్రయాణశ్రమచే మేము మిక్కిలి యలసితిమి రెండుదినము లిక్కడ విశ్రమించి పిమ్మట మీకొడుకులున్నచోటికిఁ బోవుద"మని కరటకపింగళు లాదేవితోఁ జెప్పి మిక్కిలి కష్టముమీఁద నామె నొడంబఱిచిరి. వారక్కడనుండగానే ముప్పదుగురు జోదులు సాయుధులైవచ్చి వారిం చేరిరి. ఈ బలగమెందుకని యరవిందాదేవి కరటకపింగళుల నడుగ మనము కొండలోనుండి పయనము సేయవలయు. మన కంగరక్షగా మీమఱఁది పంపె"నని వారుత్తరము చెప్పిరి.

ఆ బలగముచేరిన మఱునాఁటిరేయి నెల్లరు గాఢనిద్రం దగిలియుండఁ గరటకపింగళులు నిదురించుచున్న సూతుని మెడ కురిబోసి వానిం గడతేర్చి యొక కొండవాఁగునం బాఱవయిచి యరదము మీఁద నెక్కి దానిం దోలుకొని శ్రీనగరమునకుం జనిరి. మఱునాఁడుదయమునఁ గరటకపింగళులను సూతునిఁ గానక యరవిందాదేవి వారేమయిరని యంగరక్షకుల నాయకునడుగ నతఁడిట్లనియె.

"అమ్మా! ఈకొండకోట మీకుఁ జెఱసాల. మీరిందుండవలయు. మిమ్మిటనుండి కదలనీయఁగూడదని చిత్రభానుఁ డానతిచ్చెను. సూతుఁడేమయ్యెనో మేమెఱుఁగము కరకటకపింగళులు నిన్నరేయి శ్రీనగరమునకుం బోయియుందురు. మీకు గావలసిన సకల పదార్థములు దెచ్చి యీయవలయునని మీమఱఁది యానతిచ్చె. మీకేవి కావలయునో యవి నర్మదచేత మాకెఱింగింతురేని మేమవి తెచ్చి మీకు సమర్పించువారము." అని యున్నదున్నట్లుగ రక్షకనాయకుఁడు పలుక తనకొడుకుల నచిరకాలమునఁ గలసికొనఁ గలుగుదునని పుట్టెడాస పెట్టుకొనియున్న యాదేవికి పిడుగడచినట్లు నిశ్చేష్టయై నేలంగూలెను. నర్మదయు దుఃఖాక్రాంత మనస్కయై యామె మొగంబునఁ జల్లనినీరు జల్లి సాధ్యములైన శైత్యోపచార

ములం జేసెను. అంతం గొండొకవడి కాదేవి మూర్ఛనుండి మేల్కొని "హా! కుమారులారా! మిమ్మింక జూచెడుభాగ్యము నాకులేదు. మీరు జీవించియున్నారను నమ్మికయే నాకుఁ బోయినది. ఆ దురాత్ముఁడు మిమ్మే మాయోపాయములనో కడతేర్చియుండును. నన్ను మాత్రము చేతులారఁ జంపక మీనిమిత్త మాజన్మాంతము విలపింపుమని నాగరకులు రాని నట్టడవిలోఁ బడవైచె. ఇఁక నేమిసేయుదు? నర్మదా! ఇఁక నీ బ్రతుకెందుకే? తీసికొనిరావే విసము! జానెడుత్రాడు తేవే! చిన్నకత్తి నాచేతికియ్యవే! నాచిన్నయన్నలారా! అటువంటి ప్రాణేశ్వరుడు గతించినను మీరిరువురు నారెండుకన్ను లనుకొని నా బహిఃప్రాణము లనుకొని నాకన్నుల చందమామయనుకొని నాతపః ఫలములనుకొని నేను బోయినయెడల మీకు సుఖములు జరుగవని, నేను ప్రాణేశ్వరుతో సహగమనము చేయక, తరువాతనయిన నసువులు విడువక జీవించియుంటి. ఇఁక నాజీవనమువలనఁ బ్రయోజనమేమి? హా! యెంత దురవస్థ ప్రాప్తించినది? ఓ చిత్రభానుపాతక! నా కారాగృహనివాసమునకు నేను విచారింపను. నామరణమునకు నేను చింతిల్లను. రాజ్యములేదని విచారింపను. సామ్రాజ్యమంతయు నీ వేలుకొన్నను సరే. కోటిసామ్రాజ్యములకన్న నెక్కుడు ప్రియములయిన నా గారాబుబిడ్డల నా చిన్నకూనల నాకియ్యరాదా? వారిమొగములే నాకు సామ్రాజ్యసుఖము నిచ్చును. వారిమాటలే నాకు ధనములమూటలు నా తండ్రులారా! జీవించియున్నపక్షమున మీరెంత దురపిల్లుచున్నారో? మీరెంత కష్టపడుచున్నారో? ఆ దురాత్ముఁడు మిమ్మె హింసలుపాలు చేయుచున్నాఁడో? జీవచ్ఛవమునయిన నన్నును బరలోకగతుఁడైన మీ తండ్రిని దలఁచి మీరెంత గుందుచున్నారో? మిమ్మతఁడు వధించియుండిన బలవన్మరణ సమయమున మీరెంత సంక్షోభించిరో అయ్యో! తనయులారా! పలుకరేమి? నన్ను కౌగలింపరేమి! నాకథ

మొసఁగ రేమి? హర్షవర్ధనా! హర్షము వర్ధిల్ల జేయవేమి? అయ్యో! హర్షముగాఁగ—బాష్పవర్షము వర్ధిల్లఁజేయుచున్నావు. విక్రమసేనా, రావేమి? నాయక్క అదీర్ఘవేమి? హా! హేమచంద్రభూపాల! నీబిడ్డల గతి యెట్లయినదో చూడుము'' అని విలపించుచు నూటిమాటికి మూర్ఛిల్లుచుఁ జిత్రభానుని దెగడుచు విధిని దూరుచుఁ దనయదృష్ట మును నిందించుకొనుచుఁ గొడుకుల సుగుణంబుల నుగ్గడించుచు సౌందర్యంబుల వర్ణించుచు మూర్తీభవించిన శోకదేవతవలెనుండెను. ఆదినము మొదలుకొని యామెయన్నము ముట్టదయ్యె. నిదురవోవ దయ్యె. నర్మద యాత్మహత్యచేసికొనకుండ నామెను బలుతెఱంగులఁ గాపాడుచుండెను.

అట్లయిదాఱు దినములు గడచినపిదప నొకనాఁటినడిరేయి రక్షకభటులు సమ్మదయుఁ దద్దయు నిద్దురందగిలియుండ నరవిందాదేవి చప్పుడుగాకుండ గడియలుదీసి తలుపులు తెఱచి మెల్లమెల్లగ నావల కుం జనియెను. తెల్లవాఱువఱకు నర్మదకు మెలఁకువరాలేదు. మెలకువ వచ్చినయనంతర మామె దేవింగానక మనంబుకలఁతజెంద నా గృహము నాలుగుప్రకల వెదకి కావలివాండ్ర కావార్త నెఱిఁగించెను. వారుం జుట్టుప్రక్కల కొండలు గుహలు వనములు వెదకి తమ కామె యెందుంగానఁబడలేదని చెప్పిరి. నర్మద రాణియవస్థకుఁ దన యేకాకిత్వమునకు బిట్టువగచుచుఁ దన్నావలకుఁ బోనిమ్మని కావలి వాండ్రను వేడుకొనెను. రాజు సెలవులేక యట్లుచేయుటకు వీలులేదని వారు చెప్పిరి. దేవి మతిచెడి తమ్ము బేలుపుచ్చి యర్ధరాత్రమున నెందో యరిగినదని యంగరక్షకులనాయకుఁడు చిత్రభానునకుఁ దెలుపు మని సేవకులనంపెను.

''నర్మదను వినువవలదని-యా వారందఱక్కడనే యుండవలసిన దనియుఁ జిత్రభానుఁడు మరల వారికుత్తరువులంపెను. పదిదినములు

గడచినపిదప నొకనాఁ డొకచెంచు దేవి తప్పిపోయినదని చెప్పుకొను చున్నయంగరక్షకులతో నిట్లనియె. "అయ్యా! ఇక్కడికినాలుగుక్రోసుల దూరమున నొకగొప్పవాఁగున్నది. నేను వేఁటకుఁ బోయినప్పు డందులో నొకయాఁడుదాని శవము గనఁబడినది. మొగము చేఁపలు తినివేయుటచే నానవాలు తెలియలేదు. వ్రేళ్ళుగూడ చేఁపలు కొఱికి వైచినవి. విగ్రహము చక్కనిది. అది రాణిగారి శవము కావచ్చును. మీఁద మీచిత్తము." అని వాఁడెఱిఁగింప నాబంటులు బద్ధకించి 'ఇప్పుడు శవమును జూడనేల? పోయినదెట్లోపోయినది" యని యూరకుండిరి.

అవస్థలు తప్పినప్పు డెంతవారయినను దమబంటులకుఁ గూడ జులకనయ్యగుదురుకదా!

ఇరువదిరెండవ ప్రకరణము

హేమచంద్రుని కుటుంబమును రాజధానికిఁ బాపి కొండలవాలు గుట్టలపాలుచేసి చిత్రభానుఁడు తాను మునుపునివాసముచేయుచుండిన గృహమువిడిచి కోటలోఁ బ్రవేశించెను. పేరునకు విక్రమసేనుఁడే రాజనిచెప్పు చున్నను నిజముగా. జిత్రభానుఁడే కాశ్మీరదేశ మహారాజై రాజ్యవ్యాపారములుయథేచ్ఛముగా,నిరంకుశముగానిర్భయముగాఁ జక్కఁబెట్టుచుండెను. అంతదనుక జిత్రభానుని యింటఁ దాఁగియుండి ప్రజలకుఁదనమోముఁ జూపక సంశయించుచుండిన రుద్రభట్టు చిత్రభానుని మంత్రియై సకలకార్యములయం దతని కుపద్రష్టయై కొలువుకూటమున నాతనిప్రక్కం జేరి కూర్చుండి సభాసదుల యు, రాయబారులయు మన్ననలువడయుచుండెను. అతని మొగము

కంఠధ్వని బాహువులతీరు, కన్నులపొంకము మున్ను గుహలో హేమ
చంద్రుని బేలుపుచ్చిన హరిశర్మ మొగమువలె నున్నదని పోలికల
వలనఁ గొందఱు గ్రహించి యిట్లుండుటకుఁ గారణమేమని యడుగఁ
దలపెట్టిరిగాని చిత్రభానున కందువలనఁ గోపము వచ్చునేమోయని
శంకించి యూరకుండిరి. విక్రమసేనహర్షవర్ధను లెందున్నవారని
యెట్లున్నవారని యెవ్వరో నెప్పుడేనడుగ వారు మాతృసమేతముగా
హిమవత్పర్వతప్రాంతములందలి కొండకోటలో సుఖముగా నున్నా
రనియుఁ బ్రకృతిసౌందర్యము వారిని సమాకర్షించుటచే నచ్చోటు
విడిచి రాఁజాలకున్నారనియు నెప్పటివార్తలప్పుడు తెలియుచున్న
వనియు నతఁడు చెప్పుచుండెను. అమ్మాటలువిని బంధుగులును
ముఖ్యముగఁ గర్పూరమంజరియు నమ్మి వారి కేయపాయము లేదని
భావించుచుండిరి.

ఇట్లుండ నొకనాఁడు వేగులవాండ్రు చిత్రభానునికడకు వచ్చి
వానితో నిట్లు విన్నవించిరి. "దేవా! మాధవసేనుఁడు పురికొల్ప
మాళవరాజసైన్యములు మనపై దండు విడియుచున్నవి. ఆసేనను
వారి సేనానాయకుఁ డగు కంఠీరవదేవుఁడు మొనగాఁడై నడుపు
చున్నాఁడు. మాళవరాజనందనుఁ డగు మకరందుఁడు మీతోఁ
బోరుటకు స్వయముగా నరుదెంచుచున్నాఁడు. ఇరువదివేలు కాల్బలము,
ఐదువేలాశ్వికులు నేనూరుమహాగజములు వారివెంటవచ్చుచున్నవి.
అవిగాక వేనవేలు శిబిరానుచరులు, బహుసహస్రములు పశువులు,
పశువులకు గడ్డిసైనికుల భోజనపదార్థములు మితిమీరి యున్నవి. వా
రుజ్జయినీపురము బయలుదేరఁగానే దేవరవారి కీవృత్తాంతము దెలియ
జేయ మిక్కిలి వేగముగా వచ్చితిమి. మీఁద దేవరచిత్తము."

అనవుడు చిత్రభానుఁడు త్రుళ్ళిపడి "ఆలాగా! మనమింక
జాగరూకతమై నుండవలయు."నని వారిం బనిచి దండపాణిని వజ్ర

పాలని తక్కిన చమూపతులను బిలువనంపి చారులు తనకు విన్నవించిన వృత్తాంతమంతయు వారికెఱింగించి సమరసన్నాహము చేయింపుమని యానతిచ్చెను.

వెంటనే సేనాపతులు క్రొత్తసైనికులం జేర్చుకొని వారికి విలువిద్దియ నేర్పి సాంగ్రామికశాస్త్రమునం బరిచితులం జేసిరి. కోట బురుజులు దృఢతరంబుగం జేసిరి. అగడ్తనిండ నీ రెక్కించిరి. కోటలలో రెండేండ్లు పగతురు ముట్టడించినను సైనికులు చిక్కుపడకుండునట్లు సంభారముల నిలువం జేయం జొచ్చిరి. ప్రతికోటయందు ముఖ్యముగా శ్రీనగరికోటయందు శస్త్రచికిత్సకులను నియమించి వారికిం గావలసిన పరికరముల సమకూర్చిరి. ముప్పదివేల కాల్బలము, పదివేల యాశ్వికబలము సహస్రగజబలము నచిరకాలములో సిద్ధమయ్యెను.

చిత్రభానుఁడు తన యాప్తసేవకుఁడైన కరటకునిం బిలిచి యిట్లు చెప్పెను. "ఓరీ! విదర్భరాజసైన్యములు మాకుఁ దోఁడుపడుటకు బైలుదేరునని చారులు విన్నవించిరి. నీవు మధ్యమార్గమున వారింగలిసికొని వారు కాశ్మీరమునకు వచ్చుటకు మాఱుగా మన పక్షమున మాళవదేశముమీఁద దండువిడిసి యాదేశమును స్వాధీనముచేసికొని సుదర్శనుని సింహాసనభ్రష్టునిఁ జేయవలయునని చెప్పవలయు. ఇవిగో నాముద్రవైచిన జాబులు. జయంతునకు నుగ్రసేనునకు నేనిచ్చుచున్నాఁడ. వీనిం గొంపోయి వారికిఁ జూపుము. ఇప్పుడు మాళవదేశమును జయించుట మిక్కిలి సులభము. ఏలయన వారిసేన యంతయు మనమీఁదికి వచ్చుచున్నది. ఉజ్జయినిలో నిప్పుడు దళము స్వల్పముగా నుండును. అందుచే నారాజ్యమవలీలగా మన వారిచేతఁ బడును. నేఁ జెప్పిన మాటలేగాక నీవును నీబుద్ధికిం దోఁచినట్లు సమయోచితములగు మాటలు చెప్పి మనపై గత్తికట్టినందుకు మాళవరాజునకు బుద్ధివచ్చునట్లు చేయుము. సుదర్శనుఁడు స్వయంకృతాపరాధఫల మనుభవించుఁ గాక!

మిక్కిలి వేగముగా నడచు నొంటెపై నెక్కి పదుగురాశ్వికులం దోచు కొని బేహారివేషముననీవుపొమ్ము. నీ విదివఱకు మాతోఁబడిన కష్టములకు నీకు మేము కాశ్మీరమునందో, మాళవదేశమునందో, నీవు కోరుకొన్నచోట నాలుగుమూఁ డగ్రహారము లియ్యఁదలఁచు కొన్నాము. నీవును, బింగళుఁడును నాకు రెండుకన్నులై, రెండు చేతులై, రెండుకాళ్లై, యుపచరించుటం జేసి నా ప్రయత్నములు ఫలోన్ముఖము లయినవి." అని పలుక కరటకుఁడు "స్వామీ! మా వలన నేమున్నది? దేవరవారియాజ్ఞాబలమే మాచేత నన్నిపనులు చేయించినది. అల్లే పోయివచ్చెద" నని వీడ్కొని మఱునాఁడు పయనమై పోయెను.

మకరందుఁడు మహాసేనాసమేతుఁడై యమాత్యనందనుఁడగు భద్రసేనుఁడు తనకు సహకారియై మనోరంజనము సేయుచుండ. చండశాసనుఁడగు కంఠీరవదేవుఁడు సేవలు నడుప మహాసన్నాహముతో నుజ్జయిని వెడలి కర్పూరమంజరీ సమాగమాభిలాష తన్నుఁ ద్వరపెట్ట నిరంతర ప్రయాణంబులు సేయుచుండెను.

చిత్రభానుఁడును సంగ్రామసన్నాహములఁ జేయుచు నొక నాఁటిరేయి రుద్రభట్టుంగూడి కార్యాలోచనము సేయుచు దండపాణిం బిలువనంపెను. అప్పుడు రెండుజాములు రాత్రియయ్యె. దండపాణి కోఁటజొచ్చి రుద్రభట్టసమేతుఁడైయున్న చిత్రభానుం జూచి పిలువనంపిన కారణమేమని యడిగెను. చిత్రభానుఁడు కొంచెముసేపు సందేహించి "శంకింపక చెప్పవయ్యా! దండపాణి మనవాఁడే" యని రుద్రభట్టు పురికొల్ప మెల్లమెల్లగ నిట్లనియె.

"మిత్రుఁడా! నీసాయమున స్వర్గతుల్యమగు కాశ్మీరదేశము నేఁడు నాపాదాక్రాంతమై యున్నది. నీతోడ్పాటువలన నే నిప్పుడు రాజమహేంద్రుఁడ నగుటకు సిద్ధముగ నున్నాఁడను. ఇప్పుడు నే

నింకను గాశ్మీరరాజును గాలేదు. ఆ కొఱంతగూడ నీవే తీర్పవలయు. రాజ్యవ్యాపారమంతయు నేను జక్కఁబెట్టుచున్నను రాజు విక్రమసేనుఁడే గదా? నేను వానిసేవకుఁడనే గదా? నాణెములపయి వాని పేరు. వానిరూపము. ముద్రింపవలయుఁ గదా? రాయబారులతో వానిప్రతినిధి నని మాటలాడవలయుఁ గాని 'యహం మస్మి' యని స్వతంత్రముగ నేను బలుకుటకు వీలులేదు గదా? ఈనైచ్యము నా కెంత మాత్రము సమ్మతముగ లేదు. నన్నీ బంధమునుండి తొలఁగింప వలసినవాఁడవునీవు. నీకన్నసమర్థులు లేరు." అని రెండియుఁ బలుకఁ బోవుచుండ దండపాణి వానిమాట కడ్డముపోయి "ఇందు నేఁ జేయ వలసినదేమున్నది? మీరు రాజైతిరిగదా! పట్టాభిషేకము జేయు మన్న మేము జేసెదము. అట్లు చేయుమని సెలవా?" యని యడిగెను.

అడుగుటయుఁ జిత్రభానుఁ డిట్లనియె. "మిత్రుఁడా! రెండు ప్రక్కల రెండు బల్లెములట్లు విక్రమసేన హర్షవర్ధనులు జీవించి యుండ నేను పట్టాభిషేక మెట్లు చేసి కొందును? నేను రాజు నెట్లగుదును? రాజ్యము నిష్కంటకమయిన తరువాతఁ గదా నేను గద్దెనెక్కుట. ఆ రెండుముండ్లు పెఱికివైచిన తరువాత సుఖముగా నేను గద్దె మీఁదఁ గూర్చుండెద. అప్పుడు పట్టాభిషేకము జేసికొని యెద."

"అట్లయిన నిప్పుడేమిచేయవలయు?" నని దండపాణి యాత్రముతో నడిగెను. "ఏమిచేయవలయునో యెఱుఁగవా?" యని చిఱునవ్వునవ్వి చిత్రభానుఁడు రుద్రభట్టుమొగము జూచెను. రుద్రభట్టు దండపాణిమీఁద జేయివైచి 'కర్తవ్యము నీకు మేము దెలుపవలయునా? ఆ గాచబుడుతల నిద్దఱ నీవు కడతేర్చితివా మనయెత్తికోలు తుదనెగ్గును. ఇది నీచేతిలోని పని" యని పలికెను.

అప్పలుకులు దండపాణి శ్రోత్రములకు మిక్కిలి దారుణమ్ములై వినంబడెను. అతఁ డదరిపడెను. గుండె జల్లుమనెను. "అయ్యో! రాజకుమారులం గడ తేర్చుటా? అబ్బబ్బ! అది నా కిష్టము లేదు. ఆపని నేను చేయుటా? హరిహరీ! ఎంతమాట? ఆపలుకులు నాతోఁ జెప్పకుఁడు. రాజ్యవిహీనులై వా రేకొండకోటలలోనో వారితల్లి కడుపుచల్లగా- హేమచంద్రుని పేరుగా బ్రతికి యుండవలయును గాని, యిట్టిదుర్దశపాలు గాఁగూడదని నాయభిప్రాయము. ఛీఛీ! ఈపాపమునకు నే నొడిగట్టఁజాల. ఇది చేయఁజాలను, వినజాలను." అని భయకంపితుఁడై పలికెను.

అతనివాలకము జూచి చిత్రభానుఁడు ముసిముసినవ్వులు నవ్వి యిట్లనియె. "దండపాణీ! నీవు నీపేరునకుఁ దగినట్లు యమధర్మరాజు వలె నిర్దయుఁడ వనుకొంటినిగాని యింత దుర్బలహృదయుఁడవని నే ననుకొనలేదు. భయపడకు. ధైర్యముదెచ్చుకో! సేనాపతులు యమ ధర్మరాజట్లు- మృత్యుదేవత యట్లు- జాలిలేక యుండవలయు."

"అయ్యో! వారు నా కేమపకారము చేసిరని వారిని నేను గడ తేర్చుదును? చందమామకు వన్నెలు దిద్దుఁ ట్టి యూ ముద్దుమొగ ములు జూచిన వారి నెవ్వఁడు హింసింపఁ జేతులు చాఁపఁగలఁడు? వారిని జంప నెవరిమన సొప్పును? అందు విక్రమసేనుఁడు వెనుక నన్నొకసారి బ్రదికించెను. నాకొడుకు నొకసారి బ్రతికించెను. రాజ భక్తి యుండవలదా? దానికేమి కృతజ్ఞతయుండవలదా? కృతజ్ఞత కేమి! మానవలక్షణమైన జాలియుండవలదా? అబ్బబ్బ! ఆమాట నాతోఁ జెప్పవద్దు. మనకు రాజ్యము స్వాధీనమైనది. వారిజోలి మన కెందుకు? వారిదారిని వారినుండనీ! వారు బిచ్చమెత్తుకొనినమైన బ్రతుకఁగలరు" అని దండపాణి స్పష్టముగాఁ బలికెను.

అది విని చిత్రభానుఁడు వెండియు వానిమనసు నొడంబఱుప నిట్లు వాక్రుచ్చెను- "దండపాణి! నీవు దప్పుదారిఁ బడుచున్నావు. రాజభక్తి యేమిటి? నీకు విక్రమసేనుఁడు రాజుగాఁడు. నేను రాజును నాయెడలనీవు భక్తిగలిగి నాశాసనము నీవు శిరసావహింపవలయును. కృతజ్ఞత యనునది యర్థములేనిమాట. అది తెలివితక్కువవాండ్ర నుడి. జాలియనునది భీరుజనలక్షణము. మనహృదయము లొకప్పుడు వజ్రకఠినములై యుండవలయు, నొకప్పుడు పుష్పసుకుమారములై యుండవలయు. రాజకార్యధురంధరులు-ముఖ్యముగా దండనాయకులు జగన్నిర్మూలన పరాయణుఁడగు రుద్రుఁడట్లు, జంతుజాలగ్రసన తత్పరమైన మృత్యుదేవతయట్లు జాలియనుమాట దఱిరాకుండ వర్తింపవలయు. ముద్దుమొగము లనుచుంటివి. మృత్యుదేవత యెంతెంతో ముద్దులమూటగట్టు చిన్నబిడ్డల నెందఱిఁ గబళించుట లేదు? దానికోఱలు జాలినెఱుఁగునా! వారు నాకేమపకారము చేసిరంటివి? అట్లయిన నీకెన్నఁడు నపకారము సేయని శత్రుసైనికుల వేలకొలఁది మందిని యుద్ధములో నిష్కారణము నీవేల చంపుచుంటివి? వారెన్నడైన నీకెగ్గులాచరించిరా? అపకారముచేయనీ, యుపకారము చేయనీ- పగతుఁడు పగతుఁడే. కావున వారి సౌందర్యము నీపనికడ్డము రాఁగూడదు. నీకృతజ్ఞత నీకార్యమున కంతరాయము గలిగింపఁగూడదు. రాజభక్తి నీమార్గము నిరోధింపఁగూడదు. కావున నక్కుమారుల నిద్దఱిఁ బరరాజకంఠలుంఠన మాచరించు నీవాఁడి కత్తికి నెఱఁ జేయవలయు."

అనుచుండ రుద్రభట్టంతలో నందుకొని వానినిట్లు హెచ్చరించె- "దండపాణీ! నీకించుక మరణతత్త్వ మెఱిఁగించెద వినుము! మరణము సకలజంతువులకు సహజము. ఎప్పుడో ప్రతిజంతువు చావక మానదు. మరణము విధినిర్ణయము. జంతువులం బలాత్కారముగఁ జంపున

ప్పుడు కర్త్రియెట్టినిమిత్తమాత్రమో చంపువాఁడునట్టి నిమిత్తమాత్రుఁడే. భగవానుఁడైన శ్రీకృష్ణుఁడు భగవద్గీతలో నీవలెనే కలుకుదనము విడిచి పిఱికితనముఁ బూనిన యర్జునున కేమియుపదేశించెను? నీవు శరీరమునేగాని యాత్మను హింసింపఁజాలవు. ఆత్మకుఁ జావులేదు. దానికి నాశములేదు. శరీర మాత్మతొడిగెడు యంగీ. నరుఁడు ప్రాఁత బట్టలవిడిచిక్రొత్తబట్టలఁగట్టుకొన్నట్లే, ప్రాతయిల్లువిడిచి క్రొత్తయింటఁ బ్రవేశించినట్లె, మునుపటిదేహమువిడిచి యాత్మ క్రొత్తదేహము స్వీకరించును. బ్రహ్మయీవిధముగా నాశిశువులకిద్దఱకు మరణమువిధించెను. విధినిర్ణయ మనతిక్రమణీయము. నీవుగాకున్న మఱియొకఁడైన వారిం జంపును. అకాలమరణము వారి మొగముల మూఁడుబంతుల వ్రాసియున్నాఁడు. అది నీవు తుడిచివేయఁజాలవు. ఈపనిచేసిన నీకు దోసములేదు. ఒకనిశిరస్సు ఖండింపుమన రాజానతిచ్చును. అట్లు ఖండించిన సేవకుని కేమైనపాపముగలదా? పాపముగాని, పుణ్యముగాని యది రాజుదే. అదియుఁగాక నే నేజంతువుచు జంపనని నీవు ముక్కుమూసికొని కూర్చుండఁగలవా! వేఁటాడి యెన్నిజంతువులం జావుచున్నావు? నీపొట్టనింపుకొనుటకై యెన్నిమొకముల నెన్నిపులుఁగుల హింసించుచున్నావు? ఎన్నినల్లులఁ జంపుచున్నావు? జలముద్రాగునప్పు డెన్ని కీటకముల నీవెఱుఁగక మ్రింగుచున్నావు? ఉచ్ఛ్వాసనిశ్వాసములలో వాయువుతోఁగలసి నీకంటికగపడని పరమాణుతుల్యములగు కీటకము లెన్నివేలు నీకడుపులోనికిఁ బోవుచున్నవో యెఱుఁగుదువా? అదియెల్ల హింసగాదా? హింసలేకుండ నీవుక్షణమయిన జీవింపఁగలవా? ఈవెఱ్ఱిమాటలు విద్వాంసులకడఁ గట్టిపెట్టుము. లోకములోఁ జంపువాఁడు లేఁడు. చంపఁబడువాఁడు లేఁడు. స్వలాభము నిమిత్తమై మనము పేలనుజంపినట్లు నల్లుల నలిపినట్లు—క్రూరమృగములఁ గూల్చినట్లు—మనకడ్డమువచ్చిన మానవుల నయితము దయాదాక్షిణ్యములేక సంహరింపవలయు.”

అనుచుండఁ జిత్రభానుఁ డడ్డమువచ్చి “మిత్రుఁడా! అన్నిటి కేమి? ఈవిషయమాలోచింపుము. విక్రమసేనహర్షవర్ధనులు బ్రతికి యుండిన నేఁడు మాళవరాజు వచ్చుచున్నట్లె మనపైఁగోపమువచ్చి నప్పుడు పరరాజులు వారినిగద్దెనెక్కించుటకై వచ్చుచునేయుందురు. వారున్నంతకాలము మనకీ యలజడియున్నదే. వారస్తమించినఁగాని మనకీశ్రమ యస్తమింపదు. అదిగాక యీరాజ్యము నాదియని నీవు తలంపకుము. నేనిప్పుడుగద్దెయెక్కినను వయస్సుమళ్ళినవాఁడనగుటచే నచిరకాలమున మృతినొందుదును. అటమీఁద రాజుగావలసినవాఁడు నీయల్లుఁడు విజయసేనుఁడు. ఆబాలకుల సంహరించుట నానిమిత్తము గాదు. నీయల్లునినిమిత్తము. నీకూఁతురునిమిత్తము. జాగ్రత్తగా నాలోచించుకో! మాళవసైన్యము రాకమునుపే మనమీపనిచేయ వలయును. వారి నీలోఁగడతేర్చితిమా మాళవసైన్యములుతమప్రయ త్నములు వ్యర్థమని మరలిపోవును. ముందువెనుక లాలోచించు కొనుము” అని కొంతయుత్సాహముతోఁ నచ్చఁ జెప్పెను.

రుద్రభట్టు చేసిన తత్త్వోపదేశము కొంతవఱకు దండపాణి మతము మార్చెను. పిమ్మట విజయసేనునిదే కాశ్మీరరాజ్యమని చిత్ర భానుఁడు వక్కాణించినతోడనే దండపాణిమనస్సు సంపూర్ణముగ మాఱెను. విక్రమసేన హర్షవర్ధనులు తనయల్లుని సింహాసనారోహణ మున కంతరాయము గలిగించునట్టి కంటకములని వానికిందోచెను. ఆత్మలాభపరాయణతవానిమనస్సులోనున్న కృతజ్ఞతను రాజభక్తిని జాలినిఁ ద్రోసివైచి యాస్థానము నాక్రమించెను. అతని హృదయ మప్పుడు ఱాయియైపోయెను. అప్పుడతఁడు “సరే! మీచిత్తమువచ్చి నట్లుచేసెద. ఏనాఁడు సేన మీవశము జేసితినో, యానాఁడేనాశరీరము గూడ మీవశముఁ జేసితిని. ఈచేతులు మీవి. వీనిచేత మీ యిచ్చ వచ్చినపని జేయించుకొనుఁడు.” అని యుత్తరమిచ్చెను.

అప్పుడు చిత్రభానుఁడు సంతసించి వానిం గౌఁగలించుకొని మిత్రుఁడనన్న నీవే మిత్రుఁడవని ప్రశంసించెను. దండపాణి వంటి మనుష్యుఁడు ప్రపంచమున మఱియొకఁడు లేఁడని, రుద్రభట్టుకొనియాడెను. అప్పుడు చిత్రభానుఁడు వెండియు నాతని కిట్లనియె—"నీవు రేపుదయమున నేపొమ్ము. అక్కడ శక్తివర్మ యున్నాఁడు. అతఁడు నీ కీ విషయమునఁ దప్పక తోడుపడును. వాఁడు మనకు విధేయుఁడు. కార్యశూరుఁడవయిన నీకు నేను వేఱ చెప్పనక్కఱలేదు. నీకు శుభమగుఁగాక! పొమ్ము.' అంతట రుద్రభట్టునకు నమస్కరించి చిత్రభానునికడ సెలవుగైకొని పోయెను.

ఇరువదియాఱవ ప్రకరణము.

దండపాణి వడిగాఁ బయనముచేసి రాజకుమారులు వసియించు కొండకోటకు మిక్కిలి సమీపమునను న్న యొకపల్లియఁ జేరి యందలి గ్రామాధికారియింట విడిసి తనరాక రాజపుత్రులకుఁ దెలియకుండ శక్తివర్మను బిలుచుకొనిరమ్మని యొక సేవకునంపెను. వాఁడును సత్వర మరిగి సేనాధిపతి సెలవయినదని రహస్యముగఁ దెలిపి శక్తివర్మం దోడ్కొనిపోయెను. దండపాణి వానిఁజూచి సముచితసత్కారములు జేసి పరిజనంబునంతను నావలకంపి వానితోఁ గదిలోనికిఁ బిలుచుకొనిపోయి చిత్రభానుని శాసనంబునఁ దాను గావింపఁదలఁచిన దారుణకర్మ మతనికెఱిఁగించి తనకుసాయము జేయుమనికోరెను.

ఆ నుడువులు చెవినిబడినతోడనే శక్తివర్మ భయంబును విస్మయంబును మనంబునఁ బెనఁగొన దండపాణికిట్లనియె. "అయ్యా! నీవు పిల్లలుగలవాఁడవు. నేనును బిడ్డలంగన్నవాఁడను. కటికవాఁడైన

జేయ వెఱచు నీ ఘోరకృత్యమును నీవు స్వయముగాఁ జేయ నెట్లు వచ్చితివో నే నూహింపఁజాలకున్నాను. మిక్కిలి యల్పపదవిలోనుండి మిక్కిలి యున్నతపదవికి నిన్నుఁ దీసికొనివచ్చి నీవృద్ధి కెల్లఁ గారణమయిన హేమచంద్రునిఁ దలఁచియైన నీపనిమానవచ్చునే బెబ్బులిబారినుండి నిన్నును జలగండమునుండి నీ కొడుకును బ్రతికించిన విక్రమసేనుని దలంచియైన నీ క్రూరకర్మము మానవచ్చునే? అనాథయై దిక్కుమాలి విలపించుచున్న యరవిందాదేవిని స్మరించియైన నీ పాపకర్మమునకుం దొలఁగగవచ్చునే. ముద్దులుమూటగట్టు నా బిడ్డల చక్కదనమును సౌకుమార్యమునుఁ జూచియయిన నీదుష్కార్యము విడువవచ్చునే! ఆ కుటుంబముతోఁ జిరకాలసంబంధముగలిగి వారివలన బాగుపడిననీకు ని ప్పనిసేయుటకు మన సెట్లులొప్పినయ్యా? నీ మనసొప్పిన నొప్పుఁ గాక! ఇట్టి దుష్కార్యమున నీకు నేఁదోడుపడఁజాల. నా యుద్యోగ మునుండి నన్ను రాజుతొలఁగించినను సరే—నాకు మరణదండన విధిం చినను సరే—నే నిప్పనియొల్ల. రాజకుమారి వధము జేసి యా నెత్తుటి కూఁడు దిని మనుటకంటె నాఁకలిచేఁ జచ్చుట మంచిది. చావలే కున్న బిచ్చమెత్తి బతుకుటమంచిది. గోచిపెట్టుకొని యడవిలో ముక్కుమూసికొని తపముసేయుట మంచిది. అంతెగాని యీపని నేఁ జేయఁజాల'' నని కూర్చున్నచోటునుండి చివాలున లేచినిలిచెను.

దండపాణియుఁ దనపీఠమునుండి లేచి శక్తివర్మ చేయిపట్టుకొని ''ఓయీ! నీమాటలఫలమేమో నీ వూహింపలేకున్నావు. రాజాజ్ఞా తిరస్కారము కోడెత్రాఁచుతోఁ జెరలాటమువంటిది. అదికత్తిమీఁది సాము. నిప్పులు కొంగునఁ గట్టుకొనుట. జాగ్రత! అతఁడలిగెనా నీ శిరచ్ఛేదముఁ జేయింపకమానఁడుసుమీ!'' యని బెదరించెను.

''ఇటువంటి సత్కార్యమున శిరస్సు పోయిననుమంచిదే. నీ బీ భీషికలకు నేను భయపడువాఁడనుగాను. ఈశ్వరేచ్ఛ యెట్లున్నదో

యట్లు జరుగుఁగాక!'' యని శక్తివర్మ యవ్వలకుఁబోయెను. పోయి యతఁడు తనకుఁ బ్రాణమిత్రుఁడు రక్షకభటులలో ముఖ్యుఁడునయిన చండుని బిలిచి తనకును దండపాణికింజరిగిన సంభాషణ మంతయు రహస్యముగ నెఱింగించి కర్తవ్యమేమని యతని యాలోచన నడిగెను. చండుఁడు శక్తివర్మవలెనే దుష్కార్య విముఖమయిన చిత్తవృత్తి గలవాఁ డగుటంజేసి యతఁడు చేసినపని ప్రశస్తముగా నున్నదని ప్రశంసించెను. "మిత్రుఁడా! నీవు మెచ్చుటంజేసి నాకెంతో ధైర్యము వచ్చినది. అట్లయిన మనకు రాఁదలఁచిన యపాయముఁ దప్పించుటకయి నాకొక యుపాయము దోఁచుచున్నది. అదివినుము" అని శక్తివర్మ చండునిచెవిలో రహస్యముగాఁ గొంతసేపు గుసగుస లాడెను.

అంతలో సాయంకాలమయ్యెను. కాలపురుషుని శరీరమందలి వ్రణమువలె సూర్యబింబమెఱ్ఱనై పశ్చిమాద్రిసంగమమునఁ గానఁబడియెను. ఆవ్రణమునుండి దొరఁగు క్రొన్నెత్తురోయన సంధ్యారాగము కట్టెఱ్ఱనై దెసలవ్యాపించెను. వ్రణబాధచేతఁ గాలపురుషుండు మూల్గుచున్నప్పుడు గల్గు ధ్వనియోయన గూఁడులఁ జేరఁబాఱు పులుఁగులమొలుఁగు లెసంగెను. నెత్తురు గడిగివైచి కాలపురుషుని పానుపుపైఁబఱచిన నల్లదుప్పటియో యనునట్లు కాఱుచీఁకటులు విశ్వమంతయు వ్యాపించెను. వ్రణసంబంధమయిన దుర్గంధము పోడమ కుండ నాపాన్పున వయిచిన హారతికర్పూరపుఁ బలుకులో యనునట్లు నభోభాగమున నక్షత్రములు విరాజిల్లెను.

విక్రమసేన హర్షవర్ధనులు సూర్యాస్తమయ మైనతోడనే పరమేశ్వరుని హృదయపీఠమున నునిచి ధ్యానముచేసి మాతృవియోగదుఃఖమున నన్నముసరిగా రుచింపకున్నను నేదోవిధముగా సేవకుల వేఁడికోలుచేఁ గొంచెముభుజించి పడకగదిఁ జేరి యేదో

యాలోచించుకొనుచు నొండొరులతోఁ బలుకక యూరకుండిరి. కొంతసేపటికి “తమ్ముఁడా! ఏమిటి నీవాలోచించుకొనుచున్నావు?” అని విక్రమసేనుఁడు హర్షవర్ధనునడిగెను.

“అన్నయ్యా! మఱేమియు లేదు. నిన్నరాత్రి మనయమ్మ కనఁబడినట్లు, నాచెక్కిలి నొక్కి ముద్దాడినట్లు, ఇంత చిక్కిపోయినా వేమి తండ్రీ యని నన్నడిగినట్లు నన్నుఁ జూచి కన్నీరు వెట్టుకొనినట్లు నేకలగంటిని. అందుచేత నేనుదయమునుండి విచారముగానున్నాను. బాష్పపూరితమయిన మనయమ్మ మొగము నాకిప్పుడుగూడ గనఁబడుచున్నది. అన్నయ్యా! ఇఁక మన మమ్మమొగ మెప్పుడుఁ జూడ లేముగదా? ఆమె యొడిలోఁ దలపెట్టుకొని పండుకొనుభాగ్యము కలుగదుకదా? నిండారుప్రేమతో నామె మనకుఁ బసిఁడిగిన్నెలోఁ బాయసము పెట్టించి యారగింపుమని బతిమాలు సుఖదినంబులు రావుగదా? ఆహా! అన్నయ్యా ఎన్నడు తల్లితోఁ గలిసియుంటిమో యెన్నఁడు సుఖపడితిమో యవన్నియు స్వప్న వృత్తాంతములే యయ్యెను.” అని బదులుచెప్పి వెక్కివెక్కి యేడ్చెను.

విక్రమసేనుఁడు తొట్రుపాటుతోఁ దన మంచముమీఁదినుండి లేచి తమ్మునికడకుఁ బోయి తమ్ముని మంచముమీఁద గూర్చుండి వెనుకప్రక్కనుండి రెండుచేతులుచాచి తమ్ముని గౌఁగిలించి “నాయనా! విచారింపకుము. కలిమిలేములు కావడికుండలు, ఐశ్వర్యమనుభవించి కష్టమువద్దన్నఁ బోవునా? సుఖదుఃఖములు దివారాత్రములు వలెఁ బర్యాయమున వచ్చుచుండును. వానిని వారించుట కెవరికిం దగము గాదు. ఇఁక నమ్మను జూచు భాగ్యము మనకుఁ గలుగదు. ఏమన భర్తృవియోగముచే నిదివఱకే యామె కృశించియున్నది. ఈపుత్ర శోకమున నామె యీపాటికే మృతినొందును. చిత్రభానుఁడు మనలఁ గూడ బ్రతుకనియ్యఁడు. ఏదో మాయోపాయమున మనలంగడతేర్చి సింహాసనమెక్కుటకై యతఁడు ప్రయత్నించుచుండును. అందుచే

మనకష్టములు చాలకాల ముండవు. బంధమునుండి గాకపోయినను దేహబంధమునుండి మన కచిరకాలములో విముక్తి కలుగును. అది యును మేలే. ఈజీవన్మరణముకన్న నిజమయిన మరణమే మనకు మహోపకారము గావచ్చును." అని విక్రమసేనుఁడు పలుకుచుండ నంతలో దండపాణి వీధిగుమ్మముకడకుఁ బోయెను. సింహద్వారము కడఁ జంద్రుఁడు శక్తివర్మయు నేదో మాటలాడుచుండిరి. దండపాణిం జూచి వారిరువురు లేచినిలిచిరి. "శక్తివర్మ! నీనిశ్చయము మాఱలేదు గదా?" యని యతఁ డడిగెను. "అయ్యా! మిమ్ము విడిచివచ్చినపిదప నేను ముందువెనుక లాలోచించుకొని నీకుఁ దోడ్పడుటకే నిశ్చయించు కొంటిని ఈవఱకు నాచేసినతప్పు క్షమింపుడు! ఈచంద్రుఁడుగూడ మనకు సాయపడును." అని శక్తివర్మ బదులుచెప్పెను.

"శహబాస్! మంచిపనిచేసితివి. రా నావెంటరా. తలుపు దీయుము." అని దండపాణి చెప్పెను. అప్పుడు శక్తివర్మ తాళముఁ దీసి తలుపు తెఱచెను. రక్షకభటులు లోపలిసేవకులు గాఢనిద్రం దగిలియుండిరి. చంద్రుఁడు శక్తివర్మ వెంటరా దండపాణి లోనఁబ్రవే శించి తలుపులుబిగించి "చంద్రుఁడా! ఈగృహావరణమున నీవొకగోయి త్రవ్వి సిద్ధముగానుంచుము. బాలుర నందు వెంటనే పూడ్చిపెట్టవల యును." అని యానతిచ్చెను. వాఁడట్లు కాకయని దొడ్డిలోని కరిగెను. తలుపు చప్పుడువిని "యిప్పు డిచ్చటి కెవ్వరు వచ్చుచుందు" రని వారు సంశయపడుచుండ మిణుకు మిణుకు మను దీపపు వెలుంగున నెవరో మనుష్యులు వచ్చుచున్నట్లు గానఁబడెను. "నేను దండపాణిని; ఇతఁడు శక్తివర్మ" అని కఠినస్వరముతో మాటవినబడెను. "ఓహో దండపాణియా? ఏమిది మామీఁద నింతదయ వచ్చినది? చిన్న నాయనగారు మాసేమమరసి రమ్మని మిమ్ముఁ బంపిరా? లేక కార్యాంతరములమీఁద నీప్రాంతములకువచ్చి పూర్వప్రేమచే మా కుశల మరయుటకు మీరే స్వయముగా వచ్చిరా? ఎట్లైననేమి మీ

రాకవలన మా కిప్పుడు పంచప్రాణములు లేచివచ్చినవి. ఎల్లచుట్టము లిం జూచినంత యానందము మా కిప్పుడు గలుగుచున్నది. ఓహో! ఇది యెంతసుదినము ? నేఁటి ప్రాతఃకాలమున మే మెవ్వరి మొగము జూచితిమో కాని మీదర్శన లాభము గలిగినది. రమ్ము! రమ్ము! ఈ పానుపుమీఁదఁ గూర్చుండుము. మాయమ్మ సుఖముగా నున్నదా ? మా వియోగదుఃఖమున మేనువిడిచినదా" యని విక్రమసేనుఁడు వానిని సబహుమానముగా గౌరవించి పలికెను. తల్లిక్షేమముగురించి యేమిచెప్పునో యని వినుటకై హర్షవర్ధనుఁడు మిక్కిలి తత్తరపడు చుండెను. అప్పుడు దండపాణి పరుషస్వరముతో "మీయమ్మ యెట్లు న్నదో నేనెఱుఁగను. ఎక్కడనున్నదో నేనెఱుఁగను. చిత్రభానుఁడు పంపుటచేత నే నిక్కడకు వచ్చితిని." అని బదులు చెప్పెను.

"ఆహా! మాచిననాయన దయార్ద్రహృదయుఁడై మమ్ము బంధ విముక్తులఁ జేయుమని నిన్నంపెనా? మాకు మేలుదినములు వచ్చినవా? కాని మాయమ్మ యెక్కడ నున్నదో నీవెఱుఁగవా ? మాతాత మహేంద్రదేవుఁ డామెను దీసికొనిపోయెనా ?" యని విక్రమసేనుఁడు కొంత సంతోషముతోను గొంత విచారముతోను బలికెను "ఆహా ! దేహబంధ విముక్తులఁ జేయుమని మీచిననాయన నన్ను బంపినాఁడు" అని తనలో ననుకొని దండపాణి బహిరంగముగా నిట్లనియె.

"కుమారులారా! నేను మీకిప్పుడు గొప్ప యప్రియము దెలుప వచ్చితిని. నేను మిక్కిలి మందభాగ్యుఁడను. ఘోరవార్త తెలుపుట ఘోరకృత్యముసేయుట నాపాలఁబడినది. ఇది రాజశాసనమగుటచేఁ జేయకతప్పదు. నేను చెప్పుట కెంతో శంకించుచున్నాను——" అన వుడు విక్రమసేనుఁడు చిన్నవోయి మెల్లగా "అయ్యా! మీరు చెప్పఁ దలఁచినది చెప్పవచ్చును. చేయఁదలంచినది చేయవచ్చును. మీ

కార్యము వలదనువారు లేరు. అడ్డగించువారు లేరు." అనిపలికెను. హర్షవర్ధనుఁడు నిశ్చేష్టుఁడై కూర్చుండెను. అంతట దండపాణికిని విక్రమసేన హర్షవర్ధనులకును నీక్రింది విధముగా సంభాషణజరిగెను.

దండ—కుమారులారా! యీరాత్రి మిమ్ముిద్దఱ సంహరింప వలసినదని చిత్రభానుఁడు నన్నుఁబంపె.

విక్ర—ఆఁ! ఆఁ! సంహరింపుమనియె పంపెనా?

హర్ష—అయ్యో! తల్లీ! (అని పాన్పుపై మూర్ఛపోయెను.)

విక్ర—అప్పని చేయనిశ్చయించి నీవువచ్చితివా?

దండ—ఆహా! నిశ్చయించుకొనియే వచ్చితిని. (అని యొఱ నుండి కత్తిదీసెను.)

విక్ర—ఈఘాతుకకృత్యము జేయ నీమనసొప్పినదా?

దండ—మనసొప్పిన నేమి, యొప్పకున్న నేమి? రాజాజ్ఞ చేయక తప్పదుగదా?

విక్ర—ఎవఁడు నీరాజు? నేను కానా?

దండ—చిత్రభానుఁడు మారాజు. నీవు కావు. నీవు కారా గృహవాసివి.

విక్ర—ఎవఁడు నన్ను కారాగృహవాసిని జేసినది? ఎవఁడు నన్ను రాజ్యభ్రష్టుఁజేసినవాఁడు?

దండ—నీపినతండ్రి చిత్రభానుఁడు.

విక్ర—అయ్యో! దండపాణీ! నీనోట నెటువంటి నిష్ఠురోక్తులు వినవలసివచ్చెను. నాతండ్రిమరణమునకుఁ గారణభూతుఁడయిన మా పినతండ్రిమాయలలోఁ బడి నీవు నీరాజుంజంపవచ్చితివా? చిన్నికుమా రులమనియైన సందియము లేదా నీకు? అగతికులమన్న మాట యయిన నీకు దోఁచలేదా? నీది హృదయము కాదా? నీవు మానవుఁడవు కావా? ఘాతుకమృగంబవా? దానవుఁడవా? ఘాతుకమృగములు సయితము

తమజాతిమృగముల జోలికిఁ బోవు. దానవులు వైరములేకుండఁ దమ తోడిదానవుఁ జుదముట్టింపరు. నీకును నాకు నెంతైన వైరమున్నదా? నిన్నెన్నడైన నే దూలనాడితినా? నీమనసు నొచ్చునట్టి పరుషోక్తు లాడితినా? నీకార్యములకు నే నాటంకము గల్పించితినా? ఏల నాపై నీకింత నిష్కారణక్రోధము? ఏల యింతనిర్దయ? నీహృదయము పుష్ప సుకుమారమయిన దే! ఇంతకఠినమెట్లయ్యెను. ఈ కాఠిన్యము మున్నె న్నడు నేఁ జూడలేదే? నామీఁద నీవు చూపెడు నాదయారస మెందుఁ బోయె? ఆ ప్రేమపూర్వకభాషణంబు లెందరిగె? అయ్యో! దండపాణీ! నీ వెంతలో నిట్లుమాఱితివి? నీహృదయము మాఱినను నా హృదయము నీదెస మాఱలేదు. నీవు నాకు వెనుకటి దండపాణివై యున్నావు. నాఁడు వేఁటలో బెబ్బులి గొబ్బున నీపైఁబడుచుండ విసవిస వెంట నమ్ముఁ దొడిగి నేను దానిఁ గూలనేసి నీప్రాణము రక్షించినప్పుడు నీపై నాకెట్టి ప్రేమగలదో నేఁడును నా కట్టిప్రేమయే కలదు. నేను మహారాజనందనుఁడనయ్యు-కడుసుకుమారుఁడనయ్యు-నత్తఱివిలువగల దువ్వలువలు దాల్చియున్నవాఁడనయ్యు-జెఱువులోఁబడి మున్కలు వేయుచుఁ బ్రాణములు గోల్పోవసిద్ధముగానున్న నీకొడుకును గాపా డుటకై చెఱువులో నుఱికిననాఁడు నీపై నాకెట్టి కూర్మిగలదో నేఁడు నట్టికూర్మియే గలదు. ఈహృదయము నీహృదయమువంటిది కాదు. కాకపోయినందుకు దీనిని దప్పకదండింపవలయు కావున నీచేతిలో దీపపువెలుగునఁ దళతళ మెఱయుచున్న నీఖడ్గపుఁగొనతో ముందుగా నాహృదయముం బొడిచి దాని నీవలకుఁ దీయుము. ఇదిగో! నా హస్తము. నాఁడు బెబ్బులిని నీనిమిత్తమై కోలం గూలనేసిన హస్త మిది. నీకఱకుగత్తితో నీచేతిని ముందుగా నఱకుము. నీకుమారుని నిమిత్తమై ముందువెనుక లాలోచింపకుండఁ జెఱువులోఁబడిన యీ శరీరమును నీవాఁడికత్తితోఁ దుత్తునియలు చేయుము. ఇదిగో! నా శరీరమును నీ కప్పగించుచున్నాను.

అంతలో నతనిచేతి కత్తి పిడివగ్గఱఁ జనుటపట్టుటం జేసి యా ఖడ్గము జారి క్రిందఁబడెను. అప్పుడు విక్రమసేనుఁడు మఱల సంభాషణ మందుకొని యిట్లనియె.

దండపాణీ! సంపూర్ణజ్ఞానముగలిగి, చైతన్యముగలిగి. యుక్తాయుక్తవివేకముగలిగి, ఘాతుకకృత్యము చేయఁదలఁచి వచ్చిన నీకన్న చైతన్యశూన్యమైన యీ కత్తియే మంచిదని తోఁచుచున్నది. ఈ దుష్కార్యము చేయఁజాలక కాఁబోలది క్రిందఁబడెను. అయినను నీవు చిత్రభానున కెట్లు వశవర్తివో యీకత్తియు నీకట్లు వశవర్తిని యగుటచే మా పినతండ్రి చెప్పినచొప్పున నీవు చేయఁదలఁచుకొనినట్లే, నీవు చేయుచున్న ట్లీకృపాణియుఁ జేయఁదలఁచుచున్నది. నా ప్రాణములమీఁద నా కంతయాస లేదు. ఈ కారాగృహవాసముకన్న స్వర్గలోకవాసమే నాకు సౌఖ్యప్రదము అచ్చట మా తండ్రి తొడపై నేఁ గూర్చుండెదను. మా పినతండ్రివలన భయము లేనిచోట దండపాణిఖడ్గమునకుఁ బ్రచారము లేనిచోట రాజద్రోహులు లేనిచోట ధనముకై యెట్టి ఘాతుకకృత్యమైనఁ జేయనొడంబడెడు నీచులు లేనిచోట నేను సుఖముగా నుండెద. కాని! యదిగో! నీయెట్టయెదుట నా మంచముపై మూర్ఛిల్లియున్న యాపసిపాపని నాగారాజుతమ్ముని హేమచంద్రుని రెండవపుత్రుని నరవిందాదేవి ముద్దులపట్టిని సకలజననయనానందకరుని నిందుచందమునకు వన్నెలుదిద్దఁగల మొగముగలవాని చక్కెరవిల్తునికలపించు చక్కఁదనమువాని నీవెన్నిసారులోఁ జిన్ననాఁట నెత్తికొని ముద్దులాడినవాని, మాహర్షవర్ధనుని బ్రతికింపుము. మాతండ్రి నిమిత్తమై యాతనిని జీవింపనిమ్ము. మహాశోకసముద్రమునను న్న మాతల్లి నిమిత్తమై యాతని బ్రతికియుండనిమ్ము. నా నిమిత్తమై యతనిని జీవింపనిమ్ము. హేమచంద్రునివంశము నిర్మూలము గాకుండ నీ మొలకకు నీదయారసముపోసి పెంచుము. ఈతఁడు

మీ చిత్రభానుని రాజ్యమున కడ్డురాఁడు. వానికి సన్న్యాసమిప్పించి వనాంతరముల కంపుము. ఇదిగో వానిని బ్రతికింపుమని చేతులు జోడించి నీపాదములకు మ్రొక్కుచున్నాను. నీవు బాసచేసితివేని నేను సుఖముగా శరీరము వాయుదును. నాకు నీకడఁగల చనవు పెంపున నీవరమిమ్మని నిన్ను వేఁడుకొనియెద."

దయనీయములయిన యాతని పలుకులు శక్తివర్మ హృదయమును గరగించి కన్నీరు స్రవింపఁజేసెను. కాని స్వలాభపరాయణతచే శిలీభూతమైన దండపాణి హృదయమును మాత్ర మవికసింప లేకపోయెను. "విక్రమసేనా! నీవేఁడికోలు నిష్ప్రయోజనము. చిత్రభానునియాన నేను సంపూర్ణముగాఁ జెల్లింపవచ్చితిని. మీయిరువు రంజంపి గాని నే నిచ్చోటు విడువ. నీతమ్ముని చావు నీవు చూడలేవు గావున ముందు నిన్నే వధించెద. నేను సగముపగముపనులు చేయు వాఁడనుగాను" అని దండపాణి ప్రత్యుత్తరమిచ్చుచుండ నంతలో హర్షవర్ధనుఁడు మూర్ఛదెలసి "అన్నయ్యా! అన్నయ్యా! బ్రతికియున్నావా! అన్నయ్యా! అన్నయ్యా! నన్నొకసారి కౌఁగలించుకొనుము," అని కోరెను.

విక్రమసేనుఁ డట్లుచేయుట కటుపోవుచుండ దండపాణి వాని నాఁపి "కౌఁగలింతలు గిఱుగిలింత లిప్పుడెందు" కని బిగ్గఱగాఁ బలికెను. అప్పుడు హర్షవర్ధనుఁడు మెల్లగాలేచి "దండపాణీ! మాయన్న నుజూడకుండ నే జీవింపఁజాలను. నాకీ బ్రతుకుమీఁద నేవ పుట్టినది. కావున నన్నుజంపి మాయన్నను బ్రతికింపుము. మాయన్న చాలమంచివాఁడు. చదువుకొన్నవాఁడు. నాకడపటిప్రార్థనమంగీకరించి వానిని జీవింపనిమ్ము. వానికి మీ రాజ్యమక్కఱలేదు. ఏ గాంధారదేశమున కయినఁ బోయి బ్రతుకు" నని కేలుమొగిచి మ్రొక్కెను. "ఓహో అన్నను బ్రతికింపుమని తమ్ముఁడు, తమ్ముని బ్రతికింపుమని యన్న

ప్రార్థనలు చేయనారంభించిరా! మీటక్కరితనములు నాకడ సాగి రావు మీ పంచాంగముఁ గట్టిపెట్టుఁడు" అని దండపాణి నిష్ఠురముగాఁ బలికి హర్షవర్ధనుని దనచేతితో నొకప్రక్కకు నెంటి "శక్తివర్మా! వీని నావలి కీడ్చుకొనిపో" అని యానతిచ్చెను. శక్తివర్మ యాబాలు నింబట్టుకొని ప్రక్కనున్న మఱియొక గదిలోనికిఁ దీసికొనిపోయి లోపలఁబెట్టి తలుపువైచెను.

"అయ్యా! అయ్యా దండపాణీ! అయ్యా! శక్తివర్మా! కడపటి సారి మాయన్నను గాఁగలించుకొననిండు కడపటిసారి మాయన్న ముఖారవిందముఁ జూడనిండు! చివరవఱకు కతనిసన్నిధినే నన్నుండ నిండు!" అని హర్షవర్ధనుఁడు మొఱపెట్టఁజొచ్చెను.

"దండపాణీ! దండపాణీ! ఒక్కనిమిషమాఁగుము. ఒక్కసారి నన్నావలిగదిలోనికిఁ బోనిమ్ము. ఒక్కసారి నాతమ్ముని నాలింగనము జేసికొననిమ్ము! ఒక్కసారి వానిని ముద్దాడనిమ్ము. అధమపక్షు మీ నరమయిన నాకు దయచేయుమయ్యా! నీకెంతో పుణ్యముండును." అని విక్రమసేనుఁడు ప్రార్థించెను.

"చాలుచాలు! నీకలాపము గట్టిపెట్టుము. పండుకొనుము. ఇప్పుడే ముందుగా నీశిరఃకర్తన మాచరించెద" నని దండపాణి పలుకుచుండ నంతలో గోయిత్రవ్వి చండుఁ డచ్చటికి వచ్చెను. "చండా! శక్తివర్మా! వీనిని నేల బడనయిచి కాలుసేతులు పట్టు కొనుఁడు" అని యాతఁ డానతిచ్చెను. "అయ్యా! నన్ను బలాత్కార ముగాఁ బండుకొనఁబెట్ట నక్కఱలేదు. నా కాలుసేతులు పట్టుకొన నక్కఱలేదు. నేనీసమయమునఁగూడ మీ కేవిధమయిన కష్టమును గలిగింపను. ఇదిగో! పండుకొనుచున్నాను." అని విక్రమసేనుఁడు నేలఁబండుకొని చేతులు జోడించి "నారాయణా! నారాయణా! నారాయణా!" యని హరినామస్మరణ చేయుచుండెను. దండపాణి

ఖడ్గమునెత్తి యేప్రక్కనుండి గొట్టిన నొక్కయేటున శ్రమలేకుండఁ దల తెగిపడునో యాప్రక్కను నిలిచి ఖడ్గ మెత్తెను. అంతలో శక్తివర్మ కనుసన్న సేయ వెంటనే చండుఁడు దండపాణిమెడలో నొక త్రాడు తగిలించి త్రాడుకొననున్న యుంగరములోనుండి రెంగవకొన పోనిచ్చి శక్తికొలఁది లాగెను.

ఇది తెప్పపాటుకాలమున జరిగెను. లాగినతోడనే చేతిలో నున్న కత్తి చేతిలోనుండఁగానే దండపాణి 'ఆ! ఆ!' యని మూల్గుచు గురక విడుచుచు వెనుకకుఁ బడెను. నిముసములో నతనిప్రాణము పోయెను. కన్నులు మూసికొని హరిధ్యానము సేయుచున్న విక్రమసేనుఁడు కన్నులు తెఱచి చూచునప్పటికి శక్తివర్మయుఁ జండుఁడును నేలఁబడియున్న దండపాణిని దలయొకరు, బాదములొకరుఁ బట్టుకొని యావలకుం గొనిపోవుచుండిరి.

అన్నయ్యా! అన్నయ్యా! యని యావలిగదిలోనుండి హర్షవర్ధనుని మొఱ లతని చెవిలోఁ బడుచుండెను. విక్రమసేనుఁడు లేచి కూర్చుండి భయవిస్మయసంభ్రమంబులు మితిమీఱి పరవశుని జేయ నేమిదియని యడుగఁజాలక గ్రుడ్లప్పగించి చూచుచుండెను. చండుఁడును శక్తివర్మయు దండపాణి కళేబరమును బాలురనిమిత్తము త్రవ్వియుంచిన గోతిలోఁ బడవయిచి పూడ్చిరి.

పరమేశ్వరుని లీల లెవ్వఁడు గ్రహింపఁగలఁడు! ఆత్మలాభపరాయణుఁడై యధర్మమనక యకార్యమనక ఘాతుకమృగములీల రాజనందనుల బ్రమందింపఁదలఁచివచ్చిన దండపాణి కృపాణినైన నెత్తకమునుపే యసువులుబాసి క్షణములో దండధరుని వీటికివిందయ్యెను. ఉత్తరక్షణము మనదిగాదని పెద్దలు చెప్పుమాట నిశ్చయముగదా! మానవుఁడు తనమనంబున నాకసంబున మేడలుగట్టి పదునాల్గులోకములఁ బాలింపఁ జూచుచుండును. దైవము వానిసంకల్పముల వికల్పములఁ జేయుచుండును.

అట్లు వారిరువురు దండపాణిని మహీగర్భమునఁబూడ్చి రాజ నందనుల కడకువచ్చి గదితలుపులుదీసి హర్షవర్ధను నీవలకుఁ దీసికొని వచ్చి "కుమారులారా! దండపాణి తానుత్రవ్వుకొన్న గోతిలోఁ దానే పడెను. ఆదురాత్ముని పాపమే యాతని జంపినది. మీ రింక రండు. మిమ్మీచెఱనుండి విడిపించి యావలకుఁ దోడుకొనిపోయెదము. మీరు మావలన నెట్టియపాయమును శంకింపకుఁడు. మేము రాజభక్తులము. మీపాదసేవకులము. చిత్రభానుని దుండగములు మేము సహింపఁ జాలక వానిచేఁ బ్రేరితుఁడై మిమ్ము వధింపవచ్చిన దండపాణిని దుద ముట్టించితిమి. మిమ్ముసురక్షితముగా గాంధారదేశమునకుంగొనిపోయె దము. మీకుఁదైవమున్నాఁడు. మనభాగ్యము సరిగా నుండునెడల భాగ్యవర్ధనుఁడు మీకుఁ దోడుపడవచ్చును. ఇచట నాలస్యముచేయు టకు వీలులేదు. రండు! సేవకులు మేలుకొనకమునుపే పోవుదము."

అనవుడు నక్కుమారులు "శక్తివర్మా! మీయిష్టము వచ్చి నట్లు చేయుఁడు" అని బదులుచెప్పిరి. అంతట శక్తివర్మయుఁ జండుఁ డును వారిచేతులు బట్టుకొని నిశ్శబ్దముగా నావలకుఁ దోడ్కొని పోయిరి. అప్పటికి రెండుజాముల రాత్రి యయ్యెను. సేవకులలో నెవ్వరు మేలుకొనలేదు! చప్పుడుగాకుండఁ దలుపు వయిచి వారు నలుగురు నా గాఢాంధకారమున బైలుదేఱి మెల్లమెల్లగా నడచి తెల్లవారు నప్పటి కొక యామడపోయి యొకపల్లియఁ జేరిరి. ప్రాతః కాలకృత్యము లచ్చటఁ దీర్చుకొన్నపిదప శక్తివర్మ చండుని బిలుచు కొనిపోయి రహస్యముగ నిట్లనియె—"రాకొమరులు దండపాణియు, నీవును నేనును హఠాత్తుగా నదృశ్యుల మయితిమని కావలివాండ్రు నేఁటియుదయమునఁ దెలిసికొని భయంపడి వడివడిగాఁబోయి చిత్ర భానున కెఱిఁగింతురు. దండపాణి బిడ్డలంజంపక తన్ను వంచించెనేమో యని శంకించి యారాజు బిడ్డలను మనలను వెదకుటకై నలుదెసలకు

సేవల నంపును. అతఁ డావలించినవారి ప్రేవులెంచును. మనము పట్టుబడితిమా భంగము వాటిల్లు. కావున నీవు చిత్రభానుని కడకుఁ బోయి యాతనిం దప్పుదారిం బెట్టుము. ఈవిధముగా నలనితోఁ జెప్పుము." అని యాతని చెవిలో నొక రహస్యము జెప్పి పొమ్మని యెను. చండుఁడును నతని యుపదేశము మాచి దేయని రాజసుతులం జూచి "తక్షశిలలో నేను వెండియు గలిసికొనియెద. మీ రక్కడ నుండుఁడు" అని చెప్పి వారిని వీడ్కొనిపోయెను.

విక్రమసేనుఁడు చండశక్తివర్మలకుఁ దన కృతజ్ఞతం దెలిపి ముందు జేయవలసినపని యేమని శక్తివర్మ నడిగెను. "గాంధార దేశమున కరిగి భాగ్యవర్ధనుని సాహాయ్య మడుగుట సమంజస" మని యతఁ డుత్తరముజెప్పి వారి నందు కొడంబఱచి దారిబత్తెము నిమిత్తము విక్రమసేనుని మేనిమీఁదనున్న యాభరణంబులలో నొక దానిని విక్రయించి రొక్కము చేఁబూని వారి యన్నపానాదులకుఁ గఱవు లేకుండఁజేసి మార్గాయాసము లేకుండ బండ్లమీఁద నెక్కించి వారి మనఃఖేదములు బాపుటకు వినోదములైన కథలు జెప్పుచు గ్రామీణుల చిత్ర చిత్రములయిన యాచార వ్యవహారములం జూపుచుఁ బయనము చేయించుచుండెను.

కొండకోటకడఁ గావలియున్న సైనికులు వంటవాండ్రు మొదలగు పరిచారకులు బాలకులను చండశక్తివర్మలం గానక యేదో మోసము జరిగినదని చండశాసనుఁడగు చిత్రభానుని యలుకకు భయపడి తమలో నొక పెద్దంబిలిచి యవ్వార్తరాజునకు విన్నవింపఁబనిచిరి.

ఇరువదియేడవ ప్రకరణము.

"ఈపాటికి దండపాణి గ్రామదేవతకు మేకపోతును బలి యిచ్చిన చందమున నాదారిలో ముండ్లవలె నున్న యాడింభకుల నిరువుర నఱికియుండును. బ్రతికియున్నప్పుడువలెనే యాకుఱ్ఱలిరువురు నొండొరుల కేలుపట్టి యమునియింటికిఁ జని యీపాటికిఁ బ్రాంత కాఁపులయి యుందురు. ఉయ్యాలలో నిద్రపోయినట్లు వారీపాటికి గోతిలోఁ బెద్దనిద్దురపోవుచుందురు. ఇప్పుడో రేపో మాపో యాశుభ వార్త నాకు రాకమానదు. ఇంక వారితల్లింగూడ దెగటార్చినంగాని నావ్రతము సమాప్తముగాదు." అని చిత్రభానుఁ డొకనాఁడు తన లోఁదాను వితర్కించుకొనుచుండ నంతలో ద్వారపాలకుఁడు "దేవా! దండపాణికడనుండి మనచంఁడుఁడు వచ్చియున్నాఁ"డని విన్నవించెను. సత్వరమ ప్రవేశపెట్టుమని యతఁడాజ్ఞ నొసఁగఁ జండుఁడు ద్వారపాలక ప్రేరితుఁడై రాజదర్శనముజేసెను. చిత్రభానుడు వానిసేమ మడిగి దండపాణి పంపిన సందేశమేమని యడుగ నతఁడు వినయంబున నిట్లనియె.

"దేవా! దండపాణి విజ్ఞాపన మిది—స్వామీ! దేవరవారి యాజ్ఞానుసారముగ నేను సురక్షితముగా మంచుకొండకుఁ బడమటి ప్రక్కనున్న మనకొండకోటఁ జేరి, చండశక్తివర్మలసాయమున నిరువురబాలకుల నాకత్తికెఱజేసి, లోభిధనమునునిక్షేపించినట్లు వారిం గోతిలోఁ బెట్టి పూడ్చి కృతకృత్యుఁడనై దేవరవారి యనుగ్రహము నకుం బాత్రమునయితిని. స్వామికార్య నిర్వహణప్రవీణుఁడ నగుటచే నేనుజరితార్థుఁడనయితిని. కాని పితృహీనులయి యగతికులయినబాల కుల నిష్కారణముగా వధించుటంజేసి నామనస్సు మిక్కిలి దుఃఖపడ

వశమై యున్నది. ఈమహాపాతకము బాపుకొనుటకు నేనును, శక్తి
వర్మయుఁ దీర్థయాత్రలు సలుపవలెనని సంకల్పించుకొంటిమి. ఈమహా
దోషపంకమును జగత్త్రయపావనకరమగు భాగీరథీజలమె కడుగ
వలయు. బదరీనారాయణ సందర్శనమే మాయాత్మలకుఁ బ్రశాంతి
నొసఁగవలయు. కురుక్షేత్రనివాసమే మాచిత్తసంక్షోభంబు మాన్పవ
లయు. సరయూనదీ జలపానమే మాహృదయములను జల్లపఱుప
వలయు. కావున నీమహాక్షేత్రముల కరిగి మేము పావనులమగుటకు
దేవరవారు సెలవియ్యవలయునని ప్రార్థించుచున్నాము. మాళవరాజ్య
సైన్యములు మత్ప్రాంతముల వచ్చి విడియునప్పటికి మేము వెండియు
దేవరవారిదర్శనముజేసి వారితో సమరంబు గావించెదము. నేనెప్పుడు
మీకువిధేయుఁడైన బంటనే కావున నన్ను మన్నింపవలయు' నని
మహాప్రభూ! దేవరవారితో సేనాపతి మనవిసేయుమనియె''

అప్పలుకులు విని చిత్రభానుఁడు తాననుకొన్నట్లు రాజనంద
నుల దండపాణిప్రమందింపఁజేసనందుకు మిక్కిలి సంతసిల్లి ''చండుఁడా!
దండపాణి ఛాందసుఁడు రాచపుట్టుకఁ పుట్టినవాఁడు రుద్రుండునుం
బోలె మానవసంహారంబు సేయుచుండు. అందుచే ననుదినము విచా
రించుచుని యుండవలయు. ఇంతమాత్రమున కతఁడు పశ్చాత్తప్తుఁ
డై తీర్థయాత్రలు చేయవలయునా? ఎట్లో యతఁడు మనశ్శాంతి
గావించుకొనుఁగాక!'' యని యాదారుణ కృత్యమునకుఁ దోడ్పడి
నందు కతఁడు చండున కొకప్రశస్తమైన ముత్యాల సరమొకటి పారి
తోషికముగా నిచ్చెను. ఆపసదనంబు గైకొని చండుఁడు తనకృతజ్ఞ
తం దెలిపి చేతులు జోడించి తనకుఁగూడ తీర్థయాత్రలు సేయఁగుతూ
హలము గలదని విన్నవించి శక్తివర్మ దండపాణులం గలసికొనుటకు
సెలవిమ్మని ప్రార్థించెను. అట్లకాక యనినృపతి యానతియ్య నతఁడు

యుధేన్ద్రుం జని నిరంతరప్రయాణంబుల రాజపుత్ర సమేతుండయిన శక్తివర్మం గలిసికొని తనకును జిత్రభానునకును జరిగిన సంభాషణ మంతయుం జెప్పి వారల సంతసింపఁజేసెను. వారు నలుగురు క్రమ క్రమంబుగా నడిచి కాశ్మీర గాంధార దేశముల సరిహద్దుం జేసిరి.

ఇకఁ జిత్రభానుఁడు మఱునాఁ డుదయమునఁ దనప్రియ సేవకు నొక్కనిఁ బిలిచి వానిచెవిలో నేదో రహస్య ముపదేశించెను. అది విని వాఁడు తనపనిమీఁద బోయెను. ఆ సాయంకాలమునఁ గొండ కోటకడనున్న రక్షకభటులలోఁ బెద్దవచ్చి "రాజపుత్రులు, దండ పాణియు, జండశక్తివర్మలు నకస్మికముగ నదృశ్యులయి" రని చిత్ర భానునితో విన్నవించిరి. అదివిని చిత్రభానుఁడు "తద్విషయమై మే మరసెదము. మీ రక్కడ గావలియుండ నక్కఱ లేదు. సత్వరమరం" డని యానతిచ్చి వానిం బంపెను. రాత్రి జాముగునప్పటికి వగర్చుకొనుచు నొక సేవకుఁడు పరుగు పరుగునవచ్చి తక్షణమే రాజదర్శనము కావలెనని కోరెను. ద్వార పాలకులు వానిరాక పరపాలునకెఱిఁగించి వారిసెలవుగైకొని యా లెంకను లోనికంపెను. అప్పుడు వాఁడు చిత్రభానునకు సాగిలఁబడి మ్రొక్కి వెక్కివెక్కి యేడ్వనారంభించెను. చిత్రభానుఁడు తొట్రుపడి నట్లభినయించి కారణమడిగెను. ఇంటిలోని సేవకులు కంచుజనము, చుట్టు ప్రక్కలఁజేరి యక్కజపడి చూచుచుండిరి. అప్పుడా సేవకుఁడు వాని తో నిట్లు విన్నవించెను.—"స్వామీ! ఏమనివిన్నవింతును? విక్రమ సేనహర్షవర్ధనులు శక్తివర్మతోఁగలిసి కొండకోటనుండి బైలుదేఱి సింగముల వేఁటాడుటకై పరిసరారణ్యముల కరిగిరి. ఒక యాఁడుసింగము రెండుమగసింగములు నొకపొదలో నప్పుడే చంపి తెచ్చిన యొక యొస్తు ను భక్షించుచుండెను. ఆమహావీరులుసుప్పురు విండ్లనారితొడిగి తీ

బాణంబును సంధించి మూఁడుసింగంబులపై మూఁడుబాణంబుల నేసిరి. ఎఱమీఁదనున్న వేమో యాసింగములు ప్రళయకాలరుద్రుఁ డట్లు మహాక్రోధపరవశములై తమపైఁబడినబాణము లెంత వేగమున బోయెనో యంత వేగమున వచ్చి ముద్వురపైబడి తక్షణ మా ముగ్వు రం గడతేర్చెను. శక్తివర్మ కేమికాని మహాప్రభో! రాజకుమారులు పోయినందుకు నేను మిక్కిలి విచారించుచున్నాను. ఇంతకు దైవ నిర్ణయ మిట్లున్నది" యని మరల నేడ్వఁజొచ్చెను.

అవ్వచనంబులు కర్ణంబులసోఁకుటయు "హా! కుమారులారా" యని యతఁడు మూర్ఛిల్లెను. సేవకులందఱు మిక్కిలి కలఁతనొంది హాహాకారములు చేసిరి. ఇందుమణియుఁ గర్పూరమంజరియు లోపలి నుండివచ్చి శైత్యోపచారములు చేయించి కారణ మేమని యడిగిరి. వార్తాహారుఁడయిన యాకింకరుఁడే యావృత్తాంతము మరలఁ జెప్పి పెద్దపెట్టున నేడ్చెను. కర్పూరమంజరి యవ్వార్త విని యతిశోకమగ్న యయ్యెను. ఇందుమణికన్నులనుండి బొటబొట బాష్పములు దొరఁ గెను. సేవకులందఱు "కటకటా! ఎంతకష్ట మని విలపించిరి. చిత్ర భానుఁడు శైత్యోపచారమువలన సేదదేఱి "హా! కుమారులారా! మిమ్ము,బాసి నేనెట్లుజీవింతునురా! మీ తల్లి యీ వార్త విని యెంత శోకించుచున్నదో కదా? అయ్యో! మాయన్నగారివంశమైన లేకపోయి నదే. ఓమాలదైవమా! నాఁడు హేమచంద్రునకట్లు దారుణమరణము విధించితివి. గుణరత్నాకరులు —లోకైకసుందరులు— నగునాతని బిడ్డలనైనంజూచి సంతసింపకుండ వారింగూడ నీపొట్టంబెట్టుకొంటివా! పాపాత్మురాలా! మృత్యుదేవీ! నీకంటికిఁ బేలగింజయుఁబెద్దయయ్యెనే! నీయాఁకలి దీర్చుకొనుట కింతకన్న నీకు మఱియొక జంతువు దొరక లేదా! ఆచక్కదనమేమి? ఆలావణ్యమేమి? అవినయసంపదయేమి? ఆ

విజ్ఞానమేమి ? హా ! అంతటి గుణవంతులను భగవంతుఁడు బ్రతుకనిచ్చునా? అయ్యో! మీరు సంచరించిన యీకోటలో నేనెట్లు తిరుగనేర్తు? ఆకొలువుకూటములో నేనెట్లుగూర్చుండఁగలను? నాయనలారా! ఏది చూచినను మీరే జ్ఞాపకము వచ్చుచున్నారు. అయ్యో ! ఏమి చేయుదు ? విజయసేనుఁడితో నాకు ముగ్గురుకుమారు లనుకొంటిని. ఆకొండకోటలో నుండవలదని నేనెన్నివిధముల బతిమాలినను యువజన సులభమైన యుత్సాహముచే వారు నామాట పెడచెవింబెట్టి యచ్చోటు విడువరైరి. విధినిర్ణయ మిట్లుండ నాపలుకులు వారికేల రుచించు? అయ్యయ్యో ! ఆ పాడు సింగపువేఁట యేల వచ్చెనో? శక్తివర్మా ! వయోవృద్ధుఁడవు, ప్రాజ్ఞుఁడవు, నీవైన నాచిన్నిపాప మృగయాక్రీడనుండి మరల్పఁజాల వయితివే? మృత్యుదేవత సిగబట్టుకొని యీడ్చుకొని పోవుచుండ నీవేమి చేయఁగలవు ?" అని పలుతెఱంగుల విలపింపఁ దొడఁగెను.

అప్పు డందఱుఁ గన్నీరు విడిచినవారె. అందఱు హాహా యన్నవారె. కర్పూరమంజరి విషాదము వర్ణనాతీతమై యుండెను. ఆమె నిజముగా విక్రమసేన హర్షవర్ధనులు తన తమ్ములే యని భావించుచున్నందున నివ్వార్త యామెకు దుర్భరమై యుండెను. ఆరాత్రి యామె నిదురయేపోలేదు. జగన్మోహనాకారులయిన యాయిరువురు బాలకులు చిఱునవ్వులు తళుకొత్త నెమ్మొగములతోఁ దన యెట్ట యెదుట నిలిచి మాటలాడినట్లు మనఃప్రీకరమైన కథలు చెప్పినట్లు—నామె భావింపఁ జొచ్చెను. రెండుజాముల రాత్రియైన పిదపఁ జిత్రభానుఁడు గాఢముగా నిద్రించి ప్రభాతమున లేచి మరల దుఃఖింపనారంభించెను. గడియ ప్రొద్దెక్క నప్పటికి రాజపుత్రుల మరణవార్త పట్టణమంతయు వ్యాపించెను. హేమచంద్రుఁడు మృతినొందిన నాఁడు పట్టణ మెట్లు దుఃఖాంధకార మగ్నమయ్యెనో నాఁడు నట్లే యుండెను. ప్రతిగృహమునుండి హాహాకారములు చెలఁగెను. చిత్ర

భానుఁడే వారిం జంపించి యుండునని కొందఱనిరి. వేటలో సింగము వేటుతప్పించుకొని మీఁదబడి నప్పుడు చిత్రభానుఁ డేమిచేయఁగలఁ డని కొందఱు వచించిరి. తండ్రికిం గొడుకులకుఁగూడ దారుణమరణమే విధి నిర్ణయించుట యాశ్చర్య మని కొందఱు భాషించిరి. ఆనాఁడు చంటిబిడ్డలు, రోగులు, వృద్ధులు దక్కఁ దక్కిన పురజనులు భోజనముకే చేయలేదనుట యతిశయోక్తిగాదు.

మఱునాఁ డుదయమునఁ జిత్రభానుఁడు కొలువుకూటమున కరుగలేదు. వజ్రపాణి ప్రముఖ సేనాపతులు చిత్రభానుని సందర్శించి పరామర్శచేసిరి. పురజనులలోని ప్రముఖులుగూడ నట్లుచేసిరి. చూడ వచ్చినవారి యందఱి యెదుటఁ జిత్రభానుఁడు గోడ్డుఱచిన ట్లుఱచి యేడ్చుచు బహువిధముల రాజకుమారులఁ గుణములఁ బ్రశంసించుచుఁ దన దుఃఖమును బ్రకటింపఁ జొచ్చెను. ఆ నాటకమంతయు నెఱిఁగియు రుద్రభట్టు తక్కినవారివలె దుఃఖోపశమన వాక్యములం జెప్పుచు నితిహాసంబులలోని గాధలు దెలుపుచుఁ బ్రక్కనఁ గూరుచుండెను. అది మొదలుకొని దుఃఖాతిశయమునఁ జిత్రభానుఁడు పదిదినములు కొలువుకూటమునకుఁ బోవనేలేదు. రాజ్యవ్యాపారములఁ జూడనేలేదు. రాయబారులకు దర్శన మియ్యనే లేదు. ఆలుబిడ్డలతో నయిన మనసిచ్చి మాటాడలేదు. ఇది నటన మని కొందఱు నిజమని కొందఱు, పురజనులు చెప్పుకొన సాఁగిరి.

ఇరువది యెనిమిదవ ప్రకరణము

పాంచాల దేశాధీశ్వరుఁడగు మహేంద్రదేవుఁడు తనకూఁతురు మనుమలు మహోపద్రవ సముద్రమున మునిఁగిపోవుదురని మాధవ

సేనుఁడు తెలిపినతోడనే వృద్ధుఁడయ్యుఁ గాశ్మీరముపై దండువిడియుటకుఁ జిత్రభానుని దండించుటకు సమరసన్నాహము జేసెను. 'ఆలస్యమమృతం విష'మన్నట్లు వారి సన్నాహము సిద్ధమగునప్పటికి హేమచంద్రునికుటుంబమునకు రావలసినకష్టము లన్నియువచ్చెను. అయినను వారది గుర్తెఱుంగక కాశ్మీరముపై దండయాత్ర జరిపిరి. మహేంద్రదేవుఁడు వృద్ధుఁడు. ఆతనికిం గొడుకులులేరు. అధికారము వహించెనని యోగు లందఱు పరస్పరమత్సరగ్రస్థులయి రాజకార్యనిర్వాహణముకన్న నొండొరులయెడఁ గలతమద్వేషమునకుఁ బ్రతిక్రియలు చేసికొనుటలో నెక్కువ శ్రద్ధ గలిగి నిరంతరము దుస్తంత్రములఁ బన్నుచుండిరి. ఆకారణమునఁ బాంచాలసైన్యము దుర్బలమైయుండెను. మహేంద్రదేవుఁడు కాశ్మీరమునకుఁ బోయి తనమనుమలఁ దనకప్పగింపుమనియు దేశము విడిచిపొమ్మనియుఁ జిత్రభానునకు సందేశమంపెను. చిత్రభానుఁ డారాయబారిని బరాభవించి తగిన యుత్తరము జెప్పకయే పంపెను. పాంచాలసేనాపతులలోఁ గొందఱు లంచగొండులై చిత్రభానునకు వశులైరి. పాంచాలకాశ్మీరసైన్యములకు యుద్ధముజరిగెను. మహేంద్రదేవుఁడు యుద్ధమునఁ బరాజితుఁడై రాజధానికిఁ బాఱిపోయెను. రాజభక్తి గల సైనికులెల్లఁ దమ యోపినకొలఁది పోరాటముసల్పి మ్రందిరి. ప్రాణభీతిగల యోధులు చిత్రభానుని కోడి నలుదెసలకుం బఱుగులెత్తి ప్రాణములఁ గాచుకొనిరి. మాధవసేనుఁడును భగ్నమనోరథుఁడై పలాయనమె శరణంబుగాఁ జేసికొనెను. పాంచాలదేశమును గొల్లపెట్టింపవలెనని చంద్రభట్టు నుపదేశమునఁ జిత్రభానుఁడు సంకల్పించెనుగాని మహాసంరంభముతో మాళవరాజసైన్యములు దమపై వచ్చుచుండుటం జేసి యతఁ డాసంకల్పమును వదలుకొని మకరందుని డాఁకుటకు సమరసన్నాహములు సేయుచుండెను.

అంతలో మకరందునిసేనలు పొడకట్టెను. మాళవసైనికులు మహోత్సాహముతోఁ బోరాటంబున కెదురుచూచుచుండిరి. నగరంబునకుఁ బడమటివైపున మాళవసైన్యములు విడిసెను. కాశ్మీర నగరముఁ జూచినతోడనే మకరందునకుఁ గర్పూరమంజరి జ్ఞప్తికి వచ్చెను. తన కామెపై నెంతవలపున్నను నామెకుఁ దనపై నెంత మక్కువ యున్నను దానామెతండ్రికి విరోధియై కాశ్మీరముపై దండు విడియుటచే నతఁ డాకన్నియఁ దనకీయఁడనియుఁ గన్నియయుఁ దండ్రికిం బగతుండైన వానిమరుని కేలు వట్టుట కిచ్చగింపదనియు నిశ్చయించి తన దురదృష్టముం దూర్చి వగచుచుండెను. మకరందుఁడు యుద్ధసన్నద్ధుఁడై వచ్చియున్నవాఁ డని వినినది మొదలుకొని కర్పూరమంజరి తనపై నతని కనురాగ మున్నను బగతునిబిడ్డ యగుటచేఁ దన కేలువట్టఁడనియుఁ, దనతండ్రి తమ సమాగమమునకు శత్రువై యన్ని యంతరాయములఁ గల్పించు ననియు నిశ్చయించి తన యాశ యడుగంటెనని వాపోవఁజొచ్చెను.

ఉజ్జయినిలో నాఁడు మకరందునకుఁ జిత్రభానుని సందేశ మెఱిఁగింపఁబోయిన జయంధరుఁడు మాళవరాజస్కంధావారముతోఁ గలసి పయనముజేసినపక్షమున సురక్షితముగాఁ దనయూరు జేర వచ్చునని దాని ననుసరించి పోయి రెండుదినములు శిబిరమునుండి యకస్మికముగా నదృశ్యుఁడై కాశ్మీరనగరద్వారముకడ నిలిచి మకరందుని రాయబారి నని చెప్పి కోటలోఁ బ్రవేశించి క్రమక్రమంబునఁ గక్ష్యాంతరంబులు గడచి ద్వారపాలకునిచేతఁ జిత్రభానుని సమీపమునకుఁ గొనిపోఁబడెను. చిత్రభానుఁడు వానిం జూచి "మకరందుఁడు మాకేమి సందేశములఁబంపె"నని యడిగెను.

అనవుడు జయంధరుఁ డిట్లనియె. "దేవా! ఆగ్రహింపకుండు దేని జిన్నవిన్నపము జేసెద నాచేసిన యపరాధంబు క్షమింపుఁడు.

నేను మకరందునిరాయబారిని గాను. మీ యతఃపురపరిచారిక యయిన చంద్రిక నా ప్రాణమిత్రము. ఈ సందడి సమయమున నన్ను లోపలికి మీబంట్లు రానీయరనిశంకించి మకరందునిదూత నని చెప్పితిని. చంద్రికతో నొక్కసారి మాటలాడవలయు దేవరవా రనుజ్ఞ నొసఁగుదురేని యట్లుచేసి పోయెద." అనవుడు విస్మితుఁడై చిత్రభానుఁడు "ఏమీ! చంద్రికమిత్రమవా నీవు? సరె? అట్లయిన దానిం బిలిపించెద నుండు" మని చంద్రికను రావించెను. అదివచ్చి యాతని మొగముఁ జూచి "ఇతఁ డెవరో నే నెఱుఁగ" నని చెప్పెను. "అయ్యో! నన్నెఱుఁగవటే! ఇంతలోనే మఱచితివఁటే! మహాప్రభూ! దేవరవారే నన్ను గుర్తింపలేదా? నేను మీయింటనే పెరిఁగితిని. మీ యడుగుల నీడనే బ్రతికితిని. మీయనుగ్రహముచేతనే వర్థిల్లితిని. అమ్మగారు నన్నెఱుఁగుదురు. మీయమ్మాయి నన్నెఱుఁగును దేవరవారు రాజకార్యములగొడవలోనుండి మఱచిరి."అని జయంధరుఁడు నవ్వుచుఁ బలికెను.

ఆకథ కడుఁ జిత్రముగా నుండుటచేఁ జిత్రభానుఁడు కర్పూరమంజరిని నిందుమణిని నచ్చటికి రావించి యప్పురుషుని గుర్తింపుమని చెప్పెను. అమ్మా! నన్ను మీరెఱుఁగరా యని జయంధరుఁడు గంఠధ్వనియుఁ దనకుఁ బూర్వపరిచితములైనట్లు తోఁప జప్పటులు చఱచి "నాయనా! ఈ విగ్రహము పురుషవిగ్రహము గాదు. మల్లికయే మాఱువేసము వైచికొని యిట్లువచ్చెనని నాకుఁదోఁచుచున్నది" యని నవ్వుచుఁ జెప్పెను. అప్పలుకులు విని చంద్రిక "ఔనండి! ఇది నిజముగా మనమల్లికయే. ఏమే! నీ సరసము చట్టుబండలుగాను"అని దగ్గఱకుఁబోయి తలపాగ నూడఁదీసెను. అప్పుడు దీపములవెలుఁగున దానిమొగము విస్పష్టమై కనఁబడెను. "అయ్యో! నిన్ను పెద్దపులి

యీడ్చుకొనిపోయి చంపెనని జంబుకుఁడు చెప్పె. ఎట్లు బ్రతికి వచ్చితివే" యని చిత్రభానుఁ డడిగెను. "స్వామీ! మనజంబుకుఁడు గంజాయి త్రాగి యామైకముతోఁ బండుకొని నన్ను బెబ్బులి యీడ్చుకొనిపోయినట్లు కలగని యుండవచ్చును. దానిమత్తుచేతఁ బయనములో నాకు సాయముచేయుటకు మాఱుగా నా కంతరాయములు గలిగించుటం జేసి వానిని వదలించుకొని నే నావలికిఁ బోతిని. ఆ లాహిరికాఁడు కలయే నిజమనుకొని తన్ను వంచించిపోయినన్నుఁ గానక మీతో నట్లు మనవిచేసియుండవచ్చును" అని మల్లిక మందహాస సుందరమైన వదనముతో నుత్తరమిచ్చెను అదివిని నవ్వి చిత్రభానుఁడు "ఓసీ! నీ యాఁడువేసముకన్న మగవేసమే బాగున్నదే. చాలు. నీవు చేసిన ప్రజ్ఞ చాలును. నీ ప్రజ్ఞకు సంతసించితిమి. ఈ పాటికి నీ వభ్యంతర మందిరమునకుఁ బో!" అని ముందలింపఁ జంద్రిక దానిచేయి బట్టుకొని లోపలికిఁ దీసికొనిపోయెను. ఇందుమణియుఁ గర్పూరమంజరియు లోపలి కరిగిరి, పిమ్మటఁ గొంతకాలము పరస్పరవియోగదుఃఖమున కంత స్థలయిన నెచ్చెలులకు విస్రంభసంభాషణ మారంభమయ్యెను. అప్పుడు చంద్రిక ముందుగా నిట్లనియె. "ఓసీ! మల్లికా! నీవు మృతినొందితివని మే మతిదుఃఖముపాలయితిమి. నీ నిమిత్తము బెంగపెట్టుకొని కర్పూరమంజరి యురివెట్టుకొన్నది. ఆయుశ్శేషముండుటచే తోడనే యది కనిపెట్టి పెద్ద పెట్టున మొఱ్ఱలు పెట్టితిని. నా కుయ్యాలించి వెంటనే కంచుకులు పరువెత్తుకొనివచ్చి యామెను రక్షించిరి. మెడ కీమె తగిలించుకొన్న తీఁగ త్రాడు దీయుటకయిన నాకుఁ జేతులువచ్చినవి కావు. నా యొడలు నే నెఱుఁగను. దైవానుగ్రహమున నెట్లో బ్రతికినది"

"అయ్యో! ఉరివెట్టుకొన్నదా? అయ్యో! ప్రాణసఖీ! ఎంత పనిచేసితివమ్మా? నీవు లేని యెడల సంసార మసారము. మధ్యమ

లోకము దీపరహితము. జగము జీర్ణారణ్యము. మానవుల నేత్ర నిర్మాణము నిష్ఫలము. నాకు మరణమే శరణము. లోకమును శోక మగ్నము జేసెదవా? మన్మథుని గర్వహీనుఁ జేసెదవా? నీకింత సాహ సముగూడనా? నావంటి నెచ్చెలులు నీకెందఱో లభింతురు. నాకొఱకై ప్రాణము విడువఁదగునా?''యని యామె సాహసమును గర్హించి మల్లిక తన ప్రయాణవిశేషంబులఁ జెప్పి వారిని ప్రొద్దుపోవువఱకు నలరించెను. ఆమాటలు వినుచుఁ జంద్రిక మెల్లగ నిద్రపోయెను.

అనంతరము కర్పూరమంజరి మల్లికను దనకు మిక్కిలిదగ్గఱగ రమ్మని పిలిచి యిట్లనియె—''మల్లికా! నిన్నుఁజూచి కొన్నిమాస ములే యయినను జిరకాలమునుండి చూడనట్లు కన్నులు వాఁచిపోయి నవే. నిన్నుఁజూడఁగా నాప్రాణము లేచి వచ్చినది. హృదయ ముప్పొంగినది. మనస్సు సంతోషముఁ బట్టఁజాలకున్నది. కన్నుల కఱవుతీరినది. నీవొక్కతవ వైనను వేయిమంది చుట్టములు వచ్చిన ట్లున్నది. ఇంతకు, గార్యసిద్ధియైనదా లేక నీప్రయాణమునకు దేహ శ్రమముమాత్రమే ఫలమా?''అని పలుక స్నేహస్నిగ్ధభాషణముల మల్లిక మరల నెచ్చెలి కిట్లనియె. ''సఖీ! నీకు నాయెడఁ జిన్నట నుండియు నట్టిప్రేమయే గలదు. అట్లు నీవనుకొనుటకు నీ సౌజన్యమే కారణముగాని నాయందలి గుణవిశేషము గాదు. బెంగపెట్టుకొనకు. కార్యసిద్ధి కొంతవఱకయినది. నా ప్రయాణము వ్యర్థము కాలేదు. బహుశ్రమలుపడి నేనుజ్జయినిఁ జేరి వేడుక చెలికానితోఁగూడి వెన్నె లలో ముచ్చటలాడుచున్న మకరందుని జూడ మగవేసముతో వెళ్ళితిని. మగవేసమేల ధరింపవలెనందువో? మహాత్ముఁడయిన మకరందుఁడు పరస్త్రీలతో మాటలాడఁడు. జవ్వనుల మొగమయినఁ జూడఁడు. కావున నాగుణరత్నాకరుని మగవేసమునం జూచుట

మంచిదని యట్లుచేసితి. నీహృదయ మాతనియందు లగ్నమైనమాట విన్నవించితిని. అతఁడును నీనిమిత్తమై పరితపించుచుండెనని వేడుక చెలికాఁడగు చంద్రచూడునివలనఁ దరువాత వింటిని. కాని, యతఁడు మీతండ్రిపై దాడివెడలియున్నాఁడు. మునుపే నీతండ్రి వీనియెల్ల దన మొల్లకయున్నాఁడు. ఇప్పుడీతనిమీఁద మీయయ్య యలుక మాఱురెట్లు హెచ్చును. కావున సుఖసుఖాన మీతండ్రి నిన్నీతని కియ్యఁడు. ఇందుకు దైవమే స్వయముగా దౌత్యము వహింపవలెను గాని మనుష్యులవలనఁ గాదు. పరమేశ్వరుఁ డఘటనఘటనా సమర్థుఁడు."

అదివిని కర్పూరమంజరి "ప్రియసఖి! నీపలుకులలోఁ గొంత యాస యున్నది. కొంతయాస లేదు. అతఁడు నాయం దనురక్తుఁడై యుండుటం జేసి యాశాబంధము తెగకయున్నది. మాయయ్యకు విరోధియగుటం జేసి వెంటనే నిరాశ యంకురించుచున్నది. ఆశా నిరాశలనడుమ నామనం బూఁగాడుచున్నది. ఈ కలహ మెట్లు పరిణమించునో తెలియదు. ఇందు మకరందునకు మరణమే సంభవించునేని నా మనోరథము లాతనితో మంటఁగలియునుగదా. లేక పోరితంబున మాయయ్య కడతేరునేని దండ్రిం జంపినవాని నెట్లు చేపట్టఁగలను? దైవమొక్కఁడే యిందు సాయముజేయఁ దగినవాఁడు. నేను గౌరీసేవానిరతురాల నగుదునేని భగవతి కాత్యాయని నా మనోరథ మీడేర్పుఁగాక!"యని తన మనోవేదన చెలిమికత్తెకెఱింగించి రేయి చాల గడచుటచే నిట్టూర్పు విడుచుచుఁ బండుకొని కన్నుమూసెను. మల్లిక మార్గాయాసముచే మిక్కిలి యలసియుండుటచే బడినదేపాటుగా గాఢనిద్ర సుఖమనుభవించెను.

ఇరువది తొమ్మిదవ ప్రకరణము.

ప్రభాతమయ్యెను. తీర్థయాత్రలు సేవింపనరిగిన దండపాణి రాకపోవుటంజేసి చిత్రభానుఁడు విషణ్ణహృదయుఁడై యుండెను. వజ్రపాణి యంతకుమున్న రెండుమూఁడుసారులు తనయన్నయెూఁదుండెనని చిత్రభాను నడుగ నతఁడు కార్యాంతరంబుల దేశాంతరంబుల కరిగెనని యుత్తరము చెప్పనేకాని యథార్థము నచింపనేలేదు. అన్న రాక దవ్వాయినకొలఁది వజ్రపాణి కనుమానము హెచ్చెను. అతని మనంబు పరిపరివిధంబులం బోయెను. "ఏమహారాజునొద్దకయినఁ జిత్రభానుఁడు వానినిరాయబారిగాఁ బంప, నారాజు వానియసువు లపహరించియుండునా? మార్గమధ్యంబునఁ జోరకిరాతాది భయంబున మ్రందియుండునా? రోగపీడితుఁడై దేహత్యాగముచేసి యుండునా! వైరాగ్యంబున సన్యసించి యుండునా?" యని వజ్రపాణి పలుతెఱంగుల నూహించుచు నిదమిత్థమని నిశ్చయముచేయలేక యానాఁ డుదయమునఁ జిత్రభానుని సందర్శించి తనసోదరుని విషయమునఁ దన కుఁగల సందియముల నెఱిఁగించి నిశ్చయవార్తఁ దెలుపుమని వేఁడెను. చిత్రభానుఁడు వానిసంశయములఁ బాప నత్తెఱియదార్థమంతయుఁ జెప్పి యిట్లనియె. "సీయన్ననుగూర్చి నీ వెంతబెంగగొంటివో నేనును నంతెబెంగఁ గొనియున్నవాఁడ. అతఁడు లేకపోవుటచే నాసేనాముఖము తిలకహీనమై యున్నది. నాకుడిచేయి పడిపోయినట్లున్నది. మాళవరాజసైన్యములు పెచ్చుపెఱిఁగి యున్నవి. అతఁడు లేఁడన్న మాట వారికిఁ దెలిసికాఁబోలు గర్వోన్మత్తులై వారు సంచరించుచున్నారు. నీవు మేటిమొనగాఁడవు. మహాశూరుఁడవు నని నే నెఱుఁగుదును. అయినను నతనికి నీవు నీ వతనికిఁ దోడైనయెడల మాళవ సైన్యంబులేగావు—మహేంద్రసైన్యంబులయినను దైన్యంబునొందక

మానవు. నీ వొంటిగాఁడ వయితివని నేను విచారించుచున్నాను. నే నొంటిరెక్కతో నున్న పక్షివలె నున్నాను. నీవు మీయన్నకొఱకై బెంగబెట్టుకొనకుము. ఈయుద్ధమయిన వెంటనే కరటక పింగళులను గాశీ హరిద్వారబదరీ నారాయణాది క్షేత్రముల కంపి మీయన్న నిమిత్తమై వెదకింతము. చిత్రభానుఁడే మీయన్న యనుకొనుము.”

వజ్రపాణి కా పలుకులంత దుఃఖోపశమనముఁ జేయకపోయినను సంశయనివృత్తిఁ జేసినందున నాతనిమనస్సు కొంత ప్రశాంతిఁ జెందెను. ఆమఱునాఁడు యుద్ధముసేయుట కిరువురు నిశ్చయించుకొనిరి. ఉభయ సైన్యంబుల భేరీభాంకరణంబులు దెసల మాఱు మ్రోఁగెను. ఉభయ సేనలలోని బంట్లకు నుత్సాహము మిక్కుటమై యుండెను. గజ బృంహితంబులు, హయహేషితంబులు, రథనేమిధ్వనులు, పదాతుల యుత్సాహరసభరిత వచనములు మిన్నుముట్టెను. ఆనాఁటిరేయి నా ప్రక్కఁ జిత్రభానుఁడు వజ్రపాణి మొదలగువారును, నీప్రక్క మకరందుఁడు, కంఠీరవదేవుఁడు మున్నగువారును దమతమనెలవుల నుచిత స్థానముల నిలిచి పిఱికితనము పటాపంచలై పోవునట్లు—వీరరసము మనంబుల నిండియుండునట్లు గయ్యంబులకు సైనికులం బురికొల్పు చుండిరి.

అంతలోఁ దెల్లవాఱెను. ఉభయులమనంబుల నెలకొన్న క్రోధాగ్నివలె భానుమండలము కానఁబడియెను. ఆక్రోధాగ్నిమంటలో యనఁ దొలిసంజకెంజాయ దెసల నలముకొనెను. మంట లెగసినతో డనే నంతరించు పొగచందంబున మంచు క్రమక్రమంబుగ నదృశ్యమయ్యెను. సైన్యములు మేనం బూసికొన్న వీరగంధముల చందంబున లేయెండలు వ్యాపింపఁ దొడఁగెను. రణదుందుభులు మొఱసి సన్నసేయ నుభయసేనలు తలపడెను.

ఏనుంగుల నేనుఁగులు దాఁకెను. అశ్వికు లాశ్వికులం దలపడిరి. పదాతులు పదాతులం గలిసి పోరాడిరి. సాయంకాలమువఱకుఁ గయ్యము ఘోరముగాజరిగెను. ఒకమాఱు జయము వారికిఁ జేకురి నట్లు మఱియొకసారి వీరికిఁ జేకుఱినట్లు దోఁచెను.

కంఠీరవదేవుఁడు కంఠీరవంబట్లు పోరాడి యుపరాహ్ణంబున వజ్రపాణి ప్రయుక్తమయినవాలుటమ్మునఁ దెగటారి నేలంగూలె, అతఁడీల్గిన కొంతసేపటికిఁ జిత్రభానుండు ప్రయోగించినకఱకుటమ్మున మకరందునకు గాయము తగుల నతఁడు మూర్ఛిల్లె. చికిత్సకొఱకు పరిజనులు స్కంధావారమునకు వానిం గొనిపోయిరి. మదపుటేనుఁగు మీఁద మకరందుఁడు కనఁబడకపోయినతోడనే పరసైన్యంబులు మకరంగుఁడు మ్రందెనని కోలాహలముచేసి సంతోషసూచకముగా రణదుందుభులు మ్రోయించిరి. భద్రసేనుఁడు తనమిత్రునకుఁ బ్రమాద కరమైన గాయంబు తగిలెనేమో యని శంకించి చికిత్సకులచేత వ్రణ పట్టికలు వేయించి సమయోచితమైన యుపచారంబులు చేయించు టకు వెంటనే శిబిరంబున కరిగెను.

పరసైన్యంబుల కోలాహలంబులు విని మాళవసైన్యంబులు భీతిల్లి పలాయనముసేయఁ జొచ్చెను. తెలివివచ్చినతోడనే తనగాయ మునయిన లెక్కసేయక జొటజొటఁగారుక్రొన్నెత్తురుసోనలతో మక రందుఁడు మరల నశ్వము నెక్కి యెలుఁగెత్తి కయ్యమునకుఁ దనసై న్యంబులఁ బురికొల్పెఁ గాని వంచినతల యెత్తక భటులు పోయిన పోకం బోయిరి. విజయలక్ష్మి చిత్రభానునిం జేపట్టెను. పరసైన్యం బులు మాళవులం దఱిమితఱిమి కత్తుల నఱికియు బల్లెములం బొడిచి యు, నమ్ముల నేసియు, గదలం జఱిమియు నాశనముచేయఁజొచ్చెను.

మకరందుఁడు ధైర్యమువిడువక రణముఖంబున నిలువ భద్ర సేనుఁడు మఱికొందఱు భటులు వాని కపాయంబు శంకించి బలిమిని

గుఱ్ఱ మెక్కించి యావలకుఁ దీసికొనిపోయిరి. గాయములకుఁ జికిత్స చేయఁబడ లేదు. నెత్తురోడికకట్టి పాఱుచుండెను. దాహముచే నాల్కయిగురుచ్చుకొనిపోవుచున్నను వెనుక పగవారు తఱుముచున్న కతమున మంచితీర్థము త్రాగుటకయిన నవకాశము లేకపోయెను. నెత్తురు మిక్కిలి మేననుండి పోవుటచే నతఁడు దుర్బలుఁడై సోలిపోఁజొచ్చె. భద్రసేనుఁ డాతనిగుఱ్ఱముమీఁదనే యెక్కి వానిఁ దనఱొమ్మునకుం జేరవైచుకొని పట్టుకొనియుండెను. అశ్వము సుశిక్షితమైన దగుటచే యజమానునవస్థ నెఱిఁగి మిక్కిలివేగమునఁ బరుగెత్తఁజొచ్చెను. శిబిరము విడిచి కొంతదూరము వారు పరుగెత్తి యొకచిన్న పల్లియం జేరిరి. అప్పటికి సాయంకాల మగుటచే శత్రువులకు వీరిజాడ తెలియ లేదు. కావున వారు మిక్కిలి వేగమున ముందుకు సాగిపోయిరి. భద్రసేనుఁడు మకరందుని మెల్లగాఁ దోడ్కొనిపోయి వ్రణచికిత్సకుఁ డా గ్రామమున నున్నాఁడాయని యడిగి తెలిసికొని గ్రామీణు లొక మంగలివానిం జూప వానిచే నాఁ డేయి యా రాకొమరునకుఁ దగు చికిత్సలు చేయించెను.

మకరందునకుఁ దీవ్రమైనజ్వరము వచ్చెను. కలఁతనిద్దురయే గాని గాఢమగునిద్దుర పట్టలేదు. నాలుగైదుసారులు దాహము త్రాగెను. పెక్కుసారులు పలువరించెను. అందొకసారి "కర్పూరమంజరీ! ఎంతకాలమునకుఁ గనఁబడితివి!" అని నిదురలోనే మందహాసపురస్సరముగాఁ బలికెను. వెంటవచ్చిన నలుగురుసేవకులు మార్గమధ్యమున శత్రుబాణప్రహారముల నీల్గుటచే వాని కంగరక్ష సేయవలసినవాఁడు భద్రసేనుఁ డొక్కఁడే యయ్యెను.

ఎంతదూరము పోయినను మకరందునిజాడలు పొడకట్టమి మకరందుం బట్టుకొనుటకై వెడలినచిన్నబలఁగము వెనుకకుఁ దిరిగి వచ్చి పరిసరంబున నున్నపల్లియలఁ శోధింపఁదొడఁగెను. గాయము

తగిలిన మూఁడవనాఁడు మంగలి కట్టువిప్పి పుండు మానుదలపట్టిన దనియుఁ బ్రాణాపాయము లేదనియుఁ జెప్పెను. అదివిని మకరందుఁ డిట్లనియె. "భద్రసేనుఁడా! సంగరంబున గాయముదగిలి నేను మూర్ఛిల్లినప్పుడు నన్నక్కడ నుండనీయక నీవు నన్ను శిబిరమునకుం గొనిపోయి మిక్కిలి తప్పుచేసితివి. మనసేనలు పలాయనము లగుచున్నప్పుడు గాయము లెక్కసేయక యశ్వారూఢుఁడనై నేను మరల సమరరంగమునకు వచ్చినప్పుడును నీవు నన్నక్కడ నిలువనీయక పగతుఁలు పట్టుకొందురని భయపడి యిటు తీసికొనివచ్చితివి. నీవిట్లు చేయనిపక్షమున నేనీపాటికి మృతినొంది వీరస్వర్గమునఁ బ్రాఁతకాపునై యుందునుగదా! నాకట్టిగౌరవముఁ గలుగనీయక పోతివి. నాప్రాణరక్షణమే చూచుకొంటివి గాని దీనికన్న వేయి మడుంగు లధికమైన నాప్రతిష్ఠారక్షణము జూడవయితివి. నీయుద్దేశము మంచిదయినను నీకార్యము శ్లాఘాపాత్రము గాదు. రణముఖంబున క్షత్రియుఁడు మడమ తిరుగక వెనుకంజ యిడక పగతురతోఁ బోరవలయును, లేదా తనకై ప్రాణంబుల నర్పించిన వీరయోధసహస్రమధ్యమునఁ దానుంబడి ప్రాణములువిడిచి కదనరంగ మలంకరింపవలయు. అట్టి పుత్రునివలననే తల్లి వీరమాతయగును. అట్టి మగనివలనఁ భార్య వీరపత్నియగును. నామరణము కన్న మకరందుఁడు పందయై పోలికలనువిడిచి పాఱెనని లోకులు చెప్పుకొందురేమో యనుసరికి నేనెంతయు భయపడుచున్నాఁడ. ప్రాణాపాయము లేదని చికిత్సకుఁడు చెప్పినందుకు నాకు సంతసము లేదు."

అనవుడు భద్రసేనుఁడు "మిత్రుఁడా! 'జీవన్భద్రాణి పశ్యతి' యను నార్యోక్తి వినవే? బ్రతికియుండిన నెన్నో శుభములు గానవచ్చు. ఎందఱో పగతుర గెలువవచ్చు. ఎన్నో విజయములఁ బడయవచ్చు. ఎంతో యశోధనము నార్జింపవచ్చు. ఊరక మృతినొందిన నేమిప్రయోజనము? "శరీర మాద్యం ఖలు ధర్మసాధన"

మ్మనుమాట వినవే? నిన్నెఱిఁగినవా రెవ్వరు నిన్నుఁ బిఱికిపందయని యధిక్షేపింపరు. సమరములో నీవు మహాద్భుతముగ బనిసేయలేదే? అదిగాక సమరమును నీయంతట నీవు విడిచిరాలేదు. నీవు సొమ్మసిల్లినప్పుడు దుర్బలుఁడవైనప్పుడు నిన్ను బలిమిం దోడ్కొనివచ్చితిమి. గాయము మానినవెనుక కాయము దృఢమయినవెనుక నీవు మరలఁ బగతుఱప్పెఁజని గెలువవచ్చు." అని యక్కుమారుని సమాశ్వాసించెను.

మకరందునినిమిత్త మన్వేషించుచున్న సైనికుల నాయకుఁడు ప్రసేనుఁడు నాఁటియుదయమున నా యాపల్లియఁ జొచ్చి గ్రామాధికారులం బిలిపించి మకరందునిజాడలు తెలియునా యని యడిగెను. నిజముగా వారతనిని జూడకపోవుటచేఁ దామేమియు నెఱుఁగనట్లు జెప్పిరి. అతఁ డది నమ్మక ప్రతియిల్లు శోధింపుమని సైనికుల కాన తిచ్చెను. ఇచ్చినదే చాలునని దుండగులయిన యాసైనికులు వంటయిండ్లనక పడకగదులనక యటకలనక దొడ్లనక తోఁటలనక యెల్ల తావుల వెదకి యంగనల నవమానించి తమకుఁ గావలసినపదార్థములఁ నెల్లఁ జెప్పియుఁ జెప్పకయుఁ దీసికొనిపోయిరి.

అట్లు వెదకుచు నిల్లిల్లు దిరుగుచుండ నొకమంగలియింటిలోఁ గంబళిపఱచిన నులకమంచముపైఁ బండుకొన్న యొక పురుషుడు, వానిప్రక్కం దాటియాకులచాపపైఁ గూర్చున్న యొక్కపురుషుఁడు సైనికుల కగపడిరి. ఆమంగలిగుడిసెలో వారు దీపముల యట్లు వెలుఁగుచుండిరి. ఇద్దఱు సుందరపురుషులే. ఇద్దఱు విశాలనేత్రులే. ఇద్దఱు మనోహరవర్చస్కులే. ఇరువురు నాజానుబాహులే. ఇరువురు స్ఫురద్రూపులే. అగుటచే మాళవరాజనందనుడు వారిలో నొకఁడై యుండునని ప్రసేనుఁ డూహించి మంచముపైఁ బండుకొన్నపురుషునిం జూచి నీపేరేమని యడిగెను. "నాపేరు మకరందుఁ"డని యతఁ డుత్తరముచెప్పెను.

వెంటనే భద్రసేనుఁడు లేచి "అయ్యా! మకరందుఁ డతఁడు గాఁడు. నాపేరు మకరందుఁడు" అని పలికెను. "నిజము చెప్పఁడు ఇం దెవ్వరు మకరందుఁడు?" అని మరల నతఁ డడిగెను. "నేనే మక రందుఁడ. నేనే సుదర్శననందనుఁడ." నని మకరందుఁడు వెండియు నుత్తరమిచ్చెను. "అతఁడు కాఁడు. నేనే మాళవరాజనందనుఁడ'నని భద్రసేనుఁడు బదులుచెప్పెను. "మిత్రుఁడా! అబద్ధమాడకుము" అని మకరందుఁడు "మిత్రుఁడా! అసత్యము పలుకకుము" అని భద్ర సేనుఁడును నొండొరులం గర్హించుకొనుచు మాటలాడిరి. "అతఁడు మామంత్రికుమారుఁ డైనభద్రసేనుఁడు. నేను మకరందుఁడ" నని మరల నాతఁడు బలికెను. "అయ్యా! అతఁడు నామిత్రుఁడు భద్ర సేనుఁడు. నేనే మకరందుఁడ"నని వెండియు భద్రసేనుఁడు వక్కా ణించెను.

వారిసంభాషము ప్రసేనునకును, సైనికులకును, జికిత్సకు డగుసంగలికిని, నచ్చట గుమిగూడిన గ్రామీణులకును మహాశ్చర్య ముఁ గలిగించెను. అత్తఱిఁ బ్రసేనుఁ డిట్లనియె"ఆహా! మీచరిత్రము మిక్కిలి చిత్రముగానున్నది. ఎవ్వఁడు రాజనందనుఁడో యెవఁడు వానిమిత్రుఁడో తెలియుట లేదు. మీరు మాకు శత్రువు లయినను మీయుదారభావమును మేము బ్రశంసింపక తప్పదు. ఇందు మంత్రి నందనుఁడు తనస్వామికుమారునిప్రాణమును గాచి తనప్రాణము పగఱ కప్పగింపఁ దలఁచుచున్నాఁడు. ఓహో! అతనిచరిత్రము మిక్కిలి శ్లాఘ్యము. రాజనందనుఁడు తనమేను దాఁచుకొనక తన కొఱకై నిష్కారణముగాఁ దనమిత్రుఁ డేల పోవలెనని యథార్థము చెప్పుచున్నాఁడు. మంత్రినందనుఁడు బొంకుట పరోపకారార్థము. రాజనందనుఁడు సత్యముపలుకుట పరోపకారార్థము. వీరిం గన్నతల్లి దండ్రులు ధన్యులు. వీరిజన్మలు చరితార్థములు. అయినను మాకుఁ

బగతుఁడగుటచే వీరినిరువుర నేనిప్పుడు బంధించి మారాజుకడకుఁగొని పోక తప్పదు. ఓహో! క్షాత్రధర్మము నిష్కరుణముగదా! నే నన్యథా వర్తింతు నేని నాచేతులతో నాకంఠముఁ గోసికొన్నవాఁడ నగుదును. అయ్యా! మీరిరువురు లెండు. నావెంట రండు''

అనపుడు భద్రసేనుఁడు ప్రసేనునిం జూచి ''అయ్యా! మీరు మూఁడుగురున్నారు. మేమిద్దఱమున్నాము. నీవామూఁకకు మొనగాఁడవు. నీవొక్కఁడవాయుధముఁబూని మాతోఁబోరి మమ్ముగెలిచి యటమీఁద మమ్ము బంధించి తీసికొనిపొమ్ము. లేదా మమ్ముఁ జంపుము అంతియ కాని క్షత్రియవంశమునం బుట్టి మీవెంట బందెలదొడ్డికిఁ బోవుపశువులవలె మిన్నక వత్తుమె?'' యని వీరరస ముట్టిపడునట్లు ప్రత్యుత్తర మిచ్చెను. నావుడు ప్రసేనుఁడు ''నీమిత్రుని గమ్మను నీవు కాదు. అని వచియింప మకరందుఁడు చివాలున మంచమునుండి లేచి వద్దు! వద్దు! నీగాయము ప్రమాదకర మగునని వెనుక భద్రసేనుఁడు వాదించి వారించుచున్నను వినక ప్రక్కనున్న ఖడ్గము దీసికొని ''వీరుఁడా! నీమాటయే చెల్లుఁగాక!'' యని ప్రసేనునియెట్టయెదుట నిలిచెను.

భద్రసేనుఁడు వానిని వారింప బహువిధప్రయత్నములఁ జేసెఁ గాని గాయపడినవానిని సులభముగా గెలువవచ్చు నని నీచమతితోఁ బ్రసేనుఁడు వానినినే గోరుకొనుటచేతను మకరందుఁడు లేనియుత్సాహముఁ దెచ్చుకొని సమరసన్నద్ధుఁ డగుటచేతను, భద్రసేనుఁడు చేయునది లేక కను లప్పగించి చూడవలసి వచ్చెను. అప్పుడు ప్రసేనునకు మకరందునకు భయంకర మగుఖడ్గయుద్ధము జరిగెను.

ఖడ్గములపరస్పరసంఘట్టనమువలన జనించిన విస్ఫులింగములు ప్రసేనమకరందుల నేత్రగోళములనుండి వెలువడుక్రోధాగ్ని విస్ఫులింగములతో వియ్యమొందెను. ప్రసేనుఁడు భీషణభాషణంబులతో

మాళవరాజనందనుని బలుసారు లధిక్షేపించెనుగాని యతఁడు వాటికి దన కఱకుకత్తిపోటులచేతనేగాని మాటలచేతఁ బ్రత్యుత్తరమియ్య లేదు. ప్రేక్షకులు మహాశ్చర్యముతో నా ద్వంద్వయుద్ధముఁ దిలకింపఁ జొచ్చిరి. వెనుకటిగాయముచేత రక్తక్షయమునెందిన తనచెలికాని కే సమయమున నెట్టియపాయము సంభవించునోయని భద్రసేనుని గుండె కడుభయంబున గొట్టుకొనుచుండెను. ఎట్టకేలకు నూతనముగాఁ గయ్యమునకుఁ దలపడిన ప్రసేనునికన్న మహాయుద్ధపరిశ్రాంతుఁడై గాయమునఁ జిక్కి స్రుక్కియున్న మకరందుఁడే మిన్నయని యెల్లవారికిం దోఁచెను.

ప్రసేనుఁడు పరిశ్రాంతుఁ డయ్యెను. మకరందుని ఖడ్గప్రహారమున నాతఁడు చేయితెగి నేలం బడెను. మకరందుఁడును మేన ముచ్చెమటలుఁగ్రమ్మ నతిశ్రాంతుఁడై నేలఁ జదికిలంబడెను. అప్పుడు ప్రసేనునిబంటులు తమ నాయకుఁడు నేలంగూలుట జూచి సైపక హుంకారము లొనరించి మకరందునిమీఁదికి దుమికిరి. తోడనే భద్రసేనుఁడు పొదలోనుండి తనకరవాల మూడఁబెఱికి యమ్మూకపైఁ బడి ముందుకువచ్చిన యేవురుబంట్లను నఱికి తక్కిన వారిపయిఁ బడెను. వెంటనే వారు వానియెదుట నిలువలేక గాలికెగిరిపోవు దూదిపింజల చందమున నలుదెసలకుం బరువెత్తిరి.

చూపరులు మకరందుని యొక్కయు, భద్రసేనుని యొక్కయు సౌజన్యంబును, సౌహార్దంబును, విక్రమంబును వేయినోళ్ళం గొనియాడిరి. అప్పుడు భద్రసేనుఁడు తా మచ్చోటనుండుట క్షేమంబుగాదని మిత్రునకుం దెలిపి ముందుగా నయ్యూరు విడిచి పరిసరంబున నున్న యడవికింజని యటమీఁదఁ దమ కర్తవ్యమును విచారింపఁ జొచ్చిరి.

ముప్పదియవ ప్రకరణము.

అరవిందాదేవి నర్స్థగాఢనిద్రలోనున్నప్పుడు కావలివాండ్రకుం దెలియకుండ నిజవాసంబు విడిచి నడిరేయి యొంటినిం జనియెనని చెప్పబడియెగదా! అంతఃపుర మెన్నఁడు విడిచి యెఱుఁగని యా సుకుమారి, యసూర్యంపశ్యయైన యామహారాజ్ఞి, మేడనెక్కిన నలసిపోవు నా మెలఁతమిన్న, పులుగులయెలుంగుల విని కలంగు నయ్యాదిర్భేశ్వరి, మహాటవులలో నెండయనక గొండయనక మిట్టయనక పల్లమనక వెనుదిరిగిచూడక యాహారంబు వర్జించి యేమృగంబులైనఁ దమయాఁకలిదీర్చుకొనుటకయి, తన్నుద్రమింగినబాగుండునని యేపాముయినఁ గఱచినమేలని యేసెలయేటినీటిలో నయినఁగొట్టుకొని పోయిన యుక్తమనుచు నడచిపోవఁ జొచ్చెను. ముండ్లుగ్రుచ్చుకొనుటచే నామెపాదములు పుండ్లయ్యెను. పొదలకుండొలఁగక వానిం దాకిపోవుటచే మేను గీచుకొనిపోయి నెత్తురులోడుచుండెను. ఎండలో నడుచుటచే నడుగులు పొడపొడఁ జొక్కెను. శిరోజములు మొగమున వీఁపునఁ జెల్లాచెదరై పడియుండెను.

మూఁడవనాఁడు మధ్యాహ్నము రెండుజాములవేళ నామెదుర్భరముగా నున్న తనజీవితమును దుదముట్టింపవలె నని సంకల్పించి యొకయేటియొద్దఁ జేరి వస్త్రము బిగించి కట్టుకొని సూర్యునికి నమస్కారములు చేసి యెత్తుగానున్నచోటు జూచుకొనియటనుండి గుభాలున నయ్యేటినీట దుమికెను. దుమికి రెండుమునకలువైచెను. రెండవమునకవైచి తేలునప్పటికి నామెశిరస్సు కాషాయాంబరధారియగు నొకబిక్షువు చేతంబట్టి శిరోజములు గ్రహించి యవ్వలి కీడ్చెను. కడుపునిండ నీరుండుటచే నామెకు సరిగా స్మారకము లేదు. ఆ భిక్షువు

తన శిష్యుని సాయమున నామె నొకచెట్టుక్రిందఁ బడవయిచి సముయోచితోపచారములఁ జేసి నీరు గ్రక్కించెను. అంతట నామెకుఁ దెలివి వచ్చెను. పిమ్మట నాభిక్షు వామెనుజూచి యట్టి యాత్మహత్యకుఁ గారణ మేమని యడిగి యామె పూర్వవృత్తాంతమును గూర్చి ప్రశ్నించెను. ఆమె కొంతసేపు ప్రత్యుత్తరము జెప్పుట కిష్టపడక మౌనముద్రవహించి యగ్గురుశిష్యులు ప్రశ్నలనియెడు ముండ్లు మాటిమాటికిఁ గ్రుచ్చుటచే సహింపక యెట్టకేల కిట్లనియె.

"అయ్యా! మీరు నాకుఁ బరమశత్రులు గాని మిత్రులుగారు. నామనంబు నతిదారుణంబుగా బాధించుచున్న దుర్వార వేదననుండి నేను విముక్తినొందుటకు సాధన మేర్పఱచుకొన నది సాగనీయక నాకు మీరు మహాపకారముఁ జేసితిరి. మీకిందువలనఁ బాపమేకాని పుణ్యములేదు. పుత్రశోకజ్వరపీడితనయిన నాకుఁ జల్లని యానదీజలములు సుఖప్రదాయకము లగును. కావున నిష్పాడయిన నన్నందుఁ బోవనిండు. ఈ ప్రాణములమీఁద నా కాశలేదు. గర్భమం దున్న విషము గ్రక్కువఱకు నరుఁడు బాధపడునట్లు నేనీప్రాణములు బోఁగొట్టుకొనువఱకు నతి బాధపడుచున్నాను. ప్రాణత్యాగమే నాకు సుఖము. శరీరవిసర్జనమే నా మనోవేదనమునకుఁ జికిత్స. కావున నాయం దనుగ్రహముంచి నన్నుఁ జావనిండు!"

అని వేఁడుకొన నాభిక్షువు లక్కజంపడి "తల్లీ! మేము భిక్షువులము. బౌద్ధులము. జీవహింసకుఁ బరాఙ్ముఖులము. చూచి చూచి నిన్నుఁ జావనిత్తుమే! నీకు మరణమే విధింపఁబడిన యెడల మాకంటఁ బడకపోయియుందువు. మేము తక్షశిలకుఁ బోవుచున్నాము. అక్కడ వేనవేలు యోగిను లున్నారు. నిన్నక్కడికి మేము గొంపోదుము. మా వెంట రమ్ము! భగవానుఁడయిన శాక్యసింహుని ధర్మంబులు విని నీకిష్టమయినపక్షమున వాని ననుసరించి దుఃఖసాగరము నీఁదగలవు.

నీవెవ్వరివిఁ జూడ మహారాజాంతఃపురవాసినివలెఁ గానఁబడుచున్నావు. నీకిష్టమగునేని నీచరిత్రము మాకుఁ జెప్పుము.'' అని పలికిరి. అప్పు డామె తన వృత్తాన్త మంతయు వారి కెఱిఁగింప వారు కాశ్మీరమహా రాజపత్నియుఁ బాంచాలరాజనందనయు, నైన యాదేవికిఁ బ్రాపిం చిన దురవస్థకు నెంతేని దురపిల్లి యతి గౌరవంబునఁ గడునాదరంబున నింతింతయనరాని వినయంబున, నామె కుపచారంబులు సల్పి నెమ్మ నంబున ధైర్యము పురికొల్పి యాత్మహత్య మహాపాతకమని దానిపై రోఁత బుట్టించి తక్షశిలం జేర్చిరి. అక్కడ నుపనిషద్రహస్య పరి జ్ఞాతలై వైదిక మతావలంబకులైన సన్యాసులను, శాస్త్రాధ్యయన ములనిమిత్తమై వచ్చి విద్యలం గఱచుచున్న బ్రహ్మచారులను, ధమ్మ పదము, త్రిపిటకము, హీనాయనము, మహాయనము మొదలగు బౌద్ధగ్రంథపఠనంబులచే ధన్యులై, విశాలము లగు విహారములందు విడిసియున్న బౌద్ధభిక్షువులను, బరమనిష్ఠాగరిష్ఠలై బ్రహ్మచర్యవ్రత దీక్షాపరతంత్రలై యగ్నిశిఖలవలెఁ బవిత్రలైన భిక్షుణీజనమును, జూచి సంతసించి యాభిక్షుణీసమూహముతోఁ గలసి కాలక్షేపముఁ జేయఁజొచ్చెను.

అట్లు శక్తివర్మ సింగపుంగొదమలవంటి రాకొమరులఁ దీసికొని కాశ్మీరగాంధార దేశముల సరిహద్దులం జేరునప్పటికి చండుడు నిరంత రము లయిన ప్రయాణంబులం జేసి వారిం గలిసికొనెను. గాంధార దేశపు సరిహద్దులం బాలించు వీరసేనుఁడు లోకోత్తరలావణ్య విశేషంబులు గల రాకొమరుల నెమ్మొగములు జూచి వారు సామా న్యులు గారని గ్రహించి వారిని రావించి వారిచరిత్రము లడిగి శక్తి వర్మముఖమున నంతయుఁ దెలిసి జాలినొంది యతిస్నేహంబున వారిం గౌరవించి రాజకుమారులకుం దగిన యాడిగంబులఁ జేయించి యంద ఱను లెక్కించి చండునకు శక్తివర్మకు నశ్వముల నిచ్చి యిట్లనియె.

"మామహారాజుగారు భాగ్యవర్ధనుఁడు సత్పురుషుఁడు. మీ చరిత్రము విన్న జాలినొంది మీకు సాయముఁ జేయును. ఆయనకుం గొడుకులు లేరు. సౌదామిని యనుకూఁతురుగలదు. పదునాలుగేండ్ల ప్రాయము గలది. మిక్కిలి చక్కనిది. తగినవరుని సంపాదింపలేక యాయువ మేఱమీఱినవిచారము నొందుచున్నాఁడు. అందుచే నాయనకు మీ రాక పరమసంతోషజనకమై యుండును. కావున మీరీవాహనంబు లెక్కి యచ్చోటికిం జనుఁడు. నేను మీరాక వారికి ముందుగా దెలియ బఱచెద"

అనవుడు శక్తివర్మ మహాప్రసాద మని వానిమన్నన నంగీకరించి కృతజ్ఞతఁ దెలిపి బాలకులం దోడ్కొని గాంధారమునకు జనియెను. గాంధారనాయకుఁ డగుభాగ్యవర్ధనుఁడు వీరసేనునిజాబు చూచుకొని సంతసించి రాజకుమారులకు నెదురుకొలుసల్పి తోడుకొని రమ్మని తనయమాత్యు నంపి వారు తన యంతికమున కరుదెంచిన పిదప వారిని కౌఁగలించుకొని యెంతయు సన్మానించి సంపంగి నూనెతో రాకొమరులకుఁ దలయంటించి యమూల్య వస్త్రాలంకారముల నాభరణంబుల నిచ్చి యభ్యంతరమందిరంబున విడియఁజేసెను. చండశక్తివర్మపలుకును దగిన గౌరవంబు సలిపెను. ఆరేయి కుమారులవలన శక్తివర్మవలన మంచుమలకడ నున్నకొండకోటలో జరిగిన దారుణ వృత్తాంత మంతయువిని భాగ్యవర్ధనుఁడు వానిమంత్రులు మహాదుఃఖ పరవశులై దాని నాఁపుకొనలేక బాలకులశ్లేడ్చి చిత్రభానుని దౌర్జన్యమును వేయితెఱంగుల గర్హించి యక్కిరాతునకు భగవంతుడు తగినదండనము చేయఁడే యని యొక్కపెట్టునఁ బలికిరి. బాలకులం జూచినదిమొదలుకొని భాగ్యవర్ధనుఁడు వారియెడ నత్యంతస్నేహంబు గలిగి విక్రమసేనునకుఁ దన గారాబుకూఁతురగు సౌదామిని నిచ్చి పెండ్లిచేయవలె ననియుఁ దన తమ్మునికూఁతు రయిన చిత్రరేఖను

హర్షవర్ధనున కిచ్చి వివాహము సేయవలె ననియు నిశ్చయించి జ్యేష్ఠునిఁ గాశ్మీరసింహాసనముపైఁ గూర్చుండఁ బెట్టవలయు నని సంకల్పించెను. తనమనోనిశ్చయమును మంత్రులకు సేనాపతులకు రహస్యముగఁ జెప్పి దండయాత్రా సన్నాహమును జేయింపుమని యానతిచ్చెను. ఆనతిచ్చుటయే తడవుగా రాజకార్యపరతంత్రులగుమంత్రులు గజతురగ పదాతిసైన్యంబుల నాయత్తము సేయఁ జొచ్చిరి.

గాంధారరాజాంతఃపురమున రాజకుమారులుసకలసౌఖ్యముల ననుభవించుచున్నను దల్లిజాడ తమకుఁ దమజాడ తల్లికి దెలియకపోవుటచే నెల్లయపుడు మాతృవియోగదుఃఖమున గ్రుక్కుచుండిరి. ఆమెజాడన నరయుటకై నిపుణులగు వేగులవాండ్రఁబంపుమని భాగ్యవర్ధనునిం బ్రార్థించిరి. అతఁడు వారియభీష్టప్రకారము జేసెను.

మాధవసేనుఁడుఁ మహేంద్రదేవునిబలములు పరాజయము నొందినపోడనే తాను పరాజితుఁడై మహేంద్రదేవునితోడఁ బాంచాలపురమునకరిగి యపజయమువలన నిర్విణ్ణుఁడై యున్న యాముదుసలిజేనికి ధైర్యముఁ గొలిపి యుత్సాహము పుట్టునట్లు పూర్వరాజులచరిత్రంబులు పురాణగాథలు, జెప్పి జయము తప్పక సేకూరు నని నమ్మకపుట్టఁబలికెను. అతఁడును మాధవసేనుని దనకు హితోపదేశకునిగా నేర్పఱచుకొని రాజభక్తిశూన్యులయిన నియోగులఁ దొలఁగించి స్వామిభక్తి యుక్తుల నధికారములందు నియోగించి మరల సమరసన్నాహము జేయింపఁజొచ్చెను. ఈసారి యుద్ధములో జయమయిన సేకురవలయు లేదా, తనప్రాణములయినసమరరంగమునకర్పింపవలె ననియు మాధవసేనుఁడునిశ్చయించుకొని యతఁడు దృఢప్రయత్నము జేయఁజొచ్చెను.

అట రత్నసేనుఁడు మాళవరాజసైన్యము లోడిపోయి నానాముఖంబులకుం బరుగులెత్తుటఁజూచి మరలసేనంగూడఁగట్టుటకు బహు

ప్రయత్నములఁ గావించెను. అతని ప్రయత్నము లరణ్యరోదనము లయ్యెను. అతని మనస్సు పరాజయమువలన జనించిన పరాభవమునను దనకొడుకు రాజుకొడుకుం గానఁ బడమిఁ బొడమిన విషాదమువల్లను మిక్కిలి దుఃఖనిలయమై యుండెను. "నన్ను నమ్మి నాసామర్థ్యమందు విశ్వాసము గలిగి తనకొడుకున కేయపాయము రాకుండ నేను జేయఁగల నని మనోనిశ్చయముగలిగి నేనల నావశముజేసి పంపినందుకు నేనెంత చేసితిని. పోనీ! జయాపజయములు దైవికములు. వాటికేమి మఱియొకసారి గెలువవచ్చు ననుకొందము. అతఁడు తన కుమారుని నాకప్పగించె. చంద్రప్రభాదేవి పంచప్రాణము లాతని మీఁదనె పెట్టుకొనియుండు. ఆతలిదండ్రులు నాకొడు కేఁడనియడిగిన నేమిచెప్పుదును? ఇంక మాభద్రసేనునిమాట నే నేమనుకొందును? పరమమిత్రు లయిన యక్కుమారు లిరువురు సమరమున మడిసియుందురా? పగతుఱచేఁ జిక్కియుందురా? ఏమిగతి! ఏమయిన నేమి! నేను మాళవంబున కరిగి సుదర్శనుని గాంచి దండయాత్రా విషయము లాతనికిఁ జెప్పి సమాశ్వాసించి మరల యుద్ధసన్నాహము జేయించెదను. ఈపరాభవవ్రణము విజయంబను నౌషధంబునం గాని కుదురదు." అని రత్నసేనుఁడు తనలో వితర్కించి యోడ నడిసముద్రమునఁ బగిలినప్పుడు దానిచెక్క నొకదానిం బట్టుకొని సాగర మీఁది ప్రాణములు దక్కించుకొను బాటసారివలె నాతఁడు హతశేషమయిన సేనం గూర్చుకొని యుజ్జయినీనగరసమీపమునకుం బోయెను. పోవునప్పటికి మాళవదేశస్థితి యెట్లుండవలెనో యట్లుండెను.

మగటిమి నెఱపఁగల సైనికు లందఱుఁ గాశ్మీరదేశముపై దండు విడియుటకుఁ బోయియుండున విదర్భరాజుసైన్యంబులు గట్టిగొళ్లెములు లేని తలుపులు గలయింట దొంగలు సులభముగఁ జొచ్చినట్టులా పౌరశూన్యమై కృశించియున్న వానిమేన రోగములు దూఱినట్లు

మాళవముఁజొచ్చి యనాయాసమున నిలిచియున్న యల్పసైన్యముల నోడించి రాజధాని నాక్రమించుకొని సుదర్శనునిం బాఱంద్రోలి కోటలో విడిసెను.

సుదర్శనుఁడు సకళత్రముగ సపరివారముగ ఘూర్జరదేశముఁ జొచ్చి యారాజు తనకుఁ బూర్వమిత్రుఁ డగుటచే వాని కతిథియై వాని సాయమున మరల మాళవరాజ్యముపై దండు విడియవలయునని ప్రయత్నము సేయుచుండెను.

రత్నసేనుఁ డావృత్తాంత మంతయు విని విధి కాశ్మీరరాజ కుటుంబమునకే గాక మాళవరాజకుటుంబమునకుఁగూడ విముఖుఁడైన యుండుటఁ దెలిసికొని రాజధానికిం బోవక తనవెంటనున్న యల్ప పరివారముతో ఘూర్జరదేశమునకుం జని యారాజున కాశ్రయుఁడై దీనుఁడై యున్న సుదర్శనుం గాంచి దండయాత్రా పర్యవసానముఁ జెప్పి మకరంద భద్రసేనులజాడలు తెలియలేదని విన్నవించెను. పుత్రవియోగము రాజ్యభ్రంశముకన్న నానరపాలున కధికసంతాపముఁ గలిగించెను. ఎల్లదేశములయందు వానిజాడలు భద్రసేనుని వార్తలు దెలిసికొనుటకై సమర్థులగు పురుషులను బంపుమని యతఁ డానతిచ్చెను. నిజపుత్రవియోగముచేఁ గుందుచున్నను రత్నసేనుఁడు మాళవరాజ్యసింహాసనమునందు సుదర్శనుని మరల బ్రతిష్ఠించుటయే ప్రధానకర్తవ్యముగాఁ జేసికొని ఘూర్జరనాయకుని యనుగ్రహము నకుఁ బాత్రమై సేనలు బ్రోగుచేయుటలోను దదితరసన్నాహము జేయుటలోను శక్యమైనకృషిఁ జేయుచుండెను.

మకరందుఁడు సమరమునఁ బరాజితుఁడై గాయపడినాఁడని కర్ణాకర్ణిగ విని కర్పూరమంజరి మితిలేని విషాదమునొంది నిద్రాహారంబులు వర్జించి యాతని నిమిత్తము పరితపింపఁజొచ్చెను. ప్రసేనుఁడు కథ తేరినతోడనే భయభ్రాంతులై పాఱివచ్చిన హతశేషసైనికులు

చిత్రభానున కావృత్తాంత మెఱిఁగించుచుండఁ జాటునను విని మల్లిక పరుగుపరుగునఁ గర్పూరమంజరికడకుఁ బోయి "సఖీ! నీకుఁ బ్రియ మెఱిఁగించెద. ప్రియ మెఱిఁగించెద" ననియెను. "ఓసీ! మరణమునకు సిద్ధముగా నున్నదానికిఁ బ్రియమేమున్నదే!" యనియామె విసుగుతోఁ బలికెను. "సఖీ! అమంగళము నోట రానీకుము. మకరందుఁడు సుఖముగా నున్నాఁడు. గాయము కుదిరినదట. అది కుదురుటయేగాదు. మన సేనాధిపతులలో నొకఁడైన ప్రసేనుని ద్వంద్వయుద్ధమునఁ దాఁకి కూల్చునంతటిబలముగూడ నతనికిఁ గలిగినఁట. శౌర్యరాశియైన ప్రసేనుఁడు చచ్చినందుకు మీతండ్రిగారు చింతిల్లుచున్నారు." అని మల్లిక విన్నవించెను.

అప్పలుకులు కర్ణరంధ్రములఁ జొచ్చినతోడనే పండుకొనియున్న కర్పూరమంజరి దిగ్గున లేచి పాన్పుపైఁ గూర్చుండి "మల్లిక! ఏమేమి? ఆయన సుఖముగా నున్నాఁడా? నిజముగా నాకుఁ బ్రియ మెఱిఁగించితివే! ఇదిగో! ఈయుంగరము నీవు పారితోషికముగా గ్రహింపుము. నా కాయనపాణిగ్రహణభాగ్యము లభించినను లభించకపోయినను జీవించి యున్నవాఁ డనియు, సుఖముగా నున్నవాఁ డనియు వింటి నదియె చాలు!" ననిపలికి కొంతయూరటఁ గలిగి వెండియు నెన్నఁడైన నాతనిసందర్శనము జేయు పుణ్యకాలము లభింపఁజేయు మని కాత్యాయనీదేవిని బ్రార్థించెను. మల్లిక యామె కోరిక నెఱవేర్పు మని భగవతి గౌరిని దానును వేఁడుకొని "సఖీ! తప్పక నీ కాతనిసమాగమము గలుగునని యెందుచేతనో నాకు గొప్పయాస గలదమ్మా! అందుచేత నీ వూరటగలిగి యుండుము." అని ధైర్యము జెప్పెను. "ఓసీ! నీవంతకన్న నేమనియెదవు? నీ ప్రియసఖి బెంగటిల్లి చిక్కి శల్యమై మృతినొందు ననుభయమున నీ వాశాగుటికలు నాచేత మ్రింగింపఁజూచుచున్నావు? ఏమైన నగుఁగాక!

మున మేమి సేయఁగలము? అని నిట్టూర్పువిడిచి వెండియుఁ బాన్పుపైఁ బండుకొనెను.

అట్లరణ్యమునందు మకరందభద్రసేనులు కొండొకవృక్షచ్ఛాయఁ జేరి యెటుపోవఁదగునని సమాలోచనము సేయఁజొచ్చిరి. అప్పుడు మకరందుఁడు తన మిత్రున కిట్లనియె. "భద్రసేన! నే నుజ్జయినికిఁ బోఁజాలను. ఏలయన నే నెంతో మొనగాఁడ నని మహాసైన్యముం గూర్చుకొని కాశ్మీరముపై దండువెడలి యుద్ధమునం దోడిపోయి గాయపడి పందనై రణరంగము విడిచి పాఱిపోయి యిప్పుడే మొగముఁబెట్టుకొని యుజ్జయినిం బ్రవేశింతును? నాయం దెంతో గౌరవముగల యుజ్జయినీపురవాసుల మొగము లెట్లు చూతును? సిగ్గులేక నాతండ్రి నెట్లు చూతును? నే నాయన కడుపుచెడఁ బుట్టితిని. నాజననమువలనఁ బవిత్రమయిన మాళవరాజవంశమునకుఁ గళంకము గలిగినది. చంద్రప్రభాదేవి వీరమాత యగుటకు మాఱుగా భీరుమాత యైనది. కర్పూరమంజరీ పాణిగ్రహణమునాకు సంప్రాప్తింపక పోవుటయే మేలయ్యె. నావంటిపందను బెండ్లిచేసికొన్నపక్షమున నామె వీరపత్నిగాక భీరుపత్నియై సాటిరాజకన్యకలలోఁ దలవంచుకొనవలసి యుండును. హేమచంద్రునితనయులకు సాయముచేసి వారి నుద్ధరింపవలెనని వచ్చి నే నింత చేసితినిగదా! ఆబిడ్డ లేమయిరో తెలియదు. ఛీ! నాబ్రతుకేల? మిత్రుఁడా! నేనింక నింటికి రాను. భగవానుఁడైనబుద్ధదేవుని కపిలవస్తునగరమున కరిగి భిక్షువునై యుండెద. లేదా, భిక్షుకసహస్రము గలతక్షశిలకుఁ జని వారి శిష్యుఁడనై జ్ఞానసంపాదనముఁ జేసెద. పరాభవాగ్నిదగ్ధమగుచున్న నామనమున కింతకన్న దారి పొడకట్టుట లేదు."

అధైర్యద్యోతకము లయిన యాతనివచనములనాలకించి భద్రసేనుఁడు నవ్వి "మిత్రమా! వజ్రము మెత్తపడినది. అగ్ని వేఁడిం

గోల్పోయితివి. ఏమి! యీవిచిత్రము. నీకింత యధైర్యము గలుగనేల? యుద్ధములు జూదములవంటివి. రణముల జయాపజయములు జూద మందలి జయాపజయములవంటివి. చెట్టు నెక్కెడువాఁడే పడెడువాఁడు. భారతయుద్ధమునఁ బాండవులు కౌరవులచే నెన్నిసారులు భంగపడ లేదు? కాని యెట్టకేలకు వారు గెలువలేదే. శ్రీమన్నారాయణుని యవతారమయిన కృష్ణుఁడు జరాసంధునిచేఁ బలుసారులు కయ్య మున నోడిపోయి యెట్టకేలకు వానిని భీమార్జునసహాయంబున సంహా రింపలేదే! కావున నొకసారి యోడితి మని వీరుఁడు సిగ్గుపడి సమర పరాఙ్ముఖుఁడు కాఁగూడదు. నరుఁడు కార్యసిద్ధికై యాజన్మాంతమును బ్రయత్నించుచుండవలసినదె. అధైర్యము మానవుని వెలుతురునుండి తీసికొనిపోయి గాఢాంధకారమునఁ బడవేయును. ధైర్యమను తేప విపత్సముద్రముల నీఁదుటకు సాధనము. ధైర్యమువంటి మిత్రము మఱియొకటి లేదు. ఏమిత్రమును విడిచినను భయములేదు కాని ధైర్య మిత్రమును విడిచితిమా చెడిపోదుము. కావున వైరాగ్యమును విడిచి మీవియోగమునకై తల్లడిలుచుండు తల్లిదండ్రులను సందర్శించి దుః ఖోపశమనముఁ జేయుము. మరల మహాసన్నాహముజేసి కాశ్మీర ముపై దండు విడిసి చిత్రభానునిం గెలువుము. జయమువలనఁ గలి గెడుమహాయశస్సు నేఁటిపరాభవకళంకమును గప్పిపుచ్చఁగలదు. లెమ్ము! లెమ్ము!" అని యుత్సాహరసపూరిత మయినపలుకులు పలి కెను. అప్పలుకులు విని మకరందుఁడు "మిత్రుఁడా! పరాభవం బను మేఘపటలముచేత మెండుగ నాక్రమింపఁబడి నా మనస్సుజ్ఞానతేజ ముం గోల్పోయి యుండుటచే నట్లంటి. నీపలుకులు యుక్తియుక్త ములై యున్నవి. నీచెప్పినట్లు చేసెద. కాని మార్గాయాసమున నేను మిక్కిలి డస్సినాఁడ. త్రాగుట కించుక మంచినీరు దొరకిన నేను బరి పయనము సేయఁగలుగుదు. అది యీకానటడవిలో నెట్లులభించును?"

కని నిట్టూర్పు విడిచి చెట్టునీడం బండుకొనియెను. "మిత్రుఁడా! భయపడకు. అడవులలో నేరులు, వాఁగులు, చెఱువులు నుండకపోవు. నే నీసమీపమున నెందయిన జలాశయమున్నదేమో యరసి యుండి నం దెచ్చెద. ఈనీడను విశ్రమింపుము" అనిపలికి తోడనే యాతఁడు జలము నన్వేషింపింప బైలుదేరెను.

అమితమైన యాయాసమున నలసియున్న కతమున మకరందునకు మహీరుహచ్ఛాయను బండుకొనినతోడనే నిద్రపట్టెను. నిద్ర సుఖమెఱుఁగదన్న సామెత నిజము గదా! చంద్రశాలలలో దాసదాసీ విలాసినీజనములు వట్టివేళ్ళవీవనల విసర మెత్తనిహంసతూలికాతల్పంబులపైఁ బవ్వళించు మహారాజకుమారునకు నట్టడవిలోఁ జెట్టునీడ వట్టినేలఁ బండుకొన్నను సుఖనిద్రపట్టెను. భద్రసేనుఁడు వనంబునఁ గొంతదూర మరిగి మనోహరములయిన తామరపూవులతోడను, జల్లని తియ్యనీటితోడను విలసిల్లు నొక్క చెఱువుం గనుఁగొని రాశీభూతమయినభగవంతునిదయారసముగా దానిని భావించి విశాలములయిన తామరాకులు దొన్నెలుగాఁగుట్టి నాలుగుదొన్నెలనిండ నీరునించి మిత్రుని నోరెండిపోవునేమోయనుభయమున నతివేగంబునవచ్చి చెట్టుకడఁజూచునప్పటికి మకరందుఁ డక్కడ లేకపోయెను. భయము విస్మయము, సంభ్రమము మనంబున మల్లడిగొన నతఁడు దాహమున తాగలేక నీరుకొఱకెందైనఁ జనియెనేమో యని శంకించి "మకరందుఁడా! మకరందుఁడా!" యని యెలుఁగెత్తి పిలిచెను. అప్పలుకులకుత్తరము లేదు. వెంటనే సందియములు హెచ్చెను. మనస్సు విషాదాక్రాంత మయ్యెను. శరీరమందుఁ జేవ డిందుపడియెను. నిలువలేక చెట్టునకుఁ జేరఁబడి కూర్చుండి యతఁ డిట్లు విచారించెను. "ఇతఁడేమైయుండును? అతిపిపాసావశమున మృతినొందినచోఁ గళేబర మిందుండవలయునుగదా? అట్లు కాదు. దుష్టమృగము లేవైన దస్సిబల

హీనుఁడై యున్నయీతనిఁ గొనిపోయియుండునా? లేక చోరులు, కిరాతులు వీనిం జంపి యుందురా? భూ? విధీ! ఆబాల్యవర్ధితస్నేహుల మగుమాకు మహారణ్యమధ్యమున నెడబాటు గలిఁగించితివే! ఏమి సేయుదు నెవ్వరి నడుగుదు, నెందుఁబోదు, ఈయడవులందు వెదకుచుఁ గానఁబడఁడేని యిందే శరీరమునువిడిచెద'' నని గమ్యస్థాన మిది యని నిర్ణయించుకొనకయె మిత్రు నన్వేషించుటకై పయనము చేసెను.

ముప్పదియొకటవ ప్రకరణము

పట్టినదెల్ల బంగార మయినట్లు చిత్రభానునకుఁ దలపెట్టినతరువాత జయముతరువాత జయము చేకూరుటచే లోకమున నతనికి గొప్పఖ్యాతి గలిగెను. కాశ్మీరదేశప్రజలెల్ల మాళవపాంచాలురపరాజయముఁ దెలిసినతరువాత ''భళి! చిత్రభానుఁడా, భళి'' యని ప్రశంసింపఁజొచ్చిరి. ఆవిజయములు వానిపూర్వదోషముల మరపింపఁ జొచ్చెను. ప్రజలు విక్రమసేనహర్షవర్ధనులమాటయే మఱచిపోయిరి. అరవిందాదేవి యెచ్చటనున్నది? యనియడుగువారే తక్కువయిరి. రాజభక్తులు, సదాచారులు మాత్రము చిత్రభానుఁడు సింహాసనము నిమిత్తమై చేసినదురితములను గర్హించి విక్రమసేనహర్షవర్ధనులగుఱించియుఁ దల్లింగూర్చియు విచారించుచుండిరి. చిత్రభానునిగర్వమునకు మేరలేకపోయెను. అతఁడు నేలనుండియు నభోవీథిని సంచరించునట్లు వర్తింపఁజొచ్చెను. దానికిం దగినట్లు రుద్రభట్టు పలుతెఱంగుల వాని విక్రమంబుల వినుతింపఁ దొడఁగెను.

ఒకనాఁడు వారిరువురుఁ గూర్చుండిమాటాడుచుండఁ బ్రసంగవశమున రుద్రభట్టిట్లనియె—''రాజా! నాచెప్పినచొప్పున నీవు రాజ

వైతివిగదా! మహేంద్రదేవుఁడోడె. మాళవసైన్యమోడె. మకరందుఁడు కథావశేషుఁ డయ్యె. సుదర్శనుఁడు రాజ్యహీనుఁ డయ్యె. నీప్రతాపాగ్నికిఁ బగతుఱదళములు మిడుతలై పోయినవి. భరతఖండమునందు నేఁటికాలమున నిన్నుమించిన రాజులు లేరు రామరంతిదేవమహాభిష మాంధాతృప్రముఖు లగురాజన్యులతోడ సమానుఁడ వైతివి. నీయశోలతలు హిమాలయము మొదలుకొని రామసేతువువఱకుఁగలభారతవర్ష మంతట నలముకొన్నవి. అనేకమహీపాలురు నీసఖ్యము నపేక్షించుచున్నారు. రత్నగర్భలవంటిభూములు గలమాళవపాంచాలదేశంబులు నీపాదాక్రాంతములై యున్నవి. రాజులు నీయానఁ బూలదండవలె శిరంబున ధరించుచున్నారు. రాజన్యమకుటమాణిక్యకాంతులు నీపాదపద్మములకు నీరాజనము వెట్టుకాలముసంప్రాప్తించినది. కష్టములు గట్టెక్కినవి. ఇంక నీవు పట్టాభిషేకముఁ జేసికొమ్ము. తద్విషయికప్రయత్నముఁ జేయించెద. నీ వనుజ్ఞ నిత్తువేని దానికిం దగుసుముహూర్తము నిర్ణయించి వలయుపనులం బ్రారంభించెద.” అని పలుక జిత్రభానుఁడు “పట్టాభిషేకమున కంత తొందర యేమి? ఎప్పుడో చేసికొనవచ్చును. మాళవపాంచాలురు మరల వత్తురేమో చూడవలయుఁగదా!” యని బదులుచెప్పెను.

“మాళవపాంచాలురు మరల వచ్చుటా! చచ్చినవాఁడుమరల బ్రతుకఁడు. పగిలినకుండ మరల నదుకుకొనదు. నేల నొలికిననీరు మరల నెత్తుట సాధ్యమా? మహేంద్రదేవుఁడు శతవృద్ధుఁడు. రాజ్యవృక్షమునకుఁ జీడపురుగులు పట్టినవి. మాళవుఁడు బౌద్ధుఁడు. నాస్తికుఁడు. పరమేశ్వరుఁడు నాస్తికులఁ దల యెత్తనిచ్చునా? ఆస్తికులలో నగ్రగణ్యుఁడ వయిననీచేత భక్తవత్సలుఁ డగుపరమేశ్వరుఁడు లోకద్రోహు లగుబౌద్ధులను నాశనము జేయింపఁ దలఁచినాఁడు. కాని యీసందర్భమున నిన్నొక్కవర మడిగెద. అది యేదన క్రొత్తగా

జయింపఁ బడి మనయధీన, మయినమాళవదేశమునకు నీకుమారుని విజయసేనుని రాజుగాను నన్నాతనిమంత్రిగాను నీవు నియోగింప వలయు నని నాకోరిక. ఈముద్దుచెల్లింపుము. ఈవేఁడుకోలు ననుగ్రహింపుము. ఈవర మొసఁగుదువేని మున్ను నష్టమైననాప్రతిష్ఠమరల బ్రతిష్ఠింపఁబడును. సువర్ణుఁడు చేసినపరాభవమువలన నేను తొల్లి పూవులమ్మినయూరిలోఁ గట్టెలమ్మితిని. నీయనుగ్రహ మున్నపక్షమున వెండియుఁ గట్టెలమ్మినయూరులోఁ బూవులమ్మెద. పూవులమ్ముటే కాదు. ఉజ్జయినీపట్టణమును మంగలమునం బెట్టి వేచెద. బౌద్ధవిహారముల నెల్ల నేలమట్టము జేయించెద. వాటితావున శివాలయముల నిర్మించెద. నాస్తికాధముఁడయినసువర్ణునినివాసమువలన నపవిత్రము లయినయాయంతఃపురముల, మేడల, మిద్దెలఁ బరశురామప్రీతి గావించి నిర్మూలించి యచ్చట ముండ్లకంపలు వేయించి జిల్లేడుమొలకల నాటించెద. అంతేగాదు సువర్ణుఁడు నన్ను నిండు కొలువుకూటములోఁ బరాభవించి దేశభ్రష్టుఁ జేసినాఁడు. సభాభవనమం దుండియు నన్నుఁబురస్కరించుకొని యొక్కమాటయిననాడక యూరకుండిన యధముల నందఱ బుద్ధివచ్చునట్లు తగురీతి దండించెద. అదియునుఁగాక పలుమాఱు నాతో దైవాస్తిక్యమునుగూర్చియు వేదప్రామాణ్యములఁ గూర్చియు, వాదమునలిపి రాజు వారిపక్షమున నున్నకతమున వానిబలమున నన్నోడించి యపహసించిన దేవసింహుఁడు, హిరణ్యమిత్రుఁడు, సత్యమిహిరుఁడు మొదలగు మానవాధముల నాస్తికబ్రువుల బౌద్ధపాంసనులఁ బండులొలచినటుల మనతోళ్ళ నొలిపించియు బ్రతికియుండఁగానె గడ్డివాములలోఁబెట్టి కాల్పించియుఁ జెఱుకుగట్టెలట్లు గానుగలలో వైచి యాడించియు, నానాహింసల పాలు జేసి చిరకాలంబుననుండి నామనంబునమండుచున్న క్రోధాగ్నిని వారినెత్తురులవలనఁ జల్లార్చుకొనియెద. కేసరి యనునమాత్యు

నొక్కనే రక్షించెద. అతఁడిప్పటికిని నాపక్షమువాఁడే. మొన్న జరిగిన కయ్యంబునఁగూడ నాతఁడే వైదర్భుల కాయువుపట్లు చెప్పి కోట మనవారియధీనము జేసినాఁ డట. ఇవియె నీవు నాకుఁ జేయవలసిన మహోపకారము." అని తీవ్రముగా రుద్రభట్టు విన్నవింపఁ త్రభానుఁడు చిఱునవ్వు నవ్వి "మహాత్మా! చిరకాలమునుండి మామనః పేటికలో నడఁగియుండిన క్రోధసర్పము నేఁడు లేచి పడగ విప్పి యాడుచున్నదే. ఇంతవఱకు రాజుచున్న క్రోధాగ్ని నేఁడు మండుచున్నది. ఈ శాంతమూర్తిలో నింతదారుణమయిన క్రోధానల మెట్లడఁగి యున్నదో యెఱుఁగకున్నాను. మీరు మహానుభావులగుటచే నింద్రియములు మీయధీనములు. క్రోధాదుల నడఁపఁగలరు. ఇచ్చవచ్చినప్పుడు ప్రజ్వరింపఁజేయఁగలరు. అట్లె మీకోరికప్రకారము జేసెద. ముందుగా నేనును వజ్రపాణియు, మాళవమునకరిగి యచ్చటిపరిస్థితుల స్వయముగాఁ దెలిసికొని దేశ మధీనము జేసికొని మరలివత్తుము. వచ్చినతరువాత నాపట్టాభిషేక మయిన వెనుక విజయసేనుని మిమ్ము మాళవమునకంపెద. మీరు నాకుఁ జేసిన మహోపకారములకు నేనీపాటిచిన్నపని మీకొఱకై చేయుట యబ్బురమా? మీ రడిగినది మిక్కిల తక్కువకోరిక. సద్బ్రాహ్మణు లగుటచే మీరు నిస్పృహులు. అశ్వము లడిగిరా, యాందోళిక లడిగిరా? గదము లడిగితిరా? కాంచనములడిగితిరా? హారములడిగితిరా? యగ్రహారము లడిగితిరా? ఈపాటిచిన్నకోరిక తీర్పనియెడల నాజన్మమేల? ఈకోరికయేగాదు-రాజ్యమంతయు మీపాదములకడ సమర్పించెద. రాజ్యమే కాదు—ప్రాణములనయిన నిచ్చెద." అని కృతజ్ఞతాపూర్వకముగా సంభాషించి వరమిచ్చినట్లు మాటయిచ్చెను.

అతని వినయంబునకుఁ గృతజ్ఞతకుఁ జాలసంతసించి రుద్రభట్టు "రాజా! బూదిద బూసికొని, నీర్కావిగుడ్డలు గట్టుకొని పండ్లు, పాలు, దిని తపంబు జేసికొను పరమహంసైన దికుంసు నాకు నశ్వములేల యాందోళిక లేల హారము లేల, యగ్రహారము లేల? అవియాగర్భశ్రీమంతులై భగవంతునివలనఁ బ్రజాపాలనాధికారము జన్మముతోడనే వహించిన మీవంటి ప్రభువులకు విధినిర్ణీతములు. కృష్ణాజినములు, దర్భాసనములు రుద్రాక్షములు జటాజూటములు మొదలయినవి మానిమిత్తము నిర్మింపఁబడినవి. ఆశలు జయించినవారు బ్రాహ్మణులుగదా! అసంతుష్టిగల బ్రాహ్మణుఁడు సంతుష్టిగల క్షత్రియుఁడు చెడుదురని వినలేదా? రాజా! ఇంక నీపట్టాభిషేక ప్రయత్నము జేయించెద. సామంతరాజులకును సాటిమేటి నృపులకును నభిషేకమహోత్సవమునకురమ్మని సగౌరవంబుగా నాహ్వానములఁ బంపించెద. సింధువు, సరస్వతి, భాగీరథీ యమున మొదలగు పవిత్రనదీనదంబులజలములు స్వాధ్యాయవేత్తలయిన బ్రాహ్మణోత్తములచేతఁ దెప్పించెద. ప్రతిదేవాలయమున నీయభ్యుదయమునిమిత్తమై యభిషేకములఁ జేయించెద. నగరమందంతటను సూర్యరశ్మి గనఁబడకుండ బందిళ్ళు వేయించి యరఁటికంబముల నాటించి తోరణములఁ గట్టించి వీథివీధులయందు శృంగారలక్ష్మి ఘల్లుఘల్లుమని తాండవనృత్యము సలుపునట్లు—దేవేంద్రుఁడు తనవీటికన్న నిది యందముగా నున్నదని వేయికన్నులఁ దెఱచి చూచి వెఱఁగుపడునట్లు—పుర మలంకరించెద. దేశమందున్న భూసురోత్తముల నందఱ రావించెద. సంతర్పణముల సమారాధనములఁ జేయించెద. భూరిదక్షిణలచే వారిని దనివి నొందించెద. బ్రాహ్మణాశీర్వాదములతోడను, ప్రజలయానందధ్వనులతోడను, మంగళతూర్యారావంబులతోడను, వారవిలాసినీ గానధ్వానములతోడను, భూనభోంతరములు నిండునట్లు—దశదిశలు మాఱుమ్రోయునట్లు—గగనము

బీటలువాఱునట్లు—మహేంద్రుఁడు నన్ను మించినభూమండలాఖండ లుఁడు వీఁ డెవఁడురా నూతనముగా వచ్చెనని గుండెలు పీచుపీచు మన బెదరిబెదరి చూచునట్లు-చూపఱునీపురము కలియుగవైకుంఠమని యానందించునట్లు—నీకీర్తి యాచంద్రతారార్కము భూమిపై నిలుచునట్లు—మహోత్సవముఁ జేయించెదఁ జూడు. అని యుత్సాహ రసము వెల్లివిరియఁ బలికెను. చిత్రభానుఁడు రుద్రభట్టుం జూచి ముసిముసి నవ్వులు నవ్వి తలఁయూఁచెను.

అనంతరము వజ్రపాణి వచ్చుటయు నతనిని జయములవిష యమై ప్రశంసించి పట్టాభిషేకానంతరము నావచ్చిని పందిళ్లలోనే కర్పూరమంజరి నిచ్చి వివాహము జేయించునట్లు జెప్పి పంచెను. వజ్రపాణి యాసన్నవివాహమహోత్సవమున కువ్విళ్లూరుచుఁ బిచ్చిద యిన తనయిల్లాలిని బిడ్డలను వివాహమున కడ్డురాకుండ నామెపుట్టి నింటికిఁ బంపెను.

ముప్పదిరెండవ ప్రకరణము

పూర్వప్రకరణమున వర్ణింపఁబడిన ప్రసంగము జరిగినరెండవ నాఁడు చిత్రభానుఁడు రుద్రభట్టు కోటలో నొకగదిలోఁ గూర్చుండి రాజ్యవ్యవహారములఁగూర్చి ప్రసంగించుచుండఁ బదుగురు రాజభటుల తోఁగూడి సుషేణుం డను చిన్నసేనాపతి దర్శనాపేక్షియై ద్వారపాల కులచేతఁ దనరాక తేని కెఱిఁగించెను. రావచ్చునని ప్రభు వానతీయ నతఁడు లోనికరిగి జోహారుచేసి యిట్లువిన్నవించెను. ''మహాప్రభూ! దేవరవారిపంపున నల్పసేనం దీసికొనిపోయి యొకయడవిలో మాళవ రాజకుమారుఁడగు మకరందుని బట్టుకొంటిని. అతఁడు ప్రయాణ

ఖేదమునఁ గాఁబోలు చెట్టునీడను సొమ్మసిలి నిద్రపోవుచుండె. నిద్రా
పరవశుఁడై యుండఁగానె కాళ్ళకుఁ జేతులకు సంకెళ్ళు దగిలించి
గుడ్డతో నొకడోలికఁగట్టి యందు వానింబడవైచి తోడ్తెచ్చితిని."

అదివిని చిత్రభానుఁడు మహాసంతోషముతో "ఏఁడీ! ఆకుఱ్ఱ
వాఁ డేఁడీ?" యని ససంభ్రమముగాఁ బలికెను. "ఆపాపాత్ముఁడు
పట్టువడినాఁడా?" యని రుద్రభట్టడిగెను. "స్వామీ! యతఁడు వీధి
లో నున్నాఁడు సెలవైనయెడల నోడ్తెచ్చెద" నని సుషేణుఁడుత్తర
ముఁజెప్పఁ దోడ్కొనిరమ్మని రాజు సెలవొసంగ నావల కరిగి డోలి
కనుండి మకరందుని ప్రభుసన్నిధికి నడిపించెను. సంకెళ్ళబరువున
నతఁడు సరిగా నడువలేక తొట్రుపడుచు రాజసన్నిధిం జేరెను.

వెనుకటి కయ్యమునఁ గలిగిన గాయమువలన రక్తహీనుఁడై
సొక్కినవాని, మార్గాయాసమునం బడలి వాడినపూవుదండయుం
బోలె నవసియున్నవాని, శృంఖలాబద్ధములైన కాలుసేతులుగలవాని,
నల్లకలువరేకులకు వన్నెలు దిద్దు విశాలనేత్రములవాని, నవమదను
నైన మెచ్చని సోయగమువాని, శరత్కాలచంద్రమండలమునకు
సాటియగు నెమ్మొగమువాని, మాళవరాజకుమారుని గనుంగొని
చిత్రభానుఁడు వాని చెలువంబునకు నచ్చెరువడి "ఆహా! ఏమిచక్కఁ
దనము! ఏమి యాముఖవిలాసము! ఏమి యాకన్నులతీరు! నాజన్మ
మధ్యమున నే నింతచక్కని రాకొమరునిం జూడలేదు. ఇందుచేతనే
మాకర్పూరమంజరి మనస్సు వీనియందు లగ్నమై యున్నది. ప్రాయ
మునం దున్న జవ్వని యీభూలోకమన్మథునిఁ జూచినపక్షమున వీని
పొందునకై యాసింపకుండునా? ఇట్టి సుకుమారుని, నిట్టిజగన్మోహనా
కారుని నే నెట్లు కారాగృహాబద్ధుఁ జేయుదును? అయినం బగవాఁడు
గదా?" యని తనలో వితర్కించి "సుషేణ! ఇతనిని గారాగృహ
మున బంధింపుము" అని యానతిచ్చెను. "పాముపిల్లను వెంటనే చం

పక విడుచుట ధర్మముగాదు. రాజా! మీఁద నీచిత్తము" అనిరుద్ర భట్టు చెప్పెను.

"ఓహో! నీవు రుద్రభట్టువుకావా? మాతండ్రిని వంచించి తత్ఫలముగా దేశభ్రష్టుడవై యిందుఁజేరి యీరాజునకు దుర్బుద్ధులు గఱపుచుంటివా? మరణమన్న నాకించుకయు భయము లేదు. పాప కర్ముఁడవైన నీకే మరణభయముగలదు. పుట్టినవాఁడు గిట్టక మానఁడు; గిట్టినవాఁడు పుట్టక మానఁడు." అని మకరందుఁడు రుద్రభట్టునకుత్తరము చెప్పెను. అంతలో సేవకులు వానిని మెల్లగా నావలకుఁ దీసికొనిపోయి కారాగృహమున బంధించిరి.

"మల్లికా! నీ వేమో చంద్రికతో రహస్యముగాఁ జెప్పు చుంటినది యేమే? మీప్రసంగములో మకరందుఁ డనుమాట నాచె వినిబడెను. యథార్థము జెప్పవే! అతఁ డేమైనాఁడే? ప్రాణముతోను న్నాఁడా? నామీఁద దయ యుంచి చెప్పవే?" యని కర్పూరమంజరి యడుగ మల్లిక యెప్పటికయిన నది యామెకుఁ దెలియక మానదని మకరందుఁడు కారాబద్ధుడైనవార్త యామె కెఱిఁగించెను.

అదివిని కర్పూరమంజరి యింతింత యనరాని వంతందగిలి మల్లికంజూచి యిట్లనియె. "ఓసి! మెత్తనిచిగురుటాకుల మెచ్చునిచూ యడుగులుసంకెళ్ళనెట్లోర్చునే? ఆబాహులతికలు శృంఖలాబద్ధములై యెంతనలిగెనో నిరంతర మంతఃపురవాసముఁ జేయు నాసుకుమారి కారాగృహంబున నెట్లుడఁగలఁడె? కటికినేలం బవ్వళింపఁగలఁడే? తినుటకుపీలులేని యామోటకూఁడు నాసుకుమారి తినఁగలఁడటె? అయ్యయ్యో! ఎంతకష్ట మెంతకష్టము. అదియటుండ నాతండ్రి వానిం బ్రతుకనిచ్చునటే? అతఁడొకవేళ బ్రతుకనిచ్చినను క్షుద్రమనస్కుఁ డైన రుద్రభట్టు వానిని వధింపుమని నాతండ్రిం బురికొల్పి కృతకృ త్యుఁడు గాకపోవునే? అయ్యయో! నేనున్నతావుననే వాని కవసాన

దళ సంప్రాప్తించుచున్నదా?" యని పరిపరిభంగుల విలపింపఁ జొచ్చెను. నాఁటంగోలె నామె వట్టినేలం బవ్వళింప నారంభించెను. ఆహారము వర్జింప సంకల్పించెను. చెలికత్తెలు బతిమలాడ నించుకించుక దిని యూరకుండును. చెఱసాలలో నతఁడెట్లు కష్టపడుచుండెనో యంతఃపురమం దుండియుఁ దాను నట్టికష్ట మనుభవింపవలెనని సంకల్పించెను. వివాహమైన తరువాత భార్యపతివ్రతయై భర్త్రృమార్గ మనుసరించుట లోకమం దున్నదిగాని పాణిగ్రహణము గాకమునుపే కామించినపతితోడిదే లోకమని యాతనికొఱకై కష్టములు పడుట యెందుఁ జూడలే దని చెలికత్తెలామెతో నని యప్పనినుండి మరల్పఁ బ్రయత్నించినను నామె మానదయ్యె.

అట మకరందుఁడు కారాగృహవాసి యయ్యుఁ దనహృదయమునఁ గర్పూరమంజరిని నిలుపుకొని యన్నపానాదులఁ దెచ్చినపరిచారకులను గావలివాండ్రను, గర్పూరమంజరీకుశలవార్తల నడుగుచు నామెంగూర్చియే స్వప్నములఁ గాంచుచు నామెతో మనస్సమాగమసుఖము బడయుచు నామెం గలసికొనుటకు నుపాయమేదియైన లభించునాయని నిరంతరముఁ జింతించుచుఁ గాలము పుచ్చుచుండెను.

మకరందునిఁ జూచినదిమొదలుకొని సువర్ణునిమీఁదఁ గల దీర్ఘక్రోధముచేత రుద్రభట్టు మకరందుని జంపింపవలయునని దృఢసంకల్పము గలిగియుండెను. వాని చక్కఁదనముఁ జూచియు, వానిపైఁ దనకూఁతున కనురాగ ముండుటచే వానిని వధించిన దనకూఁతు రేమగునోయని సందేహము గల్గియు రుద్రభట్టు ప్రేరణచేసినను జిత్రభానుఁడు మాళవరాజనందనుని జంపింపక యూరకుండెను. అందుచే రుద్రభట్టుకు మనస్స్థిమితము లేకపోయెను. త్వరితముగా వానినెట్లు తుదముట్టింపవచ్చునని యుపాయములు వెదకుచు నొకనాఁడు వ్రజ

పాణింబిలిచి యిట్లనియె—"వజ్రపాణీ! నీకొక్కహితోపదేశముఁ జేసెద. అది నీమనస్సులోనే యుంచుకొమ్ము! చిత్రభానునకైన నిది తెలియనియ్యవద్దు. ఈయుపదేశము నాకడుపులో జన్మించి నీకడుపులో నస్తమింపవలయు. కర్పూరమంజరిని జిత్రభానుఁడు నీకిచ్చి వివాహము సేయఁదలఁచినమాట నిజము. కాని, కర్పూరమంజరి యీమకరందుని వలచినది. నీయం దామెకు లేశమయిన ననురాగములేదు. అనురాగము లేకపోవుటయేగాదు. నీపేరువిన్న నామెకుఁ దలయేఁఱు. దానికిఁ దోడుగా వీఁడిక్కడికి వచ్చుట యనర్థకము. వానిని వెంటనే సంహరింపవలసినదని చిత్రభానునితో నేను రెండు మూఁడుసారులు చెప్పితిని. ఎందుచేతనో యతఁడు సంహరింపక యూరకున్నవాఁడు. కావున నక్కుమారుని దెగటార్చుమని నీవును బట్టుపట్టి చిత్రభాను నొడంబఱుపుము. వానిరక్తము కన్నులఁ జూచినఁ గాని నీవు నిద్రపోకుము. వానిమీఁద నాకేమియుఁ గోపములేదు. కాని, నీవివాహము నిమిత్తమై నే నీయలమటఁ బొందుచుంటిని. నీవు కర్పూరమంజరి కేలువట్టిననాఁడు నాకన్నులు చల్లఁబడును. చిత్రభానుని పట్టాభిషేకముఁ జూచి, నీపాణిగ్రహణమహోత్సవముఁ జూచి, యనంతరము నేను తపంబుచేసికొన హిమాలయమున కరిగెద. ఈరెండే నాసంకల్పములు. అందు మొదటిది జరిగినట్లె. రెండవదియు జరిగినట్లే గాని వీనిం దెగటార్చిన నిస్సందేహముగా నది జరుగును. కావున నప్పని యతివేగంబున జరుగునట్లు ప్రయత్నింపుము."

ఆపలుకులు చెవిని బడినతోడనే వజ్రపాణివజ్రహృదయము నీరయిపోయెను. పోవుటయు నతఁడు కఠిన స్వరముతో రుద్రభట్టున కిట్లనియె. "అయ్యా! కర్పూరమంజరి నన్నే వలచినదని నానిమిత్తమే పరితపించుచున్నదని నానామమే స్మరియించుచున్నదని ప్రధానమైన నాఁడు నీవేగదా చెప్పితివి. ఆనోటితోనే యామెకు నాయం దనురక్తి లేదని నాపేరువిన్నఁ దలయేఁఱని యెట్లు చెప్పుచుంటివి! ఈరెండు

మాటలలో నేది నిజము?" అని యడిగెను. అడుగుటయు రుద్రభట్టు తనమాటలకుఁ గలపరస్పర వైరుధ్యము మనంబునకుఁ దట్ట, నయ్యిక్కట్టు నుండి తప్పించుకొనుటకు వెంటనే యుపాయ మన్వేషించి యిట్లనియె. "ప్రధానమయినదినములలో నా బాలిక యట్లె నిన్ను వలచియుండెను. ఈనడుమ మకరందునిఁ జూచెనఁట! చూచినదాదిగా వానికై పరితపించుచున్నదఁట! పడుచుకన్నులకు బాగోగులుగలవా? ఎదుటనున్న వాఁడె పెండ్లికొడుకు. అంతేగాని నామాటలలో వైరుధ్యము లేదు. లేదు కావుననే నీమేలుకోరి వెంటనే చెప్పితిని, నాఁడట్లు నీతోఁ జెప్పితినన్నమాట నాకు జ్ఞాపకములేదా? కావున నీవు నా మీఁద ననుమానపడక నీకార్యసిద్ధికై పాటుపడుము."

ఆమాటలు వజ్రపాణికి నచ్చెను. మఱునాఁ డావిషయమైచిత్రభానునితో నొక్కి చెప్పవలెనని యతఁడు సంకల్పించుకొని యింటికిఁ జనెను. అతఁడు పోవునప్పటికి వాని యత్తవారియూరినుండి వచ్చిన యొకసేవకుఁడు నమస్కరించి యొకజాబు చేతికిచ్చెను. ఆజాబుతీసికొని యామూలాగ్రముగఁ జదువుకొని "హా! దైవమా" యనినేలఁ గూర్చుండెను. సేవకులు "స్వామీ! ఏమియాపద వాటిల్లె" ననియడుగ నతఁ డుత్తరము చెప్పక జాబుచేతికిచ్చెను. వారు జాబు చదువుకొని "అయ్యో! సునందాదేవి యున్మాదవశమున నూతిలోఁబడి మరణించెనఁట! తల్లిలేని యాపిల్లలదుఃఖము వర్ణనాతీతమైనదఁట. హా యెంత కష్టము. ఇల్లు కాలిపోయినది. ఇల్లాలు కూలిపోయినది. గోరుచుట్టుపై రోఁకటిపోటన్న మాట నిజమైనది" యని విచారింపఁదొడఁగిరి. అప్పుడు వజ్రపాణికి దుఃఖముతో గాఢపశ్చాత్తాపము గలిగెను. తన నాదరణమువల్లనే, తనయప్రియసంభాషణములవల్లనే, తనయజాగ్రత్తవల్లనే, యామెకు మనశ్చాంచల్యము గలిగినదనియు నెట్లయిన

నామెమరణమునకుఁ దానే కారణమనియు భావించి వాపోవఁజొచ్చె
ను. ఆవార్త తెలిసినతోడనే మంత్రులు బంధువులు వచ్చి సమయో
చితసంభాషణంబుల నూఱడించిరి. వజ్రపాణి మఱునాఁడుదయమున
నవ్వార్తఁ జిత్రభానునకుఁ దెలిపి పయనమై యత్తవారియూరు జేరి
మాతృహీనులయినబిడ్డల నోదార్చి యుత్తరక్రియలు సమాప్తమగు
వఱకు నక్కడనే యుండెను.

ఇల్లాలిమరణవార్త వినినతోడనే యతఁడు విషాదపరీతమన
స్కుఁడైనను దినములు గడచినకొలఁది దృఢచిత్తుఁడై కర్పూరమం
జరీపాణిగ్రహణమునకు మొదటియాటంకము భార్యమరణముతోఁ
దీరినదనియు, మకరందునివధతో రెండవది గతించిపోవు ననియు,
దైవము తన కనుకూలుఁడై యపకారరూపకమైనయుపకారము చేసె
ననియు భావించి యొకవిధముగా సంతసింపఁజొచ్చెను.

ముప్పదిమూఁడవ ప్రకరణము

జనకునిక్రూరస్వభావమును, రుద్రభట్టుయొక్కదుష్టవృత్తియు
లెస్సగా నెఱిఁగినదగుటచేఁ గర్పూరమంజరి మకరందునకు వారిరువురి
వలన నేదేనపాయము వాటిల్లవచ్చు నని శంకింపఁ జొచ్చెను. అత
నికి బంధమోక్షణముచేయవలెనని మల్లికతోఁ బలుమాఱు జెప్పుచుం
డును. ఎన్నివిధంబులఁ జూచినను శక్యము గాకపోయెను. అందువలనఁ
గర్పూరమంజరిమనస్సు తామరాకులోనినీటివలె స్తిమితము లేక
యుండెను. మల్లిక కర్పూరమంజరికి మనస్సంతోషమునుగూర్పమక
రందునిఁ జెఱనుండి విడిపించుటకై యెన్నోపన్నుగడలు పన్నుచుం
డెను. అట్టిసమయమునఁ జిత్రభానుఁడు మృగయాక్రీడనిమిత్తము

రాజధానివిడిచి సపరివారముగా నరణ్యముల కరిగెను. విజయసేనుఁడు రుద్రభట్టు రాజ్యవ్యాపారములఁ జూచుటకై నగరమం దుండిరి. అత్తతిఁ గర్పూరమంజరి మల్లికం బిలిచి "ఓసీ! మాయయ్య వేఁట కరిగెను. నిన్న సాయంకాల మాయన యభ్యంజనస్నానముచేసి వ్రేలి యుంగరముఁ దీసి యొకపీటపైఁబెట్టెను నేఁటిప్రాతఃకాలమున వేఁట కరుగునప్పుడు దానిని దీసికొనుట మఱచిపోయెను. అది నాకు దొరికి నది. ఆయంగుళీయకము నీకిచ్చెద. మాళవరాజనందనునిబంధమోచ ణమున కది యుపయోగపడునేమో విచారింపుము. ఇట్టివిషయము లలో నీవు మిక్కిలి నిపుణురాలవు. కావున లెస్సగా నాలోచించి మాళవరాజకుటుంబము నుద్ధరింపుము. మాతండ్రి రాకమునుపే యీ పని జరుగవలయు. అతఁడు వచ్చెనా యిఁక నాసయుండదని నాయభి ప్రాయము. మకరందుఁడు తనకూఁతుఁ గత్తి గట్టి కయ్యమునకు వచ్చెననియాయనమీఁద మాయయ్యకుఁ గ్రోధము. శత్రువైనసుదర్శ నునిసూనుఁ డగుటచే రుద్రభట్టునకు ద్వేషము. వజ్రపాణికి నాకత మున వానిపై మత్సరము. కావున నీనగర మతని నగ్నిహోత్రపుం బుంత. ఎంతవేగముగా విమోచనమైన నంతక్షేమము. పాణిగ్రహణ మైననుసరే, కాకపోయిననుసరే! ఆమన్మథమన్మథుఁడు బ్రతికినం జాలును. ఇందు నీవు కృతకృత్య వగుదువేని నాకు మహోపకారము చేసినదాన వగుదువు." అని బహువిధముల బ్రతిమాలి చెప్పెను.

"అమ్మా! ఉంగర మిటుదెమ్ము. దీనివలనఁ గార్యసాధన మయ్యెనా మంచిదె. కానియెడల నీయుంగరము నీకుఁ దెచ్చియిచ్చెద ఎట్లయిన నాతని బంధవిముక్తుని జేయవలయు ననియేనాసంకల్పము. ఆసుకుమారుని గారాగృహమున నుంచుట దిరిశనపువ్వు నెండలో వైచుటయని నేనెంతో విచారించుచున్నదానను. నాకే యింతమనో వ్యథయుండఁగా నీమన స్సెంత మఱుఁగుచున్నదో చెప్పవలయునా"

యని యంగుళీయకముఁ దీసికొని యీరేయి చాలసేపు నిద్రపోవక దానినుపయోగించువిధము నాలోచింపఁదొడఁగెను. ఎట్టకేల కామె కొకయుపాయము పొడకట్టెను. మఱునాఁడుదయమునఁ గర్పూరమంజరినిజూచి మీతండ్రి వ్రాసినలేఖ యేదయిన నీయొద్దఁ గలదా? యని యడిగెను.

"మున్ను విదర్భలో నున్నప్పుడు మాయయ్య వ్రాసినజాబొకటి నాకడఁ గలదు. అది యెందుకు? కావలసిన నిచ్చెద" నని యామె బదులు చెప్పెను. "ఎందుకని నీవడుగకు. పనియైనపిదప దానిప్రయోజనముఁ జెప్పెద. ముం దాలేఖ నిటుదెమ్ము" అని యామెకడనుండి జాబుం గైకొని రహస్యముగా నొకగదిలోఁ గూర్చుండి యేదో వ్రాసి యేదో పన్నుగడ బన్ని కర్పూరమంజరికడ సెలవుగైకొని యొందే నరిగెను.

సాయంకాల మయ్యెను. ప్రభాకరుఁడ స్తమించెను. జగమునం దెల్లెడనిండియున్నయజ్ఞానమువలెనే కారుచీఁకటులు నలుదెసల వ్యాపించెను. చరమాద్రిఁ గ్రుంగినభానుఁడు ధరించినయనంతకోట్యవతారములో యనునట్లు దీపములు ప్రతిగృహంబున నలంకరించెను. సుషేణుఁడు తనగృహంబున బిడ్డలముద్దులాడుచు నుండెను. అప్పు డొక సేవకుఁడు వానిదర్శనముజేసి నమస్కరించి యెట్టయెదుట నిలచెను. "నీవెవ్వఁడవు? ఏమిపనిమీఁద వచ్చితివి?" అని యాతఁ డడుగ నా సేవకుఁ డిట్లనియె. "మహాప్రభూ! చిత్రభానుమహారాజుగారి సన్నిధి నుండి వచ్చితిని. ఆయన యీజాబు మీకిమ్మని నాచేతికిచ్చె." నని యొకలేఖ చేతికిచ్చెను. సుషేణుఁడు దీపపువెలుఁగునఁ దానినిట్లు జదువుకొనెను.—

"చిరంజీవి యైన సేనాపతిసుషేణునకుఁ గాశ్మీరమహీపాలుఁడు చిత్రభానుఁడు వ్రాసినశాసనము. మకరందునితండ్రియగుసుదర్శనున

కను, మాకును సంధిజరిగినందునను, సుశర్మనుఁడు మాకు విధేయుఁడై సామంతరాజై ప్రతియేటఁ గప్పముగట్ట నొప్పుకొనినందునను మకరందుని బంధమునుండి మేము విడిపింప నిశ్చయించినారము. కావున నీవీజాబుజూచినయాక్షణమే మా రాకుమారుని జెఱనుండి విడిపింప వలసినది. ఇతఁడు మాళవరాజసచివుఁడు. వీనిపేరు వినయంధరుఁడు. మాకును మాళవరాజునకును వీనిద్వారముననే యుత్తర ప్రత్యుత్తరములు జరుగుచున్నవి. నీకు నమ్మికగలుగుటకై నానామాక్షరములు గలయంగుళీయకము వీనిచేతికిచ్చి పంపుచున్నాఁడను. ఇది యానవాలుగా గ్రహించి నీవు వెంటనే వాని విడిచిపుచ్చునది.

ఇట్లు.

కాశ్మీరనాయకుఁడు, చిత్రభానుఁడు''

లేఖఁ జదువుకొని సుషేణుఁడు ప్రభువుగారియుంగర మేదియని యడిగెను. తోడనే వినయంధరుఁడు దాని నతని కిచ్చెను. అది పుచ్చుకొని యాసేనాపతి దీపపు వెలుఁగున దానిని బలుమాఱు శోధించి యది తనప్రభువుదే యని తెలిసికొని తత్క్షణమే వినయంధరుని వెంటఁబెట్టుకొని కారాగృహమున కరిగి తలుపుదెఱపించి మకరందుం జూచి ''నిన్ను విడువుమని మహారాజుగారియాజ్ఞ యైనది. నీయిచ్చ వచ్చినచోటికిఁబొమ్ము!'' అని చెప్పెను. మకరందుఁడు మిక్కిలి యాశ్చర్యపడి పెద్దపులినోటఁ దలయిడి చావకుండఁ బైకివచ్చినవాని నట్లు తన్నుభావించుకొని చిత్రభానుఁడు తన్ను విడిపించుట కేమి కారణముండుననుచు వితర్కించుచుఁ గారాగృహమునుండి వెలువడి వీధిలోనికి వచ్చెను. అత్తఱి వినయంధరుఁడు వానిం గలిసికొని ''దేవా! నేను మీ కాప్తుఁడను. మీరు నన్నిప్పుడు గుర్తింపలేరు. మీరిప్పుడు బంధవిముక్తు లయినను మీ కపాయము తప్పలేదు. ఇచ్చోటు విడిచి యీక్షణమే మీరు వెడలిపోవలయు. నగరము వెలు

పల మీానిమిత్తమై నేను కల్యాణలక్షణసంపన్నమై యతివేగవంతమైన యాజానేయతురంగమును సిద్ధముచేసి యుంచితిని. అచ్చోటనే మీా కాహారముగూడ నేర్పఱచితిని. నావెంటవచ్చి యాయాహారము భుజించి యాయశ్వమెక్కి పయనముజేసి తెల్లవాఱకమున్నె జాల దవ్వరుగవలయు, ఎందుకని ప్రశ్నింపక నాచెప్పినచొప్పున మీారు చేయుఁడు. కర్పూరమంజరీపాణిగ్రహణ మయినతరువాత నేనిట్లుచేయు టకుఁ గారణము లాెవలననే తెలియఁగలవు.'' అని విన్నవించెను. అప్పలుకులు విని వెండియు నెట్టిప్రశ్నముల నడుగక మకరందుఁడు వినయంధరునివెంట నరిగి యాహారముభుజించి యాహయమునెక్కి యదృచ్ఛంజనియెను. వినయంధరుఁడు వానిని సాగనంపి నగరంబుఁ బ్రవేశించెను.

మఱునాఁ డుదయమున మల్లిక కర్పూరమంజరిం గలసికొని మకరందుఁడు బంధముక్తుఁడై కడచినరేయి సురక్షితముగా నావ లకుఁబోయె నని విన్నవించెను. కర్ణామృతము లయినయప్పలుకులు విని కర్పూరమంజరి సంతోషమున వికసితముఖయై ''సఖి! నన్నుఁ గౌఁగిలించుకొనుము. నీవు మాకెల్లఁ బ్రాణదానము జేసితివి. సఖవన్న నీవే సఖవి. ఆఁడుదానవన్న నీవే యాఁడుదానవు. వేయి జన్మములకైన నీఋణముఁ దీర్చికొనఁగలనఁటే!'' యని కృతజ్ఞతం దెలిపిబహూకరించెను. అప్పుడు వారీక్రిందివిధముగా మాటలాడిరి.

మల్లిక—అమ్మా! నేను చేసినదేమున్నది! దైవ మనుకూలమైనపక్షమున నెట్టికార్యమైనఁ జుల్కనగా సాధింపవచ్చును. అప్పుడు గుండులు నీటిలోఁ దేలును. ప్రతికూలమైన బెండులు మునుంగును. మనయత్నము నిమిత్తమాత్రము; కార్యసిద్ధి యాశ్వరాయత్తము. ఇంతకు నీవు సంకల్ప సిద్ధురాలవు.

కర్పూ—ఓసీ! అతఁ డెట్లు విముక్తుఁడయ్యెనో చెప్పవే!

మల్లిక—చెప్పెదను లే తొందరేమి! అశ్రమముకొంత సేపు నడచుకొనుము.

కర్పూర—పోనీ, యుంగర మెక్కడనున్నదో చెప్పుము!

మల్లిక—ఉంగరము సుషేణునియొద్దనున్నది.

కర్పూర—అతనియొద్ద కెట్లుపోయినది?

మల్లిక—వినయంధరుఁ డాతని కిచ్చెను.

కర్పూర—వినయంధరుఁ డెవ్వఁడు?

మల్లిక—నీకు నమ్మినబంటు.

కర్పూ—ఏమిది! నానమ్మినబంటా? నాకడ నెవ్వఁడైన మగవాఁడు పనిచేయుచున్నాఁడఁటె? మనకంచుకిజనములోనైన నట్టివాఁడున్నాఁడా?

మల్లిక—ఉండనీ, లేకపోనీ. అతఁడు నీ లెంక.

కర్పూర—(కోపముతో) ఓసీ! మల్లిక, మద్యపానముచేసితివా? లేక నిన్నే దేనిఁ బిశాచ మావహించినదా?

మల్లిక—మహారాజులకు, మహారాజపుత్రికలకు, మద్యము సులభముగా లభించునుగాని పేదదానికి నాకెట్లు దొరకును? నేనే పిశాచమునై యెల్లవారి నన్నమునకు, వస్త్రమునకుఁ బీకికొని తినుచుండ నన్ను వేఱొకపిశాచ మావహించునా?

కర్పూ—ఈయసందర్భప్రలాపములఁ జూడ మకరందుఁడు సురక్షితముగా నటనుండి దాఁటెనో లేదో యనిసందియము గలుగుచున్నది.

మల్లిక—నేను మల్లిక నగుదునో కానో యనువిషయమును గూర్చి సందేహపడుచున్నావా?

కర్పూ—నీవు మల్లికవే! సందియము లేదు.

మల్లిక—అట్లయిన మకరందుఁడు దాఁటిపోవుటలో సందియము లేదు.

కర్పూ—ఓసీ! నివక్రోక్తులు కట్టిపెట్టి వినయంధరుఁ డెవ్వఁడో సరిగఁ జెప్పవే?

మల్లిక—అమ్మా! నాఁటిజయంధరుఁడే, నేఁటి వినయంధరుఁడు.

కర్పూ—జయంధరుఁ డెవ్వఁడో నాకు జ్ఞాపకము లేదు.

మల్లిక—కర్పూరమంజరిపక్షమున నుజ్జయిని కరిగి యామె వలపు మకరందుని కెఱిఁగించినవాఁడె జయంధరుఁడు.

కర్పూ—(సంతోషముతో) ఓసీ! నీయిల్లు బంగారుగాను, నీవుమగవేషము దాల్చి వినయంధరుఁ డని పేరు పెట్టుకొని సుషేణుని వంచించితివా యేమి?

మల్లిక—అమ్మా! నాచేతఁ బగటివేషములు రాత్రివేషములు వేయించి మీ రంతఃపురమునఁ గూర్చుండి మీతల పెట్టిన కార్యములందు సిద్ధిఁగాంచుచుందురు.

కర్పూ—ఓసీ! నీప్రజ్ఞ శ్లాఘాపాత్రమే! నీ వేమహారాజునొద్దనైన మంత్రిత్వముఁ జేయఁ దగుదువె.

మల్లిక—నీవు మకరందుని జేపట్టి మాళవంబునకు మహారాజ్ఞివైనప్పుడు నీకడ మంత్రిత్వము జేసెదనులే. అప్పుడుమాత్రమునన్ను మఱచిపోకుము.

కర్పూ—సఖీ! నాశరీరమును నేను మఱతునేని నాప్రాణమును నేను మఱతునేని నిన్ను మఱతును. కాని వక్రసంభాషణము లేకుండ జరిగినవృత్తాంత మంతయుఁ జెప్పుము!

మల్లిక—అమ్మా! చెప్పుట కేము న్నది? పరిచారికనైనను జదువుట, వ్రాయుట లెస్సగా నేర్చినదాన నగుటచే మకరందుని వెంటనే విడిపింపుమని మీయయ్య వ్రాసిన ట్లొకజాబు వ్రాసితిని.

అక్షరములు మీ యయ్య వ్రాసిన యక్షరములవలె నున్నవి.

కర్పూ—గదిలోఁ గూర్చుండి చేసినపని యిదియా!

మల్లిక—మ తేమిచేసితి ననుకొంటివి? తలుపులు మూసికొని తపముజేసికొంటి ననుకొంటివా? ఆ జాబునకుఁ దోడుగా నుంగర మానవాలు జూపితిని. దానితో నంతపని జరిగినది.

అని తన కావించినకృషి యంతయు మల్లిక సవిస్తరముగాఁ జెప్పి యామె నానందసముద్రమున ముంచెను.

ముప్పదినాలుగవ ప్రకరణము.

అట్లరణ్యమునఁ బ్రియమిత్రునింగానక భద్రసేనుఁడు పొదలు గుహలు చెఱువులు వాఁగులు మొదలగు సమస్తప్రదేశములు వెదకి వెదకి వేసారి మకరందునికథనుగూర్చిని యిదమిత్థమని నిర్ణయింపఁ జాలక, స్వదేశమునకరుగుట కంతకుముందే యిష్టములేక పాంచాల దేశమునకుం బోయి యటనుండి మిత్రునిజాడ లరయవచ్చునని రాజ ధానియైన కన్యాకుబ్జమునకు జనెను చని తన రాక మంత్రుల కెఱిఁ గించుటయు, వారు మాళవరాజసుపుత్రుఁడైన రత్నసేనునికొడుకగుటచే వానిని గడుంగడు గారవించిరి. పూర్వపరిచితుఁడగు మాధవసేనుఁడు వానిరాకకు మిక్కిలి సంతసించి మకరందునిజాడ లడిగి తెలియఁ జాలక యెంతేని వగచెను.

మకరందుఁడు నాఁటిరేయియెల్ల నయ్యుత్తమ తురంగంబు నెక్కి తెల్లవాఱునప్పటికిఁ జాలదవ్వరిగి యచ్చటఁ బ్రాతఃకాలకృత్య ముల నిర్వర్తించుకొని గుఱ్ఱమునకు మేఁతవైచి దానికి విశ్రాంతి నొ సంగి దానినొక్కచోట విశ్రమించి మధ్యాహ్నము మఱల బయనమ్మై

సాయంకాలమగునప్పటికిఁ గాశ్మీరదేశపుంజొలిమేరఁదాఁటి పాంచాల దేశముం జొచ్చెను. ఒక గ్రామమునం దారాత్రి విశ్రమించి యుపాయము గలించినందున స్తిమితమనస్కుఁడై యతఁడు మెల్ల మెల్లగా బయనముచేసి తాను మిక్కిలి డస్సిపోకుండఁ బ్రాణాపాయము దాఁటించిన గుఱ్ఱము చెడిపోకుండఁ బయనంబులు సేసి కతిపయదినంబులకు రాజధానియగు కన్యాకుబ్జముఁ జేరెను. చేరి రాచనగరు ముంగట గుఱ్ఱమునిలిపి తననామధేయాదులు ప్రతిహారివలన మహేంద్రదేవునకు విన్నవింప నారాజన్యుఁడు మకరందునిఁ దనమందిరమునకు రావించి సన్మానించి యాతనివలన రణమండలి పరాజయమును, దాని వెనుక జరిగిన కారాగృహనివాసాదులును విని విస్మయమును జాలియు నొంది యచ్చటఁ గొన్ని దినంబులుండుమని వేఁడెను, అట్లుకాకయని బహువిధముల వారిచే సత్కృతుఁడై యచ్చటనుండి తనమిత్రుఁడగు భద్రసేను నచ్చటం గలసికొని కౌఁగలించుకొని యాకస్మికముగాఁ దా నగపడకపోవుటకుఁ జిత్రభానుప్రేరితులైన సైనికులు తన్నుఁ బట్టుకొనుటయే కారణమని చెప్పి తన చరిత్ర కథనముచేత వానిం దుఃఖపరవశుం జేసెను.

అంతరంగము గలసినమిత్రులు కలసినప్పుడుగల్గునానందమను భవైకవేద్యమేగాని వర్ణింప నలవిగాదు. అయ్యిరువురుఁ దమక్షేమవార్తలు దమజాడలు దెలియక దురపిల్లుచుండు తల్లిదండ్రులకుఁ దెలియఁజేయింపఁదగునని మహేంద్రదేవునితోఁ జెప్ప నాతఁడు విశ్వాసముగలబంట్ల నప్పనికై మాళవంబునకుఁబంపెను. పిమ్మటఁ గొన్ని దినములచ్చటనుండి కాశ్మీరరాజ్యముపై మరల దండువెడలవలయునని మహేంద్రదేవునితోఁ జెప్పి మాధవసేనునితోడను, దక్కిన పాంచాల మంత్రులతోడను, మంతనంబుండి యాసారి వేఱువేఱుగాఁగాక మాళవ పాంచాలసైన్యము లేకమై పోరాటము సలిపినఁ దప్పక జయంబు

సేకూరునని యట్లు చేయునట్లు వారి నొడంబఱిచిరి. అవ్వల మకరం దభద్రసేనులు పయనమై తమదేశంబునకుం జనిరి. వారరుగునప్పటికి సుదర్శనుఁడు రత్నసేనుఁడు ఘూర్జరంబుననుండిరి. అందుచేవారు రాజధానికిం జనక ఘూర్జరవిషయంబునకుం జని మహారాజాధిరాజై శ్రీమంతుఁడై పండితులకుఁ గవులకుఁ బేదలకు సాదులకు నాశ్రితు లకు నాశ్రయుఁడై సుగుణరాశియై, భూలోకమందారమైయున్న సుదర్శనమహీపాలుఁడు కాలవక్రగతిచేత రాజ్యభ్రష్టుఁడై కుంజరంబు దోమకుత్తుకంజొచ్చిన తెఱంగునఁ దనకన్న నన్నివిధంబులఁ దక్కువ వాఁడగు ఘూర్జరేంద్రునియింట నతిథియై వానిపంచ నుండవలసి వచ్చినందుకుఁ దద్దయు విచారించి ముందుగా నమ్మహీపాలునింగనుం గొనిరి. సుదర్శనుఁడు తనబిడ్డను, మంత్రిబిడ్డనుగూడ గౌఁగిలించికొని "నాకు నేఁడు వేయిరాజ్యములు చేకురినట్లు సంతసించుచున్నాఁడను. ఇఁక రాజ్యసంపాదనము సులభము. మీరాయాగమనమే శుభాగమ నము. ఈదినము సుదినము. దుర్దినములు నేటితో గతించినవి. నాకుఁ జిరమిత్రుఁడును, సాధుశీలుఁడు నైన ఘూర్జరనాయకుఁడు సేన నాయత్తము చేసియున్నాఁడు. ఇంక మన మీసేనం గైకొని మనరాజ్యంబు మనముసంపాదింపవలయు" నని చెప్పి మితిమీఱిన యానంద మొందెను. రత్నసేనుఁడు కుమారాగమనముచే నానంద పరవశుఁ డయ్యెను. చంద్రప్రభాదేవి మరల వచ్చి తనకంటఁబడి యడుగులకు మ్రొక్కిన కొడుకును లేవనెత్తి హర్షబాష్పములచే నాతని మూర్థము నభిషేకించెను.

సైన్యము దండయాత్రకుఁ దగియుండుటచే మకరందుఁడు సేనాపతియై ఘూర్జరసైన్యమును మాళవదేశంబునకుఁ దీసికొనిపో యెను. రాజ్య మాక్రమించుకొనియుండిన వైదర్భులకును, మకరం దుని నాయకత్వముననున్న ఘూర్జరులకును, సందడికయ్యము జరి

గెను. మాళవేంద్రకుమారుని ప్రతాపాగ్నికి వైదర్భులు శలభము లైరి. రాజవాహనుని సేన సంపూర్ణముగాఁ బరాజయమొందెను. హతశేషులు నానాముఖములఁ బరుగులెత్తిరి. మకరందుఁడు సుదర్శనుని మరల మాళవరాజ్యసింహాసనము నందుఁ బ్రతిష్ఠించెను. రత్నసేనుఁడు యథాపూర్వకముగ నమాత్యుఁడయ్యెను. కేసరి రెండవ సారియుఁ ద్రోహియై వైదర్భులతోఁగూడి వారివలన లంచములు గ్రహించి దేశాపకారి యగుటచే వానింబట్టి సుదర్శనుఁడు కారాగృహంబున నుంచెను. దేశమునం బ్రశాంతము నెలకొన్న పిదప మకరందుఁడు కాశ్మీరదేశ దండయాత్రకై సైన్యసన్నాహము జేయఁ బూనెను.

అటఁ జిత్రభానుఁడు వేటనుండి రాజధానికి మరలివచ్చిన పిదప సుషేణుఁడు వానిని దర్శించి "దేవరవారియాజ్ఞా ప్రకారము మకరందుని విడిచిపుచ్చితి" నని మనవిచేసెను. అదివిని చిత్రభానుఁ డదరిపడి "ఏమీ! నాయాజ్ఞాప్రకారము మకరందుని విడిచితివా? మూర్ఖుఁడా! అసత్యము లాడి నన్ను వంచించెదవా?" యని బిట్టులుకతోఁ బలికెను. "దేవా! శాంతింపుఁడు ఇదిగో! మీజాబు. ఇదే మీ రానవాలుగాఁ బంపిన యుంగరము" అని సుషేణుఁడు రెంటినిం జూపెను. "ఎవఁ డీయుంగరమును దెచ్చినవాఁడు?" అని మరలరాజడిగెను. "ఎవఁడో వినయంధరుఁడఁట! మాళవసచివుఁడఁట! మీరు పంప వచ్చినాఁడట" యని సుషేణుఁడు బదులు చెప్పెను. అదివిని చిత్రభానుఁడు క్రాఁచుబామువలె నెగిరిపడి "దురాత్ముఁ డెవడోఁ మోసము జేసెను. నాయుంగరము! నావ్రేలినుండి జారిపోయియుండవచ్చును. అది తీసికొని నా సేవకులు నన్ను వంచించియుందురు. అంతఃపురమందు నగరమందుఁగూడ నెందరో ద్రోహులున్నారు. ఆద్రోహులలో నీవొకఁడవై యుండవచ్చును.

అయ్యారో! పరమశత్రువు దాటిపోయెనే! వాఁడు మన కడనుండిన సుదర్శనుఁడు కాళ్ళబేరమునకు వచ్చునే? ఛీ! దురాత్మా! నీమొగము జూడఁగూడదు. ఇదియంతయు నీవలననే జరిగినది. అతని స్థానమున నిన్నే కారాగృహమునం దుంచెద.''నని రాజభటులం బిలిచి చెఱలో సుషేణుని బంధింపుమని యానతిచ్చెను. నిర్దోషియైన సుషేణుఁడు నిష్కారణముగా బంధింపఁ బడినందుకుఁ గర్పూరమంజరి మనస్సున మిక్కిలి విచారించెను. చిత్రభానునకు నంతఃపుర సేవకులపై నెంతో యనుమానము కలిగెనుగాని కర్పూరమంజరిపైఁ గలుగలేదు. నిజస్థితి దెలియక పోవుటచే నతఁ డెవ్వరిని దండింపఁ జాలకపోయెను. గంజాయిమత్తుచేత జంబుకుఁడు చిత్రభానుని ప్రశ్నలకు నసందర్భములైన యుత్తరములు చెప్పుటచే బెత్తముతో నాలుగు దెబ్బలు తినెను.

అట గాంధారవల్లభుఁడైన భాగ్యవర్ధనుఁడు విక్రమసేనుని గద్దెఁ నెక్కించుటకు నిశ్చయించి కాశ్మీరముపై దాడి వెడలుటకు మహాసన్నాహము సేయఁబూని తనకడనున్న శక్తివర్మఁ జూచి యిట్లనియె. ''ఓయీ! నీవు మా పక్షమునఁ బాంచాలవల్లభుఁడైన మహేంద్రదేవునికడకు సందేశముఁ గొనిపోవలయు. మహేంద్రదేవుఁడును సమరసన్నాహము చేయుచున్నాఁడని చారులవలన వినియుంటిని. అతఁడొకసారి మే మొకసారి వేర్వేఱుగాఁ జిత్రభానునిం దాఁకిన జయము చేకురకపోవచ్చును. ఉభయ సైన్యంబులు గలసి యేకముఖముగాఁ బోరిన జయ మనలీలగాఁ జేకురును. కావున శరత్కాలమునఁ గార్తికమాసమున శుద్ధపూర్ణిమనాటికిఁ దన సైన్యమును దోడ్కొని కాశ్మీరముఁ బ్రవేశింపు''మని యామహారాజుతోఁ జెప్పుము. ఆనాఁటికి మనమును గజరథతురంగాది చతురంగబలంబులతో నాదేశము బ్రవేశింతము. నాముద్రగల జాబులుగూడ నిచ్చుచున్నాను. ఇది యాషాఢమాసముగదా! వర్షకాల మాసన్నమగుచున్నది. అదియుద్ధ

మునకు వీలైన సమయముగాదు. నీవు స్వల్పపరివార సమేతుఁడవై వెంటనేపొమ్ము." అని యానతిచ్చుటయు శక్తివర్మ మహాప్రసాద మని జాబులనందుకొని మితపరివారముతోఁ బాంచాలమునకరిగి రాజధానిం బ్రవేశించి మహేంద్రదేవుని సందర్శించి సందేశార్థ మెఱిఁగించెను. అతఁడు సందేశార్థములకు సమ్మతము దెలిపి తనమనుమలు భాగ్యవర్ధనునిచెంత నున్నకుశలవార్త విని మిక్కిలిసంతసించి దౌహిత్రులప్రాణములు రక్షించినందుకు శక్తివర్మకు రత్నాభరణములు పారితోషికముగ నిచ్చి గారవించెను.

పిమ్మట శక్తివర్మ యానృపాలునికడ సెలవుగైకొని గాంధారమున కరిగి మహేంద్రదేవుఁడు సందేశార్థము నంగీకరించెనని విన్నవించెను. మాళవ పాంచాల గాంధారదేశములం దొక్కసారిగా దండయాత్రాప్రయత్నములు మిక్కిలిత్వరితముతోఁ జరుగఁజొచ్చెను. కార్తికమాస శుక్లపక్షమునఁ గాశ్మీరమునకు ససైన్యముగా రావలయునని మహేంద్రదేవుఁడు సుదర్శనునకు రాయబారమంపెను. అతఁడు దాని నంగీకరించెను. మాధవసేఁడు శక్తివర్మవలనఁ రాజకుమారుల క్షేమ మెఱిఁగి ముప్వురు రాజు లేకమగుటచేఁ దప్పక చిత్రభానుఁడు కూలిపోవునని నిశ్చయించి "కార్తికమాస మెప్పుడువచ్చు నెప్పుడు సేనలు కాశ్మీరముఁజొచ్చు, నెప్పుడు చిత్రభానుఁడుజచ్చు" నని యాశుభదినముల కెదురు చూచుచుండెను.

విద్యాపీఠ మైనతక్షశిలలో నేఁటేఁట శ్రావణమాసమున గొప్ప విద్యాపరీక్ష జరుగుచుండును. అత్తఱి విద్యార్థుల వారు వారు నేర్చిన శాస్త్రములలోఁ బండితులు పరీక్షించి యర్హులగువారికి విద్యానిధి సాహిత్యచక్రవర్తి వేదాంతకేసరి మొదలగుబిరుదములును మిక్కిలి విలువగలశాలువలును ధనమును బారితోషికములుగా నొసంగుచుండును. ఆవిద్యాపీఠమంతయు గాంధారరాజులపోషణముక్రింద

నుండుటచేభాగ్యవర్ధనుఁ డేఁటేటనప్పరీక్షాసమయమున తక్కడికివచ్చు చుండును. ఆసంవత్సరమును భాగ్యవర్ధనుఁడు విక్రమసేనహర్షవర్ధనుల వెంటబెట్టుకొని తక్షశిలకుఁ బోయెను. పండితులచే విద్యార్థులు పరీక్షింపఁబడిరి. శ్రోతలు మహానందభరితులగునట్లు సామవేదముగానము చేయఁబడెను. మందిరములు ప్రతిధ్వనులిచ్చునట్లు ఋక్కులు యజస్సులు నధ్యయనము చేయఁబడెను. పూర్వమీమాంసకులు నుత్తరమీమాంసకులు, నుపన్యాసములతో సలిపి తమ తమ శాస్త్రములే సరియని సిద్ధాంతీకరించుటకు మహావాదములు సలిపిరి. కపిలుని నిరీశ్వర సాంఖ్యముం పతంజలీశ్వర సాంఖ్యము, గౌతమకణాదుల మతములు, పండితుల జిహ్వారంగములయందు నాట్యము చేసెను. బుద్ధదేవప్రోక్తముల లయిన త్రిపిటకములయందును, ధమ్మపదాది గ్రంథములయందును దగుపరీక్షలుజరిగెను. భిక్షుకులకు, సన్యాసులకుఁ గాషాయాంబరములు,విద్వాంసులకు విలువగల సేలువలు విద్యార్థులకు వస్త్రములు వైదేశికులకు పండితులకు ధనములు మొదలగునవి భాగ్యవర్ధనుఁడు విరివిగానిచ్చి విద్వజ్జనవంద్యుఁడయ్యెను.

విక్రమసేనహర్షవర్ధనులు తత్పురముఁ జూడఁబోయి యొక బౌద్ధవిహారమున భిక్షుణీవేషముతో నున్న యొక యంగనంజూచి మొదట నెవ్వరో యనుకొని సాఁగి యడుగులు నడచి మరల నను మానము దోఁప వెనుకకు నడచి యాపడఁతి యెట్టయెదుట నిలిచిరి. ఆమె తలవంచి వారివంక జూడక యేదో యాలోచించు చున్నట్లుం డెను. "అన్నయ్యా! అమ్మ-అమ్మ చూడు. చూడు" అని హర్షవర్ధనుఁడు మెల్లగా ననెను. "ఔను! ఆనవాలుపట్టుటకు వీలులేకుండ వెత్తిదానివలె నున్నది." అని విక్రమసేనుఁడు దగ్గఱకుఁబోయి "అమ్మా! అమ్మా!" యని పిలిచెను. ఆమె తలయెత్తి చూచెను. ఎట్టయెదుట నామె తపఃఫలములువలె బంగారుబొమ్మలవలె నిరువురు

స్థానులు కనఁబడిరి. కనఁబడినతోడనే యామె యానందపరవశయై లేచి నిలువఁబడి యిరువురు బిడ్డల నొక్కసారి కౌఁగలించుకొని 'నాయనా! బ్రతికియున్నారా? నాయనా! నీవు విక్రమసేనుండవేనా? నాయనా! నీవు హర్షవర్ధనుఁడవేనా? మీరు.నా చిన్నియన్నలేనా? దృష్టిదోషముచేత నే నెవరిబిడ్డలనో నా తనయులుగా భావించు చున్నానా?'' యని మహాసంభ్రమముతోఁ బలికెను. ''అమ్మా! నేను విక్రమసేనుఁడనే. నేను హర్షవర్ధనుండనే. తల్లీ! నీవెంత మార్పు జెందితివి! మేమే సరిగా గుర్తింపలేకపోతిమి'' అని వారు తల్లిని గౌఁగలించుకొనిరి. భిక్షుభిక్షుణీజనములు మాతాపుత్రుల సమాగమ సౌఖ్యమును గన్నులారఁ జూచి సంతసించియభినందించిరి. బిడ్డలు తల్లిని భాగ్యవర్ధనునివిడిదికిం దీసికొనిపోయి యాతని కెఱిఁగించిరి. అతఁ డామెను బహూకరించి మాతాపుత్రుల సమాగమము భావికాలశుభమునకు సూచకమని వక్కాణించెను. తల్లియు బిడ్డలు దమతమకష్టముల నొండొరులకుం జెప్పుకొని తత్తత్సమయోచితముగా దుఃఖమును నానందమును నొందుచువచ్చిరి. అచ్చటఁ గొన్ని దినములుండి భాగ్యవర్ధనుఁడు విక్రమసేన హర్షవర్ధనులను నరవిందాదేవిని దోడుకొని స్వనగరంబున కరిగి యుద్ధసన్నాహముఁ జేయుచుండెను.

ఆవర్షర్తువతి రమణీయముగా నుండెను. గ్రీష్మకాలమునఁ బ్రభాకరుని చండమయూఖముల తైక్ష్ణ్యమునకు గగనమంతయుఁ బీటలు వాఱఁ గాలపురుషుఁడు బీటలుగానఁబడకుండ మెత్తినబురదయో యనునట్లు నభోమండలమంతయు మేఘపటలసంఛన్నమైకనఁబడెను. భీష్మంబగు గ్రీష్మమునఁ దాపమునకోర్వలేక తహతహంబడిన భూదేవి మీనఁ జల్లుకొన్న పన్నీరోయన వెల్లివిరిసి నేలంబడుచున్న యాకాశగంగయోయన వర్షములు సాంద్రములై కురిసెను. ఱుఖములధణంధణ

ఢణఢ్వానములతోడను, నెడనెడఘణిల్లుఘణిల్లుమనిపడియెడు పిట్టపిడుగులచప్పుడులతోడను బెకబెకలాడు గోదురుకప్పల యఁలివులతోడను బ్రహ్మాండము ప్రతిధ్వనించుచుండెను. భగ్నమనోరథులై పరితపించు వారికి నెడనెడం బొడకట్టునల్పాశలంబోలెఁ దళతళతళమని కన్నులకు మిఱుమిట్లుగొలుపునట్లు మెఱుపులు మెఱయఁజొచ్చెను. గ్రీష్మకాలమునఁ బ్రభాకరుని చండతైక్ష్ణ్యముచేత నెండి స్రుక్కినజలాశయ శిశువులను వెండియుఁ బ్రకృతిలక్ష్మి దృఢగాత్రులం జేయుటకు నొసంగెడు స్తన్యమో యనఁ బయోధరములనుండి శుద్ధపయోధారల వెల్లి విరియునట్లొసంగెను. నదీనదంబులు పొంగెను. వాఁగులునిండెను తటాకములు జలపూర్ణములయ్యెను. ప్రపంచ మంతయు జలమయ మయ్యెను. మార్గంబు లరికట్టఁపడెను. ప్రయాణములు దుస్సాధ్యము లయ్యెను. ప్రపంచమంతయుఁ జల్లఁగా నున్నను నావర్షకాలమున మకరందునిమనస్సు వియోగవేదనాసంతప్త మగుటంజేసి యతఁడు సౌఖ్యముం గనక నిరాశామేఘచ్ఛన్నము లయినయాదినములను దుర్దినములనుగా భావించి కాల మెట్లెటో గడుపఁజొచ్చెను. కర్పూర మంజరియు మకరందుఁడట్ల ప్రియవిరహసంతాపమునఁ బొక్కుచు నాదుర్దినము లెన్నిటికయిన గతింపక పోవునా, యనిమంచి కాలమున కెదురుచూచుచుండెను.

ముప్పదియైదవ ప్రకరణము

శరత్కాలము ప్రాప్తించెను. అయ్యాదిపరమేశ్వరసృష్టికిఁ బ్రతిసృష్టి చేయఁజాలు మహాకవివాక్ప్రౌఢిమకును జిత్రకారుని తూలికా నైపుణ్యమునకును నతీతమై సౌందర్యనిలయమై యతిశోభావంతమై

యులరఁజొచ్చెను. భూమండలమున రాజేంద్రులు ధనుస్సులు పూని విజృంభింతురుగావునఁ దనధనుస్సుతో నింక బనిలే దనికాఁబోలు మహేంద్రుఁడు తనచాపంబును గగనమందుఁ బ్రదర్శింపకడాఁచెను. వానకారున మేఘమండలముచే నాచ్ఛాదితుం డయిన సహస్ర మయూఖుఁడు బంధవిముక్తుఁ డయినమహాతేజశ్శాలియుంబోలె మున్ను జడమైనబ్రహ్మాండమున కంతకు వెండియు నఖండ చైత న్యము గలుగునట్లు దేదీప్యమానప్రభలతో వెలుఁగఁజొచ్చెను. దిక్కులు ప్రసన్నములయ్యెను. బురద లెంత నేల గట్టిపడెను. జనుల గమనాగమనముల కనుకూలముగా బాటలేర్పడెను. మున్ను కూలం కషములై దేశంబులపై దండువెడలి గృహారామక్షేత్రాదుల నాశ నంబుఁ జేసినమహావాహినులు తమగాంభీర్యముం గోల్పోయి విజృం భణము నెడలి సామాన్యజనులు తమ్ముదాఁటిపోవుపాటిరేవుల గలిగి కల్మషరహితములైన నిర్మలోదకములుగలిగి యక్కడక్కడఁ దమ తిప్పలు బైలుపడఁ దొంటిమైశ్వర్య మంతయుం గోలుపోయి గర్వ హీనులై నెల్లవారికిఁ జులకనౌ పేదల ట్లుండెను. సరోవరములు పగలు వికసించి కనుపండువు సేయుతామరలతోడను, రాత్రులు వికాసము జెంది నయనాభిరామంబు లగుకలువలతోడను వెలయుచు నిరంతర మందహాసమునఁ గళగళలాడునెమ్మొగంబులు గలవిలాసవతులట్లు శోభిల్లుచుండెను, ఏసరసుఁడు తనయింటికి వచ్చిన నాసరసునఁ గౌఁగిఁ టఁజేర్చి యాదరించువెలవెలఁదుకలట్లు సరోవరంబులు పట్టపగంట దర్శనంబిచ్చుప్రభాకరుని, రేయిఁగానఁబడు శీతమయూఖునిఁ బద్మదళ హస్తములతోడను గలువతేకులచేతులతోడను గౌఁగిలించుకొనుచు వారికరస్పర్శల ధన్యత నొందుచుండును. ఆకాశమున నగస్త్యనక్ష త్రము తోఁచెను. తారాచంద్రమండలము నిశల నిష్కళంకమై నిరుప మానమై నితాంతమనోహరమై నేత్రపర్వమైనపండువెన్నెలలుగాయు

జొచ్చెను నిశాలక్ష్మి వెన్నెలయను తెల్లదువ్వలువ గట్టి నక్షత్ర మాలిక యనుముత్యాలసరముఁ దాల్చి వర్ణనాతీతమైనశోభ గలిగి విరాజిల్లుచుండెను. పొలము లన్నియుఁ బండఁబాఱెను. వసుంధర సస్యభరితమై చూలుదాల్చి నెలలునిండినపడంతుకవలె దర్శనీయమై యొప్పెను. ఎప్పుడు శరత్కాలము వచ్చు, నెప్పుడు మహావాహినీ సమారాహములఁ గొని కాశ్మీరముపై దండువిడియ నగునని నిరీక్షించు చున్నగాంధార పాంచాలమాళవేంద్రులకు రూపుదాల్చిన తమమనో రథముంబోలె నాశరదృతువు కనఁబడెను.

గాంధార సైన్యంబులు భీష్మంబులై గీష్మంబట్లు పరసైన్యం బుల శోషింపఁజేయఁగలిగి యుండె. బాణవర్షంబులఁ బగతుఱ ముంపఁజాలి పాంచాలసైన్యంబులు వర్షర్తువుల ట్లుండెను. మాళవేం ద్రసేనలు శీతాకాలంబట్లు లెల్లవారి గడగడ వడఁకింపఁజాలియుండెను బాణంబులు, తూణంబులు, నరదంబులు, ద్విరదంబులు, ధనుస్సులు క్షుభితమనస్సులు, హయంబులు, భటచయంబులు, గలిగి మూఁడు సేనలు నేకకాలమున సన్నిధియయిన ముక్కారులట్లు, ముచ్చిచ్చు లట్లు ముక్కాఁకలఁ దేరి ముప్పెన్నవలువలుఁ దాల్చినజోదులుగలిగి బైలుదేఱి కార్తికశుద్ధపూర్ణిమనాఁటికిఁగాశ్మీరదేశముం బ్రవేశించెను. తనచేఁ బరాజితులైనమాళవపాంచాలభూపతులు మఱలనూఁగలం గూర్చుకొని తనపై నెత్తివత్తురని చిత్రభానుఁడు తలంచుచుండెనుగాని గాంధారనాయకుఁడు తనపై దాడివెడలునని యాతఁడెన్నఁడును దలంచియుండలేదు. ముగ్గురు రాజులును సకలసమరసన్నాహంబు చేసి కొని దనపై దండువిడియుచున్నా రని చారులవలనవిని చిత్రభానుఁడు తత్తఱపడి తనసేనలఁ బక్కఁ జేయఁజొచ్చెను. విశ్వసింపఁదగినబంట్లను దండపాణిని వెదకుటకై కాశీమొదలగుమహాక్షేత్రములకుఁ బంపెను. క్రొత్తజోదుల సేనలోఁ జేర్చుకొనెను. మగఁటిమి గలజోదులను

జిన్నదండనాథులుగఁ జేసెను. వలయు ప్రయత్నము లన్నియుఁ జేసెను. వైదర్భులను సాయమురమ్మని సందేశమంపినుగాని వారు మకరందునిచేఁ బరాజితులై నిశ్శేషముగాఁ జెదిరిపోవుటచే నెట్టిసాహాయ్యముం జేయఁజాలరయిరి. కావునఁ జిత్రభానుఁ డసహాయుఁడై తనలావును నమ్ముకొనియుండవలసినవాఁ డయ్యెను.

యథానిర్దిష్టముగఁ గార్తికశుద్ధపూర్ణిమనాఁటికి మూఁడుసైన్యములు శ్రీనగరపరిసరంబుల విడిసెను. గాంధారవల్లభుఁడు, పాంచాలనాయకుఁడు, మాళవరాజనందనుఁ డగుమకరందుఁడు నొండొరులం గలసికొని కుశలంబు లరసి సమరం బెట్లు జరుగవలయునో యావిధానమునుగూర్చి తర్కించిరి. భాగ్యవర్ధనమహేంద్రదేవులు తమదళంబులకుం గూడ మకరందుని దండనాథుని జేసి యాతనియాజ్ఞాప్రకారము నడువవలసిన దని తమసేనానాయకుల కాజ్ఞనొసఁగిరి. భాగ్యవర్ధనునివెంట వచ్చినవిక్రమసేనహర్షవర్ధనులు, పాంచాలసైన్యముతో వచ్చినమాధవసేనుని గలసికొని తమకై బెంగ పెట్టుకొనినయావృద్ధమంత్రి కానందముఁగలిగించిరి. విక్రమసేనుఁడు గాంధారసైన్యమున నొకభాగమునకు దండనాథుఁడై మకరందునియాజ్ఞ నిర్వర్తించుచుండెను. గాంధారవల్లభుఁడు మకరందమహేంద్రదేవులతో నాలోచించి తనయమాత్యుఁడయిన జీవసిద్ధినిఁ జిత్రభానునికడకు రాయబారిగాఁ బంపెను. అతఁడును గాశ్మీరనరపాలునికడఁ జెప్పవలసిన సందేశార్థము లన్నియు జాగరూకతతో సంగ్రహించుకొని చిత్రభానుని సందర్శనము వేఁడి వానియనుమతమున సన్నిధి కరిగి సత్కృతుఁడై తన సందేశమును నెఱిఁగింప ననుజ్ఞ వేఁడెను. అప్పుడు వారీక్రిందివిధమున ముచ్చటించిరి.

జీవ—మహారాజా! మా ప్రభు వగు భాగ్యవర్ధనుఁడు సంగ్రహముగా సందేశ మొకఁగించి రన్నుని పంపెను. ఆసందేశమిది: గతించిన దానిని మరల త్రవ్వుకొనుట నిష్ప్రయోజనము, విక్రమసేనుని గాశ్మీరసింహాసన మెక్కించి హర్షవర్ధనుని యువరాజుజేసి నీవు సకుటుంబముగాఁ గాశ్మీరరాజ్యము విడిచి పోవుదువా లేక, కయ్యమును కయ్యకొందువా? ఇందు నీ కేదియిష్టమో దానిం జేయుము. ఇంతే సందేశము.

చిత్ర—ఇంకను విక్రమసేనహర్షవర్ధను లెక్కడ! వారు మృతినొందిరి. చచ్చినవానిని రాజుం జేయుటెట్లు? యువరాజుం జేయుటెట్లు?

జీవ—రాజా! నీవు మేలుకొనియుఁ గలఁ గనుచున్నావు. విక్రమసేనహర్షవర్ధనులు జీవించియున్నారు. దండపాణి త్రవ్వించిన గోతిలో దండపాణియే పడియెను. రాజపుత్త్రులం జంపఁ దలఁచి వచ్చి తాఁ జచ్చె. నీమాయాసముద్రంబున మునిఁగిపోక రాజపుత్త్రులు సురక్షితులయి గాంధారమునకు వచ్చి నేఁడీసేనతో నిటకు వచ్చియున్నారు.

చిత్ర—(తెల్లబోయి) ఏమేమీ! బ్రతికియున్నారా? ఇది పరిహాసమా? నీవు మతి తప్పి మాటాడుచున్నావా?

జీవ—పరిహాసముగాదు. మత్తసంభాషణముగాదు. నిజము.

చిత్ర—బ్రతికి యున్నను సరె చచ్చినను సరె! రాజ్యము నే నియ్యను. వెంటనే యిచ్చోటు విడిచి పొమ్ము. లేకున్న నీప్రాణములు దక్కవు.

జీవ—చిత్తము. ఇదే సెలవుపుచ్చుకొనుచున్నాను. (అని వడలిపోయెను)

అప్పలుకులు వినినదాదిగాఁ జిత్రభానుని మనస్సు మిక్కిలి సంక్షుభిత మయ్యెను. "ఏమీ! దండపాణి మృతినొందెనా? రాజకుమారులు బ్రదికి యున్నారా? రాకొమరులు చచ్చిరని దండపాణి తీర్థయాత్రలు సేవించుచున్నాఁడని చందుఁడు చెప్పినమాట యబద్ధమా? చండశక్తివర్మలను వంచించి యుందురా? అయ్యయో! సర్వము. చెడిపోయినది. నాకట్టిన మేడలు కూలిపోయినవి.' అని తనలోఁ జింతించుకొనుచు రుద్రభట్టుకడకుఁ బోయి జీవసిద్ధిసందేశ మెఱిఁగించెను. అతఁడును మొదట నమ్మాట నమ్మక యెట్టకేలకు రాయబారమునం దబద్ధముండదని నిశ్చయించి యెట్లయిన సమరసన్నాహమే కర్తవ్య మని యుపదేశించెను.

చిత్రభానుని ధైర్యము సడలెను. సందేశార్థము పిడుగడచినట్లు పాసియుత్సాహము నడంచెను. దండపాణి వచ్చుననునాసయుడుగంటెను. అట్టి క్లిష్టసమయమున భ్రాతృమరణవార్త వజ్రపాణి కెఱిఁగింపఁగూడదని యవ్వార్తఁ దనమనంబుననే యడంచుకొనెనుఁ. దండపాణి లేకపోవుటయు వెనుకటియుద్ధములో మెఱియలవంటిజోదులు, దండనాథులు హతులగుటయు, బొక్కసములోనిధనములన్ని మిత్తమై వ్యయమగుటయు రాజకుమారులు బ్రతికియుండుటయు మున్నగువిషయములు చిత్రభానున కమితవిషాదముఁ గలిగించెను. ధనము చాలమి నగరమందున్నసంపన్నులగుబేహారులను నితరగృహస్థులను రావించి యుద్ధమునిమిత్తము తనకు సొమ్ముగావలె నని చెప్పి యిమ్మని యడిగెను. ఇచ్చినవారిని మఱికొంత హెచ్చుగా నిమ్మనియు, లేదన్నవారిని తప్పక యియ్యవలసిన దనియు నిర్బం

థించి హింసించెను. ప్రజలు భయభ్రాంతులై చిత్రభానునిదూషించి వానివినాశమును గోరిరి. కొందఱు పాఱిపోయిరి. పరుగెత్తినవారిని యతఁడు పట్టితెప్పించి శిరచ్ఛేదముఁ జేయించి వారియిండ్లు దోఁపించెను. తనజయమునిమిత్తము దేవాలయంబులఁ బ్రార్థనలు చేయవలసినదని బ్రాహ్మణోత్తముల నియోగించెను. రాజువలన భూరిసంభావనల నపేక్షించిన బ్రాహ్మణోత్తములు వానికి జయముఁబ్రసాదింపుమని పరమేశ్వరుం బ్రార్థించిరి. దేశాభిమానులగు బ్రాహ్మణులు మరల వానికపజయమును మరల విక్రమసేనునిఁబ్రతిష్ఠయుఁ గావలెనని సర్వేశ్వరుని వేఁడుకొనిరి. రుద్రభట్టు చిత్రభానునివిజయమునిమిత్తమై గ్రహశాంతులు చేయనారంభించెను. గ్రహదోషనివారణార్థము బ్రాహ్మణులకు భూరిదానము లిప్పించెను.

జీవసిద్ధి తనసందేశపర్యవసానమును భాగ్యవర్ధనాదిప్రభువుల కెఱిఁగింప వారు యుద్ధసన్నద్ధులయిరి. రణభేరులు మ్రోఁగి కోటలోనున్న యంగనలగుండెలు జలుజల్లు మనఁజేసెను. ఆభయంకరధ్వానములకు నభమునఁ బాఱుపిట్టలు చుట్టచుట్టుకొని బిట్టఱచుచు నేలంబడియెను. గాంధారసైన్యములు పట్టణమున కుత్తరమునను బాంచాలవాహినులు పడమటను, మాళవసైన్యములు దక్షిణమునను విడిసి స్కంధావారమును నిర్మించుకొనెను. ఊరికిఁ దూర్పున సింధువునకుపనదియైన జీలమనునది ప్రవహించుచుండుటచే నచ్చట నెవ్వరును విడియుటకు వీలులేకపోయెను. కార్తికశుద్ధ పంచమినాఁటియుదయమున యుద్ధ మారంభమయ్యెను. చిత్రభానుఁ డిష్టదేవతలకుఁ గృహదేవతలకు వేదవేదాంగపారంగతు లగువిప్రులకు రుద్రభట్టునకు నమస్కరించి కడపటివారియాశీర్వచనములఁబడసి కవచంబును శిరస్త్రాణంబును దొడిగి విల్లుబూని వజ్రపాణియుఁ గుమారుఁడు విజయసేనుఁడు దక్షిణసేనాపతులు వెంటరా రణరంగముఁజొచ్చెను. అతఁడు తనసైన్యములు మూఁడుభాగములుచేసి యొకభాగంబునకుఁ దాను మొనగాఁడై భాగ్యవర్ధనునిమీఁదికి నడిపెను. రెండవభాగమునకుఁ

దనకుమారుఁడైనవిజయసేనుని దండనాథునిగఁజేసి కొందఱుచిన్న సేనాపతులను వానికి సాయమిచ్చి మహేంద్రదేవునిమీఁది కంపెను. మూఁడవభాగము వజ్రపాణికిచ్చి మకరందునిమీఁది కంపెను. నాలుగు సైన్యంబులఘోషము నాలుగుసముద్రములమహాఘోషము ననుకరించెను. సమరము కురుపాండవయుద్ధమును జూపఱకు స్మరణకుఁ దెచ్చెను. ముందుగాఁ జిత్రభానుఁడు భాగ్యవర్ధనుం దలపడెను. విజయసేనుఁడు మహేంద్రదేవునిదాఁకెను. వజ్రపాణి మకరందునిమీఁదికిం జనెను. గ్రద్దఱెక్కలు గట్టినవాలుటమ్ములు యోధులచేతులనున్న విండ్లనెడుక్రొక్కాఱుమబ్బులనుండి వర్షధారలట్లు జివ్వుజివ్వునఁ బడఁ జొచ్చెను. ఖడ్గపాణులగుజోదులచేనఱుకఁబడినవీరులశిరంబులుమృత్యుదేవత తిని పాఱవైచిన తాటిపండ్లయట్లు ముంజెలట్లు నామెపానపాత్రంబులట్లు తోఁచెను. పాదంబులు తెగిన యూర్ధ్వభాగంబులు శిరంబులు లేని మొండెంబులు, బాహువులు తెగికొమ్మలు తెగినమ్రానులట్లుగచూపట్టు కళేబరములు మిక్కిలిభయంకరములై కానఁబడియెను చచ్చినవారు మరణవేదనఁ బడుచున్నవారు, ప్రాణములు గుటగుటలాడుచున్నవారు, కట్టకడపటిశ్వాసలు విడుచుచున్నవారు, దాహపీడితులై మాటాడలేక సన్నలు చేయువారు, పేదచూపులుచూచువారు, ప్రాణావసాన సమయమున గూండ్రించువారు, బాధపడలేక యఱచువారు, హరిహరీ యనువారు, నయి పడినజోదులు పలుతెఱంగులగు నవస్థలకుఁ బాలయిరి.

కయ్యము మూఁడుదినములు జరిగెను. మొదటినాఁ డెవ్వరు గెలిచిరో యెవ్వ రోడిరో చెప్పుటకు వీలులేకపోయెను. రెండవనాఁడు విజయసేనుఁడు మహేంద్రదేవునివాలుటమ్ముల మూర్ఛిల్లి యొడలు తెలియక పడియెను. తోడనే యంగరక్షకులు వానిని శిబిరమునకుం గొంపోయిరి. వానిసైనికులు పగఱకు వెన్నిచ్చి పరుగిడిరి. చిత్రభానుఁ డవ్వార్తవినితనగారాబుకొడుకున్న నెలవునకరిగి శస్త్రవేదనాపరవశుఁడైన యాతనిం జూచి జీవనాశ లేదని విచారాక్రాంతుఁ డయ్యెను. మునుపున్న యల్పోత్సాహముగూడ వానినివిడిచెను. "కుమారా!

నీ నిమిత్తమే గదా యీరాజ్యము సంపాదించుట? నీ నిమిత్తమే
గదా మాయలుపన్ని యెన్నెన్నో పాపములుచేయుట? తండ్రీ! నీవు
లేనిచో నా కీసమరమేల? సామ్రాజ్యమేల? యనిగుట్టుగలవాఁ డగు
టచే లోలోపల దుఃఖపడి పైకి గాంభీర్యము వెలిపుచ్చి సైనికుల
మనంబుల నుత్సాహముఁ బురికొల్పుచుఁ గుమారునకుఁదగుచికిత్సలఁ
జేయింపఁజొచ్చెను. చిత్రభానుని యుత్సాహమట్లే వాని సైన్యమును
రెండవనాటికిఁ బలుచఁబడెను. మూఁడవనాఁటిమధ్యాహ్నమున మక
రంగునిచే వజ్రపాణి తెగటారెను. పాప మాతనికిఁ గర్పూరమంజరీ
పాణిగ్రహణమహోత్సవము లభింపకున్నను వీరపురుషోచితమయిన
శస్త్రమరణము గలుగుటచే మందారమంజరీసమేతలయిన యచ్చర
మచ్చకంటుల కేలువట్టు భాగ్య మొదవెను. దండపాణి లేకపోవుట
చేతను విజయసేనుఁడు గాయపడుటచేతను, వజ్రపాణి నిహతుండగుట
చేతను, చిత్రభానునియుత్సాహ్మే చల్లవడెను. వానిసేనలుగాంధారుల
పోటులకును పాంచాలురవ్రేటులకును, మాళవుల ప్రహారములకును,
నిలువలేక వెన్నిచ్చి తిరిగిచూడక పరుగెత్తి [illegible]దఱు మొసళ్ళపాలయిరిఁ
దూరముకొట్టుకొనిపోయిరి. యుద్ధభూమి గుజ్జములయు. [illegible]దాతులయు
నేనుంగులయుఁ బీనుంగులతోడ నతి భయంకరమై హేయమై
మృత్యుదేవత రాజధానివలె నుండెను.

చిత్రభానుఁడు శత్రువులు తఱిమి తఱిమి మీఁదిమీఁదికి రాఁగ
సేనలు లేక యుత్సాహములేక సగముమంది సైనికులతో యుద్ధ
భూమి విడిచిపోయెను. జీవసిద్ధి కొంతసేనతో వానివెనువెంట నంటి
పోయి తఱిమి దాదాపుగ నందఱుజంపె. చిత్రభానునకు రెండుకన్ను
లట్ల రెండుచేతులట్ల పనిచేసిన కరటకపింగళులు వెంటరా నతఁడు
గత్యంతరములేక ప్రాణరక్షణముకొఱకు జీలమునదిలోఁబడెను. ఈఁత
యందు మిక్కిలి పరిశ్రమచేసినవాఁ డగుటచేతను నప్పటికి సాయం
కాలమగుటచేతను జీఁకటిచాఁటున నెట్టెటో దూర మీఁదికొనిపోయి
రెండుజాములరాత్రివేళ కవ్వలియొడ్డుం జేరి తడిబట్టలతో గడగడ వడఁ
కుచు నేకాకియై యవ్వలియొడ్డుఁ జేరి తన యవస్థఁగూర్చి భవిష్య

కర్తవ్యమునుగూర్చి తనలోఁదాను వితర్కించుకొనుచుండఁ గరటక పింగళులును దడిసిన బట్టలతో వచ్చి వానిం గలసికొనిరి. ఆ సాయం కాలమున యుద్ధభూమియందు నెత్తురు లేరులై ప్రవహించెననుట యతిశయోక్తిగాదు. ఏనుఁగుతొండములనెడు తూములనుండి నెత్తుటి వఱదలు వసుంధరపై విచ్చలవిడిగఁ బ్రవహించెను. ఆనెత్తురు వసుం ధరాదేవి దాల్చిన కుసుంభారుణవస్త్రమట్లు-మృత్యుదేవత యింట సంతోషమునఁ జల్లుకొన వసంతమట్లు- నాకసమునుండి నేలకు విజృం భించిన సంజకెంజాయయట్లు నెఱసెను.

చిత్రభానుఁడు రణరంగమువిడిచి పాఱిపోయినపిదప మకరం దుఁడు "భానుఁ డస్తమించె. చిత్రభానుఁ డస్తమించినట్లే యింక సైన్యములు శిబిరమునకుం జనుఁ" డని యానతిచ్చి కోటచుట్టుఁ గొంతసేనఁ గావలిపెట్టెను. చిత్రభానుని పరాజయమును బలాయన మును విని రుద్రభట్టు తద్దయు వగచి కోటయొక్క దొడ్డిగుమ్మముఁ దెఱచి పాఱిపోవు చూచెను. మాళవసైనికులలోఁ గొందఱాప్రాంత మును గాచుచుండుటచే వారాతనింబట్టి మకరందుని కప్పగించిరి. మకరందుఁడు వానిని మాధవసేనునికడకుఁ గొంపోయెను. అతఁడు పేదకుఁ బెన్నిధి దొరకినట్లే సంతసించి కాలుసేతులు గట్టిగాబంధింపఁ జేసి వాని నొక గుడారమునఁ బడవైచి చుట్టు నమ్మికగల బంట్లం గావలియుంచెను.

ముప్పది యాఱవ ప్రకరణము.

మఱునాఁ డుదయమున భాగ్యవర్ధనుఁడు మకరందమహేంద్ర దేవులను దన స్కంధావారమునకు రావించి కోటస్వాధీనము జేసికొను టకై పోవలె నని చెప్పెను. అప్పుడు మకరందుఁ డిట్లనియె. "కోట లోఁ జిత్రభానునికుటుంబమున్నది. వారుశుద్ధాంతకాంతలు, చిత్ర

భానుఁ డనేక దురితములు చేసియుంట నిజము. కాని యాతని యాలు బిడ్డ లాదోసములం బాలుకొన లేదు. కావున వారి కేవిధమైన యవ మానముగాని, యగౌరవముగాని మనము తలపెట్టఁగూడదు. అదియునుఁగాక గాయపడిన విజయసేనుఁడుఁగూడఁ గోటలోనున్నాఁ డు. అతనియెడ మన మనాదరణము జూపఁగూడదు. మఱియొక మాటగూడ జెప్పఁ దలఁచితిని. సమరవిజయగర్వముచే మనసైనికులు సేనాపతులు శ్రీనగరమును గొల్లగొట్ట నుబలాటపడుచుందురు. పుర జనుల కించుకేనియు నలజడి కలుగఁగూడ దని నామతము. వారు చేసిన యపరాధ మేమియు లేదు. నాపలికిన పలుకులు మీకు సమ్మత ము లగునేని మనమందఱముఁ గోట నాక్రమించుకొందము" అన వుఁడు విక్రమసేనుఁ డిట్లనియె. "మకరందునిపలుకులు నాకు సమ్మ తములు. మాపినతల్లి యిందుమణి సాధుశీల. కర్పూరమంజరి తన సోదరుఁ డగువిజయసేనునియెడ నెంతయభిమానము కలిగియున్నదో మాయెడ నంతయభిమానము నంపప్రేమ కలిగియున్నది. విజయ సేనుఁడు దుర్జనుఁడు గాఁడు. తండ్రి దుశ్చరితుఁ ... గణమున పినతండ్రిదనయుని హింసించుటధర్మముగాఁదు. నా(స్నే) డుగాని తక్కుటుంబముగాదు. పురజనులు నాయందను వారు మనయాదరంబునకుం బాత్రములు."

వారిరువురపలుకులు సహేతుకముగా న... భాగ్యవర్ధనులు వారు చెప్పినచొప్పున నడ మాధవసేనునిగూడ వెంటఁబెట్టుకొని య- సైనికులఁ దోడ్కొని కోటం బ్రవే- పాయమువాటిల్లునో యని భ- బరిజనంబునకును నభయ- శ్రీవించియున్నారని తెలి-

సంతసించి వారిం జూడ నభిలషించుచుండెను. విక్రమసేనుఁడు భ్రాతృసమేతుఁడై యంతఃపురమున కరిగి యింపుమణికి నమస్కరించి యెట్టయెదుట నిలిచెను. ఆమె వానిని మెల్లగాదీవించి తనభర్తృవిషయమై విచారించుచుఁ దలవంచుకొని యుండెను. కర్పూరమంజరి విక్రమసేనహర్షవర్ధనులను గౌఁగలించుకొని హర్షవర్ధనుని ముద్దుపెట్టుకొని "తమ్ములారా! మీరు మరల నాకంటఁ బడినందుకు లామనస్సు పరమానందము నొందుచున్నది. వెనుకటిదంతయు మఱచిపోండు. మీయమ్మ యెక్కడనున్నది?" అని వారిం బరామర్శ చేసెను. అప్పుడు విక్రమసేనుఁడు "అక్కా! దైవానుగ్రహమున వెండియు మిమ్ముఁ జూచుభాగ్యము గలిగినది. ప్రాఁతపగను వెండియు నుజ్జీవింపఁజేయఁ దలఁచుకొనలేదు. మీకు మావలన నెట్టిభయము లేదు. చేతులారఁ జేసికొన్న దుష్కృతఫలము మీతండ్రి యనుభవించును. విజయసేనునెడఁగూడ మా కెట్టి చెడ్డతలంపులు లేవు. మీరు నిర్భయముగా నుండుఁడు" అని చెప్పి యనంతరము విజయసేనునికడకుఁ బోయి నా ‹ గూడ నభయం బొసంగి ప్రణవైద్యుల రావించి

లుచేయఁ బనిచెను. పిమ్మట వారందఱు వెండియు

ౘునకుం జనిరి.

ుఁడు పట్టణంబునకుం జని మణివర్మయొక్కయు

ఁయొక్కయు, దుస్థితిఁ దెలిసికొనివచ్చి వారిని

ని విక్రమసేనునితోఁ జెప్పెను. అట్ల కాక

. యతఁ డాకార్యముచేయుటకు మాధవ

ుఁడై కారాగారంబున కరిగి

ు. మనోవిచారముచేతను

న వీలులేనిస్థితిలోనున్న

తనమిత్రుని మలినవస్త్రధారుని కృశీభూగాత్రునిఁ గనుఁగొని కన్నుల వేఁడికన్నీ రొలుక గాఢాలింగనముఁ జేసికొని సమర వృత్తాంత మంతయు నాతనితోఁ జెప్పి విక్రమసేనునివిజయ మెఱిఁగించ బంధ విముక్తునిఁ జేసెను. అనంతరము గదాధరశూలపాణులఁ గూడ నాతఁడు విడిపించెను వారుమువ్వురును తోడనే గృహంబులకుం జనక తమ కృతజ్ఞతను రాజభక్తిని బాలుఁడైన విక్రమసేనునకుం దెలుప నాతని నిలయంబునకుం బోయి యెట్టయెదుట నిలిచిరి. మణివర్మం జూచిన తోడనే విక్రమసేనుఁడు లేచి నమస్కరించి కౌఁగలించి "తాతగారు! మాకొరకై మీరు చెప్పరాని యిడుములు బడితిరి. మిమ్ము వెండియు మేము చూతుమనుకొనలేదు. మొదటఁ బ్రతికూలముగా నున్నను దైవము తుదకు మన కనుకూలుఁడయ్యె." నని పరామర్శపూర్వక మగు పలుకులుపలికెను. మణివర్మ వారిని దమ్మునిఁ గనుఁగొన గల్గి నందుకు సంతసించి యట్లే మూర్ధాభిషేకము జరుగునని సూచించు టకో యన నానందాశ్రువులచే వారిశిరంబుల నభిషేకించి "నాచిన్ని యన్నలారా! మృత్యుదేవతకోరలనడుమఁ జిక్కియు నదృష్టవశ మున జీవింపఁగల్గితిరి. దురాత్ముఁడైన చిత్రభానుఁడు రణమునఁ జచ్చి నాఁడా, చేసినపాపము వడ్డితోఁగట్టి కుడువకపోవునా? లేదా వ్రణ శేషము, రణశేషము, ఋణశేషము నుంచఁ గూ

చెప్పుదురు. వానిని విచ్చలవిడిగాఁ జరింపనిచ్చితిమా

గ్రామమున విడిచినట్లు. కావున సైన్యమునంపి

పుము." అని బహూకరించి హితోపదేశము

గదాధరశూలపాణులును దమకృతజ్ఞత

అనంతరము రుద్రభట్టు నే

మకరంద మహేంద్రదేవులను

లను బిలిపించి యడిగెను. వ

గొట్టుట కర్తవ్యమని పలి

నుంచఁ దగునని విక్రమసేనుఁ డనెను. "బ్రాహ్మణో న హంతవ్యః" యని ధర్మశాస్త్రము చెప్పుచున్నదిగనుక నామనుమఁడు చెప్పినట్లు మకరందుఁడు చెప్పినట్లుజేయుట సముచితమని వృద్ధుఁడైనమహేంద్ర దేవుఁడు వాక్రుచ్చెను. మాధవసేనుఁడు వారిమాటల కిష్టపడక రోషావేశముగలిగి యిట్లనియె. "అయ్యా! మీరందఱు మూర్ధాభిషిక్తులు ధర్మాధర్మ విచక్షణులు. మీ రెఱుఁగని ధర్మములులేవు. నేను మీకీ విషయమునం జెప్పఁదగినవాఁడను గాను. అయినను నాదొక్క చిన్నమనవిగలదు. ఇతఁడు బ్రాహ్మణుఁడగుటచే నవధ్యుఁడనిపాంచాలవల్లభుఁడుపలికె. ఆయభిప్రాయముచేతనే విక్రమసేనుఁడు యావజ్జీవ కారాగారాగృహవాసము విధించె. పరమదయాళువగుటచే మకరందుఁడు వానిని దేశభ్రష్టుఁ జేయుమనియె. మీమాటలు నాకుసరిపడవు వాఁడు బ్రాహ్మణుఁడుగాడు చండాలుఁడు. చండాలుఁ డనుట చండాలుర నవమానించుట. చండాలురు గూడ వీనికర్మలంజూచి సిగ్గుపడవలయును. కటికవాండ్రు సైతము వీనిచర్యలం జూచి కంపింతురు. వీఁడే హరిశర్మయనుపేరుపెట్టుకొని చిత్రభానుంగూడి హేమచంద్ర మహారాజుంజంపించెను. వీనియుపదేశంబుననే చిత్రభానుఁడు బాలకుల
జంపింపఁదలఁచె. అగ్నికి వాయువుతోడైనట్లు దురా
'భానునకు వీఁడుమంత్రియై యుపదేష్టయై యుండెను.
ము లేదు. వీనియెడ దయబూనుట యనుచితము,
పాతకమున కభ్యుదయము గలిగించుట,
-తముచేత విప్రుఁడైనంత మాత్రమున
పాత్రముగాదు. కావున వీనిని
ఁగు కాలిక్రిందవైచిత్రొక్కం
' వలయు." అప్పలుకులు
యుక్తమని పలికెను.

మీాయిష్టగుని మహేంద్రదేవుఁ డూరకుండెను. అంతకుమున్ను పెద్ద లుచెప్పినట్లు వినకపోవుటచేఁ దమకిట్టి యిడుములు కల్గినవని యెఱిఁగి విక్రమసేనుఁడు వారిమాట కెదురాడఁడయ్యె. మకరందుఁడు వధింపవలదని పలుమాఱు చెప్పెను గాని వానిమాట సాగదయ్యె. రుద్రభట్టుం దోడ్కొనిరమ్మని భాగ్యవర్ధనుఁ డాజ్ఞయిచ్చెను. సంకెళ్ళబరువున మెలమెల్లగ నడుగులిడి నడచుచు గతగర్వుఁడై దీనాననుఁడై రుద్రభట్టు రాజసన్నిధిం బ్రాపించెను అతనిం జూచి భాగ్యవర్ధనుఁ డిట్లనియె. "బ్రాహ్మణుఁడా! చిత్రభానునితోఁ గలిసి కాశ్మీర రాజకుటుంబమునెడ నీ వొనర్చిన మహాఘాతుకకృత్యములకు నీకు మరణదండన విధించినారము. మదపుటేనుఁగుకాలిక్రింద వైచి త్రొక్కించి నిన్నంత మొందించుట · బని స

చిరి. నీవర్చస్సుచూడ బ్ర

వేదవేదాంగపారగుఁడ ః

లేక యక్కటికవానిచ

కావునఁ దత్ఫల న

బాష్పాకులితలోచన

నాకులమును. నావి

నని ప్రార్థించుచున

మిక్కిలి పేదవాఁడఁ

లాశ్రయించి బ్రతే

యేడ్చెను.

మకరంద

మాధవసేనుఁడు '

మట్లు సకలరసమ

ములు కరఁగింప

కన్నను దారుణమైనశిక్షల కర్హుఁడు. బ్రతికి యుండఁ గా వీనిం గాల్చినను దోసములేదు. ఇట్టికలుషాత్మునిసంపర్కమువలన నతిపవిత్రమగునగ్నిహోత్రుఁడు మలినుం డగును. కావున నిదే వీనికిఁ దగిన శిక్ష'' యని కఠినముగాఁ బలికెను.

''బ్రాహ్మణుఁడా! నీమీఁద నెవ్వరికిం జాలి లేదు. 'అవశ్య మనుభోక్తవ్యం కృతం కర్మ శుభాశుభ' మ్మని మీవంటిపెద్దలే చెప్పినారు. కావున నీవు చేసినవ్యవసాయమునఁ బండినపంట నీవ కుడువవలయు. కార్యమొకఁడు చేయ ఫలము మఱియొకఁ డనుభవించునా? మాయారూపము దాల్చి హేమచంద్రునివంటిరాజచంద్రుని పొట్టం బెట్టుకొంటివి. అట్టినృపచంద్రుఁడు పురల మనకు లభించునా? [illegible] జూడఁ [illegible] మ్ము.'' అని భాగ్యవర్ధనుఁడు [illegible]లికిం దోడ్కొనిపోయిరి.

[illegible]సమదపుకేనుఁగుకలదు.
[illegible]వారమునకు నెట్టెదు
[illegible]చున్నరుద్రభట్టును
[illegible]ంతికమ్మునకుఁ దీసి
[illegible]భట్టునదుమునకుఁ
[illegible]ట్టి తన కట్టిదారు
[illegible]నము జేసికొని
[illegible]లం బండుకొని
[illegible]డిచి ముందుకు
[illegible]రము లై రోళ్ళ
[illegible]బెట్టి త్రొక్క
[illegible]వైచెను. రుద్ర

భట్టు క్రొన్నెత్తురులు గ్రక్కుకొని యమమందిరమునకుం జనియెను. సైనికులందఱు మహాభయముతో విస్మయముతో నాతనిదుర్మరణముఁజూచి జాలినొందిరి. శ్రీనగరపౌరులాబాలగోపాలముగ నవ్వార్త విని సంతసించిరి.

గాంధారనాయకుఁడు మణివర్మచేసినహితోపదేశము ననుసరించి చిత్రభానునిఁ బట్టి చంపుటో లేక బ్రతికియుండఁగా శ్రీనగరంబునకుం గొనితెచ్చుటో కర్తవ్యమని కొంతసేనతో జీవసిద్ధిని వానికొఱకై పంపెను. జీవసిద్ధియు నది దాఁటి వానిజాడ లరయుచుఁ బరిసరంబుల నున్న యరణ్యములు వెదకుచుఁ గొంతద వ్వరిగెను. ఒకయేటియొడ్డున నొకకొండగుహలోఁ జిత్రభానుఁడు కరటకపింగళ సమేతుఁడై తనయాప్తసేవకులు పిట్టలం గొట్టితెచ్చి యిచ్చినమాంసంబును గొన్నిపండ్లను మెసవి కాలక్షేపము సేయుచుండెను. ఒకనాఁటి సాయంకాలము చీఁకటిపడినవెనుక నాగుహలో మువ్వురుఁ గూర్చుండి తమదురవస్థకు వగచుచుండఁ బింగళుఁడు విచారాక్రాంతుఁడై యిట్లనియెను. “మహాప్రభూ! దేవరవారినిమిత్తమై మేము మేను దాచుకొనక యేపని జేయుమన్న నాపని జేసితిమి. మీరు మీయన్నం జంపునపుడు మేమెంతో సాయము జేసితిమి. ఎన్నోమాయవేషములం దాల్చితిమి. నేను విశారదనామముతో మాళవదూతనని బొంకి మీయన్న మనసు కలఁచితిని. గాంధారదేశబ్రాహ్మణవేషము,
సాయిలవానివేషము, కరటకుఁడు వైచి యెంతో చిత్రముగాఁ
కలాపము వినిపించి సైనికుల కుద్రేకముఁ గలిగించెను
మహేంద్రదేవుని పురోహితవేషము వేసి యాయన
దొంగలించుకొనివచ్చి రాజకుటుంబముమనసు కఁ
వేఁటకు వెళ్ళఁదలఁచినప్పుడు నేనెగొల్లవాఁడ నైతిని
పులినోటఁబడి చచ్చిరని నేనెబొంకితిని. మీయాన

దుస్తంత్రములనైనఁ బన్నితిని. కాని దైవము మన కనుకూలముగ లేకపోవుటంజేసి మనప్రయత్నములన్నియు భగ్నములయ్యెను. ఇఁక నేమిచేయుదము? ఎందుఁబోవుదము? మాబ్రతుకు, మాసుఖము, మీతో నున్నది. ఆలుబిడ్డలకు దూరమైతిమి. అన్నవస్త్రములకు వెలియైతిమి. పరమేశ్వరుఁడు మనమీఁద నిర్దయుఁడగుటకుఁ గారణ మేమో'' యని యంగలార్చుచుండఁ జిత్రభానుఁడు దైన్యసూచక మగు హీనస్వరముతో ''ఓరీ! మీవలన లోపములేదు. నే నేయాట లాడుమన్న నది యాడితిరి. అయినను మనము దైవోపహతుల మగుటచే నపజయమైనది. అయినను మేనఁ బ్రాణములుండ మనప్రయత్నము విడువఁదగదు. ఈయాటవికులం గూర్చుకొని క్రమక్రమముగా దేశపుంగొననున్న గ్రామముల నాక్రమించి మెల్లగ విజృంభింతము.'' అని పలుకుచుండ మనుష్యులు నడచివచ్చుచున్నజాడ వారికి వినవచ్చెను. వెంటనే పింగళుఁడు గుహ వెలుపలికివచ్చి శబ్దమాలకించి 'మనుష్యుల యడుగులచప్పుడువలెఁ గొంతదూరము వినఁబడుచున్నది. మనలం బట్టఁబగతురు వచ్చుచున్నారేమో! ఈవలకురండు. పాఱిపోదము.'' అని తొట్రుపాటుతోఁ బలికెను. అదివిని వెంటనే లోపలనున్న యిరువురు వెలుపలికివచ్చి శబ్దమాలకించిరి. అంతలో జీవసిద్ధిసైన్యము మిక్కిలి దగ్గఱకు వచ్చుటయు సేవకసమేతుఁడై చిత్రభానుఁడు ప్రాణరక్షణమునకై పరువెత్తిపోయెను. అదికనిపెట్టి జీవసిద్ధియు సైనికులును వారిం దఱుమనారం

కాలిలో ముండ్లు విఱుగుటంజేసి పింగళకుండు నడువలేక

...ఁబడెను. సైనికులు వానిం బట్టి తుత్తునియలుగా నఱికి

...నుఁడు తనపాదములు పరుగెత్తనిచ్చి వంతవేగముగాఁ

...చెంచుపల్లియ డాసి యయ్యూరు వెలుపల నున్న

...డెను. చీఁకటిచాటున నది కానఁ బడకపోవుటచే

...ం సంభవించెను. అందు నీరు లేదు గాని

పాములు, జెఱ్ఱులు, కండచీమలు మొదలగునవి విశేషముగ నుండెను. తేళ్ళుకుట్టెను. పాములు కఱచెను. కండచీమలు పీకెను. అతఁడా బాధలుపడలేక పెద్దపెట్టున నఱచి మరణవేదన బొందెను. చెంచుపల్లియలోనివారందఱు నడలి మేల్కొనిరి. అంతలో నాతఁ డెక్కడున్నాఁడో నెవ్వరుఁ జెప్పనక్కఱలేకయే వానియఱపులే యెఱిఁగించుటచే జీవసిద్ధి యానూతికడకుఁబోయి సైన్యసమేతుఁడై దానియొద్దను నిలిచెను. కొంతసేపటికిఁ గ్రమక్రమముగాఁ జిత్రభానుఁడు స్మారకము దప్పి హీనస్వరంబున నేమేమో గొణుగుకొనుచుఁ గాలధర్మము నొందెను.

మఱునాఁ డుదయమువఱకు జీవసిద్ధి యచ్చట నుండి శవముం దీయించి సైనికులతో నిట్లనియె. "అహా! చూచితిరా? యెంతయున్నతవంశముననో జన్మించెను. ఎన్ని విద్యలనో నేర్చెను. కాని దురాశాపీడితుఁడై దుస్సహవాసములంజేసి దుర్నయంబున కొడిగట్టిదుస్తంత్రంబులఁబన్ని దుష్కార్యము లాచరించి తుదకీదురవస్థం దెచ్చికొనియె. రాజద్రోహియయ్యెను. భ్రాతృద్రోహియయ్యెను. దేశద్రోహియయ్యెను. శిశుహంత కాఁదలఁచెను. తరువాత నరకమున్నదో లేదోగాని యీనూతిలోఁ బడినది మొదలుకొని ప్రాణముపోవువఱకు భూలోకమందె నరకక్లేశమనుభవించెను. శిష్టజనసంరక్షణంబును దుష్టజన సంశిక్షణంబును జేయ దీక్షవహించిన దాక్షాయణీవల్లభుఁడు పరమేశ్వరుఁడు పాపఫలంబు దురాత్ముల ననుభవించునజేయకపోవునా? పాప మెన్నటికిని జయముగాంచదనియు, జయించుననియు ధర్మమే సర్వోత్కృష్టమైవర్ధిల్లునని మిగిలినది పాపమేయనియు వీని చరిత్రమువల్ల నేఁ

అనియుపన్యసించి శవమును భాగ్యవ జూపఁదలఁచి కట్టుకు గట్టించి దానిపైఁబెట్టించి

యించుకొని నదియొడ్డునఁబెట్టించి నది దాఁటి తాను స్కంధావారమునకుం జని విక్రమసేనునకు భాగ్యవర్ధనునకు మకరందునకు మాధవసేనునకు నవ్వార్త జెప్పి రహస్యముగ వారిని నదిదాటించి యావలియొడ్డునకుఁ దీసికొనిపోయి శవముం జూపెను. చిత్రభానుఁ డస్తమించె నని వారప్పుడు నిజముగా నెఱింగి సంతుష్టు లయిరి. విక్రమసేనుఁడు వానిదురవస్థకు విచారించి బాష్పాకులితలోచనుఁ డయ్యెను. మాధవసేనుఁడు చేతులారఁ జేసికొన్నది యనుభవింపక తప్పునా యనెను. మకరందుఁడు జాలిపడెను. మరల నడవికిం గొనిపోయి యచ్చటనే దహనసంస్కారము చేయుఁడని భాగ్యవర్ధనుఁ డాజ్ఞ యిచ్చెను. ఆవార్త చిత్రభానునికుటుంబమునకుఁ దెలియకుండ రహస్యముగ నుంచుమని కాలాంతరమునఁ దెలియఁజేయవచ్చునని విక్రమసేనుఁడు వారినిగోరెను. శాస్త్రచోదితములైన యుత్తరక్రియలు లేక తనకొఱకు విచారించునాప్తజనము లేక, దిక్కులేక చిత్రభానుఁడు వనమధ్యంబున నెండుటాకులు గాలినట్లు దగ్ధుఁడయి యపకీర్తికాయమును లోకంబున విడిచి పోయెను. చిత్రభానుఁడు మాతఁ బడినరాత్రి కరటకుఁడు పేరుఁగలిగొన్న పెద్దపులివాఁతం బడి యంతకపురంబుఁ జేరెను.

ముప్పదియేడవ ప్రకరణము

త్రభానుఁడు మృతినొందినవెనుక నొకమాసమువఱకునూర
గనుఁడు మకరందమహేంద్రదేవులతో నాలోచించి
ట్టాభిషేకము సేయ నిశ్చయించెను. మాతామహుఁ
డు నానాదేశాధీశ్వరులకు మనుమనియభిషేక
రావలయునని యాహ్వానముల నంపెను. మాళ

వేంద్రుఁడైనసుదర్శనుఁడు సింధునాయకుఁడైనపరంతపుఁడు ఘూర్జరవల్లభుఁడైన కువలయేశ్వరుఁడు మున్నగుమహీనాయకులు తమతమ పరివారములతో మహావైభవమున వచ్చి శ్రీనగరమునఁ దమనిమిత్త మేర్పఱుపఁబడినవిడిదలలో విడిసిరి.

నగరమంతయు సింగారింపఁబడెను. ఎచ్చోటఁజూచినఁ బచ్చని పందిళ్ళు. ఏద్వారమునఁజూచినఁ గనుపండువుసేయుతోరణములు, ఏగుమ్మముముందరఁ గనుఁగొన్న గెలలతోనిండిన యనఁటికంబములు, ఏగోడలు వీక్షించిన నతిమనోహరములైనచిత్తరువులు. ఏమేడలఁ జూచినఁ బట్టుపతాకములు ఎవ్వునదర్శించిన సర్వాలంకారశోభిత లైన విలాసవతులు. యమున, సింధు, భాగీరథి, సరస్వతీ, ప్రముఖము లగుపుణ్యవాహినులతోయంబులు హేమకుంభములతోఁ దెప్పింపఁబడెను. ప్రకృతిజనంబులలో ముఖ్యులు తన్మహోత్సవదర్శనార్థమై వచ్చిరి. భాగ్యవర్ధనుని యానతి బూని చండశక్తివర్మలు తగుపరివారముతో గాంధారనగరమున కరిగి కుమారాభిషేకమహోత్సవము గనుఁగొనుటకై యరవిందాదేవిని దోడితెచ్చిరి. తల్లియుం గొడుకులుఁ గలసికొని పరస్పరాలింగనసుఖంబు ననుభవించిరి.

సిద్ధాంతులు నిర్ణయించినసుముహూర్తంబున నుపరాజులయు, సామంతులయు, మంత్రులయుఁ, జుట్టములయుఁ బ్రకృతిజనంబులయు సన్నిధిని బురోహితుఁడగునిగమశర్మ విక్రమసేనుని గాశ్మీరసింహాసనంబునఁ గూర్చుండఁబెట్టి పుణ్యనదీతోయంబులతో నభిషేకించెను. అరవిందాదేవిసహజమగుమాతృవాత్సల్యముచేతఁగన్నులనుండి దొరఁగునానందబాష్పములతోఁ బుణ్యనదీజలములఁ బవిత్రమైనకుమారునిమూర్ధమున వెండియు నభిషేకించెను. ఉదయశైలము నలంకరించినభానుమండలమట్లు నవరత్నఖచితమైన సువర్ణపీఠము నధిష్ఠించిన దేదీప్యమానప్రభలతో విరాజిల్లుమణిమయమకుటంబు నొసలఁదాకి

కుమారశ్మశానంబుదాల్చి వచ్చినహేమచంద్రుఁడుంబోలె వెలయు విక్రమసేనునిం జూచి మహేంద్రదేవప్రముఖబాంధవులు సుదర్శనాది మిత్రులు, భాగ్యవర్ధనప్రముఖులగునాప్తులు నానందించిరి. వంది మాగధులు కైవారముజేసిరి. వైతాళికులు జయగీతములఁ బాడిరి. వృద్ధు లాశీర్వదించిరి. ప్రకృతిజనంబులు భళి భళీ యని ప్రశంసించి సంతసించిరి. విరివిగా జరిగినయన్నదానమునఁ బేదలు సంతుష్టులైరి. భూరిసంభావన లందుకొని కవులు, పండితులు, బహుశ్లోకగర్భితము లైనదీవనలనిచ్చిరి. నగరమంతయు నుత్సవమయ్యెను. ఒకచో విప్రుల వేదఘోషములు, వేఱొకచోఁ బణ్యాంగనలయాటలు, గొండొకచో బుణ్యాంగనలపాటలు, నొకమూలగానవినోదములు, నొకనెలవునఁ బండితశిరోమణులవాదములు నొకతావున మిత్రులసరససల్లాపములు నొకయెడ బాంధవులపరస్పరరామర్శలు నిట్లునగరమంతయు మహా నందమయమై నయనపర్వమై మనోహరమై యుండెను.

ఉత్సవానంతరమున విక్రమసేనుఁడు తనకుందమ్మునకుఁ బ్రాణ ప్రదాతలైనచండుని శక్తివర్మను బిలిపించి వారిరాజభక్తిని గొని యాడి చెరిమూఁడుగ్రామములు పన్నులులేకుండ నగ్రహారములుగా నొసఁగెను. అదియునుఁగాక దమనిమిత్తమై కష్టపడినవారికిఁ, బ్రాణ ములుగోల్పడినవారికి, నుచితరీతిని బారితోషికముల నొసంగి వారి కుటుంబములకు జీవనాధారముగల్పించెను. చిత్రభానునియొక్కయు దండపాణి వజ్రపాణులయొక్కయు దుర్బోధనలవలన వికలచిత్తులై తనపైఁదిరుగుబాటుచేసినసైనికుల నందఱను క్షమించి మరలసైన్య మునఁ జేర్చుకొనెను. మణివర్మను. మాధవసేనుని, మంత్రులుగా నియమించెను. గధాధర, శూలపాణులు సేనాపతులైరి.

భాగ్యవర్ధనుఁడు తన గారాబుకూతురైన సౌదామినిని విక్ర మసేనునకును, దనతమ్మునికూఁతురగు చిత్రరేఖను హర్షవర్ధనునకును, వివాహము సేయసంకల్పించినట్లు మహేంద్రదేవునితోడను,

నరవిందాదేవితోడను, జెప్పి వారి యనుమతివడసి మాఘమాసంబునఁ గళ్యాణంబులు జరుపఁదలఁచి సుముహూర్తము నిశ్చయించెను. మహేంద్రదేవుఁడు తా నతివృద్ధుఁడై రాజ్యభారము నిర్వహింప లేకుండుటచేఁ దనరాజ్యమున హర్షవర్ధను నభిషేకించి వానికి యుక్త వయను వచ్చువఱకుఁ దా నాతనికిఁ దోడై యుండి యనంతరము దపోవనమునఁ గరుగ నిశ్చయించెను. భాగ్యవర్ధనుఁడును దనకుం దమ్మునకుఁ బురుషసంతతి లేనందునఁ దనపరోక్షమున విక్రమసేనుఁడే గాంధారదేశమునకుఁ గూడ నేలికగాఁ గలఁడని యెల్లరాజులయెదుట నొక్కి వక్కాణించెను.

సుదర్శనుఁడు మకరందుని మిత్రుఁడగు చంద్రచూడునివలనఁ దనకుమారుఁడు కర్పూరమంజరిపై వలపునిలుపుట వినియున్నకతమున విక్రమసేనుని పట్టాభిషేకమహోత్సవము నిమిత్తము నిర్మింపఁబడిన పచ్చని పందిళ్ళలోనే కర్పూరమంజరిని మకరందునకు వివాహము సేయు టుచితమని యరవిందాదేవికిని నిందుమణికిని నిగమశర్మ ముఖమున సందేశమంపెను. అరవిందాదేవి యాసందేశము నాదరముతో విని యావివాహము నంగీకరించెను. భర్తృమరణవార్త తెలియక పోయినను నిందుమణి మహాపతివ్రత యగుటచే నాతనికొఱకై బెంగ గొని యన్యులతో మాటలాడక సరిగా నన్నము ముట్టక నిదుర పోవక దుఃఖపరవశయై యుండియు, సంప్రాప్తయౌవన యైన కూఁతు నవివాహితగాఁ జిరకాలముంచుట యనుచితంబని తలఁచి యనుకూలుఁడైన వరుఁడు చేకూరినప్పుడు వాని కామె నీయకపోవుట యధర్మమని భావించి యరవిందాదేవిం బిలచి యిట్లనియె "అక్కా! మీమఱఁదితోఁబాటు నేనును మీకు లేనిదానినేయని భావింపుఁడు. మీమఱఁదివలన మీకైన మహోపకారముల నెల్ల మరచిపోఁజా చిన్ననాఁటనుండి కర్పూరమంజరిని నీవె పెంచితివి. అది నీకో

నాబిడ్డ కాదు. కడుపునఁ గాంచుటచే నేను తల్లినైతిని, పెంచుటచే నీవు తల్లివైతివి. దానికి నామీఁదకన్న నీమీఁదనే మక్కువ మెండు నేను బహుకారణములచేఁ బ్రజలముఖము జూడఁజాల కావునఁ గర్పూర మంజరినిమాళవ రాజనందనుఁ డగు మకరందున కిచ్చి పెండ్లిచేయిఁ పుము. జనకునికి జడిసి యబ్బాలిక పైకిఁ జెప్పలేదుగాని యామె రహస్యముగ బౌద్ధమతమును స్వీకరించినది. వెనుక తండ్రితోఁగూడ నొకసారి బుద్ధదేవుని సిద్ధాంతములఁ బ్రసంగించుచు గంభీరముగ మాట లాడెను. అందుచే బౌద్ధధర్మప్రకార మామెకు వివాహము సేయిఁ పుము.'' అని పలికి యాఁగకుండ వచ్చు బాష్పధారలను చీరచెరఁగుతో దుడుచుకొనియెను. ''ఇందుమణీ! విచారింపకు. నీమనోభీష్టము నేను నెఱవేర్చెద. నీకు విక్రమసేన హర్షవర్ధనులతో ముగ్గురుకొడుకు లను కొనుము. నీవు చెప్పినట్లు కర్పూరమంజరి నాబిడ్డయే. కర్పూరమంజరికి శుభముహూర్తమున వివాహము చేయించెద'' నని యరవిందాదేవి నుడివి యామె యలమట దీర్చి వివాహమునకు ముహూర్త మేర్పఱచి యావార్త సుదర్శనున కెఱింగించెను. సుదర్శనుఁడును వెంటనే వార్తాహరుల నుజ్జయిని కంపి చంద్రప్రభాదేవిని రత్నసేన ప్రముఖు లగు మంత్రులను రావించెను. అరవిందాదేవి వేగ గమనముగల యొంటెలమీఁదఁ బ్రయాణనైపుణిగల పరిజనుల విదర్భ కంపి వివాహము నిమిత్తము సకుటుంబ సపరివారముగా రాజవాహనుని రమ్మని యాహ్వాన మంపెను. అందఱును వివాహ మహోత్సవ దర్శనార్థము వచ్చిరి. తక్షశిల నుండియు మఱి తదితర ప్రదేశముల నుండియు బౌద్ధభిక్షుక భిక్షుణీ జనములు తండోపతండములుగ వచ్చి శ్రీనగరమున విడిసిరి. కామందకి యను బౌద్ధయోగినియు, జినదాసుఁ డను బౌద్ధగురువును విజయముచేసి సౌగత ధర్మప్రకారము సకల

సుమిత్ర సమక్షమునఁ గర్పూరమంజరిని మకరందున కిచ్చి వివా

హోమముచేసిరి. ఆదంపతులం జూచి జయజయ ధ్వనులు సేయునివారు భళీయని ప్రశంసింపనివారు "నహో! బ్రహ్మనిర్మాణకౌశల"మ్మనని వారు "దాంపత్యమన నిదే దాంపత్య"మని యననివారు సంతోషమొందనివారు, హర్షసూచకముగఁ జప్పటులు చరువనివారు నచ్చట గుమిగూడిన జనులలో లేరు.

ప్రపంచములో ననుకూలదాంపత్యము కుదురుట యరిదియగుటచే విధాత తుల్యగుణములు, తుల్యరూపములు తుల్యశీలములుఁ గల దంపతులను గూర్చి నేఁటికాలమునకు లోకనింద బాసెనని జనులు చెప్పుకొనిరి. వివాహము మహావైభవముతో జరిగెను. పేదలకు మృష్టాన్నము లభించెను. పండితులకుఁ బారితోషికములు దొరకెను. భిక్షుకభిక్షుణీజనంబులకుఁ దగు పసదనంబు లీయఁబడెను. మకరందుని మనోరథము సిద్ధించెను. కర్పూరమంజరి కామితము కడముట్టెను.

వివాహానంతరమున సుదర్శనుఁడు విజయసేనుని నిందుమణిని నరవిందాదేవిని విక్రమసేనుని నొడంబఱచి కోడలైన కర్పూరమంజరిని నుజ్జయినీపురంబునకుఁ దోడ్కొనిపోయెను. రతీమన్మథులవలె నున్న యాసతీపతులం జూచి యుజ్జయినీపురవాసులు మహానందభరితులై వారియపూర్వ సమాగమము బహువిధములఁ బ్రశంసించిరి. సుదర్శనుఁడును జంద్రప్రభాదేవియు గుమారుని మాళవరాజ్యమున కభిషిక్తునిజేసి, తాము మందిరమువిడిచి యొక విహారమునం బ్రవేశించి బుద్ధదేవోపదిష్టములయిన ధర్మముల బారాయణము సేయుచుఁ బారమార్థికచింతతో గాలము గడుపఁదొడఁగిరి. మకరందుఁడు సతీసమేతుఁడై ప్రత్యహముఁ దల్లిదండ్రుల సందర్శించి వారిదీవనలఁ బడసి వచ్చి ధర్మమార్గానుసారముగాఁ బ్రజాపాలనము సేయుచుండెను. ప్రతిగ్రామమున నతఁడు చెఱువులు, నూతులు, బావులు త్రవ్వించెను. పల్లెపల్లెయందు బాలుర విద్యాభివృద్ధికై పాఠశాల

నెలకొల్పెను. దుర్గమములగు మార్గములఁ జక్కని రాచబాటలు నిర్మించెను. విశాలములైన యాబాటల కిరుప్రక్కల సుందరపుష్పములను, మధురఫలంబులను, శీతలచ్ఛాయలను నొసంగు వృక్షముల నాటించెను. ఎల్లరు ఫలంబుల ననుభవింపవచ్చును. ఎల్లరు పుష్పముల స్వీకరింపవచ్చును. ఎల్లరు నీడల సుఖింపవచ్చును. క్రోసుదూరమున కొక్కచోట బాటసారులు విడియుటకై సత్రములఁ గట్టించెను. రోగుల చికిత్సలనిమిత్తము ధర్మవైద్యశాలలు స్థాపించెను. తెగులుగొంట్లగు పసరములకుసైతము నట్టి చికిత్సాశాలలే నిర్మింపఁబడెను. మాంసభక్షణము దేశమందంతట నిషేధింపఁబడెను. జీవహింస యరుదయ్యెను. జంతువులయెడ సహితము నిష్కరుణముగాఁ బ్రవర్తించిన వారు రాజదండనలకుఁ బాత్రములైరి. తల్లిదండ్రులయెడ భక్తి గురుజనంబుల యెడ గౌరవము క్షుద్రజంతువులయెడ దయ, పరస్త్రీలయెడ సోదరీభావము, వికలాంగులయెడ నిరుపేదలయెడ జాలి, మొదలగు సద్గుణంబులు "యథా రాజా తథా ప్రజా" యను సామెత నిజముగా రాజునడతనుండి ప్రజలు నేర్చుకొని ధర్మాచరణముచేత రాజుమనస్సు రంజింపఁజేసిరి. మకరందునకుఁ బరరాజులలో శత్రువులు లేకపోయిరి. అజాతశత్రుఁ డనుశబ్దము సరిగాపదునొకండక్షౌహిణుల శత్రువులుగల యుధిష్ఠిరునకుఁ జెల్లినదనియు నిజముగా నమ్మాట మకరందునకే చెల్లుననియు నాకాలపువారందరుఁ జెప్పుకొనుచుండిరి. మగధనాయకుని మందిరములందు మకరందునికీర్తియు, ఘూర్జరాధిపుని కొలువుకూటంబున మకరందునిప్రశంసయు, శూరసేననృపాలుని శుద్ధాంతములయందు మకరందునిపేరె వెయ్యేల! దేశమం దెల్లెడ నాతని యశోలతలు ప్రాఁకెననుట యతిశయోక్తిగాదు. మకరందుఁడు తనప్రజలలో తండ్రిలేనివారికిఁ దండ్రియై భ్రాతృహీనులకు భ్రాతృడై మిత్రులులేని మిత్రుఁడై ధనములేనివారికి ధనమై బలములేనివారికి బలమై

"దుర్బలస్య బలం రాజా" యనులోకోక్తిని సార్థకముజేసెను. అతఁడు దురాచారులకు దుర్నిరీక్ష్యుఁడై యుత్తములకుపగమ్యుఁడై, విద్వజ్జనులకువేలుపుఁజెట్టై పేదలపాలిటిపెన్నిధానమై సర్వజనరంజకుఁడై దుష్టజనభంజకుఁడై ప్రజ తనకు శరీరముగాఁ బ్రజాశరీరమునకుఁ దా నాత్మగా, నుండునట్లు మెలంగి ధర్మమార్గమునుండి యించుకేనియుం దొలఁగక, తనచేఁత లితరనేతలకు మార్గదర్శకములుగా మహీపాలనముచేయఁజొచ్చెను. కర్పూరమంజరి సహధర్మచారిణి యను పేరు సార్థకమగునట్లు కాంతలలో నీయింతి మేలుబంతి యని పేరువచ్చునట్లుమహాపతివ్రతలలో నగ్రగణ్యయై యత్తమామలకు విధేయయై బంధువులకుఁ బరమానురక్తయై మహారాజపత్నియయ్యుఁ గరువంబించుకయులేక నెల్లయంగనలకు దర్శనంబిచ్చుచు సాదరంబుగ మాటలాడుచుఁ దల్లిలేనివారికిఁ దల్లియై యాఁడుబిడ్డలు లేనివారికి బిడ్డయై, గతిలేనివారికి గతియై, జనులప్రేమకు భక్తికిఁ బాత్రమైయుండెను. ఆమె పేదలగు బాలింతరాండ్రకుఁ బథ్యపానంబు లంపును, చూలింత రాండ్రకు సూడిద లంపును. పేదలయాఁకుటిండ్లకు, గుడిసెలకు నయితము బోయి వారిసుఖదుఃఖముల నరయుచుండును. వారికిఁ గావలసినధనసాహాయ్యముజేయుచుండును. ఆదంపతులు ప్రజలనే బిడ్డలుగా భావించి, వారియానందము తమయానందముగ, వారియభ్యుదయము తమయభ్యుదయముగ వారికష్టములు తమకష్టములుగ వారికలిమి దమకలిమిగ వారిలేమి దమలేమిగ భావించి వారిసుఖమునకై యెల్లపుడుఁ బాటుపడు చుందురు.

కర్పూరమంజరికి లోకైకసుందరుఁడగు నొకకుమారుఁడును, జగన్మోహనాకార యగునొకకూఁతురుం గలిగిరి. పాడిదప్పక రాజు పాలించుటంజేసి జనుల పాడిపంటలు గలిగి సిరిసంపదలు గలిగి సుఖించుచుండిరి.

భాగ్యవర్ధనునిమరణానంతరమునవిక్రమసేనుఁడు గాంధారమునకుఁగూడ రాజయ్యెను. మహేంద్రదేవునిపరోక్షమున హర్షవర్ధనుఁడు పాంచాలమునకుఁ బ్రభువయ్యెను. మాళవపాంచాల గాంధార, కాశ్మీర దేశంబు లక్కసెల్లెండ్రట్లు బరస్పరమైత్రి గలిగి సిరులతోఁ దుల దూఁగుచుండెను. ఇందుమణియు, విజయసేనుఁడును గర్పూరమంజరీ వివాహమైనవెనుక గొన్ని మాసములుదనుక శ్రీనగరమునం దుండి పిమ్మట మకరందుఁ డాహ్వానముసేయ, నుజ్జయినికిం బోయి యచ్చటనే నివసించి యుండిరి. విజయసేనుఁడు కాలక్రమంబున మాళవసైన్యంబున కధిపతియై మేటిదండనాయకుఁడని పేరుపొంది మకరందుని యాదరమునకు భాజనమయ్యెను. అనుకూలవతి యగుకర్పూరమంజరి యిల్లాలుగ భద్రసేనుఁడు మంత్రిగ విజసేనుఁడు దండనాథుఁడుగ ధర్మము మిత్రంబుగ సత్యంబు చుట్టంబుగ మకరందుఁడు జూదమాడి సిరులు గోల్పోవనినరుఁడు చండాలసేవ జేయనిహరిశ్చంద్రుఁడు వేశ్యాలోలుఁడుఁగాని పురూరవసుఁడు నని ప్రజలు ప్రశంసింపఁ జిరకాలము రాజ్యపాలనము జేసెను.

సమాప్తము.

శ్రీ కొండపల్లి ముద్రాశాల, రాజమండ్రి.